

## టి. శ్రీనివాస్ రావు

జననం : 08-06-1939
మరణం : 01-09-1997

స్వర్గీయ శ్రీ తాతా శ్రీనివాసరావుగారు అనువదించిన (సుఖమయ భట్టచార్యగారి) చరితావళిని రెండు సంవత్సరముల క్రితం ముద్రించడమైనది. ఈ పుస్తకానికి మంచి స్పందన వచ్చింది. చాలామంది ప్రశంసించారు. ఇప్పుడు వారు అనువదించిన మహాభారతంలోని కొన్ని పర్వాలను జె.వి. పబ్లికేషన్స్ ద్వారా కొత్తగా ముద్రించదలచినాము. దీనికి పిల్లల ఆసక్తి, ప్రోత్సాహం ముఖ్య కారణం.

తాతా శ్రీనివారావుగారు విజయనగరం వాస్తవ్యులు. అక్కడే మహారాజా కాలేజీలో చదువుకున్నారు. ఉద్యోగరీత్యా చాలాకాలం పశ్చిమ బెంగాల్‌లో నివసించడం వలన బెంగాలీ భాష చదవడం, మాట్లాడడం, రాయడం బాగా ఒంటబట్టింది. అంతేకాక వారికి భాషను నేర్చుకోవడం అంటే చాలా మక్కువ. ఆ కారణం చేతనే ఈ మహాభారతాన్ని బెంగాలీ భాషనుండి ఆదిపర్వం మొదలు విరాటపర్వం వరకూ అనువదించారు.

మా ఈ ప్రయత్నానికి చేయూతనిచ్చి పుస్తక రూపంలో తీసుకురావడంలో తోడ్పడిన శ్రీమతి జ్యోతి వలబోజుగారికి మనఃపూర్వక కృతజ్ఞతలు.

– తాతా కామేశ్వరి

J.V.Publications



# మహాభారతము

రచయిత
సుఖమయ భట్టాచార్య శాస్త్రి సప్తతీర్థ

అనువాదం
తాతా శ్రీనివాసరావు

# మహాభారతము

రచయిత

**సుఖమయ భట్టాచార్య శాస్త్రి సప్తతీర్థ**

అనువాదం

**తాతా శ్రీనివాసరావు**

**జె.వి. పబ్లికేషన్స్**

హైదరాబాద్

# Mahabharathamu

*Author:*
Sukhamaya Bhattacharya Sastry Sapthatheertha

*Translation:*
Tata Srinivasa Rao

First Published: 2015

© Author

Address:
T. Kameswari
Flat # J-102, Aparna Sarovar
Nallagandlla Serilingampally
Hyderabad – 500046
Telangana
Mob. No. 9959974598/9948028853
Landline no. – 040-40040581

Copies: 150

Rs. 250/-

*Book Publishing Works:*
Jyothivalaboju
jyothivalaboju@gmail.com
Phone: 80963 10140

*DTP & Typesetting:*
K. Ravi Prabha
Ph: 96666 08835

# విషయసూచిక

# మహాభారతము

## మొదటి భాగము

## ఆదిపర్వం


| | | |
|---|---|---|
| 1. | అనుక్రమణికాధ్యాయము | 29 |
| | నైమిశారణ్యమునకు సూతుని రాక | 29 |
| | సృష్టి వర్ణన | 29 |
| | భారతము వ్రాయుటకు వినాయకుని స్మరణ | 29 |
| | ధృతరాష్ట్రుడు మొదలైనవారి జన్మము | 30 |
| | మహాభారత సంక్షిప్త సారము | 30 |
| | ధృతరాష్ట్రుని విలాపము | 30 |
| | సంజయుని ఓదార్పు | 30 |
| | మహాభారత ప్రశంస | 30 |
| 2. | శమంతపంచకోపాఖ్యానము | 31 |
| | అక్షౌహిణీ పరిమాణము | 31 |
| | పర్వసంగ్రహము | 31 |
| 3. | పౌష్యపర్వం – జనమేజయుని శాపం | 31 |
| | సోమశ్రవుడనే ఋషి ఉపాఖ్యానము | 32 |
| | అయోధ్య ధౌమ్యుడు – అరుణి | 32 |
| | ఉపమన్యుని ఉపాఖ్యానము | 32 |
| | వేద ఋషి – ఉదృక వృత్తాంతము | 32 |
| | జనమేజయుని సర్పక్రతువు చేయ ప్రోత్సాహము | 34 |
| 4. | పౌలోమ పర్వం | 34 |
| 5. | భృగువంశము – చ్యవనోత్పత్తి | 34 |
| 6. | రాక్షసుడు పులోమను అపహరించుట | 35 |

| | | |
|---|---|---|
| 7. | పులోమ రాక్షస వధ | 35 |
| 8. | అష్టమ అధ్యాయము - రురుని చరిత్ర | 35 |
| 9. | డుండుభోపాఖ్యానము | 36 |
| 10. | రురుని సర్పవైర కారణము | 36 |
| 11. | ఆస్తీకపర్వము - ఖగమ ఋషి వృత్తాంతము | 37 |
| 12. | సర్పయాగ కారణ పృచ్ఛ | 37 |
| 13. | జరత్కారుని చరిత్ర | 38 |
| 14. | జరత్కారుని వివాహము | 38 |
| 15. | సర్పరక్షణ సంక్షిప్త కథ | 38 |
| 16. | అనూరుడు, గరుడుల జన్మవృత్తాంతం | 38 |
| 17. | సముద్రమంథన ప్రశ్న | 39 |
| 18. | సముద్రమంథనారంభము | 39 |
| 19. | రాహు మస్తకచ్ఛేదము | 40 |
| | దేవాసుర సంగ్రామము | 40 |
| 20. | నాగగణ అభిశాపము | 40 |
| 21. | సముద్రవర్ణన | 41 |
| 22. | కద్రు, వినతలు సాగరతీరమునకు పోవుట | 41 |
| 23. | వినత దాసీత్వము | 41 |
| 24. | సూర్యుడు సర్వసంహారక రూపము ధరించుట | 41 |
| 25. | కద్రువ ఇంద్రుని స్తుతించుట | 42 |
| 26. | ఇంద్రుని అనుగ్రహముచే వర్షము కురియుట | 42 |
| 27. | వినత దాసత్వ విమోచనకై ఆలోచించుట | 42 |
| 28. | అమృతము కొరకు గరుత్మంతుని ప్రయాణము | 42 |
| 29. | శాపగ్రస్త గజ - కచ్ఛప వృత్తాంతము | 43 |
| 30. | గరుత్మంతుడు అమృతము హరించుట | 43 |
| 31. | గరుడుని జన్మరహస్యము | 44 |
| 32. | గరుత్మంతునితో దేవగణముల యుద్ధము | 44 |
| 33. | గరుత్మంతుడు అమృతము హరించుట, వాహనమగుట | 44 |

| | | |
|---|---|---|
| 34. | ఇంద్రుడు-గరుత్మంతుల స్నేహము | 45 |
| | దాసత్వమునుంచి వినత ముక్తి పొందుట | 45 |
| 35. | ముఖ్యమైన నాగులు | 46 |
| 36. | శేషుడు నాగకులము వీడుట | 46 |
| 37. | ఆత్మరక్షణకై నాగుల ఆలోచన | 47 |
| 38. | నాగుల రక్షణ విషయమై రహస్య సంభాషణం | 47 |
| 39. | నాగగణములు ఊరట చెందుట | 47 |
| 40. | పరీక్షిత్తుని బ్రాహ్మణకుమారుడు శపించుట | 48 |
| 41. | రాజును శృంగి శపించుట | 48 |
| 42. | శాపవృత్తాంతము పరీక్షిత్తునకు తెలియజేయుట | 49 |
| 43. | పరీక్షిత్తును తక్షకుడు కాటువేయుట | 49 |
| 44. | పరీక్షిత్తుని మృతి | 50 |
| 45. | వంశాభివృద్ధి ప్రశంస | 50 |
| 46. | వంశరక్షణకై జరత్కారుని ప్రతిజ్ఞ | 50 |
| 47. | జరత్కారుడు భార్యను వదలుట | 51 |
| 48. | ఆస్తీకుని జననము | 51 |
| 49. | పరీక్షిత్తుని మరణ వృత్తాంతము | 51 |
| 50. | పరీక్షిత్తుని శాపరహస్యము | 52 |
| 51. | సర్పములను నశింపచేయుటకై రాజు ప్రతిన పూనుట | 52 |
| 52. | సర్పయాగారంభము | 53 |
| 53. | ఋత్వికుల పేర్లు | 53 |
| 54. | ఆస్తీకుని తల్లి ఆదేశించుట | 53 |
| | జనమేజయుని యజ్ఞమునకు ఆస్తీకుడు వచ్చుట | 53 |
| 55. | ఆస్తీకుడు జనమేజయుని కీర్తించుట | 54 |
| 56. | నాగకులమును రక్షింప వరము వేడుట | 54 |
| 57. | యజ్ఞమున దగ్ధులైన నాగులు | 55 |
| 58. | సర్పయాగ ఉపసంహారము (ఆస్తీకపర్వ సమాప్తి) | 55 |

| | | |
|---|---|---|
| 59. | ఆది వంశావతరణిక, మహాభారత ప్రసంగము | 56 |
| 60. | వేదవ్యాసుడు జనమేజయుని యజ్ఞమునకు వచ్చుట | 56 |
| 61. | మహాభారత కథారంభము | 56 |
| 62. | కురుపాండవుల శత్రుత్వ కారణము, మహాభారత మహాత్మ్యము | 56 |
| 63. | ఉపరిచర వసువు | 57 |
| | మత్స్యగంధిక పుట్టుక, వ్యాసుని జన్మవృత్తాంతము | 57 |
| | సంక్షిప్త క్షత్రియవంశ వర్ణన | 58 |
| 64. | ప్రాచీన రాజవంశములు (ఆది వంశావతరణికాధ్యాయ సమాప్తి) | 59 |
| 65. | సంభవసర్వము, బ్రహ్మర్షి వంశము | 59 |
| | దేవాసుర వంశవర్ణన | 59 |
| | అసుర గురువు శుక్రుని వంశము | 60 |
| 66. | రుద్రాది సృష్టి వర్ణన | 61 |
| 67. | నృపుల జన్మ వృత్తాంతము | 63 |
| | పాండవవంశ వర్ణన, యదువంశ వర్ణన | 64 |
| 68. | శకుంతలోపాఖ్యానము | 64 |
| 69. | దుష్యంతుడు వేటకు పోవుట | 64 |
| 70. | కణ్వఋషి ఆశ్రమ సమృద్ధి | 65 |
| 71. | దుష్యంతుడు శకుంతలను చూచుట | 65 |
| | శకుంతల తన వృత్తాంతము రాజునకు తెలియజేయుట | 65 |
| 72. | విశ్వామిత్రుని తపోభంగము | 66 |
| 73. | వివాహప్రస్థానము | 66 |
| | దుష్యంత – శకుంతలల వివాహము | 67 |
| 74. | శకుంతలకు భరతుడు జన్మించుట | 67 |
| | శకుంతల పతి గృహమున కేగుట | 68 |
| | దుష్యంతుడు శకుంతలను నిరాకరించుట | 68 |
| | ఆకాశవాణి పలుకుట | 69 |
| | (సంభవ పర్వాధ్యాయ, శకుంతలోపాఖ్యాన సమాప్తి | |
| 75. | సాధారణ సృష్టి వర్ణన | 69 |
| | యయాతి చరిత్ర | 70 |

| | | |
|---|---|---|
| 76. | దేవయాని చరిత్ర | 71 |
| | శుక్రుని వద్ద కచుని శిష్యరికము | 71 |
| | కచునకు సంజీవినీ విద్య లభించుట | 72 |
| 77. | దేవయాని కచుని వివాహమాడగోరుట | 72 |
| 78. | దేవయాని-శర్మిష్ఠల వివాదము | 72 |
| | దేవయానిని నూతియందు త్రోసివేయుట | 73 |
| 79. | వృషపర్వునిపై శుక్రుడు కోపించుట | 73 |
| 80. | శుక్రుడు వృషపర్వునితో సంబంధము త్రెంపుకొనుట | 73 |
| | శర్మిష్ఠ దేవయాని దాసియగుట | 74 |
| 81. | యయాతితో దేవయాని కలయిక | 74 |
| | దేవయాని యయాతిని వివాహమాడుట | 75 |
| 82. | యయాతి శర్మిష్ఠను గ్రహించుట | 75 |
| 83. | యదుడు మొదలైనవారి జననము | 75 |
| 84. | 'పురు' తండ్రి వృద్ధాప్యము గ్రహించుట | 76 |
| 85. | పురుని రాజుగా చేయుట | 77 |
| 86. | యయాతి తపస్సు | 78 |
| 87-88. | ఆత్మప్రశంస వలన యయాతి స్వర్గచ్యుతుడగుట | 78 |
| 89. | యయాతి ఆత్మకథ | 79 |
| 90. | యయాతి చెప్పిన నీతులు | 79 |
| 91. | నాల్గు ఆశ్రమ ధర్మములు | 80 |
| 92. | యయాతి స్వధర్మానురక్తి | 80 |
| 93. | యయాతి త్యాగశీలత | 81 |
| 94. | పురువంశ వర్ణన | 81 |
| 95. | పురువంశ వర్ణన (విస్తృతము), భరతుని పుట్టుక | 83 |
| 96. | అభిసప్తులైన వసువులు గంగా గర్భమున జన్మించుట | 85 |
| 97. | శంతనుని జన్మవృత్తాంతము | 86 |
| 98. | శంతనుడు గంగను వివాహము చేసుకొనుట | 87 |
| 99. | వసుగణముల శాపవృత్తాంతము | 87 |

| | | |
|---|---|---|
| 100. | శంతనుని చరిత్ర, భీష్ముని చరిత్ర | 88 |
| | భీష్ముని యౌవ్వరాజ్య పట్టాభిషేకము | 88 |
| 101. | శంతనుడు సత్యవతిని వివాహమాడుట | 90 |
| 102. | కాశీరాజ కన్యల స్వయంవరము | 90 |
| | భీష్ముడు కాశీరాజ కన్యలను హరించుట | 91 |
| | సాళ్వునితో భీష్ముడు యుద్ధము చేయుట | 91 |
| 103. | సంతానోత్పత్తి చేయ భీష్ముడు నిరాకరించుట | 92 |
| 104. | క్షేత్రతోత్పాదన దృష్టాంతములు | 93 |
| | దీర్ఘతముడను ఋషి జన్మవృత్తాంతము | 93 |
| | స్త్రీజాతిని దీర్ఘతముడు శపించుట | 94 |
| | అంగరాజాదుల జన్మవృత్తాంతము | 94 |
| 106. | ధృతరాష్ట్రుని పుట్టుక | 95 |
| 107. | విదురుని పూర్వజన్మ వృత్తాంతము, మాండవ్యోపాఖ్యానము | |
| | మాండవ్యుని కొఱత వేయుట | 96 |
| 108. | మాండవ్యుని శాపమున ధర్మరాజు విదురుడై జన్మించుట | 97 |
| 109. | ధృతరాష్ట్రాదుల జనన సమయమున శుభశకునములు | 97 |
| 110. | ధృతరాష్ట్ర పాండురాజుల వివాహ పరామర్శ | 98 |
| | గాంధారితో ధృతరాష్ట్రుని వివాహము | 98 |
| 111. | కుంతికి దూర్వాసుడు వరమిచ్చుట | 98 |
| | కుంతికి కర్ణుడు జన్మించుట | 99 |
| 112. | కుంతీ స్వయంవరము, పాండురాజుతో ఆమె వివాహము | 99 |
| 113. | మాద్రితో పాండురాజు వివాహము | 100 |
| | పాండురాజు దిగ్విజయము చేయుట | 100 |
| 114. | పాండురాజు వనవిహారము | 100 |
| 115. | గాంధారికి దుర్యోధనాది శతపుత్రులు జన్మించుట | 101 |
| | దుర్యోధనుడు జన్మించునపుడు దుశ్శకునములు కాన్పించుట | 101 |
| 116. | దుర్యోధన సోదరి దుఃశల జన్మవృత్తాంతము | 102 |
| 117. | దుర్యోధనాది శతభ్రాతల పేర్లు | 102 |

| | | |
|---|---|---|
| 118. | మృగరూపులైన ముని దంపతుల వలన పాండురాజు శపింపబడుట | 103 |
| 119. | పాండురాజు విషాదము నొందుట | 103 |
| | కుంతీమాద్రులతో పాండురాజు వానప్రస్థమున కరుగుట | 103 |
| 120. | పాండురాజు బ్రహ్మలోక యాత్ర | 104 |
| | అపుత్రకుడైన పాండురాజు దుఃఖించుట | 104 |
| | పుత్రులను పొంద కుంతిని పాండురాజు ఆదేశించుట | 104 |
| 121. | కుంతీ ప్రబోధము | 105 |
| | మృతిచెందిన బ్యూషితాశ్వుడు కుమారుని పొందుట | 105 |
| 122. | శ్వేతకేతు సంవాదము | 106 |
| | పుత్రోత్పాదనకు కుంతి సమ్మతించుట | 107 |
| 123. | పుత్రార్థము ధర్ముని ఆహ్వానించుట | 107 |
| | యుధిష్ఠురుని జననము | 107 |
| | భీముని జననము | 107 |
| | అర్జునుని జననము | 108 |
| 124. | నకుల సహదేవుల జన్మవృత్తాంతము | 108 |
| 125. | పాండురాజు మృతి | 109 |
| 126. | పాండురాజు మృతదేహమును హస్తినకు తీసుకొని వచ్చుట | 109 |
| 127. | పాండురాజు యొక్క అంత్యక్రియలు జరుపుట | 110 |
| 128. | పాండురాజు యొక్క ఊర్ధ్వదైహిక క్రియలు | 110 |
| | సత్యవతి గృహస్థాశ్రమమును వర్జించుట | 110 |
| | కురుపాండవ బాలుర క్రీడ | 111 |
| | పాండవులను నిగ్రహింప దుర్యోధనుని దురాలోచన | 111 |
| 129. | భీముడు నాగలోకము చేరుట | 112 |
| | నాగలోకమున భీముడు అమృతము త్రాగుట | 112 |
| | భీముడు తిరిగి వచ్చుట | 112 |
| 130. | కృపుడు, కృపిల జన్మవృత్తాంతము | 112 |
| | కృపుని కురు కుమారుల ఆచార్యునిగా నియమించుట | 113 |

| | | |
|---|---|---|
| | ద్రోణుడు ప్రధానాచార్యుడగుట | 113 |
| | ద్రోణుని జన్మవృత్తాంతము | 113 |
| | పరశురాముని వద్ద ద్రోణుడు అమోఘ అస్త్రములు పొందుట | 114 |
| 131. | ద్రోణ-ద్రుపద సంవాదము | 114 |
| | ద్రోణుని విద్యాకౌశలము కురుబాలకులు భీష్మునకు తెలియజేయుట | 115 |
| | భీష్మునితో ద్రోణుడు తన దైన్యము తెలుపుట | 115 |
| 132. | కౌరవ శిష్యగణమునకు ద్రోణుడు అస్త్రశిక్ష గరపుట | 116 |
| | అర్జునుడు మేటి విలుకాడగుట | 116 |
| | ఏకలవ్యుని అలౌకిక గురుభక్తి | 117 |
| | అస్త్రశిక్షయందు అర్జునాదుల పరీక్ష | 118 |
| 133. | అర్జునుని సాఫల్యత | 118 |
| 134. | కుమారుల కృత్రిమ యుద్ధ ప్రదర్శన | 119 |
| | రణక్షేత్ర నిర్మాణము | 120 |
| | యుద్ధదర్శనార్థము ప్రజల రాక | 120 |
| | యుద్ధారంభము | 120 |
| 135. | ద్రోణుడు సభాసదులకు అర్జునుని పరిచయము చేయుట | 121 |
| | అర్జునుని అస్త్రకౌశల్య ప్రదర్శన | 121 |
| 136. | రణాంగణమున కర్ణుడు ప్రవేశించుట | 122 |
| | కర్ణుడు అంగరాజగుట | 123 |
| | కర్ణుని అభిషేకము - దుర్యోధనునితో సఖ్యము | 123 |
| 137. | కర్ణుని ఉద్దేశించి భీముడు కఠినోక్తులాడుట | 123 |
| 138. | ద్రోణుని గురుదక్షిణ - ద్రుపద నిగ్రహము | 124 |
| | ద్రుపదుడు అర్జునునితో యుద్ధము సేయుట | 125 |
| | ద్రుపదుడు ఓడిపోవుట | 125 |
| | అర్జునుడు ద్రుపదుని బంధించి ద్రోణునకు అర్పించుట | 125 |
| 139. | శౌవీర పరాజయము | 126 |
| 140. | ధృతరాష్ట్ర కణికుల కూట మంత్రాలోచన | 126 |
| | ముంగిస, పులి, నక్క, తోడేలు, ఎలుకల కథ | 127 |

| | | |
|---|---|---|
| 141. | జతూగృహ పర్వాధ్యాయము | 129 |
| 142. | వారణా నగరమునకు పాండవులను పంపగోరుట | 129 |
| 143. | పాండవులు వారణాసికేగుట | 130 |
| 144. | వారణాసిలో లాక్షాగృహ నిర్మాణము | 130 |
| 145. | పాండవులకై ప్రజలు విచారించుట | 130 |
| | విదురుడు సంకేత వాక్యముల పాండవులను హెచ్చరించుట | 130 |
| 146. | లాక్షాగృహ నివాసము | 131 |
| 147. | విదుర ప్రేరితుడైన ఖనకుడు పాండవులను చేరుట | 131 |
| | లాక్షాగృహమున ఖనకుడు సొరంగము త్రవ్వుట | 131 |
| 148. | లాక్షాగృహ దహనము | 132 |
| | పాండవుల పలాయనము | 132 |
| 149. | పాండవులు గంగను దాటుట | 132 |
| 150. | లాక్షాగృహ దహన వార్తకు కౌరవుల కపట శోకము | 132 |
| 151. | కుంతి మొదలైనవారి క్లేశమునకు భీముడు విచారించుట | 133 |
| 152. | హిడింబాసుర వధ పర్వాధ్యాయము | 134 |
| 153. | పాండవులను వధింప హిడింబాసురుడు వచ్చుట | 135 |
| | భీమ హిడింబాసురుల వాగ్వాదము | 135 |
| 154. | భీమ హిడింబాసురుల యుద్ధము | 135 |
| | భీముడు హిడింబాసురుని వధించుట | 136 |
| 155. | భీమ హిడింబల పరిణయము | 136 |
| | ఘటోత్కచుని జన్మము | 137 |
| 156. | పాండవుల యొద్ద వ్యాసమహర్షి సాక్షాత్కరించుట | 137 |
| | ఏకచక్రపురమున పాండవులు వసించుట | 138 |
| 157. | బకవధ పర్వాధ్యాయము | 138 |
| | ఏకచక్ర పర్వమున రాక్షసభీతి | 138 |
| | రాక్షసుని వలన భయముచే బ్రాహ్మణ కుటుంబము రోదించుట | 138 |
| 161. | బ్రాహ్మణ కుటుంబమును రక్షింప కుంతి పుత్రదానము చేయుట | 140 |
| 162. | భీముని రాక్షసుని వద్దకు పంప అన్నదమ్ములు అంగీకరింపకుండుట | 140 |

| | | |
|---|---|---|
| 163. | భీముడు రాక్షసుని వద్దకు వెడలుట | 141 |
| | రాక్షసునితో భీముని యుద్ధము | 142 |
| 164. | బకాసుర వధ | 142 |
| 165. | చైత్రరథ పర్వాధ్యాయము-ద్రౌపదీ దుష్టద్యుమ్నుల ఉత్పత్తి | 142 |
| 166. | ద్రోణుని జన్మరహస్యము | 143 |
| 167. | పుత్రునికై ద్రుపదుడు యజ్ఞము చేయ దలంచుట | 143 |
| | యజ్ఞార్థము పురోహితుని అన్వేషించుట | 144 |
| | యాజుమహర్షి ద్రుపదుని పురోహితుడగుటకు అంగీకరించుట | 144 |
| | ద్రుపదుని యజ్ఞారంభము | 144 |
| | యజ్ఞాగ్ని నుండి దుష్టద్యుమ్నుని పుట్టుక | 145 |
| | ద్రౌపది యజ్ఞాగ్నినుండి ఉద్భవించుట | 145 |
| 168. | పాంచాల దేశమునకు పాండవులు బయలుదేరుట | 146 |
| 169. | వ్యాసపునరాగమనము | 146 |
| 170. | అంగారపర్ణుడను గంధర్వునితో పాండవుల విరోధము | 147 |
| | గంధర్వునితో అర్జునుడు యుద్ధము సేయుట | 148 |
| | గంధర్వుడు అర్జునునకు చాక్షుషియను విద్యను నేర్పుట | 148 |
| | అర్జునుడు గంధర్వునితో సఖ్యము చేయుట | 149 |
| | అర్జునునకు గంధర్వుడు నీతి గరపుట | 149 |
| 171. | తపతీ ఉపాఖ్యానము | 149 |
| 172. | తపతి సౌందర్యమునకు సంబరణుడు ముగ్ధుడగుట | 150 |
| | శంబరణుడు మోహపరవశుడగుట | 150 |
| 173. | శంబరణుడు సూర్యుని ఉపాసించుట | 151 |
| | శంబరణుడు తపతిని పొందుట | 151 |
| | ఇంద్రుడు కుపితుడగుట | 151 |
| 174. | పురోహిత ప్రశస్తి | 152 |
| 175. | వశిష్ఠ విశ్వామిత్రుల ఉపాఖ్యానము | 152 |
| 176. | కల్మషపాదుని కథ | 153 |
| | వశిష్టుడు అలౌకికముగా ఉపేక్షా భావము చూపుట | 155 |

| | | |
|---|---|---|
| 177. | విపాస, శతద్రూపుల వృత్తాంతము | 155 |
| 178. | పరాశరుని జన్మవృత్తాంతము | 156 |
| 179. | ఊర్వఋషి జన్మవృత్తాంతము | 157 |
| 180. | బడబాగ్ని పుట్టుక | 157 |
| 181. | ఆగ్నేయగిరి వృత్తాంతము | 158 |
| 182. | కల్మషపాదుని క్షేత్రజపుత్ర రహస్యము | 159 |
| 183. | ధౌమ్యుని పాండవులు పురోహితునిగా వరించుట | 159 |
| 184. | స్వయంవర పర్వాధ్యాయము | 160 |
| 185. | పాండవులు పాంచాల దేశమునకు వెడలుట | 160 |
| | ద్రౌపదీ స్వయంవర సభ | 161 |
| 186. | స్వయంవరమునకు వచ్చిన రాజుల పరిచయము | 161 |
| 187. | కృష్ణ సౌందర్యము చూసి రాజులు మోహితులగుట | 162 |
| 188. | అర్జునుడు విల్లు ఎక్కుపెట్టుట | 163 |
| | అర్జునుడు లక్ష్యము భేదించుట | 164 |
| 189. | అర్జునునితో రాజులు యుద్ధము చేయుట | 164 |
| 190. | ఉభయపక్షములు యుద్ధము సేయుట | 165 |
| | కృష్ణుడు మధ్యవర్తియై యుద్ధమునాపుట | 166 |
| 191. | ద్రౌపదితో పాండవులు కుంతిని చేరుట | 166 |
| 192. | దుష్టద్యుమ్నుడు రహస్యముగా పాండవులను పరీక్షించుట | 168 |

## రెండవ భాగము

## ఆదిపర్వం

| | | |
|---|---|---|
| 193. | వైవాహిక పర్వాధ్యాయము | 169 |
| | పాండవులతో 'కృష్ణ' వివాహము మంత్రణాలోచన | 169 |
| 194. | పాండవులను ద్రుపదుడు ఆహ్వానించుట | 170 |
| 195. | ద్రుపదుడు పాండవులను పరిచయమడుగుట | 170 |
| | ద్రౌపదీ వివాహాలోచనము | 171 |
| 196. | వివాహ విషయము వ్యాసమహర్షితో చర్చించుట | 172 |
| | వ్యాసమహర్షి కర్తవ్యము తెలియజేయుట | 172 |

| | | |
|---|---|---|
| 197. | ద్రౌపది బహుస్వామిత్వము వ్యాసుడు ద్రుపదునకు తెలియజెప్పుట | 172 |
| 198. | ద్రౌపది వివాహము | 174 |
| 199. | నవవధువు ద్రౌపది ఆశీర్వాదము పొందుట | 175 |
| 200. | విదురాగమన పర్వాధ్యాయము | 175 |
| | ద్రౌపదిని పొందని కౌరవుల విచారము | 175 |
| | ధృతరాష్ట్రుని కపట ఆనందము | 176 |
| 201. | పాండవులను నాశనము చేయ దురాలోచన | 176 |
| 202. | కర్ణుని అభిమతము | 177 |
| 203. | భీష్ముని ఉద్దేశ్యము | 177 |
| 204. | ద్రోణాచార్యుని ఆలోచన | 178 |
| | భీష్మ ద్రోణుల అభిమతమునకు కర్ణుడు ఎదురు పలుకుట | 178 |
| 205. | విదురుని హితోపదేశము | 178 |
| 206. | పాండవులను హస్తినానగరమునకు తోడ్కొని వచ్చుటకై విదురుడు బయలుదేరుట | 179 |
| 207. | రాజ్యలాభ పర్వాధ్యాయము | 180 |
| | ద్రౌపదితో పాండవులు హస్తినానగరమునకు వచ్చుట | 180 |
| | పాండవులు అర్థరాజ్యము పొందుట | 181 |
| 208. | ఖాండవప్రస్థ నగరమున పాండవుల నివాసము | 181 |
| 209. | సుందోపసుందోపాఖ్యానము | 182 |
| 210. | సుందోపసుందుల ఉపద్రవము | 183 |
| 211. | సుందోపసుందుల సంహారమునకై ఆలోచన | 183 |
| | విశ్వకర్మ తిలోత్తమను సృష్టించుట | 183 |
| | బ్రహ్మకు నాల్గు శిరస్సులు కలుగుట | 183 |
| 212. | తిలోత్తమ సుందోపసుందులవద్దకు వచ్చుట | 184 |
| | ద్వంద్వ యుద్ధమున సుందోప సుందులు నిహతులగుట | 184 |
| 213. | అర్జున వనవాస పర్వాధ్యాయము | 184 |
| | అర్జునుడు బ్రాహ్మణుని గోధనము రక్షించుట | 185 |
| | ప్రతిన తప్పిన అర్జునుడు వనవాసమున కేగుట | 185 |
| 214. | అర్జునుడు ఉలూపిని వివాహమాడుట | 186 |

215. చిత్రాంగద, అర్జునుల పాణిగ్రహణము 186
216-217
మొసలి రూపమున ఉన్న వర్గ మొదలైన అప్సరసల కథ 187
218. ప్రభాసతీర్థమున కృష్ణార్జునులు కలసుకొనుట 188
అర్జునుడు ద్వారకకు వచ్చుట 188
219. సుభద్రాహరణ పర్వాధ్యాయము - రైవతక ఉత్సవము 188
220. సుభద్రాహరణము 189
221. హరణాహరిణ పర్వాధ్యాయము
పార్థుడు సుభద్రను వివాహమాడుట 190
సుభద్రతో అర్జునుడు ఖాండవప్రస్థ నగరము చేరుట 190
యాదవులు ఖాండవప్రస్థమునకు వచ్చుట 191
అభిమన్యుని జననము 191
ద్రౌపదికి ఐదుగురు కుమారులు కలుగుట 192
222. ఖాండవ దహన పర్వాధ్యాయము 192
బంధువులతో కృష్ణార్జునులు జలవిహారము చేయుట 192
223. ఖాండవవన దహనము చేయ అగ్ని అర్జునుని చేరుట 192
ఖాండవవన ఇతిహాసము - శ్వేతకి వృత్తాంతము 193
శ్వేతకి దీర్ఘకాల యజ్ఞము 193
బహుఘృత భక్షణమున అగ్ని అగ్నిమాంద్యము 194
224. అస్త్రములకై అర్జునుడు అగ్నిని ప్రార్థించుట 194
225. అర్జునుడు గాండీవము పొందుట 194
కృష్ణుడు గదా చక్రములను గ్రహించుట 195
226. ఖాండవారణ్యమందలి ప్రాణుల సంక్షోభము 195
అగ్నిని ఆప ఇంద్రుడు ప్రయత్నించుట 195
227. ఇంద్రుని రాళ్లవాన 195
దేవతలు అర్జునునితో యుద్ధము చేయుట 196
228. అర్జునుడు మయ దానవుని రక్షించుట 196
229. మందపాల మహర్షి ఉపాఖ్యానము 196

230, 231, 232
తల్లి పిచ్చుక పిల్లలకు ధైర్యము చెప్పుట 197
233. సంతానమునకై మందపాలుడు విలపించుట 198
234. అస్త్రదాన ప్రతిశృతి ఇంద్రుడు అర్జునునకిచ్చుట 198

## సభాపర్వము

1. సభాక్రియా పర్వాధ్యాయము – మయుని సౌజన్యము 199
2. శ్రీకృష్ణుడు ద్వారకకు మరలుట 199
3. మయుడు స్వగృహమునకు మరలుట 200
4. పాండవులు మయసభను ప్రవేశించుట 200
5. పాండవ సభకు దేవర్షి నారదుని ఆగమనము 201
6, 7, 8, 9, 10, 11.
ధర్మరాజు మయసభ యెట్లున్నదని నారదుని ప్రశ్నించుట 201
ధర్మరాజుతో నారదమహర్షి రాజసూయ యాగము చేయుమనుట 202
12. రాజసూయారంభ పర్వాధ్యాయము 202
13. రాజసూయయాగమందలి అడ్డంకులు కృష్ణుడు తెలియజేయుట 203
14. కృష్ణ, ధర్మరాజాదులు కలసి ఆలోచించుట 203
15. జరాసంధుని వధింప అర్జునుడు తన నిశ్చయము తెలుపుట 204
16. జరాసంధుని వధార్థము కృష్ణుని ఉపదేశము 205
జరాసంధుని జన్మవృత్తాంతము 205
17, 18.
జరాసంధుని నామకరణము 206
19. జరాసంధ వధ పర్వాధ్యాయము 206
జరాసంధుని వధింప భీమాదులు బయలుదేరుట 207
20. ఛద్మవేషధారులైన భీమాదులను చూచి జరాసంధుని సంశయము 208
21. తన అపరాధము తెలుపుడని జరాసంధుడు ప్రశ్నించుట 208
కృష్ణ భీమాదులు తమ నిజరూపములను ఎరుకపరచుట 209
22. భీమునితో జరాసంధుడు యుద్ధము చేయుట 209
23. జరాసంధ వధ 210

| | | |
|---|---|---|
| 24. | దిగ్విజయ పర్వాధ్యాయము | 211 |
| 25, 26, 27 | | |
| | అర్జునుని దిగ్విజయము | 211 |
| 28, 29. | | |
| | భీముని దిగ్విజయము | 212 |
| 30. | సహదేవుని దిగ్విజయము | 212 |
| | అజేయమైన మహిష్మతీ నగరము | 213 |
| 31. | నకులుని దిగ్విజయము | 213 |
| 32. | రాజసూయ పర్వాధ్యాయము | 213 |
| | కృష్ణుని ఆనతిపై ధర్మరాజు రాజసూయ యాగము ఆరంభించుట | 214 |
| | యుధిష్ఠిరుని యజ్ఞదీక్ష | 214 |
| 33. | భీష్మాది కౌరవ ప్రముఖుల రాక | 215 |
| 34. | నిపుణతతో ధర్మరాజు యజ్ఞకార్యభారము వహింప తగువారిని నియోగించుట | 215 |
| 35. | అర్ఘ్యాభిహరణ పర్వాధ్యాయము | 216 |
| 36. | సభలో శిశుపాలుడు కృష్ణుని నిందించుట | 216 |
| 37. | ధర్మరాజు శిశుపాలుని శాంతపరుప ప్రయత్నించుట | 217 |
| | భీష్ముడు ధర్మరాజును ఆగమనుట | 217 |
| 38. | శిశుపాలుడు యుద్ధసన్నద్ధుడగుట | 217 |
| 39, 40, 41. | | |
| | శిశుపాల వధ పర్వాధ్యాయము | 218 |
| 42, 43, 44. | | |
| | శిశుపాలుని జన్మవృత్తాంతము | 219 |
| 45. | ద్యూతపర్వాధ్యాయము | 220 |
| 46. | దుర్యోధనుడు మయసభలో అపహాస్యముల పాలగుట | 221 |
| 47. | జూదమాడ శకుని దుర్యోధనుని ప్రోత్సహించుట | 222 |
| 49. | తండ్రివద్ద దుర్యోధనుడు మరల దుఃఖించుట | 223 |
| 53. | ధృతరాష్ట్రుని ఉపదేశము | 224 |
| 57. | పాండవుల వద్దకు విదురుడు వచ్చుట | 226 |

| | | |
|---|---|---|
| 58. | ద్యూతక్రీడారంభము | 226 |
| 60. | విదురుని ద్యూతక్రీడా తిరస్కారము | 227 |
| 62. | దుర్యోధనుడు విదురుని అవమానించుట | 228 |
| 63. | ధర్మరాజు పరాజయము | 228 |
| 65. | దుర్యోధనుడు ద్రౌపదిని తీసుకొని రమ్మని దూతను పంపుట | 229 |
| | దుశ్శాసనుడు ద్రౌపదిని సభకు ఈడ్చుకొని వచ్చుట | 230 |
| 66. | ద్రౌపదిని పణముగా ఒడ్డు విషయమై వికర్ణుని ప్రశ్న | 231 |
| | ద్రౌపదీ మానసంరక్షణ | 232 |
| | దుశ్శాసనుని రక్తపానము చేయ భీముడు ప్రతిజ్ఞ చేయుట | 232 |
| | విదురుని నివేదన | 233 |
| 67. | విలపించు ద్రౌపదిని భీష్ముడోదార్చుట | 233 |
| 69. | కర్ణుని కుత్సితోక్తి | 234 |
| | భీముడు దుర్యోధనుని ఊరువులు భగ్నము చేయుదునని ప్రతిజ్ఞ చేయుట | 235 |
| | ధృతరాష్ట్రుడు పాంచాలికి వరములిచ్చుట | 236 |
| 70. | ధర్మరాజు భీముని శాంతపరచుట | 236 |
| 71. | పాండవులు ఖాండవప్రస్థమునకు మరలుట | 237 |
| 72. | అనుద్యూత పర్వాధ్యాయము | 237 |
| 73. | గాంధారి ఉపదేశము | 238 |
| 74. | రెండవమారు ద్యూతక్రీడ | 238 |
| 75. | పాండవులు అజ్ఞాతవాసము చేయ బయలుదేరుట | 239 |
| | విదురుడు అరణ్యోన్ముఖులైన పాండవులను ఆశీర్వదించుట | 239 |
| 79. | పాండవుల నిర్వాసనమున ధృతరాష్ట్రుడు సంజయునితో తన విచారము ప్రకటించుట | 242 |

# అరణ్యపర్వము


| | | |
|---|---|---|
| 1. | అరణ్యక పర్వాధ్యాయము | 244 |
| 2. | పాండవులతో బ్రాహ్మణుల వనగమనేచ్ఛ | 244 |
| 3. | ధౌమ్యుడు సూర్యోపాసన చేయుమని ఉపదేశించుట | 246 |
| | సూర్యుడు ధర్మరాజునకు అక్షయపాత్రనిచ్చుట | 246 |
| 4. | కురుపాండవుల సంధికి విదురుని ఉపదేశము | 246 |
| 5. | విదురుడు పాండవులను చేరుట | 247 |
| 6. | పాండవుల అభివృద్ధికి భయపడి ధృతరాష్ట్రుడు విదురుని తిరిగి రమ్మనుట | 248 |
| 10. | కురుపాండవుల సంధికై మైత్రేయుని రాక | 250 |
| | మైత్రేయ ముని దుర్యోధనుని శపించుట | 250 |
| 11. | కిమ్మీర వధ పర్వాధ్యాయము | 251 |
| | పాండవులు ద్వైతవనమున వసించుట | 252 |
| 12. | అర్జునాభిగమన పర్వాధ్యాయము | 252 |
| | కృష్ణునితో ద్రౌపది తమ కష్టములు తెలియజేయుట | 253 |
| 15. | శౌభధ్వంసము - సాళ్వ వధ వృత్తాంతము | 254 |
| 25. | పాండవులకు మార్కండేయుని ఉపదేశము | 256 |
| 26. | బక ఋషి వలన యుధిష్ఠరాదులు ఉపదేశము పొందుట | 257 |
| 27. | ద్రౌపదీ విలాపము | 257 |
| 28. | బలి-ప్రహ్లాదుల ఉపాఖ్యానము | 258 |
| 29. | ధర్మరాజు ద్రౌపది నోదార్చుట | 258 |
| 33. | భీముడు రోషపరవశుడగుట | 259 |
| 36. | భీముని ధర్మరాజు ఓదార్చుట | 261 |
| | ధర్మరాజాదుల వద్దకు వ్యాసమహర్షి వచ్చుట | |
| | ధర్మరాజును ప్రతిస్మృతియను రహస్య విద్యాదీక్షితుని చేయుట | 262 |
| 37. | అస్త్ర విద్యాస్త్ర లాభార్థము అర్జునుడు తపస్సు చేయుట | 262 |
| 38. | కైరాత పర్వాధ్యాయము | 264 |
| | అర్జునుడు మహాదేవుని కొరకై తపస్సు చేయుట | 264 |

| | | |
|---|---|---|
| 39. | కిరాత రూపమున హరుడు అర్జునుని తపోవనమును చేరుట | 264 |
| 40. | అర్జునుడు పాశుపతాస్త్రము పొందుట | 266 |
| 42. | ఇంద్రలోకాభిగమన పర్వాధ్యాయము | 267 |
| 43. | అర్జునుని దేవతలు ఆహ్వానించుట | 269 |
| 47. | ఇంద్రసభలో పార్థుడు లోమస మహర్షిని కలుసుకొనుట | 270 |
| 48. | అర్జునుని అభ్యుదయమునకు ధృతరాష్ట్రుడు భయపడుట | 271 |
| | పాండవుల భయముచే ధృతరాష్ట్రుడు రోదించుట | 272 |
| 52. | నలోపాఖ్యాన పర్వాధ్యాయము | |
| | పార్థుని కొరకై పాండవుల విచారము | 272 |
| 53. | దమయంతీ జన్మవృత్తాంతము | 273 |
| 54. | దమయంతీ స్వయంవరము | 274 |
| | దేవతల ఆజ్ఞానుసారము నలుడు దమయంతిని కలుసుకొనుట | 275 |
| 56. | దేవతల కోర్కెను దమయంతి తిరస్కరించుట | 275 |
| 57. | స్వయంవర సభలో దమయంతి పతి అన్వేషణ | 276 |
| | దమయంతి నలుని వరించుట | 276 |
| 58. | నలుని నాశనము చేయ కలి సంకల్పించుట | 277 |
| 59. | నలుని దేహమున కలి ప్రవేశించుట | 277 |
| 60. | అరిష్టములు కలుగనున్నవని అనుమానించిన | |
| | దమయంతి సంతానమును పితృగృహమునకు పంపుట | 278 |
| 61. | సర్వము కోల్పోయిన నలుడు పురము త్యజించుట | 278 |
| 62. | కలి ప్రభావమున నలుడు దమయంతిని వదిలిపోవుట | 279 |
| 63. | నలపరిత్యక్త దమయంతి విలాపము | 279 |
| 65. | సుబాహు నృపతి పురమున దమయంతి వసించుట | 281 |
| 66. | దావాగ్నినుంచి కర్కోటకుని నలుడు రక్షించుట | 282 |
| 67. | ఋతుపర్ణ నృపతి వద్ద నలుడు అశ్వాధ్యక్షుడిగా యుండుట | 282 |
| 68. | నల-దమయంతుల కొరకై భీమ నృపతి అన్వేషించుట | 283 |
| 70. | పర్ణాదుడను బ్రాహ్మణుడు దమయంతితో | |
| | నలుని వృత్తాంతము యెరింగించుట | 284 |

71. దమయంతి స్వయంవర వార్త విని ఋతుపర్ణుడు
విదర్భకు బయలుదేరుట 285
77. నలుని రాకకు విదర్భదేశ ప్రజలు సంతసించుట 288
78. నలుడు స్వదేశమునకు తిరిగి వచ్చుట 288
79. బృహదశ్వుడు పాండవులను ఓదార్చుట 289
80. తీర్థయాత్రా పర్వాధ్యాయము 290
86. ధౌమ్యునితో యుధిష్ఠిరుని వనాంతరగమన ప్రార్థన 292
91. పాండవుల వద్దకు లోమసమహర్షి వచ్చుట –
అర్జునుని రాక తెలుపుట 292
95. పాండవుల తీర్థయాత్ర 294
96. అగస్త్య తీర్థము – వాతాపి, ఇల్వలుల ఉపాఖ్యానము 294
లోపాముద్ర ఉపాఖ్యానము 295
98. ధనమునకై అగస్త్యుడు ఇల్వలుని చేరుట 296
పరశురామ తీర్థ వృత్తాంతము 297
100. లోకకల్యాణమునకు దధీచి ఆత్మత్యాగము 298
104. సూర్యుని గతి నిరోధింప వింధ్యాచలము శరీరము పెంచుట 300

## మూడవ భాగము

## అరణ్య పర్వము

(శేషాంశము)

## విరాటపర్వము

106. సగర వృత్తాంత వర్ణన 302
107. సగర సంతానమును కపిల మహర్షి భస్మము చేయుట 302
108. భగీరథుడు గంగాదేవిని ఆరాధించుట 304
109. భగీరథుని తపస్సునకు మెచ్చి శివుడు గంగను ధరించుట 305
110. కౌశికి మొదలైన తీర్థ దర్శనము 305
ఋష్యశృంగుని చరిత్ర 306
114. పాండవులు వైతరిణీ మొదలైన తీర్థములను గాంచుట 309

115. పాండవులు మహేంద్రపర్వతమున పరశురాముని
ఆశ్రమమునకు చనుట 309
116. కార్తవీర్యార్జునుని చరిత్ర 309
117. జమదగ్ని–రేణుక 310
119. పాండవులు ప్రభాస తీర్థమునకు చనుట 312
122. చ్యవనుడు – సుకన్య 313
123. అశ్వనీకుమారుల దయచే చ్యవనుడు యౌవ్వనము పొందుట 313
126. మాంధాత జన్మవృత్తాంతము 315
127. సోమక నృపతి వృత్తాంతము 316
ఉశీనర ఉపాఖ్యానము 317
132. అష్టవక్రుడు–శ్వేతకేతు వృత్తాంతము 318
134. వందితో అష్టవక్రుని వాగ్వాదము 319
135. భరద్వాజ ఋషి లోకాంతర వృత్తాంతము 321
136. యవక్రీతుని జీవననాశము 322
137. పుత్రశోకమున భరద్వాజుడు జీవితము త్యజించుట 322
138. పరావసువు తండ్రిని చంపుట 323
భీముడు స్మరింప ఘటోత్కచుడు వచ్చుట 324
146. ద్రౌపది సమీపమున బంగారు కమలము పడుట 325
హనుమంతునితో భీముని సాక్షాత్కారము 326
147. భీముడు–హనుమంతుడు ఒకరినొకరు పరిచయము చేసుకొనుట 327
154. భీముడు సౌగంధిక పుష్పములను కోయుట 330
155. ఉపద్రవములు చూచి పాండవులు భీముని అన్వేషించుట 331
157. జటాసురవధ పర్వాధ్యాయము 332
భీముడు జటాసురుని వధించుట 333
158. యక్షయుద్ధ పర్వాధ్యాయము 334
పాండవులు గంధమాదన పర్వత శోభ దర్శించుట 334
159. రాజర్షి ఆర్ష్టిషేణుని ఆశ్రమమునకు పాండవులు వెడలుట 335
165. నివాతకవచ యుద్ధ పర్వాధ్యాయము – అర్జునుడు
గంధమాదనమునకు మరలి అన్నదమ్ములను కలియుట 337

| | | |
|---|---|---|
| 167. | ధర్మరాజు అడుగగా అర్జునుడు అస్త్రాదులు లభించిన తెరంగు తెలుపుట | 338 |
| 168. | గురుదక్షిణగా నివాతకవచులను చంపుటకై అర్జునుడు బయలుదేరుట | 338 |
| 169. | నివాత కవచులతో అర్జునుని యుద్ధము | 339 |
| 173. | కాలకంజాది దానవులు అర్జునునితో యుద్ధము చేయుట | 340 |
| 176. | అజగర పర్వాధ్యాయము | 341 |
| 177. | గంధమాదన పర్వతము నుండి పాండవులు బదరికాశ్రమమును చేరుట | 341 |
| 178. | అజగర సర్పము భీముని బంధించుట | 342 |
| 179. | శాపగ్రస్తమైన సర్పము తన పరిచయము తెలుపుట | 343 |
| 180. | ధర్మరాజు సర్పము బారినుండి భీముని రక్షించుట | 343 |
| 182. | మార్కండేయ సమస్యా పర్వాధ్యాయము | 344 |
| 183 | మార్కండేయ మహర్షి రాక | 346 |
| 184. | ద్విజాతి మహత్యము | 347 |
| 185. | అత్రిఋషి చరిత్ర | 348 |
| 192. | సూర్యవంశీయుడైన పరీక్షిత్తు అను రాజు వృత్తాంతము | 350 |
| 197. | సౌభాగ్యశాలుర మహత్య కీర్తనము | 352 |
| 198. | ప్రాచీనుల పరిచయము | 353 |
| 199-200 | దుంధుమారుని చరిత్ర | 354 |
| 202. | మధుకైటభుల వృత్తాంతము | 355 |
| 204. | పతివ్రతా మహత్యము | 357 |
| 222. | కార్తికేయుని జన్మవృత్తాంతము | 359 |
| 232. | ద్రౌపదీ సత్యభామా సంవాద పర్వాధ్యాయము | 362 |
| 235. | ఘోషయాత్రా పర్వాధ్యాయము | 363 |
| 240. | గంధర్వులతో దుర్యోధనాదులు యుద్ధము చేయుట | 366 |
| 253. | కర్ణుని దిగ్విజయ యాత్ర | 373 |
| 254. | దుర్యోధనుడు వైష్ణవ యజ్ఞము చేయుట | 374 |

| | | |
|---|---|---|
| 257. | మృగస్వప్నోద్భవ పర్వాధ్యాయము | 376 |
| 258. | వ్రీహిద్రౌణిక పర్వధ్యాయము | 376 |
| 259. | మహర్షి ముద్గలుని ఉపాఖ్యానము | 376 |
| 261. | ద్రౌపదీహరణ పర్వాధ్యాయము | 378 |
| 263. | ద్రౌపదిని చూచి జయద్రధుని చెడ్డతలపు | 379 |
| 271. | జయద్రధ విమోక్షణ పర్వాధ్యాయము | 383 |
| 272. | రామోపాఖ్యాన పర్వాధ్యాయము | 385 |
| 273. | శ్రీరామచరిత్ర | 385 |
| 292. | పతివ్రతామహత్య పర్వాధ్యాయము | 395 |
| | సావిత్రి ఉపాఖ్యానము | 395 |
| 300. | కుండలాహరణ పర్వాధ్యాయము | 399 |
| 301. | కర్ణ జన్మవృత్తాంతము | 399 |
| 310. | ఆరణేయ పర్వాధ్యాయము | 403 |


## విరాటపర్వము


| | | |
|---|---|---|
| 1. | పాండవ ప్రవేశ పర్వాధ్యాయము | 411 |
| | యుధిష్టిరుని ఛద్మరూపధారణ | 411 |
| 2. | భీమార్జునులు తమ ప్రచ్ఛన్నవేషములను తెలియజేయుట | 412 |
| 4. | ధౌమ్యుడు పాండవులకు రాజగృహమున యెట్లుండవలెనో ఉపదేశించుట | 412 |
| 5. | వృక్షశాఖకు అస్త్రములను కట్టి పాండవులు విరాటనగరము ప్రవేశించుట | 414 |
| 6. | యుధిష్టిరుడు దుర్గను పూజించుట | 414 |
| 7. | ధర్మరాజు విరాటనగరము ప్రవేశించుట | 414 |
| 13. | సమయపాలన పర్వాధ్యాయము | 417 |
| | బ్రహ్మోత్సవము-మల్లక్రీడ-జీమూతమల్ల వధ | 417 |
| 14. | కీచకవధ పర్వాధ్యాయము | 418 |

| | | |
|---|---|---|
| 25. | గోహరణ పర్వాధ్యాయము | 425 |
| 30. | సేనాధిపతి కీచకుడు లేని విరాటరాజ్యముపై దండెత్తుట | 426 |
| 31. | సుశర్మతో విరాటరాజు యుద్ధము | 427 |
| 35. | కౌరవులు విరాటరాజు గోవులను అపహరించుట | 429 |
| 40. | అర్జునుడు శమీవృక్షము నుండి అస్త్రములను దింపుమని ఉత్తరునితో చెప్పుట | 432 |
| 54. | కౌరవులతో అర్జునుని యుద్ధము | 438 |
| 68. | బృహన్నలను సారథిగా చేసుకొని కుమారుడు యుద్ధమునకు వెడలిన వార్త విని విరాట నృపతి చింతించుట | 442 |
| 69. | ఉత్తరుడు దేవకుమారుడు యెట్లు యుద్ధము కావించెనో తెలుపుట | 444 |
| 70. | వైవాహిక పర్వాధ్యాయము | 445 |
| | ఉత్తరతో అభిమన్యుని వివాహము | 447 |

# మహాభారతము

# ఆదిపర్వం

## అనుక్రమణికాధ్యాయము

నరనారాయణులకు, దేవీ సరస్వతికి నమస్కారములు

## నైమిశారణ్యమునకు సూతుని రాక

ఒకానొక సమయంలో నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులు కూడి ఉండగా అక్కడకు లోమహర్షుని కుమారుడైన సౌతి వారిని కలసికొనెను. మహర్షులు అతనిని ఆహ్వానించి, కుశలప్రశ్నానంతరము, అతనిని ఎక్కడనుంచి వచ్చితివని ప్రశ్నించగా, "నేను జనమేజయుని సర్పయాగము చూచినాను. అక్కడ కృష్ణ ద్వైపాయనుడు రచించిన మహాభారత గాథ, వైశంపాయనుడు, రాజునకు చెప్పగా నేను కూడా విన్నాను" అని చెప్పగా ఋషులందరూ ఆ కథ తమకు కూడా వినిపించమని వేడగా, వారి ప్రార్థనలకు సంతోషించి, ఉగ్రశ్రవుడు వారితో "ఇది విజ్ఞానము నిచ్చేటటువంటిది, లౌకిక ఆచార, వ్యవహారములు తెలియజేయునది, వ్యాసవిరచితమైనది. సావధానులై వినగోరుచున్నాను".

## సృష్టివర్ణన

మొదట చీకటితో నిండి ఉన్న విశ్వసంసారమునందు అన్ని వస్తువులకు బీజరూపము అయి ఉన్నది. దీనినుండి ప్రజాపతి బ్రహ్మ, తదుపరి మను, దక్షప్రజాపతి మొదలయినవారు ఉదయించారు. ప్రళయకాలములో అన్నియు పరబ్రహ్మలో లీనమై మరల ఉత్పత్తి పొందుచుండును.

## భారతము వ్రాయుటకు వినాయకుని స్మరణ

వేదవ్యాసుడు, బ్రహ్మను చేరి తాను రచింపదలచిన కావ్యము చెప్పగా బ్రహ్మ సంతోషించెను. తగిన లేఖకుని కొరకు తాను వెదకుచున్న సంగతి చెప్పగా బ్రహ్మ గణేశుని స్మరించమని కోరెను. వినాయకుడు వ్రాయసగానిగా ఉండుటకు అంగీకరించెను. కాని తన కలము ఆగకుండా మాత్రము చెప్పవలెనని షరతు

పెట్టగా, వ్యాసమహర్షి, “అందులకు నాకు సమ్మతమే కాని, నీవు కూడా అర్థము కానిదే వ్రాయకూడదు” అని తన నియమమును కూడా చెప్పెను. ఈ విధముగా వేదవ్యాసుడు మధ్య మధ్య అర్థపూర్ణమైన శ్లోకములు చెప్పి గణేశుడు అర్థము ఆకళించుకొనే సమయములో తదుపరి విషయానంకనము చేయగలిగేవాడు.

## ధృతరాష్ట్రుడు మొదలైనవారి జన్మము

అతిపూర్వకాలములో బాదరాయణుడు తల్లి సత్యవతి అనుమతితో విచిత్రవీర్య క్షేత్రములో ముగ్గురు సంతానము ఉత్పత్తి కావించెను. వారు ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు. వారి వంశము వృద్ధినొంది వారు దేహాంతర ప్రాప్తులైన తరువాత మహర్షి ఈ పవిత్ర భారతగ్రంథము ప్రచారము కావించెను. జనమేజయుని సర్పయాగకాలమందు వైశంపాయనునకు భారతము చెప్ప అనుమతి ఇచ్చెను. ఆహ్నికాది కర్మలు చేసుకొనిన తరువాత వైశంపాయనుడు వారికి భారతగాథ వినిపించెడివాడు.

## మహాభారత సంక్షిప్త సారము

వ్యాసుడు భారతము వ్రాసిన తరువాత అందరికన్నా ముందు తన కుమారుడు శుకునకు, పిదప శిష్యులకు నేర్పెను. ఇందు దుర్యోధనుడు క్రోధమయ మహావృక్షము, యుధిష్ఠిరుడు ధర్మమయ మహావృక్షము. కౌరవులు, పాండవులు, శిక్షాప్రాప్తి, లాక్షాగృహం, ద్రౌపదీపరిణయం, రాజ్యప్రాప్తి , దీని కథాభాగము.

## ధృతరాష్ట్రుని విలాపము

భారతయుద్ధానంతరము ధృతరాష్ట్రుడు పాతకథ అంతా సంజయునికి చెప్పుకొని రోదిస్తూ మూర్ఛిల్లుతాడు.

## సంజయుని ఓదార్పు

సంజయుడు పూర్వము కుమారుని కోల్పోయిన శైబ్యరాజునకు నారదుడు చెప్పిన ఇరువది నాలుగు ఉపాఖ్యానములు చెప్పి ఓదారుస్తాడు.

## 1. మహాభారత ప్రశంస

భారతము పెరుగులో వెన్నవలె, ద్విపదులలో బ్రాహ్మణునివలె, ఔషధులలో అమృతము వలె, ఇతిహాసములలో ఉత్కృష్టమైనది. దేవతలు త్రాసులో నాలుగు వేదములు ఒకవైపు, భారతమునొకవైపు ఉంచగా, భారతము వైపే త్రాసు మ్రొగ్గినదట. (అనుక్రమణికాధ్యాయ సమాప్తి)

# 2. ద్వితీయ అధ్యాయము
## శమంతపంచకోపాఖ్యానము

ఋషులు, సూతనందనుని శమంత పంచకతీర్థగాథ వినిపింపుమని కోరగా ఆతడిట్లు చెప్పసాగెను.

“పూర్వం పరశురాముడు తన తండ్రి మృతికి కారణమైన కార్తవీర్యార్జనుని చంపిన తరువాత, శాంతిని పొందక 21 మారు క్షత్రియ వంశమును నాశనముచేసి శమంతపంచక హ్రదములో వారి రక్తము పితృదేవతలకు తర్పణము చేసి వారిని తృప్తిపరచెను. వారును సంతోషించి పరశురాముని కోరికపై ఆ స్థానము తీర్థమగునట్లు వరమిచ్చిరి. అక్కడనే తదుపరి కురుపాండవులు 18 అక్షౌహిణీల సైన్యముతో యుద్ధము చేసిరి.

## అక్షౌహిణీ పరిమాణము

ఒక రథము, ఒక ఏనుగు, అయిదుగురు పదాతులు, మూడు గుఱ్ఱములు కలసిన పంక్తి, మూడు పంక్తులు ఒక సేనాముఖము, మూడు సేనాముఖములొక గుల్మము, మూడు గుల్మములు ఒక గణము, మూడు గణములు ఒక వాహిని, మూడు వాహినులు ఒక పృథన, మూడు పృథనములు ఒక చమూతి, మూడు చమూతులొక అనీకిని, పది అనీకినులొక అక్షౌహిణి. (రథములు–21870, ఏనుగులు 21870, గుఱ్ఱములు–65610, పదాతి – 109350).

## పర్వసంగ్రహము

ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వం, విరాటపర్వం, ఉద్యోగపర్వం, భీష్మపర్వం, ద్రోణపర్వం, కర్ణపర్వం, శల్యపర్వం, సౌప్తికపర్వం, స్త్రీపర్వం, అనుదేశనపర్వం, అశ్వమేధపర్వం, ఆశ్రమవాసిక పర్వం, మేషల పర్వం, మహాప్రస్థానికపర్వం, స్వర్గారోహణపర్వం.

హరివంశం, పర్వసంగ్రహ ప్రశంస

# 3. తృతీయ అధ్యాయము
## పౌష్యపర్వం – జనమేజయుని శాపం

దేవశుని సరమ తన కుమారుని, జనమేజయుని సహోదరులు శృతసేన, ఉగ్రసేన, భీమసేనులు అకారణముగా భావించగా కోపము, దుఃఖముతో మీరు అజ్ఞాత భయభీతులవుదురుగాక అని శపించెను.

## సోమశ్రవుడనే ఋషి ఉపాఖ్యానము

జనమేజయుడు వేటకు వెళ్లి శృతశ్రవుడు అనే ముని ఆశ్రమమును కాంచి అతని కుమారుడు సోమశ్రవుని తన పురోహితునిగా ఉంచమని కోరగా శృకశ్రవుడు తన కుమారుడు బ్రాహ్మణులు అడిగింది ఇవ్వకుండా తిరిగి పంపడని అతని నియమమును తెల్పి, దానికి అంగీకరించిన పక్షమున తన అభ్యంతరము లేదని చెప్పెను. జనమేజయుడు అంగీకరించి సోమశ్రవుని పురోహితునిగా తీసుకొని రాజధానికి వచ్చెను.

## అయోధ ధౌమ్యుడు - అరుణి

అయోధ ధౌమ్యుడనే ఋషి వద్ద ఉపమన్యుడు, అరుణి, వేదుడు అనే శిష్యులు ఉన్నారు.

అరుణి గురువుగారి పొలము గట్టు వేయలేక తనే అడ్డుగా పరుండి నీటిని కాపాడగా గురువు ఆనందించి ఉద్దాలకుడని పేరుపెట్టి అతనిని అనుగ్రహించెను.

## ఉపమన్యుని ఉపాఖ్యానము

అయోధ ధౌమ్యుడు తన గోవులను కాపాడమని ఉపమన్యుని నియోగించెను. భిక్షాన్నము తినకుండాను, రెండవమారు భిక్ష చేయకుండాను, ఆవుపాలు తాగకుండాను, దూడలు తాగేటపుడు వేచే నురగ కూడా పుచ్చుకొనకుండా గురువు అడ్డుపడగా అడవి ఆకులు తిని (అర్కపత్రములు) ఉపమన్యుడు గ్రుడ్డివాడు అయి, నూతిలో పడిపోతాడు.

గురువు అనుజ్ఞపై అశ్వనీకుమారులను స్తోత్రము చేసి గురువు ఆనతిపై ప్రసాద భక్షణ చేసి దృష్టిని తిరిగి పొందెను.

## వేద ఋషి - ఉద్పృక వృత్తాంతము

వేదుడు చాలాకాలము ఋషి ఆని సేవాశుశ్రూషలు చేసి గురువును తృప్తిపరచి సెలవు తీసుకొని గృహస్థాశ్రమం స్వీకరించెను. అతడు ఆశ్రమవాసిగా ఉండగా అతని వద్దకూడా ముగ్గురు శిష్యులు ఉంటారు. తను గురుకులములో అనుభవించిన కష్టములు జ్ఞాపకముంచుకొన్న వేదుడు శిష్యులకు ఎటువంటి పనులను చెప్పడు. రాజకుమారులైన జనమేజయుడు, పౌష్యుడు కూడా ఇతని శిష్యులు.

కొంతకాలము తరువాత యాజన కార్యముపై పైదేశమునకు వెళ్తూ వేదుడు, తన శిష్యుడైన ఉదంకుని ఆశ్రమ రక్షణకై ఉంచి పరదేశం వెళ్తాడు.

ఋతిమతియైన గురుభార్య అనుచితమైన కోరికను తిరస్కరించి, ఉదంకుడు తిరిగి వచ్చిన పిదప జరిగిన సంగతి గురువునకు తెలియజేయగా అతడు సంతోషించెను.

గురుదక్షిణను కోరమనగా గురుపత్ని పౌష్యరాజపత్ని కుండలద్వయము తీసుకొని రమ్మని కోరెను.

దారిలో వృషభవాహనుని ఆజ్ఞపై పూరీష భక్షణ చేసెను.

పౌష్యుని కలుసుకొని కుండలములను కోరగా అతడు భార్యవద్దకు పంపెను. మొదట కనిపించని రాణి ఆచమనము చేసి వెళ్లగా కనిపించిన కుండలములను ఇచ్చి "నాగరాజు తక్షకుడు దీనిని కోరుతున్నాడు. జాగ్రత్తగా తీసుకొని వెళ్లవలసినది" అని చెప్పెను.

భోజనము చేయబోవగా అది కేశసంస్పర్శమై, శీతలమై ఉన్నందున ఉదంకుడు కోపించి అంధుడవు కమ్మని రాజును శపించగా, అదూషిత అన్నమును తిరస్కరించేవు కావున నీ వంశము లోపమవుగాక అని రాజు ప్రతి శాపమిచ్చెను. ఉదంకుడు శాపమును ఉపసంహరించినను రాజు ప్రతిశాపమును ఉపసంహరించు కొనలేదు. ఉదంకుడు తప్పు నీయందు ఉంచుకొని నన్ను శపించేవు. అది నన్నేమీ చేయలేదని తన దారిని బయలుదేరెను.

నాగరాజు తక్షకుడు, ఉదంకుడు స్నానము చేయుచుండగా కుండలమును అపహరించుకొని పారిపోగా, దేవేంద్రుని సాయముతో భూమిని రంధ్రము చేసి ఉదంకుడు నాగలోకము ప్రవేశించెను.

అక్కడ ఇద్దరు స్త్రీలు బట్టలు నేయుటను చూసెను. దారముల రంగు తెలుపు, నలుపు. 12 పుల్లలున్న రాట్నాన్ని 6గురు పిల్లలు త్రిప్పుతున్నారు. అతి మనోహరమైన పురుషుడు అశ్వారూఢుడై వారలను చూచుచుండెను.

వారే దివారాత్రలు, ఋతువులు, నెలలు, కాలపురుషుడు.

వారిని స్తుతించిన పిదప పురుషుడు అశ్వ అపానదేశమున పూత్కారము చేయమనగా ఉదంకుడట్లే చేసెను. అప్పుడు అగ్ని వర్షము పడగా భయముతో తక్షకుడు వచ్చి కుండలములు తిరిగి ఇచ్చెను. అశ్వసహాయముతో గురుకులమునకు త్వరగా వచ్చి, గురుపత్నికి కుండలములివ్వగా ఆమె అధికముగా సంతోషించెను. గురువు అనుమతిని తీసుకొని ఉదంకుడు తన దేశానికి తిరిగి వెళ్లిపోయెను.

## జనమేజయుని సర్వక్రతువు చేయ ప్రోత్సాహము

గురువు వద్ద శలవు తీసుకున్న ఉదంకుడు, తక్షకునిపై క్రోధము తగ్గక ప్రతీకారము చేయదలచి హతిసయ దినములకు హస్తినానగరము చేరి జనమేజయ మహారాజును కలసికొనెను. అతడు ఉదంకునకు యథోచిత సత్కారము చేసి వచ్చిన కారణము అడుగగా, "రాజా! దురాత్ముడైన తక్షకుడు నీ తండ్రి మృతికి కారకుడు. నీచబుద్ధితో నీ తండ్రిని బ్రతికించదలచి వచ్చుచున్న కాశ్యపుని మరలించేడు. ఆ దుష్టుడే నా వద్దనుంచి కుండలములను కూడా దొంగిలించి పట్టుకొనిపోయేడు. నీ పితృదేవుని ఆ విధముగా నాశనము చేసిన తక్షకునిపై నీవు ప్రతీకారము తీర్చుకొనుమని నేను నిన్ను కోరుచున్నాను" అని ఉదంకుడు రాజు మనస్సులో క్రోధాగ్నిని ప్రజ్వలింపచేసెను.

## 4. చతుర్థ అధ్యాయము
## పౌలోమ పర్వం

సౌనకాది మహర్షుల కోరికపై సూతుడు భృగువంశమును వర్ణించ మొదలిడెను.

## 5. పంచమ అధ్యాయము
## భృగువంశము - చ్యవనోత్పత్తి

స్వయంభూ బ్రహ్మ చేసిన వారుణ యజ్ఞకుండమునుంచి భృగు మహర్షి జన్మించెను. చ్యవనుడు, భృగుని కుమారుడు. చ్యవనుని కుమారుడు ప్రమతి. ఘృతాచీ-ప్రమతుల కుమారుడు రురుడు. ప్రమద్వరా రురుల కుమారుడు సౌనకుడు.

భృగుమహర్షి భార్య పులోమ. ఒకప్పుడు పులోమ గర్భవతియై యుండెను. భృగుమహర్షి ఆశ్రమములో లేని సమయమందు పులోమడను రాక్షసుడు సన్యాసి వేషమున వచ్చి పులోమ అతిథి సత్కారము పొందెను.

పులోముడు కన్యగా ఉన్న పులోమను వరించెను. కాని ఆమె తండ్రి భృగునితో పులోమ వివాహము చేసెను.

తాను పులోమను తీసకొని వెళ్లిపోతున్నట్లు చెప్పుతూ తాను చేయుచున్న పని సరియైనదా, కాదా? అని పులోముడు ప్రశ్నించగా అగ్ని అతడే ఆమెకు భర్త అని తీర్పు చెప్పెను.

## 6. షష్ఠమ అధ్యాయము
## రాక్షసుడు పులోమను అపహరించుట

అగ్ని మాటలు విన్న రాక్షసుడు వరాహరూపమును దాల్చి పులోమను తీసుకొని పారిపోవుచుండగా ఆమె గర్భస్థ శిశువు క్రోధముతో బయలువెడలి చూచు మాత్రముననే రాక్షసుడు భస్మీభూతుడాయెను. ఆ బాలకుడే చ్యవనుడు. రోదనమును చేయుచూ, కుమారునితో తిరిగి ఆశ్రమమునకు వచ్చుచున్న పులోమను బ్రహ్మ ఓదార్చెను. ఆమె కన్నీటితో ప్రవహించిన నది పేరు 'వధుసర'. ఈ సంగతి తెలుసుకున్న భృగుమహర్షి క్రోధముతో అగ్నిని 'సర్వభుక్కువు' కమ్మని శపించెను.

## 7. సప్తమ అధ్యాయము
## పులోమ రాక్షస వధ

ఉగ్రశ్రవుడిట్లనెను - ఈ విధముగా భృగుమహర్షి శపించగా అగ్నిదేవుడు కోపోద్దీపితుడై "ఓయీ మహర్షీ! నీవు అకారణముగా నన్ను శపించేవు. ఆ రాక్షసుడు ప్రశ్నించగా నేను నిజమును పలికితిని. ఏ వ్యక్తి నిజము తెలిసి, అడిగినను చెప్పకపోయిన అతనితో పాటు ఇటు ఏడు తరములు, అటు ఏడు తరములు అధోగతిని పొందుదురు. నేను కూడా, నీ యీ దుర్ణయమునకు ప్రతిశాపమీయు వాడనే కాని నేను బ్రాహ్మణులను గౌరవించెడివాడను. నేను అగ్నిహోత్రాది క్రియా కలాపములను నడపించువాడను. నాలో ఆహుతు చేయబడినవి, దేవ, పితృ గణములకు అందింపచేస్తాను. అటువంటి నేను ఏ విధముగా సర్వభుక్కు నౌతాను" అని, కోపముతో అగ్ని అగ్నిహోత్రాది యజ్ఞక్రియలనుండి తిరోగతుడయ్యెను. ఋషులు, దేవతలు బ్రహ్మను ప్రార్థించగా అతడు హుతాసనుని బిలచి నీ అపాన దిశ శిఖలు మాత్రమే సర్వభుక్కులవుతాయని, నీ శిఖలవల్లనే అన్ని వస్తువులు శుచిని పొందుతాయని తెలిపిన పిదప అగ్ని మరల తన కార్యములు చేయ మొదలిడెను.

## 8. అష్టమ అధ్యాయము
## రురుని చరిత్ర

భృగునందనుడు చ్యవనుని భార్య సుకన్య. వారలకు ప్రమతి అను కుమారుడు కలిగెను. ఘృతాచీ గర్భమునందు ప్రమతికి రురుడు అను పుత్రుడు

జన్మించెను. ఆ మహాతేజోవంతుడైన రురుని చరిత్ర చెపుతాను. సావధానువై వినుడు” అని సౌతి ఇట్లు మొదలిడెను.

“గంధర్వరాజు విశ్వావసువు వల్ల గర్భవతియైన అప్సర మేనక, జననమందిన కుమార్తెను స్థూలకేశుడను ముని ఆశ్రమము వద్ద వదలి వెడలిపోయెను. అందాల రాశియైన బాలికను ముని పెంచి పెద్ద చేసెను. అందరు ప్రమదల కన్నా మిన్నగాన ముని ఆమెకు ప్రమద్వర అని నామకరణము చేసెను. ప్రమతినందనుడు రురుడు ఆమెను తోటలో చూసి మోహించి తండ్రికి తన కోరిక తెలియజేసెను. ప్రమతి, స్థూలకేశుని చేరి సంగతి తెలియజేయగా అతడు సంతోషించి వివాహలగ్నము నిర్ణయించెను.

ఒకనాడు చెలికత్తెలతో కందుక క్రీడ చేయుచున్న ప్రమద్వరను విషనాగు కాటు వేయగా ఆమె విగతాశువై నేలకూలెను. ప్రియురాలి మృతి చూసి రురుడు దుఃఖాక్రాంతుడయ్యెను.

## 9. నవమ అధ్యాయము
## దుంధుబోపాఖ్యానము

“నేనే కనుక తపోచరితుడను, గురుజనులను పూజించేవాడను, దానవంతు డను అయిన నా ప్రియురాలు పునర్జీవితురాలు అవుగాక” అని పదే పదే అనుచున్న రురుని చూసి దేవదూతలు నీవు సగము ఆయుర్దాయము ఇచ్చిన నీ భార్య బ్రతుకకలదని చెప్పిరి. రురుడు సంతోషముగా అంగీకరించెను. వారును యమ ధర్మరాజునకు ఈ విషయము తెలియజెప్ప అతడు ‘తథాస్తు’ అనెను. ప్రమద్వర నిద్ర లేచినట్లుగా లేచి అందరకూ ఆనందము కలిగించెను. శుభలగ్న మందు వారి వివాహము జరిగెను.

నాటినుండి రురునకు సర్పద్వేషము కలిగెను. ఒకనాడు అతడు దుర్బలమై, జీర్ణించియున్న దుంధము సర్పమును తాడనము చేయ, అది “ఓయీ తపోధనా, నీకు నేనేమి అపకారము చేసితిని. ఈ విధముగా నన్ను హింసించుచున్నావు” అని ప్రశ్నించెను.

## 10. దశమ అధ్యాయము
## రురుని సర్పవైర కారణము

రురుడు ఆ సర్పముతో “ఓ భుజంగమా నా ప్రియురాలిని ఒక సర్పము కాటువేసి కీడు కలిగించినది. అందువల్ల నేను సర్పములను చూసిన ఊరుకొని

ఉండలేను. నాశనము చేయ ప్రయత్నిస్తాను" అని బదులు పలికెను. అప్పుడా పాము నేను విషసర్పమును కాను. ఈ విధముగా బాధించుట న్యాయము కాదని చెప్పెను.

రురుడు కూడా తన దుష్కృత్యమును విరమించుకొని "ఓ సర్పమా! నీ వెవరు? ఎందులకు ఈ దశలో ఉన్నావు" అని అడిగెను.

"ఓ మునికుమారా! నేను సహస్రపాదుడను మునిని. బ్రాహ్మణశాప వశమున ఈ విధముగా ఉన్నాను" అని సర్పము పలుకగా,

"ఓ భుజంగమా, నీవెందువలన బ్రాహ్మణ శాపము పొందేవు? సవిస్తరముగా తెలుపవలసినది" అని రురుడు కోరెను.

## 11. ఏకాదశ అధ్యాయము
## ఆస్తీకపర్వం - ఖగమ ఋషి వృత్తాంతము

సర్పరూపమున ఉన్న సహస్రపాదుడిట్లనెను. "ఖగముడను బ్రాహ్మణుడు నా చిన్ననాటి స్నేహితుడు. బాల్యచాపల్యము చేత నేను తృణముతో చేసిన పాముతో అతని భయపింప ఆతడు రోసిల్లి తేజోహీనమైన సర్పము కమ్మని నన్ను శపించెను. నేను అతని రక్షించమని ప్రార్థింప, ప్రమతిపుత్రుడు, రురుని చూసిన పిదప నీకు శాపవిముక్తి కలుగుననెను" అని పలికి, సర్పరూపము పోయి నిజరూపము పొంది, "మహాత్మా, బ్రాహ్మణునకు 'అహింసా పరమోధర్మః' అన్నట్లు శాంతము ప్రధానము. అహింస, సత్యవాక్యము, క్షమ, వేదవాక్యధారణ బ్రాహ్మణుని పరమ ధర్మములు. దండధారణ, ఉగ్రత, ప్రజాపాలన క్షత్రియుని ధర్మములు.

పూర్వము జనమేజయ మహారాజు చేసిన సర్పయాగములో నశించుచున్న సర్పములను ఆస్తీకుడను బ్రాహ్మణుడు కాపాడేడు. అట్లే మీరు కూడా బ్రాహ్మణ ధర్మము అవలంబించవలెను" అని పలికెను.

## 12. ద్వాదశ అధ్యాయము
## సర్పయాగ కారణ పృచ్ఛ

"ఏ కారణము వల్ల జనమేజయుడు సర్పయాగము చేసెను? ఎందులకు ఆస్తీకుడు సర్పసంరక్షణ చేయబూనెను?" అని ప్రశ్నించగా, సహస్రపాదుడు పండితులైన బ్రాహ్మణులవద్ద తెలుసుకొనమని అదృశ్యుడయ్యెను. రురుడు ఆశ్రమమునకు తిరిగివచ్చి, తండ్రినడిగి ఆస్తీకోపాఖ్యానము వినెను.

(పౌలోమ పర్వతాధ్యాయ సమాప్తి)

## 13. త్రయోదశ అధ్యాయము
## జరత్కారుని చరిత్ర

"సౌతమహర్షీ, ఏ కారణమున జనమేజయుడు సర్పక్రతువు చేసెను? ఆస్తీకుడు ఎందులకు సర్పములను కాపాడవచ్చెనో సవిస్తరముగా తెలుపుము" అని శౌనకుడు కోరగా ఉగ్రశ్రవుడిట్లు చెప్పసాగెను.

ఆస్తీకముని తండ్రి జరత్కారమహర్షి బ్రహ్మచర్యమవలంబించి కఠోర వ్రతములాచరించుచు ఒకనాడు అధోముఖుడై వ్రేలాడుచున్న పితృపురుషులను కలసికొని వారి కోరికపై తన పేరు కలిగిన యువతిని ఎవరని అడగకుండా సంప్రదానము చేసిన వివాహమాడుటకు సమ్మతించెను.

## 14. చతుర్దశ అధ్యాయము
## జరత్కారుని వివాహము

వాసుకి తన చెల్లెలైన జరత్కారిని అడవిలో కన్యా భిక్షార్థిమైన జరత్కారునకు సంప్రదానము చేసెను.

## 15. పంచదశ అధ్యాయము
## సర్పరక్షణ సంక్షిప్త కథ

పూర్వము సర్పగణములు తల్లివల్ల జనమేజయుని సర్పక్రతువులో అగ్నిదగ్ధులగుటకు శాపము పొందిరి. భుజంగరాజు తన చెల్లెలైన జరత్కరిని, జరత్కరమహర్షికి సాంప్రదానము చేయగా వారికి ఆస్తీకుడను కొడుకు జన్మించెను. మాతృ వంశమునతడు తల్లి ప్రేరణతో రక్షించెను. జరత్కరూ విద్యుక్త కర్తవ్యానంతరము స్వర్గలోక ప్రాప్తి చెందెను.

## 16. షోడశ అధ్యాయము
## అనూరుడు, గరుడుల జన్మవృత్తాంతం

సత్యయుగమున దక్షప్రజాపతి తన కుమార్తెలు కద్రువ, వినతలను కశ్యపునకు ఇచ్చి వివాహము కావించెను.

భర్త వరము వలన కద్రువకు వెయ్యి అండములు, వినతకు రెండు గుడ్లు కలిగెను. వాటిని అయిదువేల సంవత్సరములు భాండములలో ఉంచిన పిదప వెయ్యి నాగులు గుడ్లనుండి బయలువెడలెను. వినత పుత్రార్థియై ఒక డింబమును

బద్దలు చేయగా అందుండి సగము దేహము మాత్రమే వృద్ధి పొందిన కొడుకు బయలువెడలి, ఈ చెడ్డపనికి అయిదువేల సంవత్సరములు సవితికి దాసిగా ఉండమని, రెండవ గుడ్డునుంచి వచ్చు కుమారుడు దాసీత్వమునుండి రక్షించునని శపించి అనూరుడు తన కార్యముపై వెడలిపోయెను. ఇతడు సూర్యుని సారథి. యధాకాలమున గరుడుడు జన్మించెను.

## 17. సప్తదశ అధ్యాయము
## సముద్రమంథన ప్రశ్న

'వినత, కద్రువలు ఒక రోజున అమృతమంథనము నుండి వచ్చిన ఉచ్చైశ్రవమును చూచిరని' ఉగ్రశ్రవుడు చెప్ప సేవకుడు 'ఓ సూతపుత్రా! దేవతలెందుకు అమృతమును చిలికిరో చెప్పుము" అని కోరెను.

సుమేరు పర్వతముపై పెద్ద చెట్టు క్రింద దేవతలందరూ కూడియుండగా నారాయణుడు వారికి సముద్ర మంథనము చేసి అమృతము పొందగలందులకు ఆజ్ఞాపించెను.

## 18. అష్టాదశ అధ్యాయము
## సముద్రమంథనారంభము

మంథరగిరిని మంథన దండముగాను, వాసుకిని త్రాడుగాను చేసికొని అబోనిధిని చిలుకుట మొదలిడిరి. దానవులు వాసుకి తల భాగము పట్టుకొనగా, దేవతలు పుచ్ఛదేశమును గ్రహించిరి. కూర్మరాజు కొండను తన వీపుపై మోయ మొదలిడెను. కొండపైనుండి నానావిధ ఔషధులు సముద్రములో కలియసాగెను. తాడమునకు వెండి బంగారము మొదలైనవి కరిగి సముద్రములో కలిసెను. చాలాకాలము తరచి అలసిన దేవతలకు నారాయణుడు వారి బలమును వృద్ధి పొందించెను. అందుండి వరుసగా చంద్రుడు, లక్ష్మీదేవి, ఉచ్చైశ్రవమను తెల్లగుఱ్ఱము, కౌస్తుభమణి ఉద్భవించెను. నారాయణుడు కౌస్తుభమణిని గ్రహించెను. మిగిలినవారు దేవతల పక్షమున చేరిరి. తదుపరి ధన్వంతరి అమృతకుంభముతో బయలువెడలెను.

ఐరావతమును ఇంద్రుడు తీసుకొనెను. ఆగక ఇంకను తరచగా కాలకూట విషము ఉద్భవించెను. లోకరక్షాకరుడు శంకరుడు దానిని కంఠమందు ధరించి నీలకంఠుడయ్యెను. అమృతము కొరకు కలహించు దేవదానవులు అమృత భాండమును మోహిని చేత ఉంచిరి.

## 19. ఉనవింశ అధ్యాయము

## రాహు మస్తకచ్ఛేదము

రాహువను రాక్షసుడు దేవరూపమున దేవతల పంక్తిని చేరి అమృతమును త్రాగుచుండగా సూర్యచంద్రులు ఈ సంగతి మోహినీ రూపమున ఉన్న నారాయణునకు చెప్పగా అతడు చక్రముతో రాహువు శిరస్సు ఖండించెను. అమృతము కంఠము వరకు వెళ్లినందున శిరస్సు ఆకాశముపైకి ఎగిరి తీవ్రముగా గర్జించెను. నాటినుండి సూర్యచంద్రులు రాహుముఖగ్రాసులగుచున్నారు.

## దేవాసుర సంగ్రామము

తదనంతరము దేవదానవులు ప్రాస, తోమర, భిందిపాల, ఖడ్గ, చక్ర, గద, శక్తి మొదలైన ఆయుధములతో ఛింది, భింది, ప్రధాభ, ఘాతక, పాతయ, మారయ, ఆది శబ్దములతో ఘోరసంగ్రామము చేసిరి. పెద్ద వృక్షములు, కొండలు విసరుచున్న రాక్షసులను తన బాణముతో ఛేదించి నారాయణుడు చక్రమును ప్రయోగించగా రాక్షసులు చాలామంది చచ్చిరి. మిగిలినవారు భూగర్భములోనికి, సముద్రములోనికి పారిపోయిరి. సురగణము మంధరగిరిని యధాస్థానమున ఉంచి, అమృతముతో స్వర్గమునకు ఆనందముగా వెడలిపోయిరి.

## 20. వింశ అధ్యాయము

## నాగగణ అభిశాపము

ఉగ్రశ్రవుడు ఇట్లు చెప్పసాగెను. పై చెప్పిన ఉచ్చైశ్రవమును ఒకనాడు సాయంకాలము వినుత, కద్రువలు చూసిరి. వినత అశ్వము తెల్లగా ఉన్నదనగా, కద్రువ తోక మాత్రమూ నల్లగా ఉన్నదనెను. ఇద్దరూ కూడా ఓడినవారు ఇతరులకు దాస్యము చేయ నిర్ణయించి మరునాడు అశ్వమును పరీక్షింప నిశ్చయించి స్వస్థలములకేగిరి.

కద్రువ నాగులను పిలచి గుఱ్ఱము తోకపై నల్లని వర్ణముతో నిలువుడని కోరగా, అధర్మాచరణకు వెనుతీసిన నాగులను పాండువంశమందు జన్మించిన జనమేజయుని సర్పక్రతువులో నశింపుడని శపించెను. ఇది విన్న బ్రహ్మ సంతోషించి దేవతలకు ఈ విషయము చెప్పి సంతోషపరచెను. బ్రహ్మ, కశ్యపమహర్షిని పిలిచి విషయము తెలియజేసి, తీయని మాటతో ఆతనిని ఆనందపరచి విషహరి విద్య అతనికి నేర్పెను.

# 21. ఏకవింశ అధ్యాయము
## సముద్రవర్ణన

పందెము వేసిన వినత, కద్రువలు మరునాడు ఉదయమున తిమి, తిమింగలము, మత్స్యము, కచ్ఛపము, మకరము మొదలైన వేలకొలది జంతుసముదాయము కలవి, చంద్రుడు, లక్ష్మి, పాంచజన్య శంఖము, అమృతము మొదలైనవాటిని పుట్టించినది, తనయందు బడబానలమును దాచుకొన్నది, అన్నిరకములైన రత్నసముదాయము కలది, మైనాక, వరుణులకు స్థానమైనది, భయభీతులైన రాక్షసులకు తనయందు ఉండ స్థానమిచ్చినది, చంద్రునివలన ఆటుపోటులను పొందెడిది, నారాయణుడు యోగనిద్రను పొందించునది అయిన సముద్రము పక్క చరించుచున్న ఉచ్చైశ్రవమును చూడపోయిరి.

# 22. ద్వావింశ అధ్యాయము
## కద్రు, వినతలు సాగరతీరమునకు పోవుట

మాతృశాపగ్రస్తులైన నాగులు తమలో తాము తల్లి కోరిక తీర్చి ఆమె దయను సంపాదింప అశ్వపృచ్ఛముపై నల్లనిరూపు దాల్చి నిలచిరి. వినతా కద్రువలు ఆకాశమార్గమున జలనిధి చేరిరి.

# 23. త్రయోవింశ అధ్యాయము
## వినత దాసీత్వము

అశ్వము తెల్లగానున్నది కాని, తోక నల్లగా ఉండుట చూసి వినత విచారించినది. ఆమె కద్రువ దాసీ అయినది.

ఆమె రెండవ గ్రుడ్డునుండి మహాబలవీర్య సంపన్నుడు, దీర్ఘకాయుడు, కామరూప, కామవీర్య, కామచారియైన విహంగరాజు గరుడుడు జన్మించెను.

మహాతేజముతో వెలుగుచున్న గరుడుని వద్దకు దేవతలు వెళ్లి అతనిని స్తుతించిరి.

# 24. చతుర్వింశ అధ్యాయము
## సూర్యుడు సర్వసంహారకరూపము ధరించుట

అమృతమంధన కాలమునుండి రాహుగ్రస్తుడగుచున్న సూర్యదేవుడు దేవతలు గరుడుని పొగుడుట చూసి కోపావిష్టుడై సర్వప్రపంచమును దగ్ధము

చేయబూనెను. ఈ విషయము తెలిసికొనిన దేవతలు బ్రహ్మవద్దకు పోగా అతడు గరుడుని అన్న అనూరుని సూర్యుని రథసారథి చేసిన అతడు సూర్యుని తాపకిరణములను ఆపునని చెప్పి, వారలను అట్లు చేయుడని పంపెను.

## 25. పంచవింశ అధ్యాయము
## కద్రువ ఇంద్రుని స్తుతించుట

గరుడుడు తండ్రి వద్ద సెలవు తీసుకొని తల్లివద్దకు వచ్చెను. ఒకనాడు కద్రువ సముద్రమధ్యమున ఉన్న ద్వీపమునకుతీసుకొనిపోవ వినతను ఆజ్ఞాపింప ఆమె కద్రువను తన వీపుమీద తీసుకొని ఖేచరగమన కాగా గరుత్మంతుడు నాగులను తన మూపుననిడి తీసుకొని రాసాగెను. గరుత్మంతుడు సూర్యునికటస్తుడగుటచే వేడికి నాగులు మాడి రాలజొచ్చిరి. ఇది చూచి తాపశమనార్థము వర్షమునకై కద్రువ ఇంద్రుని అనేక విధముల కీర్తించెను.

## 26. షట్‌వింశ అధ్యాయము
## ఇంద్రుని అనుగ్రహముచే వర్షము కురియుట

ఇంద్రుడు కద్రువ స్తుతికి సంతసించి వర్షము కురిపించెను. కద్రువ, ఆమె కుమారులు రమణీయమైన ద్వీపమును చేరిరి.

## 27. సప్తవింశ అధ్యాయము
## వినత దాసత్వ విమోచనకై ఆలోచించుట

రమణీయమైన ద్వీపమును గరుత్మంతునిపై ఆరోహించి చేరిన నాగులు అందందు విహరించి, గరుత్మంతుని మరియొక స్థానమునకు మోసుకొని పొమ్మనగా దుఃఖముతో గరుత్మంతుడు తల్లిని చేరి తాను ఏల వారికి ఊడిగము చేయవలెనని ప్రశ్నించగా ఆమె దాసత్వ విషయము చెప్పెను. అప్పుడు ఖగేంద్రుడు నాగులను చేరి యే విధమైన పౌరుషము చూపిన వారు తమ దాసత్వమునుంచి విముక్తి కలిగించగలరని అడుగ, నాగులు అమృతము తెచ్చి వారికి ఇచ్చిన ముక్తిని ఇత్తుమని చెప్పిరి.

## 28. అష్టావింశ అధ్యాయము
## అమృతము కొరకు గరుత్మంతుని ప్రయాణము

ఉగ్రశ్రవుడిట్లనెను – ఈ విధముగా నాగుల వద్ద ముక్తికి దారి తెలుసుకొనిన గరుత్మంతుడు తల్లి వద్దకు వచ్చి సెలవు తీసుకొని దారిలో తను ఏ ఆహారము

చేసుకొనవలసినదో తెలుపుమనగా ఆమె నిషానులను ఆహారముగా గ్రహించు మనియు, బ్రాహ్మలకు మాత్రము ఎటువంటి కీడు తలపెట్టవద్దనియు చెప్పెను. వారిని ఏ విధముగా తెలుసుకొనగలననగా నీ జఠరాశయములో జీర్ణము కానివారు నిప్పువలె మంట పుట్టించు గొంతుక మండించువారు బ్రాహ్మణులని గ్రహించుమని ఆమె చెప్పి కుమారుని ఆశీర్వదించి విజయుడవై తిరిగిరమ్మని పంపెను. గరుత్మంతుడు వాయువేగమున యెగురుచూ నిషాద పట్టణమును చేరి భయంకరమైన తన ముఖమును విప్పి నిషాదులను భక్షించసాగెను.

## 29. ఉనత్రింశ అధ్యాయము
## శాపగ్రస్త గజ - కచ్ఛప వృత్తాంతము

ప్రమాదవశమున ఉదరములో ప్రవేశించిన బ్రాహ్మణుని, అతని నిషాద భార్యను బయటకు పంపి గరుత్మంతుడు తండ్రియైన కశ్యపుని చేరి సంగతు లన్నియు చెప్పి తన ఆకలి తీరుటకు దారి చూపుమనెను.

కశ్యపుడు కుమారుని అనతి దూరమున ఉన్న సరోవరములో ఆరు యోజనముల ఎత్తు పన్నెండు యోజనముల ఆయతనముగల యేనుగు, మూడు యోజనముల ఎత్తు, పది యోజనముల పరిధి గల కచ్ఛపరూపమున పరస్పర శాపఫలమున ఉన్న విభావసు, సుప్రతీక ఋషులను భక్షింపుమని ఆశీర్వదించి పంపెను. గరుత్మంతుడు అట్లే పోయి ఒక నఖముతో యేనుగును, మరియొక నఖముతో తాబేలును పట్టుకొని యెగురుచూ అలంబతీర్థమున శతయోజన విస్తీర్ణముగల వటవృక్షము యొక్క కొమ్మపై వ్రాలగానే అతని వే, బలముల ధాటికి ఆగలేక కొమ్మ విరిగెను.

## 30. త్రింంశ అధ్యాయము
## గరుత్మంతుడు అమృతము హరించుట

భగ్నతరు శాఖను అధోముఖులై వ్రేలాడుతూ ఉన్న బాలఖిల్యములను చూచి భయమంది గరుత్మంతుడు శాఖా పతనమును తన కంచువుతో ఆపి, యెగురుచూ గంధమాదన పర్వతమున తండ్రిని చేర కశ్యపుడు మునులను పొగడి వేడగా వారు తరు శాఖను వీడి వేరొక స్థానమునకు పోయిరి. మానుష శూన్యమై ఉన్న పెద్ద పర్వతాగ్రము చేరి గరుత్మంతుడు, గజ, కచ్ఛపములను భక్షించెను.

అమృతము కొరకై వచ్చిన గరుత్మంతుని ఇంద్రవసు, రుద్ర, ఆవిద్య, సాధ్య, మరుక్ ఆది దేవతలు ఆపుటకై ఆయుధధారులై సిద్ధమైరి.

బృహస్పతి ఇంద్రునితో నీ అపరాధము వలననే బాలఖిల్య మునుల తపోబలముచే కశ్యప, వినతల గర్భమున గరుత్మంతుడు జన్మించెను అని చెప్పెను.

## 31. ఏకత్రింశ అధ్యాయము

## గరుడుని జన్మరహస్యము

సౌనకుడు సూతునితో ఇంద్రుని యే అపరాధము వలన ఇట్లు జరిగెననగా ఇతడిట్లనెను –

ఒకానొక సమయమున కశ్యప ప్రజాపతి పుత్రార్థియై ఒక మహాయజ్ఞము ఆరంభించెను. దానికి కట్టెలు తీసుకొని వచ్చుచున్న ఇంద్రుడు అంగుష్ఠప్రమాణులైన బాలఖిల్య మునులు ఒక పత్రమును తీసుకొని వచ్చుచూ గోష్పాదమండిక నీటిలో తబ్బిబ్బు అవుచున్న వారిని చూసి నవ్వి అవమానము పొందింప వారు క్రోధితులై ఇంద్రుని మించిన శౌర్య, వీర్య, బలసంపన్నుని సృష్టించి వానిచే ఇంద్రుని ఇంద్రత్వము నష్టపడునట్లు చేయు యజ్ఞమారంభింప, ఇంద్రుడు కశ్యపుని శరణు వీడెను. అతడు మునులను చేరి అందరికీ శుభమగునట్లుగా తనకు వినతకు బలపరాక్రములైన సుతులు కలుగునట్లు, అందు గరుడుడు పతగేంద్రుడు అగునట్లు, ఇరువురు ఇంద్రుని మిత్రులగునట్లు పెంపుచేసెను.

## 32. ద్వాత్రింశ అధ్యాయము

## గరుత్మంతునితో దేవగణముల యుద్ధము

గురుడుడు, పట్టిస, పరిఘ, శూల, గద, చక్ర మొదలైనవానితో పోరాడుచున్న దేవతలతో తన పఖ, నఖ, చంచుపుటలతో పోరాడి, అశ్వక్రంద, రేణుక, క్రథన, తపన, ఉలూక, స్వసన, నిమేష, ప్రరుజ, పురినాది యక్షులతో పోరాడి సంహరించి అమృతకుంభమును పరివేష్ఠించియున్న అగ్నిశిఖలను నదీజలముతో ఆర్పెను.

## 33. త్రయత్రింశ అధ్యాయము

## గరుత్మంతుడు అమృతము హరించుట, వాహనమగుట

అమృతకుంభముపై తిరుగుచున్న చక్రమును సూక్ష్మరూపుడై తప్పించుకొని గరుత్మంతుడు లోన దూరి కుంభమును కాపాడుచున్న రెండు భయంకరమైన విషసర్పములను సంహరించి, అమృతకుంభమును తీసుకొని ఆకాశమున ఎగిరెను. అతడు అమృతము ప్రోలకుండా త్వరితముగా అచటినుండి వెడలిపోవుచుండెను.

గరుత్మంతుని యుద్ధము వీక్షించిన నారాయణుడు సంతసించి గరుత్మంతుడు కోరగా ఆతడు తన మూపుపైన ఉండేటట్లు, అమృతము తీసుకొనకుండా అమరుడయ్యేటట్లు వరములడిగెను. నారాయణుడు "తథాస్తు" అని పలికెను. వరములు పొందిన గరుడుడు నారాయణుని వరములడుగుమని కోరగా విష్ణుమూర్తి తన వాహనము కమ్మని, రథము యొక్క ధ్వజము కమ్మని అడిగెను. పంతంగేశ్వరుడు "తథాస్తు" అని అమృతకుంభముతో తన ప్రయాణము మొదలిడెను.

కోపించిన ఇంద్రుడు వజ్రాయుధము ప్రయోగింప గరుత్మంతుడు, ఇది నన్నేమీ చేయలేదు. కాని ఇది మూలమైన ముని యొక్క గౌరవార్థము, నీ గౌరవము నిమిత్తము అని తన అసంఖ్యాకమైన ఈకలలో ఒకటి రాల్చెను. సుందరమైన ఆ పర్ణమని చూసి అందరూ ఆనందించిరి. అందువలననే అతనికి సుపర్ణుడను పేరు కలిగెను. ఇంద్రుడు గరుత్మంతునితో స్నేహము చేయ ఆహ్వానించెను.

## 34. చతుత్రింశ అధ్యాయము
## ఇంద్రుడు-గరుత్మంతుల స్నేహము

"ఇంద్రా! నా శక్తి అమోఘమైనది. నన్ను నేను పొగడుకొనకూడదు కాని, ఈ విద్య బ్రహ్మాండమునంతా ఒక రెక్క నేను వహించగలను" అని గరుత్మంతుడు పలుకగా ఇంద్రుడు అంగీకరించి అమృతము తిరిగి ఇమ్మనగా తను నాగులకు ఇచ్చిన వెంటనే అపహరించి తీసుకొని పొమ్మనెను. ఇంద్రుడు గరుడునకు త్వరలో దాస్యవిమోచనము కలుగునట్లు, నాగులు అతని ఆహారమగునట్లు వరమిచ్చెను.

## దాసత్వమునుంచి వినత ముక్తి పొందుట

అమృతకుంభముతో గరుత్మంతుడు తల్లివద్దకు వచ్చి నాగులను పిలచి వారితో "ఇదిగో అమృతుంభము. దర్భపై ఇడుచున్నాను. మీ కోరిక తీర్చితిని కాన నా తల్లియొక్కయు, నాయొక్కయు దాసత్వమునుంచి విముక్తి ఇవ్వవలసినది. మీరు స్నానపూజాదులు చేసి దీనిని గ్రహింపవలెను". అనగా వారు "తథాస్తు" అని స్నానాదులకు పోగా పురందరుడు అమృతకలశమును దొంగిలించి నాకలోకమునకు పోయెను.

తిరిగి వచ్చిన నాగులు అమృతకలశము కానక కపటముగా మనము ప్రవర్తించినందు కిట్లు కపటమునకు లొంగితిమని విచారించి కలశము నుంచిన కుశాసనము నాకగా వారి నాలికలు చీలికలైనవి. దర్భలు పవిత్రములైనవి.

## 35. పంచత్రింశ అధ్యాయము

## ముఖ్యమైన నాగులు

శౌనకుడిట్లనెను. "ఓయీ సూతనందనా! నీవు పన్నగులపై, వారి తల్లి శాపము, వినతా పుత్రుని శాపము, వినత గర్భస్థుడైన గరుత్మంతుని కథ చెప్పితివి. కాని సర్పముల నామములు తెలుపలేదు. అవి తెలుపవలసినది" అని కోరగా ఉగ్రశ్రవుడు ముఖ్యులైన నాగుల నామములు వారికి చెప్పెను.

శేషుడు జ్యేష్ఠుడు. తరువాత వాడు వాసుకి, తదితరులు యౌరావుడు, తక్షకుడు, కర్కోటకుడు, ధనుంజయుడు, కాళీయుడు, మణినాగుడు, అపూరణుడు, పింజరకుడు, మిలాపత్రుడు, వామనుడు, నీల, అనిల, కల్మాష, శబల, ఆర్యాక, ఉద్రక, కలశపోతక, సుకాముఖి, దధిముఖ, విమలపిండక, ఆప్త, కరోటక, శింఖ, బాలిశిఖ, నిష్టానఖ, హేరుగువా, నహుష, పింగళ, బోవ్యాకణ, మహేందరాది నాగులు జన్మించిరి. వీరు కాక లక్షల కొలది సర్పములు కలవు.

## 36. షట్త్రింశ అధ్యాయము

## శేషుడు నాగకులము వీడుట

తల్లి వలన నాగులు శాపగ్రతస్తులయిన తరువాత ఆదిశేషుడు తన సహోదరుల క్రూరచర్యలకు రోసి వారిని వీడి హిమాలయములలో ఘోరమైన తపస్సు చేయగా బ్రహ్మ ఆతనికి ప్రత్యక్షమై వరము కోరుకొనుమనగా ఆతడు "నా తమ్ములు క్రూరులు. వారు పినతల్లి కుమారుడైన గరుత్మంతునితోను, ఆతని తల్లితోను వైరీభావము పూని కీడుచేయుచున్నారు. లోకములో అనేకులకు అపకారము చేయుచున్నారు. నేను నా కాయమును కృశింపచేసి, దేహాంతర ప్రాప్తి పొంది, వారి పొత్తును వీడదలచుకున్నాను. నాకు అటులనే వరమీయుడు" అని కోరెను.

### ఆదిశేషుడు భూభారము వహించుట

అంత బ్రహ్మ ఇట్లనెను. "నీ తమ్ముల ఆచారవ్యవహారములు అవగతమే. నీవు కోరినట్లే వరమిచ్చుచున్నాను. నీవు భూమి యొక్క భారము వహించి లోకకళ్యాణము చేయుము" అనగా నాటినుండి శేషుడు, గరుడునితో సఖ్యము చేసి, పాతాళమున నివసించుచూ భూభారము వహించియుండెను.

## 37. సప్తత్రింశ అధ్యాయము
## ఆత్మరక్షణకై నాగుల ఆలోచన

మాతృశాపగ్రస్తులైన నాగులలో రెండవవాడైన వాసుకి తోడివారిని పిలిచి యే విధముగా కులము రక్షించుకొనవలసినదో ఆలోచింపుడనగా వేరు వేరు ఆలోచనలు వారిలో కలిగెను. జనమేజయుని కాటువేసి చంపుట, హోమకుండము భగ్నము చేయుట, నీటిధారలతో యజ్ఞము నష్టపరచుట, యజ్ఞపరికరములను అపహరించుట, భయపించుట మొదలయిన వారి ఆలోచనలను అవి విన్న వాసుకి నేను మీలో పెద్దవాడిని, ఈ పనులకు నేను ఒప్పుకొనలేను. సర్వులకు హితకరమైన పనిచేసిన యెడల మనకు హితము కలుగును. తండ్రియైన కశ్యపుని వద్దకు పోయి అతని పరామర్శించిన బాగుండును అని పలికెను.

## 38. అష్టత్రింశ అధ్యాయము
## నాగుల రక్షణ విషయమై రహస్య సంభాషణం

అప్పుడు యెలాపత్రుడను నాగుడు అన్నకిట్లనెను. “మన తల్లి మనలను శపించునపుడు నేను తల్లి ఒడిలో కూర్చుని పినతల్లి వాక్కు విన్నాను. “కద్రువ శాపము వినిన బ్రహ్మ ఊరకుండగా దేవతలు అతనిని కారణమడుగగా అతడు, నాగులు విషధరులు, పాషాణ హృదయులు. మీరు చలించవలదు. సర్పక్రతువు నందు విషధరులైన సర్పములు మాత్రమే నశించును. మిగిలిన నాగకులమును జజాబర వంశస్థుడైన జరత్కారుడు స్వనామధన్యయైన నాగకన్యను దక్షిణగా పొంది ఆమె వలన ఆస్తీకుడను కుమారుని పొందును. ఆ ఆస్తీకుడు జనమేజయుని యజ్ఞము ఆపి నాగకులమును రక్షించును.

అని చెప్పుచూ యెలపత్రుడు, “అన్నా! నీవు ఉపయుక్త సమయమున వెళ్లిన జరత్కారిని ఆతనికి ఇవ్వవలసినది” అని చెప్పెను.

## 39. ఉనచత్వారింశ అధ్యాయము
## నాగగణములు ఊరట చెందుట

యెలాపత్రుని మాటలు విని నాగులు సంతోషించి భగిని జరత్కరిని కాపాడుచుండిరి. సముద్ర మంధన సమయమున వాసుకి రజ్జువై దేవతలకు సాయపడగా వారు అమృతము పొందిన పిదప వాసుకిని బ్రహ్మవద్దకు తీసుకొని పోయి సాయపడమనగా బ్రహ్మ “యెలాపత్రుడు చెప్పినది నిజము. అట్లే

చేయవలసినది" అని పల్కెను. జరత్కరని పరీక్షించుచూ, అతడు భార్యను కోరగా చేతనకా వార్త చేర్చుమని వాసుకి కొందరు నాగులను నియోగించెను.

## 40. చత్వారింశ అధ్యాయము
## పరీక్షిత్తుని బ్రాహ్మణ కుమారుడు శపించుట

జరత్కారుడు ఎందులకు ప్రసిద్ధి వహించెను? అతనికా పేరు యెందులకు కలిగినది యని సేనకుడడగ, సూతుడిట్లనెను - జర అనగా క్షయము, కారు అనగా దారుణము. ఆ మహర్షి శరీరము నాతిదీర్ఘము. దానిని క్షీణింపచేయుటచే అతడు జరత్కారుడయ్యెను. అతడు చాలాకాలము ఊర్ధ్వరేతస్కుడై, తపస్సు చేయుచూ మేదినీ మండలము పరిభ్రమణము చేయుచూ ఉండగా వాసుకి అనుయాయులు అనుగమనము చేయుచుండిరి.

కాలక్రమమున క్షత్రియ వంశీయుడైన పరీక్షిత్తు మహారాజు వేటకై అడవికి వచ్చి చాలా మృగములను సంహరించి అనుచరులను కానక ఒక ఆశ్రమమును చేరి, అక్కడ ఉన్న మునిని చూసి తన దాహమును తీర్చుమని వేడెను. జవాబు చెప్పని మునిని చూసి రాజు క్రోధముతో ఒక మృతసర్పమును అతని స్కంద దేహమున ఉంచి తన దారిని పోయెను. ఆ మహర్షికి తరుణవయస్కుడైన శృంగి అను కుమారుడు కలడు. అతడు చాలా కోపస్వభావుడు. కృశుడను అతని స్నేహితుడు సర్పవృత్తాంతమును చెప్పి హేళన చేసెను.

## 41. ఏకచత్వారింశ అధ్యాయము
## రాజును శృంగి శపించుట

కృశుడు ఇట్లనియె - "అభిమన్యు తనయుడైన పరీక్షిత్తు మృగయా వినోదమునకై వచ్చి దాహముతో వచ్చి మీ నాన్నను కలసికొనగా అతడు మౌనము వహించియున్నందున జవాబు ఇవ్వలేదు. కృద్ధుడైన రాజు వింటికొనతో మృత సర్పమును భుజములపై నుంచి వెడలిపోయెను" అని చెప్పగా శృంగి కన్నుల నిప్పులు రాల ఆచమనము చేసి సప్తరాత్రులలో తక్షకుని వలన కాటువేయబడి మృతినొందునట్లు శపించెను.

తండ్రి వద్దకు వచ్చిన శృంగి దీనుడైన తండ్రిని చూసి అతనితో తను ఇచ్చిన శాపవృత్తాంతము తెలియజేసెను.

శమీక మహర్షి, కుమారుని మాటలు విని చాలా విచారించి "నాయనా,

పరీక్షిత్తు మహారాజు ధర్మమును పాలించుచు మనలను కాపాడుచున్నాడు. అతడు నా మౌనము తెలియక ఇట్లు చేసెను. రాజు చేసిన ఈ చిన్నతప్పిదమునకు నీవిట్లు దండించుట చాలా పొరపాటు” అని పలికెను.

## 42. ద్విచత్వారింశ అధ్యాయము
## శాపవృత్తాంతము పరీక్షిత్తునకు తెలియజేయుట

“నా మాటలు అబద్ధము కావు” అని పలికిన కుమారునితో శమీకుడు “నాయనా, నీవు తేజోవంతుడవు. తపశ్శాలివి. కాని కుక్రవాడవు. నీ తప్పుల భారము నామీద యుండును. నీవు ఈ క్రోధస్వభావమును వీడవలెను. శాంతమే మునులకు శ్రేయము” అని గౌరముఖుడను శిష్యునితో పరీక్షిత్తుని సభకు పంపెను. అతడు రాజసభకు వెళ్లి కుశలప్రశ్నానంతరము జరిగిన సంగతి చెప్ప రాజు దుఃఖాక్రాంతుడై, మునిని క్షమింపుమని వేడమని గౌరముఖుని పంపెను. ఒంటి స్తంభపు మేడలో రాజు, ఔషధములను, మంత్రవేత్తలను కూర్చి, జాగ్రత్తగా మెలగసాగెను.

## 43. త్రిచత్వారింశ అధ్యాయము
## పరీక్షిత్తుని తక్షకుడు కాటువేయుట

విషవిద్యా విశారదుడైన కాశ్యపుడను బ్రాహ్మణుడు పరీక్షిత్తు మహారాజు శాపవృత్తాంతము తెలుసుకొని తన విద్యాబలముచే ఆతనిని రక్షింప బయలుదేరెను. మార్గమధ్యమున వృద్ధబ్రాహ్మణ వేషధారియైన తక్షకుడు ఆతని కలుసుకొని కాశ్యపుని ప్రయాణ ఉద్దేశ్యము తెలిసికొని నిజరూపము చూపి నీవు నా విషప్రయోగమును ఆపలేవన, కాశ్యపుడు పరీక్ష కోరెను.

తక్షకుడు భస్మీభూతము చేసిన వటవృక్షమును కాశ్యపుడు మరల పునరుద్ధరింప తక్షకుడాతనితో “నీవు బ్రాహ్మణుడవు. బ్రాహ్మణుని శాపము కించపరచవద్దు. నీవేమి కావలసిన అది ఇత్తును” అనగా కాశ్యపుడు దివ్య జ్ఞానమున పరీక్షిత్తుని ఆయువు తీరిన సంగతి తెలిసికొని తనకు కావలసిన ధనమును తక్షకుని వద్ద గ్రహించి వెనుకకు మరలెను.

తక్షకుని ఆదేశమున కొంతమంది నాగులు బ్రాహ్మణ వేషధారులై ఫల, పుష్పములను రాజునకు ఇచ్చి ఆశీర్వదించి వెడలిరి. అందలి ఒక ఫలమును ఆరగింప రాజు తీయగా అందలి నల్లని కన్నులు, తామ్రవర్ణము కలిగి సూక్ష్మ కీటకరూపమున ఉన్న తక్షకుడు బయటకు వచ్చెను. కాలము తీరిన రాజు

దర్పముతో, హేళనతో ఆ కీటకము మెడపైనుంచి "సూర్యుడు అస్తమించుచున్నాడు, బ్రాహ్మణుని శాపమే నిజమైన ఈ కీటకమే తక్షకుడై నన్ను కాటువేయుగాక" అని పలికి నవ్వసాగెను. తక్షకుడు నిజరూపము ధరించి గర్జించుచూ రాజు మెడపై కాటువేసెను.

## 44. చతుచత్వారింశ అధ్యాయము
## పరీక్షిత్తుని మృతి

తక్షకునిచే కాటుపడిన రాజు మృతినొందగా మంత్రులు మొదలైనవారు అతని అంత్యక్రియలు యధావిధిగా జరిపించి బాలకుడైన యువరాజు జనమేజయుని రాజును చేసిరి. అతడు దిన దిన ప్రవర్థమానుడగుచూ న్యాయయుక్తముగా ప్రజాపాలనము చేయసాగెను. యుక్తవయస్సు రాగానే మంత్రులు కాశీరాజును కలసికొని అతని కుమార్తె అతిలోకసుందరియైన శుపుష్టముతో జనమేజయుని వివాహము కావించిరి. వారు అన్యోనానురక్తులై ఊర్వశీ, పురూరవుల వలె మెలగసాగిరి.

## 45. పంచచత్వారింశ అధ్యాయము
## వంశాభివృద్ధి ప్రశంస

జరత్కార మహర్షి వివిధ ప్రాంతములు గ్రుమ్మరుచూ ఒకనాడు ఉసీర స్తంభములపై తలక్రిందులుగా వ్రేలాడుచున్న తన పితృపురుషులను కలసికొనగా, వారు నీవే మా ఈ అధోగతికి కారణమని పల్కిరి.

## 46. షట్‌చత్వారింశ అధ్యాయము
## వంశరక్షణకై జరత్కారుని ప్రతిజ్ఞ

తను వివాహము చేసుకొనక సంతాన విహీనుడౌట వారి విచారహేతువుగా తెలిసికొనిన జరత్కారుడు తనకు భిక్షగా దొరికినటువంటిది, తన పేరు కలిగినటు వంటిది తన భారణ పోషణపై ఆధారపడకుండా ఉండినట్టిది అయిన కన్య దొరికిన ఆమెను గ్రహింతునని పలికి యెచ్చటను కన్యను పొందలేక తుదకు అరణ్యమధ్యమున మూడుమారులు కన్యాభిక్షను కోరి కేకవేసెను.

ఇంతకాలము యే నాగులు జరత్కారుని వెంటనంటి ఉన్నారో వారు వాసుకికి తెలుప అతడు తన చెల్లెలైన జరత్కారిని తీసుకొని వచ్చి మునికి దానము చేసెను.

## 47. సప్తచత్వారింశ అధ్యాయము
## జరత్కారుడు భార్యను వదలుట

జరత్కారిని భార్యగా గ్రహించి ముని భార్యాసహితుడై భుజంగరాజు యొక్క రమణీయ అంతఃపురమందు ప్రవేశించి కాలము గడుపుచు భార్యతో నీవు నాకు అప్రియమైన కార్యమును యెపుడూ చేయవలదు. నాకు ఇష్టము లేని పని చేసిన వెంటనే నిన్ను పరిత్యజించి వెడలిపోదునని చెప్పెను. ఆమెయూ తన పితృకుల రక్షణార్థమై అతనికి సేవలు చేయుచూ కొంతకాలము పిదప ఋతుమతి యయ్యెను. ఒకనాడు జగత్కారుడు భార్య తొడపై శిరస్సు నిడి నిద్రించుచుండెను. సాయం కాలము అగుచుండుట చూసిన జరత్కారి భర్త సంధ్యాహ్నికమునకై భయపడుచూ నిదుర లేప అతడు నేను నిద్రించుచుండ సూర్యుడు అస్తమించ సాహసించునా? నీవు నన్ను, నా తపోబలమును అవమానించితివి అని బయలదేర జరత్కరి అతనికి నమస్కరించి తప్పు లేకుండా తనను విడువవలదని, తన అన్నదమ్ములు మాతృపాప విమోచనకై తనను నియోగించిరని, దీనముగా వేడుకొనగా, ముని నీ గర్భమందు వేదవేదాంగపారాయణుడు, అగ్నికల్పుడు అయిన బాలకుడు ఉన్నాడని తెలిపి కఠోర తపస్సు ఆచరింప వెడలిపోయెను.

## 48. అష్టచత్వారింశ అధ్యాయము
## ఆస్తీకుని జననము

తదనంతరము నాగదుహిత వాసుకి వద్దకు వచ్చి భర్త వెడలిపోయిన సంగతి చెప్పగా నాగరాజు, “చెల్లెలా, నీ గర్భమందు సంచారము జరుగుచున్నదా?” అని అడుగ ఆమె జరత్కారుడు వెడలిపోవుచూ చెప్పిన సంగతి చెప్పెను. కొంత కాలమునకు శుభసమయమున ఆమెకు సర్వశుభలక్షణములు గల కుమారుడు జన్మించెను. ఆతడు గర్భమందున్న సమయమున తండ్రి ‘అస్తి’ అని అన్నందున ఆతని పేరు ఆస్తీకుడయ్యెను.

## 49. యేకోన పంచాసత్తమ అధ్యాయము
## పరీక్షిత్తుని మరణ వృత్తాంతము

ఒకనాడు కొలువుతీరియున్న జనమేజయమహారాజు మంత్రులను తన తండ్రి మరణ వృత్తాంతము అడుగగా వారు నీ తండ్రి ధర్మయుక్తముగా పరిపాలించెడివాడు. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులు స్వకార్యానురక్తులై ఉండెడివారు. అతడు వైధవ్యము పొందినవారు, వికలాంగులు, అనాధలు, దీనులు,

దరిద్రులు అయిన ప్రజల పోషణభారము వహించెడివాడు. ప్రజలందరూ అతనియందు అనురక్తులై ఉండెడివారు. అభిమన్య సుతుడైన నీ తండ్రి రాజ ధర్మము, నీతిశాస్త్రము చక్కగా తెలిసినటువంటివాడు. జితేంద్రియుడు, మేధావి. అతడు అరువది సంవత్సరముల వయస్సునందు అడవికి వేటకు వెళ్లి క్షుత్పిపాసతో మునిని చేరి దాహము తీర్చమనగా అతడు పలుకకపోయెను. నీ తండ్రి మృతసర్పమును అతని స్కంద దేశమున వేలితో ఉంచి రాజధానికి తిరిగి వచ్చెను.

## 50. పంచాసత్తమ అధ్యాయము
## పరీక్షిత్తుని శాపరహస్యము

శమీకమహర్షి కుమారుడు శృంగి తండ్రి మెడపైనున్న చచ్చిన పామును చూసి స్నేహితుని ప్రేరణచే రాజు తక్షక దంతనమున మృతి చెంద శపించెను. తక్షకుడు రాజును రక్షింపవచ్చుచున్న కాశ్యపుడను బ్రాహ్మణునికి ధనమిచ్చి తిరిగి పంపి కపటముగా రాజుని కాటువేసి చంపెను అని మంత్రులు చెప్ప జనమే జయుడు వారిని కాశ్యపుడుతక్షకునిచే కాటువేయబడిన వృక్షము పునర్జీవితమైన సంగతి మీకెట్లు తెలిసినదని అడుగ, వారు “ఎందు కర్రలకై వృక్షమును అధిరో హించిన బ్రాహ్మణుని కశ్యపుడు, తక్షకుడు ఇరువురూ చూడలేదు. వృక్షముతోనే భస్మీభూతుడైన బ్రాహ్మడు పునర్జీవము పొందిన పిదప మాకీ వృత్తాంతము చెప్పెను” అని పల్కిరి.

అతిరోష పరవశుడై జనమేజయుడు మంత్రులతో “తక్షకుడు బ్రాహ్మణ శాపమును నెపముగా చేసికొని నా తండ్రిని చంపెను. ఆతడు దుష్టస్వభావుడు కాకపోయిన, మంత్రవేత్తయైన కశ్యపుని ఆపవలసిన అవసరము లేదు కదా! నేను మీకు, నా తండ్రి ఆత్మకు, ఉదంకునకు సంతోషము కలుగునట్లుగా వైరిని తునుమాడెదను” అని గర్జించుచూ పలికెను.

## 51. ఏకపంచాసత్తమ అధ్యాయము
## సర్పములను నశింపచేయుటకై రాజు ప్రతిన పూనుట

జనమేజయుడు సభాసదులందరి ముందు సర్పములను నాశనము చేతునని ప్రతిన పూని పురోహితులను, ఋత్విక్కులను పిలచి పరామర్శింప వారు సర్పక్రతువు చేయుమని చెప్పిరి. యజ్ఞమునకై అన్ని ద్రవ్యములను సమకూర్చి యజ్ఞవేదిక తయారుచేసిరి. యజ్ఞశాల నిర్మించు సమయమున ఒక వాస్తువిద్యా విశారదుడు యే ప్రదేశమున ఈ శాల నిర్మించబడినదో దానిని బట్టి ఈ యజ్ఞమునకు ఒక

బ్రాహ్మణుని వలన విఘ్నము కలుగునని పలికెను. ఈ వార్త తెలిసిన రాజు యజ్ఞవాటిక ముందు ద్వారపాలకులతో నా అనుమతి లేకుండా లోనికి యెవ్వరినీ రానీయవద్దని ఆజ్ఞాపించెను.

## 52. ద్విపంచాసత్తమ అధ్యాయము
## సర్పయజ్ఞారంభము

కృష్ణవర్ణ వసనధారులై, హోమధూమమున రక్తవర్ణ చక్షులైన పురోహితులు నమోచ్చారణ చేయుచూ ఆహుతి చేయుచుండగా దీర్ఘనిశ్వాసములు విడుచుచూ, రోదనము చేయుచూ వేలకొలది సర్పములు యజ్ఞకుండమున పడసాగెను.

## 53. త్రిపంచాసత్తమ అధ్యాయము
## ఋత్వికుల పేర్లు

సర్పకుల సంహారణార్థము జనమేజయుని సర్పక్రతువునందు ఎవరెవరు ఋత్విక్కులైరి అని శౌనకుడడుగ సూతాత్మజుడిట్లు చెప్పసాగెను. చ్యవన వంశస్థుడైన చండాభార్గవుడు హోతజ్ఞుడు, కౌత్సుడు ఉద్గాత, జైమిని, బ్రహ్మగా ఉండిరి మరియు పింగళ, అసిత, దేవల, నారద, పర్వత, ఆత్రేయ, కుండజఠర, కాలఘట, వాత్స్య, శ్రతశ్రువ, కోహల, దేవశర్మ, మౌద్గల్య, సమసౌరభ మొదలైన వేదజ్ఞులైన బ్రాహ్మణులు సదస్యు వైరి యజ్ఞము ప్రారంభము కాగానే ఈ వార్త తెలిసిన తక్షకుడు ఇంద్రుని వద్దకు పోయి శరణు వేడ అతడు కరుణించి తక్షకుని తన వద్ద ఉంచుకొనెను. క్రతువున అనేకములైన సర్పములు నశించిన పిదప శోకసంతప్త మానసుడైన వాసుకి చెల్లెలిని వంశమును రక్షింపుమని పరిపరి విధముల వేడుకొనెను.

## 54. చతుపంచాసత్తమ అధ్యాయము
## ఆస్తీకుని తల్లి ఆదేశించుట

తదనంతరము జరత్కారి కుమారుని పిలచి కద్రువ శాప వృత్తాంతము, అమృతమంధన కాలమున వాసుకి దేవతలకు చేసిన సహాయము, వారికి వాసుకిని బ్రహ్మవద్దకు తీసుకొనిపోవుట చెప్పెను.

### జనమేజయుని యజ్ఞమునకు ఆస్తీకుడు వచ్చుట

బ్రహ్మ వాసుకిని దేవతలను ఉద్దేశించి "మీరు విచారించవలదు. జరత్కార మహర్షి వలన ఈతని సహోదరికి పుట్టిన కుమారుడు నాగకులమును రక్షించును" అని పలికెను.

అందువలన కుమారా, ఆస్తీకా, రేపు మా చిరకాల వాంఛితమును నెరవేర్చుము అని కుమారునితో పలుకగా ఆతడు మేనమామయైన వాసుకిని ఊరడించి జనమేజయ మహారాజు యజ్ఞవేదిక వద్దకు వచ్చి సూర్యసదృశులై వెలుగచున్న ఋత్విక్కులను, రాజును కీర్తించసాగెను.

## 55. పంచ పంచాసత్తమ అధ్యాయము
## ఆస్తీకుడు జనమేజయుని కీర్తించుట

ఆస్తీకుడిట్లనెను. "రాజా! నీవు చంద్ర, వరుణ, ప్రజాపతులవలె యజ్ఞము చేయుచున్నావు. కాని పరీక్షితాత్మజా! నా బంధువర్గమునకు మేలు చేయుము. ఇంద్రుని అశ్వమేధ యజ్ఞము వలె నీ సర్పయజ్ఞము తేజరిల్లియున్నది. కాని రాజా! నా బంధువులకు శుభము కలుగుగాక! యముడు, రంతిదేవుల యజ్ఞములవలె ఈ యజ్ఞము ఉన్నది. కాని నా బంధువర్గమునకు హితముగా నీ మనస్సు మారుగాక! కుబేరుడు, నృగమహారాజు, గయుడు, శశబంధువుల యజ్ఞ దృశ్యముగా నీ యజ్ఞము అలరారుచున్నది. కాని నా మాతృకులమనకు నీవు క్షేమము ప్రసాదించుము. నీ ఋత్విక్కులు అసమాన తేజోరాసులు. నీవు ధర్మరాజు వంటి వాడివి. దిలీపుడు, యయాతి, మాంధాత, భీష్ముల వంటి రాజువు. వాల్మీకి వంటి విభావ మహాత్య సంపన్నుడవు. నారాయణునివలె కాంతి సంపన్నుడవు. యముని వలె ధర్మపరాయణుడవు. కృష్ణుని వలె సర్వగుణాలంకారుడవు. మహారాజా! అధికముగా నేమి చెప్పుదును. ధైర్య, వీర్య, గంభీర్యాది గుణములు నీయందు మూర్తీభవించి యున్నవి."

ఈ విధముగా ఆస్తీకుడు రాజును, ఋత్విక్కులను పొగడ అందరూ సంతోషించిరి. రాజు ఋత్విక్కులతో ఇట్లనెను.

## 56. షట్పంచాసత్తమ అధ్యాయము
## నాగకులమును రక్షింప వరము వేడుట

జనమేజయుడిట్లనెను. "ఈతడు బాలకుడు కాని అభిజ్ఞతలో బాలుని వలె లేడు. ఏది యెటులైనను ఈతని కోరిక తీర్చ నాకు ఇచ్ఛ కలిగినది. మీ ఉద్దేశ్యము తెలియజేయుడు" అని పలుక, వారు తక్షకుని తప్ప వరమీయమనిరి. తక్షకుడు రాకుండటకు వారు కించుక కోపించి యుండిరి. మునుల వలన రాజు తక్షకుడు ఇంద్రుని శరణు వేడియున్న సంగతి తెలిసికొని ఇంద్రుని ఆరాధింపుడని వారిని కోర వారు అట్లే చేయ, ఇంద్రుడు విమానమున అంతరిక్షమున దేవతా సమేతుడై

తక్షకుడు చాటున ఉండవచ్చెను. కాని తక్షకుని వదలలేదు. రాజు కోపించి ఇంద్రునితో సహితముగా మంత్రోచ్చారణ చేయమనెను. హోత రాజాజ్ఞ తక్షకుని ఉల్లేఖించి అగ్నిలో ఆహుతి ప్రదానము చేయగానే భయముతో ఇంద్రుడు తక్షకుని వదిలి స్వర్గమునకు పారిపోయెను. మంత్రబలమున తక్షకుడు నిరాటంకముగా ఛీత్కారము చేయుచు స్వర్గమునుండి పతనము చెందసాగెను.

అప్పుడు రాజు బ్రాహ్మణకుమారుని వరమడుగుమనగా "నాకు వరమిచ్చు సమయము మొదలు మరి సర్పములు దగ్ధము కాకుండా ప్రసాదింపుమని" రాజు ఇవ్వబోయిన ధన, కనక, వస్తు సముదాయము తిరస్కరించి తన కోరిక చెల్లింపుమని కోరెను. వరమిచ్చితివి కాన నిలుపుకొనుట మీ శ్రేయస్కరమని సభ్యులు పలికిరి.

## 57. సప్త పంచాసత్తమ అధ్యాయము
## యజ్ఞమున దగ్ధులైన నాగులు

పూర్ణ, శల, పాల, వాలీమక, పిచ్ఛల, కౌనస, చక్ర, కాలవేగ, ప్రకాలన, పుచ్ఛాండక, మండలక, పారాబత, పారిజాత, మేరక, శంకువర్ణ, బాహుల్య, ఆదివాసుకి పుత్రులు, తక్షకపుత్రులు, మైరావత కులజులు, కౌరవ కులజులు, ధాత్రరాష్ట్ర కులజులు తదితరజాతులు యైన లక్షలాది నాగులు యజ్ఞదగ్ధులైరి.

## 58. అష్ట పంచాసత్తమ అధ్యాయము
## సర్పయజ్ఞ ఉపసంహారము

తేజోవిహీనుడై హోమగుండమున పతనమగుచున్న తక్షకుని ఉద్దేశించి ఆస్తీకుడు కుడిచేతినెత్తి తిష్ఠ, తిష్ట, తిష్ట అని మూడుమారులనగా అతడు అగ్నియందు పడక ఆకాశమున కాలయాపన చేయ సమర్థుడయ్యెను.

తదనంతరము రాజు బ్రాహ్మణ బాలకుని కోరికపై ఉచ్ఛకంఠమున "సర్ప కులము నిరాపద చెందుగాక, ఆస్తీక ఋషి కోరిక తీరుగాక!" అని క్రతువునాపి ఆస్తీకునకు ఆసన, వసనాది నానా సామగ్రులను ఇచ్చి తన అశ్వమేధ యజ్ఞమునకు ఆతని సదస్యుడవు కమ్మని కోర, అతడు అంగీకరించి సెలవు తీసుకొని తల్లిని, మామను కలసికొని శుభవార్త వారికి తెలియజేయ, వారు మిక్కిలి సంతోషించి ఆస్తీకుని వరమడుగుమని కోరిరి. "బ్రాహ్మణులను, నా పేరు స్మరించినవారిని మీరు యెప్పుడు హాని చేయకుండా ఉండవలె"నని కోర వారు తథాస్తు అనిరి.

ఈ ఆస్తీకుని చరిత్ర ప్రమతి; కుమారుడైన రురునకు వినిపించెను.

ఆస్తీకోపాఖ్యానము వినినవారు, చదివినవారు సర్పబాధను పొందరు. సర్పభయము తొలగిపోవును.

ఆస్తీక పర్వాధ్యాయ సమాప్తి

## 59. ఏకోన షష్ఠితమ అధ్యాయము
## ఆదివంశావతరణిక, మహాభారత ప్రసంగము

"జనమేజయుని సర్పక్రతువు జరుగు సమయమున రోజూ వేదవ్యాసుని ఆజ్ఞానుసారము మహాభారత గాథ వినుచుండిరి" అని పల్కిన, సూతపుత్రునితో శౌనకుడు దానిని యథాతథముగా వినిపింపుమని కోరెను.

## 60. షష్ఠితమ అధ్యాయము
## వేదవ్యాసుడు జనమేజయుని యజ్ఞమునకు వచ్చుట

సత్యవతీ పరాశరుల పుత్రుడు, తపోగరిష్టుడు, వేదవేత్త అయిన వేదవ్యాసుడు శిష్యగణములతో జనమేజయుని సభాస్థలమునకు రాగా రాజు సువర్ణ సింహాసనముపై మునిని కూర్చుండబెట్టి పాద్య, అర్ఘ్య, ఆచమన యుక్తముగా మధుపర్కములనిచ్చి సత్కరించి కురుపాండవుల యుద్ధకారణములు, వారి చరిత్ర వినుపింపుమని కోర వ్యాసుడు తన శిష్యుడైన వైశంపాయనుని సవిస్తరముగా వినిపింపుమని ఆనతించెను.

## 61. ఏక షష్ఠితమ అధ్యాయము
## మహాభారత కథారంభము

పాండవుల బలము, సుయోధనుని అసూయ, పాండవులకు అర్థరాజ్యప్రాప్తి, ద్యూతక్రీడ, పన్నెండు సంవత్సరముల అరణ్యవాసము, సంవత్సర అజ్ఞాతవాసము పూర్తిచేసిన పాండవులు రాజ్యము తిరిగి ఇమ్మనుట మొదలైన గాథ వైశంపాయనుడు వినిపించెను.

## 62. ద్వి షష్ఠితమ అధ్యాయము
## కురుపాండవుల శత్రుత్వ కారణము

జనమేజయుడు "యే కారణము వలన ధర్మనిరతులైన పాండవులు ఇన్ని కష్టములు అనుభవించిరి? అర్జునుడు ఏ విధముగా కురుసైన్యమును నాశనము చేసెను" అని వైశంపాయనుని అడిగెను.

## మహాభారత మహాత్మ్యం

భారతమున లేనిది మరింకెందును లేదు. ఇది సర్వపాపములను హరించును. తేజస్సునిచ్చును అని భారత మహాత్మ్యము వైశంపాయనుడు తెలిపెను.

## 63. త్రి షష్ఠితమ అధ్యాయము

## ఉపరిచర వసువు

వసు నామాంతరుడైన ఉపరిచర వసువు తీవ్రతపమును చేయగా ఇంద్రుడు చేది రాజ్యమును, వైజయంతి విమానమును, యుద్ధమందు జయమునిచ్చు పద్మమాలను ఇచ్చి, తపము మాన్పించెను. వసువు ప్రతి సంవత్సరము ఇంద్రుని పూజ చేయుచు అతనిని తృప్తిపరచి భోగభాగ్యములను పొంది, ఇతర రాజులు ఇంద్రుని పూజ చేయ కారకుడయ్యెను. వసువుకు ఐదుగురు కొమారులు. బృహద్రథుడు మగధరాజు అయ్యెను. మరియొకడు ప్రత్యగ్రహుడు. మూడవవాడు కుశాంబుడు. ఇతనినే మణివాహుడని కూడా పిలుస్తారు. మిగిలినవారు 'మాబల్లుడు', యదుడు. విమానముతో మీదను చరించినందున వసువు పేరు ఉపరిచర వసువయ్యెను. ఒకనాడు దైవయోగమున రాజు వేటకు వెడలినపుడు రాణి గిరిక ఋతుమతి అయ్యెను. రాజు మనసు గిరికపైనే లగ్నమై యుండెను.

## మత్స్యగంధ పుట్టుక

వేటాడి అశోకవృక్షము క్రింద విశ్రాంతి తీసుకొనుచున్న రాజునకు గిరిక జ్ఞప్తికి రాగా రేతస్సు పతనమయ్యెను. అతడా రేతస్సును మంత్రయుక్తముగా పత్రమందుంచి భార్యకిమ్మని ఒక శ్యేనపక్షి కివ్వ అది అంతఃకలహమందు నీట జార్చెను. రేతస్సును ఇంద్రుని శాపమున మత్స్యరూపమున ఉన్న గిరిక అను అప్సర భక్షించి అంతస్త అయ్యెను. వలలో పడిన ఆ చేప కడుపు చీల్చి ఒక మగశిశువును, ఒక ఆడశిశువును జాలారులు చూసి వసురాజునకు చూప, రాజు కుమారుని గ్రహించి బాలికను బెస్తరాజునకు ఇచ్చెను. బాలుడు మత్స్యరాజుగా ప్రసిద్ధి చెందెను. బాలిక సత్యవతి జాలారుల పెంపున మత్స్యగంధి నామ్న అయ్యెను.

## వ్యాసుని జన్మవృత్తాంతము

ఒకానొకప్పుడు యమునానదిని పడవపై దాటిస్తున్న దాసరాజు కన్యను పరాశర మహర్షి చూసి మదనాతురుండై ఆమెను తన కోర్కె తీర్చమని వేడెను.

సిగ్గుపడుతున్న సత్యవతిని చూసి ముని ఆ ప్రదేశమును తమోమయముగా చేసి, ఆమె కన్యాత్వము భంగము కలుగకుండగను, ఆమె శరీరమునుండి సుగంధము వచ్చునట్లుగను వరమిచ్చి తన ఈప్సితార్థము నెరవేర్చుకొనెను. నాటినుండి ఆమె గంధవతియని, యోజనగంధియని పేరుగాంచెను.

యమునానదీ ద్వీపమందు ఆమె ఒక కుమారుని కాంచెను. అతడు తల్లి నిర్దేశ ప్రకారము తపస్సునకు వెళ్తూ అవసరమన్నప్పుడు తనను స్మరింపుమని ఆమెకు చెప్పెను. యమునా ద్వీపమందు పుట్టెను కాన ద్వైపాయనుడును, వేదములను విభజించెను కాన వేదవ్యాసుడని అతనికి పేరు కలిగెను. మహర్షి సమంతుడు, జైమిని, పైలుడు, వైశంపాయనుడు మొదలైన శిష్యులకు, కుమారుడైన శుకదేవునకు భారతము అధ్యయనము చేయింప, వారు దానిని ప్రచారము చేసిరి.

## సంక్షిప్త క్షత్రియ వంశ వర్ణన

శాంతనునకు భీష్ముడు జన్మించెను. ఋషి అణిమాండవ్యుని శాపమున ధర్మదేవత విదురుడై సూతయోనిని పుట్టెను. సూతుడు గవాల్గణుని కుమారుడు సంజయుడు. కుంతి కన్యావస్థయందు కర్ణుడు పుట్టెను.

నారాయణుడు దేవకీ వసుదేవులకు కృష్ణుడై జననమొందెను. దేవతలు ధర్మసంస్థాపనార్థము అంధక-వృష్ణి కులములందు పుట్టిరి. సత్యక-హృదికల కుమారులు సాత్యకి, కృతవర్మ.

ఋషి భరద్వాజుని రేతస్సును ఉంచిన కుంభమునుండి ద్రోణుడు, గౌతముని వలన కృపుడు, కృపి పుట్టిరి. ద్రోణాచార్యుని కుమారుడు అశ్వత్థామ, ద్రోణుని చంపుటకు యజ్ఞవేదికనుండి దుష్టద్యుమ్నుడు, ద్రౌపది పుట్టిరి. గాంధార రాజునకు శకుని, గాంధారి కలిగిరి. వ్యాసుని వలన ధృతరాష్ట్రుడు, పాండురాజు పుట్టిరి. ద్వైపాయనుని వలన శూద్రయోనిలో విదురుడు పుట్టెను. పాండురాజుకు ఇద్దరు భార్యల వలన - ధర్ముని వలన యుధిష్ఠరుడు, వాయువు వలన భీముడు, ఇంద్రుని వలన అర్జునుడు, అశ్వనీకుమారుల వలన నకుల సహదేవులు కలిగిరి. ధృతరాష్ట్రునకు దుర్యోధనాది నూర్గురు కొడుకులు, కుమార్తె దుస్సల జనన మొందిరి. అర్జున, సుభద్రల కుమారుడు అభిమన్యుడు. పాండవుల వలన ద్రౌపదికి ప్రతివింధ్య, సుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతసేనులు కలిగిరి. హిడింబి, భీములకు ఘటోత్కచుడు కలిగెను.

## 64. చతుష్షష్ఠితమ అధ్యాయము
## ప్రాచీన రాజవంశములు

పరశురాముడు ఇరువది ఒక్కమారు క్షత్రియులపై పడి వారిని నాశనము చేయ రాజు భార్యలు ఋతుమతులైనప్పుడు సత్‌బ్రాహ్మణులను కూడి వంశరక్షణ చేసిరి.

భూభారము తగ్గింప బ్రహ్మ దేవతలను భూలోకమున జననమొంద ఆదేశింప వారు అట్లే చేరిరి.

ఆదిమవంశానన తరణిక సమాప్తము

## 65. పంచ షష్ఠితమ అధ్యాయము
## సంభవపర్వం : బ్రహ్మర్షి వంశము

దేవతలు బ్రహ్మర్షి, రాజర్షి వంశములందు జన్మించి దానవ, గంధర్వ, పన్నగ, రాక్షసాదులను సంహరింప మొదలిడిరి. వారి వంశములను వర్ణింపుమని జనమేజయుడు వైశంపాయనుని కోరెను.

## దేవాసుర వంశవర్ణన

మరీచి, అత్రి, అంగిర, పౌలస్య, పులహ, క్రతువులు బ్రహ్మ మానసపుత్రులు. మరీచికి కొడుకు కశ్యపుడు. అతని వలననే సమస్త ప్రజలు సృష్టి పొందిరి. అదితి, దితి, దను, కాళ, దనాదు, సింహిక, క్రోధా, ప్రధా, విశ్వ, వినత, కపిల, ముని, కద్రు వీరు పదముగ్గురు దక్షకన్యలు కశ్యపుని భార్యలు. అదితికి ధాతా, మిత్ర ఆర్యను, శక్ర, వరుణ, అంశ, భగ, వివశ్వాన్, పునః, సవితో, త్వష్ట, విష్ణు అను ద్వాదశాదిత్యులు జన్మించిరి. విష్ణువు కనిష్టుడు. గణవంతుడు. దితి కుమారుడు హిరణ్యకశిపుడు. హిరణ్య కశిపునకు ఐదుగురు పుత్రులు – ప్రహ్లాద, సంహ్లాద, అనూల్యాద, శిబి, బాష్కలులు. ప్రహ్లాదునకు ముగ్గురు కొడుకులు – విరోచన, కుంభ, నికుంభులు. విరోచనుని కుమారుడు బలి. బలిపుత్రుడు బాణుడు. ఇతడు ఈశ్వరుని ఆరాధించి మహాకాలుడను బిరుదు పొందెను.

ప్రథమ, రాజా, విప్రచిత్తి, మహాయశ, శంబర, నముంచి, పులోమ, విశ్రుత, అశిలోమ, కేశి, దుర్జయ, దానవది, అయఃశిర, అశ్వశిన, అశ్వశంకు, వీర్యవాను, గగనమూర్ధ, వేగవాను, కేతమాన, స్వర్భాను, అశ్వ, అశ్వపతి, వృషపర్వు, జ్యక,

అశ్వగ్రీవ, సూష్మ, తుహుండ, మహాబల, ఏకపాద, ఏకచక్ర, విరూపాక్ష, మహోదర, దినచంద్ర, నికుంభ, కూపట, కపట, శరభ, శంభ, సూర్య, చంద్రాది ఇరువది నలుగురు 'దను' పుత్రులు.

ఏకాక్ష, అమృతప, ప్రలంబ, నరో, వాతాపి, శత్రుతాపన, శఠ, గరిష్ఠ, వ్యవనాయు, దీర్ఘజిహ్వ. వీరు దానవులు. అనంతపుత్ర సంతతి కలవారు.

చంద్రవిద్వేషి రాహు, సుచంద్ర, చంద్రహస్త, చంద్రమర్దన వీరు సింహికాగర్భ సంజాతలు. వీరు క్రూరస్వభావులు.

దనాయువుకు నలుగురు పుత్రులు – విక్షర, బల, వీర, వృత్త యనువారు.

కాళ కుమారులు వినాశన, క్రోధ, క్రోధహస్త, శక్రులు.

## అసురగురువు శుక్రుని వంశము

శుక్రునకు నలుగురు కుమారులు. త్వష్టాధర, అత్రి మరి యిద్దరు.

**తిర్యక్ ప్రాణుల జన్మకారణము**

త్ర్యాక్ష, రిష్టనేమి, గరుడ, అరుణి, ఆరుణి, వారుణి. వీరు వినతాపుత్రులు.

శేష, అనంత, వాసుకి, ఆదులు కద్రూ పుత్రులు.

'ముని' పుత్రులు – భీమసేన, సుపర్ణ, వరుణ, గోపతి, ధృతరాష్ట్ర, సూర్యవర్చ, సత్యవాకు, అర్క, పర్ణ, ప్రదూత, భీమ, చిత్రరధ, శాలిశివ, పర్జన్య, కవి, నారదాది పదహారుగురు. వీరు కొందర దేవతలు, కొందరు గంధర్వులు.

'ప్రధ'యందు అనవద్య, రును, వంశ, అసుర, మార్గనప్రియ, అనూప, సుభగ, భాశి అను కన్యలు, సిద్ధ, పూర్ణ, బరినా, ................, బ్రహ్మచారి, అతిగుణ, సువర్ణ, విశ్వావసు, భాను, ప్రచంద్ర అను పదిమంది కుమారులు కలిగిరి.

ప్రధాదేవియందు దేవర్షి ఔరసులు, అప్సరసలు జన్మించిరి. అలంబూష, మిశ్రకేశి, విద్యాపూర్ణ, తిలోత్తమా, అరణ, రక్షిత, రంభ, మనోరమ. కేశిని, సరాహు, సరత, సురజ, సుప్రియ అను అప్సర కన్యలు అతి బాహు, హాహా, హోహూ, తుంబురాది గంధర్వులు కపిలకు కలిగిరి.

# 66. షట్ షష్ఠితమ అధ్యాయము
## రుద్రాది సృష్టి వర్ణన

మరీచాది ఆర్గురు బ్రహ్మర్షులు బ్రహ్మ మానసపుత్రులు. మృగవ్యాధ, సర్ప, నిర్జాతి, అజైకపాద, అహి, బుధ్యా, పినాకి, దహన, కపాలి, స్థాను, భర్గ, వీరు స్థానురుని పుత్రులు. వీరిని ఏకాదశ రుద్రులందురు.

అంగీరసునకు ముగ్గురు కుమారులు. బృహస్పతి, ఉతధ్య, సంవర్త.

అత్రి కుమారులు అనేకులు. అందరూ వేదజ్ఞులు, సిద్ధులు, ఋషులు.

రాక్షస, వానర, కిన్నెర, యక్షగణములు పులస్త్యుని కుమారులు.

పులహుని కుమారులు – శలభ, సింహ, కింపురుష, వ్యాఘ్రులు. వీరు మృగములు.

దక్షుడు, బ్రహ్మ కుడి బొటనవ్రేలునుంచి, అతని పత్ని ప్రజాపతి వామాంగుష్టమునుంచి జన్మించిరి. దక్షునకు మగసంతతి లేదు. అందరూ కుమార్తెలే. యాభైమంది. ధర్మునకు పదిమందిని, కశ్యపునకు పదముగ్గురిని, చంద్రునకు ఇరవై యేడుగురిని వేదవిధిగా సంప్రదానము చేసెను. కీర్తి, లక్ష్మీ, ధృతి, మేధ, పృష్ఠి, శ్రద్ధా, క్రియ, బుద్ధి, లజ్జ, మతి వీరు ధర్ముని భార్యలు. అశ్వని, భరణి ఆది 27గురు చంద్రుని భార్యలు. మనువు బ్రహ్మపుత్రుడు. అతని కుమారుడు ప్రజాపతి.

ధర, ధృవ, సోమ, అహ, అనిల, అనల, ప్రత్యూష, ప్రభాసు – వీరు అష్టవసువులు. వీరు ప్రజాపతి పుత్రులు.

వీరిలోని ధర, ధృవులు, ధరాభ్రమా యొక్క గర్భమున జననమొందిరి. మనస్విని కుమారుడు సోముడు. అతని కుమారుడు అహ, శ్వాస కుమారుడు అనిలుడు. శాండిల్య కుమారుడు అనలుడు, ప్రభాత కుమారులు ప్రత్యూష, ప్రభాసులు.

ధరకు ఇద్దరు పుత్రులు – ద్రవిణ, హుతహవ్యహులు.

సంహారకర్త కాలుడు ధృవుని కుమారుడు.

సోముని కుమారుడు వర్చా.

శిశిర, ప్రాణ, రమణ – మనోహర కుమారులు.

జ్యోతి, శమ, శాంత, ముని వీరు అహ పుత్రులు.

కుమారుడు అగ్ని కుమారుడు. కుమారుని కృత్తిక పెద్దది చేసినది. కాన అతడు కార్తికేయుడయ్యెను. శాఖ, విశాఖ, నైశ్యమేయులు, కార్తికేయుని అనుజులు. అనిలుని భార్య 'శివ'. ఆమె గర్భమున మనోజబ, అభిజ్ఞాత గతి ఇరువురు పుత్రులు జన్మించిరి.

ప్రత్యూష పుత్రుడు దేవలుడు. దేవలునకు ఇద్దరు కుమారులు.

బృహస్పతి చెల్లెలు యోగశక్తకు అష్టమ వసువు ప్రభాసుని వలన శిల్పప్రజాపతి విశ్వకర్మ కలిగెను.

బ్రహ్మ దక్షిణ స్థనము నుండి ధర్ముడు వచ్చెను. ధర్మునకు ముగ్గురు కుమారులు. శమ, కామ, హర్షుల. శముని భార్య ప్రాప్తి. కాముని స్త్రీ రతి. హర్షుని భార్య నంద. అశ్వరూపధారిణి త్వష్ట సవితుని భార్య. ఈమె కుమారులు అశ్వనీ కుమారులు.

మరీచి కుమారుడు కశ్యపుని వలన సరాసుర గణములు జన్మించిరి.

అదితియందు ఇంద్రాది ద్వాదశ పుత్రులు కలిగిరి. విష్ణు సర్వకనిష్టుడు.

భృగు బ్రహ్మ హృదయము ఛేదించుకొని పుట్టాడు. భృగుపుత్రుడు శుక్రుడు. ఇతడు దైత్యుల గురువు.

భృగునకు మరియొక కొడుకు చ్యవనుడు. ఆరుషి చ్యవనుని భార్య. వీరి పుత్రుడు ఔర్వుడు. ఇతని పుత్రుడు ఋచీకుడు. ఋచీకుని కుమారుడు జమదగ్ని. జమదగ్నికి నల్గురు కుమారులు. వీరిలో కనిష్టుడు పరశురాముడు.

ఋచీకునకు జమదగ్ని ఆది నూర్గురు కుమారులు.

వీరు కాక ఋచీకునకు మరి ఇద్దరు కుమారులు కలరు. ధాత, విధాత. పద్మాలయ లక్ష్మి వీరి చెల్లెలు.

వరుణుని జ్యేష్ట భార్య శుక్రాదేవి. ఆమెకు బలుడను కుమారుడు, సురయను కుమార్తె కలరు.

అన్నార్తులైన ప్రజలత పరస్పర భక్షణ నుండి అధర్మము పుట్టెను. అధర్ముని భార్య నిర్ఞాతి, వీరినుండి రాక్షసులు పుట్టిరి.

అధర్ముని మరి ముగ్గురు కుమారులు భయము, మహాభయము, మృత్యువు. మృత్యువునకు పుత్రకళత్రములు లేరు.

# 67. సప్త షష్ఠితమ అధ్యాయము

## నృపుల జన్మ వృత్తాంతము

దేవరాక్షసాదులు భూలోకమందు జననమందిరి. ఎట్లనిన – దానవుడైన విప్రచిత్తి – జరాసంధునిగాను, హిరణ్యకశిపుడు – శిశుపాలునిగాను, ప్రహ్లాదుని తమ్ముడు సాహ్లాదుడు – శల్యునిగాను, అనూల్యాదుడు – దుష్టకేతుగాను, శిబి – ద్రుమునిగాను, భాష్కలుడు – భగదత్తునిగాను, ఆయుఃశిర, అశ్వదర, అయశంకు, గగనమూర్ధ, నెగవాదులు – కేకయ భూపతులుగను, కేతుమానుడు – అమితౌజునిగను, స్వర్భాను – ఉగ్రసేనునిగాను, అన్వుడు – ఆదోకునిగను జన్మించిరి. ఇతర రాక్షసులు వివిధ నామములు భూలోకమున జన్మించిరి.

## కౌరవ కుల వర్ణన

ధృతరాష్ట్రునకు గాంధారీ పుత్రులు నూర్గురు కాక కైశ్యకులజుడైన యుయుత్సుడను కుమారుడు కలడు.

కౌరవులు నూర్గురు – దుర్యోధన (యుయుత్సు), దుఃశాసన, దుఃశిహ, దుఃర్మల, దుఃర్ముఖ, బిబింశతి, వికర్ణ, జలసుధ, సులోచన, వింద, అనుబింద, దుర్దష, సుబాహు, సుప్రదర్షన, సుర్మర్ధన, దురున్మాక, దుష్కన, కర్ణ, చిత్ర, ఉపచిత్ర, చిత్రాక్ష, చారంచిత్ర, అంగద, దుర్మద, దుష్టహర్ష, బిబిత్సు, వికట, సమ, ఉర్ణనాభ, పద్మనాభ, నంద, ఉపనంద, సేనాపతి, సుసేణ, కుండోదర, మహోదర, చిత్రభాను, చిత్రవర్మ, సుకర్మ, దుర్విలోచన, అయోబాహు, మహాబాహు, చిత్రచాప, సుకుండల, భీమనిగ, భీమబల, బలాకి, భీమవిక్రమ, ఉగ్రాయుధ, భీమశర, కనకాయు, దృఢాయుధ, దృఢకర్మ, దృఢక్షత్ర, సోమకీర్తి, అనూదర, జరాసంధ, దృఢసంధ, సత్యసంధ, సహస్రబాహు, ఉగ్రశ్రవ, ఉగ్రసేన, స్థిమమూర్తి, సేనాని, అపరాజిత, పండితక, విశాలాక్ష, దురాధన,దృఢహస్త, సుహాసి, కాంశనిగ, సువర్చ, ఆదిత్యకేతు, బల్బాశి, నాగదత్త, అగ్రయాయి, కవచి, నిషంగి, దండి, దండధార, ధనూగ్రహ, భీమరథ, వీర, వారబాహు, అలోలూప, అభయ, రౌద్రకర్మ, దృఢరథ, అనాధృష్య, కుండభేది, విరాగి, దీర్ఘలోచన, దీర్ఘబాహు, మహాబాహు, వ్యూఢోరు, కనకాంగద, కుండజ, చిత్రక.

## పాండవవంశ వర్ణన

ధర్మ, వాయు, ఇంద్ర, అశ్వనీకుమారుల అంశ వలన క్రమముగా యుధిష్టిర, భీమ, అర్జున, నకుల, సహదేవులు జన్మించిరి. సోమ తనయుడు వర్చః అర్జునుని కుమారుడు అభిమన్యునిగాను, అగ్ని అంశమున దుష్టద్యుమ్నుడు, రాక్షసాంశమున శిఖండి, విశ్వనామ దేవతలు ద్రౌపది పంచపుత్రులుగను కలిగిరి. యదువంశమందు శూరసేనునకు వసుదేవుడు కలిగెను. శూరసేనుని కన్య పృధను పినతండ్రి కుమారుడైన కుంతిభోజునకు పెంపకమిచ్చెను. ఆమె కన్యగా ఉన్నప్పుడు దుర్వాసుని వరముతో సూర్యుని వలన కుమారుని గాంచెను. కర్ణుడను అతడు వృషసేనుడను పేర పెరిగెను.

## యదువంశ వర్ణన

వాసుదేవుడు నారాయణ అంశ, బలభద్రుడు శేషుని అంశ, ప్రద్యుమ్నుడు సనత్కుమారుని అంశ. పదహారువేల అప్సరకన్యలు భూలోకమందు జన్మించి వాసుదేవుని భార్యలైరి. రుక్మిణి లక్ష్మీదేవి అంశను, ద్రౌపది శచీదేవి అంశను, సిద్ధి, ధృకుల అంశయందు కుంతి, మాద్రులు, మతి అనే కన్య సుబలను కుమార్తెగాను జననమొందిరి.

## 68. అష్ట షష్టితమ అధ్యాయము
## శకుంతలోపాఖ్యానము: దుష్యంతుడు

వైశంపాయనుడు జనమేజయునకిట్లనెను. “వివిధమైన వంశములను వర్ణించితిని. ఇక కురువంశ చరిత్ర చెప్పెదను. సావధానుడవై వినుడు”

పురువంశమందు దుష్యంతుడను రాజు కలడు. ఇతడు మహాబలుడు, ధర్మపరాయణుడు. ప్రజారంజకముగా రాజ్యమును పాలించుచుండెను.

## 69. ఏకోన సప్తతితమ అధ్యాయము
## దుష్యంతుడు వేటకు పోవుట

ఒకప్పుడు రాజు దుష్యంతుడు నానాశస్త్రధారులై వాహనారూఢులైన సేనతో వేటకు బయలుదేరెను. రాజును జనులు పొగుడుచుండ, బ్రాహ్మణులు ఆశీర్వచనము, పురస్త్రీలు మంగళవాక్యములు పల్కిరి.

రథారోహుడైన రాజు ఆతని సేన అడవి ప్రవేశించి సింహ, శార్దూల, వరాహ, హస్తి మొదలగు జంతువులను వేటాడిరి.

## 70. సప్తతితమ అధ్యాయము
## కణ్వఋషి ఆశ్రమ సమృద్ధి

వేటాడుచు రాజు, పరివారముతో మరియొక అడవి ప్రవేశించెను. అది అందమైన పూలమొక్కలతోను, నెమళ్లు మొదలగు అందమైన పక్షులతోను నిండి సువాసనలు నిండియుండెను. అందు ముళ్లుగాని, ముళ్లచెట్లుగాని లేవు. పక్షులు మనోహరముగా గానము చేయుచుండెను. ఇందు తిరుగు రాజు ఒక ఆశ్రమ పదము చేరెను.

అచ్చట మాలిని అను నదియందు హంస, బక, చక్రవాహాది పక్షులు కలవు. సింహ, వ్యాఘ్రాది వనమృగములు సాధువులై అచ్చెరువు కలిగించుచుండెను.

ఇది కశ్యపుని పుణ్యాశ్రమము. రాజు తన సేనలతో తను వచ్చువరకు ఉండమని కశ్యపాత్మజుడు కణ్వుని దర్శనము చేయ బయలుదేరెను.

వేదోచ్చారణ చేయుచున్నవారు, సంహిత చదువుచున్నవారు, యజ్ఞానుష్ఠాన క్రమ, పురాణ, న్యాయ, తత్వ, ఆత్మవివేక, శబ్దశాస్త్ర, ఛంద, నిరుత్తరాది నానాశాస్త్ర చర్చ చేయుచున్నవారు అయిన మునులను, పండితులను సందర్శించుచు ఆశ్రమ సమీపమునకు వచ్చెను. ఋషులు అతనిని ఆశీర్వదించి, కూర్చుండ ఆసనమిచ్చిరి. కొంత విశ్రమించి అతడు బయలుదేరెను.

## 71. ఏకో సప్తతితమ అధ్యాయము
## దుష్యంతుడు శకుంతలను చూచుట

నిర్జనముగా ఉన్న కణ్వుని కుటీర సమీపమున చేరిన రాజు యెవరున్నారని పిలువ, మధురహాసిని, రూపయవ్వనవతి, లోకలలామభూతయైన కన్య వచ్చి పిలచికొని పోయి అతనికి పాద్య, అర్ఘ్య, ఆసనములచే యధోచిత అతిథిమర్యాదలు చేసి వచ్చిన కారణమడిగిన రాజు మునిని సందర్శించుటకు వచ్చితినని, నీవెవ్వరివి? యెందులకు ఇచ్చటనుంటివన ఆమె తాను కణ్వుని కుమార్తెనని పల్క దుష్యంతుడు, ఊర్ధ్వరేతస్కుడైన కణ్వమహర్షికి నీకెట్లు కుమార్తెవైతివనగా, ఆమె తన వృత్తాంతము ఆతనికి తెలియబల్కెను.

### శకుంతల తన జన్మవృత్తాంతము రాజునకు తెలియజేయుట

పూర్వకాలము విశ్వామిత్రుడు కఠోరమైన తపస్సు చేయుచుండగా, ఇంద్రుడు తన పదవిని గ్రహిస్తాడేమోనను భయముతో అప్సర మేనకను రూప, యౌవన,

మధురవాక్య, అంగభంగి, కటాక్ష, హావ, భావ, హాస్య ప్రభుతులతో ఆతని తపస్సు విఘ్న చేయుమన, ఆమె ఇంద్రునితో "దేవరాజా! నేను అబలను. కోపావిష్టుడు, వశిష్టుని నూర్గురు కుమారులను చంపినవాడు, అభిషేకక్రియకు కౌసికి నదిని రప్పించినవాడు, నక్షత్రమండలమును సృష్టించినవాడు, అభయమిచ్చిన త్రిశంకునకు వేరే స్వర్గము చేసినవాడు అయిన ఆ ఋషిని యే విధముగా హర్షింప చేయగలను? మీరు నాకు ముని కోపమునుండి నాశనము కాకుండునట్లుగాను, నేను అతని కడకు వెడలి నాట్యము చేయునప్పుడు వాయువు నా వసనమును ఉద్దీపనము చేయునట్లు, పృష్టము సుగంధము వెదజల్లునట్లు, మన్మధుడు సాయపడునట్లు వరమీయుడు" అన ఇంద్రుడు "తథాస్తు" అనెను. మేనక విశ్వామిత్రుని ఆశ్రమమునకు బయలుదేరెను.

## 72. ద్విసప్తతితమ అధ్యాయము

## విశ్వామిత్రుని తపోభంగము

మేనక విశ్వామిత్రుని వద్దకు వచ్చి నమస్కరించి నాట్యము చేయుచుండ వాయువు సమయము చూసి ఆమె పరిధేయవసనము హరించి దూరముగా నిక్షేపము చేసెను. లజ్జతో తీసుకొనపోవుచున్న మేనకను చూసిన ముని మన్మధబాణ జర్జరితుడై ఆమెను చేరబిలచి తప, జపాదులు వదలి రతిక్రీడలలో పరమసుఖమున కాలము గడుపసాగెను.

## శకుంతల పుట్టుక

కొంత కాలమునకు మేనక గర్భవతియై సద్యోజాత కన్యకను మాలినీ నదీతీరమున వదలి ఇంద్రసభకు పోయెను. ఆ బాలికను శకుంతము పెంచుట చూసిన కణ్వమహర్షి తీసుకొని వచ్చి శకుంతముల చేత పెంచబడినది కాన శకుంతల అని పేరిడి పెంపుచేసెను.

## 73. త్రిసప్తతితమ అధ్యాయము

## వివాహప్రస్థావనము

శకుంతల పూర్వ వృత్తాంతము విని దుష్యంతుడు ఆమెతో "నీవు రాజకుమార్తెవు. నా రాజ్యము, సంపదలు ఇకముందు నీవే. నన్ను గాంధర్వ విధానమున వివాహము చేసుకొనవలసినది" అని పల్కెను.

తన తండ్రి తిరిగి వచ్చిన తరువాత అతని అనుమతితో వివాహమాడవలసిన

దనిన శకుంతలతో రాజు "నీ శరీరముపై నీకే హక్కు కలదు. దాని మంచి నీవే అధికముగా కోరెదవు కదా! అందులకు యధేచ్ఛగా నీవు స్వయముగా నాకు అర్పణము కావలసిది."

"ధర్మశాస్త్రమందు అష్టవిధములైన వివాహక్రియలు కలవు. బ్రహ్మ, దేవ, ఆర్య, ప్రజాపత్య, అసుర, గాంధర్వ, రాక్షస, పైశాచికములు. బ్రాహ్మణులకు ఉచితమైనవి బ్రహ్మ, దేవ, ఆర్య, ప్రజాపత్యములు. క్షత్రియులు అసుర, పైశాచికముల తప్ప మిగిలిన ఆరు విధముల పెండ్లాడవచ్చును. అందువలన నీవు రాక్షస, గాంధర్వ విధానములతో వివాహమునకు అంగీకరింపవలసినది" అని పలికెను.

శకుంతల తన గర్భమందు జననమందు కుమారునకు రాజ్యాభిషేకము చేయుటకు సిద్ధమైన వివాహము చేసుకొనెదననెను.

## దుష్యంత-శకుంతలల వివాహము

రాజు అంగీకరించి, గాంధర్వవిధిని ఆమెను వివాహమాడి, కొంతసేపు రతిక్రీడల తేలి, త్వరలోనే రథాదులను పంపి ఆమెను పిలవనంపెదనని నమ్మించి, కణ్వుడు యేమి అనుకుంటాడో అనుకుంటూ రాజధానిని చేరెను,

ఆశ్రమమునకు తిరిగి వచ్చిన ముని తనను చేరరాని శకుంతలను చూసి దివ్యజ్ఞానమున సంగతిని అవగతము చేసుకొని ఆమెను నీవు తప్పు చేయలేదని, గాంధర్వము రాజులకుచితమైనదే అని ఆమెను ఓదార్చి మనస్సునకు శాంతి కలిగించి ఆమె కోరికపై పురువంశీయులు అధర్మపరాయణులు, రాజచ్యుతులు కాకుండా ఆశీర్వదించెను.

## 74. శకుంతలకు భరతుడు జన్మించుట

యథాకాలమున శకుంతలకు, మహాబల పరాక్రాంత, అలౌకిక రూపగుణ సంపన్నుడు అయిన కుమారుడు కలిగెను. అతడే భరతుడు. ముని మూడు సంవత్సరములు బాలునకు రాగానే జాతకర్మాది సంస్కారములు చేసెను. ఆరు సంవత్సరముల వయస్సు వచ్చుసరికి బాలుడు సింహ, వ్యాఘ్రాదులను భయములేక దండించుచు, కట్టుచూ, ఆడుకొనుట చూసి మునులు అతనిని సర్వదమనుడని పిలువసాగిరి. కుమారుడు యువరాజు అగుటకు సమయమాయె నని ముని శిష్యగణములతో కుమార్తెను, మనుమని భర్తృగృహమునకు అంపెను.

## శకుంతల పతి గృహమునకేగుట

శకుంతలను, కుమారుని రాజువద్దకు చేర్చి ముని శిష్యులు రాజును ఆశీర్వదించి రాజునకు కుమారునితో శకుంతలను అర్పించి ఆశ్రమమునకు తిరిగిపోయిరి. శకుంతల రాజుతో తనను గాంధర్వముగా వివాహమాడినప్పుడు అతడు చేసిన ప్రతిజ్ఞను జ్ఞాపకము చేసి భరతుని యువరాజు చేయుమనెను.

## దుష్యంతుడు శకుంతలను నిరాకరించుట

శకుంతల మాటలు వినిన దుష్యంతుడు "ఓ తాపసీ, నీవెవ్వరవో నాకు తెలియదు. నేను నిన్ను ఎన్నడూ చూడలేదు. నీతో నాకు యెటువంటి సంబంధమూ లేదు. దురాత్మురాలా, నీవు వెంటనే ఇచ్చటనుండి వెడలిపొమ్ము" అని పలుక శకుంతల మొదట లజ్జా, దుఃఖములతో స్తంభితురాలై పిదప క్రోధముతో, రక్తవర్ణ నేత్రములతో రాజును దగ్ధము చేయునటుల చూసి "నీవు నాకేమియు తెలియదనుచున్నావు. కాని నీవు చెప్పుచున్నది నిజమో అబద్ధమో నీ మనస్సుని అడిగి చూడు. తెలుస్తుంది. నీవు చేసిన కార్యము యెవరూ చూడలేదు అనుకొనుచున్నావేమో! కణ్వమహర్షి దివ్యదృష్టి సంపన్నుడు. అతనిని నీవు మోసగించలేవు. అదేకాక సూర్య, చంద్ర, వాయు, అగ్ని, స్వర్గ, పృధ్వి, జరి, మనో, ఆయ, దివా, రాత్రి, ప్రాతః, సంధ్య, ధర్మములు మనుష్యుని సమస్త వృత్తాంతము తెలుసుకొనుచున్నవి. పాపాత్ములు నిజమును దాచుటకు ప్రయత్నింతురు. నేను పతివ్రతను. నేనే నీ కడకు వచ్చితిని కాన నీవు నన్ను అవమానించుచున్నావు. నా మాటలు నీవు మన్నించకపోయిన నీ శిరస్సు వేయిముక్కలు అవుతుంది. పున్నామనరకమునుండి రక్షించు కుమారుని ముఖమైన చూసి నీవు నిజము పలుకుట మంచిది. భార్య గౌరవమే భర్తకు గౌరవము. నన్ను నీవు అవమానించిన నిన్ను నీవే అవమానించుకున్నట్లగును. పతి భార్యా గర్భమునుండి కుమారునిగా జన్మించును కాన భార్య తల్లివలె గౌరవించతగినది. రతి, ప్రీతి, ధర్మములకు సతియే మూలమని గ్రహింపుము. పిపీలికాదులు కూడా తమ అండములను రక్షించుకొనును. కాని నీవు నీ కుమారుని పరిత్యజించుటకు సిద్ధపడుచున్నావు. నా అదృష్టమే ఇట్లున్నది కాబోలు. చిన్నపుడు తల్లిదండ్రుల మోము కూడా చూడలేదు. నేడు పతిని కూడా పోగొట్టుకొనుచున్నాను" అని శకుంతల పలికెను.

దుష్యంతుడు శకుంతల మాటలను పెడచెవిని పెట్టి ఆమెను అనేక విధముల దుర్భాషలాడెను.

శకుంతల తన తల్లిదండ్రులను దుర్భాషలాడిన రాజును తృణీకరించి, నీవు నన్ను చేరదీయకపోయినంత మాత్రమున నేను భయపడను. నా కుమారుడు ఒక దినమున ఈ సామ్రాజ్యమునకు తప్పక రాజగును అని తీవ్రముగా పలికెను.

## ఆకాశవాణి పలుకుట

ఆ సమయమున ఆకాశవాణి "ఓ రాజా! దుష్యంతా! శకుంతల నిజము చెప్పుచున్నది. ఆ బాలకుడు నీ కుమారుడే. నీవు శకుంతలను అవమానించవలదు. భరత వాక్యమున నీవు కుమారుని స్వీకరించుచున్నావు కాన ఇతడు భరతుడని పిలవబడును" అని పలికెను.

రాజు మంత్రులు, పురోహితులతో ఇట్లనెను. "మీరు దైవవాణి పలుకులు విన్నారు కదా! శకుంతల నా భార్య అనియు, ఆమె బాలకుడు నా కుమారుడే అని తెలిసియే లోకాపవాదమునకు భయపడి ఆమెతో వాదించవలసి వచ్చినది" అని పలికి భార్యను, కుమారుని ఆదరించి ఆనందంతో కుమారుని యౌవరాజ్యాభిషిక్తుని చేసెను.

(ఆదిపర్వాంతర్గత సంభవపర్వాధ్యాయ శకుంతలోపాఖ్యానము సమాప్తము)

## 75. పంచ సప్తతితమ అధ్యాయము
## సాధారణ సృష్టివర్ణన

వైశంపాయనుడు జనమేజయునితో దక్షప్రజాపతి, వైవశ్వతమనువు, భరత, కురు, పురు, అజామీళ, యదు, కౌరవ వంశములను సవిస్తరముగా చెప్పెను.

ప్రచేతునకు మొదట పదిమంది కొడుకులు కలిగిరి. వారందరూ రాక్షసులైరి. తరువాత దక్షుడను కొడుకు జన్మించెను. అతడే సృష్టికి కారకుడు. దక్షునకు వారిణియందు వేయిమంది కొడుకులు పుట్టిరి. వీరిలోని నారదుడు సాంఖ్యశాస్త్ర పారంగతుడు. తరువాత దక్షుడు యాభైమంది కన్యలను సృజించి, పదిమందిని ధర్మునకు, పదముగ్గురను కశ్యపునికి, ఇరువది యేడుగురిని చంద్రునకు ఇచ్చెను. కశ్యపుని భార్యలలో దాక్షాయణి ముఖ్యురాలు. ఆమెకు ద్వాదశ ఆదిత్యులు కలిగిరి. తదుపరి కశ్యపునకు దేవతలు, వివశ్వానుడు కలిగిరి. వివశ్వానునకు ఇద్దరు కుమారులు. వైవశ్వత మనువు, యముడు. మనువు నుంచి బ్రాహ్మణ, క్షత్రియాదులు జన్మించిరి కాన వారిని మానవులందురు. వేన, ధృష్ట, వరిష్యంత, నాభాగ, ఇక్ష్వాకు, కారుష, శర్యాతి, ఇలా, పుషధ్ర, నభాగారిష్టాది పదిమంది మను తనయులు క్షత్రియులైరి. ఇలుని కుమారుడు పురూరవుడు. ఇలుడే అతని

తల్లి, తండ్రి. పురూరవుడు బ్రాహ్మణులతో యుద్ధము చేసి వారి సంపదలు లాగుకొనెను. సనత్కుమారుడు చెప్పిన విధముగా యజ్ఞము చేయక ఋషులవల్ల శాపము పొందెను.

పురూరవుడు గంధర్వులతో స్నేహము చేసి ఊర్వశిని తెచ్చుకొనెను. వారికి ఆయు, ధీమాన, అమానసు, దృఢాయు, దనాయు, శతయు అను ఆర్గురు కుమరులు కల్గిరి.

నహుష, వృద్ధశర్మ, రాజాజ్ఞ, అనీవశువను నల్గురు పుత్రులు, ఆయు, స్వర్భానవీరలకు కలిగిరి.

నహుషుడు పరాక్రమశీలుడైన రాజు. ఇతనికి యతి, యయాతి, సంయాతి, అయాతి, అయతి, ధృవ అను ఆర్గురు పుత్రులు కల్గిరి.

యతి యోగబలమున బ్రహ్మత్వము పొందెను. యయాతి స్వీయ భుజబలమున సుస్థిరమైన రాజ్యమును చక్కగా పాలించెను.

## యయాతి చరిత్ర

యజ్ఞయాగాదులు చేయుచు యయాతి ధర్మయుక్తముగా రాజ్యపరిపాలన చేసెను. అతనికి ఇద్దరు భార్యలు. దేవయాని, శర్మిష్ఠ. దేవయాని వలన యదు, తుర్వాశులను ఇద్దరు కుమారులు, శర్మిష్ఠ వలన దృహ్యు, అను, పురు అను ముగ్గురు కొడుకులను పొందెను. శుక్రాచార్యుల వలన శాపగ్రస్తుడైన యయాతి జరాక్రాంతుడై కుమారులను వారి యౌవ్వనము ఇవ్వమని కోర 'పురు' అంగీకరించెను. యయాతి అతనిని రాజుగా చేసి కుమారుని యవ్వనముతో ఉభయ భార్యలతో వేయి సంవత్సరములు గడిపినా తృప్తి పొందక చైత్రరథమను కుబేరోద్యానములో విశ్వాచి అను అప్సరకన్యతో ఇంతకాలము గడిపి అప్పటికిని తనివి తీరక ఇట్లనుకొనెను. అగ్నిలో వేసిన నేయి విధముగా కామ్యవస్తువులను అనుభవించుచున్న కొలది కామము అధికమగునే కాని తగ్గదు. పృధ్విపైనున్న సకల భోగములను, సుఖములను సమకూర్చి ఇచ్చినా మనుష్యుడు తృప్తిని పొందదు కదా! అందువలన శాంతమైన పద్ధతిని అవలంబించుటయే మేలు. మనోవాక్కాయ కర్మల లోకుల శుభచింతన చేయువాడే బ్రహ్మతుల్యులని భావించి కుమారుని పిల్చి ఆతని యవ్వనము తిరిగి ఇచ్చి అనశనవ్రతావలంబియై భార్యలతో దేహత్యాగము చేసి స్వర్గమునకేగెను.

# 76. షట్ సప్తతితమ అధ్యాయము
# దేవయాని చరిత్ర

జనమేజయుడు వైశంపాయనునితో "ఓ తపోధనా! మా పూర్వపురుషుడు, పదవ ప్రజాపతియైన యయాతి యే విధముగా శుక్రతనయ దేవయానిని వివాహమాడెనో తెలియజేయవలసినది' అని కోరగా వైశంపాయనుడు ఈ విధముగా చెప్పసాగెను.

పూర్వము దేవదానవుల యుద్ధకాలమందు దేవతలు బృహస్పతిని, రాక్షసులు శుక్రాచార్యుని తమ తమ గురువులుగా ఉంచుకొనిరి. ఇందువలన వారిద్దరి మధ్య ప్రతిద్వందిత ప్రబలెను. యుద్ధమున చనిపోయిన రాక్షసులను శుక్రుడు తన మృతసంజీవని విద్యతో మరల బ్రతికించుచుండెను. కాని ఆ విద్య తెలియని దేవగురువు మృతినొందిన దేవతలను బ్రతికించలేకపోయెను.

దేవతలు బృహస్పతి కుమారుడైన కచుని, వృషపర్వుని వద్దనున్న శుక్రాచార్యుని, అతని కుమార్తె యొక్క మనస్సు చూరగొని మృతసంజీవిని విద్యతో తెలుసుకొనదగినవాడవు నీవే అని అతనిని కోర అపుడు 'తథాస్తు' యని వృషపర్వుని వద్ద కొలువున్న శుక్రుని సమీపించి "ఆచార్యా, నేను అంగీరసుని పౌత్రుడను, బృహస్పతి పుత్రుడను. వేయి సంవత్సరములు బ్రహ్మచర్యవ్రతము చేసి, మిమ్ములను గురువుగా స్వీకరించదలచియున్నాను. నన్ను అనుగ్రహింపుము" అని కోరగా శుక్రాచార్యుడు అతని బ్రహ్మచర్యము అవలంబనకు అనుమతి ఇచ్చెను.

## శుక్రుని వద్ద కచుని శిష్యరికము

భృగు పుత్రుడైన శుక్రాచార్యుని వలన బ్రహ్మచర్య దీక్షను పొందిన కచుడు గురువును, అతని కుమార్తె దేవయానిని ఆరాధింప మొదలిడెను. ఈ విధముగా అయిదు వందల సంవత్సరములు గడచిపోయెను. కచుని ఉద్దేశ్యము తెలిసికొనిన రాక్షసులు కచుని సంహరించి కుక్కలకు, నక్కలకు ఆ మాంసము తినిపించిరి. కచుడు రాకపోవుట గమనించిన దేవయాని తండ్రి ప్రార్థింప అతడు దివ్యదృష్టిని సంగతి తెలిసికొని కచుని మృతసంజీవని విద్యతో బ్రతికించెను. ఇదేవిధముగా మరల జరిగెను. మూడవమారు రాక్షసులు కచుని చంపి భస్మము చేసి, ఆ భస్మమును శుక్రాచార్యుడు త్రాగిన సురలో కలిపిరి. కచుని కొరకై దేవయాని రాగా శుక్రుడు మరల కచుని మృతసంజీవని విద్యతో ఆహ్వానించెను. గురుని జఠరమునుంచి కచుడు మెల్లగా గురునిచే ప్రసాదింపబడిన స్మరణ శక్తితో తనను

భస్మము చేసి సురలో కలిపి త్రాగుటకు ఇచ్చిన సంగతి చెప్పెను. గర్భమున ఉన్న శిష్యునకు శుక్రుడు మృతసంజీవిని విద్య నేర్పెను.

## కచునకు సంజీవినీ విద్య లభించుట

సంజీవిని విద్య పొందిన కచుడు గురుని శరీరము ఛేదించుకొని బయలు వెడలి గురుని పునర్జీవితుని చేసెను. సుర కారణమున ఈ సంఘటన జరిగె కావున శుక్రుడు "నేటినుండి సురను పానము చేసిన బ్రాహ్మణులు ఇహపర లోకములనుండి వంచితులగుదురు గాక" అని శపించెను. వేయి సంవత్సరములు బ్రహ్మచర్యము పూర్తిచేసుకొని కచుడు గురుని అనుమతి తీసుకొని దేవలోకమునకు ప్రయాణమయ్యెను.

## 77. సప్త సప్తతితమ అధ్యాయము
## దేవయాని కచుని వివాహమాడగోరుట

తన పితృగృహమునకు వెడలిపోవుచున్న కచుని దేవయాని కలసికొని అతనిపై తన మనస్సు లగ్నమయి ఉన్న సంగతి తెలిపి వివాహాడగోరెను. కచుడు నీవు నా గురుపుత్రివి. నీవలె నేను గురుని శరీరమునుండి వచ్చితిని. నన్ను అనుచితమైన కార్యము చేయుమని కోరవలదు. క్షమింపుమని దేవయానితో పలికెను.

## కచుడు-దేవయాని పరస్పరము శపించుకొనుట

దేవయాని కచుని నీ సంజీవిని విద్య ఫలించకుండుగాక అని శాపమిచ్చెను. కచుడు ఆమెతో "నేను అధర్మమునకు వెరచి నీకు చెప్పిన మాటలు నీకు రుచించలేదు. నీ శాపము ధర్మమైనది కాదు. మరియే బ్రాహ్మణ కుమారుడు కూడా నిన్ను వరించడు" అని ఆమెకు ప్రతిశాపమిచ్చి, మరల "నీ శాపప్రకారము ఈ విద్య నా వలన కాకపోయినా, నేను నేర్పినవారికి తప్పక ఫలమునిచ్చును" అని పలికి త్వరితగతిని స్వర్గమునకు తిరిగివచ్చి దేవతలకు ఆనందము కలిగించెను.

## 78. అష్ట సప్తతితమ అధ్యాయము
## దేవయాని-శర్మిష్ఠల వివాదము

మృతసంజీవిని విద్య పొందిన దేవతలు శత్రుకుల సంహారణార్థము బయలుదేరిరి. దారిలో సరోవరమున జలక్రీడలాడుచున్న కన్యల వలువలు

వాయురూపధారియై ఇంద్రుడు కలిపివేసెను. సరిగ్గా చూడని వృషపర్వ కన్య శర్మిష్ఠ ధరించిన చీర దేవయానిది. దేవయాని కోపమతో నా వలువ నీవు ధరించితివి. ఈ నీ సాహసము క్షమించరానిది. దీని వలన నీకు శ్రేయస్సు జరగదు" అని అనగా శర్మిష్ఠ హేళన చేయుచూ "నా తండ్రి వద్ద నీ జనకుడు నిమ్న ఆసనమున కూర్చుండి పొగడుచు నా తండ్రి ఇచ్చినది పుచ్చుకొనును. నీ కోపతపములకు నేను భయపడుదానను కాను" అని అనెను.

## దేవయానిని నూతియందు త్రోసివేయుట

కోపముతో దేవయాని తన చీర బలవంతముగా తీసుకొనబోవ శర్మిష్ఠ ఆమెను ఒక పాడుపడిన నూతియందు త్రోసి చనిపోయినదని భావించి, స్వగృహమునకు మరలిపోయెను. వేటకై వచ్చిన నహుష తనయుడు యయాతి రోదన స్వరము విని బ్రాహ్మణ కన్యగ తెలిసికొని దక్షిణ హస్తము పట్టుకొని కూపము నుండి బయలు తీసి స్వాంతవచనములాడి తన దారిని పోయెను.

దేవయాని పురము ప్రవేశించక తండ్రి వద్దకు ఘూర్ణిక అను దాసిని పంప ఆమె సభాస్థలియందున్న శుక్రాచార్యుని పిలుచుకొని వచ్చెను. దేవయాని వలన అన్ని సంగతులు తెలిసికొనిన శుక్రాచార్యుడు "నీవు చింతించవలదు. దీని ప్రతీకారము నేను ఆలోచించుచున్నాను. నీ తండ్రి బ్రహ్మను తృప్తిపరచువాడు కాని బిచ్చగాడు కాదు" అని ఆమెను ఓదార్చెను.

## 79. ఏకోన అశీతితమ అధ్యాయము
## వృషపర్వునిపై శుక్రుడు కోపించుట

శుక్రాచార్యులు అనేక విధముల కోపము యొక్క దుర్లక్షణముల, వానివల్ల జరుగు కీడు కుమార్తెకు చెప్పి శాంతింపచేయ ప్రయత్నించెను. దేవయాని తండ్రితో శిష్యులు, అశిష్యులవలె ప్రవర్తించినపుడు, కౌలీన్యాదులు ఆచారవ్యవహారములు తెలియ ప్రవర్తించినపుడు అటువంటి స్థలముల నుండుట బుద్ధిమంతుల లక్షణము కాదని చెప్పి తండ్రిని క్రోధాన్వితుని చేసెను.

## 80. అశీతితమ అధ్యాయము
## శుక్రుడు వృషపర్వునితో సంబంధము తెంపుకొనుట

కోపించిన శుక్రుడు వృషపర్వుని వద్దకు వచ్చి "రాజా! ఒకడు చేసిన తప్పుకు ఫలితము వాడే కాక వాని సంతతి కూడా అనుభవించవలసి వచ్చుచుండును.

నీవు నీ అనుయాయులచే ధర్మపరాయణుడు, సుశీలుడు, శుశ్రూషాపరుడు, నా ప్రియశిష్యుడైన కచుని అనేక విధముల బాధించి, చంపించితివి. నీ కుమార్తె దేవయానిని మృత్యుముఖమున త్రోసి అపరాధము చేసెను. నేటినుండి నీతో నేను ఎటువంటి సంబంధము ఉంచుకొనను” అని తీవ్రముగా పలికెను.

వృషపర్వుడు వినీతుడై గురునకు నమస్కరించి నేను, నా సంపత్తు, నా పరివారము నీ అధీనులము. మీరు శాంతింపవలసినదని పరిపరి విధముల వేడుకొనగా శుక్రుడు తన ప్రియమైన కుమార్తెను శాంతింపచేయుమని వృషపర్వుని ఆజ్ఞాపించెను. దేవయాని, రాక్షసరాజుతో అతని కుమార్తెను, వేయిమంది అసురకన్యలతో తనకు దాసిగా ఉండవలెననియు, తన వివాహానంతరము కూడా తనతోనే దాసీగా రావలసియుండుననియు చెప్పెను. వృషపర్వుడు కుమార్తెను పిలిచి, గురువు దేవయాని రాక్షసకులమును వీడిపోకుండా, దేవయాని చెప్పినట్లు నడచుకొనుమని కుమార్తెకు చెప్పెను.

## శర్మిష్ఠ దేవయాని దాసియగుట

తండ్రి ఆజ్ఞానువర్తియై శర్మిష్ఠ వేయిమంది రాక్షస కన్యలతో దేవయాని వద్దకు వచ్చి “నీవు కోరిన విధముగానే నీకు ఊడిగము చేయవచ్చితిని” అని పలుక దేవయాని “నీవు దీనముగా దాసీత్వము చేయుదువా? నీవు రాజనందినివి కావా?” అని హేళన చేయ శర్మిష్ఠ “నిజకులమును నాశనము కాకుండా రక్షించుకొనుటకై యెటువంటి పనియైనా చేయవలెను. నా వంశరక్షణకై నీ దాసీత్వమునకు ఒప్పుకొంటిని” అని వచించెను.

సంతృప్తి చెందిన దేవయాని, శుక్రులతో వృషపర్వుడు పరివారముతో పురము ప్రవేశించెను.

## 81. ఏకాశీతితమ అధ్యాయము

## యయాతితో దేవయాని కలయిక

ఒకనాడు యయాతి వేటాడుతూ, దాహముతో జలాశయము వెదకుడూ శర్మిష్ఠ పాదసంవహనము చేయుచుండ సఖీ పరివృతయైనున్న దేవయానిని కాంచి వారెవరో తెలిసికొనెను. రాజును చూసి అతని రూప, గుణములకు ముగ్ధయై దేవయాని అతనిని పరిణయమాడ ఇచ్ఛను ప్రకటించెను.

## దేవయాని యయాతిని వివాహమాడుట

యయాతి తాను క్షత్రియుడనని, దేవయాని బ్రాహ్మణ కన్య కాన ఆమెను వివాహమాడిన ధర్మచ్యుతుడ నవుదునని సంశయించుట చూసిన దేవయాని, "ఓ రాజా! నాడు కూపమునుండి నా కుడిచేయి పట్టి నీవు నన్ను బయటకు తీసితివి. కన్య దక్షిణ హస్తము గ్రహించుట వివాహముతో సమానము. నీవు సంకోచింపవలదు" అనగా యయాతి "నీ తండ్రి స్వహస్తములతో సంప్రదానము చేసిన వివాహమాడుదు"నని పల్కెను. దూతిక చేత పిలువనంపబడిన శుక్రుడు యయాతికి కుమార్తె పాణిగ్రహణము జరిపి, "శర్మిష్ఠ నీకు పూజనీయురాలు. ఆమెను ఎట్టి పరిస్థితులలోను వివాహమాడవలదని" చెప్పెను.

## 82. ద్వాశీతితమ అధ్యాయము

## యయాతి శర్మిష్ఠను గ్రహించుట

యయాతి దేవయానిని ఆమె చెలికత్తెలైన శర్మిష్ఠ మొదలైనవారిని తన నగరమునకు తీసుకొనివచ్చి దేవయానిని అంతఃపురమందుంచి, శర్మిష్ఠను అశోకవన సమీపమున నిర్మించిన గృహమందుంచెను.

దేవయాని యయాతితో సుఖములనుభవించుచు కొంతకాలమునకు చక్కని కుమారుని కాంచెను.

అశోకవనమందు విహరించుచున్న రాజును ఒకరోజు శర్మిష్ఠ చేరి తన రూపయవ్వనములను చరితార్థము చేయుమన అతడు శుక్రుని మాటలామెకు తెలుప, శర్మిష్ఠ "రాజా! సాక్ష్యమిచ్చినప్పుడు, విచారణ చేయు స్థలమందు అబద్ధము చెప్పుట తప్పు. పరిహాస ప్రసంగములందు, స్త్రీ మనస్సు రంజింపజేయునపుడు, వివాహకాలమందు, ప్రాణసంకట సమయమందు, సర్వస్వము నాశనము పొందు నపుడు, మిథ్యా వ్యవహరించుట తప్పు కాదు. అదియే కాక నా సఖిని వరించినప్పుడే నన్నూ వరించినట్లయినది. ఆర్తినైన నన్ను రక్షించుట నీ ధర్మమతి" అని పలుక రాజు ఆమె కోర్కెకు అంగీకరించి తృప్తిపరచెను. వృషపర్వుని కన్యకకు యయాతి సహయోగమున చక్కని కుమారుడు జన్మించెను.

## 83. త్రీశీతితమ అధ్యాయము

## 'యదుడు' మొదలైనవారి జననము

శర్మిష్ఠకు కుమారుడు కలిగిన సంగతి తెలుసుకొనిన దేవయాని ఆమె వద్దకు వచ్చి కామాంధురాలవై నీవిటువంటి పాప కార్యమెందులకు చేసితివనగా

శర్మిష్ఠ తను ఋతిమతియైయున్న యెడల ఒక ధర్మపరాయణుడైన ముని రాగా అతనిని వేడితినని, ఆతని వల్లనే తనకు కుమారుడు కలిగెనని, తాను అధర్మాచరణ చేయలేదని, అతని పేరు మాత్రము తెలిసికొనలేకపోయితినని చెప్ప దేవయాని తృప్తి చెంది నిజనివాసమున కేగెను.

దేవయానికి యదు, తుర్వాసు అను ఇద్దరు కుమారుల, శర్మిష్ఠకు దృహ్యా, అను, పురు అను ముగ్గురు కుమారులు కలిగిరి.

ఒకనాడు వనమందు విహరించుచున్న దేవయాని, యయాతులు ముగ్గురు చక్కని కుమారులను చూసిరి. దేవతుల్యులైన వారిని చేరి దేవయాని మీరెవ్వరు? మీ తల్లిదండ్రులెవరు అని అడుగ, వారు యయాతిని తండ్రిగా చూపిరి.

శర్మిష్ఠ అచ్చటకు వచ్చి యయాతే ఆ ముని అని, అతని వలననే తనకు ఈ ముగ్గురు కుమారులు కలిగిరి అని, నీకు భర్త అయినపుడే నాకు కూడా భర్త అయినాడని నిర్భయముగా చెప్పెను. రోదించుచు దేవయాని తండ్రిని చేరెను. ఆమె వెనువెంటనే యయాతి కూడా శుక్రుని కడ కేగి నమస్కరించెను.

దేవయాని రాజు చేసిన మోసము తెలుప శుక్రుడు కోపించి జరాక్రాంతుడవు కమ్మని యయాతిని శపించెను.

తను ఇంకా యవ్వన సుఖములచే పరితృప్తుడను కాలేదని వేడిన రాజునకు శుక్రుడు వారి కోరికపై ఇతరులనెవ్వరియందైనా జరను సంచరింపచేయగలవని, నీ వార్ధక్యము తీసుకొనిన కుమారుడే నీ రాజ్యమునకు అధికారి కాగలడని చెప్పెను.

## 84. చతురశీతితమ అధ్యాయము
## 'పురు' తండ్రి వృద్ధాప్యము గ్రహించుట

నగరమునకు తిరిగి వచ్చి యయాతి ఒక్కొక్క కుమారుని కలసికొని తన జరను తీసుకొనమని వేయి సంవత్సరముల పిదప తను వృద్ధాప్యమును తిరిగి తీసుకొందునని కోరెను.

వృద్ధాప్యమును తీసుకొన నిరాకరించిన 'యదు'ని నీ వంశపరంపరయందు ఎవ్వరూ రాజ్యాధికారము పొందరని, 'తుర్వాసుని' నిర్వంశుడవు కమ్మని, రాక్షస, చండాలురకు రాజువు కమ్మని శపించెను.

జరను తృణీకరించిన శర్మిష్ఠా తనయులలో దృహ్యుని కోరికలు తీరక,

గజ, రథ, అశ్వాదులు చరించని యెడారియందు వసింతువని, 'అను'డను కుమారుని జరాక్రాంతుడవు కమ్మని, నీ సంతానము యవ్వనప్రాప్తి కాకుండానే మృతిచెందుదురని శాపమిచ్చెను.

తుదకు కడపటి కుమారుడైన పురుని చేరి తనకోరిక తెలియజేయ అతడు అంగీకరించెను. యయాతి శుక్రుని స్మరించి స్వకీయ జరను పుత్రునియందు సంచరింపచేసెను.

## 85. పంచాశీతితమ అధ్యాయము
## పురుని రాజుగా చేయుట

వైశంపాయనుడిట్లనెను. రాజా! ఈ విధముగా కుమారుని యౌవ్వనము పొందిన యయాతి యజ్ఞములచే దేవతలను, శ్రాద్ధముచే పితృలోకమును, అనుగ్రహముచే దీనులను, కోరికలు తీర్చుచూ ద్విజులను, అన్నపానాదులచే అంధులను తృప్తిపరచి ధర్మయుక్తముగా పాలించుచూ ఇరువురు భార్యలతో విషయవాంఛల పరితృప్తి చెందుచూ వేయి సంవత్సరములు రాజ్యము చేసి కుమారుడైన పురుని చేరబిలచి "నాయనా! నీ యౌవ్వనము గ్రహించి నేను విషయభోగములను పెక్కేండ్లు గడిపినాను. కామ్య వస్తువులను అనుభవించుటచే కామము పెరుగునే కాని తరుగదు. ఈ భూమిపైనున్న సమస్త ధన, ధాన్య, హిరణ్య, పశు, రమణులాది సంపదలిచ్చినా మనిషి కోరిక తీరదు. భోగతృష్ణను పరిత్యజించుటే సరియైన పని. శరీరము జీర్ణించినా ఆశ చావదు. ఆ ప్రాణాంతకమైన ఆశను పరిత్యజించిననాడే సుఖపడును. నేను ఆశను వదలి నేడే తపోవనములకు పోవుచున్నాను. నీవు నీ యౌవ్వనము గ్రహించి నా జరను ఇవ్వవలసినది" అని పలికి తాను వృద్ధాప్యమును తీసుకొని కుమారుని యౌవ్వనవంతునిగా చేసి చాతుర్వర్ణముల వారిని పిలచి తన కోరిక ప్రకారము పురుడు యౌవ్వనమిచ్చుట, శుక్రాచార్యుడు జరను తీసుకొనిన కుమారుడే రాజగునని వరమిచ్చుట మొదలైన సంగతులు చెప్పి వారిని అంగీకరింపచేసి చిన్నకుమారుడైన పురుని రాజుగా చేసెను.

యయాతి తపస్వియై బ్రాహ్మణులతో కూడి వనవాసమున కేగెను. తదుపరి 'యదు'ని వలన యాదవ వంశము, తూర్వాసుని వలన యవనులు, దుహ్యుని వలన వైభోజ్యులు (శూద్రులు), 'అను'ని వలన మ్లేచ్ఛులు, పురుని వలన పౌరవ వంశము కలిగెను. జనమేజయ మహారాజా! నీవు ఆ పురువంశీయుడవు సుమా!

# 86. షడశీతితమ అధ్యాయము

## యయాతి తపస్సు

వైశంపాయనుడు, జనమేజయునితో "మహారాజా! కుమారుడైన పురుని రాజ్యాభిషిక్తుని చేసి యయాతి వానప్రస్థాశ్రమము స్వీకరించి కొంతకాలమునకు సురలోకమును చేరెను. దేవరాజు ఇంద్రునిచే భూతలముపై పతితుడయ్యెను. స్వర్గభ్రష్టుడైన యయాతి పతనము చెందక, అంతరిక్షముననే ఉండి వసుమానుడు, అష్టకుడు, ప్రతర్దనుడు, శిబి రాజులతో కూడి మరల స్వర్గలోకమున కేగెనని జనస్మృతి కలదు" అన, జనమేజయుడు వ్యాసశిష్యుని "యయాతి స్వర్గమునుంచి బహిష్కరింపబడుటకు కారణమేమి? సవిస్తరముగా దయచేసి చెప్పవలసినది" అని కోరెను.

వైశంపాయనుడిట్లు చెప్ప మొదలిడెను. "పరమపవిత్రమైన ఈ కథ రెండు లోకముల ప్రసిద్ధి పొందినది. నహుష తనయుడు యయాతి కనిష్ఠ పుత్రుని రాజుని చేసి, యదు మొదలయిన కుమారులను అంత్యజులుగా భ్రష్టులను చేసి వానప్రస్థానము హర్షముగా స్వీకరించి, కొంతకాలము జలము మాత్రమే తీసుకొని, మరికొంతకాలము వాయువును మాత్రమే భక్షించి, కొంతకాలము పంచాగ్నుల మధ్యనుండి తపస్సు చేసి పుణ్యఫలముచే స్వర్గమును చేరెను.

# 87. సప్తాశీతితమ అధ్యాయము

స్వర్గలోకమున దేవ, సిద్ధ, సాధ్యులతో సంచరించుచు యయాతి ఒకనాడు ఇంద్రసభకు పోగా ఇంద్రుడు రాజ్యాభిషిక్తుడైన నీ కుమారునకు యేమి ఉపదేశించితివి అని ప్రశ్నింప యయాతి "మైత్రి, దానము, మధురవాక్యములతో సంభాషణ మొదలైనవాటితో అందరినీ తృప్తిపరుపుమనియు, పరుషోక్తులతో ఇతరులను భావింపక, శాంతముగా మాటలాడమని కుమారునకు ఉపదేశించితిని" అని జవాబిచ్చెను.

# 88. అష్టాశీతితమ అధ్యాయము

## ఆత్మప్రశంస వలన యయాతి స్వర్గచ్యుతుడగుట

దేవరాజు యయాతిని తపశ్శక్తిలో నీవెవరితో సమానమని అడుగ యయాతి దేవ, మనుష్య, గంధర్వ, మహర్షులలో నా సమతుల్యముగా తపోనుష్టానము చేసినవారు మరి ఒకరు లేరని పలుక ఇంద్రుడు "మహారాజా! ఇతరుల తపః ప్రభావము తెలియక ఉత్కృష్ట, నికృష్ట, సమకక్షులనందరిని అవమానించితివి

కాన క్షీణపుణ్యుడవై దేవలోకమునుంచి పతనము చెందుదువు గాక!” అని శపింప, సాధువుల సన్నిధిని పడునట్లు యయాతి కోర, అట్లే ఇంద్రుడనుగ్రహించెను.

దేవలోకమునుండి పతనము చెంది యయాతి అష్టకుడు మొదలయిన రాజర్షుల వద్దకు రాగా, అష్టకుడు అతనిని నీవెవ్వరవు? యెందులకిట్టి స్థితికి వచ్చితివి. భయపడక చెప్పమనెను.

## 89. ఏకోన నవతితమ అధ్యాయము
## యయాతి ఆత్మకథ

యయాతి వారితో “నేను నహుషుని పుత్రుడను, పురుని తండ్రిని, యయాతిని. ఇంద్రుని సన్నిధిని ఆత్మప్రశంస చేయుటచే ఇట్లు పదభ్రష్టుడనైతిని. మీరు నా కన్న చిన్నవారు. అందులకు నమస్కారము చేయరాదు.

పాపపు చింత మనస్సున రాకూడదు. వచ్చిన యెడల నష్టపడుట తప్పదు. పోయిన వస్తువు గురించి విచారించుట తగదు. ఇది సాధువుల లక్షణము. సుఖదుఃఖములు దైవాధీనములు. ధీమంతులు దుఃఖములు వచ్చినపుడు విచారించరు. సుఖములు పొందినపుడు హర్షించరు.

ఓయి! అష్టకా! నేను సుఖదుఃఖములు అనిత్యమని గుర్తించితిని. అందులకు యేమని విచారించను? అంతా దైవాధీనములు కదా!” అని వచింప అష్టకుడు మీరు యెందెందు సంచరించితిరో తెలుపుడనిన యయాతి తను రాజుగా పెక్కేండ్లు రాజత్వము చేయుట, అమరావతి, బ్రహ్మలోకము, శివలోకము, నందనవనాది సంచరించిన స్థలములను వారికి చెప్పెను. తను స్వర్గచ్యుతుడైనపుడు దేవతలు పొందిన దుఃఖము, వారల ఆశీర్వచనము చేతను ఈ పుణ్యస్థలమునకు వచ్చినది వివరించెను.

## 90. నవతితమ అధ్యాయము
## యయాతి చెప్పిన నీతులు

“ఓ రాజా! అష్టకా! ధనమును కోల్పోయినవారిని బంధువులు త్యజించునట్లు క్షీణపుణ్యుడైనవారిని ఇంద్రాది దేవతలు స్వర్గమునుండి పరిత్యజింతురు” అని యయాతి పలుక అష్టకుడు “మీరు తత్వజ్ఞానము తెలిసినవారు. స్వర్గమున పుణ్యమెందులకు తరిగిపోవును. యేయే పుణ్యముల వలన యేయే లోకములకు పోవుదురో చెప్పవలసినది” అని కోరెను.

"పుణ్యముల ఫలమే స్వర్గము. పాపముల ఫలమే నరకము. భూలోకమే నరకము" అని యయాతి చెప్పెను.

## 91. ఏకోనవతితమ అధ్యాయము
## నాల్గు ఆశ్రమ ధర్మములు

యయాతి మునుల కోరికపై నాల్గు ఆశ్రమముల విద్యుక్త ధర్మములు వివరించి చెప్పెను.

మొదటిది బ్రహ్మచర్యము: చదువు చెప్పుటకై గురుని వేధించక, అతడు చెప్పునపుడే నేర్చుకొనుచు, గురువు నిద్ర లేవకుండా లేచి, అతడు నిద్రించిన పిదప నిద్రించుచు, నెమ్మది, శాంతము, సంతుష్టి స్వభావములతో వేదాధ్యయనముల చేయుట బ్రహ్మచారికి ఉత్తమము.

రెండవది గార్హస్థ్యము: ధర్మముగా విత్తమార్జించి, యజ్ఞ యాగాది విధుల చేయుచూ, దానములను పుచ్చుకొనక, అతిథులను ఆదరించుట గృహస్థ ధర్మము.

మూడవది వానప్రస్థము: పాపములు చేయుట, ఇతరులకు దానము చేయుట, వీర్యము నష్టము చేయక, ఇతరులకు కష్టము కలుగచేయక ఉండుట దీని ధర్మము.

నాల్గవది సన్యాసము: గుణవంతుడు, జితేంద్రియుడు, విషయవాసనలు వదలినవాడు, వృక్షమూలమున శయనించుచూ అధిక ప్రదేశములు చరించక యుండుట సన్యాసి ధర్మము.

ముని, మౌనవ్రతుల లక్షణములను ఋషులకు యయాతి తెలిపెను.

## 92. ద్వినవతితమ అధ్యాయము
## యయాతి స్వధర్మానురక్తి

అంతరిక్షమందు తన శక్తివలన ఉండమనిన అష్టకునితో, క్షత్రియుడనగుటచే దానము స్వీకరించనని యయాతి పలికెను.

దర్శనీయతన స్వర్గస్థానము ఈయబోయిన యయాతి సమతేజస్కుల వద్ద సహాయమపేక్షించుట పాడి కాదని వారించెను.

## 93. త్రినవతితమ అధ్యాయము
## యయాతి త్యాగశీలత

వసుమానుడు ఇట్లనెను. "రాజా! స్వర్గమన్నదే ఉంటే, నాకు సంప్రాప్తించ వలసినదియైన అది నీకు ఇచ్చుచున్నాను. దానము తీసుకొన ఇష్టము లేనిచో తృణముతో దానిని స్వీకరింపుము" అనగా యయాతి స్వశక్తిపై ఆధారపడువాడనే కాని ఇతరులపై ఆధారపడువాడనే కాని ఇతరులపై ఆధారపడువాడను కాదనెను.

ఆ సమయమందు అయిదు దివ్యరథములు రాగా దానినధిరోహించి వారందరూ స్వర్గమునకు బయలుదేరిరి.

దానము, తపస్సు, సత్యము, ధర్మము, లజ్జ, క్షమ, విధిత్సు, ముఖ్యముగా సుశీలుడు, సౌమ్యుడు అయిన ఉసీనరపుత్రుడు శిబి రథము ముందుగా ప్రయాణము చేసెను.

ఈ విధముగా యయాతి స్వీయదహౌత్రులతో స్వర్గము చేరెను.

## 94. చాతుర్ణవతితమ అధ్యాయము
## పురువంశ వర్ణన

జనమేజయుడు వైశంపాయనుని పురువంశ రాజులను, వారి చరిత్ర తెలుపుడని వేడెను.

ప్రౌష్టి గర్భమందు పురురాజునకు ముగ్గురు తనయులు కలిగిరి. ప్రవీర, ఈశ్వర, రౌద్రాశ్వులు.

పెద్ద కుమారుడు ప్రవీరుని భార్య శూరసేని. ఆమె గర్భమందు మనస్యు పేరుగల కుమారుడు జన్మించెను.

సౌబీరి గర్భమందు మనస్యుడు అంబగ్భానుడను పుత్రుని పొందెను.

మిశ్రకేశియను అప్సర వల్ల రౌద్రాశ్వుడు పదిమంది పుత్రుల బడసెను. వారు – ఋచేయు, కక్షేయు, కృకనేయు, స్థండివేయు, బనేయు, జలేయు, తేజోయు, సత్యేయు, ధర్మేయు, సన్నతేయు.

ఋచేయు పుత్రుడు అనాధృష్టి అసాధారణమైన విద్యనార్జించి తండ్రి సింహాసనము అధిరోహించెను.

అనాధృష్టి తనయుడు 'మతి' రాజసూయ, అశ్వమేధ యజ్ఞములు చేసెను.

మతికి నల్గురు కుమారులు. తంశు, మహాన్, అతిరథుడు, ద్రహ్యుడు.

మహాబలపరాక్రమవంతుడైన తంశునకు ఇలినుడను కుమారుడు కలిగెను. ఇలినుడికి రథంతరి యందు దుష్యంత, శూర, భీమ, ప్రబశు, వశు అను ఐదుగురు కొడుకులు కలిగిరి.

వారిలో పెద్దవాడైన దుష్యంతుడు శకుంతల వల్ల భరతుడను తనయుని కాంచెను. ఈ భరతుని పేరనే భరతవంశము ప్రసిద్ధి చెందినది.

భరతుడు తన ముగ్గురు భార్యల వల్ల తొమ్మండుగురు పుత్రులను బడసెను కాని వారెవ్వరూ యోగ్యులు కాకపోవుటచే వారిని రాజు ఆదరించకపోవగా మహిషిగణము క్రోధముతో పుత్రులను వినష్టము గావించిరి.

భరతుడు పుత్రుని కొరకై అనేక యజ్ఞ యాగాదులు చేసి భరద్వాజ మహర్షి అనుగ్రహముచే భూమన్యుడను కుమారుని పొందెను.

పుష్కరిణి అను రాణి వలన భూమన్యుడు సుహోత్ర, దివిరథ, సుహోత, సుహబి, సుజేయ, ఋచీకల అను కుమారులను బడసెను.

జ్యేష్ఠుడైన సుహోత్రుడు రాజసూయాది బహుయజ్ఞములు చేసెను. ఐక్షకి గర్భమందు సుహోత్రుడు ముగ్గురు పుత్రులను కాంచెను. అజామీళ, సుమీళ, పుమీళులు.

పెద్దవాడైన అజామీళునకు ముగ్గురు భార్యలు. ధూమిని, నీలి, కేశిని. వారివలన రాజు ఋక్ష, దుష్యంత, పరమేష్టి, జహ్ను, వ్రజన, రూపిణ అను తనయుల ప్రాప్తి పొందెను.

ఋక్షుని కుమారుడు సంవరణుడు. సంవరణుడు రాజు అయిన పిదప వర్షములు పడక, ఈతిబాధలు అధికము కాగా జనక్షయము కాదొడగెను. ఆ సమయమున పాంచాల దేశపు రాజు చతురంగ సేనలతో దాడి చేసి సంవరణుని ఓడించెను. సంవరణుడు పుత్ర, కళత్ర, బంధు మిత్రులతో సింధుతీర ప్రాంతమున పర్వత సమీపమున దుర్గ మధ్యమునకు పారిపోయెను. అచ్చట చాలాకాలము వారు గడిపిన పిదప ఒకప్పుడు వశిష్ట మహర్షి అచ్చటకు రాగా భారతులు మునిని సత్కరించి అతనిని తమ పురోహితుని కమ్మనిరి. వశిష్టుడు పౌరోవాక్యమున సంవరణుడు తిరిగి రాజ్యము పొందెను. సంవరణుడు తపతి అను భార్య వలన కురుడను తనయుని పొందెను. మహాతపస్వియైన కురుడు తపస్సు చేసిన స్థలమును

కురుక్షేత్రమని పేరుకాంచెను. కురునకు ఐదుగురు కొడుకులు. అవిక్షిత, భవిష్యంత, చైత్రరథ, ముని, జనమేజయులు.

అవిక్షితునకు ఎనమండుగురు సంతానము. పరీక్షిత, శవలంబ, ఆదిరాజు, విరాజ, శాల్మాది, ఉచ్చైశ్రవ, భంగాకార, జితారులు.

పరీక్షిత్తునకు ఏడుగురు కొడుకులు – జనమేజయ, కక్షశేన, ఉగ్రసేన, చిత్రసేన, ఇంద్రసేన, సుషేణ, భీమసేనులు.

జనమేజయునకు ఎనమండుగురు కుమారులు. ధృతరాష్ట్ర, పాండు, బాల్హీక, నిషధ, జంబూనద, కుండోదర, పదాతి వసాదులు.

జ్యేష్ఠుడైన ధృతరాష్ట్రుడు రాజయ్యెను. అతనికి మండిక, హస్తి, వితర్క, త్రాధ, కుండిన, హవిశ్రవ, ఇంద్రాభ, భూమన్య, అపరాజిత, ప్రతీప, ధర్మనేత్ర, సునేత్ర అనుపన్నెండుగురు తనయులు.

వీరిలో ప్రతీపుడు పేరుగాంచెను. అతనికి ముగ్గురు కుమారులు. దేవాపి, శాంతనుడు, బాల్హీకుడు. వీరిలో దేవాపి ధర్మోపార్జనార్థమై సన్యాసియయ్యెను. శాంతనుడు, బాల్హీకుడు రాజ్యము చేయుచుండిరి.

## 95. పంచ నవతితమ అధ్యాయము

## పురువంశము (విస్తృతము)

వైశంపాయనుడు పురువంశము నిట్లు పూర్తిగా వర్ణించెను. (క్రమము)

దక్షుడు → అదితి → వివశ్యానుడు → మను → ఇళా → పురూరవుడు → ఆయు → నహుషుడు → యయాతి →

యయాతి → దేవయాని → యదు, దూర్వాసు
యదు → యదువంశము

యయాతి → శర్మిష్ఠ → దృహ్యా, అను, పురు → పురువంశము

పురు + కౌసల్య → జనమేజయుడు + మాధవి → ప్రాచిన్యానుడు

ప్రాచిన్యానుడు + అశ్మీ → సంయాతి + వరాంగి → అహంయాతి

అహంయాతి+ భానుమతి → సార్వభౌముడు + సునంద → జయత్సేనుడు
జయత్సేనుడు + శుశ్రవ → అవాచీనుడు + మర్యాద → అరిహ →

మహాభౌమ + సుయజ్ఞ →

అయూతనాయ + కామ → కదంబ + అక్రోధ → దేవాతిధి + మర్యాద

→ అరిహ + సుదేవ → ఋక్ష + జ్వాల → మతినారుడు + సరస్వతి

→ తంశు → ఇళిన → దుష్యంతుడు → భరతుడు

## భరతుని పుట్టుక

దుష్యంతుడు భార్యయైన శకుంతలను, కుమారుని స్వీకరించిన సమయమున అతడే నీ కుమారుడని భరతవాక్యము వినిపించినందున ఆ బాలకుడు భరతుడని పిలువబడియెను. భరతుని భార్య సునందకు భూమన్యుడను కుమారుడు జన్మించెను. భూమన్యుని భార్య విజయ సుహోత్రుని పుత్రునిగా పొందెను. సువర్ణ వలన సుహోత్రుడు హస్తియను తనయుని గాంచెను. అతడు స్థాపించిన నగరమే హస్తినా నగరము. యశోధర హస్తి భార్య. వికుంఠనుడు వారి కొడుకు. సుదేవ వలన వికుంఠనుడు ఒక కుమారుని బడసెను. అతడు అజామీఢుడు. అజామీఢునకు నల్గురు భార్యలు. కైకేయి, గాంధారి, విశాల, రక్ష. చతుర్వింశతితమ పుత్రులలో సంవరణుని వలన పితృవంశము విస్తరించెను. సంవరణుడు, తపతి అను భార్య వలన కురు అను కుమారుని పొందెను. శుభాంగీ, కురుల కుమారుడు విదురథుడు. విదురథుని భార్య సుప్రియ, వారికి అనుస్వారుడు అను కుమారుడు జన్మించెను. అమృతగర్భమున అనుస్వారుడు పరీక్షిత్తుని ఉత్పత్తి చేసెను. పరీక్షిత్తుని సతి సుయశ. ఆమె కుమారుడు భీమసేనుడు. భీమసేనుని భార్య కుమారి. తత్పుత్రుడు ప్రతీశ్రవుడు. ప్రతీశ్రవుని పుత్రుడు ప్రతీపుడు. ప్రతీపునికి ముగ్గురు కుమారులు. దేవాపి, శాంతను, బాల్హీకుడు.

## కౌరవ, పాండవ వంశములు

శంతనుడు ముట్టుకొని జరాజీర్ణదేహులు యువకుల వలె సబలులౌటచే అతనిని శాంతనుడని పిలిచెడివారు. శాంతనుడు గంగను వివాహమాడెను. ఆమెయందు అతడు దేవవ్రతుడను తనయుని పొందెను. అతడే తదుపరి భీష్ముడని పేరుగాంచెను. తండ్రినిఆనందపరచుటకు భీష్ముడు సత్యవతితో అతని వివాహము కావించెను. ఆమె కన్యగా ఉన్నప్పుడే పరాశరుని వలన ద్వైపాయనుడను కుమారుడు జన్మించెను. శంతనుని వలన ఆమెకు విచిత్రవీర్యుడు, చిత్రాంగదుడను కుమారులు కల్గిరి. చిత్రాంగదుడు చిన్నపుడే గంధర్వునిచే హతుడయ్యెను.

విచిత్రవీర్యుని భార్యలు అంబిక, అంబాలిక. అతడు పుత్రముఖము చూడకుండా పంచత్వము పొందెను. సత్యవతి కోర వ్యాసమహర్షి వలన ధృతరాష్ట్ర, పాండురాజులు, శూద్రకన్యకకు విదురుడు జన్మించిరి.

ద్వైపాయనుని వరము వలన గాంధారీ, ధృతరాష్ట్రులకు దుర్యోధనాది నూర్గురు కొడుకులు, పాండురాజునకు కుంతీ మాద్రుల వలన యుధిష్ఠిర, భీమ, అర్జున, నకుల, సహదేవులు కలిగిరి.

ద్రౌపదికి పాండవుల వలన – ప్రతివింధ్య, సుతసోమ, శృతకీర్తి, శతానీక, శృకకర్మలు కలిగిరి.

భీమ, హిడింబలకు ఘటోత్కచుడు.

యుధిష్ఠిర, దీపికలకు యౌధేయడు

భీమ బాలంధరలకు సర్వరుడు.

అర్జున, సుభద్రలకు అభిమన్యుడు

నకుల రేణుమతులకు సోమిత్రుడు

సహదేవ విజయలకు సుహోత్రుడు

పాండవులకు ఏకాదశ పుత్రులు.

అభిమన్యుడు వంశధరుడు. అతని భార్య ఉత్తర. వారి కుమారుడు పరీక్షిత్తుడు. పరీక్షిత్తుని కుమారుడు జనమేజయుడు.

## 96. షష్ఠి నవతితమ అధ్యాయము

## అభిసప్తులైన వసువులు గంగా గర్భమున జన్మించుట

వైశంపాయనుడు ఇట్లు చెప్పెను. ఇక్ష్వాకు వంశస్థుడైన మహాభిషుడను రాజు వేయి అశ్వమేధములు, నూరు రాజసూయములు చేసి స్వర్గలోకప్రాప్తి చెందెను. బ్రహ్మలోకమున ఒకనాడు దేవ, మునిగణములున్న సమయమున గంగాదేవి వసనము గాలికి తొలగిపోవ ఇతరులు తలలు వంచుకొనిరి కాని మహాభిషుడు ఆమెనా అవస్థయందు నిరీక్షించుటచే బ్రహ్మ అతనిని మర్త్యలోకమున జన్మించమని శపించెను.

ఎందు జన్మింతునని పర్యటించుచున్న మహాభిషుడు వసువులను గాంచెను. వారు వశిష్టుని వలన శాపగ్రస్తులై భూలోకమున జననమంద శపింపబడి గంగను

తమ తల్లివి కమ్మని ప్రార్థింప ఆమె ప్రతీపుని కుమారుడైన శంతనుని వలన మీరు నాయందు పుట్టెదరని, రాజునకు ఒక్క కుమారుడైన ఉండవలెను కాన వారి వీర్య చతుర్భాగమున కలిగిన కుమారుడు చాలాకాలము బ్రతుకుననియు, కాని సంతానహీనుడై యుండుననియు నిర్ణయించుకొనిరి.

మహాభిషుడు శంతనునిగా జన్మించ మనస్సు స్థిరపరచుకొనెను.

## 97. సప్త నవతితమ అధ్యాయము
## శంతనుని జన్మవృత్తాంతము

సర్వభూత హితైషియైన ప్రతీప మహారాజు గంగాతీరమున ధ్యాన నిమగ్నుడై యుండ గంగాదేవి అతని రూప గుణములకు మోహితయై మానవాంగ రూపమున అతని దక్షిణ ఊరు దేశమున కూర్చుండ రాజు "కళ్యాణీ, నీవెవ్వరవు? నీకు నేనేమి చేయగలను?" అన గంగ "రాజా! నీవు నన్ను వరించవలసినది. ఇతర మేమియు నాకక్కరలేదు. కోరి వచ్చిన స్త్రీని కాదనుట ధర్మము కాదు సుమా!" అని పలుకగా ప్రతీపుడు "నేను వ్రతమును పూని యున్నాను. అదీకాక అసవర్ణ స్త్రీని వివాహమాడుట కూడా అధర్మాచరణమే కదా!" అని తెలుప గంగ తను దివ్యాంగననని, తనను చేపట్టుట తప్పులేదన రాజు ఇట్లనెను. "నీ కోరిక మన్నించ లేనందులకు అన్యథా భావించవలదు. కామినీ! భోగ్యమైన ఎడమ తొడమీద కాక నీవు పుత్ర, పుత్రవధూ దక్షిణ ఊరువు మీద కూర్చుంటివి. అందువలన నీవు నా కోడలివైతివి. నేను నీకు మాట ఇస్తున్నాను. నా కుమారునితో నీ వివాహము చేయుదును" అనగా గంగాదేవి అంగీకరించి మరలిపోయెను.

రాజదంపతులకు చాలాకాలము తరువాత చక్కని కుమారుడు జన్మించెను. మహాభిషుడే వారి కుమారునిగా జననమొందెను. శాంతిపరుడైన రాజు యొక్క కుమారుడు గాన అతనికి శాంతనుడను పేరు వచ్చెను.

ప్రతీపుడు కుమారునకు యుక్తవయస్సు రాగానే రాజ్యాభిషిక్తుని చేసి మున్ను తాను గంగాదేవికిచ్చిన వాగ్దానము కుమారునకు తెలియజేసి, ఆమెను ఎదురాడక వివాహము చేసుకొమ్మని చెప్పి వానప్రస్థాశ్రమమునకు వెడలిపోయెను. శాంతనునకు వేటయన్న ఎంతో ప్రీతి. ఒకనాడు వేటాడుచూ గంగాతీరమున విహరించుచున్న సమయమున అతడొక సుందరిని చూసి, దరిచేరి తన మనసు తెలిపి వివాహము చేసుకొమ్మనెను.

## 98. అష్ట నవతితమ అధ్యాయము
## శాంతనుడు గంగను వివాహము చేసుకొనుట

ఆ రమణియు అతనిని తిరస్కరించక, వసువులను జ్ఞాపకముంచుకొని "రాజా! నిన్ను వివాహమాడుటకు సమ్మతమే కాని నీవు నేను చేసిన మంచి పనికిగాని, చెడ్డపనికి కాని ప్రశ్నించి ఆటంకపరచకూడదు. నీవట్లు చేసిన వెంటనే నేను నిన్ను విడచి వెళ్లిపోదును" అన రాజు అంగీకరించి ఆమెతో సకల విషయ సుఖములను పొందసాగెను.

ఆమెకు క్రమముగా ఎనమండుగురు కుమారులు కలిగిరి. పుత్రుడు జన్మించగానే రమణి వారిని గంగలో పారవేయుచుండెడిది. ఆమెకు మాట ఇచ్చి ఉన్నందున రాజు ఆమెను ఆటంకపరచలేకపోయెడివాడు.

అష్టమ శిశువు జన్మించినపుడు రాజు పుత్రశోకమును భరించలేక ఆమెను నీవెందులకు ఇట్లు పుత్రహంతకివి అగుచున్నావు? ఈ కుమారుడిని చంపవలదని ఆపెను.

స్త్రీ అప్పుడు "ఓయీ, పుత్రకామి, నీవు నాకిచ్చిన మాట జ్ఞప్తికి తెచ్చుకొనుము. నేటినుండి నేను నీతో చరింపను. నేను జహ్నుమహర్షి కన్యను. నా పేరు గంగ. మునులు నన్నెప్పుడూ సేవింతురు. దేవకార్యార్థమై నేను నీ భార్యనైతిని. జన్మించిన వారందరూ వసువులు. వశిష్ఠుని శాపమున వారిట్లు జన్మించిరి. వారి కోరికపైన నేను వారికి తల్లినైతిని. భాగ్యవంతుడవు కాన నీవు తండ్రివైతివి. వారికి జన్మించిన వెంటనే మనుష్యలోకమునుండి ముక్తి నివ్వ నేను వారికి మాట ఇచ్చితిని. ఈ కుమారుడు మాత్రము చిరంజీవియై నీకు యశము చేకూర్చును" అని పలికెను.

## 99. నవ నవతితమ అధ్యాయము
## వసుగణముల శాపవృత్తాంతము

శంతనుడు గంగతో వశిష్టుడు ఎందులకు వసువులను శపించెనో తెలుపుమన ఆమె ఇట్లనెను. "వరుణదేవుని కుమారుడు వశిష్టుడు. అతనివద్ద సురభియను నందిని కలదు. వసువులు భార్యలతో ఒకనాడు విహారార్థమై పోవుచుండ సురభిని చూసి ఆనందించుచుండ వారిలో ద్యు అను వసువు భార్యతో ఈ గోవు పాలు త్రాగిన వేయి సంవత్సరములు యౌవ్వనవంతులై జీవింతురని తెలుప ఆమె అతనిని మర్త్యలోకమున ఊసూనరుని కుమార్తె జితవతి అను తన స్నేహితురాలికి ఈ గోవుని ఇమ్మని కోర వారందరూ గోవును, దూడను తోలుకొనిపోయిరి.

దివ్యదృష్టిని ఈ సంగతి తెలిసికొని వశిష్టుడు కోపించి మనుజ యోనిని జన్మింపుడని వసువులను శపించెను. ఈ సంగతిని తెలిసికొని వారు వశిష్టుని ప్రార్థింప అతడు త్వరగానే అతడు త్వరగానే తిరిగివత్తురు కాని కారణభూతుడైన ద్యు మాత్రము చాలాకాలము భూమిపై నుండునని పల్కెను. వసువులు గంగను తమ తల్లివి కమ్మని ప్రార్థింప ఆమె అంగీకరించెను.”

ఈ విధముగా ఆమె వసువుల శాపవృత్తాంతము వినిపించెను.

## 100. శతతమ అధ్యాయము

## శంతనుని చరిత్ర

శంతనుడు ధర్మజ్ఞుడు, సత్యవాది, ఋజుస్వభావుడు, వదాన్యుడు, తపోనిరతుడు, రాగద్వేషశూన్యుడు, ప్రియదర్శనుడు.

అతడు ధర్మముగా రాజ్యము చేయుచుండెడివాడు.

## భీష్ముని చరిత్ర

ఒకనాడు శంతనుడు గంగాప్రవాహము మరలియుండ చూసి కారణము పరీక్షించెను. ఒక సుందరాకారుడైన యువకుడు అసంఖ్యాకమైన శరములతో గంగను ఆపియుండుట చూసి ఆశ్చర్యపడెను. అపుడు గంగాదేవి వచ్చి యువకుని కుడిచేయి పట్టుకొని రాజు వద్దకు వచ్చి “రాజా! ఇతడు నీ కుమారుడు. సర్వశాస్త్ర విశారదుడు, సర్వోత్కృష్టుడు. ఇతడు వశిష్టుని వద్ద వేదవేదాంగములను అభ్యసించెను. కృతాస్త్రుడు. అద్వితీయ ధనుర్ధరుడు. రాజధర్మము, అర్థచింతనలందు దక్షుడు. అతని నీవు గ్రహించవలసినదని” కుమారుని, తండ్రికి అర్పింప రాజు సంతోషముగా కుమారునితో రాజధానికి తిరిగివచ్చెను.

## భీష్ముని యౌవ్వరాజ్య పట్టాభిషేకము

కుమారుని హస్తినా నగరమునకు తీసుకొని వచ్చి ప్రజలు, సామంతులు, మిత్రులు, బంధువులు ఆనందింప అతనిని యువరాజుగా అభిషిక్తుని చేసెను. అతడు తండ్రిని, సామంతులను, ప్రజలను తన మంచి ప్రవర్తనతో ఆనందపరచుచుండెను.

ఇట్లు నాలుగు సంవత్సరములు గడచిన పిదప శంతనుడొకనాడు విహారార్థము గంగాతీరమునకేగ అచ్చట పుష్పగంధము ఆఘ్రాణించి, వెదకి, ఆ సుగంధమునకు కారణభూతురాలైన యువతిని గాంచి నీవెవ్వరివన, ఆమె తను

సత్యవతినని, బెస్తరాజు కుమార్తెనని, తండ్రి ఆదేశమున ప్రజలను నది దాటింతునని పలుక రాజు ఆమె తండ్రిని కలసికొని తను సత్యవతిని వివాహమాడ దలచినట్లు తెలిపెను.

బెస్తరాజు, తన కుమార్తెకు పుట్టిన కుమారులకే రాజ్యము ఇవ్వవలసినదని, అట్లు చేయుటకు మాట ఇచ్చిన తన కుమార్తెతో వివాహమునకు అభ్యంతరము లేదని పల్కెను.

మదనబాధితుడైనను రాజు అందులకు ఇయ్యకొనక హస్తినకు మరలి వచ్చి, పదే పదే ఆ సుందరిని తలచుకొనుచు చింతాక్రాంతుడై ఉండెను.

దేవవ్రతుడు ఒకనాడు తండ్రిని చేరి కారణమడుగ అతడు "నాయనా! నీవొక్కడవే నాకు కలవు. ఒక్క కుమారుడు ఉన్నను లేనట్లే అని లోకులందురు. నీవు నల్గురు పుత్రుల బలము, యశము, బుద్ధి కలవాడవు. కాని ఏ యుద్ధములోనైనా నీకు హాని జరిగిన మన కులము నశించును కదా! ఇదే నా చింత" అని పలుక, దేవవ్రతుడు వృద్ధుడైన ఒక అమాత్యుని చేరి తండ్రి వాక్యములు తెలుప అతడు సత్యవతి వృత్తాంతమును, దాసరాజు శంతనునకు తన కోరికకు సమ్మతింపని పక్షమున కుమార్తెనీయనని చెప్పిన సంగతి దేవవ్రతునకు తెల్పెను.

దేవవ్రతుడు మంత్రులను, సామంతులను వెంటనిడుకొని బెస్తరాజు వద్దకు వచ్చి స్వయముగా అతని కుమార్తెను తన తండ్రికిచ్చి వివాహము చేయ ప్రార్థింపగా అతడు "భరతర్షభా! నీవు శంతన మహారాజు కులప్రదీపుడవు. నీ తండ్రివంటి వ్యక్తిని భర్తగా పొందుట ఎటువంటి కన్యకైనను కష్టతరమే. నీవు కృద్ధుడవైన దేవతలే భయపడుదురు. నా కన్యకు వివాహమైన పిదప ఆమె సంతానమునకు, నీకు ఎటువంటి వైరము కలుగునో అని మాత్రమే భయపడుచున్నాను" అనగా పితృభక్తుడైన దేవవ్రతుడు "ఓ బెస్తరాజా! నా సత్యవ్రతమును దయచేసి ఆలకింపుడు. నీవు కోరిన విధముగానే జరుగగలదు. ఈమె గర్భమందు జనించిన కుమారుడే మాకు రాజగును."

అంత దాసరాజు "గాంగేయా! నీవు దేశక్షేమము తలచి దుష్కరమైన పని చేయ సమగట్టితివి. నీవే ఈ కన్యకకు ప్రభువు. కాని నీకు కలిగిన సంతానము నీవలె ఊరకుందురని నేనెట్లు నమ్మగలను?" అని సందేహము తెలుపగా పితృ ప్రియచికీషుడైన దేవవ్రతుడు "నేను ఇంతకు క్రితమే రాజ్యాధికారము వదలుకొంటిని. మరల ప్రతిజ్ఞ చేయుచున్నాను. నేటినుండి నేను బ్రహ్మచర్యము

నవలంబించుచున్నాను. నేను అపుత్రకుడనైనను అక్షయ స్వర్గ లాభము పొందుదును" అని భీషణమైన ప్రతిజ్ఞ చేయ దాసరాజు హర్షించెను. దేవతలు పుష్పవృష్టి కురిపించి దేవవ్రతుని భీష్ముడని సంబోధించిరి. నాటినుండి అతడు భీష్ముడని పిలువబడసాగెను.

భీష్ముడు పినతల్లిని చేరి "మాతా! రథము నధిరోహించుడు. ఇంటికి వెళ్లుదము" అని ఆమెను రథారూఢను చేసి తండ్రికి అప్పగించెను. లోకులు ముక్తకంఠమున ఆతని సత్ప్రవర్తనను శ్లాఘించిరి.

శంతన మహారాజు కుమారుని అసాధారణ ప్రతిభకు, త్యాగమునకు సంతసించి ఆతనికి స్వేచ్ఛామరణము కలుగునట్లు వరము ప్రసాదించెను.

## 101. ఏకాధిక శతతమ అధ్యాయము
## శంతనుడు సత్యవతిని వివాహమాడుట

వైశంపాయను డిట్లనెను "తదుపరి శంతన మహారాజు ఆ సుందరిని పాణి గ్రహణము చేసికొని, నిజాలయమున నుంచుకొనెను. కొంతకాలమునకు రాణి గర్భవతియై చక్కని కుమారుని గాంచెను. అతని పేర చిత్రాంగదుడు. అతడు అసాధారణ ధీశక్తిసంపన్నుడు. మహాబలుడు అయి ఉండెను. తదనంతరము శాంతనునకు విచిత్రవీర్యుడను మరియొక పుత్రుడు కలిగెను. ఆ బాలకుడు పిన్నవయస్కుడై ఉన్నప్పుడే శంతనుడు దేహము చాలించెను.

పితృకార్యము చేసి సత్యవతి కోరినట్లు భీష్ముడు చిత్రాంగదుని రాజ్యాభిషిక్తుని చేసెను. అతడు తనతో సమానమైనవాడింకొకడు లేడనుకొనెడివాడు. ఒకప్పుడు చిత్రాంగదునకు, అదే పేరుగల ఒక గంధర్వునకు సమరము జరిగెను. ఉభయ సైన్యములు కురుక్షేత్రమున, సరస్వతీ నదీతీరమున, మూడు సంవత్సరములు పోరిరి. గంధర్వుడు మాయాబలమున విచిత్రవీర్యుని సంహరించి నిజస్థానమునకు వెడలిపోయెను. తమ్ముని ప్రేతకార్యము చేసి భీష్ముడు చిన్నవాడైన విచిత్రవీర్యుని సింహాసనమున కూర్చుండబెట్టి రాజ్యము చేయసాగెను.

## 102. ద్వ్యధిక శతతమ అధ్యాయము
## కాశీరాజు కన్యల స్వయంవరము

విచిత్రవీర్యునకు యుక్తవయసు రాగానే తమ్ముని వివాహము చేయ సంకల్పించు సమయమున కాశీరాజు ముగ్గురు కుమార్తెల స్వయంవరము చాటించుట విని రథారోహణము చేసి కాశీరాజ్యము చేరెను.

భీష్ముడు స్వయంవర మంటపమున తన తమ్మునికై వారిని తీసుకొని పోవుచున్నట్లు రాజుకు తెలిపి రాజకుమార్తెలను రథముపైనిడి రాజన్యులను ఉద్దేశించి "కొందరు వస్త్రాది అలంకారములతో, ధనధాన్యములతోను, కొందరు గోమిధునముల ప్రదానము చేసియు, కొందరు కన్యలను ప్రతిజ్ఞ చేసిన విధముగా ధనధాన్యముల నిచ్చియు పెండ్లి చేయుదురు. కొందరు బలపూర్వకముగా పెండ్లి చేసుకొందురు. కొందరు ప్రణయ సంభాషణలతో రమణీ మనోరంజనము చేసి వివాహము చేసుకొందురు. ప్రమత్త నారీ పాణిగ్రహణము చేయుదురు. ఆర్ష విధేయముగా పెండ్లి మరికొందరు చేసుకొందురు. కన్య తమ తండ్రులకు అర్థదానము చేసి కొందరు వివాహమాడుదురు. ఇవి అష్టవిధ వివాహములు. స్వయంవరము ఉత్తమైనదిగా రాజులు గ్రహింతురు. పరాక్రమమున కన్యను వివాహమాడుట ప్రశంసనీయము. మీలో ఎవరైనా యోధులున్న నన్నాప ప్రయత్నించుడు" అని మేఘగర్జనవలె పలికెను.

## భీష్ముడు కాశీరాజు కన్యలను హరించుట

అందు చేరిన రాజులందరు త్వరితముగా అలంకారాదులు వదలి, కవచములు ధరించి, అస్త్రధారులై త్వరితగతిని రథారూఢులై, అశ్వారూఢులై గాంగేయునిపైకి యుద్ధమునకు వెడలిరి.

భీష్ముడు వారి శరములను ఖండించుచు, శతశత శత్రువుల ధను, ధ్వజాగ్ర, కవచ, మస్తకములు తన తీవ్ర శరజాలమున ఖండించుచు వారిని పరాజితులను కావించెను.

## సాళ్వునితో భీష్ముడు యుద్ధము చేయుట

రాజన్యులనందరిని ఓడించి భీష్ముడు హస్తినా నగరాభిముఖుడై రథమును త్రిప్పి యేగుచుండ మహారథుడైన సాళ్వుడు 'తిష్ట, తిష్ట' యనుచు రథముపై రాగా క్షాత్రధర్మ పరతంత్రుడైన భీష్ముడు రథమాపి యతనితో యుద్ధసన్నిధుడైన తీవ్రమైన వారి పోరాటము చూసి రాజన్య బృందము వారిని ప్రశంసించుచుండిరి.

తుదకు గంగానందనుడు వారుణాస్త్రముతో సాళ్వుని నాలుగు రథ తురగములను, ఐంద్రాస్త్రమున సారథిని చంపి రాజు అస్త్రములను అన్నిటిని తునాతునకలుగా చేసి జీవితావస్థయందు మాత్రము వానిని వదలెను. రాజకన్యలను గౌరవపురస్సరముగా దుహితల వలె తీసుకొని వచ్చి తమ్మునితో వివాహము చేయ ప్రయత్నములు చేయించసాగెను.

## విచిత్రవీర్యుని మృతి

ఆ సమయమున కాశీపతి జ్యేష్ఠ పుత్రిక అంబ భీష్మునితో తను ఇంతకు క్రితమే సాళ్వుని వరించితినని, అతడు కూడా ఇష్టదేనని, తన తండ్రి కూడా ఇందులకు సమ్మతించియుండెనని చెప్ప బీష్మడు బ్రాహ్మణులను సాయమిచ్చి యధేచ్ఛన అనుమతించెను.

తరుణవయస్కుడు, సుందరాకారుడుయైన విచిత్రవీర్యుడు ఆ రాజకుమార్తెలను వివాహమాడి కుసుమాయుధుని ఆధీనుడయ్యెను. ఆ నిబిడ నితంబినీ ద్వయుల పయోధరములు పీనము, కటిదేశము క్షీణము. నఖములు రక్తవర్ణములు. ఘననికుంచిత శ్యామల కేశపాశము అనిర్వచనీయమైన శోభలీనుచుండెను. వారితో విచిత్రవీర్యుడు ఏడు సంవత్సరములు సంసార సుఖములను పొంది క్షయరోగాక్రాంతుడై అకాలమరణము నొందెను. భాతృ శోకాక్రాంతుడైన భీష్ముడు ఋత్విక్కుల సహాయముతో తమ్ముని ప్రేత కార్యములను చేసెను.

## 103. త్ర్యధికశతతమ అధ్యాయము
## సంతానోత్పత్తి చేయ భీష్ముడు నిరాకరించుట

పుత్రశోకమున నిండిన సత్యవతి, యౌవనవతులు, పుత్రహీనులైన కోడండ్రను చూసి ఒకనాడు భీష్ముని చేరి “నాయనా! శంతనుని వంశము నిలబెట్టవలసిన బాధ్యత నీపైన ఉన్నది.నీకు ధర్మతత్వమును తెలిపెడిదానను కాను. నీకు కులాచారములన్నియును తెలియును. నీ తమ్ములిద్దరూ కూడా పుత్రవిహీనులై అకాలమరణము చెందిరి. వారి పరమరూపవతులు, యౌవ్వనులు అయిన భార్యలు పుత్రార్థినులై ఉన్నారు. నేను నీకు అనుజ్ఞ ఇచ్చుచున్నాను. నీవు వారిని కూడి వంశాభివృద్ధి చేయుము. రాజ్యాభిషిక్తుడవై రాజ్యము చేయుము” అని పలుకగా భీష్ముడు తల్లితో ఇట్లనెను. “నేను ఇంతకు క్రితమే మీవద్ద అనపత్యుడనై ఉండెదనన్న సంగతి మరచిపోయినట్లున్నారు. మరల ప్రతిజ్ఞ చేయుచున్నాను. వినుడు. మూడు లోకములను పరిత్యజించగలను, ఇంద్రత్వము వదలగలను, కాని సత్యమును మాత్రము వీడజాలను. పృధివి గంధమును, జలము మధురరసమును, జ్యోతి రూపమును, వాయువు స్పర్శను, సూర్యుడు ప్రభను, అగ్ని ఉష్ణతను, ఆకాశము శబ్దమును, ధర్ముడు ధర్మమును పరిత్యజించినను, నేను సత్యమును వదలను.”

సత్యవతి, “ఓయీ, సత్యపరాక్రమా! నీ ధర్మనిరతి నాకు తెలియనిది కాదు. ఇంతకు క్రితము నావద్ద నీవు ఇచ్చిన వచనములు కూడా మరువలేదు. కాని ఆపద్ధర్మముగా తలచి పితృభారము గ్రహించుము. వంశము రక్షింపబడే విధముగా నడచికొనుమని వేడుచున్నాను” అని పలికెను.

“మాతా! క్షత్రియునకు సత్యభంగము కన్నా నిందనీయమైనది లేదు. శంతనుని వంశము నిలచునట్లు సనాతన క్షత్రియ ధర్మము ప్రకారము పురోహితులగు బ్రాహ్మణులను శరణువేడుట శ్రేయస్కరము. ఎట్లన వివరించెద వినుము” అని గాంగేయుడు పలికెను.

## 104. చతురధిక శతతమ అధ్యాయము
## క్షేత్రతోత్పాన దృష్టాంతములు

భీష్ముడిట్లనెను. “పితృవధ చేసిరన్న కోపముతో పరశురాముడు ఇరువది యొక్క మారు తన పరశువుతో క్షత్రియులను సంహరించి నిర్వంశులను చేసి వారి రుధిరముతో పితృతర్పణము చేసెను.

తుదకు బ్రాహ్మణుల ద్వారా అపత్యత్పాదనము చేసి వినాశోన్మభిరాజ కలమును మరల రక్షించెను.”

## దీర్ఘతముడను ఋషి జన్మవృత్తాంతము

“వేదములందు, క్షేత్రజ సంతానము ఉత్పత్తియైన ఆ పుత్రుడు పెండ్లి చేసికొనిన వానికే చెందనని తెలియజేయబడినది. అందవలననే క్షత్రియరమణులు బ్రాహ్మణులను సమీపించి క్షత్రియ వంశములను రక్షించుకొనిరి. ఈ విషయమై మరియొక ప్రాచీన ఇతిహాసము కలదు. పూర్వము ఉతథ్యుడను మహర్షికి మమత అను భార్య కలదు.

ముని లేని సమయమందు అతని తమ్ముడు, దేవగురుడు అయిన బృహస్పతి గర్భవతియైన మమతను చేరబోవ ఆమె వదినని, గర్భవతినని చెప్పినను అతడు వినకపోయెను. గర్భస్త మునికుమారుడు కూడా దేవగురుని కుత్సితకార్యమునుండి నిరతి చెందుమని కోరినను అతను వినకపోగా మునిబాలకుడు రేతః ప్రవేశమార్గమును తన కాలితో ఆపగా రేతస్సు భూతలముపై పడిపోయెను. క్రోధముతో బృహస్పతి అతనిని జన్మాంధుడవు కమ్మని శపించెను. ఉతథ్యమ పుత్రుడే దీర్ఘతముడని పేరు పొందెను.

దీర్ఘతముడు ప్రద్వేషియను బ్రాహ్మణ యువతిని పెండ్లాడి ఆమెవలన గౌతమాది సువిఖ్యాత పుత్రులను పొందెను. దీర్ఘతముడు గోధర్మము నభ్యసించి, ఆ ధర్మమునే అవలంబింప అచ్చటి మునులు కృద్ధులై అతనితో చరించుట మానిరి. తని భార్య "నిన్ను, నీకుమారులను నేను చాలాకాలము పోషించితిని. ఇక నా వల్ల కాదని" అనెను.

## స్త్రీజాతిని దీర్ఘతముడు శపించుట

మహర్షి భార్య మాటలు విని క్రోధాన్వితుడు తన ప్రభావమున ధనమిచ్చి, నీకీ అర్థస్పృహ ఉంది కాబట్టి క్షత్రియ కులమందు జన్మించుమని శపించెను. ప్రద్వేషి గర్వముతో "కోపముతో నీవు నాకిచ్చిన ధనము నాకక్కరలేదు. నిన్ను, నీ సంతానమును ఇక నేను పోషించను" అనగా దీర్ఘతముడు ఇట్లు స్త్రీజాతిని శపించెను.

"నేటినుండి భూమిపై ఈ నియమమును ప్రతిష్ఠించుచున్నాను. భర్త బ్రతికియున్నపుడైనను, చనిపోయిన తరువాతనైనను స్త్రీ ఇతర పురుషులతో సంగమించిన అధోగతి పొందును. ఆమెకు ఎంత ధనమున్నను పతి విహీనయైన పిదప సుఖముల ననుభవించిన దుష్కీర్తి కలుగును."

బ్రాహ్మణి కోపముతో కొడుకులను ఆజ్ఞాపింప దుష్కర్ములైన గౌతమాదులు అంధుడైన తండ్రిని బుట్టలో పెట్టి బంధించి నదిలో వదలగా అతడు చాలా దూరము కొట్టుకొనిపోయెను. బలిరాజు అతనిని ఉద్ధరించి పుత్రుల నర్థించి, అతని అంగీకారము తీసుకొని, స్వీయమహిషి సుదేష్ణను మునివద్దకు పనుప అంధుడు, వృద్ధుడైన అతని వద్దకు చన ఇచ్ఛగింపక ఆమె తన దాసిని పంపెను. ఆమెకు పదకొండుగురు కుమారులు కలిగిరి. ముని తనతో మాట్లాడవచ్చిన రాజుతో వారు తన పిల్లలని, రాణి తనవద్దకు రాలేదని చెప్పెను.

## అంగరాజాదుల జన్మవృత్తాంతము

రాజు మరల భార్యను పంపెను. ముని ఆమెను స్పృశించి తేజోవంతులైన ఐదుగురు కుమారులు కలుగగలరని చెప్పెను. అట్లే ఆమెకు అంగ, వంగ, కళింగ, పుండ్ర, సుష్మ అను ఐదుగురు కుమారులు కలిగిరి. వారు వారి పేరున వేరు వేరు రాజ్యములను ప్రతిష్ఠించుకొనిరి."

## 105. పంచాధిక శతతమ అధ్యాయము

భీష్ముడు ఈ విధముగా పినతల్లియైన సత్యవతికి ఉత్తముడైన బ్రాహ్మణునకు ధనాదులిచ్చి విచిత్రవీర్యుని క్షేత్రమున సంతానము పెంపుసేయుమని తెలుపగా సత్యవతి అతనితో పూర్వము తను పరాశర మహర్షి వలన సంతానము పొందిన వైనము తెలిపి, కుమారుడు ద్వీపమున పుట్టె గావున ద్వైపాయనుడని, వేదవిభాగ కర్తగాన వేదవ్యాసుడని, నల్లటివాడు కాన కృష్ణద్వైపాయనుడని పేరు పొందెనని, తను తలచుకొనిన అతడు వచ్చుననియు తెలియజేయగా భీష్ముడు సంతోషించి "అమ్మా! మీరు చెప్పినది ధర్మయుక్తమైనది, మంగళాస్పదమైనది, కులమునకు హితము కలిగించునది. ఆతని వలన కురువంశము రక్షింపబడుట నాకు పూర్తియైన ఇచ్ఛగలదని చెప్పుటకు సంతోషించుచున్నాను" అనగా సత్యవతి ద్వైపాయనుని స్మరించెను.

తలచుకొనిన మాత్రముననే వ్యాసుడు తల్లి యెదుట నిలచి, ఆమెను ఓదార్చి, తన కోరిక తెలుపుమని కోరగా సత్యవతి పుత్రులు లేకనే విచిత్రవీర్యుడు, చిత్రాంగుల మృతి, భీష్ముని వ్రతము తెలిపి పుత్రార్థులైన మరదళ్ల కోరిక తీర్చి వంశము రక్షింపుమని దీనముగా వేడుకొనగా అతడు తను అపవిత్రులైన రమణులను ముట్టనని వారు సంవత్సర కాలము నిష్ఠాగరిష్టులై వ్రతము చేసిన వారి కోరిక తీర్తునని పలికెను.

అంత ఆలస్యమునకు ఆగలేమని, రాజ్యమున అధర్మము పెరుగును. ధర్మయుక్తముగా రాజ్యపాలనకు రాజు కావలెను గాన శీఘ్రముగా పుత్రోత్పత్తి కావింపుమని కుమారుని కోర అతడు తన కురూపమును భయపడక ఉండు పక్షమున కౌసల్య (అంబిక మారుపేరు)ను నాటి రేయి పంపుమన సత్యవతి ఆమెను చేరి సంగతి తెలియజేసి అంగీకారము పొందెను.

## 106. షడధిక శతతమ అధ్యాయము

## ధృతరాష్ట్రుని పుట్టుక

అత్తగారి ఆజ్ఞానుసారము బావగారిని చేరిన అంబిక అతని నల్లని రూపు, ఎఱ్ఱని కన్నులు చూసి భయపడి కన్నులు మూసుకొనెను. వ్యాసుడు తల్లితో ఆమెకు బలము కలవాడు, వీరుడు, వివేకవంతుడు అయిన కుమారుడు కలుగునని, అతనికి నూర్గురు కొడుకులు పుట్టెదరు కాని తన తల్లి దోషము

వలన జన్మాంధుడగునని చెప్పెను. అట్లే ఆమెకు యధాకాలమున అంధుడైన కుమారుడు జన్మించెను.

## పాండురాజు జన్మము

చేరబోగానే అంబాలిక భయమున పాండువర్ణము చెంద సాత్యవతి తల్లితో ఆమెకు పాండువర్ణము కల కుమారుడు జన్మించునని, అతను 'పాండు'రాజు అని పిలువబడునని చెప్పెను. అట్లే ఆమెకు పాండువర్ణముగల కుమారుడు కలిగెను.

## విదురుని జన్మము

రెండవ మారు అంబిక తను మునిని చేరిక సౌందర్యవతియైన దాసిని అలంకరించి మౌని కడకంపెను. మహర్షి ఆమెను ఆదరించి నీ దాసత్వము తొలగునని, అసాధారణమైన బుద్ధి కలవాడు, ధార్మికుడైన కుమారుడు కలుగునని చెప్పి, ఆమెను తృప్తిపరచి తల్లికి చెప్పి అంతర్హితుడయ్యెను. మాండవ్యముని శాపమున ధర్ముడు ఆ దాసికి చక్కని కుమారునిగా జన్మించెను. అతడే విదురుడు.

## 107. సప్తాధిక శతతమ అధ్యాయము
## విదరుని పూర్వజన్మ వృత్తాంతము-మాండవ్యోపాఖ్యానము

జనమేజయుడు "ధర్మరాజు యే దుష్కర్మము వలన శూద్రయోనియందు జన్మించెనో తెలుపుడ" అని ప్రశ్నింప వైశంపాయనుడు ఇట్లు చెప్పసాగెను.

"పూర్వము మాండవ్యుడను మహర్షి ఊర్ధ్వబాహుడై, మౌనవ్రతావలంబియై తపస్సు చేసుకొనుచుండ, కొందరు చోరులు నగరపాలకుల భయముచే దోచుకొనిన సొమ్ము ముని ఆశ్రమమున దాచి పారిపోయిరి. వారిని వెదకుచు వచ్చిన రక్షకులు మునిని దొంగల జాడ తెలుపుమని కోర, మౌనవ్రతావలంబియైన అతడు బదులు పలుకడాయెను.

## మాండవ్యుని కొరత వేయుట

ఆ స్థలమున వెదకిన భటులు ధనమును కాంచి, మాండవ్యుని రాజు వద్దకు బంధించి తీసుకొనిపోయిరి. రాజు కొరత వేయుడని ఆజ్ఞాపింప వారట్లే చేసిరి. తపస్సు చేసుకొనుచున్న ముని తన అవస్థను తెలుసుకొనలేక అట్లే బహుకాలముండెను. ఒకనాడు పక్షిరూపులైన మునులు అతని చూసి, చేరి అతని ఈ అవస్థకు కారణమెవరని అడిగిరి.

## 108. అష్టాధికశతతమ అధ్యాయము
## మాండవ్యుని శాపమున ధర్మరాజు విదురుడై జన్మించుట

తన ఈ అవస్థకు యెవరిని దోషులుగా నిర్ధారింపవలెనని మాండవ్యుడు పలుక మునులు వెడలిపోయిరి.

కొంత కాలము గడిచిన పిదప చారుల వలన సంగతి తెలుసుకొనిన రాజు మునిని చేరి తన అజ్ఞానమునకు క్షమింపుమని, ప్రసన్నుని చేసుకొని శూలమును తీయబోవ, రాకపోవుటచే మూలచ్ఛేదము చేసెను. నాటినుండి ముని అణిమాండవ్యుడని పిలువబడసాగెను.

అతడు యమధర్మరాజును చేరి తన శిక్షకు కారణమడుగగా అతడు మాండవ్యుడు చిన్నతనమున తూనీగ తోకకు ముల్లు గుచ్చిన సంగతి చెప్పగా ముని కోపించి "ధర్మరాజా! చిన్న తప్పిదమునకు నీవు చాలా పెద్ద శిక్ష ఇచ్చితివి కాన మనుష్యుడవై శూద్రకులమున జన్మింపుము. నేను నేటినుండి పాపపుణ్యముల సరిహద్దు వేయుచున్నాను. పదునాల్గు సంవత్సరముల వరకూ ఎవరినీ పాపపుణ్యములు అంటవు" అని శపింప, ధర్మరాజు విదురుడై జన్మించెను. అతడు ధర్మచింతన కలవాడు, లోభశూన్యుడు, జితేంద్రియుడు, కౌరవగణముల హితకాంక్షియై యుండెను.

## 109. నవాధిక శతతమ అధ్యాయము
## ధృతరాష్ట్రాదుల జనన సమయమున శుభశకునములు

ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు జననమొంద జనపదములు సుభిక్షములై, పాడిపంటలతో తులతూగసాగెను. ప్రజలు న్యాయమార్గమును వీడక సచ్చరిత్రులై ఉండిరి. చోరభయము, ఈతిబాధలు నశించెను. వివిధ దేశముల రాజులు శత్రుత్వము వీడి కౌరవ వంశము శరణుజొచ్చిరి.

భీష్ముడు కుమారులను తన బిడ్డలవలెనే జాతకర్మాది విధులను నిర్వర్తించి సరియైన గురువుల వద్ద విద్యాభ్యాసము సేయ నియోగించెను.

వారును దినదినాభివృద్ధి నొందుచు యుద్ధక్రీడలు, నీతిశాస్త్రము, ఇతిహాసము, పురాణము మొదలయినవి అభ్యసించి పారంగతులైరి. పాండురాజు మంచి విలుకాడుగాను, విదురుడు ధర్మతత్వజ్ఞునిగను ప్రసిద్ధిపొందిరి.

ధృతరాష్ట్రుడు అంధుడగుటచేతను, విదురుడు, సారసరుడగుటచేతను పాండురాజే సింహాసనము అధిరోహించెను.

## 110. దశాధిక శతతమ అధ్యాయము

## ధృతరాష్ట్ర, పాండురాజుల వివాహ పరామర్శ

ఒకనాడు భీష్ముడు, విదురునితో తాను, సత్యవతి, వ్యాసుడు ఆలోచించి వంశరక్షణకై పూనుకొనుట తెలిపి వంశము అభివృద్ధి కొరకై మద్రదేశాధిపతి సుబలునకు గల కుమార్తెలను ధృతరాష్ట్రునకు, పాండురాజునకు ఇచ్చి వివాహము చేసిన బాగుండునని తెలుపగా విదురుడు "మీరు పితృతుల్యులు, మీరు మా మంచిని కోరువారు. అట్లే చేయుడని" జవాబు ఇచ్చెను.

## గాంధారితో ధృతరాష్ట్రుని వివాహము

బ్రాహ్మణుల వలన సుబలుని కుమార్తె గాంధారి నూర్గురు కొడుకులు కలుగునట్లు శివుని వలన వరము పొందినట్లు తెలిసికొనిన భీష్ముడు ధృతరాష్ట్రునకు ఆమెనిమ్మని దూతలను పంపగా, సుబలుడు వరుడు అంధుడని తెలుసుకొని కొంత ఆలోచించి, తుదకు అంగీకరించెను. తల్లిదండ్రుల ఇచ్ఛ తెలుసుకొనిన వెంటనే గాంధారి దళసరి పట్టువస్త్రముతో కండ్లను ఆచ్ఛాదించెను. ఆమెను సహోదరుడు హస్తినానగరమునకు తీసుకొని వచ్చి ధృతరాష్ట్రునితో వివాహము గావించెను. గాంధారి అందరకు ప్రియమగునట్లుగా ప్రవర్తించుచూ సత్ప్రవర్తనతో వారి మనస్సులను జయించెను.

## 111. ఏకాదశాధిక శతతమ అధ్యాయము

## కుంతికి దూర్వాసుడు వరమిచ్చుట

యదువంశమందు శూరసేనుడను రాజు కలడు. అతని కుమారుడే వసుదేవుడు. శూరసేనుడు తన మొదటి సంతానమైన పృథయను కన్యను మాట ప్రకారము పినతండ్రి కుమారుడైన కుంతిభోజునకు పెంపకమిచ్చెను. కుంతిభోజుని పాలిత కన్య కావున ఆమెను అందరూ కుంతియని పిలవసాగిరి. కుంతి చిన్నతనమునుండి బ్రాహ్మణులను, మునులను భక్తియుక్తులతో పూజించుచుండెడిది. ఆమె సేవలకు సంతోషించి, ఒకప్పుడు దూర్వాసమహర్షి ఒక మంత్రముపదేశించి, అది జపించిన ఆమెకు ఆ దేవతల వలన చక్కని కుమారులు కలిగెదరని వరమిచ్చెను.

## కుంతికి కర్ణుడు జన్మించుట

బాల్య చాపల్యమున దూర్వాసుని మంత్రమును కుంతి జపము చేయగా సూర్యదేవుడు ఆమె ముందు ఉపవిష్టుడు కాగా, ఆమె భయపడుచూ తన అజ్ఞానమునకు క్షమించి వెడలిపొమ్మని కోరెను. అతను మృదుభాషణములతో ఆమె భయమును తీర్చి ఆమెను చేరెను.

కుంతి గర్భవతియై కవచకుండలధారి, పరమరూపవంతుడు అయిన చక్కని కుమారుని గాంచెను. తృప్తి చెందిన సూర్యదేవుడు ఆమెకు మరల కన్యాత్వము ప్రసాదించెను.

లోకాపవాదమునకు భయపడిన కుంతి కుమారుని గంగానదిలో, తొట్టెలో నుంచి వదలెను. ఆ బాలకుని అతిరథ సూతుడు వృషసేనుడని నామకరణము చేసి పెంచి పెద్ద చేసెను.

వృషసేనుడు చిన్నతనమునుండి సూర్యోదయ సమయమున సూర్యుని ఉపాసించుచూ, ఆ సమయమున ఎవరు యేదడిగిన అది దానము చేసెడివాడు. అర్జుననకు మేలు చేయదలచి ఇంద్రుడు బ్రాహ్మణ వేషమున అతని కవచ, కుండలములను దానముగా పొంది, ప్రతిగా శక్తి అను ఆయుధమిచ్చెను. నాటినుండి అతనికి కర్ణుడని, వైకర్తనుడని పేర్లు కలిగెను.

## 112. ద్వాదశాధిక శతతమ అధ్యాయము

## కుంతీ స్వయంవరము - పాండురాజుతో ఆమె వివాహము

వైశంపాయనుడిట్లనెను. లోకుల ముఖమున కుంతి సౌందర్యము తెలుసు కొనిన రాజులు కుంతిభోజుని వద్దకు దూతలను పంపసాగిరి. కుంతిభోజుడు మంత్రులతో చర్చించి కుంతీస్వయంవరము ప్రకటించి రాజులనందరిని ఆహ్వానించెను. సభామధ్యమున భరతవంశావతంశుడు, మహాబలపరాక్రాంతుడు అయిన పాండురాజుని చూసి మదన పరవశయై, లజ్జనమ్రముఖమున ఆతని కంఠదేశమున వరమాలను వేసెను. కుంతిభోజుడు కుమార్తె వివాహము వైభవముగా చేసెను. పాండురాజు భార్యతో హస్తినానగరమును చేరి పరమసుఖమున కాలయాపన చేయసాగెను.

# 113. త్రయోదశాధిక శతతమ అధ్యాయము

## మాద్రితో పాండురాజు వివాహము

పాండురాజునకు మరియొక వివాహము చేయదలచిన భీష్ముడు బ్రాహ్మణులు, మంత్రులు, సామంతులతో మద్రదేశమునకు వెళ్ల, మద్రాధిపుడైన శల్యుడు వారిని ఆదరించి రాకకు కారణమడిగెను. భీష్ముడు పాండురాజుతో అతని చెల్లెలైన మాద్రినిచ్చి వివాహము చేయ తన సంకల్పము తెల్పి, వారి కులాచారము ప్రకారము రథ, గజ, తురగ, వసన, భూషణాదులు కన్యాశుల్కముగా నిచ్చి, రాజకుమార్తెను హస్తినా నగరమునకు తీసుకొని వచ్చి ఒక శుభ ముహూర్తమున పాండురాజుతో వివాహము గావించెను.

## పాండురాజు దిగ్విజయము చేయుట

భార్యలతో కొంతకాలము సుఖములనుభవించి, పాండురాజు భీష్మాదుల ఆశీర్వాదములను అందుకొని, చతురంగ సైన్యములతో దిగ్విజయ యాత్రకు బయలుదేరెను. అతడు మగధ, మిథిల, కాశీ, పుండ్ర మొదలయిన దేశాధీశులను జయించి వారి కోశాగారములను స్వాధీనము చేసుకొనెను.

ఈ విధముగా సకల దేశములను జయించి, అశేష ధనముతోను, విచిత్ర రత్నాభరణములతోను, హస్తి, రథ, గో, ఉష్ట్ర, మేషాదులతోను తిరిగివచ్చుచున్న పాండురాజునకు హస్తినానగరమునుండి భీష్ముడు, మంత్రి, సామంతులతో ఎదురేగి, ఆదరించి దీవించి నగరమునకు తీసుకొని వచ్చెను.

# 114. చతుర్దశాధిక శతతమ అధ్యాయము

## పాండురాజు వనవిహారము

పాండురాజు తను తీసుకొని వచ్చిన ధనరాసులు చూపి, భీష్ముడు, సత్యవతి, విదురుడు, తల్లి కౌసల్యాదులను సంతోషపరచి అన్నయైన ధృతరాష్ట్రునిచే నూరు అశ్వమేధ యాగములు చేయించెను.

కొంతకాలము తర్వాత పాండురాజు భార్యలతో వానప్రస్థమునకు వెడలి, వివిధ రమ్యప్రదేశముల తిరుగుచూ బ్రాహ్మణులను, మునులను తన సత్ప్రవర్తనతో ఆనందపరచుచూ విహరించుచుండెను.

భీష్ముడు దేవకుడను రాజు యొక్క పరాశర కుమార్తెతో విదురునకు వివాహము కావింప అతడు ఆమె వలన వినయసంపన్నులైన కుమారులను పొందెను.

## 115. పంచదశాధిక శతతమ అధ్యాయము

## గాంధారికి దుర్యోధనాది శతపుత్రులు జన్మించుట

వైశంపాయనుడు ఇట్లనెను. "ధృతరాష్ట్రునకు గాంధారి వలన నూర్గురు కుమారులు, వైశ్యభార్య వలన ఒక కుమారుడు, కుంతికి ముగ్గురు కుమారులు, మాద్రికిద్దరు పుత్రులు జన్మించిరి" అని తెలుపగా జనమేజయుడు అతనిని వారి జన్మవృత్తాంతము సవిస్తారముగా వినిపింపుమని వేడ మౌని ఇట్లు చెప్పసాగెను.

ఒకప్పుడు అలసివచ్చిన వ్యాసుని సేవా, శుశ్రూషలు చేసి గాంధారి నూర్గురు కుమారులు కలుగునట్లు ఆశీర్వాదము పొంది, గర్భవతి అయ్యెను. రెండు సంవత్సరములు గడచిపోయినవి. పుత్రోత్పాదనము కలుగలేదు. అట్టి సమయమున ఆమె కుంతికి చక్కని కుమారుడు కలిగెనను వార్త విని ఈర్ష్యతో గర్భస్రావము పొంది, లోహసదృశమైన పిండము పారవేయబోయెను. వేదవ్యాసుడు ఆమెను ఆపి, బొటకనవేలు ప్రమాణమున ఖండములను నీటికుండలందు ఉంచి రెండు సంవత్సరముల తరువాత పుత్రులను పొందుమని ఆమెను ఊరడించెను.

## దుర్యోధనుడు జన్మించునపుడు దుశ్శకునములు కాన్పించుట

అనంతరము రెండు సంవత్సరములు గడచిన పిదప మొదట దుర్యోధనుడు జన్మించెను. ఆ రోజుననే భీముడు కూడా జననమొందెను. దుర్యోధనుడు కలుగగానే గాడిద గొంతుకతో రోదనము చేసెను. వానితో గార్ధభముల, గ్రద్దలు, గోమాయువులు భయంకరముగా వికట ధ్వనులు చేసెను. అనేకములైన అశుభ సూచనలు కానుపింప ధృతరాష్ట్రుడు, భీష్మాదులను పిలిపించి కర్తవ్యము విచారింప వేడుకొనగా వారు వీనివలన కులక్షయము అగు సూచనలు కనిపించుచున్నవి. వీనిని నీవు పరిత్యజింపుమని చెప్పిరి. పుత్రస్నేహమన ధృతరాష్ట్రుడు ఒప్పుకొనలేదు. కొలది కాలమునకే మిగిలిన తొంభైతొమ్మండుగురు కుమారులు, ఒక కుమార్తె కలిగిరి.

గాంధారి గర్భవతియైయున్న సమయమున ఒక వైశ్యకన్య ధృతరాష్ట్రుని శుశ్రూష చేయుచూ అతని వలన ఒక కుమారుని గాంచెను. అతనికి యుయుత్సుడని నామకరణము చేసిరి.

## 116. షోడశాధిక శతతమ అధ్యాయము
## దుర్యోధన సోదరి దుఃశల జన్మ వృత్తాంతము

వ్యాసుడు గాంధారి కోరికపై 101 భాగములైన పిండములను వేరు వేరు పాత్రలందుంచెను. నూట ఒకటవ భాండమునుండి కుమార్తె జన్మించెను. ఆమెయే కౌరవుల యేకైక భగిని దుఃశల.

## 117. సప్తదశాధిక శతతమ అధ్యాయము
## దుర్యోధనాది శతభ్రాతల పేర్లు

జనమేజయుని కోరికపై వైశంపాయనుడు ధృతరాష్ట్రుని కుమారుల పేర్లు వర్ణించెను. 1) దుర్యోధన 2) యుయుత్సుడు 3) దుశ్శాసనుడు 4) దుస్సహ 5) దుఃశ్శల 6) జలసంధ 7) సమ 8) సహ 9) పాద 10) అనుపాద 11) దుర్ధక్ష 12) సుబాహు 13) దుష్ప్రదర్శన 14) దుర్హర్షన 15) దుర్ముఖ 16) దుష్కర్ణ 17) కర్ణ 18) వివింశతి 19) వికర్ణ 20) శల 21) సత్వ 22) సులోచన 23) చిత్ర 24) ఉపచిత్ర 25) చిత్రాక్ష 26) వారుచిత్ర 27) శరాశన 28) దుర్మద 29) దుర్విగాహ 30) చిచిత్సు 31) వికటాసన 32) ఉర్ణనాభ 33) సునాభ 34) నంద 35) ఉపనందక 36) చిత్రబాణ 37) చిత్రవర్మ 38) సువర్మ 39) దుర్విమోచన 40) అహిబాహు 41) మహాబాహు 42) చిత్రాంగ 43) చిత్రకుండల 44) భీమవేగ 45) భీమబల 46) బలాకి 47) బలవర్ధన 48) ఉగ్రాయుధ 49) సుషేణ 50) కుండధార 51) మహోదర 52) చిత్రయూధ 53) నిషాధి 54) పాశి 55) బృందారక 56) దృఢవర్మ 57) దృఢనక్షత్ర 58) సోమకీర్తి 59) అనూదర 60) దృఢసంధ 61) సత్యసంధ 62) జరాసంధ 63) సద 64) సుబాకు 65) ఉగ్రశ్రవ 66) ఉగ్రసేన 67) దుష్పరాజయ 68) అపరాజిత 69) కుండశాయి 70) విశాలాక్ష 71) దురాధర 72) దృఢహస్త 73) సుహస్త 74) వాతవేగ 75) సువర్చ 76) ఆదిత్యకేతు 77) మహాయశి 78) నాగదత్త 79) అగ్రశాయి 80) కవచి 81) త్రిధన 82) కుండి 83) ధనుర్ధర 84) ఉగ్ర 85) భీమరథ 86) నారబాహు 87) అలోలూప 88) అభయ 89) అనాదృష్య 90) కుండభేది 91) విరాగి 92) చిత్రకుండల 93) ప్రమథ 94) ప్రమాథీ 95) దీర్ఘరోమ 96) దీర్ఘబాహు 97) వ్యఢోరు 98) కనకధ్వజ 99) కుండాశి 100) విరజ

## 118. అష్టాదశాధిక శతతమ అధ్యాయము
## మృగరూపులైన ముని దంపతుల వలన పాండురాజు శపింపబడుట

వైశంపాయనుడిట్లు చెప్పసాగెను. అరణ్యమందు సంచరించుచున్న పాండురాజొకనాడు రతిక్రీడయందున్న మృగమిధునమును పంచబాణములతో కూలవేసెను.

నేలకూలిన లేడి, జింక నిజముగా మృగములు కావు. మిందముడను ఋషి కుమారుడు, అతని భార్య.

నేలకూలిన ముని తనను యేల కొట్టితివన, రాజులకు ఆఖేటనము కర్తవ్యమని పాండురాజు తెలుప ముని తెలియక వధించితివి కాన బ్రహ్మహత్యా పాతకము నిన్ను అంటదు కాని సంగమ సమయమున మమ్ములను నీవు వధించిన పాపమును మాత్రము నీవు అనుభవించక తప్పదు. నేను ఆనందముగా ఉన్న సమయమున నీవు దుఃఖమును కలుగచేసితివి కాన నీవు నీ భార్యా సంగమమున ఆనందించు సమయమున మృతి చెంది దుఃఖము పొందెదవు అని శపించి ప్రాణములు వదలెను.

## 119. ఉనవింశత్యాధిక శతతమ అధ్యాయము
## పాండురాజు విషాదము నొందుట

ఆశ్రమమునకు తిరిగి వచ్చి పాండురాజు జరిగినదానికి విచారించుచు "నా తండ్రి కాముకుడై విషయవాంఛాలోలుడై దేహము అల్ప ఆయువును వదిలెను. మహర్షి దయవలన నేను నా తల్లికి కలిగితిని. నేటినుండి విషయవాంఛలు వీడి సంయమముతో సన్యాసిగా జీవించెదను అని తలచి భార్యలను చేరి వారిని హస్తినా నగరమునకు తిరిగిపొమ్మని తన అభీష్టము తెలియజేయ వారు "మేము కూడా తపస్సు చేయుచూ నీతో ఉందుము. కాదేని నీ ముందే ప్రాణములు వీడెదమని" ధృఢముగా పలికిరి.

### కుంతీమాద్రులతో పాండురాజు వానప్రస్థమునకరంగుట

పాండురాజు భార్యలైన కుంతీమాద్రులు రాజాలంకారములు, వసనములు వదలి కాషాయాంబరధారులై బహుమూల్య అలంకారములు, వస్త్రములన్నియు బ్రాహ్మణులకు, సేవకులకు ఇచ్చి తాము పరివ్రాజులైన సంగతి హస్తినా నగరమున

తెలియజేయుడని వారిని పంపి, కేవలము వనమందలి ఫలములను, దుంపలను తినుచు భార్యలతో నాగశత, చైత్రరథ, కాలకూట, హిమాలయ, గంధమాదనాది పరిసరముల చరించుచు ఇంద్రద్యుమ్న సరోవరమును చేరెను. అచటనుండి శతశృంగమునకు వెడలి, అచ్చట తపస్సు చేయసాగెను.

## 120. వింశత్యధిక శతతమ అధ్యాయము
## పాండురాజు బ్రహ్మలోకయాత్ర

శతశృంగ పర్వత సమీపమున పాండురాజు కఠోరమైన తపస్సు చేయుచు, సిద్ధచారణాదుల ప్రియపాత్రుడై పాపముక్తుడై బ్రహ్మర్షి తుల్యుడయ్యెను. ఒకనాడు బ్రహ్మలోకమునకు వెడలుచున్న మునులతో పాండురాజు భార్యలతో పోబోవ వారు దారి చాలా క్లిష్టమైనదని వారించిరి.

### అపుత్రకుడైన పాండురాజు దుఃఖించుట

అపుడు పాండురాజు ఆ మునులతో ఇట్లనెను. "మునిశ్రేష్ఠులారా! మీ మాటలోని గూఢార్థము నేను గ్రహించితిని. నేను అపుత్రకుడను కావున మీరు నన్ను వారించుచున్నారు. దేవ, ఋషి, పితృ, మనుష్యులను ఈ నాల్గు ఋణములను తీర్చుకొనవలసినవి యజ్ఞము వలన దేవ ఋణము, వేదాధ్యయనము, తపస్సుల వలన ఋషి ఋణము, పుత్రోత్పాదనము, శ్రద్ధాతర్పణాదుల వలన పితృ ఋణము అన్నసంసాచరణమున మనుజ ఋణము తీర్చుకొనవలెను. ఇందు నేను దేవ, ఋషి, మనుజ ఋణములు తీర్చితిని. కాని పితౄణ విముక్తడను కాలేదు. వేదవ్యాసుడు మా తండ్రి క్షేత్రమున సంతానోత్పత్తి కలిగించిన విధముగా నా క్షేత్రమున అపత్యోత్పాదనకు అవకాశము కలదేమో తెల్పుడు" అనగా వారు "ఓయి! ధర్మాత్మా! నీకు అచిరకాలములోనే పుత్రులు కల్గుదురు. నీవు పుత్రార్థివై ప్రయత్నము చేయుము. తప్పక నీకు అశేష గుణసంపన్నులైన క్షేత్రజులు కలుగగలరు" అని చెప్పి వెడలిపోయిరి.

### పుత్రులను పొంద కుంతిని పాండురాజు ఆదేశించుట

పుత్రకామియైన పాండురాజు ఒకనాడు కుంతిని చేరి పుత్రులు లేనందువలన తనకు స్వర్గప్రాప్తి కలుగదనియు, ముని శాపమున తను భార్యలను చేరలేననియు తెల్పుచూ, పుత్రులు పన్నెండు రకములుగా కలుగుదురు. అందు బంధు దాయాదులు ఆర్గురు. అబంధుదాయాదులు ఆర్గురు. ఎట్లనిన 1) స్వయంజాత 2) ప్రణీత (క్షేత్రజులు - బ్రాహ్మణుల అనుగ్రహమున తన ఔరసము జన్మించిన

వారు) 3) పరిక్రీత (జననమూల్య దానమున కలిగినవారు) 4) పౌనర్చన (పున ర్వివాహ పత్నికి మొదటి వివాహమున కలిగినవారు) 5) కానీన (కన్యా కాలమున పుట్టినవారు) 6) స్వైరిణీజ (వివాహిత ద్విచారిణీ పుత్రులు) 7) దత్త 8) క్రీత 9) కుత్రిమ - స్వయముపాగత 10) సహోఢ (గర్భవతియైన స్త్రీని వివాహము చేసికొన్నందున కలిగిన కుమారుడు) 11) జ్ఞాతిరేత 12) హీనయోని ధృత.

"ఓ కుంతీ! స్వయముగా పుత్రోత్పాదనకు నేను అసమర్థుడను కావున నా అనుమతిపై నీవు తపోగుణ గరిష్టుడైన బ్రాహ్మణుని వలన పుత్రుని పొంద వలసినది" అని పాండురాజు కోరెను.

## 121. యేకవింశత్యధిక శతతమ అధ్యాయము
## కుంతీ ప్రబోధము

ఆ పలుకులు వినిన కుంతి భర్తతో "మీరు తప్ప నాకింకెవరు మనస్సులో లేరు. మీతోటిదే నా స్వర్గము. మీవలననే నాకు సంతానము కలుగునట్లు అనుగ్రహించవలెను. మీకొక పౌరాణిక గాథ వినిపింతును. దయచేసి వినవలెను.

## మృతిచెందిన బ్యూషితాశ్వుడు కుమారుని పొందుట

కుంతి ఇట్లు చెప్పెను. పూర్వము పురువంశమునందు బ్యూషితాశ్వుడను రాజు కలడు. అతడు యజ్ఞములను చేసి ఇంద్రాది దేవతలను దానముల వలన బ్రాహ్మణులను తృప్తిపరచి ప్రతాపాన్వితుడయ్యెను. క్రమముగా ఆతడు పాచ్య, ఉదీచ్య, పాశ్చాత్య, దక్షిణాత్యముల అన్ని దేశములను జయించి అనేక ధనరాశులను పొంది మరల యజ్ఞము చేసెను. ఈ విధముగా ఆతడు దానధర్మములతో రాజ్యమును పాలించుచుండెను. అతని భార్య భద్ర. ఆమె రూపలావణ్యములకు వశీభూతుడై రాజు రాజకార్యములను కూడా విసర్జించి అంతఃపురమున కాలము రాణితో గడుపసాగెను. అపరిమిత ఇంద్రియాసక్తి వలన రాజు క్షయరోగాక్రాంతుడై స్వల్పకాలములోనే దివంగతుడయ్యెను. పుత్రులు లేని అతని భార్య భద్ర ఆతని మృతదేహమును కౌగలించుకొని పరిపరి విధముల విలపించుచు దేహత్యాగము చేయ సంసిద్ధురాలు కాగా ఆకాశవాణి ఇట్లనెను. "నీవు విచారించవలదు. నీవు చతుర్దశినాడు గాని, అష్టమినాడు గాని ఋతుస్నాతవై నా శయ్యపై శయనించిన నేను నా మృతదేహమున ఆవిర్భవించి నీకు సంతానము ప్రసాదింతును." ఈ పలుకులు విని ఆనందించి ఆమె తన భర్త శరీరసంసర్గమున పుత్రులను పొంది వంశాభివృద్ధిని కావించెను.

కావున, ఓ నాథా! నీవు విచారింపవలదు. భద్ర వలననే నేను కూడా సంతానము పొందెదను" అని కుంతి పలికెను.

## 122. ద్వావింశత్యాధిక శతతమ అధ్యాయము
## శ్వేతకేతు సంవాదము

వైశంపాయనుడిట్లనెను. "భార్యవలన బ్యూషితాశ్వుని చరిత్ర విన్న పాండు రాజు ఆమెతో ఇట్లనెను. "లలనా! నీవు చెప్పినది యదార్థము. అతడు దేవతుల్యుడు కాన అది సంభవమైనది. అటువంటి దుర్లభమైన కార్యము నా వంటి సామాన్యుల వలన జరుగునది కాదు.

"ఓ చారుహాసినీ, ఋషులు చెప్పిన ధర్మములలో చెప్పినది, ఉత్తర మేర ప్రాంతములందు నేటికి కూడా ఆచరించునదియైన సంగతి చెప్పెదను వినుము. స్త్రీలు అనావృతులై, యెవరి ఆధీనములోను ఉండక కౌమార ప్రాప్తినుండి ఇచ్ఛా విహారము చేయుటకు అధికారము కలిగి ఉండెడివారు. తాము కోరిన పురుషుని పొందుట తప్పు కాదు. కాని మనదేశమందు ఈ ఆచారము నిషేధించబడినది. ఎందులకనగా - పూర్వము ఉద్దాలకుడను మహర్షి కుమారుడు శ్వేతకేతు తల్లిదండ్రులవద్ద ఆటలాడుకొనుచున్న సమయమున ఒక బ్రాహ్మణుడు అచ్చటకు వచ్చి ముని భార్య కరమును గ్రహించి రతికై బలవంతముగా తీసుకొని పోవుచుండ చూసిన మునిబాలకుడు కోపింప తండ్రి అతనిని వారించుచూ స్త్రీ సజాతీయులైన యే పురుషునైనను కోరుట తప్పు కాదని తెలిపెను. మునిబాలకుడు శాంతించక నేటినుండి స్త్రీలు ఒకే భర్తను చేరియుండవలెనని శాసించెను. ఈ విధముగా ఉద్దాలకుని కుమారుడైన శ్వేతకేతుని నియమము ప్రకారము స్త్రీల వివిధ పురుష సంగమము నిషేధించబడినది.

అదే కాక పూర్వము కల్మషపాద మహారాజు భార్య మదయంతి పతి ఆజ్ఞ ప్రకారము వశిష్ట మహర్షిని చేరి అశ్మాకుడను పుత్రుని బడసెను. భగవానుడైన వేదవ్యాసుని వలన భరతవంశ రక్షార్థము చరించుట వలన నేను, ధృతరాష్ట్రుడు జన్మించితిమి. ఋతుమతియైన స్త్రీ భర్తను వదలి పరపురుష గమనము చేయుట అధర్మమని ఆర్యులు చెప్పుదురు. తదితర సమయములందు తప్పు కాదు. పత్ని, అధర్మమైన కార్యమైనను పతి మాట వినుట తగినది. నేను పుత్రార్థినైయున్నాను. శాపవశుడను కాన నీవు నా మాట మన్నించి తపఃసంపన్నపరుడైన బ్రాహ్మణుని కూడి నాకు పుత్రుని ముఖము చూపుము."

## పుత్రోత్పాదనకు కుంతి సమ్మతించుట

భర్త మాటలు వినిన కుంతి తన చిన్నతనమందు శుశ్రూషలు పొందిన దూర్వాసమహర్షి వలన పుత్రులను దేవతా ప్రార్థన వలన పొందదగిన వరమును పొందిన వైనము వినిపించి అనుమతి కోర పాండురాజు ధర్ముని ప్రార్థింపుమని కోరెను.

## 123. త్రయోవింశత్యధిక శతతమ అధ్యాయము

## పుత్రార్థము ధర్ముని ఆహ్వానించుట

వైశంపాయనుడు ఇట్లనెను. "ఓయి! కురువంశావతంశా! జనమేజయా! కుంతి భర్త అనుమతి పొంది కుమారుని కొరకు మంత్రము జపింప పోనాటికి గాంధారి గర్భవతియై సంవత్సరమైనది.

కుంతి మంత్రము జపింపగానే విమానారూఢుడై, ధర్ముడు ఆమని చేరి తనను పిలచిన కార్యమేమన పృథ పుత్రుని ప్రసాదింపుమని కోరెను.

## యుధిష్ఠరుని జననము

ధర్ముని వలన కుంతికి అభిజిత్ నామకమైన అష్టమ ముహూర్తమున మధ్యాహ్నమున ఒక కుమారుడు జన్మించెను. అతడు పుట్టగానే ఆకాశవాణి "ధార్మికుడు, విక్రమశాలి, సత్యవ్రతుడు, యశస్వి అయి ఇతడు యుధిష్ఠరుడను పేర ప్రజాపాలనము చేయును" అని పలికెను.

## భీముని జననము

కొంతకాలమైన పిదప బలశాలియైన పుత్రుడిని పాండురాజు కోరగా కుంతి మహర్షి మంత్రమును జపించి వాయుదేవుని ఆహ్వానించెను. ఆతని వలన ఆమెకు పుత్రుడు జన్మించగానే "భీముడను పేర ఈ బాలుడు మహాబల సంపన్ను లందరిలోను మేటి అగును" అని అశరీరవాణి పల్కెను.

ఒకనాడు భీముడు తల్లి ఒడిలో నిద్రించి ఉండునెడ వ్యాఘ్రభయమున కుంతి లేవ, బాలుడు పర్వతసానువున పెద్దశిలపై పడ ఆ శిల శతధా చూర్ణమాయెను.

ఓ జనమేజయా! దుర్యోధనుడు కూడా భీముడు జన్మించిన దినముననే జన్మించెనని తెలియుము.

## అర్జునుని జననము

మహావీరుడైన భీముడు జన్మించిన అనంతరము పాండురాజు పురుష శ్రేష్ఠుడైన పుత్రుని పొంద తలంపు కలిగి సర్వదేవ శ్రేష్ఠుడైన ఇంద్రుని మనమున దలచి భార్యతో సంవత్సరకాలము మంత్రోక్తముగా వ్రతము చేయుమని చెప్పి, తను ఒకే పాదమున నిలచి ఘోరముగా దేవేంద్రుని కొరకై తపస్సు చేసి, అతని వలన ఆశీర్వచనము పొంది భార్యకు పుత్రుని పొంద అనుమతి ఇవ్వ ఆమె ఇంద్రుని అనుగ్రహమున కుమారుని గాంచెను. అతడు జన్మించిన వెంటనే ఆకాశవాణి మహాగంభీర నిర్ఘోషముగా ఇట్లనెను. “కుంతీ! నీ ఈ కుమారుడు అర్జునుడని పిలవబడును. ఇతడు కార్తవీర్యార్జునుని కన్న, ఇంద్రుని కన్న మిన్నయై తన భుజబలముతో కురు, సోమ, చేది, కాశి మొదలయిన దేశములు జయించును. దేవతల శత్రువులైన నివాతకవచులను వధించును. పరమేశ్వరుని ద్వంద్వ యుద్ధమున తృప్తి పరచి పాశుపతాస్త్రమును పొందును. అనేకమైన శస్త్రాస్త్రములు పొంది పగతురను వధించును.”

ఈ మాటలు వినిన కుంతి, పాండురాజు, శతశృంగనివాసులైన మునులు ఎంతో హర్షించిరి. ఆ సమయమున దేవతలు పుష్పవృష్టి గావించిరి. దేవతలు అర్జునుని కీర్తించిరి. అప్సరసలు నాట్యమాడిరి. సప్తమహర్షులు ఆశీర్వదించిరి.

తదుపరి పాండురాజు మరియొక పుత్రునికై కుంతిని చేర ఆమె నాల్గు మార్లు పరపురుష సంసర్గము పొందిన స్త్రీ స్వైరిణిగా పండితులు భావింతురని, ఆతని కోర్కెను నిరాకరించెను.

## 124. చతుర్వింశత్యధిక శతతమ అధ్యాయము
## నకుల సహదేవుల జన్మవృత్తాంతము

మాద్రి ఒకనాడు పాండురాజును చేరి “నాథా! నాకు గాంధారికి శతపుత్రులు కల్గిరన్న అసూయ లేదు కాని, కుంతి పుత్రసంతతిని మీ నిమిత్తము లేకుండగనే పొందినది. నేనే అభాగ్యురాలను. పుత్రులకై సవతిని ప్రార్థించలేను గదా! మీరు దయచేసి ఆమెను ఒప్పించవలసినది” అని పలుక పాండురాజు కుంతిని చేరి మాద్రిని అనుగ్రహింపుమన ‘పృథ’ ముని చెప్పిన మంత్రము ఒకమారు చెప్పింప ఆమె అశ్వనీకుమారులను ధ్యానించి పుత్రద్వయమును పొందెను. ఆకాశవాణి “వీరు అశ్వనీకుమారులు కన్న రూపము, గుణము, తేజస్సు కల్గినవారగుదురు” అని పలికెను.

శతశృంగవాసులైన మునులు వారికి నకులుడు, సహదేవుడు అని నామకరణము చేసిరి.

రాజు మరల మాద్రి సంతానమునకై కుంతిని చేర ఆమె ఇట్లనెను. "రాజా! మాద్రి ధూర్తురాలు. ఒకమారు మంత్రజపము వలన ఆమె ఇద్దరు కుమారులను పొందినది. ఈ విషయము తెలియక నేను మోసపోయితిని. దయచేసి ఈ విషయమున నన్ను ప్రోత్సహింపకుడు."

పాండురాజు మారు పలుకక మిన్నకుండెను.

## 125. పంచవింశత్యధిక శతతమ అధ్యాయము
## పాండురాజు మృతి

పుత్రులతో పాండురాజు కొంతకాలము ఆనందముగా గడపిన పిమ్మట ఒకనాడు వనవిహారము చేయ బయలుదేరెను. తోడ దివ్యాంబరములు ధరించి మాద్రి బయలుదేరెను. వనమున చరించు సమయమున పాండురాజు కామోద్రేకుడై భార్యను కౌగలించుకొనినంత మునిశాప వశమున విగతజీవుడాయెను.

మాద్రి రోదనము విని కుంతి ఆ ప్రదేశమును చేరి, చనిపోయిన భర్తను చూచి ఏడ్చుచూ "మాద్రీ, మునిశాపము తెలిసి కూడా నీవు భర్తకు ప్రలోభనము చూపితివి. ఇది తప్పు. నీవు అదృష్టవంతురాలవు. నగుమోముతో నున్న రాజును చూసితివి" అనగా మాద్రి తన తప్పు లేదని తెలియజేయుచూ కుంతికి తన కుమారులను అప్పగించి పతి శరీరము ఆలింగనము చేసికొని కళేబరము వదిలెను.

## 126. షడ్వింశత్యధిక శతతమ అధ్యాయము
## పాండురాజు మృతదేహమును హస్తినకు తీసుకొనివెళ్లుట

పాండురాజు మరణవార్తను తెలిసికొనిన ఋషులు తమ కర్తవ్యముగా భావించి పాండురాజు, మాద్రుల శరీరములను భద్రముగా తీసుకొని కుంతీదేవి, అయిదుగురు కుమారులు వెంటరాగా హస్తినానగరమునకు బయలుదేరిరి. కుంతి స్వదేశమునకు తిరిగిపోతున్నందులకు, కుమారుల ముఖములను చూసుకొని ముందుగా నడవసాగెను. యేడవ దినమునకు వారు హస్తినానగరము చేరిరి. మునులను చూడ భీష్ముడు, విదురుడు, ధృతరాష్ట్రుడు కౌరవాదులు నగరము వెలుపలికి వచ్చిరి. మునులు భీష్మునికి యుధిష్ఠిర, భీమ, అర్జున, నకుల, సహదేవులను వేరువేరుగా పరిచయము చేసి పాండురాజు, మాద్రుల మృతిని తెలియజేసి మృతశరీరముల నప్పగించి తిరోగతులైరి.

## 127. సప్తవింశత్యధిక శతతమ అధ్యాయము
## పాండురాజు యొక్క అంత్యక్రియలు జరుపుట

ధృతరాష్ట్రుడు త్వరితముగా విదురుని పిలచి "మనము తమ్ముని మృతికి విచారించి లాభము లేదు. అతని జీవితము ధన్యమైనది. తేజోమయులైన పంచపుత్రులను పొందిన భాగ్యశాలి. నీవు అంత్యక్రియలకు యేర్పాట్లు చేయుము" అనగా విదురుడు యత్నములు చేయసాగెను.

కురు పురోహితులు అగ్నిలో నెయ్యి వ్రేల్చుచు ముందు బయలుదేర పుష్పమాలలతోను, వివిధ సుగంధములతోను, రత్నాభరణములతోను పాండురాజు, మాద్రుల మృతకళేబరములను వాహకులు మోయ, భీష్మ, ధృతరాష్ట్ర, విదురాదులు, కౌరవులు, అంతఃపుర స్త్రీలు గంగాతీరమును చేరి శరీరములను పునీత గంగాజలముల స్నానము చేయించి గంధాది సుగంధకాష్టమలతోను, ఘృతముతోను దహనసంస్కారము చేయసాగిరి. కౌసల్య హా పుత్రా! పుత్రా! అని రోదనము చేయుచూ మూర్ఛిల్లెను. కుంతీదేవి దీనముగా రోదనము చేయుచూ తెలివి తప్పెను. సత్యవతాదులు ఎటులనో వారికి చందనాదులతో సేదతీర్చిరి. భీష్మాదులు, కౌరవులు అశ్రులోచనులై పంచపాండవులతో పాటు ఉదకక్రియలు జరిపిరి. ఆ దినమున పాండవులు బంధుమిత్రులతో నేలమీదనే శయనించిరి. పదకొండు దినములు ఆ నగరవాసులందరూ నిరానందులై ఉండిరి.

## 128. అష్టావింశత్యధిక శతతమ అధ్యాయము
## పాండురాజు యొక్క ఊర్ధ్వదైహిక క్రియలు

పదకొండవ దినమున పాండవులు తండ్రి పారలౌకిక క్రియలు నెరవేర్చి బ్రాహ్మణులకు భోజనమిడి, బట్టలను, గ్రామములను, గోవులను, స్వర్ణాభరణము లను దానము చేసి, ప్రజలు పాండురాజు గుణములను పొగడుచుండ సబాంధవముగా హస్తినానగరమును ప్రవేశించిరి.

## సత్యవతి గృహస్థాశ్రమమును వర్జించుట

పాండురాజు అంత్యక్రియానంతరము శోకమూర్తియైన తల్లిని మహర్షి కృష్ణ ద్వైపాయనుడు చేరి "అమ్మా! ఇక సుఖము పొందు సమయము లేదు. లోకమున పాపము అభివృద్ధి పొందుచున్నది. లోకులు దుష్కర్ములగుచున్నారు. కౌరవుల దుర్నీతి వలన రాజ్యశ్రీ వారిని వదలును. అల్పదినములలో వీరు సవంశముగా

కృతాంతని చేరెదరు. కులక్షయము నీ కళ్లతో చూచుట కంటే యోగానుష్ఠానముల చేయుట శ్రేయము” అని చెప్ప ఆమె అంబికకు సంగతి తెలియజేసెను. ఆమెయూ అంగీకరించి శోకమూర్తియైన అంబాలికను తోడ తీసుకొని భీష్మాదుల సెలవు తీసుకొని చారులు వెంట రాగా వనములకేగి కఠోర తపస్సు చేసుకొనుచూ శరీరములను త్యజించి అభిలాషిత మార్గముల ప్రస్థానము చేసిరి.

## కురుపాండవ బాలుర క్రీడ

పాండవులు పితృభవనమున నివసించుచూ రాజలాంఛనములతో, భోగములతో పెరుగుచుండిరి. యధా సమయములందు వారికి వేదోక్త సంస్కారములు చేయబడినవి. చిన్నతనమందే వారి తేజస్సు బయలుపడసాగెను. వారు బహువిధములైన క్రీడలను నేర్చుకొనుచుండిరి. వారిలో భీముడు కౌరవులందరికన్నా అమిత బలము కలిగినవాడై వారిని వివిధోపాయముల తన బలమును చూపి పరిహాసము చేయసాగెను. యే విధముగను భీముని పరాస్తుని చేయలేని దుర్యోధనాదులు అసూయతో క్రుమ్మసాగిరి.

## పాండవులను నిగ్రహింప దుర్యోధనుని దురాలోచన

బలవంతుడు, శౌర్య, ధైర్యములు కలిగినవాడు అయిన భీముడు ఒక్కడే తామందరినీ కూడా ఓడించుట పరికించిన దుర్యోధనుడు ఆతడు నిద్రించి యుండు నెడ బంధించి గంగాజలముల విసరిన, సులభముగా మిగిలిన ధర్మరాజు మొదలైనవారిని తుదముట్టించి పూర్తి రాజ్యమును గ్రహింపగలమని రంధ్రాన్వేషణ చేయసాగెను.

తన అభీష్టసిద్ధికై దుర్యోధనుడు గంగాతీరమున సుందరమైన భవనము, పూదోట నిర్మించి జలక్రీడలాడ పాండవాదులను పిలిచి ఆటలాడుచూ భుజించు చున్న సమయమున విషయుక్తమైన మిష్టాన్నము భీమునిచే తినిపింప, భీముడు నీటిఒడ్డున తెలివితప్పి పడిపోయెను. గృహమునకు మరలిపోయినాడని తలచి ధర్మరాజాదులు వెనుకకు తిరిగిరి. సమయము చూసి దుర్యోధనుడు లతలచే భీముని కట్టి గంగాజలముల నిమజ్జనము చేసి ఆనందముగా పురమునకు వచ్చెను. ఇంటికి వచ్చిన పిదప తమ్మునికై యుధిష్ఠిరుడు తల్లిని ప్రశ్నింప, ఆమె భీము డింకనూ రాలేదని చెప్పి భయముతో విదురుని కలసుకొని సంగతి తెలుపగా అతడు వ్యాసమహర్షి నీ పుత్రులందరూ దీర్ఘాయుష్మంతులని చెప్పినాడని, అనవసరముగా భయపడవలదని చెప్పి తిరిగిపంపెను.

## 129. భీముడు నాగలోకము చేరుట

నీటిలో త్రోయబడిన భీముడు నీట మునుగుచూ నాగలోకము చేరి అచట ఆటలాడుకొనుచున్న నాగబాలకులపై పడ వారు భీముని కాటువ్రేయ కాలకూట విషము విరుగుడు పొంది భీముడు చైతన్యము పొంది తన్ను బాధించుచున్న నాగబాలకులను సంహారము చేయ మొదలిడ వారు నాగరాజైన వాసుకిని చేరి "నాగేంద్రా! ఒక మనుష్యబాలకుడు బంధితుడై వచ్చి తెలివిపొందిన పిదప బంధములను ఛేదించుకొని మమ్ములను బాధించుచున్నాడు" అని తెలిపిరి.

## నాగలోకమున భీముడు అమృతమును త్రాగుట

వాసుకి భీముని చేరి అతడు స్వదౌహిత్రుడైన కుంతిభోజుని మనుమడని తెలిసికొని ఆనందమున కౌగలించుకొని ధన, రత్నాదులిచ్చి సత్కరించి వజ్రకాయు డగుటకు అమృతము త్రాగుమని ఆహ్వానింప వృకోదరుడు ఎనిమిది కుండల అమృతము త్రావి నాగులు అమర్చిన దివ్యశయ్యపై పరుండెను.

## భీముడు తిరిగి వచ్చుట

ఎనిమిదవ దినమునకు భీమునకు తెలివి రాగా, వాసకి ఆతనితో "నీ తల్లి, అన్నదమ్ములు నీకై తల్లడిల్లుచున్నారు. నీవు త్వరితముగా పోయి, వారిని కలసుకొని ఆనందింపచేయుము" అని కోర భీముడు నాగులు ఇచ్చిన అనేక వస్తువులతో శుక్లాంబరము ధరించి, కంఠమాలాదులు పరిగ్రహించి, అపరసూర్యుని వలె ప్రకాశించుచూ తల్లిని చేరి నమస్కరించి, అన్నకు ప్రణమిల్లి, తమ్ములను కౌగలించుకొని, దుర్యోధనుడు విషయుక్త మిష్టాన్నము తినిపించినదాదిగా అన్ని సంగతులను వారికి చెప్పెను. ధర్మరాజు ఈ సంగతి మరియెవ్వరికీ తెలియజేయకు మని తమ్మునకానతిచ్చి, ఆనాటినుండి వారు సావధానులై ఒకరినొకరు కాపాడు కొనుచుండవలెనని చెప్పి, అప్రమత్తులై ఉండునట్లు ఒడబరచెను.

## 130. త్రింశతధిక శతతమ అధ్యాయము
## కృపుడు, కృపిల జన్మవృత్తాంతము

జనమేజయుడు వైశంపాయనునికి "ఓ బ్రాహ్మణోత్తమా! దయచేసి ఆచార్య కృపుని జన్మవృత్తాంతము దయచేసి వినిపింపుడు" అని ప్రార్థింప, వైశంపాయను డిట్లు చెప్పసాగెను.

గౌతమమహర్షి కుమారుడు శరసంహితముగా జన్మించినందున శరద్వానుడని పేరు పొందెను. ఊర్ధ్వరేతస్కుడై శరద్వానుడు దీక్షగా తపము

చేయుచుండ శంకాకలిత హృదయుడైన ఇంద్రుడు తపోభంగము చేయ జానపది అను దేవకన్యను పంపెను.

అపురూప సౌందర్యవతియైన దేవకాంతను చూసి మనస్సు చంచలము కాగా ముని హస్తములనుండి శరచాపములు నేలపడెను. ఆతనికి తెలియకుండగనే రేతఃస్కలనముచెందెను. ఆతడు మోహము తప్పించుకొన బయలుదేరి పోవుచుండ రేతస్సు శరస్తంబముపై పడి రెండు భాగములాయెను. దానినుండి ఒక బాలుడు, ఒక బాలిక జన్మించిరి. వేటకై అడవికి వచ్చిన శంతన మహారాజు కృష్ణాజినాదులు చూసి విప్రసంతానమై ఉండనోపురని అసత్య నిర్విశేషముగా వారిని పెంచెను. శంతుని కృప వలన పెరిగిరి కాన వారికి కృపుడు, కృపి అని పేరు కలిగెను.

## కృపుని కురుకుమారుల ఆచార్యునిగా నియమించుట

మరియొక స్థలమున ఆశ్రమము నిర్మించుకొని శరద్వానుడు తపోనుష్టానమున అద్వితీయ ధనుర్ధరుడాయెను. అతడు తపోబలమున కృప, కృపిల జన్మవృత్తాంతాదులు తెలిసికొని హస్తినకు వచ్చి కుమారునకు గోత్రాదులు తెలిపి ఆతనికి చతుర్విధ ధనుర్వేదము, వివిధ శాస్త్రములు అధ్యయనము చేయించి తన ఆశ్రమమునకు మరలిపోయెను.

కొద్దికాలములోనే కృపాచార్యులు పేరుపొందిన గురువుగా పేర్కొనబడ సాగెను. ధృతరాష్ట్ర తనయులు, పాండవులు, యాదవులు, వృష్టి వర్ణములు అతని వద్ద ధనుర్వేదాధ్యయనము చేయసాగిరి.

## ద్రోణుడు ప్రధాన ఆచార్యుడగుట

భీష్ముడు తన మనుమలైన కౌరవ, పాండవులకు నానాశస్త్ర జ్ఞాన సంపన్నుడు, విశిష్ట విద్యాసంపన్నుడు, వినయశీలుడైన వానికై పర్యవేక్షించు సమయమున దైవవశమున అక్కడకు వచ్చిన భరద్వాజ తనయుడైన ద్రోణునిగాంచి తగిన సత్కారముల చేసి రాజకుమారులకు గురువుగా ఆతనిని నియోగించెను. వారును కొద్దికాలములోనే సర్వశాస్త్ర విశారదులై అపరిమిత తేజస్సంపన్నులైరి.

## ద్రోణాచార్యుని జన్మవృత్తాంతము

హిమాలయ పర్వత సానువుల భాగీరథీ తీరమున భరద్వాజ మహర్షి నదీజలముల స్నానమాడ వచ్చిన 'ఘృతాచీ'యను అప్సరసను వివస్త్రగా చూసి రేతఃస్కలనము కాగా కలశమందుంచెను. అందుండి సంభవించిన కుమారుడే ద్రోణుడని పిలువబడెను. ద్రోణుడు వేదవేదాంగవిదుడయ్యెను. భరద్వాజ శిష్యుడు

అగ్నివేశ్యుడు గురుకుమారునకు ఆగ్నేయాది అస్త్రములు నేర్పెను. పృషధుని పుత్రుడు ద్రుపదుడు ద్రోణుని సఖుడు. తండ్రి మృతి అనంతరము అతడే రాజయ్యెను. భరద్వాజుని పరలోకగమనానంతరము ద్రోణుడు శరద్వానుని కుమార్తె కృపిని వివాహమాడి కుమారుని గాంచెను. పుట్టగానే అశ్వము వలె ఘోషించునందున ఆ బాలునకు అశ్వత్థామ అని పేరిడిరి.

## పరశురాముని వద్ద ద్రోణుడు అమోఘ అస్త్రములు పొందుట

మహేంద్ర పర్వతమున నివసించుచూ సర్వస్వము బ్రాహ్మణులకు దానము చేయుచున్న సమయమున శిష్యసమేతముగా ద్రోణుడు అతనిని చేరి "ఓ మహాత్మా! నేను అంగీరసకులోద్భవుడను, అయోనిసంభూతుడను, భరద్వాజ పుత్రుడను. ద్రోణ నామధేయుడను. నాకు ధనమునిండు" అని కోర, పరశురాముడు "నా ధన కనక వస్తువాహనాదులు ఇంతకుముందే దానము చేసితిని. శరీరము ఈ ధనుర్బాణములే మిగిలినవి" అని పలుకగా ద్రోణుడు "ప్రయోగోప సంహార యుక్తముగా మీ అస్త్రసముదయమిండని" వేడుకొనెను. ఈ విధముగా ద్రోణుడు పరశురాముని అస్త్రములను పొంది ఆనందముగా సఖుడైన ద్రుపదుని వద్దకు చనెను.

## 131. ఏకత్రింశదధిక శతతమ అధ్యాయము
## ద్రోణ ద్రుపద సంవాదము

తదనంతరము ద్రోణుడు మహారాజైన ద్రుపదుని చెంత చేరి "రాజా! నేను నీ మిత్రుడను, ద్రోణుడను" అని సంబోధింప ఆతడు క్రోధాన్వితుడై "ఓయి బ్రాహ్మణుడా! ఏనాడో మనమిద్దరము నెచ్చెలులమై ఉండనోపును కాని ధనవంతులతో బీదవారికి, పండితులతో పామరునకు, శూరునితో పేడివానికి యేనాటికైనా స్నేహమేర్పడునా?" అని కఠినముగా పలుక, క్రోధమున కంపిత దేహుడైన ద్రోణుడు సభాస్థలి వీడి హస్తినా నగరము భార్యాబిడ్డలతో శ్యాలకునింట ప్రచ్ఛన్నముగా జీవితము గడుపసాగెను.

## కురుబాలకులకు ద్రోణుడు తన అస్త్రనైపుణ్యము చూపుట

టొకనాడు హస్తినా నగరమున కురుబాలకులు లౌకగుణికచే ఆడుకొనుచుండ ప్రమాద వశమున బంతి ఒక పాడుపడిన నూతిలో పడిపోయెను. బాలురు దానిని తీయలేక నూతినుండి బంతి తీయలేక తిరుగుట చూసిన ద్రోణుడు వారిని "ఓ బాలకులారా! క్షత్రియులమని చెప్పుకొనుచు, శస్త్రాస్త్రములు నేర్చుకొను మీరు

ఈ చిన్నపని చేయలేకపోవుట లజ్జా జనకమైనది కాదా! ఆ బంతినే కాదు ఈ ఉంగరమును కూడా బావినుండి తీతును, చూడుడు” అని తన వ్రేలినున్న అంగులీయకమును నూతిలో పడవేసి, మొదట ఆతడు ఈషికలను ఒకదానిపై మరియొకటి ఛేదించి బంతిని బయటకు తీసెను. తదుపరి తన మూపున ఉన్న ధనుఃశరములతో అంగులీయకమును బయటకు తీసెను. బాలకులందరూ బ్రాహ్మణునకు నమస్కరించి మీ పరిచయము తెలుపుమని కోరిరి.

## ద్రోణుని విద్యాకౌశలము కురుబాలకులు భీష్మునకు తెలియజేయుట

అంత ద్రోణుడు కురుకుమారులతో “నాయనలారా! మీరు మీ తాతయైన భీష్మునితో నా రూపగుణములు వర్ణింపుడు. అతడు తప్పక నన్ను పోల్చుకొనును” అనగా బాలకులందరూ తాత వద్దకు చని ద్రోణుని రూపమును వర్ణించి అతడు చూపిన ఆశ్చర్యకరమైన పనిని తెలిపిరి. సుశిక్షితుడైన గురువకై అన్వేషించుచున్న భీష్ముడు, వచ్చినది ద్రోణాచార్యునిగా పోల్చుకొని స్వయముగా ద్రోణుని సమీపించి ఆతనిని తన స్వీయభవనమునకు తోడ్కొనిపోయి యథోచిత సత్కారములను చేసి సాదర సుభాషణానంతరమూ కుశల ప్రశ్నలు వేయుచూ ఆగమన కారణము అడిగెను.

## భీష్మునితో ద్రోణుడు తన దైన్యము తెలుపుట

ద్రోణుడు భీష్మునితో ఇట్లనెను. “ఓ మహాత్మా! నేను మహర్షి అగ్నివేశ్యుని వద్ద బ్రహ్మచర్యమవలంబించి, ఆత్మసంయమనముతో జటాధారినై శిష్యుడనై ఉండునెడ పాంచాల దేశ రాజపుత్రుడైన ద్రుపదుడు కూడా విద్యార్థియై యుండెడివాడు. క్రమముగా మేమిద్దరమూ పరమస్నేహితులమైతిమి. ఆతడు విద్యానంతరము పితృగృహమునకేగుచు నాతో “ఓ స్నేహితుడా! మనలో స్వపర భేదములు లేవు కదా! త్వరలో నేను రాజయ్యెదను. నా సర్వభోగములు, సంపదలు, సుఖములు, సమస్తము నీ అధీనములు. నీవు తప్పక నా వద్దకు రావలసినది.” అని కోర నేనాతని ఆదరముతో వీడ్కొలిపితిని.

పిత్రు నియోగానుసారము నేను కృపి అను కన్యను వివాహమాడితిని. మాకు అశ్వత్థామ అను కుమారుడు కలిగెను. బాల్యావస్థయందున్న నా కుమారుడు ధనికుల పుత్రులను చూసి పాలను కోర, దీనావస్థయందున్న నేను బాలకుని కోర్కె తీర్చలేకపోయితిని. ఆతడు తల్లి ఇచ్చిన బియ్యపు పాలను త్రాగుచు పాలని

ఆనందించుచున్నాడు. ఇతర బాలకులు చూచి వెక్కిరింప ఆతడు దీనముగా రోదనము చేయసాగెను.

చిన్ననాటి స్నేహితుడైన ద్రుపదుని మాటలు జ్ఞప్తికి వచ్చి నేను ఆతనిని చేర నన్ను తిరస్కరించి కఠినోక్తులాడ నేను అచటనుండి తిరిగి వచ్చితిని. భీష్మా! నాటి సభాస్థలి వీడు సమయమున నేను చేసుకొనిన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనుటకై గుణవంతులైన శిష్యుల కొరకు అన్వేషించుచూ ఈ కురునగరమునకు వచ్చితిని. మీకు నేనేమి చేయగలనో దయచేసి తెలుపుడు".

ద్రోణుని ఈ మాటలు విని భీష్ముడు "ఓ బ్రాహ్మణావతంశా, మీరు దయచేసి శరాసన గుణమోచనము చేయుడు. అనుగ్రహించి ఈ బాలకులకు అస్త్ర శిక్ష గరుపవలసినది. ప్రీతి ప్రసన్నవదనులై సుఖముల ననుభవించుడు. కౌరవుల ధన, రాజ్యములు మీ అధీనములు. మేమందరమూ మీ ఆజ్ఞానువర్తులము. మీరు కోరిన వెంటనే అన్నియూ సమకూర్చెదము. మా సౌభాగ్యవశమున మీరు ఇచ్చటకు అనుగ్రహించి వచ్చితిరి" అని ఆదరముగా పలికి ద్రోణుని ఆదరించెను.

## 132. ద్వాత్రింశదధిక శతతమ అధ్యాయము
## కౌరవ శిష్యగణమునకు ద్రోణుడు అస్త్రశిక్ష గరపుట

వైశంపాయనుడిట్లనెను. మహారాజా! అనంతరమూ భీష్ముని వలన సత్కృతుడైన ద్రోణుడు ధన, ధాన్య సంపదలతో, దాసదాసీజనములతో చక్కని గృహమున నివసించసాగెను. కురుకుమారులందరూ విద్యార్థులై ఆతని ఆత్మీయవాసులైరి. ద్రోణుడు శిష్యులను చూసి "నాయనలారా! నేను ఉత్తమముగా మీకు అస్త్రశిక్ష నేర్పెదను. కాని విద్యానంతరము నా కోర్కెను మీరు తీర్చవలయును? మీకు అంగీకారమేనా?" అని ప్రశ్నింప దుర్యోధనాదులందరూ మిన్నకుండిరి. అర్జున కుమారుడొక్కడు నిలబడి గురువు వాక్యములను స్వీకరించుచూ "మహాశయా! మీరు ఆదేశించిన క్రమముగా నేను చేసెదను. సందేహింపకుడు" అని పలుకగా ద్రోణుడు ఆనందాశ్రువులు రాల్చుచూ ఆతని ఆలింగనము చేసుకొని మస్తకము అఘ్రాణించెను.

## అర్జునుడు మేటి విలుకాడగుట

ద్రోణాచార్యులు కురుకుమారులందరకూ వివిధ అస్త్రశస్త్రముల ప్రయోగోపసంహారాదులు నేర్పసాగెను. ఈ సంగతి తెలిసిన అంధక వంశీయ రాజులు తమ కుమారులను పంపిరి. సూతపుత్రుడు కర్ణుడు కూడా విద్యార్థియై గురుని

చేరెను. కొద్దికాలములోనే అర్జునుడు వారందరిలోను మేటి విలుకాడుగా పేరుగాంచెను. ఆతని ప్రయోగ, లాఘవ, కౌశలాదులు పరికించి ద్రోణుడు ఆతనికి సవిశేషముగా ఉపదేశము చేయసాగెను.

ప్రతి ఉదయము విద్యార్థులు నదికేగి కమండలములతో జలములను గ్రహించి గురువును చేరునెడ ద్రోణుడు తన కుమారునకు మాత్రము పెద్ద ముఖమున్న కమండలము ఇచ్చి ఇతరులకు క్షుద్రముఖ కమండలములివ్వ గురుపుత్రుడు త్వరగా నింపుకొని తండ్రిని చేరెడివాడు. ఇతరులు వచ్చు లోపున ద్రోణుడు ఆతనికి విశేషములైన అస్త్రములను ఉపదేశించెడివాడు. ఇది తెలిసికొని అర్జునుడు వారుణాస్త్రముతో కమండలము జలముల నింపి అశ్వత్థామతో గురువుని చేరి శ్రద్ధతోను, భక్తితోను మనస్సు నిల్పి నేర్చుకొనుచూ క్రమముగా ద్రోణునికి ప్రియపాత్రుడయ్యెను.

అర్జునుని ఆసక్తిని గ్రహించిన ద్రోణుడు, వంటమనిషిని పిలిచి ఆమెతో "నీవు అర్జునునకు ఎప్పుడూ చీకటిలో అన్నము పెట్టవలదు" అని చెప్పి పంపెను. ఒకనాడు అర్జునుడు రాత్రి భోజనము చేయుచుండగా పెద్దగా గాలి వీచుటచే దీపమారిపోయెను. అభ్యాసమున ఆతడు భోజనము చేయుచూ, చీకటిలో కూడా అన్ని పనులను అభ్యాసము చేసిన చేయగలమని గ్రహించి రాత్రికాలమందు ధనస్సున నారి సంధించి అభ్యాసము చేయసాగెను. ఆతని ధనుష్టంకారము విని ద్రోణుడు వచ్చి కారణము తెలిసికొని చాలా సంతోషించి, "నాయనా! అర్జునా! నీతో సమతుల్యుడైన ధనుర్ధరుడు ఈ లోకమున వేరొకడు లేకుండునట్లు విద్య నేర్పెదను" అని పలికి వివిధమైన గోపవిద్యలు ఆతనికి నేర్పెను.

## ఏకలవ్యుని అలౌకిక గురుభక్తి

ఒకనాడు నిషాదరాజు పుత్రుడు ఏకలవ్యుడు ద్రోణాచార్యుని వద్దకు విద్యను అభ్యసించ చేరగా ఆతడు అస్పృశ్యుడైన మ్లేచ్ఛునకు విద్యను నేర్ప నిరాకరించెను. ఆ బాలకుడు ద్రోణుని పాదాభివందనము చేసి అరణ్యమున కుటీరమును నిర్మించుకొని, మట్టితో ద్రోణుని బొమ్మను చేసుకొని దానికి ఎదురుగా నిలుచుని విద్య నేర్చుకొనుచూ మంచి విలుకాడయ్యెను.

ఒకనాడు గురువు ఆనతి తీసుకొని కురుబాలకులు రథారూఢులై వేటకు అడవికి వెళ్లిరి. అచ్చట వారి శునక మొకటి దారి తప్పి యేకలవ్యుని ఆశ్రమ స్థలమును చేరి ఆతని మలిన కళేబరము, కృష్ణాజినము, జడలను చూసి

మొరుగసాగెను. ఏకలవ్యుడు ఒకేసారి ఏడు బాణములు వదలి దానికి తగులకుండా నోరు కట్టివేసెను. అర్జునాదులు ఆ కుక్కను చూసి ఆశ్చర్యము పొంది, వెదకుచు ఏకలవ్యుని చేరి ప్రశ్నింపగా ఆతడు తాను ద్రోణాచార్యుని శిష్యుడనని తెలిపెను. నగరమునకు తిరిగి వచ్చి బాలకులు గురుని చేరి జరిగిన సంగతి చెప్పిరి. అర్జునుడు "గురూ! మీరు నన్ను అందరిలోను ప్రవీణునిగను, మేటి విలుకానిగను చేసెదరంటిరి. నేటికి అది మిథ్య అని ప్రమాణమైనది" అని దీనముగా పలికెను.

ఆచార్యుడు శిష్యసమేతుడై ఏకలవ్యుని చేర, ఆతడు సాదరముగా గురువు నాహ్వానింప ద్రోణుడు ఆతనిని గురుదక్షిణగా కడిచేతి బొటనవ్రేలు కోరగా సత్యవాక్య పరిపాలకుడైన యేకలవ్యుడు తన కుడిచేతి బొటనవ్రేలు తెగవేసి గురునకు దక్షిణగా సమర్పించెను. తదుపరి ఎడమచేత ధనుర్బాణములను ధరించెను గాని మునపటి లాఘవము మాత్రము పొందలేకపోవుట చూసిన అర్జునాదులు సంతసించి నగరాభిముఖులైరి.

అర్జునుడు లోకైక ధనుర్ధరుడయ్యెను. భీమ దుర్యోధనులు గదాయుద్ధమున నిపుణులైరి. అశ్వత్థామ సర్వ రహస్యములు తెలిసికొనిన పారదర్శియని పేరు గాంచెను. నకుల సహదేవులు అశిచర్యయందు కుశలులైరి. యుధిష్ఠిరుడు మేటి రథికుడయ్యెను. ధార్తరాష్ట్రులు భీమార్జునుల కుశలతను గాంచి ఈర్ష్యాపరవశు లగుచుండిరి.

## అస్త్రశిక్ష యందు అర్జునాదుల పరీక్ష

ఒకనాడు ద్రోణుడు శిల్పిచే పక్షిని చేయించి వృక్షమందు ఉంచి శిష్యులనందరనూ పిలిచి "నేను మీ కౌశల్యము పరీక్షింప దలచితిని. నేను చెప్పిన వెంటనే పక్షి శిరచ్ఛేదము చేయుడు" అని పలికి ముందుగా ధర్మరాజును పిలచి శరము సంధింప ఆజ్ఞాపించి "నీకేమి కన్పించుచున్నది?" అనగా ఆతడు నేను వృక్షమును, మిమ్ము, తమ్ములను చూచుచున్నాననెను. నీ వలన లక్ష్యభేదము జరుగదని ఆతనిని పంపి మరిఒకరిని పిలిచెను. దుర్యోధనాదులెవ్వరూ ఆతని మనోగతమైన జవాబు ఇవ్వలేక మరలిపోయిరి.

## 133. త్రయోత్రింశధిక శతతమ అధ్యాయము

## అర్జునుని సఫలత

వైశంపాయనుడిట్లనెను. మహారాజా! తదనంతరము ద్రోణుడు సహాస్య వదనుడై అర్జునుని పిలచి "అర్జునా! నీవే ఈ లక్ష్యభేదము చేయుదువని

ఆశించుచున్నాను. నీవు శరమును సంధింపుము" అని పలికి అందరినీ ప్రశ్నించిన విధముగా "వత్సా! వృక్షమును, నన్ను, భాతృగణమును చూచుచున్నావా?" అని అడుగ అర్జునుడు "గురువరా! నాకు పక్షి మాత్రమే కన్పించుచున్నది. అందున దాని శిరస్సు మాత్రమే నేను చూచుచున్నాను" అని ప్రత్యుత్తరమిచ్చెను. "లక్ష్యమును భేదించుమ" అని గురువు ఆనతించిన మాత్రమున ఆతని బాణము ముక్తి పొంది పక్షి శిరము ఖండించబడి నేలబడెను.

కొంతకాలము అయిన తరువాత ద్రోణాచార్యుడు గంగానది స్నానమాడ శిష్యులతో వెడలెను. అచట ఒక మొసలి ఆతని ఝంగదేశమును పట్టుకొనగా, స్వీయప్రభావమున ముక్తి పొందక శిష్యులను పరీక్షింప "ఓ శిష్యులారా! ఒక భయంకర మొసలి నన్ను పట్టుకొన్నది. నన్ను రక్షింపుడు" అని పెద్దగా కేక వేసెను. అర్జునుడు తప్ప మిగిలిన రాజకుమారులు కర్తవ్యవిమూఢులై చిత్రముల వలె నిలబడిరి. అర్జునుడు వెంటనే ఐదు శరములను ప్రయోగించి మొసలిని చంపి గురుని రక్షించెను.

నీటినుండి బయలువెడలి ద్రోణుడు మిక్కుటముగా సంతసించి అర్జునునితో "మహాబాహో! నేడు నీకు ప్రయోగోపసంహార యుక్తముగా బ్రహ్మశిరోః నామకాస్త్రమును ప్రదానము చేయుచున్నాను. దీనిని గ్రహింపుము. కాని వత్సా! దీనిని సామాన్య మానవులపై మాత్రము ఎన్నడూ ప్రయోగింపకుము. అట్లు చేసిన సమస్త చరాచరమైన జగత్తునే నాశనము చేయును" అని చెప్పి ఆతనికా అస్త్రము నిచ్చి "నాయనా! ఈ జీవనలోకమున నీ సమతుల్యుడైన ధనుర్ధరుడు వేరొకడు లేడు" అని పలికెను.

## 134. చతుత్రింశధిక శతతమ అధ్యాయము
## కుమారుల కృత్రిమయుద్ధ ప్రదర్శన

కురు కుమారులు విద్య అందు ఆరితేరిన పిమ్మట ద్రోణుడు భీష్మ, విదురాదులు కూడియుండు నెడ ధృతరాష్ట్రుని చేరి "మహారాజా! మీ కుమారు లందరూ ధనుర్వేదాదులందు కృతవిద్యులైరి. మీరు అనుమతించిన వారు తమ విద్యాపాటవము చూపించెదరు" అని పలుక ధృతరాష్ట్రుడు సంతసించి ద్రోణునకు తమ కృతజ్ఞతను తెలుపుకొని విదురుని పిలచి గురుని ఆదేశానుక్రమమున రంగస్థలము నిర్మించ ఆజ్ఞాపించెను.

## రణక్షేత్ర నిర్మాణము

ద్రోణాచార్యులు తగిన స్థలము చూప రంగస్థలమును నిర్మించిరి. డిండమ ప్రచారముతో వీరులను ఆహ్వానించిరి. రంగస్థలమును అస్త్ర, శస్త్రములతో తగిన విధముగా అమర్చిరి. అంతఃపుర స్త్రీలకు, పౌరులకు, రాజన్యులకు వేర్వేరు చక్కని ఉన్నత శిబిరములు నిర్మించి అలంకరించిరి.

## యుద్ధ దర్శనార్థము ప్రజల రాక

నిర్ణీత దినమున ధృతరాష్ట్రుడు, భీష్మ, కృపాచార్య, విదురాదులతో సింహాసనమును దాసదాసీజనముతో అధిరోహించెను. గాంధారి, కుంతి, మొదలగు స్త్రీ జనము తమ తమ స్థానముల ఉపవీతులైరి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాది చాతుర్వర్ణ పురుషులు, స్త్రీలు గుంపులు, గుంపులుగా వచ్చి కూర్చొని హర్షోల్లాసములు చేయసాగిరి. అట్టి అవసరమున శుక్లాంబరధారి, శుక్లకేశుడు, శుక్లయజ్ఞోపవీత సంపన్నుడు, శుక్లస్మశ్రు, శుక్ల చందనలేప శరీరుడు అయిన ద్రోణాచార్యుడు, శుక్లమాల్యాలంకృతుడై కుమారుడైన అశ్వత్థామతో మేఘమైన ఆకాశమున చంద్రునివలె ప్రకాశించుచు రంగస్థలము ప్రవేశించెను.

## యుద్ధారంభము

మహావీరులైన రాజపుత్రులు అంగుళిత్రములను తొడగికొని, హస్తములందు ధనుర్బాణములు ధరించి సర్వజ్యేష్ఠుడైన యుధిష్టిరుడు అగ్రభాగమును అలంకరింప జ్యేష్ఠానుక్రమముగా బారులు తీరి వివిధ మధరు వాద్యములు మ్రోగుచుండ రంగస్థలమును ప్రవేశించిరి.

తదుపరి రథములపైన, ఏనుగులపైన, గుఱ్ఱములపై అధిరోహణావ రోహణములు చేయుచూ, స్వనామాంకితములైన శరములతో లక్ష్యభేదము చేయుచూ, ఖడ్గసంచాలనము చేయుచూ వివిధ శస్త్రముల ద్వంద్వయుద్ధముల చేసి అందరి మనస్సులను చూరగొనిరి.

అనంతరము మహాబల పరాక్రములైన భీమ, సుయోధనులు గదాహస్తులై రంగస్థలమున ప్రవేశించి రెండు కొండలు ఢీకొనినట్లు, మత్తమత్తేభములు ఒండొంటిని తాకినట్లు గదాయుద్ధమును ఊరువుల ఆస్ఫాలనము చేసి భీకరముగా గర్జించుచూ ప్రారంభించిరి. వారు మండలాకారాది వివిధ గతుల తిరుగుచూ గదాయుద్ధము చేయుచుండ గదల తాకిడికి నిప్పురవ్వలు రేగసాగెను. విదురుడు, కుంతి రాజకుమారుల సమస్త వృత్తాంతమును ధృతరాష్ట్రునకు, రాజమహిషి గాంధారికి వినిపించిరి.

# 135. పంచత్రింశదధిక శతతమ అధ్యాయము
# ద్రోణుడు సభాసదులకు అర్జునుని పరిచయము చేయుట

భీమ, దుర్యోధనుల గదాయుద్ధము తీవ్రతరమగుట చూసి ద్రోణుడు కుమారుడైన అశ్వత్థామను పిలచి "వత్సా! మహావీరులు, సుశిక్షితులైన ఈ వీరద్వయము క్రోధోద్రేకులు కాకుండా, గదాయుద్ధమును ఆపుము" అని ఆనతివ్వ ఆతడు రంగస్థలము ప్రవేశించి వీరులిద్దరిని నిరస్త్రులను చేసెను.

తదనంతరమూ ద్రోణుడు అర్జునునితో రంగస్థలమున ప్రవేశించి "మదీయ శిష్యుడైన అర్జునుడు నాకు నా కుమారుని కన్నా ప్రియతముడు. ఈతడు సర్వశాస్త్ర విశారదుడు. ఉపేంద్రతుల్యుడు. ఓ దర్శకులారా! మీరీతని విద్యాపాటవమును నిరీక్షింపుడు" అని మేఘగంభీరముగా పలికెను.

అర్జునుడు ఆచార్యుని అనుమతిని తీసుకొని గోధూలతా అంగుళీ త్రానముతో, కాంచనమయ కవచముతో, ధనుర్బాణములతో రంగస్థలి ప్రవేశింప నలుదిశల ఆతని పొగడుచూ ప్రజలు హర్షధ్వానములు చేయసాగిరి. ఈ శబ్దమును విని ధృతరాష్ట్రుడు విదురుని కారణమడుగ అతడు పాండవ మధ్యముని ప్రజలు చేయుచున్న ప్రశంస అని తెలుప ధృతరాష్ట్రుడు "కుంతీ గర్భసంభూతులైన పాండవుల వలన నేను అనుగృహీతుడను, రక్షితుడను అయినాను" అని మందమతము పలికెను.

## అర్జునుని అస్త్రకౌశల్యప్రదర్శన

ప్రజల కోలాహలము తగ్గిన పిదప అర్జునుడు ఆగ్నేయాస్త్రము, వారుణాస్త్రము, పర్జన్యాస్త్రము, భౌమాస్త్రము, అంతర్ధానాస్త్రము మొదలయిన దివ్యాస్త్రములను ప్రదర్శించెను. తన శిక్షాకౌశలమున ఒకప్పుడు దీర్ఘతముడగుచు మరియొకప్పుడు హ్రస్వాకృతి వహించుచూ, సుకుమార, స్థూల, సూక్ష్మ, లక్ష్యములను అనాయాసముగా భేదించుచూ, లోహవరాహమున ఐదు బాణములను ఒకేసారి వేసియు, వివిధ ఆయుధముల పాటవమును ప్రకటించియు దర్శకులను ఆశ్చర్యాంబుధిలో ముంచెను.

ఆ సమయమున జనుల హర్షోల్లాసములను కూడా మించిన భుజాస్ఫాలనము చేయు శబ్దము విని అందరూ రంగస్థల ద్వారము దెస చూడసాగిరి.

# 136. షట్త్రింశదధిక శతతమ అధ్యాయము
# రణాంగణమున కర్ణుడు ప్రవేశించుట

దర్శనులందరూ ఈ మహానుభావుడెవడని ఆశ్చర్యము పొందుచుండ సహజ కవచ కుండలములు దీప్తి పొంద, సూర్యచంద్రులవలె ముఖకాంతి ప్రజ్వరిల్ల, కటిదేశమున ఖడ్గము వ్రేలాడుచుండ మృగరాజువలె మందమందముగా అడుగులు వేయుచూ కర్ణుడు సభ ప్రవేశించి "పార్థా! నీవు చూపిన విద్యలన్నియూ నేను కూడా చూపగలను. ఆశ్చర్యపడకుమీ" అని మేఘగంభీరముగా పలికెను.

అనంతరము అతడు అర్జునునకు సిగ్గు, దుర్యోధనునకు ఆనందము కలుగ అర్జునుడు చూపిన అస్త్రములన్నియు ప్రయోగించి చూప, సుయోధనుడు హర్షాతిరేకమున ఆతనిని కౌగిలించుకొని "మహాబాహో! మా సౌభాగ్యక్రమమున నీవు ఇచ్చుటకు వచ్చితివి. నీవు మాతో స్వేచ్ఛగా మా సౌభాగ్యములన్నియూ అనుభవించుము" అని పలుక, కర్ణుడు "ప్రభో! నేను ఉచితకార్యమును మాత్రమే చేసితిని. నాకు మీ స్నేహము, అర్జునునితో ద్వంద్వయుద్ధము ప్రసాదింపుడు" అని వినయముగా పలుకగా, దుర్యోధనుడు దర్పముగా "నాతో స్నేహము చేసి విషయభోగములను అనుభవించుము. విపక్షుల మస్తకమున పదాఘాతము చేయుము" అనెను.

దుర్యోధనుని మాటలు విని అర్జునుడు రోషకషాయిత లోచనుడై "కర్ణా! అనాహుతుడవై వచ్చి, బీరములు పల్కు నిన్ను ఇప్పుడే యమసదనము కనిపెదను" అని గర్జింప కర్ణుడు నవ్వుచూ "అర్జునా! ఇది రణభూమి. ఇందు వీరులందరకూ స్థానము కలదు. నీవే కాదు, మేమూ ......... సుమీ! ఈ గురుజనుల సమక్షమందే నా శరమున నీ శిరచ్ఛేదము చేసి నీ దంభోక్తులను ఆపెను" అని వ్రాక్కుచ్చెను.

అర్జునుడు సంగ్రామము చేయ రణస్థలమందు కర్ణునకు ఎదురు నిలువ, సుయోధనాదులు నూర్గురు కర్ణునివైపు నిలచి వెంట రాగా భీష్మ, ద్రోణాదులు అర్జునుని ప్రక్క నిలుచుండిరి. ఇట్లు చూచుచుండగనే సభయంతయు రెండు భాగములై ఒక భాగము అర్జునుని మరియొక భాగము కర్ణుని సమర్థించిరి. వారి జన్మకారకులు కూడా పక్షము వహించినట్లు అర్జునునిపై నీడనిచ్చుచూ మేఘములు నిలువకర్ణుడు ఎండలో నిలుచుండియుండెను.

ఈ విధముగా భీకర రూపము దాల్చిన రంగస్థలి చూచి కుంతి మూర్ఛిల్ల దాసులు ఆమెకు శైత్యోపచారములు చేసిరి.

ధనుర్ధరులై ముందుకు వచ్చి కర్ణార్జునులను చూచి ద్వంద్వ యుద్ధ విశారదుడైన కృపాచార్యులు ముందుకు వచ్చి కర్ణునితో "ఈతడు కుంతీగర్భ సంజాతుడు. పాండురాజు తృతీయపుత్రుడు అర్జునుడు. నీతో ద్వంద్వయుద్ధము చేయబోవుచున్నాడు. నీ పితృపరిచయము చేయకోరుచున్నాను. నీ కులశీలములు తెలిసిన తరువాతనే అర్జునుడుయుద్ధమును చేయును. రాజకుమారులు అజ్ఞాత కులశీలురతో ద్వంద్వయుద్ధము చేయరాదు" అని అర్జునుని చూపుచూ పలికెను.

## కర్ణుడు అంగరాజగుట

ఈ మాటలు విని కర్ణుడు లజ్జావదనుడై అధోముఖుడు కాగా దుర్యోధనుడు ముందరకు వచ్చి "ఆచార్యా! సత్కుల సంభూతుడు, వీరుడు, సైన్య పరిచాలనము చేయగలిగినవాడు యుద్ధము చేయ సమర్థుడని శాస్త్రములు పలుకుచున్నవి. అర్జునుడు రాజులతోనే కాని యుద్ధములతోనే కాని యుద్ధము చేయడని మీరనిన నేనిపుడే ఈ మహాపురుషుని అంగరాజుగా అభిషిక్తుని చేయుదునని" గంభీరముగా పలికెను.

## కర్ణుని అభిషేకము - దుర్యోధనునితో సఖ్యము

తదనంతరము కర్ణుని స్వర్ణసింహాసనమున కూర్చుండబెట్టి, బ్రాహ్మణులు మంత్రములు చదువుచుండ, సేవకులు చామరములు వీవ, ఛత్రముపట్ట, వందిమాగధులు జయధ్వనులు చేయ దుర్యోధనుడు సువర్ణపుష్పములతో రాజ్యాభిషిక్తుని చేసెను.

అంగరాజైన కర్ణుడు సుయోధనునితో "మహారాజా! మీరు చూపిన ఆదరమునకు నేను చిరకృతజ్ఞుడను. మీకు నేనేమి చేయగలను? తెలుపుడు" అన సుయోధనుడు "నాకు నీవలన కావలసినది స్నేహమే సుమీ" అని పలుక కర్ణుడు "తథాస్తు" అనెను. వారిరువురు తమ మైత్రీ బంధమోయన ఆలింగనము చేసుకొనిరి.

## 137. సప్తత్రింశదధిక శతతమ అధ్యాయము
## కర్ణుని ఉద్దేశించి భీముడు కఠినోక్తులాడుట

పైబట్ట లేకుండా కంపితశరీరుడై రంగస్థలములను అతిరథసూతుడు ప్రవేశింప పితృ గౌరవార్థము అభిషేకసిక్తమై కిరీటము వెలుగొందుచున్న శిరమును వాల్చి పాదాభివందనమును కర్ణుడు చేయుచుండుట చూచి భీముడాతనిని సూత పుత్రునిగా గ్రహించి "కర్ణా! అర్జునుని చేతులలో అనవసరముగా ఏల చావుకు

సిద్ధమగుచున్నావు? నీ కులోచితమైన పగ్గములు పట్టుకొనుము. నీ వంటి కుక్కలు అంగరాజ సింహాసనమధిరోహింప తగదు" అని హాస్యముఖమున గేలిచేయుచు నవ్వసాగెను.

క్రోధమున శరీరము కంపించుచుండ కర్ణుడు పదే పదే నభోమండలమున సూర్యుని చూడసాగెను.

భీముని మాటలు విని దుర్యోధనుడు కుపితుడై "భీమా! నీవిటుల కర్ణుని అవమానించి తగని పని చేసితివి. అర్జునుడు క్షత్రియులతోనే తప్ప యుద్ధము చేయడనుట అవివేకము కాదా! క్షాత్రమును జన్మముతో బంధింపశక్యమా? క్షత్రియుడయ్యు విశ్వామిత్రుడు అక్షయబ్రహ్మత్వము పొందలేదా? ద్రోణాచార్యులు, కృపాచార్యులు బ్రాహ్మణులైనా అద్వితీయ శస్త్రధారులు కాలేదా? సహజ కవచ కుండలధారియైన ఈ కర్ణుడు హీనవంశోద్భవుడు ఎన్నటికీ కాదు. ఈతడు మన రాజ్యమే కాదు తలచుకొన్న సమస్త పృథ్విని జయించి యేలగల సమర్థుడు. కర్ణుని రాజ్యలాభమున యెవరైనా ప్రతికూలురైన నేను సోదరసమేతుడనై సంగ్రామము చేయ సిద్ధముగా నున్నాను" అని పలికెను.

సూర్యుడు అస్తమించి చీకట్లు కమ్ముకొనుచుండ సభాసదులందరూ పరిపరి విధముల మాటలాడుకొనుచూ గృహోన్ముఖులైరి.

కర్ణుని చూసిన కుంతి మనస్సు మాతృప్రేమతో నిండి అతని అభివృద్ధికి ఆనందించెను.

## 138. అష్టత్రింశదధిక శతతమ అధ్యాయము
## ద్రోణుని గురుదక్షిణ - ద్రుపద నిగ్రహము

వైశంపాయనుడు జనమేజయునితో ఇట్లనెను. "మహారాజా! కృతవిద్యులైన శిష్యులను పిలచి వారితో ద్రోణాచార్యుడిట్లనెను. "మీరు రణక్షేత్రమున పాంచాల దేశపు రాజైన ద్రుపదుని ఓడించి బందీని చేసి నాకిందు. అదే మీ గురుదక్షిణ" అని పలుక శిష్యులు గురుదక్షిణ నిచ్చుటకు బయలుదేరిరి. దుర్యోధన, కర్ణ, యుయుత్సు, దుశ్శాసన, వికర్ణ, జలసంధ, సులోచనాదులు రథారూఢులై పాంచాల నగరమున చేరి పాంచాల రాజు 'యజ్ఞసేనుడు' తన సైన్యమును సమకూర్చుకొని వారిని తలపడెను. పోరు తీవ్రముగా జరుగసాగెను.

ఆ సమయమున అర్జునుడు గురుని చేరి "ఆచార్యా! కురుకుమారులు తమ పరాక్రమమును చూపింపనిండు. వీరు ద్రుపదుని ఓడింతురని నేను

తలంచను. వారి తరువాత నేను నా పరాక్రమమును చూపెదను" అని అన్న దమ్ములతో అరక్రోసు దూరమున ఆగి రణమును వీక్షింపసాగెను. దుర్యోధన, కర్ణాదుల శరపరంపరలను ఖండించి ద్రుపదుడు తన బాణములతో వారిని జర్జరీభూతులను గావించి, పాండవుల దెస తిరిగి సింహనాదమును చేసెను.

## ద్రుపదుడు అర్జునునితో యుద్ధము సేయుట

ద్రుపదుని సింహగర్జన వినిన పాండవులు గురుని ఆశీర్వాదము పొంది యుద్ధముచేయ బయలుదేరిరి.

అర్జునుడు అన్న ధర్మరాజును యుద్ధము సేయవలదని కోరెను. నకుల సహదేవలను వ్యూహరక్షకులుగా నియమించెను. భీమడు యమపాశ సదృశమై గదను పూని అరివీరులను దునుమాడసాగెను. అర్జునుడు బాణపరంపరలను వేయసాగెను.

## ద్రుపదుడు ఓడిపోవుట

అర్జునుడు రిపు సైన్యములను భేదించుకొని ద్రుపదుని చేర వారిరువురకు ఘోరమైన సంగ్రామము జరిగెను. అర్జునుడు ఐదు బాణమలతో ద్రుపదుని ధనస్సు, ధ్వజము, సారథి, గుఱ్ఱములను పడగొట్టెను.

## అర్జునుడు ద్రుపదుని బంధించి ద్రోణునకు అర్పించుట

అనంతరము అర్జునుడు భీముని అనవసరముగా రక్తపాతము కానివ్వకుమని ద్రుపదుని బంధించి గురని వద్దకు తీసుకొని వచ్చి సమర్పింప ద్రోణుడ యజ్ఞసేనునితో "ఓ ద్రుపదమహారాజా! నా ఆదేశానుసారము నేడు నీవు, నీ రాజ్యము నా ఆధీనులైరి. ఈ సమయమున నాతో సఖ్యము చేయ నీకిష్టమేనా?" అని నవ్వుచూ పలికి మరల ఇట్లనెను, "ఓ వీరుడా! ప్రాణములు పోవునేమోయని నీవు భయపడవలదు. నేను క్షమాశీలుడనైన బ్రాహ్మణుడను. నీతో చిన్నతనమున ఆడుకొనుచూ సఖ్యతతో విద్యాభ్యాసము చేసిన సహాధ్యాయిని. నీవు నాతో యే విధముగా ప్రవర్తించినా, నాకు నీయందు స్నేహభావమే యున్నది. నీతో మరల స్నేహము చేయ ఇచ్ఛ కలదు. అందులకే మరల అర్ధరాజ్యము వరమిచ్చుచున్నాను. నీవొకనాడు నాతో రాజు కానివాడు రాజుతో సఖ్యము చేయ అర్హుడు కాడంటివి. అందువలన గంగానదికి ఉత్తరమున ఉన్న రాజ్యమును నేనేలెదను. దక్షిణభాగము నీవు తీసుకొమ్ము. ఇది నీకిష్టమైన మరల మనము స్నేహితులమయ్యెదము."

ద్రుపదుడు అంగీకరించి అతని స్నేహవత్సలతకు ధన్యవాదములు తెలిపి, నగరికి తిరిగివచ్చి యుద్ధమున ద్రోణుని ఓడింపజాలనని తెలిసికొని అలౌకిక బ్రహ్మబలమున పుత్రని పొంద కృతనిశ్చయుడై పర్యటనము చేయసాగెను.

## 139. యేకోన చత్వారింశదధిక శతతమ అధ్యాయము
## శౌవీర పరాజయము

సంవత్సర కాలము గడచిన పిమ్మట ధృతరాష్ట్రుడు, ధర్మరాజును యువరాజుగా అభిషిక్తుని చేసెను. అతడు స్వకీయ అసాధారణ ధైర్య, స్థైర్య, సహిష్ణుత, ఋజుత, అనృశంచార, భృత్యానుకంపాదులతో అందరి మనస్సులను చూరగొనెను.

భీమసేనుడు అసిచర్య, గదాయుద్ధ, రథయుద్ధాదులలో బలదేవుని వద్ద జ్ఞానార్జనము పొంది అన్నకు ఆజ్ఞానువర్తియైయుండెను.

అర్జునుడు క్షురప్ర, నారాచ, భల్ల, బిపాలన ప్రభృతి బహు విధ అస్త్రశస్త్రముల పారదర్శియై అజేయ విలుకాడై ద్రోణుని వలన భూయసి ప్రశంసలు పొంది బ్రహ్మశిరోఃఅస్త్రమును ఇచ్చి గురుదక్షిణగా రణమున ప్రద్వందివి కమ్మని అడగ అర్జునుడు అంగీకరించెను. సహదేవుడు శుక్రాచార్యులవద్ద నీతిశాస్త్రకోవిదుడయ్యెను. నకులుడు అతిరథుడను పేరుగాంచెను.

పాండవులు విచిత్రవీర్య, పాండురాజులు కూడా లొంగదీయలేని యవనరాజు సౌవీరకుని యుద్ధమున సంహరించిరి. సౌవీరకుడు పదమూడు సంవత్సరములు యజ్ఞము చేసి కురురాజులను లెక్కచేయక యుండెడివాడు.

భీముని సహాయముతో అర్జునుడు దక్షిణదేశపు రాజులను అనేకులను రాజ్యచ్యుతుల చేసి మిక్కుటముగ ధనము వారివద్ద సేకరించి హస్తినా నగరమునకు తెచ్చెను.

పాండవుల బలము అలౌకికమైనదిగా ఎరింగి ధృతరాష్ట్రునకు వారిపై సాధు భావము తగ్గసాగెను. చింతితుడైన ఆతనికి సుఖనిద్ర లేకపోయెను.

## 140. చత్వారింశదధిక శతతమ అధ్యాయము
## ధృతరాష్ట్ర కణికుల కూటమంత్రాలోచన

ధృతరాష్ట్రుడు బాహుబలమున ఉన్నతులగుచున్న పాండవులను చూచి భయపడి, వెరగుపడిన చిత్తము కలవాడై నీతినిపుణుడైన కణికుడను మంత్రిని

పిలిచి "ద్విజోత్తమా! పాండవులు అన్ని విధముల దినదినాభివృద్ధి పొందుచున్నారు. వారిని చూసి నేను అసూయాపరవశుడనగుచున్నాను. వారితో సంధి విగ్రహము కాక నేనేవి చేయగలను? దయచేసి తెలియజెప్పుడు" అని వేడుకొనగా ఆతడు "మహారాజా! నేను చెప్పిన మాటలు అప్రియ సత్యములు. కాన ఆగ్రహించకుడు. రాజులు తమ శత్రువుల లోపములను తెలుసుకొనుచూ, జాగరూకుడై తమ విషయములు వారికి తెలియనీయక అవకాశమును చూసుకొని వారిని సమూలముగా నాశనము చేయవలెను. ఇందు దయకు స్థానము లేదు. సామదాన భేద దండోపాయముల చరించి సకల విషయముల శాంతిని పొందవలెను" అని నర్మగర్భముగా పలికెను.

## ముంగిస, పులి, నక్క, తోడేలు, ఎలుకల కథ

అంత ధృతరాష్ట్రుడు మంత్రి ప్రవరునితో "సంధి, దాన, భేద, దండోపాయములతో యే విధముగా శత్రుసంహారము చేయవలెనో తెలుపుడు" అని అడిగిన కణికుడు "మీకు ఒక ఇతిహాసమును తెలిపెదను. దయచేసి వినుడు" అని ఒక కథ చెప్పసాగెను. "ఒక అడవిలో ఒక ముంగిస, పులి, నక్క, తోడేలు, మూషికము సఖ్యముగా నుండి కాలము గడపసాగెను. అందు నక్క తెలివైనది, ధూర్తురాలు, స్వార్థపరియై యుండెను. ఆ మిత్రులందరూ ఒక పరి ఒక లేడిని చూసి వధింప ప్రయత్నించిరి కాని త్వరితగతిని పరుగెత్తగల లేడిని చంపలేక పోయిరి. అంత నక్క వారితో "మనము దీనిని అంత సులభముగా వధించలేము. నేనొక ఉపాయమును చెప్పెదను వినుడు. మృగము నిద్రించు సమయమున మూషికము లేడి కాళ్లు కొరికిన అది దాని వేగమును కోల్పోవును. మనము దానిని సులభముగా యమపురికి అంపగలము" అని ఉపాయము చెప్పిన వారట్లే ఆ మృగమును వధించిరి. స్వార్థపరురాలైన నక్క ఆ మృగము మాంసమంతయూ తానే భుజింపతలచి వారినందరినీ స్నానమాడి రమ్మని పంపెను.

ముందుగా స్నానమాడి వచ్చిన పులి, చింతాక్రాంత వదనముతోయున్న నక్కని కారణమడుగ "మహానుభావా! మీరు స్నానమాడ వెళ్లిన సమయమున మూషికము నా చెంత చేరి, తన సామర్థ్యము వలననే లేడిని చంపగలిగితిమని, వీరుడని చెప్పుకొను పులికి పేరు గొప్పే అని నీ శౌర్యమును తూలనాడినది. అందువలన నేనిట్లున్నాను" అని పలుక పులి "ఛీ! ఒక ఎలుక వలన అవమానము పొంది, ఈ మాంసమును నేను తినజాలను, నా భుజబలముపైననే ఇక బ్రతికెదను" అని ఆ స్థలమును వీడిపోయెను.

తదనంతరము వచ్చిన ఎలుకతో నక్క "తోడేలు ఈ లేడి మాంసము విషయుక్తమై ఉన్నదని భుజింప నిరాకరించి, ఆకలి తీర్చుకొన మూషికమును తినెదనని ఇప్పుడే బయలుదేరినది" అన ప్రాణభయముతో ఎలుక ఆ తావు వీడిపోయెను.

స్నానమాడి వచ్చిన తోడేలుతో నక్క "పులి నీపై ఎందువలననో చాలా కోపముతో నున్నది. నీ స్నేహితుడను కాన చెప్పితిని. తరువాత నీ ఇష్టము" అనగా తోడేలు కలతపడి పారిపోయెను.

తీరుబడిగా వచ్చిన ముంగిసతో ఆ కపటియైన నక్క "ఓరి నకులాధమా! నేను మిగిలినవారినందరినీ నా భుజబలమున ఓడించితిని. నీకు మాంసభక్షణ చేయ తలంపు కలిగిన నాతో యుద్ధమునకు రమ్ము." అని క్రూరముగా పలుక ముంగిస "పులి, తోడేలే ఓడిన నేనేమాత్రము?" అని ఆ స్థలమును వీడ నక్క ఆనందముగా ఆ మృగమును భక్షించి ఆనందించెను.

అందువలన మహారాజా! భీరులకు భయము చూపి, వీరుల ముందు వినయము ప్రదర్శించి వశభూతులను కావించుకొనవలెను. పుత్రులు, సఖులు, అన్నదమ్ములు, తల్లితండ్రులైనను వైరము పూనిన క్షమించి విడువరాదు. దండించి తీరవలె. క్రోధముతో యే పనీ చేయరాదు. ఎల్లవేళలా చిరునవ్వుతో యుండవలెను. దండించిన పిదప వ్యక్తుల యెడ మెల్లని తీయని మాటతో బుద్ధి చెప్పవలెను. కోపమునకు లోనుగాక శత్రువులను సమయము చూసి నాశనము చేయవలెను. రాజులు ఎన్నడూ ఒకరిని పూర్తిగా విశ్వసించరాదు. సదాచారులను ఉపయోగించ వలెను. ఉద్యానవనమున, విహారస్థానమున, దేవాలయమున, మంత్రాలోచన చేయవలెను. అర్థులు వచ్చిన దానము చేయనని అనరాదు. ఇవ్వకపోయినను తీయని మాటతో తృప్తిపరచవలెను. దానము చేయ ఇచ్ఛ గలిగినను వెంటనే ఇవ్వరాదు. ఆలోచన చేయు సమయమున నీ ఉద్దేశ్యము చెప్పక మిగిలినవారి ఆలోచనలు తెలిసికొని నిర్ణయము తీసుకొనవలెను.

పాండవులు మీ తమ్ముని కుమారులని మీరు ఉపేక్షించరాదు. నిప్పును రొంటిని కట్టుకొనలేము కదా! మీరు పుత్రులను కలసి వారి ఉద్దేశ్యము తెలిసికొని మేలైన కార్యము నిర్ణయించుకొనుడు" అని పలికెను.

(సంభవ పర్వాధ్యాయము సమాప్తము)

## 141. యేకచత్వారింశదధిక శతతమ అధ్యాయము
## జతూగృహపర్వధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. "తదనంతరము ధృతరాష్ట్రుడు తన కుమారులైన దుర్యోధన, దుశ్శాసనులతోను, శకుని, కర్ణులతోను కూడి పాండవులను దగ్ధము చేయ తలంచి వారణావతమున లాక్షా గృహము నిర్మించి అందు పాండవులను పంప వారు విదురుని సహాయమున విపత్తును తప్పించుకొనగలిగిరి" అని తెలుప జనమేజయుడు "మునివరా! పాండవులు జతూగృహమునుండి యెట్లు తప్పించుకొనిరో సవిస్తరముగా తెలుపుడు అని ప్రార్థింప ఆతడిట్లు చెప్పసాగెను.

వినయశీలురైన పాండవులను చూసి ప్రజలు, అంధుడగుటవలననే ధృతరాష్ట్రుడు రాజు కాలేదని, పాండురాజే రాజ్యము చేసెనని ఉదార ప్రవర్తన కలిగిన యుధిష్ఠిరుడే రాజ్యార్హుడని చెప్పుకొనసాగిరి.

ఏ విధముగాను పాండవులను మించలేని దుర్యోధనాదులు తండ్రిని చేరి యుధిష్ఠిరునకు పితృరాజ్యమును ఇచ్చిన తాము రాజ్యభ్రష్టులమగుదుమని, పుత్రపౌత్రాదులందరూ విషయహీనులగుదురని దీనముగా విలపించిరి.

## 142. ద్విచత్వారింశదధిక శతతమ అధ్యాయము
## వారణానగరమునకు పాండువులను పంపగోరుట

కణికుని వలన సలహా పొంది ధృతరాష్ట్రుడు దీనవదనులైన కుమారులతోను, కర్ణ, శకునులతోను కూడి, యోచించునెడ, దుర్యోధనుడు "పాండవులను మీరు కౌశల్యముతో వారణావతమునకు పంపిన వారి వలన మనకెట్టి భయమును ఇక ఉండదు" అనగా ధృతరాష్ట్రుడు "నాయనా! ఆనాడు పాండురాజు నన్ను సలహా అడుగకుండా ఏ పనియూ చేసెడివాడు కాదు. ఈనాడు ధర్మరాజు కూడా అదే విధముగా నడచుకొనుచు వినయశీలుడై అందరి మనస్సులను ఆకట్టుకొనియున్నాడు. వారికి కీడు తలపెట్టిన భీష్మ, ద్రోణ, కృప, విదుర, అశ్వత్థామాదులు మిన్నకుండరు. నిరపరాధులైనవారిని రాజ్యమునుండి వంచించి నిర్వాసితులను చేయుట కష్టసాధ్యము" అని పలుక సుయోధనుడు "తండ్రీ! తాతకు ఉభయులమూ సమానమే! అశ్వత్థామ నాకు హితుడు. తండ్రి ఆతనిని వీడలేడు. ఇక కృపాచార్యులు బావని కాదనలేడు కదా! యేకాకియైన దాసుడు విదురుడు మనలనేమి చేయగలడు? రాజా! పాండవులవల్ల నాకు దివారాత్రుల ఒక్క నిముషమైనా నిద్రపట్టుటలేదు. మీరు వారిని నిర్వాసితులను చేసి మా శోకాగ్నిని చల్లార్చుడు" అని వేడికొనెను.

## 143. త్రియచత్వారింశదధిక శతతమ అధ్యాయము
## పాండవులు వారణాసికేగుట

ధృతరాష్ట్రుని ఆజ్ఞ ప్రకారముకుశలురైన మంత్రులు "ఒకనాడు సభలో వారణాసీ నగరమును వర్ణించి ప్రశంసలు చేయుచుండ విధిప్రేరితులైన పాండవులు ఆ స్థలమును చూడ ఉత్సుకత కనపరచిరి. వేచికొని యున్న ధృతరాష్ట్రుడు సమయము చూసి వారితో "నాయనలారా! మీ కోరికకు నేనానందించుచున్నాను. మీరు సకుటుంబముగా, వైభవముగా వారణాసికేగి అందు కొంతకాలము ఆనందముగా సంచరించి, హస్తినానగరమునకు తిరిగి రండు" అని వ్రాక్కుచ్చెను. ఆతని మర్మము తెలిసికొనినప్పటికీ ధర్మరాజు మారుమాటాడలేకపోయెను. పాండవులు ప్రయాణమునకు సన్నద్ధులైరి.

## 144. చతుశ్చత్వారింశదధిక శతతమ అధ్యాయము
## వారణాశిలో లక్షాగృహనిర్మాణము

వైశంపాయనుడిట్లనెను. మహారాజా! ఈ విధముగా పాండవులు వారణాసికి పంపబడు వార్త తెలియగానే దుర్యోధనుడు యేకాంతమున పురోచనుడను మంత్రిని కలసుకొని ఆతనిని త్వరితముగా వారణాసికేగి అందు పాండవులకు శన, తైల, ఘృత, జతు, కాష్టభరిత భవనము నిర్మించి వారు సుఖనిద్ర చెందు సమయమున అగ్నిప్రదానము చేయమని కోర, ఆతడు రాజకార్యార్థియై బయలుదేరెను.

## 145. పంచచత్వారింశదధిక శతతమ అధ్యాయము
## పాండవులకై ప్రజలు విచారించుట

పాండవులు భీష్మ, ద్రోణాది పెద్దలకు నమస్కరించి రథారూఢులై తల్లితో ప్రయాణము కాగా హస్తినా నగర ప్రజలుచూసి కుటిలాత్ముడైన ధృతరాష్ట్రుని నిందించుచూ, యెట్టి అపకారమును చేయని పాండవులను పంపి వేయుట తగని కార్యమని తమలో తాము చర్చించుకొని, పాండవులను అనుసరింపబోవ ధర్మరాజు వారిని వారించి నిలిపివేసెను.

## విదురుడు సంకేత వాక్యముల పాండవులను హెచ్చరించుట

పాండవులను అనుసరించుచూ వచ్చుచున్న విదురుడు ధృతరాష్ట్ర, దుర్యోధనుల దురాలోచనము తెలియునట్లు వారితో మ్లేచ్ఛభాషయందు "నాయనలారా! బుద్ధిమంతులు యెల్లవేళలా జాగరూకులై యుండెదరు. ఖననము

చేసుకొని గుప్తముగా నున్న అగ్ని కూడా హాని చేయదు కదా! శత్రువుల ఆయుధము లోహనిర్మితము కాదు. కాని దేహమును ఛేదనము చేయును కదా! పంచేంద్రియము లను వశమునందుంచుకొని ప్రవర్తింపుడు" అన ధర్మరాజు "అర్థమైనది" అని బదులు పలికెను.

దారిలో యుధిష్ఠిరుడు తల్లితోను, తమ్ములతోను దుర్యోధనుని దురాలోచన తెలియజేసి, విదురుడు హెచ్చరించిన సంగతి చెప్పెను.

## 146. షట్చత్వారింశదధిక శతతమ అధ్యాయము
## లక్షాగృహ నివాసము

కతిపయ దినములకు పాండవులు వారణాసి నగరమును చేరిరి. పురవాసులు వారిని ఆదరించి, వినయసంభాషణలతో పురమును ప్రవేశింపజేసిరి. పాండవులు కొంతకాలము వరుసగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల ఆతిథ్యము స్వీకరించి తదుపరి పురోచనునిచే కట్టబడిన లాక్షాగృహము చేరిరి. అది లక్క, నెయ్యి మొదలైన వస్తు సముదాయములతో నిండినదైనను అనుమానము కలుగకుండా ప్రవర్తింపసాగిరి. వేటకి వెడలుచూ, నృత్యగానముల చేరి ఆనందముగా ఉన్నటుల పురోచనునకు అనుమానము కలుగకుండా చరించుచుండిరి.

## 147. సప్తచత్వారింశదధిక శతతమ అధ్యాయము
## విదురప్రేరితుడైన ఖనకుడు పాండవులను చేరుట

ఒకనాడు ఖనకుడు రహస్యముగా పాండవులను చేరి "దుర్యోధన ప్రేరితుడైన పురోచనుడు మిమ్ము కృష్ణపక్ష, చతుర్దశి దివసమున అగ్నిదగ్ధులను చేయ సమకట్టియున్నాడు. నేను ఖనకుడను. విదురుడు పంపగా వచ్చితిని. మీకేమి సహాయము చేయగలనో తెలుపుడు" అని పలుకగా ధర్మరాజు విపత్తునుండి తప్పించుకొను మార్గము తెలుపుమని వేడుకొనెను.

## లక్షాగృహమున ఖనకుడు స్వరంగము త్రవ్వుట

ఖనకుడు పాండవులకు క్షేమము కలుగనట్లు తటాక నిర్మాణ నెపమును మహాగ్రహ్వరము నిర్మించి, కవాట నిర్మాణము చేసి రహస్యముగా ఉంచెను. పాండవులు రాత్రులందు అందే కాలయాపనము చేయసాగిరి.

## 148. అష్టచత్వారింశదధిక శతతమ అధ్యాయము

## లక్షాగృహ దహనము

పాండవుల ఆచరణ గమనించి సంతుష్టుడై ఉన్న పురోచనుని గాంచి పాండవులు ఇక ఆలస్యము చేయుట విపత్తునకు కారణమగునని తలంచి స్థానాంతర సంసిద్ధులైరి. ఆనాడు కుంతి పురోచనాది అనేక బ్రాహ్మణులను విందు భోజనము చేసి, పానము చేయ సురనిచ్చెను. కాలప్రేరితరాలైన ఒక నిషాది అన్నాతురయై ఐదుగురు కుమారులతో వచ్చి కుంతి ఇడిన భక్ష్యములను తిని సుర త్రాగి ఒడలు తెలియక పుత్ర సమేతముగా అందే నిద్రగాంచెను. భీముడు మధ్య రాత్రియందు ముందుగా పురోచనుని గృహమునకు అగ్ని రగిల్చి తదుపరి లాక్షాగృహ చతుర్దిశల అగ్ని సంయోగము గావించెను. దహనమగుచున్న భవనము చూసి నగరవాసులు ధృతరాష్ట్ర, దుర్యోధనుల కుబుద్ధిని దూరుచూ నిషాది, ఆమె పుత్రుల యొక్కయు, పురోచనుని శరీరములు చూసి పాండవులు మృతిచెందిరని తెలిసికొని హస్తినానగరమునకీ వార్త తెలియజేసిరి.

## పాండవుల పలాయనము

సొరంగము కుండా తప్పించుకొని పాండవులు ఆ స్థలమును వీడిరి. మిగిలినవారు అశక్తులు కాగా పాండవ మధ్యముడు తల్లిని స్కందదేశమున, నకుల సహదేవులను పక్కన నిడి యుధిష్ఠిర, అర్జునుల వేలు గ్రహించి మహావేగముగా నిష్క్రమించుచుండ మిన్నే భూరుహములు నేలగూలెను.

## 149. ఉనపంచశతాధిక శతతమ అధ్యాయము

## పాండవులు గంగను దాటుట

కొంతసేపటికి పాండవులు గంగాతీరమును చేరిరి. అచ్చట విదురునిచే నియమింపబడిన నావికుడు మనోమారుతగామిని, యంత్రపతాకాశాలినియైన నౌకపై వారిని అధిరోహింపచేసి ప్రయాగ పట్టణ ప్రాంతమున వారిని విడిచెను. పాండవులు ఆతనికి కృతజ్ఞతలు తెలియజేసికొని, విదురునకు తమ నమస్కారములందజేయుమని తెలిపి ముందుకు బయలుదేరిరి.

## 150. పంచ శతాధిక శతతమ అధ్యాయము

## లక్షాగృహ దహన వార్తకు కౌరవుల కపట శోకము

మరునాడు వారణాసి నగరవాసులు నిషాదసంతతి పాండవులుగా భావించి, పాండవులు మరణించినారని కౌరవులకు వార్తనంపిరి.

భీష్మాదులు పాండవుల మృతికి మిక్కుటముగా దుఃఖించిరి. ధృతరాష్ట్ర, దుర్యోధనాదులు రోదించుచూ, పాండవుల శౌర్యములను వర్ణించుచూ శోకము నటించి తదుపరి తర్పణాదులతో పితృలోకప్రాప్తికి పారలౌకిక క్రియలు జరిపించిరి.

అలసట చెందిన తల్లిని, అన్నను, తమ్ములను మునుపటి విధముగానే మోసికొని భీముడు భీకరమైన అడవి దాటసాగెను.

## 151. ఏకపంచ శతాధిక శతతమ అధ్యాయము

## పరిశ్రాంతి పొందిన కుంతి నీటికై తపించుట

ప్రచ్ఛన్న వేషధారులై పాండవులు తల్లితో మరునాడు ఆహారశూన్యము, జలశూన్యమైన కాంతారమును భీమ సహాయులై దాటసాగిరి. భీముని వేగమునకు తట్టుకొనలేక వారు మూర్ఛాప్రాయులైరి. సాయంకాలమగుసరికి దాహనము ఓర్వలేక విలపించు తల్లిని ఒక వృక్షమూలమున దించి అన్న అనుజ్ఞ తీసుకొని భీముడు సారసగణ సహాయమున ఒక సరోవరము చేరి నీటిని గ్రహించి తిరిగి వచ్చుసరికి తల్లియూ, అన్నదమ్ములు నిద్రాధిభూతులై యుండిరి.

## కుంతి మొదలైనవారి క్లేశమునకు భీముడు విచారించుట

అట్టి దీనదశయందు తన ఆత్మీయులను చూసి భీముడు 'అయ్యో! కుంతిభోజుని ముద్దులపట్టియైన నా తల్లి వట్టి నేలపై పండుకొని యున్నదే! సుకుమార శరీరులైన ఈ నల్గురు ఎట్టి కడగండ్లకు లోనగుచున్నారు. సృహృద్వర్గమకల ప్రజలందరూ సుఖముగా కాలము గడుపుచున్నారు. దుర్మార్గులైన జ్ఞాతుల వలన కదా మేమిట్టి ఇడుములను పడుచున్నాము. భగవంతుని దయవలన యెటులనో అగ్నిభీతిని తప్పించుకొంటిమి. ఓరీ!దుష్ట దుర్యోధనా! ఈనాడు నీ కోరిక నెరవేరినది. దైవము నీపై చిరునవ్వు ప్రసాదించుచున్నాడు. నా అన్నయే కంపితుడై కనుసంజ్ఞ చేసిన మాత్రమున నిన్ను ఆమాత్య, సహోదర, కర్ణ, శకునలతో యమసదనమునకు పంపెడివాడను కానా?' అని తలంచుకొనుచూ కొంతసేపటికి శాంతము వహించి వారిని నిద్రనుంచి లేప సందేహించి, జాగరూకుడైయుండెను.

(జతూగృహదాహ పర్వాధ్యాయ సమాప్తము)

# 152. ద్విపంచౌ శతాధిక శతతమ అధ్యాయము
## హిడింబాసుర వధ పర్వాధ్యాయము

ఆ సమయమున పాండవులు చరించుచున్న స్థలము హిడింబాసురుడను రాక్షసుని ఆవాసము. ఆతడు విశాలమైన శాలవృక్షమును అధిరోహించి ఉండునెడ దూరముగా విశ్రమించుచున్న పాండవులను చూచెను. నరమాంసభక్షకుడైన రాక్షసుడు మంచి ఆహారము లభించినదని లొట్టలు వేయసాగెను.

## హిడింబి పాండవుల వద్దకు వచ్చుట

అంత హిడింబాసురుడు చెల్లెలైన హిడింబను పిలిచి “చెల్లెలా! చాలా కాలమునకు మనకు రుచికరమైన ఆహారము దొరికినది. నీవు త్వరితముగా పోయి ఆ మానవులను వధించి తెమ్ము. వారి రుధిరము త్రావి, మాంసమును భక్షింతము. వీరు నా అధీనమైన స్థలమున నివసించియున్నారు. నీవు భీతిచెందక వేగిరముగా ఆహారము తీసుకొని రమ్ము” అని ఆమెను పంప, హిడింబ ఆ స్థలమును చేరి నిద్రించుచున్న కుంతిని, నలుగురు అన్నదమ్ములను కాపాడుచున్న మహాబాహుడు, సింహస్కంధుడు, కంబుగ్రీవుడు, కమలనయనుడు, సురూపుడైన భీముని చూసి మోహించి అన్న మాటకు తాత్కాలిక నరభక్షణ కన్నా, చిరకాలము ఆతని భార్యయైయుండుట మేలని భావించి షోడశ వర్షీయ కామినీ రూపమున భీముని చేరి ఇట్లనెను. “ఓ పురుషశ్రేష్ఠా! మీరెవ్వరు? ఎక్కడినుండి వచ్చుచున్నారు? నిద్రించుచున్న వీరందరూ ఎవ్వరు? ఇది హిడింబాసురుని స్థలమని తెలియదా? ఆతడు నా అన్న. మిమ్ములను భక్షింప వధించి తెమ్మని నన్ను పంపెను. కాని నీ రూపమును చూసి వివాహమాడ నాకు ఇచ్ఛ కలిగినది. నన్ను స్వీకరించిన రాక్షసబాధ నుండి నిన్ను తప్పించెదను.”

ఆమె మాటలు విని భీముడు “రమణీ! నీ మాటలు విని తల్లిని, అన్నదమ్ములను వీడు కామార్తుడను కానని తెలిసికొమ్ము” అన హిడింబ వారిని కూడా నీ కొరకు రక్షింతునని, వారిని మేలుకొలుపుమనగా భీముడు “లలనా! నేను నీ అన్నకే కాదు, దేవ, గంధర్వులకు కూడా భయపడువాడను కాదు. నీవు పోయి నీ అన్నను పంపుము. ఆతనిని శిక్షింప సంసిద్ధుడనైయున్నాను” అని పలికెను.

# 153. త్రిపంచా శతాధిక శతతమ అధ్యాయము

## పాండవులను వధింప హిడింబాసురుడు వచ్చుట

హిడింబ వచ్చుటకు ఆలస్యము చేయుచున్నందులకు కోపించి వచ్చుట చూసి, హిడింబ భీతితో భీముని అన్నదమ్ములను లేపుమని, వారినందరిని తన మూపున నిడుకొని ఆకాశమార్గమున తీసుకొని పోయెదననగా భీముడు "వనితా! నీవు అనవసరముగా భయపడుచున్నావు. నాయీ విశాల వక్షస్థలమును, భుజస్కంధములను పరికింపుము. ఈతడే కాదు, యావత్తు రాక్షస కులము వచ్చినను నేను పరాజితులను చేసెదను. ఇప్పుడే వీనిని వధించి నీ అనుమానము తీర్చెదను. నన్ను సామాన్య మానవునిగా తలంపకుము" అని పలికెను.

## భీమ, హిడింబాసురుల వాగ్వాదము

భీముని మాటలు వినియు, పుష్పమాలలతోను, స్వర్ణాలంకారములతోను, సూక్ష్మపరిధేయ వసనములతోను ఉన్న చెల్లెలను చూసి, ఆమెను కామునిగా గ్రహించి ఆగ్రహము మిక్కుటము కాగా ఆమెతో ఇట్లనెను. "ఓసీ కళంకినీ! నీవు నా భోజనము విఘ్నము చేయదలంచితివి. నాకోపము నీకు తెలియదా? నీవు ఎవరిని చూసి నన్ను ఎదిరించదలచితివో వారిని ఇప్పుడే మట్టుపెట్టెదను చూడు" అని పలుక భీముడు ఆతనిని ఎదిరించి,

"ఓరీ దురాత్మా! ఎందులకట్లు వదరుచున్నావు? నీవు పంపగా ఆమె ఇచ్చటకు వచ్చి మదనాతురయై నన్ను చేరి శరణము పొందినది. నేనుండగా నా స్త్రీయైన ఆమెను నీవు ఏమి చేయగలవు?

నరమాంసభక్షకా! నీ మస్తకమును భిన్నము చేసి ఈ వనమును నిష్కలంకము చేసెదను. నిద్రితులై ఉన్న జనముల నిద్రాభంగము చేయనేల? దూరముగా పద" అని భీషణముగా గర్జించుచున్న హిడింబుని కరము గ్రహించి దూరముగా ఈడ్చుకొనిపోయెను. వారు మదించిన కరముల వలె ఒండొరుల నెదుర్కొని ఘోరమైన మల్లయుద్ధము చేయసాగిరి.

# 154. చతుఃపంచాశదధిక శతతమ అధ్యాయము

## భీమ హిడింబాసురుల యుద్ధము

రాక్షసుని కేకలకు కుంతి, ధర్మరాజులకు నిద్రాభంగమై లేచిరి. కుంతీదేవి చెంతనున్న హిడింబను చూసి "దేవీ! నీవు ఎవరు? ఈ వనమునకు అధిష్ఠాన

దేవతవా? ఇచ్చటకు ఎందులకు వచ్చితివి?" అని ప్రశ్నింప, హిడింబ "నేను ఈ వనమునకు రాజైన హిడింబాసురునకు చెల్లెలను. మిమ్ము భక్షింపదలంచి నా అన్న నన్ను ఇచ్చటకు పంపెను. తప్తకాంచనసన్నిభ దేహుడైన నీ కుమారుని జూసి నేను కందర్పుని బారిపడి అతనిని పతిగా వరించితిని. విళంబమునకు ఓర్వని నా అన్న క్రోధాన్వితుడై రాగా నీ కుమారుడు ఎదుర్కొని పోరాడుచున్నాడు. చూడుడు" అని ప్రత్యుత్తరము ఇవ్వ ధర్మరాజు, అర్జునుడు త్వరితముగా భీముని చేరిరి. ద్వంద్వయుద్ధము భీకరముగా జరుగుచుండెను. భీముడు అలసట పొందినట్లు గమనించిన అర్జునుడు ఉత్సాహము పెంపుచేయ "భీమసేనా! నీవు అలసినట్లున్నావు! ప్రక్కకు తప్పుకొని కొద్దిగా విశ్రమించుము. నకుల సహదేవులు తల్లిని కాపాడుచున్నారు. వీనిని నేను ఎదుర్కొనెదను" అనగా భీముడు "తమ్ముడా! నీవు నిశ్చింతగా యుండుము. నాచేత చిక్కిన ఈ రాక్షసాధముడు ప్రాణములతో బయటపడడు" అని పలుక అర్జునుడు "వీని మాయ అభివృద్ధి చెందకుండా సూర్యోదయము కాకుండగనే మట్టుపెట్టుము. మనము త్వరితముగా ఈ స్థానమును వదిలిపెట్టవలెను" అని వ్రాక్కుల్లెను.

## భీముడు హిడింబాసురుని వధించుట

అర్జునుని మాటలు విన్న భీముడు ద్విగుణీకృతమైన కోపముతో రాక్షసుని ప్రకాండ దేహము నెత్తి గిరగిర త్రిప్పి భూతలమున మోది పశువు వలె వధించెను. వికటముగా గర్జించుచూ రాక్షసుడు చనిపోయెను.

ఆనందముతో అర్జునుడు అన్నను కౌగలించుకొని "మహాత్మా! దగ్గరలోనే నగరమున్నటులున్నది. దుర్యోధనుని చారులు రాకుండగానే మనము ఆ పట్టణము ప్రవేశించుట మంచిది" అని పలికెను.

## 155. పంచపంచాశదధిక శతతమ అధ్యాయము
## భీమ హిడింబల పరిణయము

కోపము తగ్గని భీముడు హిడింబను కూడా వధింపుమన ధర్మరాజు స్త్రీహత్య మహాపాతకమని హత్యావిముఖుని చేసెను.

హిడింబ విచారవదనయై యుధిష్ఠిరుని యెదుట కుంతితో "మాతా! నీ పుత్రునిపై ఆకాంక్షతో నేను కులత్యాగినైతిని. నన్ను ఆతనితో కలిపి పుణ్యము కట్టుకొనుడు. కాకపోయిన నాకు మరణమే శరణ్యము" అని దీనముగా పలికెను.

ధర్మాత్ముడైన ధర్మరాజు ఆమె కోరికకు అంగీకరించి సూర్యాస్తమయము నుండి, సూర్యోదయము వరకు భీమునితో యథేచ్ఛగా విహరించుటకు అనుజ్ఞ ఇచ్చెను. భీముడు అన్న ఆనతికి అంగీకరించి హిడింబతో సంతానము కలుగు వరకు సహవాసము చేతునని చెప్పెను.

## ఘటోత్కచుని జన్మము

కుంతి అనుజ్ఞ తీసుకొని రాత్రులందు మనోవేగగామినియైన హిడింబ భర్తను తీసుకొని రమణీయ ప్రదేశములందు చరించుచూ, తన రూపలావణ్యములతోను, మధురభాషణములతోను ఆతనికి ఆనందము కలిగించుచుండెను. కొంత కాలమునకు హిడింబ గర్భవతియై మహాబలుడైన కుమారుని గాంచెను. జన్మించినంతనే కుమారుడు యౌవ్వన ప్రాప్తిని పొంది సర్వశాస్త్ర నిపుణుడయ్యెను. జన్మకాలమున కేశవిహీనమైన పెద్ద తలయుండుటచే ఘటోత్కచుడను పేరిడిరి.

స్వామి సహవాసకాలము పూర్తియైనదని తెలుసుకొనిన హిడింబ భర్తకు, కుంతికి, ధర్మరాజునకు నమస్కరించి అనుజ్ఞ గైకొని కుమారునితో తన వాసస్థానమునకు నిష్క్రమించెను. పితృభక్తుడైన ఘటోత్కచుడు అవసరమైన, తలచినంత మాత్రమున వత్తునని చెప్పి తల్లితో చనెను. ఆతడు కర్ణునితో సంగ్రామార్థము ఇంద్రుని యొక్కయు, పాండురాజు యొక్కయు అంశమున పుట్టెను.

## 156. షష్ఠపంచాశదధిక శతతమ అధ్యాయము
## పాండవుల యొద్ద వ్యాసమహర్షి సాక్షాత్కరించుట

వైశంపాయనుడిట్లనెను. రాజా! తదనంతరము పాండవులు జడలతోను, వల్కలాజినములతోను తాపస వేషములతో, మార్గాయాసము కలుగకుండా తల్లిని మోసుకొని, గమనకాలమున ఉపనిషత్తులు చర్చించుచూ మత్స్య, త్రిగర్త, పాంచాల, కీచక దేశముల వనముల చరించుచుండిరి. ఒక దినమున మార్గమున వారు పితామహుడైన వ్యాసదేవుని గాంచి నమస్కరించిరి. పౌత్రుల దీనావస్థను చూసిన వ్యాసమహర్షి "నాయనలారా! క్రూరులైన ధృతరాష్ట్ర సంతతి వలన మీకిట్టి ఇడుములు కలిగినవి. నా మనస్సు మీయందే ఆదరముతో నిలిచియున్నది. విచారింపకుడు. మీరు రాజ్యమును పొంది సుఖముగా నివసింతురు. అనతి దూరముననే ఒక పట్టణము కలదు. నేను మరల వచ్చి కలియునంతవరకూ మీరు అచ్చటనే నివసింపుడు" అని వారిని ఊరడించెను.

## ఏకచక్రపురమున పాండవులు వసించుట

సత్యవతీ తనయుడు పాండవులతో ఏకచక్రపురమును చేరి ఒక బ్రాహ్మణుని ఇంట వారినుంచి కుంతితో "పుత్రీ! ధర్మపరాయణుడైన నీ పెద్ద కుమారుడు, భీమార్జునుల భుజబలముతో పృధివినంతయూ జయించి, రాజసూయ, అశ్వమేధ యాగములు చేసి పితృదేవతలకు ఆనందము కలుగునట్లు రాజ్యము చేయును" అని పలికి ధర్మరాజుతో జాగ్రత్తగా మాసాంతమున తాను వచ్చువరకు ఉండుడని ఆశీర్వదించి స్వస్థానమునకు అరిగెను.

హిడింబాసుర వధ పర్వాధ్యాయ సమాప్తి

## 157. సప్తపంచాశదధిక శతతమ అధ్యాయము
## బకవధ పర్వాధ్యాయము

వైశంపాయనుడు ఇట్లు చెప్పెను. పాండవులు పగలు భిక్షాటనము చేసి సాయంకాలమునకు గృహమునకు రాగా కుంతి వారు తీసుకొని వచ్చిన భక్ష్యములను రెండు భాగములు చేసి ఒక భాగము భీమునకు ఇచ్చెడిది. మిగిలినది ఐదు భాగములు చేయగా దానిని కుంతి, మిగిలిన కుమారులు భుజించెడివారు.

## ఏకచక్రపురమున రాక్షసభీతి

ఒకరోజు భీముడు, కుంతి ఇంటనున్న సమయమున ఇంటి యజమాని గృహమునుండి రోదన ధ్వనిని విని ఉపకారము చేసినవారికి ప్రత్యుపకారము చేయ తలంపుగలవారైరి. కుంతి కారణమడుగ వెడలెను.

## రాక్షసుని వలన భయముచే బ్రాహ్మణకుటుంబము రోదించుట

కుంతి వెళ్లుసరికి బ్రాహ్మణుడు భార్యతో "రమణీ! ఇంతకు క్రితమే ఈ స్థలమును వదలి వెడలిపోవుదమని చెప్పితిని. కాని నీవు వినవైతివి. ఇప్పుడు వినయశీలివి, సహధర్మచారిణివైన నిన్ను ప్రాణత్యాగము చేయుమనలేను కదా! ప్రేమతో పెంచిన కుమారుని, కుమార్తెను వీడలేను గదా! నేనే ప్రాణములు విడుతుమన్న మీ పోషణభారమును ఎవరు వహింతురు?" అని పరి పరి విధముల రోదించసాగెను.

## 158. అష్టపంచాశదధిక శతతమ అధ్యాయము
## బ్రాహ్మణపత్ని ఓదార్పు

అప్పుడు ఆతని భార్య "మహాశయా! మీరెందుకు విద్వాంసులయ్యి, ఇట్లు అవివేకి వలె చింతించుచున్నారు. పుట్టిన ప్రతి ప్రాణి గిట్టుట సహజము కదా! భార్యాపుత్రులందరూ స్వసుఖము కొరకే కదా! తన ప్రాణముల కొరకు వీరిని వర్జించవచ్చును. మీ పొందున నేను చాలా సుఖములనుభవించితిని. మీ వలన కుమారుని, కుమార్తెను గాంచి అనృతనైతిని. నేడు మీకై దేహత్యాగము చేసి పరలోకప్రాప్తి పొందెదను" అని పలికెను.

## 159. ఉనషష్ఠ్యధిక శతతమ అధ్యాయము
## తండ్రితో కుమార్తె సంభాషణ

ఆ సమయమున బ్రాహ్మణుని కుమార్తె తండ్రిని చేరి "నాన్నా! మీరు లేకుండా మేము జీవించలేము. కుమారుడు పిండోదకములిచ్చువాడు. కాన కుమార్తెనైన నేను మీ వలన సంప్రాప్తమైన శరీరమును మీకై ఉపయోగించనిండు" అని దీనముగా పలికెను.

శిశువైన బ్రాహ్మణ కుమారుడు తల్లితండ్రులను, అక్కను చేరి చేత గడ్డిపరక ఆడించుచూ "నాన్నా! మీరు యేడవకండి. నేనే దీనితో ఆ రాక్షసుడిని చంపేస్తాను" అని ముద్దుముద్దుగా నవ్వుచూ అనసాగెను.

అంతవరకూ వేచియున్న కుంతి దుఃఖమునకు కారణమడుగ బ్రాహ్మణుని చేరెను.

## 160. షష్ఠ్యధిక శతతమ అధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. రాజా! కుంతి వారిని చేరి నెమ్మదిగా "మీరు ఎందులకిట్లు విచారించుచున్నారు? దయచేసి నాకు తెలియజేయుడు. వీలైన మీకు తప్పక సాయపడెదను" అని వచింప బ్రాహ్మణుడు "అమ్మా! ఇతరులకు సహాయపడుట మంచివారి లక్షణము. కాని ఈ విషయమున ఎవ్వరునూ మాకు సహాయము చేయజాలరు.

ఈ నగరమునకు సమీపమున బకుడను రాక్షసుడు కలడు. ఈ పట్టణము అతని ఆధీనమైనది. రాజు అసహాయుడు ప్రజల కష్టములను చూడకున్నాడు. ఆ బకాసురునకు ఆహారము నిమిత్తము రోజునకొక ఇంటినుంచి 200 మణుగుల

ఆహారమును, ఒక మనిషి దున్నపోతులను బండికి పూన్చి తీసుకొనిపోవలెను. వారిని భక్షించి రాక్షసుడు ఆకలి తీర్చుకొనును. దీనికి వ్యతిరేకులైనవారిని సకుటుంబముగా నాశనము చేయును. నేడు మావంతు వచ్చినది. మేము ఒకరిని విడచి మరియొకరు ఉండలేము. కాన సకుటుంబముగా ఆతనికి ఆహారము కాగలందులకు నిశ్చయించుకున్నాము" అని పలికెను.

## 161. ఏక షష్ట్యధిక శతతమ అధ్యాయము
## బ్రాహ్మణ కుటుంబమును రక్షింప కుంతి పుత్ర దానము చేయుట

ఆ బ్రాహ్మణుని మాటలు విని కుంతి "అయ్యా! మీరు విచారించవలదు. ఆ రాక్షసుని బారినుండి బయటపడుటకు మీకొక ఉపాయమును చెప్పెదను వినుడు. నీకు ఒక్కడే కుమారుడు. వాడైన శిశువు. కన్యను, స్త్రీని పంపుట విధేయము కాదు కదా! నాకు ఐదుగురు కుమారులు. మీకొరకు అందులో ఒకనిని పంపెదను" అని పలుక బ్రాహ్మణుడు "అమ్మా! అతిథులను, అందునా బ్రాహ్మణులను రక్షించుట అభ్యాగతుని కర్తవ్యము. నేను ప్రాణత్యాగమునకైన సిద్ధమే కానిఈ అనుచిత కార్యము చేసి పాపము మూటగట్టుకొనలేనని" పలికెను.

"ద్విజోత్తమా! మీరు చెప్పినది సత్యము. నూర్గురు కుమారులున్నను యే తల్లియూ ఒక్కనిని కూడా విడనాడ సిద్ధము కాదు కదా! కాని, నా కుమారుడు అమిత బలశాలి. తేజోసంపన్నుడు. నేను నా కళ్లతో ఆతడు మహాబలశాలులైన రాక్షసులను వధించుట చూచితిని. కాన మీరు సందేహింపకుడు. ఈ విషయమును మాత్రము దయచేసి ఇతరులకు తెలియజేయనీయకుడు" అని కుంతి పలుకగా బ్రాహ్మణుడు ఆమెతో భీముని చేరి రాక్షస వధార్థము వెళ్లుమని కోర ఆతడు ఆనందముగా అంగీకరించెను.

## 162. ద్వి షష్ట్యధిక శతతమ అధ్యాయము
## భీముని రాక్షసుని వద్దకు పంప అన్నదమ్ములు అంగీకరింపకుండుట

సాయంకాలమునకు ధర్మరాజు, అర్జునుడు, నకుల సహదేవులు భిక్షాటనము చేసికొని గృహమునకు వచ్చి భీమసేనుడు, బ్రాహ్మణ కుటుంబ రక్షణకై రాక్షసుని వద్దకు పో నిశ్చయించిన వార్తను తెలిసికొనిరి. ధర్మరాజు తల్లి చేరి "అమ్మా! భీముడు తనంత తానే ఈ కార్యమునకు సంసిద్ధుడయ్యెనా? లేక మీరే ఆతనికి

అనుజ్ఞ ఇచ్చిరా?" అని ప్రశ్నింప కుంతి "నాయనా! నాఅనుజ్ఞ తీసుకొనియే భీముడీ కార్యము చేయ సమకట్టినాడు" అని ప్రత్యుత్తరమివ్వ యుధిష్ఠిరుడు "అమ్మా! భీమునకు ఇట్టి కార్యము చేయ ఆనతిచ్చుట ఉచితకార్యము కాదు. కష్టసమయములందు మీ మతి చెడినట్లున్నది. భీముని భుజబలము వలననే కదా మనము లక్షా గృహము నుండి తప్పించుకొంటిమి. ఆతని భుజబలముపై ఆధారపడి రాజ్యాధికారము మరల పొందుదుమని ఆశించుచున్నామన్న సంగతి కూడా మీకు జ్ఞాపకము లేదా?" అని తీవ్రముగా పలుకగా కుంతి "నాయనా! ధర్మరాజా! నీవు ఎందులకు అనవసరముగా క్లేశము పొందుచున్నావు? మనకు మహోపకారము చేసిన ఈ బ్రాహ్మణునకు సాయపడదలచితిని. భీమసేనుని ఆయుత మత్త హస్తితుల్య బలము తెలిసినదానను కనుకనే ఆతనిని ఈ పనికి ప్రేరేపించితిని. ఈతడు శిశుకాలమున నా చేతినుండి రాతిపై పడగా ఆ శిలయే చూర్ణమైనది.

క్షత్రియుడు బ్రాహ్మణుని రక్షించిన శుభలోకములను పొందును. క్షత్రియుని రక్షించిన ఇహపరలోకముల కీర్తిగాంచును. వైశ్యుని రక్షించిన ప్రజారంజకుడగును. శూద్రుని రక్షించిన మరల ఉత్తముడైన క్షత్రియునిగా జన్మించునని వ్యాసమహర్షి చెప్పియున్నాడు. ఆతని ఉపదేశము స్మరణకు వచ్చినందువలననే ఈ విషయమున కలుగజేసుకొంటిని" అని పలికెను.

## 163. త్రిషష్ట్యధిక శతతమ అధ్యాయము
## భీముడు రాక్షసుని వద్దకు వెడలుట

అంత ధర్మరాజు తల్లితో "మీరు దయార్ద్ర హృదయవై బ్రాహ్మణునకు సహాయపడదలచిరి. ఈ పుణ్యబలమున భీముడు తప్పక ఆ రాక్షసుని సంహరించును. మీరు ఆ బ్రాహ్మణుని ఈ సంగతి ఎవరికినీ తెలియజేయవలదని చెప్పుడు" అని పలికెను.

మరునాడు ఉదయము అన్నాదులను గ్రహించి భీముడు రాక్షసుని నివాసస్థానము చేరి గట్టిగా వానిని పిల్చి, తీసుకొని వచ్చిన అన్నాదులను తానే భోజనము చేయసాగెను. కేకను విని రాక్షసుడు కోపముగా వచ్చి తన భక్ష్యములను ఆరగించుచున్న భీముని గాంచి "ఓరీ దురాత్ముడా! నా సమక్షమందే నా గురించి తెచ్చిన అన్నమును భక్షించుచున్నావా? నిన్నిపుడే యమసదనమునకు అనిపెదను" అని గర్జించుచూ పలికెను.

## రాక్షసునితో భీముని యుద్ధము

భీముడు చిరునవ్వుతో రాక్షసుని మాటలను లక్ష్యపెట్టకుండా భోజనము చేయసాగెను. విపరీతమైన కోపముతో బకుడు భీముని వీపుపై పిడుగులు పడినట్లు గ్రుద్దసాగెను. జడివానకు ఎదిరించిపోవు వృషభమువలె భీముడు వాటిని లెక్కచేయక క్రమక్రమముగా ఆహారమునంతయు భుజించి, త్రేన్చి తాపీగా లేచి రాక్షసుడి చేతిలోని వృక్షమును లాగుకొన అతడు మరియొక్క వృక్షమును పెకలించి భీమునిపై పడెను. ఇరువురి మధ్యను భీషణమైన పోరాటము సాగెను. తుదకు భీముడు, బకుని నేలపై పడవైచి గుండెలమీద కూర్చొని వజ్రముష్టితో ప్రహారము చేయ అతడు రక్తము కక్కుకొనసాగెను.

## 164. చతుషష్ట్యధిక శతతమ అధ్యాయము
## బకాసుర వధ

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! తదనంతరము బకాసురుడు భీమసేనుని ప్రహారములకు ఓర్చుకొనలేక భయానకముగా ఛీత్కారము చేయుచూ పర్వతమువలె విగతజీవుడయ్యెను.

భయముతో కంపించుచున్న రాక్షస బంధువర్గము మానవ రక్తమాంసమును భక్షింపమని ప్రతిజ్ఞ చేసిన పిమ్మట వారిని, సాధువులై బ్రతుకుడని భీముడు దయతలచి వదలి నగరమును ప్రవేశించి, బ్రాహ్మని ఇంట అన్నదమ్ములను, తల్లిని కలుసుకొని జరిగిన సంగతి తెలియజేసెను.

మరునాడు నగరవాసులు విగతజీవుడైన రాక్షసుని శరీరము చూసి ఆశ్చర్యపడుచు నిన్న ఆహారము పంపు వంతు యెవరిదో కనుగొని బ్రాహ్మణుని చేరి ప్రశ్నింప ఆతు నిజము తెలియజేయక "నిన్న నాయందు దయదలచి ఒక మహాశూరుడు ఆహారమును రాక్షసునకు తీసుకొని పోయెను. అతడే బకాసురుని సంహరించియుండును" అని తెలియజేయ ప్రజలు ఆనందించి గృహోన్ముఖులైరి.

బక పర్వాధ్యాయ సమాప్తి

## 165. పంచ షష్ట్యధిక శతతమ అధ్యాయము
## చైత్రరథపర్వాధ్యాయము - ద్రౌపదీ, దృష్టద్యుమ్నుల ఉత్పత్తి కథ

వైశంపాయనుడిట్లనెను. రాజా! బకాసుర వధ జరిగిన కొంత కాలమునకు దేశాటనము చేయుచున్న కొందరు బ్రాహ్మణులు పాండవులు నివసించుచున్న

బ్రాహ్మణుని ఇంట బసచేసిరి. పాండవులు తల్లితో కూడా వారికి సేవలు చేసిరి. ఆనాడు మధ్యాహ్నము భోజనాదులు అయిన పిదప బ్రాహ్మణులు వారు చూసిన వివిధ నగరములు, తీర్థస్థానములల వింతలు చెప్పుచూ శిఖండి జన్మము, దుష్టద్యుమ్న, ద్రౌదుల జన్మవృత్తాంతము చెప్పుచుండ పాండవాదులు ఉత్సుకతతో వినసాగిరి.

## 166. షట్‌షష్ట్యధిక శతతమ అధ్యాయము
## ద్రోణుని జన్మరహస్యము

బ్రాహ్మణులు ఇట్లు చెప్పసాగిరి. "పూర్వము గంగాద్వారమున భరద్వాజ మహర్షి గంగానదిలో స్నానము చేయుచుండ ఘృతాచి అను అప్సరస కన్యను చూసి రేతఃస్కలితుడై దానిని కలశమందుంచెను. దానినుండి ద్రోణుడను కుమారుడు జన్మించెను.

భరద్వాజునకు స్నేహితుడైన పృషతుడను రాజునకు కూడా ద్రుపదుడను కుమారుడు జన్మించెను. ద్రోణుడు, ద్రుపదుడు ఒకే గురువు వద్ద విద్య నభ్యసించిరి. తదనంతరము ద్రుపదుడు రాజయ్యెను.

ధనార్థము ద్రోణుడు పరశురాముని వద్దకు వెడలెను. కాని శస్త్రములనే గాని ధనము పొందలేక సఖుడైన ద్రుపదుని చెంత చేర అతడు అవమానించి పంపివేసెను.

క్రుధుడైన ద్రోణాచార్యుడు హస్తినానగరమును చేరి, భీష్ముని వలన ఆదరింపబడి కురుకుమారులకు ధనుర్వేదము నేర్పి శిష్యగణమును గురుదక్షిణ నిమిత్తము బంధింప ఆజ్ఞనిడ మహావీరుడైన అర్జునుడు ద్రుపదుని ఓడించి, బంధించి గురు పాదముల పడవైచెను.

ద్రోణుడు అర్థరాజ్యమును గైకొని ద్రుపదుని క్షమించి వదలివైచెను.

అవమానితుడైన ద్రుపదుడు నానాటికీ క్రుంగిపోవుచూ దుర్బలుడవసాగెను.

## 167. సప్త షష్ట్యధిక శతతమ అధ్యాయము
## పుత్రునకై ద్రుపదుడు యజ్ఞము చేయదలంచుట

బ్రాహ్మణులిట్లనిరి. "రోషావిష్టుడైన ద్రుపదుడు భుజబలము వలన ద్రోణుని జయింపజాలనని తెలుసుకొని, ప్రతీకారము తీర్చు సంతానము లేకపోయి నందులకు విచారించుచూ యేమి చేయుటకు తోచక గ్రుమ్మరుచుండెను."

## యజ్ఞార్థము పురోహితుని అన్వేషించుట

ద్రుపదుడు భాగీరథీ తీరమున తిరుగుచు కాల్మషీనగర సమీపమున ముని ఆశ్రమమును గాంచెను. అది కాశ్యపగోత్ర సంభూతులైన యాజ, ఉపయాజులను మహర్షుల ఆశ్రమము.

ద్రుపదుడు వారిలో తమ్ముడైన ఉపయాజునకు సేవలు చేయుచూ "మహర్షీ! మీకు అర్బుదగోధనము నిత్తును. ద్రోణుని నాశనము చేయ నాకు కుమారుడు కలుగునట్లు ఏదైనా దేవకార్యానుష్ఠానము చేయుడు" అని వేడుకొనగా ముని "రాజా! నేను నీ మాటలకు సమ్మతుడు కాను" అని మారు పలికెను.

తాపసి వలన ప్రత్యాఖ్యానము పొందినా ద్రుపదుడు సేవలు చేయుచుండెను. సంవత్సరము గడచిన తరువాత ఉపయాజుడు "మహారాజా! నా యన్నయైన యాజుడు అరణ్యమున సంచరించుచు అశుచియైన స్థానమున పడియున్న ఫలమును దోషమును తలంచక గ్రహించెను. గురుకులమున విద్యాభ్యాసము చేయుచున్న సమయమున ఉత్కృష్టమైన ఆహారమును తలుచుచు పొగిడెడివాడు. అతడు ఫలాకాంక్షి. నీవు ఆతని వేడిన తప్పక నీ పుత్రేష్టి యజ్ఞమున దీక్షితుడగును" అని పలికెను.

## యాజు మహర్షి ద్రుపదుని పురోహితుడగుటకు అంగీకరించుట

అంత ద్రుపద మహారాజు యజమహర్షిని చేరి "తాపసోత్తమా! నేను ద్రోణుని వలన పరాభూతుడనైతిని. అతని వంటి ధనుర్విద్యా సంపన్నుడు భూలోకమున మరియొకడు లేడు. అతడు అపర పరశురాముని వంటివాడు. ఆతని యుద్ధమున నేను జయించుట కల్ల. క్షాత్రము, బ్రహ్మత్వము ముందు పరాజితమైనవి. అందువలన బ్రహ్మతేజ సహాయముననే కార్యముసంపన్నము చేయదలంచినాను. నాకు ద్రోణుని జయించగల కుమారుడు కలుగునట్లు యజ్ఞము చేయుడు. మీకు ఎనిమిది అర్బుదముల గోధనము నిత్తును. నాయందు దయదలచి అనుగ్రహింపుము" అని వేడికొనిన యాజుడు అంగీకరించెను. ఉపయాజుడు కూడా ధర్మకార్యార్థము అన్న దీక్ష వహింప సహాయపడెను.

## ద్రుపదుని యజ్ఞారంభము

అంత యాజ, ఉపయాజులు ద్రుపదుని యజ్ఞసామగ్రులు కూర్ప ఆజ్ఞ ఇడి ఉపయుక్త సమయమున యజ్ఞము ఆరంభించిరి. ఉపయాజుడు రాజుతో "మహారాజా! మీ అభిలాష తీరు విధమున ద్రోణాంతకుడైన కుమారుడు,

కుమార్తెయు కలుగుదురు" అని రాణిని రమ్మని ఆహ్వానింప ఆమె వినయముగా "మునివరా! ఈ సమయమున నా ముఖము అవలిప్తమైయున్నది. గాత్రము దివ్యగంధ లిప్తమైయున్నది. సంతానార్థము ఈ విధముగా రాలేను. కొద్దిసేపు తాళుడు" అని కబురు పంపెను.

## యజ్ఞాగ్ని నుండి దుష్టద్యుమ్నుని పుట్టుక

యాజుడు ఆలస్యమునకు ఓర్చుకొనక మంత్రపూత హవ్యమును ప్రజ్వరిల్లుచున్న అగ్నియందు ఆహుతి చేయ ఉజ్జ్వలవర్ణుడు, సుందరమైన కిరీటము తల కలిగినవాడు, ధనుర్బాణములు ధరించినటువంటివాడు, కవచము ధరించినవాడు, దేవకుమారతుల్యుడు అయిన కుమారుడు సింహనాదనము చేయుచు ఉద్భవించెను. రాజునకు, ప్రజలకు ఆనందము చేకూర ఆకాశవాణి "యశస్వియైన ఈ రాకుమారుడు ద్రోణుని సంహరించును. ఇతని బలవీర్యముల వలన పాంచాల దేశపు భయమును పోగొట్టును" అని పలికెను.

## ద్రౌపది యజ్ఞాగ్నినుండి ఉద్భవించుట

అనంతరము సర్వాంగ సుందరియైన కుమార్తె యజ్ఞవేదిక నుండి ఉద్భవించెను. శ్యామలాంగి, పద్మపలాస తుల్యమైన కన్నులు గలది, పీనోన్నత పయోధరి అయిన ఆ కన్య శరీరమునుండి సుగంధము నలుదిక్కుల వ్యాపించెను. ఆమె సురకన్యవలె దేవ, దానవ గంధర్వులను కూడా మోహితులను చేయు సౌందర్యము కలిగియుండెను. "ఈ కన్య సురల కార్యార్థము క్షత్రియ కులక్షయమునకు కారణమగును. కురు వంశీయులకు ఈమె భయకారణమగును" అని ఆకాశవాణి పలికెను.

ఆ సమయమున శుచియై వచ్చిన రాజమహిషి కుమారుని, కుమార్తెను గాంచి యాజునికి "మహర్షీ! వారుభయులు నన్నే తల్లిగా గుర్తించునట్లు అనుగ్రహింపుడు" అని వేడ ఆతడు "తథాస్తు" అని ఆశీర్వదించెను.

అతిప్రగల్భుడు, ద్యుమ్నసంభూతుడు అనగా కవచాదులతో జన్మించినవాడు కనుక ద్రుష్టద్యుమ్నుడని రాకుమారునకు బ్రాహ్మణులు నామకరణము చేసిరి.

కృష్ణ వర్ణ ప్రయుక్త కనుక కృష్ణ యని కన్యకకు పేరుపెట్టిరి.

ద్రుపద మహారాజు సంతానమును గృహమునకు తీసుకొని వచ్చి రాజకుమారునకు అస్త్రవిద్యయందు శిక్షణ గరుపసాగెను."

## 168. అష్ట షష్ట్యధిక శతతమ అధ్యాయము
## పాంచాల దేశమునకు పాండవులు బయలుదేరుట

వైశంపాయనుడిట్లనెను. ఈ వృత్తాంతము విన్న పాండవులు హృదయము ముల్లు గుచ్చుకున్న విధముగా విచారసాగరమున తపించిరి. అనంతరము కుంతి ధర్మరాజును పిలిచి "నాయనా! ఇచ్చటకు మనము వచ్చి చాలాకాలమైనది. చూచుటకు క్రొత్త స్థలములు ఏవియూ లేవు. భిక్ష కూడా మునుపటి వలె దొరుకుట లేదు. పాంచాల దేశమున ప్రజలు, రాజైన యజ్ఞసేనుడు యాచకులను తిరిగి పంపరని వింటిని. మనమా దేశమునకు పోవుట బాగుండునని తోచుచున్నది" అన ధర్మరాజు తమ్ములను పిలిచి తల్లి అభిమతమును తెలుప వారునూ ప్రయాణము చేయ ఉత్సాహమును చూపిరి.

## 169. ఉనసప్తత్యధిక శతతమ అధ్యాయము
## వ్యాసపునరాగమనము

ఆ సమయమున వ్యాసమహర్షి పాండవులను చేర వారు ఆతనిని ఆహ్వానించి, నమస్కరించి సుఖాసీనుని చేయ "పాండుపుత్రులారా! మీరు శాస్త్ర, ధర్మానుసారముగా జీవనము గడుపుచున్నారు కదా! దేవ బ్రాహ్మణులను సత్కరించుచుండిరి కదా!" అని వివిధ ధర్మార్థ సంబంధమైన ప్రశ్నలు వేయుచూ ఒక ఉపాఖ్యానమును వారికి చెప్పెను.

## వ్యాసుడు ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతము తెల్పుట

ఒక తపోవనమున సర్వాంగసుందరియైన ముని కన్య కలదు. దురదృష్టవంతురాలైన ఆమె తగిన భర్తను వరించలేకపోయినందున శంకరుని కొరకై తపస్సు ఆచరించెను. ప్రసన్నుడై మహాదేవుడు ప్రత్యక్షమై ఆమెను వరము కొరుకొనుమనగా సర్వగుణసంపన్నుడైన పతిని అనుగ్రహించమని పదే పదే కోర శివుడు "వనితా! నా వరప్రసాదము వలన నీవు సద్గుణసంపన్నులైన ఐదుగురు భర్తలు మరుచటి జన్మలో పొందగలవు" అని వరమియ్య ఆమె నేనొక్క భర్తనే కోరితిని అనగా శంకరుడు "నీవు భర్తను ప్రసాదింపుమని ఐదుమార్లు అంటివి కాన ఐదుగురు భర్తలు కలుగునట్లు వరమిచ్చితిని" అని పలికెను.

ఆ రమణియే ద్రుపదుని వంశమున జన్మించింది. ఆమెను మీరైదుగురు వివాహమాడి సుఖింతురు" అని వ్యాసుడు సాదర సంభాషణ పాండవులకు ఆనందము చేకూర్చి తన ఆశ్రమమునకు మరలెను.

## 170. సప్తత్యధిక శతతమ అధ్యాయము

## అంగారపర్ణుడను గంధర్వునితో పాండవుల విరోధము

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! వ్యాసమహర్షి నిష్క్రమించి పిదప పాండవులు తల్లితో ఉత్తరాభిముఖుడై ప్రయాణము చేయుచూ సాయంకాలమునకు సోమాశ్రయానమను భాగీరథీ తీర తీర్థప్రదేశమును దాటుచుండిరి. వెలుతురు కొరకు, ఆత్మరక్షణార్థము చేతిలో ఒక దివిటీని పట్టుకొని అర్జునుడు అగ్రభాగమున ఉండెను.

ఆ సమయమున అచ్చట అంగారపర్ణుడను గంధర్వరాజు తన భార్యలతో గంగానదియందు స్నానము చేయవచ్చు పాండవుల పదశబ్దము విని క్రోధావిష్టుడై ధనుష్టంకారము చేయుచూ ఇట్లనెను. "పథికులారా! సంధ్యాసమయము రాక్షస, గంధర్వ, యక్షులదని, అవశిష్ట కాలము మానవులని మీకు తెలియదా? లోభపరతంత్రులై మీరు రాక్షస వేళయందు చరించుచున్నారు. మిమ్ములను ఇప్పుడే యమసదనమునకు పంపెదను. నా పేరు అంగారపర్ణుడు. నిజభుజబలముపై ఆధారభూతుడను. కుబేరుడు నా ప్రియసఖుడు. అంగారపర్ణమని పిలువబడు ఈ అరణ్యస్థలము నాది. నేనిందు విహరించు సమయమున దేవ రాక్షసులే చేర భీతి చెందుదురు. మీరెందులకు ఇచ్చటకు వచ్చితిరి?

ఔద్ధత్యముతో కూడిన ఆతని మాటలు విని అర్జునుడు "ఓరీ దురాత్మా! సముద్రము, హిమాలయ పార్శ్వదేశము, నదీతీరము దివారాత్రులే కాని, సంధ్యా సమయమే కాని, మీ యొక్కరి ఆధీనము కాదు. గంగానది యందు స్నానము చేయుటకు సమయ తారతమ్యము లేదు. దేవలోకమున అలకనంద యని ప్రసిద్ధి పొందిన ఈ నది హిమాలయము నుండి బయలువెడలి గంగా, యమున, సరస్వతి, అతస్థ, సరయూ, గోమతి, గండకి అను సప్తనదీ రూపముల సముద్రమును కలియుచున్నది.

ఈ దేవనదియందు అందరూ చరింతురు. నీవిందులకు అడ్డుపడుచున్నావు. సామాన్య మానవులు నీముందు భయపడుదురేమో కాని మహాబల పరాక్రమ వంతులమైన మేము నిన్ను లెక్కించము. నీకు చావు మూడినది కనుకనే మాకు అడ్డు నిలచితివి" అని పలికెను.

## గంధర్వునితో అర్జునుడు యుద్ధము సేయుట

ఆ మాటలు విని అత్యంత కుపితుడైన గంధర్వరాజు రథారూఢుడై అర్జునునిపై శరపరంపరలు విడువ అర్జునుడుచేతనున్న డాలు, దివిటీలతో వాటిని వ్యర్థము కావించి "గంధర్వా! అస్త్రవిద్యా విశారదుడైన వీరుని యొద్ద ఇట్టి భిభీషిక సృష్టించుట హాస్యాస్పదము. గర్వాంధుడవైన నీకు మానవశక్తి రుచి చూపెదను. మాయా యుద్ధమున లాభము లేదు. పూర్వకాలమున దేవరాజైన ఇంద్రుడు ఈ అస్త్రమును భరద్వాజునకు, అతడు అగ్నివేశ్యునకు, అగ్నివేశ్యుడు నా గురుడైన ద్రోణునకు, ద్రోణాచార్యులు నాకు ఉత్కృష్టమైనటువంటిది ఇచ్చిరి" అని చేతనున్న ఆగ్నేయాస్త్రమును గంధర్వునిపై ప్రయోగింప వాని రథము భస్మమయ్యెను. అంగారపర్ణుడు అధోముఖుడై నేలకూలెను. అర్జునుడు దివ్యమాలాలంకృతమైన ఆతని కేశరాశిని పట్టి అన్నదమ్ముల వద్దకు ఈడ్చుకొని వచ్చెను.

## గంధర్వుడు అర్జునునకు చాక్షుషియను విద్య నేర్పుట

ఆ సమయమున అంగారపర్ణుని భార్యయైన కుంభానని ధర్మరాజు శరణు జొచ్చి పతిభిక్ష పెట్టమని ప్రార్థింప ఆతడు "అర్జునా! యశోహీనుడు, స్త్రీసహాయుడు, దుర్బలుడు, పరాజితుడైన శత్రువును దండించుట పాడి కాదు. ఆతనికి ముక్తి ప్రసాదింపుము" అని పలుక అర్జునుడు "ఓయి! కురువంశాభుధియైన యుధిష్ఠిరుడు నీకు అభయమిచ్చినందున నీ ప్రాణములు నిలచినవి. విచారించక వెడలిపొమ్ము" అని విడుదల చేయ అంగారపర్ణుడు "మహానుభావా!" నీచేత నేడు పరాజితుడనైతిని. చిత్రరథుడను నా నామమునకు మూలకారణమైన నా విచిత్రరథము నేడు నీచేత భస్మమైనది. ఇక నేను దగ్ధరథుడని పిలవబడుదును. నా ప్రాణములను రక్షించిన నేను సర్వమును దర్శించగల చాక్షుసియనువిద్యయును గ్రహింపుము. అదే కాక మీ అన్నదమ్ములొక్కొక్కరికి నూరేసి గాంధర్వాశ్వములను సమర్పింతును" అని వినతిసేయ అర్జునుడు "నీవు ప్రాణభయమున నాకీ విద్య నిచ్చుట ఇష్టము లేదు. నీవు ప్రతిదానము గ్రహించునెడ నేనా విద్యను గ్రహింతును" అని పలుక గంధర్వుడు "అర్జునా! మంచివారితో సంసర్గము పొందుటయే ఆనందదాయకము. నేను ఆనందము పొందుట వలననే మనువు నుండి సోమునకు, అతనినుండి విశ్వావసువు, విశ్వావసువు నుండి నేను పొందిన ఈ విద్య నేర్పనుంటిని. నేను నీ వద్ద బ్రహ్మాస్త్రమును, వృద్ధియనెడి ఔషధము గ్రహింతును" అని పలికెను.

## అర్జునుడు గంధర్వునితో సఖ్యము చేయుట

అర్జునుడు, గంధర్వుడు అగ్ని మ్రోల సఖ్యత్వము కూర్చుకొని, దాన, ప్రతి దానములు గ్రహించిన పిమ్మట అర్జునుడు "స్నేహితుడా! యే కారణమున ధర్మశీలురమైన మేము నీ వలన అవమానమునకు గురియైతిమి?" అని ప్రశ్నించెను.

గంధర్వరాజు "అర్జునా! మీరు యజ్ఞానుష్ఠానము చేసినవారు కారు. బ్రాహ్మణుడు మీ ముందుగా లేడు. అందువలననే మీరు నా వలన అవమానితులైరి. మీరు కురువంశజులని, ద్రోణుని వద్ద విద్యనభ్యసించిన ధనుర్విద్యాపారంగతులని తెలిసినప్పటికి, రాత్రి కాలమున బలవీర్యములు పెంపొంది, సస్త్రీకముగా ఉన్న నేను మిమ్ము అడ్డగించక తప్పలేదు. మీరీ యుద్ధమున యెందులకు జయమును పొందితిరో తెల్పెదను వినుము."

## అర్జునునకు గంధర్వుడు నీతి గరపుట

"బ్రహ్మచర్యము ఉత్కృష్టమైన ధర్మము. దానివలననే నీవు నన్ను జయించితివి. రాత్రి కాలమున కామపరాయణుడైన క్షత్రియుడు తప్ప నశించును. అందువలననే పండితులైనవారు వేదవిహితమైన విధిగా పురోహితునితో కూడి అతనిపైననే కార్యభారముంచి యుద్ధమునకు సిద్ధపడుదురు. విజయమును పొందుదురు. అందువలన మీరు సత్యవాది, ధర్మార్థి, సుగుణసంపన్నుడైన పురోహితుని నియోగించుకొనుడు. ఆతని సహాయమున మీరు చిరకాలము రాజ్యము సేయగలరు. తాపత్యా! నా ఈ సుమంత్రమును గ్రహింతువని ఆశించుచున్నాను."

## 171. ఏక సప్తత్యధిక శతతమ అధ్యాయము
## తపతీ ఉపాఖ్యానము

"ఓ గంధర్వరాజా! నేను కుంతీపుత్రుడను. నన్ను నీవు యేల 'తాపత్యా' అని సంబోధించితివి? తపతి ఎవరో నాకు తెలియజెప్పుము.

"అర్జునా! నిన్ను నేను యేల తాపత్యుడవని సంబోధించితినో ఆ ఇతిహాసమును సవిస్తరముగా తెలిపెదను. సావధానుడవై వినుము.

సర్వలోకములను అవలోకించు సూర్యదేవుడు తపతి తండ్రి. తపతి

యవ్వనవతి కాగా ఆమెను పోలిన సౌందర్యవతి సుర, అసుర, గంధర్వ, అప్సరసలలో యే యొక్కరూ లేరు. సూర్యభగవానునకు తన కుమార్తెకు తగిన వరుడు ఎందును కన్పింపక దిగులు పొందెను. ఆ సమయమున సుశీలుడు, సద్గుణసంపన్నుడు, నిత్య సూర్యోపాసకుడు, కురువంశ సంభూతుడైన శంబరణుడను రాజు హస్తినానగరమును పరిపాలించుచుండెను. సూర్యుడు ఆతడే తన కుమార్తెకు తగిన వరుడని నిర్ణయించుకొనెను.

## 172. తపతి సౌందర్యమునకు శంబరణుడు ముగ్ధుడగుట

ఒకనాడు శంబరణుడు వేటకు వెడలెను. మార్గమున ఆతని అశ్వము దాహముచే ప్రాణములు కోల్పోవ రాజు కాలినడకను రాజధానికి బయలుదేరెను. దారిలో ఒక రమణీయ ప్రదేశమున అలౌకిక సౌందర్యవతియైన నారీరత్నమును గాంచి "ఓహో! ఇది సత్యమా! లేక నేను కలగనుచున్నానా? ఇట్టి సౌందర్యవతిని నేనెన్నడు చూడలేదే. బ్రహ్మ త్రిభువనములోని సౌందర్యమునంతయూ గ్రహించి ఈమెను సృష్టించె గాబోలు. ఈమెను చూసి నా కన్నులు ధన్యమైనవి" అని తలపోయుచూ ఆమెను చేరి "సుందరీ! నీవెవ్వరు? ఈ కాంతారమున ఏల ఒక్కతెవు చరించుచున్నావు? నీ ముఖ కమలము చూచి నేను కందర్పుని వాడి తూపులకు గురియైతిని" అని పలుక వనిత మారుపలుకక మాయమాయెను. రాజు నిశ్చేష్టుడై మనోదర్పణమున ఆమెను నిరీక్షించుచూ శిల్పము వలె నిలబడియుండెను.

## శంబరణుడు మోహపరవశడగుట

అర్జునా! అట్లు ఆ రమణీమణి అంతర్హితురాలు కాగా రాజు మూర్ఛిల్లి నేలపడెను. ఆతని దీనదశను చూసి ఆ లలనామణి ఆతనిని చేరి సేదతీర్చెను.

మూర్ఛనుండి తెప్పరిల్లిన రాజు ఎదురుగా ఆ సౌందర్యవతిని చూసి "నారీరత్నమా! కాముని విరిశరముల దగ్ధుడనగుచున్న నన్ను గాంధర్వవిధిని వివామమాడి రక్షింపుము" అని వేడికొన తపతి ఇట్లనెను. "రాజా! నీవలననే, కొద్ది క్షణములలో నీ యందు నా మనసు నిలచినది. కాని నేనబలను, స్వతంత్రము లేనిదానను. నేను సావిత్రికి చిన్న చెల్లెలను. నా పేరు తపతి. నా తండ్రియైన సూర్యదేవుని అనుగ్రహము బడసి నన్ను కోరుకొనుము. నీ సఖినై యుండటయే నా మనోవాంఛితము" అని పలికెను.

# 173. త్రిసప్తత్యధిక శతతమ అధ్యాయము

## శంబరణుడు సూర్యుని ఉపాసించుట

ఈ విధముగా తపతి తన మనస్సు రాజున కెరుకపరచి ఆకాశపథమున తిరోహితురాలయ్యెను. అంత రాజు మరల మూర్ఛ చెందెను. రాజును వెదకుకొనుచూ మంత్రి, సైన్యము ఆ స్థలమును చేరి శీతలమైన ఉదకముతో ఆతనికి సేవలు చేసిరి. మూర్ఛనుండి తేరుకొనిన రాజు, మంత్రిని తప్ప మిగిలిన సైన్యమును రాజధానికి తిరిగి పంపి, శుచియై, వశిష్ఠుని పురోహితునిగా మనమున స్వీకరించి సూర్యుని ఉపాసింప మొదలిడెను. పండ్రెండు దినములు ఆగమని వశిష్ఠుడు, యోగబలమున రాజు మనోవాంఛను గ్రహించి, ఆకాశపథమున సూర్యుని చేరెను.

సూర్యుడు ఆతనిని సత్కరించి "మహర్షీ! మీ రాకకు కారణము తెలుపుడు. నా సాధ్యాతీతముగా చేతును" అని పలుక వశిష్ఠుడు "దివాకరా! నీ కనిష్ఠ పుత్రికయైన తపతిని శంబరణ మహారాజునకు ఇచ్చి వివాహము చేయుమని వేడుచున్నాను. అతడే నీ కుమార్తెకు తగిన వరుడు" అని పలికెను.

సూర్యుడు సంతసించి కుమార్తెను వశిష్ఠుని చేతనిడి శంబరణునితో వివాహము చేయుమని తెలిపెను. ముని ఆమెను తోడ్కొని రాజు వద్దకు మరలి వచ్చెను.

## శంబరణుడు తపతిని పొందుట

వశిష్ఠుడు మెరుపుతీగవలెనున్న ఆ కన్యను రాజు వద్దకు తీసుకొని వచ్చి ఆమెతో వివాహము గావించెను.

అర్జునా! ఈ విధముగా రాజు సూర్యోపాసన చేసి తపతిని భార్యగా పొందెను. శంబరణుడు మంత్రిని రాజకార్యములను నిర్వర్తింప పంపి అందే భార్యతోడ విహరింపసాగెను.

## ఇంద్రుడు కుపితుడగుట

ఈ విధముగా రాజు కాంతావ్యసనుడై సంచరింపుచుండ ఇంద్రుడు కుపితుడయ్యెను. రాజ్యమున వర్షములు పడక కాటకముచే పంటలు పోయెను. తుదకు త్రాగుటకు కూడా నీరు లేకుండుటచే ప్రజలు దేశాంతరములు పోసాగిరి.

వశిష్ఠుడు రాజును కలసికొని రాజధానికి తోడ్కొని వచ్చెను. భార్యా

సహితుడైన శంబరణుడు నగరమును ప్రవేశింపగనే వర్షములు కురిసెను. పైరు పంటలతో మరల రాజ్యము కళకళలాడసాగెను. శంబరణుడు కన్నబిడ్డల వలె ప్రజలను కాపాడుచూ పండ్రెండు సంవత్సరములు ఒక మహాయజ్ఞమును గావించి దేవ పితృగణములను తృప్తిపరచెను. 'కురు' తపతీ శంబరణుల కుమారుడు. ఆతని వలననే మీ వంశమునకు కురువంశమని పేరు వచ్చినది. అందువలననే నిన్ను నేను 'తాపత్యా' అని సంబోధించితిని" అని అంగారపర్ణుడు అర్జునాదులకు తపతీ చరిత్రము వినిపించెను.

## 174. చతుఃసప్తత్యధిక శతతమ అధ్యాయము
## పురోహిత ప్రశస్తి

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! అట్లు అర్జునుడు తపతీచరిత్రమును విని గంధర్వునితో "గంధర్వరాజా! నీవు వశిష్ట మహర్షి మా పూర్వ పురుషులకు కులపురోహితుడని చెప్పితివి. ఆతని చరిత్ర దయచేసి తెలుపవలసినది" అని వేడుకొనగా అంగారపర్ణుడు "అర్జునా! వశిష్ట మహర్షి బ్రహ్మమానసపుత్రుడు. అరుంధతి అతని భార్య. భర్తయే దైవమని అనుకూలవతియై యుండెడిది. జాతక్రోధుడైనను కుశిక వంశస్థుడైన విశ్వామిత్రుని నాశనము చేయలేదు. ఆతని వలన తన నూర్గురు కొడుకులు చనిపోయినా అసక్తుడైన సామాన్యునివలె వారిని యమసదనమునుండి రప్పింప ఎట్టి కార్యమునకు పూనుకొనలేదు. ఆతని సహాయమున ఇక్ష్వాకు వంశపు రాజులందరూ బహు యజ్ఞయాగాదులు చేసి తరించిరి.

సువంశస్థులైన రాజులందరూ పురోహితుని నియోగించుట మంచిది. అర్జునా! నీవు కూడా జితేంద్రియుడైన పురోహితుని అన్వేషించుము" అని పలికెను.

## 175. పంచసప్తత్యధిక శతతమ అధ్యాయము
## వశిష్ట విశ్వామిత్రుల ఉపాఖ్యానము

అంత అర్జునుడు "గంధర్వరాజా! ఆశ్రమవాసులైన విశ్వామిత్ర వశిష్టులకు వైరభావము ఎందులకు కలిగినది? సవిస్తరముగా తెలియజేయ కోరుచున్నాను" అని పలుక గంధర్వుడిట్లనెను. "అర్జునా! వశిష్టోపాఖ్యానము చాలా ప్రాచీనమైనది. సావధానచిత్తుడవై వినుము.

కన్యాకుబ్జ దేశమును కుశికుని కుమారుడైన గాధియనెడి రాజు పాలించెడివాడు. ఆతని కుమారుడు విశ్వామిత్రుడు. ఒకనాడు విశ్వామిత్రుడు

మంత్రి, సామంతులతో వేటకు వెడలి అనేక వన్యమృగముల వధియించి మార్గాయాసుడై వశిష్టుని ఆశ్రమము చేర ఆతడు రాజును అర్ఘ్యపాద్యాదులచే సత్కరించి పరివార సమేతుడైన రాజునకు చవ్య, చూష్య, లేహ్య, సేయ, రసాయనాది పంచభక్ష్యాదులతోను, మిష్టాన్నములతోను భోజనము పెట్టి వివిధ ధన, కనక వస్తు వాహనాదులను ఇచ్చి సంతుష్టులను కావించెను.

కామధేనువైన నందిని సహాయము వలననే ఆతడు ఇవియన్నియు పొందినట్లు తెలిసికొనిన విశ్వామిత్రుడు వశిష్టునితో తనకు అందమైన ఆ నందినిని ఇవ్వమని ప్రార్థించెను. దేవకార్యములందు, పితృకార్యములందు, అతిథి సత్కారములందు, యజ్ఞానుష్టానములందు తనకు సహాయపడు కామధేనువును రాజ్యలోభమున ఇవ్వజాలనని వశిష్టుడు నిరాకరింప విశ్వామిత్రుడు రాజుల స్వజాతి సులభమైన బలప్రయోగము చేతునని భయపించిన వశిష్టుడు నీ ఇచ్ఛవచ్చినట్లు చేసుకొమ్మని ప్రత్యుత్తరమిచ్చెను.

విశ్వామిత్రుని సైనికులు నందినిని కొట్టుచూ బలవంతముగా ఈడ్చుకొని పోవ ప్రయత్నించుచుండ నందిని అంబారము చేయుచూ వశిష్టుని చేరి రక్షింపుమని ప్రార్థింప, అతడు "నందినీ, నీ అంబారమును విన్నాను. కాని విశ్వామిత్రుడు నిన్ను బలవంతముగా తీసుకొనిపోబోవుచున్నాడు. క్షత్రియులకు తేజస్సే బలము, బ్రాహ్మణులకు క్షమయే బలము. నేను బ్రాహ్మణుడను. అశక్తుడను. నిన్ను నేను వదిలితినని తలంపకుము. సామర్థ్యము కలిగిన ఆత్మరక్షణ గావించుకొనుము" అని పలుక ముడిచిన కనుబొమ్మలతో ఎఱ్ఱని కన్నులతో నందిని భీకరముగా అంబారము చేయదొడగెను. ఆమె వివిధ అంగములనుండి యవన, ద్రావిడ, కిరాత, పౌండ్ర, సింహళ, బర్బర, చీన, హ్రన ఆది బహువిధ మ్లేచ్ఛ జాతులు ఉత్పన్నములై విశ్వామిత్రుని సైన్యమును తరిమివేసిరి. ఇదిఅంతయూ తిలకించిన విశ్వామిత్రుడు బ్రహ్మతేజస్సు మహిమ తెలిసికొని క్షత్రియ బలమును ధిక్కరించి, తపోబలమే పరమబలముగా తలంచి రాజ్యమును, భోగభాగ్యములను పరిహరించి ఘోరమైన తపస్సుచేసి బ్రహ్మత్వము పొంది, దేవరాజు ఇంద్రునితో సోమరసము పానము చేసెను.

## 176. షట్సప్తత్యధిక శతతమ అధ్యాయము
## కల్మషపాదుని కథ

అర్జునా! భూలోకమున ఇక్ష్వాకు వంశోద్ధవుడైన కల్మషపాదుడను రాజు కలడు. అతడు మహాబలసంపన్నుడు. అతడు ఒకనాడు వేటకై అడవికి వెళ్లి

అనేక వనమృగములను సంహరించి తుదకు శాంతుడై నగరమునకు తిరిగి బయలుదేరెను.

## కల్మషపాదుడు రాక్షసప్రవృత్తి పొందుట

మహర్షి విశ్వామిత్రుడు యజ్ఞక్రియలను నెరవేర్చ ఆకలిదప్పులతో బాధపడుచున్న రాజును అనుసరించుచుండ వారికి వశిష్టుని పుత్రులలో జ్యేష్ఠుడైన శక్తి యెదురయ్యెను.

రాజు ముని కుమారునితో దారి వదలుమని కోర శక్తి బ్రాహ్మణులు జ్యేష్ఠులు కనుక నీవే దారి వదలుమని ఆజ్ఞాపింప వారిద్దరూ వాదోపవాదములు చేయు చుండిరి. క్రోధాన్వితుడైన రాజు చేతనున్న కొరడాతో మునిని కశాఘాతము చేయ ఆతడు రాక్షసుడవై మనుష్య మాంసమందు ఆసక్తి కలిగి పర్యటించుమని శపించెను.

వశిష్టునిపై క్రోధము పొందియున్న విశ్వామిత్రుడు అంతర్హితుడై ఇది అంతయూ గమనించుచుండెను.

విశ్వామిత్రుడు తన తపోబలమున కింకరుడను రాక్షసుని సృష్టించి ప్రేరేపింప ఆతడు రాజు దేహమున ప్రవేశించెను. కింకర్యతా విమూఢుడైన రాజు వెడలిపోవుచుండ అన్నాతురుడైన బ్రాహ్మణుడొకడు రాజును మాంసయుక్తమైన ఆహారము అర్థించెను. రాజు కొద్దిసేపు తాళుడని వేడుకొని నగరమునకు తిరిగి వచ్చెను. బ్రాహ్మణుడు ఆతనికై అచ్చటనే వేచియుండెను.

రాజు గృహమునకు వచ్చి విశ్రమించి బ్రాహ్మణునికి మాట ఇచ్చిన సంగతి సాయంకాలమునకు గుర్తుకు రాగా వంటవానిని పిలిపించి అడవిలో క్షుధార్తియై యున్న బ్రాహ్మణునకు మాంసముతో అన్నమిడుమని ఆజ్ఞాపించెను.

పొరకుండు మాంసము దొరుకక రాజును చేర రాక్షసప్రేరితుడైన రాజు నరమాంసము వండిపెట్టుమని ఆజ్ఞాపించెను. సూపకారుడు వధ్యభూమికి చని నరమాంసము గ్రహించి వండి బ్రాహ్మణుని చేరి ఆహారమునుంచ ఆతడు అభుక్తముగా ఎరింగి కుపితుడై "నరమాంసభక్షణము చేయుచూ చరింపుమని" రాజును శపింప శక్తి శాపము ఇతోధికమై రాజు జ్ఞానశూన్యుడై, రాక్షసవేషమున శక్తిని చేరి "నీ శాపకారణముననే నాకు మనుష్య మాంసము తిన ఇచ్ఛ కలిగినది" అని ముని కుమారుని వధించి భక్షించెను. విశ్వామిత్రుడు ఆనందించి వశిష్టుని కుమారులందరనూ భక్షింపుమని రాజును ప్రేరేపింప ఆతడట్లే వారినందరినీ వధించి తినెను.

## వశిష్టుడు అలౌకికముగా ఉపేక్షాభావము చూపుట

నూర్గురు కుమారులను కోల్పోయినా వశిష్ట మహర్షి కుపితుడై విశ్వామిత్రునిపై ఎట్టి ప్రతీకార చర్యను వహింపక పాతకులను మోయుచున్న ధరిత్రివలె రూపము దాల్చిన శాంతము వలె యుండెను. కాని పుత్రశోకమున మునిగిన ముని దేహత్యాగము చేయదలంచెను. విధివశమున, ఆతని తేజోబలముచే ఆతని శరీరము అగ్నియందు దగ్ధము కాలేదు. నీట మునుగలేదు. విఫలమనోరథుడైన తపస్వి మరల ఆశ్రమము ప్రవేశించెను.

## 177. సప్తసప్తత్యధిక శతతమ అధ్యాయము

## విపాశ, శతద్రూపుల వృత్తాంతము

జనశూన్యమైయున్న ఆశ్రమము చూడగానే పుత్రశోకము మిక్కుటము కాగా మహర్షి మరల ఆశ్రమము వదలి యధేచ్ఛగా సంచరించుచు వేగవతియైన నదిని కాంచి ఆత్మహత్య చేసికొన నదియందు దూకెను. నది జలశూన్యమై ఆతనికి దారి ఇచ్చెను. ముని ఆ నదికి విపాశ అని పేరిడెను. అటులనే శతద్రూపయను నదియందు దేహత్యాగము చేయ ప్రయత్నము చేసి విఫలుడై తాపని ఆశ్రమమునకు తిరిగి రాగా వేదపఠనము కర్ణగోచరము కాగా "ఎవ్వరిది?" అని ప్రశ్నింప ఆశ్రమము నుండి ఆతని పుత్రవధువు బయలువెడలి "మునీంద్రా! నేను అదృశ్యాంతిని. మీ పుత్రవధువును. శక్తి భార్యను. పన్నెండు సంవత్సరములనుండి నా గర్భమందున్న పుత్రుడు వేదాధ్యయనము చేయుచున్నాడు. మీరు ఆతని షడంగ వేదపఠనము విన్నారు" అని పలుక వశిష్టుడు ఆనందించి శరీరత్యాగ సిద్ధాంతము మానుకొనెను. వారు వేరొక స్థలమున ఆశ్రమము నిర్మించుకొని నివసింప తలంపు కలిగి బయలుదేరిరి. మార్గమధ్యమున రాక్షసరూపుడైన కల్మషపాదుడు వారికి ఎదురై భక్షింప ఉద్యుక్తుడు కాగా అదృశ్యాంతి భయపడి మునిని రక్షింపుమని వేడుకొనగా ఆతడు "కుమారీ! నీవుభీతిచెందకుము. ఈతడు కల్మషపాదుడను రాజు. శక్తి శాపవశమున ఇట్లు నరమాంసభక్షకుడైన రాక్షసుడైనాడు" అని తన కమండలమునుండి మంత్రపూత జలమును గ్రహించి రాజుపై చల్లెను.

రాహుముక్త శశాంకుని వలె రాజు శక్తి శాపవిమోచనుడై కింకర రాక్షసుడు తిరోహితుడు కాగా నిజ తేజమును పొంది మునికి నమస్కరించి "నేను మీకుఅధీనుడను. మీకేమి సేవ చేయగలను?" అని ప్రశింప ముని "రాజా! నీవు నాకేమీ సాయము చేయవలసిన అవసరము లేదు. నిజ రాజధానికి తిరిగిపొమ్ము. బ్రాహ్మణులను అవమానించి కష్టములు పొందకుము" అని ఆనతిచ్చెను.

కల్మషపాదుడు ఆతని ఆనతి శిరసావహించి "మునీంద్రా! నేను పుత్ర రహితుడను. వంశరక్షణ కావించి మీరు నాకు పుత్రుని ప్రసాదింపుడు" అని వేడుకొనగా సత్యసంధుడైన మౌని అంగీకరించెను.

ఋషిప్రవరునితో రాజు అయోధ్యానగరము ప్రవేశింప ప్రజలు ఆనందాతిరేకమున హర్షధ్వానములు చేసిరి. రాజప్రేరితురాలైన మహిషి మునిని చేర ఆతడు ప్రతిజ్ఞారూఢుడై దివ్యవిధానానుసారము ఆమె సహవాసము చేసెను. కొంతకాలమునకు రాణి గర్భవతి కాగా ముని రాజదంపతులను ఆశీర్వదించి ఆశ్రమమునకు వెడలిపోయెను. రాణికి చక్కని కుమారుడు కలిగెను. ఆతడే అస్మాకుడు.

## 178. అష్టసప్తత్యధిక శతతమ అధ్యాయము
## పరాశరుని జన్మవృత్తాంతము

కొంత కాలమునకు అదృశ్యాంతికి తండ్రి వంటి వేదసంపన్నుడైన కుమారుడు కలిగెను. వశిష్టుడు ఆతని జాతకర్మాది క్రియలు నెరవేర్చి పరాశరుడని నామకరణము చేసెను.

బాలకుడు వశిష్టుని తండ్రిగా భావించి సంచరించుచూ ఒకనాడు తల్లి ముందు మునిని తండ్రిగా సంబోధింప, అశ్రులోచనయైన అదృశ్యాంతి "నాయనా! నీ తండ్రిని అరణ్యమధ్యమున ఒక రాక్షసుడు భక్షించెను. ఈ మహానుభావుడు నీ తాతగా ఎరుంగుము" అని గద్గద కంఠమున పలికెను.

## భార్గవులపై క్షత్రియులు క్రోధము చెందుట

తల్లి మాటలు విని పరాశరుడు దుఃఖితుడై సప్తలోకములను నాశనము చేయ సమకట్టెను. ఆతని మనస్సు మరల్చ వశిష్టుడు "నాయనా! పరాశరా! పూర్వము కృతవర్యుడను రాజు కలడు. భార్గవులు ఆతని పురోహితులు. రాజు యజ్ఞానంతరము సోమరసము పానము చేసి సమస్త ధనధాన్యములను భార్గవులకు దానము చేసెను. అతడు లోకాంతర ప్రాప్తి చెందిన పిదప అతని వంశస్థులు ధనాభావమున భార్గవులను చేరిరి. భీతులైన భార్గవులు అక్షయ ధనమును భూగర్భమున నిక్షిప్తము చేసిరి. కాలవశమున క్షత్రియుడొకడు భార్గవ గృహమున దాచిన సొమ్ము బయటకు తీసెను. దానిని చూసి క్షత్రియులు క్రోధాన్వితులై భార్గవుల నందరినీ వధించిరి. గర్భస్థ శిశువులను కూడా వధించిరి.

వంశరక్షణార్థము ఒక మునిపత్ని గర్భమును ఊరుదేశమున నిక్షిప్తము చేసియుంచెను. ఒక బ్రాహ్మణ స్త్రీ భీతిచే ఈ వార్త క్షత్రియులకు తెలియజేయ

వారు శిశుసంహారము చేయ ఆ స్థలమును చేరిరి. అంత ఆ బాలకుడు తల్లి ఊరుదేశమును భేదించుకొని బయలువెడలి తన చూపులతో క్షత్రియులను అంధులుగా చేసెను. భీతులై క్షత్రియులు అంధత్వమునుండి రక్షింపుమని మునిపత్నిని దీనముగా వేడుకొనిరి.

## 179. ఉనాశాత్యధిక శతతమ అధ్యాయము
## ఊర్వఋషి జన్మవృత్తాంతము

మునిపత్ని క్షత్రియులతో "నేను క్రోధపరవశనై మీకు చేయ సిద్ధపడలేదు. వంశరక్షార్థము సంతానమును తొడలలో దాచితిని. పితృవధ జనిత క్రోధముతో నా కుమారుడే మిమ్ములను దృష్టిహీనులను చేసెను. మీరు అతిని ప్రార్థింపుడు" అని పలక ముని కుమారుని వారు వేడుకొన అతడు ప్రసన్నుడైనంత క్షత్రియులు తమ చూపును తిరిగిపొందిరి.

నాయనా! పరాశరా! ఆ మునికుమారుడే ఔర్వుడని ప్రఖ్యాతిని కాంచెను. పితృహంతకులను నాశనము చేయ పూని మునికుమారుడు భీకరమైన తపస్సు చేయ ఆతని తపోబలముచే సప్తభువనములు దగ్ధము కాసాగెను. అంత ఆతని పితృదేవతలు కుమారుని ఔద్ధత్యము చూసి, ఆతని చెంత చేరి "కుమారా! నీ తపోబలమును మేము కాంచినాము. నీవు క్రోధమును వీడుము. మేము ఆత్మసంరక్షణ చేసుకొనలేనివారము కాము. కాని బహుకాలము లోకసుఖముల ననుభవించి దేహత్యాగము చేయబూని ధనమును దాచినట్లు ఉంచితిమి. మేము కోరుకొన్న ధనమునకు లోటా? కోరుకొన్న కుబేరుడే మా ముందు దిగివచ్చును. యమధర్మరాజే మేమనిన భీతిచే మమ్ము చేర ప్రయత్నింపలేదు. ఆత్మహత్య మహాపాతకము కాన మేము అందులకు వెరచి క్షత్రియుల వలన ప్రాణవిసర్జనము చేసితిమి. నీవు ఈ పాపకర్మమునుండి మరలుము. తపఃప్రభావమును దూషితము, కలుషితము చేయకుము" అని బోధించిరి.

## 180. ఆశీత్యధిక శతతమ అధ్యాయము
## బడబాగ్ని పుట్టుక

వారి మాటలు విని ఔర్వుడు "పితృదేవతలారా! నేను పితృహీనుడనై తల్లి గర్భమున నున్న సమయమునుండి క్షత్రియులపై కోపముతోనే పెరిగితిని. నా తండ్రులను నాడుయెవ్వరునూ రక్షింప ప్రయత్నింపలేదు. నేడు నేను శక్తిమంతుడనై దుష్టులను శిక్షింప ప్రయత్నము చేయుచున్నాను. నేను ఈ కార్యమును ఆపిన

లోకులు నన్ను చూసి పరిహాసము చేయుటయే కాక ఈ అగ్ని నన్నే సంహరించును. అందువలన అందరికీ శ్రేయస్సు జరుగునట్లు హితము గరపుడు” అని పలుక పితృగణములు “నాయనా! నీ క్రోధాగ్నిని సముద్రజలమున నిక్షేపము చేయుము. సర్వప్రపంచ ప్రాణులు జలోద్భవులు కాన నీ ప్రతిజ్ఞయు తప్పినట్లు కాదు. దానివలన సర్వప్రపంచమునకు ఆనందము చేకూరును” అని పలుక ఆతడట్లు చేసెను.

వశిష్టుడిట్లనెను. “భృగునందనుడు ఔర్యుడిట్లు తన క్రోధానలము మహా సాగరమున పరిత్యజించెను. అది సముద్రజలమును పానము చేయుచుండెను. దానినే పండితులు బడబానలమని పిలుతురు.

## 181. ఏకాశీత్యధిక శతతమ అధ్యాయము
## ఆగ్నేయగిరి వృత్తాంతము

గంధర్వుడిట్లు చెప్పసాగెను. “అర్జునా! అట్లు తాతయైన వశిష్టుని మాటలు విని పరాశరుడు క్రోధముపసమింప లోకనాశనమునుండి నిరతుడయ్యెను. కాని పితృవధకు కారకులైన రాక్షస జాతిని నాశనము చేయ రాక్షస క్రతువు ప్రారంభించెను. యువకులు, బాలురు, వృద్ధులుయైన సమస్త రాక్షసులు క్రమముగా యజ్ఞాగ్నిలో పడి మాడిపోసాగిరి.

అంత లోకభీకరమైన ఆ క్రతువునాప అత్రి, పులస్త్యుడు, క్రతూ, మహాక్రతూ మొదలైన మునులు పరాశరుని సమీపించిరి.

పులస్త్యుడు ఆతనితో “వత్సా! కుశలమే కదా! నిరపరాధులైన ఈ రాక్షసవర్గమును నిర్దయతో సంహరించుట నీకు ఆనందము కలుగుచున్నదా? నా వారిని నీవిట్లు నాశనము చేయకుడ. శాంతినవలంబించి ఉండుట మునికుల ధర్మము. నీవు దానిని వీడకుమ. నీ తండ్రి శక్తి దార్మికుడు. ఆతడు నిజాపరాధము వలననే మృతుడయ్యెను. విశ్వామిత్రుడు, కల్మషపాదుడు నిమిత్తమాత్రులు మాత్రమే. నీ తండ్రి, కల్మషపాదుడు కూడా ఇప్పుడు స్వర్గభోగములనుభవించుచూ స్నేహితులై ఉన్నారు. కావున నీవు ఈ యజ్ఞమునాపివేయుము. నీకు యజ్ఞఫల లాభము కలుగుగాక! నీకు మంగళము చేకూరుగాక!” అని ఆశీర్వదించుచూ పలికిన పరాశరుడు యజ్ఞమును ఆపి యజ్ఞార్థసంచిత అగ్నిని హిమాలయములకు ఉత్తరమున గిరిగహ్వరమున దానిని నిక్షేపము చేసిరి. వీటినే నేడు అగ్నిపర్వతములని పిలుచుచున్నాము.”

## 182. ద్వాశీత్యధిక శతతమ అధ్యాయము
## కల్మషపాదుని క్షేత్రజపుత్ర రహస్యము

"గంధర్వరాజా! రాజు ఎందులకు పుత్రార్థియై వశిష్ఠమహర్షిని చేరెను. ధర్మజ్ఞుడు, వారికి గురువైన ముని శిష్యురాలిని ఎందులకు కూడెను? వివరముగా తెలియజేయ ప్రార్థించుచున్నాను."

"అర్జునా! ఇంతకుముందు నీకు చెప్పిన విధముగా కల్మషపాదుడు, శక్తి వలన రాక్షసప్రవృత్తి పొంద శాపమును బడసి భార్యాసహితుడై అడవుల సంచరించుచూ ఒక ముని దంపతులను గాంచి మునిని గ్రహించి వధింపబోవు చుండ మునిపత్ని "రాజా! నీవు సువంశసంజాతుడవు. నేను సంతానహీనురాలను. దయచేసి పుత్రార్థియైన నన్ను నా భర్తతో సుఖముగా జీవింపనిమ్ము. ఆతనిని వదలి పుణ్యము కట్టుకొమ్ము" అని బహువిధముల ప్రార్థించెను. కాని రాక్షస మనోవికారియైన కల్మషపాదుడు మునిని చంపి తినెను.

మునిపత్ని కోపించి "నృపాధమా! అసహాయనైన నన్ను ఇట్లు చేసితివి. ఋతుమతియైన భార్యను కూడిన నీవు చత్తువు. నీవు ఎవరి పుత్రులను నాశనము చేసితివో వానివలననే నీ కులము రక్షింపబడును" అని శపించి అగ్నిప్రవేశము చేసెను.

అనంతరము శాపముక్తుడైన రాజు మునికన్య శాపము గుర్తుకు రాగా వశిష్టుని చేరెను. సర్వవిషయములు అతనికి అవగతము గాన ముని అందులకు అంగీకరించెను.

## 183. త్రశీత్యధిక శతతమ అధ్యాయము
## ధౌమ్యుని పాండవులు పురోహితునిగా వరించుట

అర్జునుడిట్లనెను. "గంధర్వరాజా! నీకు తెలియనిదేమున్నది? మాకు తగిన పురోహితుడెవ్వడో దయచేసి తెలియజేయుము" అని పలుక గంధర్వుడు "దేవలుని చిన్నతమ్ముడైన ధౌమ్యుడు ఉత్కోచకమను తీర్థమున వశించుచున్నాడు. అతడు మీకు తగిన పురోహితుడు" అని చెప్పెను.

తదనంతరము అర్జునుడు గంధర్వునితో ఘోటకములను తనవద్దనే ఉంచమని సెలవు తీసుకొని బయలుదేరెను. పాండవులు ఉత్కోచక తీర్థమును చేరి ధౌమ్యుని తమ పురోహితునిగా ఉండ వేడిన ఆతడు ఆనందముగా అంగీకరించెను.

ధౌమ్యుని ఆశ్రయమున తామిక అనాథులము గామని పాండవులు త్వరలోనే తాము పాంచాలిని, రాజ్యమును బడసి సుఖింతుమని ధైర్యమును పొందిరి.

ధౌమ్యుడు వారికి ఉచిత బోధనలతో ఉత్సాహితులను చేసెను.

చైత్రరథ పర్వాధ్యాయ సమాప్తము

## 184. చతురశీత్యధిక శతతమ అధ్యాయము
## స్వయంవర పర్వాధ్యాయము

అంత నరశ్రేష్ఠులైన పాండవులు తల్లితో ద్రుపదదేశమునకు బయలుదేరిరి. దారిలో స్వయంవరము చూడ బయలువెడలిన కొందరు బ్రాహ్మణులు వీరిని కలసికొని "మీరు ఎచ్చటనుంచి వచ్చుచున్నారు? ఎక్కడకు పోవుచున్నారని" ప్రశ్నించిన ధర్మరాజు "అయ్యా! మేమైదుగురము అన్నదమ్ములము. ఈమె మా తల్లి ఏకచక్రపురమునుండి వచ్చుచున్నాము" అని బదులు పలికిన వారు "మేము పాంచాల దేశము వెళ్లుచున్నాము. రాజు యజ్ఞసేనుడు యజ్ఞమున లభించిన కుమార్తె కృష్ణ స్వయంవరము చేయుచున్నాడు. ఆమె అతిలోక సౌందర్యవతి. ఆమె కమల సుగంధము క్రోసు దూరము వ్యాపించును. ఆమెను మేము చూడదలంచుచున్నాము. అచ్చటకు మహాత్ములు, తరుణవయస్కులు, పరమసుందరులు, భూరిదక్షిణలు ఇచ్చువారు అయిన యెందరో రాజకుమారులు వత్తురు. వారు పోటీలు పడి ఇచ్చిన భక్ష్య, భోజ్య, గోసమూహము, ధనాదులు గైకొని, సూత, మాగధ, వైతాళిక, నట, నర్తకాదుల నైపుణ్యము చూసి, తదుపరి స్వయంవరము దర్శించ వెడలుచున్నాము. మీరు దేవతుల్య శరీరధారులై ఉన్నారు. మీలో ఒకరికి ఆమె వరమాలను వేయునేమో! దయచేసి మాతో అచ్చటకు రండు" అని పలికిన ధర్మరాజు అంగీకారము తెలిపెను.

## 185. పంచాశీత్యధిక శతతమ అధ్యాయము
## పాండవులు పాంచాలదేశమునకు వెడలుట

ఇట్లు పాండవులు క్రమక్రమముగా దక్షిణ పాంచాల దేశమున పయనించుచూ నగరము చేరి వింతలు తిలకించుచూ ఒక కుంభకారుని ఇంట బ్రాహ్మణ వృత్తి నవలంబించి భిక్షాటనము చేయుచూ నివసించుచుండిరి.

రాజు యజ్ఞసేనుడు కుమార్తెను కిరీటికి ఇచ్చి వివాహము చేయ సంకల్పము కలిగియుండెను. కాని మనస్సులోని సంగతిని ఎవరికీ తెలియజేయక ఒక

అపురూపమైన మత్స్యయంత్రము నిర్మించి దానిని భేదించిన ధనురథరునకు కుమార్తెను ఇచ్చి వివాహము చేయుదునని ప్రకటించెను.

## ద్రౌపదీ స్వయంవర సభ

ఆతని ప్రకటనను విని నలుదిక్కులనుండి భూపాలులు రాదొడగిరి. కర్ణాదులతో దుర్యోధనాది కురురాజులందరూ వచ్చిరి. వందలకొలది బ్రాహ్మణులు వచ్చిరి. ద్రుపదుడు వారిని యథోచితముగా సన్మానము చేయ వారు సభాస్థలి నలంకరించి, నగరమునకు ఉత్తరప్రాంతమున విశాలమైన సభాస్థలమును నిర్మించి దానిని అందముగా తోరణాదులతోను, శిల్పములతోను, మణిమయాదులతోను అలంకరించిరి. వివిధ స్థానముల నృత్య, గీత, వాద్యములతో నటులు దర్శకులకు ఆనందము కలిగించిరి.

రాజులందరూ రమణీయ వేషముల ఒకరిపై నొకరు స్పర్ధతో చూచుచూ సభ నలంకరించిరి. పౌరులు తమతమ స్థానముల కూర్చుండి పాండవులు బ్రాహ్మణ బృందముతో నుండి పాంచాల రాజు ఐశ్వర్యము పరికించుచుండిరి.

నృత్య నాట్యాదులు పూర్తియైన పిమ్మట ద్రౌపది అపూర్వమైన వసనములు ధరించి, వివిధాలంకారములతో, చేతనొక సుందరమైన పూలమాలను ధరించి సభ ప్రవేశించెను. బ్రాహ్మణులు స్వస్తి వచనములు పలికిరి. పురోహితుడు అగ్నియందు తర్పణము చేసెను.

దుష్టద్యుమ్నుడు సోదరి వెంట రంగమధ్యమము చేరి తూర్యాది వాద్యముల నాపి గంభీరరవమున ఇట్లు పలికెను. "ఓ నరపతులారా! దయచేసి వినుడు. ఐదు బాణములతో యంత్రమును ఛిద్రము చేసి మత్స్యమును పడగొట్టు కులశీల రూపలావణ్యుని నా సహోదరి పతిగా వరించును."

ఈ విధముగా పలికి ద్రుపదపుత్రుడు భగినికి సభనలంకరించిన రాజుల నామ, గోత్ర, కార్యాదులు వివరించి చెప్పెను.

## 186. షడశీత్యధిక శతతమ అధ్యాయము
## స్వయంవరమునకు వచ్చిన రాజుల పరిచయము

దుష్టద్యుమ్నుడు రాజుల పేర్లు, కుల, శీలాదులు వివరించెను. ధార్తరాష్ట్రులు దుర్యోధన, దుర్విసహుడు, దుర్ముఖుడు, దుష్టదర్శనుడు, వివింశాతుడు, వికర్ణుడు, దుశ్శాసనుడు, యుయుత్సుడు, వాయనీగుడు, భీమనేగుడు, ఉగ్రయూధుడు,

బలాకి, కరకాయుడు, విరోచనుడు, సుకుండలుడు, చిత్రసేనుడు, సువర్చుడు, కనకధ్వజుడు, నందకుడు, తుహుడు, వికటుడు మొదలైనవారు కర్ణునితో వచ్చిరి.

గాంధార రాజు కుమారుడు శకుని, వృషకుడు, బృహద్బలుడు, మహావీరుడైన అశ్వత్థామ, భోజరాజు, బృహస్తుడు, మణిమానుడు, దండధారుడు, సహదేవుడు, జయత్సేనుడు, విరాటుడు, వాని కుమారులు శంఖుడు, ఉత్తరుడు; సుశర్మ, సేనాబిందు, సుకేతుడు, వాని కుమారులు సునామ, సువర్ణులు, సుచిత్రుడు, సుకుమారుడు, వృకుడు, సత్యధృతి, సూర్యధ్వజుడు, రోచమానుడు, నీలుడు, చిత్రాయుధుడు, అంశుమానుడు, శ్రోనిమానుడు, చేకితానుడు, సుమద్రసేనుని పుత్రుడు చంద్రసేనుడు; జలసంధుడు, విదంతుడు, అతని కుమారుడు దండుడు, పౌండ్రకవాసుదేవుడు, భగదత్తుడు, కుళింగుడు, తామ్రలిప్తుడు, మద్రరాజు శల్యుడు, వాని కుమారులు రుక్మాంగదుడు, రుక్మరథుడు, సోమదత్తుడు వాని కుమారులు భూరి, భూరిశ్రవుడు; సుదక్షిణుడు, కాంభోజుడు, బృహద్బలుడు, సుషేణుడు, శిబి, ఔశీనరుడు, నిహుతారుడు, సంకర్షణుడు; వాసుదేవుడు, శాంబుడు, చారుదేష్ణుడు, ప్రదుమ్న, అక్రూరుడు, సాత్యకి, కృతవర్మ, హార్ద్వికుడు, విదూరథుడు, కంకుడు, శంకుడు, గవేషణుడు, అనిరుద్ధుడు, శమీకుడు, ఉశీనరుడు మొదలగు యాదవులు; భగీరథుడు, బృహక్షత్రుడు, సింధుదేశాధిపతియైన జయద్రధుడు, బృహద్రధుడు, బాల్హీకుడు, శుత్రాయు, ఉలూకుడు, చిత్రాంగదుడు, శుభాంగదుడు, వత్సరాజు, కోశలాధిపతి, శిశుపాలుడు, జరాసంధుడు మొదలైన రాజులందరూ లక్ష్యభేదము చేయ సంసిద్ధులై ఉన్నారు.

## 187. సప్తశీత్యధిక శతతమ అధ్యాయము
## కృష్ణ సౌందర్యము చూసి రాజులు మోహితులగుట

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! బలవీర్య సంపన్నులు, అస్త్రవిద్యా విశారదులు, తరుణ వయస్కులు అయిన ఆ రాజన్యబృందము, రూప, యౌవ్వన, కుల, శీల, ఐశ్వర్య మదమున మత్తులై మదించిన యేనుగుల వలె, ఒకరినొకరు ఈర్ష్యాకషాయిత లోచనులై స్పర్ధను చెందుచూ త్రిభువన లలామ భూతయైన కృష్ణను చూచి కామమోహితులై "ద్రౌపది నాదేయగునని" తమ తమ సింహాసనముల నుండి కదలిరి. ఆమె రూపలావణ్యములకు ముగ్ధులై కందర్పుని శరములచే జర్జరితులై ఆమెనే ధ్యానింపసాగిరి.

అంత రుద్ర, ఆదిత్య, వసుగణ, అశ్వనికుమార, సిద్ధ, సాధ్య, కుబేరాది దేవగణములు విమానారూఢులై రాజసభను చేరిరి. అసంఖ్యాకులైన దైత్య, సువర్ణ,

మహూరంగ, దేవర్షి, గుహ్యక, చారణాదులు,విశ్వావసు, నారద, పర్వతాది ఋషులు, గంధర్వులు, అప్సరసలు సమాగతులైరి.

బలభద్రుడు, జనార్ధనుడు, వృష్టి వంశీయ యదుశ్రేష్ఠులు అందరినీ పర్యవేక్షించుచుండిరి. కృష్ణుడు నివురుగప్పిన నిప్పు వలె బ్రాహ్మణుల మధ్యనున్న పాండవులను చూసి అన్నయైన బలరామునకు తెలియజేయ ఆతడు ప్రసన్న వదనుడయ్యెను.

మిగిలిన రాజులెవ్వరూ పాండవులను పోల్చుకొనలేకపోయిరి. వారు ద్రౌపదియందు మనస్సు నిల్పి ఈర్ష్యతో పండ్లు కొరుకుచూ ఎఱ్ఱని కండ్లతో యుండిరి. పాండవులైదుగురు పాంచాలిని చూచి మారుని పాలబడిరి.

దేవతలు దివ్యపుష్పములు జల్ల సభయంతయు సుగంధమున నిండెను. దుందుభిధ్వనము గగనమంతయూ నిండెను. రాజప్రముఖులు బలవీర్యములు ప్రదర్శించుచూ సింహనాదములు చేసిరి.

ఆ భీషణ శరాశనమును ఎక్కుపెట్టుట అటుండ అనేకనేక రాజన్యులు గుణసంధానము చేయలేక నిస్తేజులై, దీర్ఘమైన నిట్టూర్పులు విడచుచూ రత్నాలంకారములు తెగి నేలరాల వెనుకకు తిరిగిరి.

ధనుర్ధరుడై కర్ణుడు రాజన్యులు తిరిగిరా చూచి త్వరితముగా ధనువునెత్తి నారి తగిలించి బాణము సంధించెను. పాండవులు తప్పక ఈతడు కన్యారత్నమును పొందునని తలంచిరి. ద్రౌపది కర్ణుని ప్రయత్నము చూచి "సూతపుత్రుని నేను పరిణయమాడను" అని ముక్తకంఠమున పలుక కర్ణుడు క్రోధాన్విత వికటహాస్యము చేసి సూర్యసందర్శనము చేసి శరాశనము పరిత్యజించి మరలెను.

చేది దేశాధిపుడు శిశుపాలుడు ప్రయత్నించి విఫలుడయ్యెను. జరాసంధుడు కృతకృత్యుడు కాలేక కూలబడెను. ఇట్లు సర్వ రాజన్యవర్గము క్రమముగా పరాన్ముఖులు కాగా అర్జునుడు ప్రయత్నింప సంకల్పితుడయ్యెను.

## 188. అష్టాశీత్యధిక శతతమ అధ్యాయము
## అర్జునుడు విల్లు ఎక్కుపెట్టుట

వైశంపాయనుడిట్లనెను. మహారాజా! ఇట్లు రాజులందరూ కార్యముచెడి తిరిగి రాగా అర్జునుడు బ్రాహ్మణ బృందము నుండి బయలు వెడల విప్రులు కొందరు ఆతనికి ఉత్సాహవాక్యముల ప్రోత్సహించుచూ కేకలు వేసిరి.

"శల్యుడు మొదలైన ధనుర్వేదపారంగతులే యేమియూ చేయలేకపోయిరి. హీనబలుడు, శిక్షణాహీనుడైన బ్రాహ్మణకుమారుడు యేమి చేయగలడు? రాజకుమార్తెను చూసి బ్రాహ్మణ సులభమైన చపలత్వమున ఈతడు ఇట్లు సాహసించుచున్నాడు. దీనివలన బ్రాహ్మణ కులమునకే చెడ్డపేరు వచ్చును. ఈతనిని ఆపుడు."

"లేదు. మనము అపహాస్యముల పాలుకాము. ఆతని పీనస్కంధములను, దీర్ఘబాహువులను చూడుడు. ఆతని గంభీర గజగమనము ఇతడు విఫలప్రయత్నుడు కాడని చాటి చెప్పుచున్నది. ఈ భూమండలమున బ్రాహ్మణునకు అసాధ్యమైన కార్యమేమున్నది? బ్రాహ్మణులు చూచుటకు దుర్బలులైనా అతడి తేజమున సర్వము సాధించగలరు. జమదగ్ని తనయుడు సమస్త రాచకులమును నతమస్కులను చేయలేదా? అగస్త్యుడు అగాధమైన సాగరమును పానముచేయలేదా? తప్పక ఈ బ్రాహ్మణ బాలకుడు జయము పొందును" అని తర్కవితర్కములు చేయసాగిరి.

## అర్జునుడు లక్ష్యమును భేదించుట

అర్జునుడు విప్రుల మాటలు వినుచూ కార్ముకమును చేరి మహాదేవుని ప్రణామము చేయుచూ విల్లునకు ప్రదక్షిణము చేసి కృష్ణుని మనస్సున ధ్యానించి శరాశనము గ్రహించెను. నారి సారించి ఐదు బాణములను గ్రహించి అతికష్టభేద్యమైన లక్ష్యమును యంత్రఛిద్రమున భేదించి నేలపడగొట్టెను. తదనంతరము అంతరిక్షమున, సభాస్థలమున మహాకోలాహలము చెలరేగెను. దేవతలు అర్జునునిపై పుష్పవృష్టి కావించిరి. వేలకొలది బ్రాహ్మణులు పైనున్న అంగవస్త్రములను ఊపుచూ మహోల్లాసముతో జయజయధ్వానములు చేయసాగిరి. తూర్యనాదములు వినిపించుచూ వందిమాగధులు స్తుతివాక్యములు చేసిరి.

ద్రుపదుడు ఆనందముతో అర్జునుని సైన్యముతో బాసటగా నిలువ సంకల్పించెను. ధర్మరాజు, నకుల సహదేవులతో సత్వరము గృహాభిముఖుడయ్యెను.

యంత్రభేదనము చూసిన కృష్ణ అర్జునుని చేరి వరమాలను ఆతని కంఠమున వేసెను. అర్జునుడు ద్విజగణములతో, పత్నితో రంగస్థలినుండి బయటకు వచ్చెను.

## 189. ఉననవత్యధిక శతతమ అధ్యాయము
## అర్జునునితో రాజులు యుద్ధము చేయుట

వైశంపాయనుడిట్లనెను. "అనంతరము ద్రుపదుడు ఆ బ్రాహ్మణునకు కన్యాదానము చేయబోవ భూపాలవర్గము కృద్ధులై "ద్రుపదరాజు మనలను ఇచ్చుటకు

అవమానించుటకే పిలచినాడు. ఇతడు సమ్మానయోగ్యుడు కాడు. ఈతనిని సపుత్రకముగా నాశనము చేయుదము. భళిరే! స్వయంవరమునకు బ్రాహ్మణు డర్హుడా? దేవతుల్యమైన ఇందరు నృపసత్తములలో ఒకరైనను ఇతని కుమార్తెకు తగినవారు లేరా? ద్రుపదుడు మనలో ఒకరికిచ్చి ఆమెను వివాహము చేయక పోయిన ఆమె నిప్పుల పడవైచి రాజ్యమునకు మరలుదము. చపలుడైన బ్రాహ్మణుని వదలుడు. ద్రుపదుని నాశనము చేయుడు" అని పలుకుచూ అవమాన భయమున ద్రుపదుని సంహరింప ఆయుధములు గ్రహించి బయలుదేర ద్రుపదుడు బ్రాహ్మణుల శరణుజొచ్చెను. అర్జునుడు ధనుర్బాణములు ధరించియు, భీముడు పెకిలించిన మహావృక్షమును భుజముల నిడుకొనియు రాజులకు ఎదురు నిలిచిరి.

ఆ దృశ్యమునుచూచి కృష్ణుడు అన్నతో "కార్ముకము ధరించినవాడే అర్జునుడు, మహావృక్షమును పెకలించినవాడు భీముడు, వినీతుడై త్వరితముగా చనుచున్న ఆతడే ధర్మరాజు. ఆతని ననుసరించు వారిద్దరూ నకుల సహదేవులు. ఇక సందేహము లేదు. పాండవులు కుశలులై ఉన్నారు" అని పలుక బలరాముడు "జనార్ధనా! మన మేనత్త, ఆమె పుత్రులు క్షేమముగా నున్న సంగతి ఎంతయో ఆనందము కలిగించునది" అని బదులు పలికెను.

## 190. నవత్యధిక శతతమ అధ్యాయము
## ఉభయపక్షములు యుద్ధము చేయుట

విప్రులు ఉత్తరీయములను కమండలములకు గట్టి అస్త్రముల వలె హస్తముల ధరించి గట్టిగా అర్జునునితో "నీవు భయపడకుము. మేము నీకు సహాయము చేయ సంసిద్ధులమై ఉన్నాము" అని పలుక అర్జునుడు చిరునవ్వుతో "మీరు ప్రక్కన నిలబడి చూచుచుండుడు. నా తీవ్రమైన వాడి ములుకులతో వీరికి బుద్ధి చెప్పెదను" అని రాజులను భీమసహాయుడై ఎదుర్కొనెను.

హేలగా ఎదురువచ్చిన కర్ణుని నిశితబాణములతో నొప్పింప ఆతడు అతికష్టముతో వాటిని ఆపెను. తదనంతరము వారిరువురి మధ్య తీవ్రమైన ద్వంద్వ యుద్ధము చెలరేగెను. "కాసుకో!" "ఇదిగో దాని జవాబు" మొదలైన హెచ్చరికలతో వారు ఘోరముగా పోరాడ దొడంగిరి.

అంత కర్ణుడు "విప్రవరా! నీ భుజబలమును, అస్త్రనైపుణ్యము చూసి చాల సంతోషించితిని. నీవు మూర్తివహించిన ధనుర్వేదమువా? పరశురాముడవా? నన్ను ఎదిరించగలవాడు పాండవ మధ్యముడు తక్క వేరొకడు లేడు."

"కర్ణా! నేను ధనుర్వేదమును కాదు. రాముడను కాదు. గురూపదేశమున కొద్దిగా విద్యనభ్యసింతిని. నిన్ను ఓడించుటకే ఈ రణక్షేత్రమునకు వచ్చితిని."

కర్ణుడు బ్రాహ్మణుని తేజమునకు అలరి యుద్ధమునుండి పరాన్ముఖుడయ్యెను.

భీముడు, శల్యుడు భీకరమైన మల్లయుద్ధము చేయదొడంగిరి. తుదకు భీముడు శల్యుని నేలపడద్రొచ్చెను, కాని వధింపలేదు.

కర్ణ శల్యుల పరాజయమును పరికించిన రాజప్రముఖులు తమలో తాము "ఈ బ్రాహ్మణ కుమారులు ఎవరి పుత్రులు? వీరు ఎచ్చటనుండి వచ్చిరో తెలిసికొనుట ఉచితమైన కార్యము. మహాబలుడైన కర్ణుని ఎదిరించు జోదు ఎందున్నాడు? దుర్యోధన, భీములు తక్క ఎదిరింప శక్యముకాని శల్యుని ఈ బ్రాహ్మణుడు ఎట్లు ఓడించెను? వీరు అపరాధము చేసినను క్షమించుట ఉచితము. వారితో ఇక యుద్ధము చేయవలదు. కాని వారు పోరుసలుప దలచిన మనకెట్టి అభ్యంతరము లేదు" అని గుజగజలు పోసాగిరి.

## కృష్ణుడు మధ్యవర్తియై యుద్ధమునాపుట

రాజుల వచనములు వినుచున్న కృష్ణుడు వారిని చేరి "భూపాలులారా! వీరు ధర్మతః రాజకుమారిని గెలుచుకొన్నవారు. మీరు శాంతి వహింపుడు. ప్రయోజనము లేదు."

కృష్ణుని అనునయ వాక్యములు విని రాజులు పోరుమాని స్వస్వ గృహాభి ముఖులైరి. "నేడు రణమున బ్రాహ్మణులు జయమొందిరి. పాంచాలి బ్రాహ్మణుని వివాహమాడినది. క్షత్రియుల మదమణిగినది" అని ప్రజలు వివిధ సంభాషణలు చేయుచూ నిష్క్రమించిరి. భీమార్జునులు మేఘములు వీడిన చంద్రునివలె ప్రకాశించుచు బ్రాహ్మణుల మధ్య వధువుతో పయనించుచుండిరి.

కుంతి ఎంతకూ భిక్షకు వెడలిన కుమారులు రాకుండుటకు చింతించుచూ దుర్యోధనాదులు మరల ఎట్టి అత్యాచారము చేసిరో అని భయపడుచూ డోలాందోళిత మానసయైయుండెను.

## 191. ఏకనవత్యధిక శతతమ అధ్యాయము
## ద్రౌపదితో పాండవులు కుంతిని చేరుట

అర్జునుడు త్వరితముగా గృహము ప్రవేశించుచూ "మాతా! నేడొక రమణీయ పదార్థము భిక్షగా దొరికినది" అని కేకవేయ పృథ "నాయనా! దొరికినది

మీరైదుగురు సమానముగా భోగింపుడు" అని పలుకుచూ బయటకు వచ్చి దేవకన్యవలె నున్న కృష్ణను గాంచి "అయ్యో! ఎట్లు తప్పిదము చేసితిని" అని విలపించుచూ ఆమె హస్తమును గ్రహించి ధర్మరాజు వద్దకు చని "నాయనా! ఈమె ద్రుపదుని కుమార్తె, యాజ్ఞసేని. నీ తమ్ముడు భిక్షయని ఈమెను తెలుప నేను అసావధానురాలనై మీరైదుగురు సమానముగా అనుభవించుడని పలికితిని. కురుశ్రేష్ఠా! నా మాటలు అబద్ధము కాకుండగను, ఈమెకు అధర్మము తాకకుండగను, ఉపాయము తెలుపుము" అన ధర్మరాజు "ఫల్గుణా! యాజ్ఞసేని నీ జయమున లభించినది. నీవే ఈమెను అగ్నిసాక్షిగా పాణిగ్రహణము చేయుము" అని పలికెను.

"నరనాథా! నన్ను అధర్మాచరణునిగా చేయవలదు. నేను సాధువిగర్హిత కార్యమును ఆచరింపలేను. మీరు పెద్దవారు. మీ వివాహానంతరము భీమసేనుడు వివాహమాడవలె. తదుపరి నేను, నా అనంతరము నకుల సహదేవులు వివాహార్హులు. అందువలన అందరికీ హితమైన కార్యము తెలుపుడు. మేము మీ వశంవదులము."

అర్జునుని మాటలు విని పాండవులు ద్రౌపదిని వీక్షించి ఒకరినొకరు చూచుచూ కూర్చుండిరి. కమనీయమైన ఆమె సౌందర్యము భువనైకమోహనమై యుండెను.

ధర్మరాజు తమ్ములను చూచి వారి మనోకామితము గ్రహించి భేదభయమున నిర్జన ప్రదేశమునకు తీసుకొనిపోయి వేదవ్యాసుని వాక్యములు తలపుకు రాగా "ద్రౌపది మనందరికి భార్యయగును" అని పలికిన భీమాదులింకను సందిగ్ధావస్థ యందుండిరి. అట్టి సమయమున బలరామునితో కృష్ణుడు పాండవులను సమీపించెను.

బలరాముడు అభివాదనము చేయుచూ తన పరిచయము తెలుప పాండవులు ఆనందించిరి. అజాతకుడు ధర్మరాజు "వాసుదేవా! రహస్యముగా ఇచ్చట వసించుచున్న మమ్మ నీవెట్లు పోల్చుకొంటివి" అన కృష్ణుడు నవ్వుచూ "యుధిష్ఠిరా! నిప్పును దాచశక్యమా? ఇటువంటి దుర్లభమైన కార్యము సామాన్యుల వలన జరుగునా? మీరు దుష్ట దుర్యోధన, ధృతరాష్ట్రులచే పావకమందు హతులు కాకనేడు నీ వృద్ధిని పొందుట మాకు ఎంతో సంతోషము కలిగించినది. ఇతరులకు తెలియక ఉండుట శ్రేయోదాయకము. శిబిరములకు తిరిగిపోవ అనుజ్ఞ ఇందు" అని పాండవుల వద్ద సెలవు తీసుకొని స్కంధావారమునకు అన్నతో మరలిపోయెను.

# 192. ద్వినవత్యధిక శతతమ అధ్యాయము

## ద్రుష్టద్యుమ్నుడు రహస్యముగా పాండవులను పరీక్షించుట

పాంచాల పుత్రుడు ద్రుష్టద్యుమ్నుడు భీమార్జునులను రహస్యముగా అనుసరించుచూ వారి చేష్టలను పరికింపసాగెను.

పాండవులు భిక్ష తీసుకొని రాగా కుంతి చెప్పిన ప్రకారము ద్రౌపది మొదటి భాగము దీనులకు, బ్రాహ్మణులకు ఇచ్చి మిగిలిన అన్నము రెండు భాగములు చేసి మొదటి భాగము వృకోదరునకు, శేషాంశము ఆరు భాగములు చేసిన ధర్మరాజు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, కుంతి, ద్రౌపది ఆనందముగా భుజించిరి. తదుపరి సహదేవుడు కుశాశనములు పరువ ఉత్తరీయములు పరచుకొని పాండవులు దక్షిణమున శిరస్సునిడి శయనింప వారి తలవైపున కుంతి పాదముల చెంత కృష్ణయు శయనించిరి.

పాండవులు అస్త్ర, ఖడ్గాది వివిధ ఆయుధములు ప్రయోపసంహారములు, సేనాచాలనాదులను తర్కించుచూ క్రమముగా నిద్రపొందిరి.

తిరిగివచ్చిన కుమారుని చూసి ద్రుపదుడు "నాయనా! ద్రౌపది ఎచ్చటకు చనినది? కుశలమేనా? నా యశము నేలపాలు కాలేదు కదా! శూద్ర, వైశ్యాది హీనవంశస్థుల పాలబడలేదు కదా!మన సౌభాగ్యవశమున నరోత్తముడైన విజయుడే ఆమెను వరించెనా? నీవు యదార్థము తెలుపుము" అని కోరెను.

# రెండవ భాగము

# ఆదిపర్వం

## (శేషభాగము)

## 193. వైవాహిక పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! తదనంతరము దుష్టద్యుమ్నుడు తాను చూచినదంతయూ వివరించి "వేషభూషణముల వారు బ్రాహ్మణుల వలె నున్నప్పటికీ నిద్రించు అవసరమున యుద్ధక్రీడా ప్రసక్తి చేయుట తప్పక వారు క్షత్రియులని, వారు పాండవులయి ఉందురని తెలియుచున్నది. మత్స్యయంత్ర భేదకుడే అర్జునుడను జనశ్రుతి కలదు. పాండవులు ప్రచ్ఛన్నవేషులై ఉన్నారు" తండ్రికి వివరముగా తెలిపెను.

### పాండవులతో 'కృష్ణ' వివాహము మంత్రణాలోచనము

ఆనందముతో ద్రుపదుడు రాజపురోహితుని పిలిపించి "భార్గవ–కర్మశాల యందున్న లక్ష్యభేదము చేసిన వీరపురుషుని కులశీలములు తెలుసుకొని రండు" అని పంప ఆతడు పాండవులను చేరి నాగాడంబరమున మిక్కుటముగా వారిని పొగడి రాజవచనములుగా ఇట్లు చెప్పెను. మీరు శత్రువులను జయించి, నన్ను నా ఆత్మీయులను ఆనందపరచిరి. మహారాజు పాండురాజు నా సఖుడు. ఆతని కుమారుడైన అర్జుననకు నా కుమార్తెనిచ్చి వివాహము చేయ కోరిక యుండెడిది. అది నేడు సాఫల్యము చెందినదని తలంచుచున్నాను." ధర్మరాజు వినీతుడై భీమునిచే పురోహితునకు ఆర్ఘ్యపాద్యాలు సమర్పించి సుఖాసీనుని చేసి, "పాంచాలరాజు నిష్కామకర్ముడై, ధర్మపథమున చరించి, యంత్రమును భేదించిన వానికి కుమార్తెను సమర్పించెను. అతడు కుల, శీల, గోత్రనామాదులు చర్చింపలేదు. అతని ఈ కుమార్తె అతిరూపవతి, గుణవతి, సులక్షణ సంపన్న. ఆమె పాణిని గ్రహించుట నీచయోని సంభూతునకు వశ్యము కాదు. లక్ష్యభేదము చేసినవాడు అర్జునుడే. పాంచాలరాజును కుమార్తె నిమిత్తమై పరితాపము మానుడని తెలియజేయుడు" అని పలికెను.

అట్టి సమయమున రాజప్రసాదమునుంచి మరియొక వ్యక్తి వచ్చి భోజనాదులు చేయ రమ్మని రాజాభిమతము తెలియజేసెను.

## 194. పాండవులను ద్రుపదుడు ఆహ్వానించుట

రాజదూత ఇట్లనెను. "పెండ్లివారికి ఉత్కృష్టమైన ఖాద్యసామగ్రి కూర్చబడినది. మీరు అచ్చటకు వచ్చి ద్రౌపదీ పాణిగ్రహణము చేసి విందు భోజనము చేయ ప్రార్థితులము. కాంచనపద్మఖచితమైన రాజోచిత రథమారోహించి ద్రుపద భవనమునకు ఆగమనము చేయుడు."

పాండవులు పురోహితుని ముందు పంపి, కుంతిని, ద్రౌపదిని ఒక రథముపైనుంచి తాము ఐదుగురు మరియొక రథముపై నెక్కి బయలుదేరిరి. కుంతి ద్రౌపదితో అంతఃపురము ప్రవేశించెను. పాండవులు తమ విడిదిని చేరిరి.

ద్రుపదుడు విడిది ప్రదేశమును చక్కగా నలకంరించి అందు కృషికులకు, రాజులకు, వైశ్యులకు, బ్రాహ్మణులకు ఆనందము కలుగజేయు ఫలములు, తాళ్లు, గోవులు కృషిసామగ్రి ఒకవంక, అశ్వ, రథ, శర, ఖడ్గ, శక్తి, ప్రాశ, పరుశు మొదలైనవి ఒక వంక, ధన కనకములొక వంక, కృష్ణాజినాదులొకవంక బహుమతులుగా ఉంచెను.

రాజు బంధుమిత్ర పరివారముతో ఎదురేగి పాండవులను తోడ్కొని తెచ్చెను. పాండవులు గృహము ప్రవేశించి, అశంకితచిత్తులై సుఖాసనముల కూర్చుండిరి. దాసదాసీజనము వారిని వివిధ ఉజ్జ్వల వేషభూషతులను చేసిరి. సువర్ణపాత్రలలో బహువిధ సుస్వాదులైన అన్న వ్యంజనాదులతో భోజనమిడిరి.

బహుమతులయందున్న అస్త్రశస్త్రములపై పాండవులు కన్నరుచుచున్న అపేక్షను చూసి ద్రుపదుడు సంతసించెను.

## 195. ద్రుపదుడు పాండవులను పరిచయమడుగుట

వైశంపాయనుడిట్లనెను. "జనమేజయ మహారాజా! తదనంతరము పాంచాలరాజు ధర్మరాజును పిలచి వివాహదినము నిశ్చయింపుచూ, "మీరు యే కులమునకు చెందినవారు? బ్రాహ్మణులా? వైశ్యులా? క్షత్రియులా? లేక శూద్రులా? లేక మారువేషములయందున్న దేవతలా? దయచేసి నిజము తెలుపుడు. నా మనస్సు సంశయాకులితమైయున్నది. మీనుండి నిజము తెలిసికొనిన పిదప నేను వివాహము చేయ ఉద్యుక్తుడనగుదును" అని పలుక యుధిష్ఠిరుడు "రాజా! మీరు ఉద్విగ్నులు కాకుండా స్వస్థతను పొందుడు. మీ కోరిక నెరవేరినది. మేము పాండురాజు పుత్రులము. కుంతి మా తల్లి. నేను యుధిష్టరుడను. వీరు భీమ,

అర్జున, నకుల సహదేవులు. నరశ్రేష్ఠా! మీరు సంశయమును వీడుడు. మేము క్షత్రియులము. మీ కన్య పద్మమువలె ఒక సరస్సునుండి మరియొక సరస్సును చేరినది” అని మారు పలికెను.

అంత ద్రుపదుడు హర్షించి, ధర్మరాజును వారెట్లు లాక్షాగృహమునుండి తప్పించుకొనినది అడిగి, తెలుసుకొని ధృతరాష్ట్రుని నీచబుద్ధిని తిరస్కరించుచూ తమ రాజ్యమునందు సుఖముగా యుండుడని వారిని కోరెను.

## ద్రౌపదీ వివాహాలోచనము

అనంతరము పాండవులు, కుంతియు ద్రుపదునిచే పూజితులైరి. ద్రుపదుడు కుమారునితో వారిని చేరి “నేడు శుభదినము. నేడే పార్థునకు, ద్రౌపదికి వివాహము జరిపించిన బాగుండునని తలంచుచున్నాను” అని పలికిన ధర్మరాజు “నరనాథా! నాకు, భీమునకు ఇంకను వివాహము కాలేదు. జ్యేష్ఠులమైన మేముండగా అర్జునుని వివాహము ధర్మయుక్తము కాదు. అదీకాక తల్లి ఆనతిచే మేమెల్ల సమయము లందును లభించిన భిక్షను సమానముగా అనుభవించుచున్నాము. అందువలన మీరు దయచేసి ద్రౌపదితో మాకు జ్యేష్ఠానుక్రమముగా వివాహము జరిపింప ప్రార్థించుచున్నాను” అని నుడివెను.

“కురునందనా! ఒక పురుషుడు బహుపత్నీయుతుడై ఉండుట తిలకించితి కాని, ఒక స్త్రీకి బహుభర్తలుండుట ఎందునూ వినలేదు. ధార్మికులైన మీనోట ఇట్టి వచనములు ప్రకాశింపవు. వేదవిహితమైన ఇట్టి కార్యము చేయుట ఉచితము కాదు.”

“ద్రుపద మహారాజా! ధర్మము అతి సూక్ష్మమైనది. దానిని తెలుసుకొనుట చాలా కష్టము. నేనెన్నడునూ అనృతమాడువాడను కాను. నా మనస్సున అధర్మమునకు స్థానము లేదు. ముఖ్యముగా మా తల్లి ఆనతితోనే మేమీ కార్యము చేయుచున్నాము. మీరు సంకోచింపక కార్యోన్ముఖులు కండు.”

“కౌంతేయా! మీరు, మీ తల్లి కుంతి, నా కుమారుడైన దుష్టద్యుమ్నుడు సావధానులై ఆలోచించి నిర్ణయించిన విధముగా సేయ సిద్ధముగా ఉన్నాను” అని ద్రుపదుడు పలికెను.

ఆ సమయమున యాదృచ్ఛాక్రమమున మహర్షి ద్వైపాయనుడు అచ్చటకు యేతెంచెను.

## 196. వివాహ విషయము వ్యాసమహర్షితో చర్చించుట

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! వేదవ్యాసుడు రాగానే పాండవులు, ద్రుపదుడు తమ తమ ఆసనములు దిగి పూజార్చనలు గావించి, ఆసనమున కూర్చుండబెట్టిన పిదప ద్రుపదుడు ఆతనితో "ధర్మరాజు తాము ఐదుగురూ ద్రౌపదిని వివాహమాడ సంకల్పించినట్లు తెలియజేయుచున్నాడు. ఇది ఎట్లు సంభవము? వర్ణసంకరము కాదా? కర్తవ్యము తెలియజేయుడు" అని ప్రార్థింప, ముని "రాజా! ధర్మతత్వము చాలా దురవగాహమైన విషయము. ముందు మీ ఉద్దేశ్యములను తెలుపుడు" అని వారిని ప్రశ్నింప ద్రుపదుడు "ఈ కార్యము వేద విహితమని నా ఉద్దేశ్యము. ఒక స్త్రీ అనేకులైన భర్తలను పొంది యుండుట ఎందునూ వినలేదు" అని పలికెను. దుష్టద్యుమ్నుడు "తపోధనా!సుశీలుడైన అన్న తన తమ్ముని భార్య పొందు ఎట్లు కోరగలడు? ధర్మపథము ఎట్లున్నదో తెలియదు కాని నా మనస్సునకు ఇది తగని కార్యమని తోచుచున్నది" అని పలికెను.

"మునివరా! నేను అబద్ధమాడువాడను కాను. అధర్మాలోచన చేయువాడను కాను. ఇది అధర్మము కాదని నా మనస్సు చెప్పుచున్నది. పురాణములో జటిల అను గౌతమవంశపు కన్య ఏడుగురు మునులను వివాహమాడెనని చదివితిని. బ్రాహ్మియను మునికన్య ప్రచేతులను పదిమంది భర్తలతో సంసారము చేసెను. ముఖ్యముగా గురుజనుల వాక్యానుసారముగా నడచుకొనుటయే ధర్మము. గురువులలో పరమగురువైన నా తల్లి భిక్షను మమ్ము సమానముగా అనుభవింపు మని చెప్పినది. అందువలన ఇదే పరమధర్మమని నేననుకొను చున్నాను" అని యుధిష్ఠిరుడు పలుక పృథ ఆతని మాటలను సమర్థించెను.

## వ్యాస మహర్షి కర్తవ్యము తెలియజేయుట

వ్యాసమహర్షి "కుంతీ! నీ వచనములు అనృతము కావు. అదే సనాతన ధర్మము. ద్రుపద మహారాజా! ధర్మరాజు చెప్పినది సత్యము. అది యెందులకో నీకు గూఢముగా తెలియజెప్పెదను" అని ఆతని కరము గ్రహించి రాజభవనమున యేకాంత ప్రదేశమును చేరెను.

## 197. ద్రౌపది బహుస్వామిత్వము వ్యాసుడు ద్రుపదునకు తెలియజెప్పుట

వ్యాసుడిట్లనెను. "ద్రుపదరాజా! పూర్వము నైమశారణ్యమందు దేవతలు ఒక మహాయజ్ఞమారంభించిరి. అందు యముడు దీక్ష వహించి యుండెను.

అతడు క్రతువున దీక్షితుడైయుండ మనుజుల సంఖ్య అధికమయ్యెను. సోమ, శుక్ర, వరుణ, కుబేర, రుద్రాది దేవతలు భీతులై ప్రజాపతిని చేర సర్వలోక పితామహుడు "మీరు అమరులు భీతిచెందకుడు. యజ్ఞము పూర్తి అయిన పిదప యముడు ద్విగుణీకృత బలముతో ప్రజలను సంహరించును" అని ఊరడించి పంపెను.

వారు మరల యజ్ఞ స్థలమునకు మరలుచుండ గంగాజలముల ఒక బంగారు పద్మమును చూసిరి. అనుసంధానము చేయ వెడలిన ఇంద్రుడు కొంత దూరమేగి ఒక యువతిని గాంచెను. ఆమె రోదించుచుండ ఆమె కన్నీటి బిందువులు బంగారు పద్మములగుచుండెను. దేవరాజు "నీవు ఎవ్వరు? ఎందులకిట్లు ఏడ్చుచున్నావు?" అని ప్రశ్నించిన ఆమె ఆతనిని తన వెంట రమ్మనెను. అచట గిరిజ శిఖరముపై సింహాసనమున అధిష్ఠించి ఒక పరమ సుందరుడైన యువకుడు సుందరియైన స్త్రీతో పాచికలాడుచుండ, ఇంద్రుడు చూసెను. యువకుడు ఆటయందు నిమగ్నుడై తనను పరికించనందున ఇంద్రుడు కోపించి "ఈ భూమండలమంతయూ నా ఆధీనము. నేను దీని ప్రభువును. నాకు ఉచిత మర్యాదను నీవు చూపక వ్యసనపరుడవై ఉంటివి" అని గర్జింప ఆ దేవుడు చిరునవ్వు నవ్వుచూ ఇంద్రుని చూసినంత మాత్రముననే ఆతడు శిల్పము వలె స్తంభించిపోయెను.

ఆ మహాపురుషుడు రోదించుచున్న స్త్రీతో ఆతనిని నా వద్దకు తెమ్ము. నేనాతని దర్పమడంచెదను అని ఆజ్ఞాపింప ఆ స్త్రీ ఇంద్రుని స్పర్శించినంత మాత్రమున ఆతడు అవయవములు శిధిలములై నేలకూలెను. ఇంద్రుని అట్టి అవస్థ చూసి ఉగ్రతేజుడు "ఇంద్రా! ఇక ఎన్నడును గర్వింపకుము. నీవు అమిత బలశాలివి. ఈ పర్వతము నెత్తి ఛిద్రమందు నీవంటివారిని చేరుము" అని ఉత్తరువిచ్చెను. ఇంద్రుడట్లే రంధ్రమును ప్రవేశించి తనవంటి మరి నలుగురిని చూసెను. దేవదేవుడు "నీవలెనే వీరును గర్వితమతులై ఈ దశకు వచ్చిరి. మీరందరూ మనుజయోనిని జనింపుడు. కర్మఫలమనుభవించి మరల స్వస్థానము చేరుడు" అని పలుక భూతమున ఇంద్రులు తాము ధర్మ, వాయు, అశ్వనీకుమారుల వలన పుట్ట వరమడిగిరి. ఇంద్రుడు స్వవీర్యముననే జననమొందునట్లు చేయుమని ప్రార్థింప శివుడు 'తథాస్తు' అని ఆశీర్వదించెను. ఆ సుందరియే వారందరికి భార్య అగునని తెలియజేసెను.

శివుడు నారాయణుని వద్దకేగి యావత్ వృత్తాంతము ఎరింగించెను. నారాయణుడు తన మస్తకమునుంచి రెండు కేశములు తీసెను. అందు ఒకటి

సలిత కేశము. అందుండి బలరాముడు, కృష్ణ కేశమునుండి కృష్ణుడు జన్మించెను. అందువలననే అతడు కేశవుడని ప్రసిద్ధిపొందెను.

ఆ ఐదుగురు ఇంద్రులే పాండవులుగా జన్మించిరి. లక్ష్మి మహాదేవుని ఆనతిపై ద్రౌపదిగా జన్మించెను.

ద్రుపద మహారాజా! దైవసంయోగమున గాక ఇట్టి సుందరి లోకమందు జన్మించునా?"

అని మహర్షి ద్రుపదునకు దివ్యదృష్టి నివ్వ ఆతడు దివ్యదేహధారులై దివ్య వస్త్రములతోనున్న దేవతలుగా పాండవులను, ద్రౌపదిని తెలుసుకొనెను.

పిదప వ్యాసుడు ద్రౌపది మునికన్యగా శివుని వలన ఐదుగురు భర్తలను వరముగా పొందిన గాథను ద్రుపదునకు చెప్పెను.

## 198. ద్రౌపది వివాహము

అంత ద్రుపదుడు "మునివర్యా! విధిని మనము ఎదిరించగలమా? శివుడే ద్రౌపదికి ఐదుగురు భర్తలను వరమిచ్చెను. ఇక ఉచితమా? అనుచితమా? అను ప్రశ్నలకు తావే లేదు. దేవవాక్యమునకు మనము ఎదురాడలేము కదా!" అని పలికెను.

వ్యాసమహర్షి ధర్మరాజును పిలచి "ఈనాడే శుభదినము. చంద్రుడు పుష్యా నక్షత్రము ప్రవేశించుచున్నాడు. నేడే ముందుగా నీవు ద్రౌపదీ పాణిపీడనము చేయుము" అని ఆనతిచ్చెను.

యజ్ఞసేనుడు పుత్రునితోడను, బంధుబాంధవులతోను, సైన్య సామంతుల తోను వివాహ మంటపమునకు పాంచాలిని వివిధ రత్నాభరణముల అలంకరించి తీసుకొని వచ్చెను. పురస్త్రీలు, బ్రాహ్మణులు వివాహము తిలకింప వచ్చిరి. పాండవులు స్నానాదులు చేసి మంగళక్రియలు ఆచరించి పురోహితుడైన ధౌమ్యునితో సభ ప్రవేశించిరి. వేదవిదులైన పురోహితులు అగ్నిసాక్షిగా హోమాదు లతో మంత్రోచ్చారణ పూర్వకముగా ద్రౌపదీ యుధిష్ఠిరుల వివాహము గావింప వారు అగ్నిహోత్రునకు ప్రదక్షిణము చేసిరి. తదనంతరము అటులనే తదుపరి నల్గురు కూడా ద్రౌపదిని ఉద్వాహమాడిరి. క్రమముగా దినాభివృద్ధి పొందినను ద్రౌపది కన్యాభావమున విలక్షణము కాన్పింపలేదు.

వివాహానంతరము ద్రుపదుడు పాండవులకు బహురత్నాభరణములు, నూరు యేనుగులు, నూర్గురు దాసీలను, నూరు రథములను కానుకగా ఇచ్చెను.

వచ్చిన బ్రాహ్మణులకు, అతిథులకు రాజు వస్త్ర, అలంకారాదులతో గౌరవించి సత్కరించెను.

అలౌకిక స్త్రీరత్నమును పొందిన పాండవులు పాంచాల రాజభవనమున సుఖముగా కాలము గడపసాగిరి.

## 199. నవవధువు ద్రౌపది ఆశీర్వాదము పొందుట

వివాహము పూర్తియైన పిమ్మట ద్రౌపది పురాంగనలతో కూర్చొని ఉన్న కుంతి వద్దకు వచ్చి ప్రణామము చేయ ఆమె "తల్లీ! నీవు లక్ష్మి నారాయణునితోను, రోహిణి చంద్రునితోను, దమయంతి నలునితోను ప్రేమానురాగములతో నున్నట్లు నీ భర్తలతో చరింపుము. వీరసంతానము పొందుము. అతిథులను సత్కరించి కులగౌరవము వృద్ధిచేయుము. నీవు భర్తతో అశ్వమేధాది యజ్ఞములు చేసి, శతసంవత్సరములు సుఖముగా జీవింపుము" అని కోడలిని ఆశీర్వదించెను.

కృష్ణుడు పాండవులకు మణులను, ఆభరణములను, వస్త్రములను, రమణీయ గృహ సామగ్రి, దాసదాసీజనములను, ఏనుగులను, గుఱ్ఱములను, రథములను కానుకగా పంప ధర్మరాజు ఆనందముతో వాటిని గ్రహించెను.

వైవాహిక పర్వాధ్యాయ సమాప్తి

## 200. విదురాగమన పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! కౌరవుల గూఢచారులు వచ్చి రాజులందరితోను ద్రౌపదిని వివాహమాడినది పాండవులనియు, యంత్రము భేదించిన వ్యక్తి అర్జునుడనియు, శల్యుని మల్లయుద్ధమున ఓడించినది భీముడనియు తెలియజేసిరి.

రాజులు, పురోచనుని సహాయమున పాండవులను చంప ప్రయత్నించిన సుయోధన, ధృతరాష్ట్రులను నిందించి, పాండవులను పొల్చుకొని తమ తమ రాజ్యములకు వెడలిపోయిరి.

## ద్రౌపదిని పొందని కౌరవుల విచారము

అర్జునుడే లక్ష్యభేదము చేసెనని తెలుసుకొని, దుర్యోధనుడు విచారముతో భ్రాతృగణముతోను, అశ్వత్థామ, శకుని, కర్ణాదులతోను హస్తినా నగరమునకు ప్రయాణమయ్యెను. దుశ్శాసనుడు "అన్నా! ఆతడు బ్రాహ్మణ వేషమున వచ్చెను

కాన ద్రౌపదిని పొందెను. లేనిచో ముందే మేము ఆతనిని మట్టుపెట్టి ఉండెడి వారము. మనము పురుషాకారము అవలంబించి వారిని చంప ప్రయత్నించితిమి. కాని నేడు దైవమే శ్రేష్ఠమని తేలినది" అని విషాదవదనుడై అన్నతో పలికెను.

ఇట్లు పాండవులను, కృతకృత్యుడు గాని పురోచనుని దూరుచూ కౌరవులు హస్తినా నగరము చేరిరి.

## ధృతరాష్ట్రుని కపట ఆనందము

భగ్నమనోరథులై, సిగ్గుతో దుర్యోధనాదులు తిరిగివచ్చిరనియు, పాండవులు ద్రౌపదిని భార్యగా పొందిరనియు తెలిసికొనిన విదురుడు ఆనందించి, ధృతరాష్ట్రుని చేరి "మహారాజా! భాగ్యవశమున కౌరవులు విజయము పొందిరి" అని పలుక ధృతరాష్ట్రుడు ద్రౌపది వరమాలను సుయోధనుని కంఠమున వైచెనని భ్రమపడి "విదురా! ఎంత శుభసమాచారము తెలిపితివి. వెంటనే నూతన దంపతులైన దుర్యోధన, ద్రౌపదులనుఅలంకరించి నా వద్దకు తీసుకొని రమ్ము" అని పలికెను.

"రాజా! వరమాలను పొందినది పాండవులు. వారు క్షేమముగానే ఉన్నారు. ద్రుపదాది బంధువులతో శక్తిమంతులై ఉన్నారు."

"ఓ! అటులనా? పాండవులు సుఖులై ఉన్నందులకు చాలా సంతోషము. వారు పాండురాజు కొడుకులే గాని నా వద్దనే కదా పెరిగినది. అందువలన నాకు నా కుమారుల కన్నా పాండవులనిననే ఎక్కువ ప్రీతి. సబాంధవముగా ద్రుపదునితో స్నేహము పెంపు చేసుకొనుట మనకు క్షేమదాయకము" అని మనోభావము దాచి ఆదర సంభాషణతో ధృతరాష్ట్రుడు విదురుని సంతోషపరచెను.

దుర్యోధనుడు, కర్ణుడు ఏకాంత ప్రదేశమున ధృతరాష్ట్రునితో "మీరు ఇట్లు పగతురను పొగడి, స్వసంతానమును నిందించుట భావ్యము కాదు. పాండవులు మా పుత్రపౌత్రులకు కీడు చేయలేని ఉపాయము ఆలోచింపుడు" అని పలికిరి.

## 201. పాండవులను నాశనము చేయ దురాలోచన

"సుయోధనా! కర్ణా! మీరిరువురు ఇంకను చిన్నవారు. మనము యెన్నడు విదురుని వద్ద పాండవులను దూషించుట మంచిది కాదు. ఆతడు పాండవ పక్షపాతి. అందువలననే ఆతని ముందు పాండవులను పొగుడుదునే కాని విశదముగా తెలుపుడు" అని ధృతరాష్ట్రుడు పలుకగా –

తండ్రి వలన ప్రేరితుడైన దుర్యోధనుడు, కుంతీమాద్రుల పుత్రులతో విభేదము పుట్టించియో, సుందరులైన స్త్రీలను పంపి పాండవులను లోబరుచుకొని ద్రౌపదీ విముఖులను చేసియో, భీముని హతమార్చి అర్జునాదులను బలహీనులను చేసియో పాండవులను నాశనము చేయుట మంచిదని తెలిపెను.

## 202. కర్ణుని అభిమతము

అంత కర్ణుడు "మహారాజా! పాండవులలో వైరము పుట్టించుట లేక ప్రలోభపరచుట కాని పనులు. ఏకపత్నీవ్రతులై ఉండు పాండవులు కాని, మహావీరులైన ఐదుగురు భర్తలను పొందిన పాంచాలి కాని విరుద్ధులు కారు. కావున పాండవుల శక్తి ఇంకనూ అభివృద్ధి పొందకుండా చతురంగ బలముతో వారి నెదుర్కొని మన సర్వశక్తులు ఉపయోగించియైన వారిని పరాభూతులను చేయుటయే మేలని నాకు తోచుచున్నది" అని పలికిన

"రాధేయా! నీ వాక్యములు పురుషోచితములు. మీరిరువురు భీష్మ, ద్రోణ, విదురులతో కూడా ఆలోచించి ఒక నిశ్చయమునకు రండు" అని ధృతరాష్ట్రుడు వారిని పిలిపించెను.

## 203. భీష్ముని ఉద్దేశ్యము

ధర్మపరతంత్రుడు, రాజనీతిజ్ఞుడుయైన భీష్ముడు "ధృతరాష్ట్రా! నాకు నీ కుమారులు, పాండురాజు కుమారులు ఇద్దరూ సమానులు. పాండవులతో యుద్ధము చేయుట నాకు ఎంత మాత్రము ఇష్టములేదు. వారికి అర్థరాజ్యమిచ్చి సంధి చేసుకొనుట మంచిది. దుర్యోధనా! నీవు ఎట్లు 'ఇది నా పైతృక రాజ్యమను'కొనుచున్నావో పాండవులు కూడా అట్లే తలంచుచున్నారు. ఏ శాస్త్రానుసారము వారికి చెందని రాజ్యము, నీకు చెందును? నీవెట్లు ధర్మతః రాజ్యమును పొందితివో, వారు కూడా పొందెదరు. అందువలన వివాదమునకు స్థానమివ్వరాదు. స్నేహముతో వారికి రాజ్యమిచ్చిన నీవు కీర్తిని పొంది, మమ్ములను కూడా ఆనందపరచెదవు. పాపాత్ముడైన పురోచనుడు వాని గోతిలో వాడే పడెను. ఇంతకాలమై నేను లోకుల ముందు తల ఎత్తుకొని తిరుగలేకపోవుచున్నాను. దీనికంతకు అందరూ నిన్ను దూషించుచున్నారు. కురునందనా! నా మాట విని వారికి అర్థరాజ్యమిచ్చి నీ మంచితనము ప్రకటించుము. పాండవులుండగా దేవేంద్రుడైనను మన రాజ్యముపై దృష్టి నిడ భయపడును. స్వసుఖము కోరిన వాడవైన నా మాట వినుము" అని పలికెను.

## 204. ద్రోణాచార్యుని ఆలోచన

“మహారాజా! భీష్ముని మతానుసారము నడచుకొనుటయే మేలు. అదియే ధర్మము. అందులకై తగిన వ్యక్తిని పంపి ద్రుపదుని, పాండవులను కలుసుకొని వారికి ద్రౌపదికి వస్త్రాభరణాదుల ఇచ్చి మంచి మాటలతో వారిని తృప్తిపరచి, అనంతరము హస్తినానగరమునకు వారిని తిరిగి రమ్మని కోరి, అంగీకరించిన పిమ్మట దుశ్శాసన, వికర్ణాది రాకుమారులను ససైన్యముగా పంపి వారిని హస్తినానగరమునక తీసుకొని వచ్చి వారి పిత్రార్థము ఇచ్చి తృప్తిపరచుట మంచిది” అని ద్రోణుడు తన ఆలోచన తెలిపెను.

## భీష్మ ద్రోణుల అభిమతమునకు కర్ణుడు ఎదురుపల్కుట

అంత కర్ణుడు ధృతరాష్ట్రునితో “మహారాజా! మీ వలన పోషింపబడుచున్న ఈ భీష్మ, ద్రోణులే మీకు విరుద్ధమైన ఆలోచన తెలుపుచున్నారు. అకృతజ్ఞులైనవారి మాటలను ఎన్నడూ వినరాదు.

పూర్వము మగధరాజ్యమును రాజగృహమును రాజధానిగా చేసుకొని అంబుబీజుడను రాజు పాలించెడివాడు. శ్వాసరోగగ్రస్తుడై అతడు మంత్రులపై ఆధారపడి రాజ్యము చేయుచుండెను.

మహాకర్ణియను మంత్రి గర్వాంధుడై ఎవరినీ లెక్కపెట్టెడివాడు కాదు. సామంతరాజులను తృణీకరించుచూ రాజభోగముల తులతూగుచూ, దానితో తృప్తిపడక రాజ్యమునే హస్తగతము చేసికొన ప్రయత్నించెను. కాని తుదకు అంబుబీజుని మంచి మంత్రులందరూ కలసి మహాకర్ణిని పారద్రోలిరి. కావున రాజా! నీవు సచేతనుడవై మంత్రుల సాధుత్వ అసాధుత్వములను పరికించి చూడుము” అని పలికెను.

అంత ద్రోణాచార్యులు రోషముతో “ఓరీ దుష్టుడా! నీ కులమునకు ఉచితమైన మాటలనే అంటివి. నీ మనస్సుకు తోచిన విధముగానే ఆచరింపుము. కాని మా మాటలు వినకపోయిన కురువంశము నాశనము చెందును. ఇందుకు సందేహము లేదు” అని పలికెను.

## 205. విదురుని హితోపదేశము

అంత విదురుడు ముందుకు వచ్చి కర్ణుని ఆపి, ధృతరాష్ట్రునితో “మహారాజా! మీ బంధువులమైన మేము ఎల్లవేళలయందు మీ అభివృద్ధి కోరుచుందుము.

వయస్సులోను, విద్యలోను, బుద్ధిలోను ఈ భీష్మ ద్రోణులను మించినవారు ఎవరు ఉన్నారు? వీరా నీకు చెడ్డ ఆలోచనలు తెలుపునది? వీరు ధర్మపరాయణులు గనుకనే ముందు నీ మనోవాంఛను తెలిసికొన ప్రయత్నింపక సత్యమును తెలిపినారు. వీరు ఎన్నడూ కూటమంత్రాలోచనము చేయువారు కారని ఎరుంగుము. దుర్యోధనాదులు మీకు ఎట్లు కుమారులో, పాండవులు కూడా అట్టివారే. అది తెలియని మూఢమతులే నీకు అహితులు. భీష్మ ద్రోణులు పాండవుల బలవీర్యములను పొగుడుచున్నారని అనుకొనకుము. అర్జునుని మించిన ధనుర్ధరుడు కాని, భీముని మించిన బలశాలి కాని ఈ భూమండలమున లేరు. ద్రుపదుడు వారికి మామయై అండయై ఉన్నాడు. యాదవ వంశస్థులందరూ వీరికి సహాయము చేయుదురు. ముఖ్యముగా వాసుదేవుడు పాండవ పక్షపాతి. ఎచ్చట కృష్ణుడున్నాడో వారికి తప్పక విజయము లభించును. దీనికి సందేహము లేదు. నీకు తెలియనిదేమున్నది? ఏ కార్యమును శాంతితో నెరవేర్చగలమో దానిని వైరముతోను, యుద్ధముతోను చేయబూనుట అవివేకము కాదా? గోటితో చేయు పనికి గొడ్డలి ఉపయోగింతురా? దుర్యోధన, కర్ణ, శకునులు అధార్మికులు. దుర్బుద్ధితో నున్న బాలకులు. పులోచనుని ప్రేరేపించి పాండవులను హతమార్చ దలంచిన మీ దుష్కీర్తిని రూపుమాపి పాండవులను ఆదరించి యశస్కాములు కండు. దుర్యోధనుని దుష్టచేష్టలచే రాజవంశము నశింపకుండ రక్షించుకొనుడు" అని హితబోధ చేసెను.

## 206. పాండవులను హస్తినా నగరమునకు తోడ్కొని వచ్చుటకై విదురుడు బయలుదేరుట

"విదురా! నీవు చెప్పినది సత్యము. భీష్మ ద్రోణులు నా హితాకాంక్షులు. పాండవులు నా పుత్రసమానులు. నాకుమారుల వలెనే వారు కూడా ఈ రాజ్యమునకు అధికారులు. నీవు మధుర వచనములతో పాండవులను, ద్రౌపదిని, కుంతిని హస్తినా నగరమునకు తీసుకొని రమ్ము. మన అదృష్ట వశముననే పురోచనుడు పాండవులకు అపకారము చేయలేకపోయెను. తానే నశించెను. ద్రౌపది తప్పక కురువంశమునకు యశస్సు చేకూర్చును" అని ధృతరాష్ట్రుడు పలికెను.

తదనంతరము విదురుడు ధృతరాష్ట్రుని ఆజ్ఞానుసారము, వివిధ ధనరత్న సంపదలతో పాంచాల దేశమునకు వెడలి ముందు ద్రుపదుని కలుసుకొని ఆదరముగా సంభాషణ సలిపెను. ద్రుపదుడు కూడా ఆతనిని గౌరవించి

సుఖాసీనుని చేసెను. అంత పాండవులు, కృష్ణుడూ అక్కడకు వచ్చి విదురుని కౌగలించుకొని ఆనందభాష్పములతో ఆతనిని కుశలప్రశ్నలు వేసిరి. విదురుడు కుంతిని, ద్రౌపదిని కూడా పిలిపించి అందరికీ తాను తెచ్చిన కాన్కలను ఇచ్చి అందరినీ ఆనందపరచి ద్రుపదునితో "మహారాజా! మీరు మీ కుమారులు, అమాత్యవర్గము దయచేసి నా మాటలు సావధానముగా వినుడు. ధృతరాష్ట్ర మహారాజు మీ అందరి క్షేమము అడగమనినాడు. భీష్ముడు, మీ స్నేహితుడైన ద్రోణుడు కూడా తమ అభినందనలు మీకు తెలియజేయమనినారు. పాండవులు బహుదినములై ప్రవాసులై ఉన్నారు. వారి పెదనాన్నగారు వారిని తిరిగి రమ్మని కోరుచున్నారు. వారు కూడా తమ పితృమందిరమును దర్శింప ఆసక్తి కలిగియుందురు. మీరు వారిని పంపి అంగీకరించిన హస్తినా నగరమునకు ఇప్పుడే వార్త పంపెదను" అని పలికెను.

విదురాగమన పర్వాధ్యాయ సమాప్తి

## 207. రాజ్యలాభ పర్వాధ్యాయము

"సుధీ, విదురా! నీవు నిక్కము పలికితివి. కురువంశము మాతో సంబంధము కలిగినందులకు మేము ధన్యులమైతిమి. పాండవులకు, వారి శ్రేయోభిలాషులైన వాసుదేవ, బలరాములకు అంగీకారమైన నాకు ఎటువంటి అభ్యంతరము లేదు" అని ద్రుపదుడు పలుక కృష్ణుడు పాండవులు హస్తినా నగరమునకు మరలుటయే ఉచితమని తెలుప అందరూ అతని మాటలకు సమ్మతిని ప్రకటించిరి.

## ద్రౌపదితో పాండవులు హస్తినా నగరమునకు వచ్చుట

విదురుడు, కుంతి, ద్రౌపది, పాండవులు, ద్రుపదుని వద్ద సెలవు తీసుకొని హస్తినా నగరమునకు బయలుదేరిరి. ఈ వార్త హస్తినా నగరమున తెలిసినంత దుశ్శాసన, వికర్ణ, కృపాచార్యాదులు వారికి ఎదురేగిరి. కతిపయ దినములకు కరినగరమునకు వారు చేర పౌరులందరూ వారి దర్శనార్థమై బాటకు రెండు వైపులా నిలచి జయజయధ్వానములు చేయుచూ పూలను జల్లిరి. కొందరు "అయ్యో! పాండురాజే బ్రతికియున్న ఎంత ఆనందించెడివాడు" అనగా, మరికొందరు "పాండుపుత్రులు చిరకాలము మన కన్నుల ముందే ఉన్న మనము సుఖింపమా?" అనియు బహువిధముల పాండునందనులను కీర్తించసాగిరి.

క్రమముగా పాండవులు భీష్మ, ద్రోణ, ధృతరాష్ట్రాదులకు ప్రణమిల్లి, తమకై నిర్దేశింపబడిన భవనమున కొంతసేపు విశ్రాంతి తీసుకొనిరి. సేదతీరిన పిదప

పాండవులు ధృతరాష్ట్రుని చేర అతడు ధర్మరాజుతో “వత్సా! కౌంతేయా! మీరు అర్ధరాజ్యము గ్రహించి, ఖాండవ ప్రాంతమున వసించి, రాజ్యము చేసుకొనుడు. ఇక మీకు సుయోధనుని వలన ఎటువంటి వివాదములు కలుగవు. భీమార్జునుల సహాయుడవై సుఖముగా జీవితము గడుపుము” అని ఆదరముగా పలికెను.

## పాండవులు అర్ధరాజ్యము పొందుట

పాండవులు అర్ధరాజ్యము పొంది ధృతరాష్ట్రుని అనుమతితో, కృష్ణుడు తోడు రాగా, అరణ్యమార్గము గుండా ఖాండవము చేరిరి. ఆకాశమునంటు ప్రాకారముల తోను, రమణీయమైన సౌధములతోను, అస్త్రశస్త్రములతో సురక్షితమైన గోపురముల తోను, అందమైన, విశాలమైన బాటలతోను, ఆమ్ర, అమ్రాతక, నీప, అశోక, చంపక, జంబు మొదలైన ఫలపుష్పములతోనున్న తోటలతోను, హంస, బక, చక్రవాక, కారండకాది జలపక్షి నికరమైన సరోవరములతోను, సర్వవేదవేత్తలైన బ్రాహ్మణులతోను, సర్వభాషా విశారదులైన పండితులతోను, కుబేరుని మించిన వణికులతోను, నిపుణులైన కళాకారులతోను ఆ పటము తయారయ్యెను.

ఖాండవ నగరము నిర్మించబడిన అనంతరము పెద్దల అనుమతితో పాండవులు అందు నివసించసాగిరి. ఖాండవ నగరమున పాండవులు స్థిరపడిన పిదప వాసుదేవుడు వారివద్ద సెలవు తీసుకొని ద్వారకకు మరలిపోయెను.

## 208. ఖాండవప్రస్థ నగరమున పాండవుల నివాసము

జనమేజయుడిట్లనెను. “తపోధనా! మహావీరులైన పాండవులు ఖాండవమున యేయే కార్యములనాచరించిరి. పంచభర్తృకయైన ద్రౌపది యే విధముగా భర్తల ఆదరణాదులు పొంది సుఖముగా కాలము గడిపెను. విశదముగా తెలియ జేయుడు.”

## పాండవులవద్దకు దేవర్షి నారదుడు వచ్చుట

వైశంపాయనుడిట్లు చెప్పెను. ఒకనాడు పాండవులు విశ్రమించియుండునెడ దేవముని నారదుడు అచ్చటకు వచ్చెను. పాండవులు ఆతనిని పూజించి సుఖాసీనుని చేసిరి. వారి ఆదరమునకు నారదుడు సంతసించి కూర్చుండ అనుమతిచ్చెను. ధర్మరాజు కబురు పంప ద్రౌపది శుచియై వచ్చి మునికి నమస్కరించిన, ముని ఆశీర్వదించి అంతఃపురమునకు పంపెను.

తదనంతరము నారదుడు పాండవులతో “మీరు పంచభ్రాతలు. యేకొకి

ద్రౌపది మీ ధర్మపత్ని. మీ అన్నదమ్ములలో ఎటువంటి భేదభావము లేకుండా ఉండుటకై తగిన ఉపాయమును ఆలోచింపుడు. పూర్వము సుందోపసుందులను అన్నదమ్ములు ఎంతో స్నేహవాత్సల్యమున నివసించుచూ, ఇతరుల వల్ల మరణము పొందనివారై ఉండియూ, తిలోత్తమయను దేవకాంత వలన ద్వంద్వయుద్ధము చేసి మరణించిరి. కాన మీరు కూడా తగిన జాగ్రత్త వహించుట మంచిది" అని పలుక ధర్మనందనుడు "మహర్షీ! సుందోపసుందులెవరు? ఎట్లు వారు కామాంధులై దేహాంతరప్రాప్తులైరి. దయచేసి తెలుపుడు" అని ప్రార్థించెను.

## 209. సుందోపసుందోపాఖ్యానము

నారదుడిట్లు చెప్పెను. "పాండునందనులారా! పూర్వకాలమన హిరణ్యకశిపుని వంశమున నికుంభుడను తేజస్వియైన రాక్షసుడు జన్మించెను. నికుంభి కుమారులు సుందుడు, ఉపసుందుడు. వారు భీమపరాక్రములు, క్రూరులు. వారు ఏకశరీరధారువలె ఎల్లవేళల కలసి మసలుచుండిరి.

త్రిలోకములను జయించ ఇచ్ఛ కలుగ, వారు జటావల్కలములు ధరించి, వింధ్యపర్వత సమీపమున వాయుమాత్ర భక్షకులై, శరీరమాంసమును అగ్నియందు ఆహుతి చేసి అంగుష్ఠములపై నిలబడి బహుకాలము తపస్సు చేయ వారి తపోప్రభావమున ఆ ప్రాంతము తప్తమవసాగెను.

దేవతలు వారి తపమునకు భయపడి అనేక విధముల విఘ్నము చేయ ప్రయత్నించిరి. కాని సుందోపసుందులు విచలితులు కాలేదు.

తదనంతరము బ్రహ్మ వారికి ప్రత్యక్షమై వరము కోరుకొనుమనిన వారు సర్వమాయాభిజ్ఞులుగను, సర్వశాస్త్రకోవిదులుగను, మహాబలపరాక్రాంతులుగను, కామరూపులుగను, అమరులగను చేయుమని వరమడిగిన, కమలయోని, "మీరు త్రిలోకములను జయించు కాంక్షతో తపస్సు గావించిరి. కాన అమరత్వము తప్ప అన్నియు ఇచ్చితిని" అని పలక వారు "పితామహా! అమరత్వము ఇయ్య అశక్తుడవైన మాకు త్రిలోకములందు, స్థావర, జంగమ పదార్థములనుండి భయము తొలగించి కేవలము పరస్పర సంహారము చేయగలుగునట్లు వరమీయుడు" అని పలికిన బ్రహ్మ "తథాస్తు" అని అంతర్హితుడయ్యెను.

వరమును పొందిన సుందుడు, ఉపసుందుడు జటావల్కాదులు వదిలి, కిరీటము, రత్నాభరణములు, సుందర వస్త్రములు ధరించి బంధు, బాంధవులతో ఆనందించిరి.

## 210. సుందోపసుందులు ఉపద్రవము

దైత్యకులము ఆనందముగా వారిరువురను ఆదరించెను. వారు ముజ్జగములను జయించ సైన్యమును సమకూర్చుకొని, వృద్ధుల ఆశీర్వాదము తీసుకొని గద, పట్టాస, శూలాది వివిధ శస్త్రాస్త్రధారులై చారణులు మంగళ వాక్యములు పలుకుచుండ దిగ్విజయమునకు బయలుదేరిరి.

వారు దేవ, యక్ష, నాగ, మ్లేచ్ఛ జాతుల నన్నిటిని ఓడించి భువనత్రయమును ఆక్రమించి మునులను, బ్రాహ్మణులను, గోవులను బాధించుచుండిరి. ఎవ్వరి ఆయుధములు కాని, మునుల శాపములు గాని బ్రహ్మవర ప్రభావము వలన పనిచేయకుండెను. నిష్కంటకులైన సుందోపసుందులు కురుక్షేత్రమున వసించుచూ రాజ్యము చేయసాగిరి.

## 211. సుందోపసుందుల సంహారమునకై ఆలోచన

నారదుడిట్లనెను. "తదనంతరము దేవర్షిగణము, సిద్ధగణము కమలాసనుని చేరి సుందోపసుందులు చేయుచున్న దుష్కర్మములను పేర్కొని పరిత్రాణమునకు ఉపాయము తెలుపుమనిరి.

## విశ్వకర్మ తిలోత్తమను సృష్టించుట

వారి మాటలు విని బ్రహ్మ విశ్వకర్మను పిలచి అపురూప సౌందర్యవతియైన స్త్రీని చేయుమని ఆజ్ఞాపించ, అతడు అటులనే సర్వలోకములను మోహింపజేయు యువతిని చేసెను. తిలప్రమాణమైన స్థానము కూడా యెడమ లేకుండా రత్నాది అపురూప వస్తువులతో నింపెను కాన ఆమెకు తిలోత్తమ అని పేరు వచ్చెను. బ్రహ్మ ఆమెకు ప్రాణము పోసి సుందోపసుందులను తన అందముతో వశపరచు కొమ్మని పంపెను.

## బ్రహ్మకు నాలుగు శిరస్సులు కలుగుట

బ్రహ్మ ఆనతి తీసుకొని తిలోత్తమ వారికి ప్రదక్షిణము చేయుచుండ ఆమెను చూడ నాల్గు దిక్కుల నాల్గు ముఖములు బ్రహ్మకు కలిగెను. ఇంద్రుడు సహస్రాక్షుడయ్యెన. ఇంతకన్నా ఆమె సౌందర్యమునకు నిదర్శనమేమి కావలెను? తప్పక ఆమె రాక్షసుల నాశనమునకు ఉపయుక్తురాలని అందరూ భావించిరి.

## 212. తిలోత్తమ సుందోపసుందుల వద్దకు వచ్చుట

దేవ, గంధర్వ,యక్ష, నాగ, రాక్షస కులములను జయించి వారి సర్వభాగ్యములను తమ రాజ్యమందు చేర్చి ఎదురులేని సుందోపసుందులు ఉత్తమమైన స్త్రీ, మాల్య, గంధ, భక్ష్యాదులతో కాలము గడుపుచూ ఒక సమయమున వింధ్యపర్వతసాను దేశమున మద్యపానమున వృత్తులైయుండు నెడ తిలోత్తమ సూక్ష్మ రక్తాంబరముతో, మనోహర వేషమున వారిని మెల్లమెల్లగా చేరెను. ఆమెను చూసినంత మాత్రముననే రాక్షసులిద్దరూ కందర్పుని శరముల జర్జరిత దేహులైరి.

## ద్వంద్వయుద్ధమున సందోపసుందులు నిహతులగుట

వారిరువురు ఆమెను సమీపించి చెరియొక చేయిని గ్రహించిరి. వరప్రదాన మత్తులు, ధనమత్తులు, బలోన్మత్తులు, సురాపానమత్తులు అయిన ఆ దానవులు ఒకరినొకరు దూషించుకొనచూ ఆమెను విడువుమని ఒకరినొకరు గద్దించుచూ, తుదకు గదాహస్తులై యుద్ధము చేసి మృతిచెందిరి.

## బ్రహ్మాది దేవతలు ఆమెను చేరి కీర్తించి వరములిచ్చిరి

ఓ పాండవులారా! చిన్నతనమునుండియు ఎంతయో సహృద్భావముతోనున్న వారిరువురు ఒక కామిని కారణమున యమసదనమునకు చేరిన విధమున, ఒకే స్త్రీకి భర్తలైన మీరు ఐదుగురిలోను కలహములు కలుగకుండా నియమమును నిర్ణయించుకొనుట మేలు" అని నారదుడు పలుక, పాండవులు తమలో నొకరు ద్రౌపదిని కూడియుండు సమయమున మరియొకరు చేరరాదనియు, ఆ నియమమును ఉల్లంఘించిన వారు పన్నెండు సంవత్సరములు వనవాసము చేయవలెననియు, ఆ మునిప్రవరుని వద్ద నియమమును చేసికొని సుఖముగా కాలయాపన చేయసాగిరి.

రాజ్యాలాభ పర్వాధ్యాయ సమాప్తి

## 213. అర్జున వనవాస పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. "జనమేజయ మహారాజా! ఇట్లు పాండవులు నారదమహర్షి వద్ద నియమమేర్పరచుకొని, తాము ఆనందము పొందుచూ, ద్రౌపదికి హర్షము చేకూర్చుతూ, శత్రుభీకరులై, ధర్మపరాయణులై కాలము గడుపసాగిరి.

## అర్జునుడు బ్రాహ్మణుని గోధనము రక్షించుట

అటుల కొంతకాలము గడచిన పిమ్మట ఒకనాడు కొందరు దొంగలు ఒక బ్రాహ్మణుని గోవులను అపహరించుకొనిపోయిన, ఆతడు దుఃఖించుచూ రాజ భవనమునకు వచ్చి అర్జునుని చూసి విలపించుచూ తన గోధనము రక్షింపుమని వేడుకొనెను. ఆ సమయమున అస్త్రాగారమున ధర్మరాజు ద్రౌపదితో యుండెను. అస్త్రాగారము ప్రవేశించిన రాజానుమతిని, తమ ప్రతినను తప్పినవాడగును. లేదేని శరణార్థియైన బ్రాహ్మణుని వదలి అధర్మాచరణుడగును. ఇట్లు దోదుల్యమాన అవస్థయందున్న అర్జునుడు, శరీరరక్షణ కన్నా ధర్మరక్షణమే ప్రశస్తమని అస్త్రాగారము ప్రవేశించి ధర్మరాజు అనుమతి తీసుకొని కవచమును, ధనుర్బాణములను గ్రహించి, బ్రాహ్మణుని తాళుమని రథారూఢుడై యేగి, చోరులను సంహరించి, గోవులను మరల్చి బ్రాహ్మణునకు అప్పగించెను. బ్రాహ్మణుడు అర్జునుని పరిపరి విధముల పొగడుచూ గోవులతో తన వాసస్థానమున కేగెను.

## ప్రతిన తప్పిన అర్జునుడు వనవాసమునకేగుట

బ్రాహ్మణునకుపకారముచేసి స్వభవనమునకు వచ్చి అర్జునుడు గురుజనుల వలన అభినందితుండై యుధిష్ఠిరుని చేరి "ప్రభో! మీరు ద్రౌపదిని కూడియుండు సమయమున ప్రవేశించి నేను మన నియమమును తప్పితిని. పూర్వము మనము స్థిరపరచిన నియమ ప్రకారము నేను అరణ్యవాసమునకు వెడలుచున్నాను. అనుజ్ఞ ఇందు" అని అనుమతి కోరిన ధర్మరాజు, "తమ్ముడా! ప్రభువునంటివి కనుక నా మాట వినుము. నీవు బ్రాహ్మణునకు ఉపకారము చేయు తలంపున నా గృహమున ప్రవేశించితివి. అందులకు నా అనుమతి ఎల్ల సమయములనున్నది. తమ్ముడు భార్యతోనున్న అన్న అచటకు జనుట తప్పుగాని, అన్న భార్యతోనున్న సమయమున తమ్ముడు చేరుట తప్పు కాదు. అందువలన అర్జునా! నీవీ కార్యమును వదలుము. దీనివలన ధర్మలోపము కాదు" అని పలికిన, "మహారాజా! మీరు అన్నది నిజమే కాని, ప్రక్కదారులచే ధర్మము రక్షించినవాడనౌట నాకు ఇష్టము లేదు. ఆయుధమును స్పృశించి చెప్పుచున్నాను, సత్యవచనము ఎన్నడూ తప్పజాలను" అని అర్జునుడు పలికి అన్న అనుమతి తీసుకొని పంద్రెండు సంవత్సరములు వనవాసము చేయ బయలుదేరెను.

## 214. అర్జునుడు ఉలూపిని పరిణయమాడుట

మహాబలుడైన అర్జునుడు వనమునకేగుచుండ అతని వెంట వేదాంగవిదులైన బ్రాహ్మణులు, భిక్షోపజీవులు, సన్యాసులు ఏగిరి. అర్జునుడు వారితో అడవులు, నదులు, కొండలు దాటుచూ, పుణ్యతీర్థములను సేవించుచూ, క్రమక్రమముగా గంగాద్వారమును చేరి అచ్చట ఆశ్రమమును నిర్మించుకొని వసింపసాగెను.

ఒకనాడు అర్జునుడు గంగలో స్నానానంతరము పితృతర్పణము చేసి అగ్ని కార్యము చేయ బయలువెడలుచుండ నాగరాజ దుహిత ఉలూపి ఆతనిని చూసి మోహించి తన భవనమునకు తీసుకొనిపోయెను. అచట హుతాసనుని చూసి అర్జునుడు అగ్నికార్యము నెరవేర్చి ఆమెతో "అబలా! నీవెవ్వరు? నీవెందులకిట్టి సాహసకార్యము చేసితివి?" అని ప్రశ్నింప,

"రాజా! నా పేరు ఉలూపి, 'ఐరావత' కులజుడైన కౌరవ్యుడు నా తండ్రి. నీవు గంగలో స్నానమాడుచుండ నేను చూసితిని. నీయందు మనస్సు వశమై యున్నది. నా కోర్కె తీర్చి వివాహమాడుము" అని పలికిన, "సుందరీ! నేను ధర్మరాజు ఆజ్ఞపై పన్నెండు సంవత్సరములు బ్రహ్మచర్యమవలంబించి వనవాసము చేయవలెను. నీ మనోభిలాష తీర్చ నాకు సమ్మతమే. కాని, నేను ఎన్నడూ అనృత మాడినవాడను కాను. నా మాట తప్పకుండా ఏదైనా ఉపాయమాలోచింపుము" అని అర్జునుడు పలుక ఉలూపి, "మహానుబావా! మీ అన్నదమ్ములు పూనిన ప్రతిన నాకు తెలుసును. అది ద్రౌపది నిమిత్తమై చేయబడినది. అదేకాక నీవు అంగీకరింపకపోయిన నేను దేహత్యాగము చేయుదును. నీకు అనృతము అంటదు. నా కోరిక తీర్చి నా ప్రాణములను కాపాడుము" అని వేడికొనిన అర్జునుడు అంగీకరించి ఆ రాత్రి అచట గడిపి మరునాడు ఆమెతో గంగాద్వారమును చేరెను. ఉలూపి ప్రియునివద్ద అనుమతి తీసుకొని సమస్త జలచరములను జయింపుమని పలికి తన గృహమునకు ఆనందముగా వెడలెను.

## 215. చిత్రాంగద, అర్జునుల పాణిగ్రహణము

వైశంపాయనుడిట్లనెను. "రాజా! తదనంతరము హిమాలయముల వశిష్ట పర్వతము, భృగుతుంగము మొదలయినవి సందర్శించి, అచటనుండి ఉత్తరాభి ముఖుడయ్యెను. తదుపరి నంద, అపరనంద, కౌశుకి, గంగా మహానదులను దాటుచూ వివిధ పుణ్యతీర్థములను చూచుచూ అంగ, వంగ, కళింగ దేశములు దాటి సాగరతీరమున మణిపుర రాజ్యమును చేరెను.

మణిపుర రాజకన్య పురమున విహరించుచుండ అర్జునుడు చూసి వివాహ మాడదలచి రాజును చేరి “రాజా! నేను క్షత్రియుడను. నీ కుమార్తెను వివాహమాడ ఇచ్ఛ కలిగినది. ఆమెను నాకు సంప్రదానము చేయుము” అని కోరగా అతడు అర్జునుని కులశీలములు తెలుసుకొని “అర్జునా! మా వంశమున ఒకే కుమారుడు జన్మించుచుండును. నాకు ఈ కుమార్తె చిత్రాంగద జన్మించినది. నేను ఈమెను పుత్రుని వలెనే పెంచితిని. ఈమెకు కలిగిన సంతానము నా వంశస్థుడై రాజ్య సింహాసనము అధిరోహించును. నీకు ఈ విషయమై అభ్యంతరము లేకపోయిన నా కుమార్తెతో వివాహము చేయగలను” అని పలుక అర్జునుడు అంగీకరించెను.

అర్జునుడు చిత్రాంగదను వివాహమాడి అచట మూడు సంవత్సరము లుండెను. ఆమె గర్భవతి అయిన పిదప వారివద్ద సెలవు తీసుకొని ముందుకు బయలుదేరెను.

## 216. మొసలి రూపమున ఉన్న వర్గ మొదలైన అప్సరసల కథ

దక్షిణ దేశమున యాత్రలు చేయుచూ అగస్త్య, సౌభద్ర, పౌలోమ, కారంధమ, భరద్వాజ యను పంచతీర్థములను గని అవి జనశూన్యమై, తపోనిరతులు లేకుండుట చూచి కొందరు మునులను ప్రశ్నింప అచట గల మొసళ్ల వలని బాధపడలేక వదిలిరని వారు తెలిపిరి. వాటి బాధను తప్పింప అర్జునుడు సౌభద్ర తీర్థమున స్నానమాడబోవ ఒక మొసలి ఆతని కాలు పట్టుకొనెను. అర్జునుడు బలపూర్వకముగా దానిని నీటినుండి ఎత్తిన సౌందర్యవతియైన అప్సరాంగన అయ్యెను.

అర్జునుడు ప్రశ్నింప ఆమె “నా పేరు వర్గ. మేము దేవరాజు ఇంద్రుని సన్నిధినుండి ఒకనాడు బయలువెడలి విహారము చేయుచూ ఒక సుందరుడైన బ్రాహ్మణ కుమారుని చూసి మోహించి మా క్రీడా వినోదముల ఆతని తపస్సు భంగము చేయ ప్రయత్నించి విఫలులమైతిమి. కోపగించిన తాపసి నన్ను, నా సఖులైన సౌరభి, సమీచి, వధూత, లతలను మొసళ్లు కండని శపించెను. మేము దీనముగా ఆతనిని రక్షింపుమని వేడ మిమ్ములను నీటినుండి బయటకు తీయు వానివలన మీరు శాపముక్తులగుదురని పలికెను. మా సంగతి తెలిసికొనిన నారదముని ఈ పంచతీర్థముల ఉండుమని, అర్జునుడు శాపవిమోచనము చేయునని తెలుప అటులుంటిమి” అని పలుక అర్జునుడు మిగిలిన నల్గురు అప్సరలను పూర్వరూపులను చేసి ఆ తీర్థములలో ఎట్టి ఈతిబాధలు లేకుండా

చేసి తిరుగు ప్రయాణమున చిత్రాంగదను కలుసుకొని బభ్రువాహనుడను కుమారుని చూసి ముద్దులాడి, గోకర్ణతీర్థాభిముఖుడయ్యెను.

## 218. ప్రభాస తీర్థమున కృష్ణార్జునులు కలుసుకొనుట

పశ్చిమ సముద్రము యొక్క ఉపకుల ప్రదేశముల చరించుచూ, అనేక తీర్థములను దర్శించుచూ అర్జునుడు, ప్రభాసతీర్థమును చేరెను. ఈ సమాచారము తెలుసుకొని కృష్ణుడు అచటకు జని అర్జునుని కలసుకొనెను. ఇరువురు ఆలింగనమున ఆబద్ధులై కుశలప్రశ్నానంతరము వారు అచటనుండి బయలుదేరి రైవతకపర్వతము చేరిరి. అచట కృష్ణుని పనుపున చేకూర్చబడిన సుఖాద్యములను భక్షించి, నృత్యగీతాదులను ప్రవలోకించి రాత్రియైన పిమ్మట అర్జునుడు దుగ్ధఫేన ధవళ శయ్యనలంకరించి కృష్ణునితో తాను దర్శించిన వివిధ స్థలములను అందలి విశేషములను తెలుపుచూ నిద్రితుడయ్యెను.

## అర్జునుడు ద్వారకకు వచ్చుట

ఉదయమే సుమధుర వీణాది వాద్య సంగీతము వినుచూ మేల్కొని సంధ్యావందనాదులు ఆచరించి వాసుదేవుని నిర్దేశమున కాంచ నిర్మిత రథారూఢుడై ద్వారకానగరము ప్రవేశింప పౌరులందరూ ఆతని చూడవచ్చిరి. అంధక, భోజ, వృష్ణి వంశీయులు అతనిని ఆదరముగా ఆహ్వానించిరి. అర్జునుడు పెద్దలకు నమస్కరించి సమవయస్కుల కౌగలించుకొని వారి అతిథి మర్యాదలను స్వీకరించి తదనంతరము కృష్ణుని సుందర భవనమున కొద్ది దినములు సుఖముగా గడపెను.

అర్జున వనవాస పర్వాధ్యాయ సమాప్తి

## 219. సుభద్రాహరణ పర్వాధ్యాయము - రైవతక ఉత్సవము

కొద్ది దినములలో రైవతక పర్వత సమీపమున పెద్ద ఉత్సవము జరిగెను. ఆ ఉత్సవమున యదువంశస్థులందరూ పాల్గొనిరి. ఆ స్థలమును వివిధ అలంకారములతో నలంకరించిరి. చిత్రవిచిత్రములైన వాద్యములతోను, నృత్య గీతములతోను, ఆ స్థలము శోభిల్లుచుండెను. మదిరాపానులై బలరాముడు తన భార్యతో ఆ స్థలమును పరిదర్శించసాగెను. అటులనే సస్త్రీకులై అక్రూర, సాత్యకి మొదలైన యాదవులు మదిర త్రావుచూ నృత్యము చేయుచూ యథేచ్ఛగా విహరించసాగిరి.

అర్జునుడు వాసుదేవునితో వింతలను చూచుచూ సఖీజనముతోను, వివిధ అలంకారములతోను, విచిత్రమైన పరిధానముతోను అపురూప సౌందర్యముతోనూ విహరించుచున్న సుభద్రను చూసి మోహితుడై రెప్ప వాల్చక యుండుటను చూచి, కృష్ణుడు నవ్వుచూ "అర్జునా! వనవాసము చేయ బయలువెడలి కందర్పుని పాలబడితివా? నీ మనస్సును హరించిన కన్య ఎవ్వరో కాదు సుమీ! నా చెల్లెలు సుభద్ర. సఖా! క్షత్రియులకు స్వయంవరమే విధేయము. అందువలన ఆమెను హరించి మనోవాంఛ తీర్చుకొనుము"అని పలుక అర్జునుడు తన భావమును గ్రహించి సదుపదేశమును తెలిపిన కృష్ణునకు కృతజ్ఞత తెలిపి ధర్మరాజునకు కబురు పంప అతడు తన ఆమోదమును తెలిపెను.

## 220. సుభద్రా హరణము

ధర్మరాజు అనుమతి పొందిన అర్జునుడు కృష్ణ సహాయుడై కవచము, శిరస్త్రాణము ధరించి అస్త్రశస్త్రములతోను, సువర్ణ ఘంటికలతో అలరారు రథమునెక్కి బయలుదేరెను.

రైవతకమున దేవతలను పూజించి, ద్విజోత్తముల ఆశీర్వాదములు పొంది సఖులతో సుభద్ర ద్వారకకు తిరిగి వచ్చుచుండ అర్జునుడు మార్గమధ్యమున ఆమె వేలు గ్రహించి రథారూఢను చేసి రాజధానియైన ఇంద్రప్రస్థమునకు బయలుదేరెను.

ఈ వార్తను తెలుసుకొని రణదుందుభి మ్రోయ యాదవులందరూ కూడి శస్త్రాస్త్రములు గ్రహించి, కవచాదులు ధరించి రథములను సిద్ధము చేసిరి.

సుధర్మమనెడి వారు తీర్చిన సభలో మధుపానమత్తుడు, నీలాంబరధరుడు, మహావీరుడుయైన బలరాముడు ఉత్తేజితులైన యాదవులతో "వీరులారా! మీరేల త్వరపడుచున్నారు? చూచితిరా! మౌనమవలంబించి వాసుదేవుడు మిన్నకున్నాడు. ఆతని అభిమతము తెలుసుకొనకుండ మీరొక అడుగైనా వేయుట తగునా?

కృష్ణా! నీవు ఎందులకు మిన్నకున్నావు? అందరూ నీ ఆజ్ఞకై వేచియున్నారు. నిన్ను చూసి మేము ఆతనిని ఆదరించి, గౌరవించితిమి. ఆతడు మన సత్కారమునకు తగినవాడు కాడు. అపాత్రునకు భోజనమిడిన ఆతడు పాత్రనే భిన్నము చేయును. అర్జునుడు చేసిన అవమానమునకు ఆతనికి తగిన శిక్ష వేయవలెను. మన కన్యను అపహరించి అతడు మృత్యువునే కౌగలించుకొన సిద్ధమైనాడు. గోవిందా! మన మస్తకమున పదాఘాతము చేసిన ఆ అధముని

నాశనము చేయకపోయిన నాకు సుఖనిద్ర కలుగదు. నేనా పాండవుల వంశము నిర్వంశము చేసెదను. అర్జునుని ఈ ధూర్తత్వము సహించి యుండుట మన వంశమునకే అవమానము" అని బలరాముడు గర్జించుచూ పలుకగా ఇతరులు ఆతని మాటలను సమర్థించిరి.

సుభద్రాహరణ పర్వాధ్యాయ సమాప్తి

## 221. హరణాహరణ పర్వాధ్యాయము

### పార్థుడు సుభద్రను వివాహమాడుట

అంత కృష్ణుడు వారిని శాంతపరచుచూ "అర్జునుడు మననూ, మన కులమును అవమానపరచలేదు. ధనసంపత్తియందు కాంక్షలేనివాడు కనుకనే క్షత్రియోచితముగా కన్యను గ్రహించెను. ఆతడు సామాన్యుడని మీరు తలపకుడు. అతడు కుంతిభోజుని మనుమడు. కుల, శీల, విద్యాసంపన్నుడు. మహాదేవుడు తప్ప ఆతని ఎదిరించగల జోడు లేడు. ఆతనితో యుద్ధము చేసిన, మనము ఓడిపోక తప్పదు. దానివలన మనకే అవమానము చేకూరును. కాన ఆతనిని ఆదరించుటయే మేలు" అని పలుక యాదవులు శాంతించి అర్జునుని ఆదరముగా రప్పించి సుభద్రతో వివాహము గావించిరి. అర్జునుడు సంవత్సర కాలము ద్వారకానగరమున వసించి తదుపరి భార్యాసహితుడై పుష్కరతీర్థమున మిగిలిన వనవాసకాలము గడిపి ఖాండవ ప్రాంతమునకు తిరిగి బయలుదేరెను.

### సుభద్రతో అర్జునుడు ఖాండవప్రస్థ నగరము చేరుట

అర్జునుడు ఖాండవప్రస్థ నగరము ప్రవేశించి గురుజనుల యొక్కయు, బ్రాహ్మణుల యొక్కయు ఆశీర్వాదములు పొంది ద్రౌపదిని చేర ఆమె నారీసులభమైన అసూయచే ప్రణయకోపముతో "ఆర్యా! ఇదేమి ఇంత త్వరగా మరలితిరి. ఇంకెందేనా సుందరాంగనలున్నారేమో! వారిని వదలుట తగునా? నూతన బంధములు యేర్పడిన పూర్వబంధములు శిథిలములగుట న్యాయమే కదా!" అని నర్మగర్భముగా పలుక అర్జునుడు పదే పదే క్షమాభిక్ష వేడెను.

ఆమె కోపము చల్లార్చుటకై అర్జునుడు సుభద్రను గోపబాలికా వేషమున అంతఃపురమునకు పంప ఆమె కుంతిని చేరి పాదసేవ యొనర్చి పిదప ద్రౌపదిని సమీపించి "నేటినుండి నేను మీ దాసిని. ఆజ్ఞాపింపుడు" అని పలికెను.

## సుభద్రా, ద్రౌపదుల కలయిక

పతిపై కినుక వహించియున్న ద్రౌపది, దీనయై తనను చేరిన సుభద్రను చూసి స్త్రీ సహజమైన కరుణా వాత్సల్యములతో ఆమెను కౌగలించుకొని "నీవు నిసఃపత్నవు కమ్ము" అని పలికెను. వారి కలయికకు కుంతి, పాండవులు సంతసించిరి. సుభద్రార్జునులు ఇంద్రప్రస్థమునకు వచ్చిరని తెలుసుకొని యాదవులు అనేకమైన వస్తువాహనములు కానుకలివ్వ తీసుకొని బయలుదేరిరి.

## యాదవులు ఖాండవప్రస్థమునకు వచ్చుట

కృష్ణ, బలరామాది యాదవ ప్రముఖులు వచ్చుచున్నారన్న వార్త తెలియగానే ధర్మరాజు నగరమును అలంకరించి నకుల సహదేవులను పంప వారు అత్యాదరమున యాదవులను నగరప్రవేశము చేయించిరి. వారును బ్రాహ్మణాశీర్వాదములతో భవనము ప్రవేశించిరి. ధర్మరాజు బలరాముని యధోచితముగా సత్కరించి, కృష్ణుని కౌగలించుకొని మస్తకాఘ్రాణము చేసెను. కృష్ణుడు, అర్జునునకు బహు రత్నాభరణములను, సువర్ణ రథములను, గోవులను, గుఱ్ఱములను కన్యాధనముగా ఇచ్చెను.

కొంతకాలము అచ్చట ఆనందముగా గడపిన పిదప బలరాముడు యాదవులతో పాండవుల వలన వివిధ బహుమతులను గ్రహించి ద్వారకా నగరాభిముఖుండయ్యెను.

కృష్ణుడు, అర్జునుడు వేటాడుచూ, యమునా నదిలో క్రీడించుచూ చరించుచుండిరి.

## అభిమన్యుని జననము

యథాకాలమున సుభద్ర గర్భతియై సర్వసులక్షణ సంపన్నుడైన కుమారుని గాంచెను. అతడు అభి, మన్యమానుడు అనగా భయము లేనివాడు, కోపస్వభావము గలవాడగుటచే అభిమన్యుడని పేరుగాంచెను. లోకులాతనిని ఆర్జుని అని కూడా సంబోధించెడివారు. కృష్ణునకు అతడన్న మిక్కుటమగు అభిమానము. అతడే జాతకర్మాదులు కావించెను. ధర్మరాజు ఆనందమున భూరి దానములు చేసెను. అభిమన్యుడు శుక్లపక్ష చంద్రునివలె దినదినాభివృద్ధి గాంచెను. అర్జునుడే ఆతనికి ధనుర్వేదము నేర్పి తనతో సమానుని గావించెను.

## ద్రౌపదికి ఐదుగురు కుమారులు కలుగుట

ద్రౌపది ఐదుగురు భర్తల వలన ఐదుగురు కుమారులను గాంచెను. ధర్మరాజు వలన ప్రతినింద్యుడు, భీమునివలన సుతసోముడు, అర్జునుని వలన శ్రుతకర్ముడు, నకులుని వలన శతానకుడు, సహదేవుని వలన శ్రుతసేనుడు జన్మించిరి. వారి జాతకర్మ, చూడ, ఉపనయనాదులు ధౌమ్యపురోహితుడు యథావిధిగా గావించెను. వారును వివిధ శాస్త్రములు అభ్యసించి అర్జునుని వద్దనే అస్త్ర, ధనుర్వేదములను అభ్యసించిరి. ఇట్లు పాండవులు దేవకుమారతుల్యులైన కుమారులతో శోభిల్లుచూ ఖాండవప్రస్థమున పరమసుఖమున కాలము గడుపసాగిరి.

హరిణాహరణ పర్వాధ్యాయ సమాప్తి

## 222. ఖాండవదహన పర్వాధ్యాయము

నల్గురు తమ్ములు తోడు కాగా, ధౌమ్య పురోహితునితో పాండురాజు తన తేజఃప్రభావమున అనుచిత కార్యములు చేయక, అప్రియవచనములు పలుకక, మృదుభాషియై, శత్రుభీకరుడై ప్రజల మనస్సు రంజింపచేయుచూ రాజ్యము చేయసాగెను.

## బంధువులతో కృష్ణార్జునులు జలవిహారము చేయుట

ఒకనాడు కృష్ణార్జునులు ధర్మరాజు అనుజ్ఞ బడసి, బంధుమిత్ర పరివారము లతో యమునానదీ కూలమున నృత్యగీతాదులతో ఆనందముగా విహరించుచూ ఒక సుందర ప్రదేశమున ఆసీనులైయుండ, వారి కడకు తరుణారుణ ప్రకాశుడు, పింగళకేశుడు, జటాధారి, దీర్ఘకాయుడు అయిన బ్రాహ్మణుడు చనుదెంచెను.

## 223. ఖాండవవనము దహనము చేయ అగ్ని అర్జునుని చేరుట

కృష్ణార్జునులు ఆసనము దిగి బ్రాహ్మణునికి నమస్కరించి ఆసీనుని చేసి రాకకు కారణమడుగ, ఆతడు “నేను బ్రాహ్మణుడను, అతి భోజనప్రియుడను. నా కోరిక తీర్చుడు” అన వారు “మీకెటువంటి భోజనము కావలెనో తెల్పుడు. తప్పక మీ కోర్కె తీర్చెదము” అని పలికిరి.

“మహానుభావులారా! నేను అగ్నిని. నాకు తగిన అన్నము ప్రసాదించుడు. నేను భక్షింపదలచిన ఖాండవవనమును ఇంద్రుడు వర్షధారలతో ఆపుచున్నాడు.

మీరు అస్త్రములు ధరించి ఉదకములను, ఆ వనములోని ప్రాణిగణములను నష్ట పరచుడు. అటులయిన నేను ఖాండవవనమును భక్షింపగలను" అని అగ్ని పలికెను.

"వైశంపాయనా! ఎందులకు అగ్ని ఖాండవవనమును భక్షింపదలంచెను? ఇంద్రుడేల ఆపుచుండెను? దయచేసి వివరముగా తెలుపుడు" అని జనమేజయుడు కోరెను.

## ఖాండవవన ఇతిహాసము - శ్వేతకి వృత్తాంతము

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! ఈ పౌరాణికగాథ శ్రద్ధగా వినుము. పూర్వము శ్వేతకి అను మహారాజు యాజ్ఞికక్రియల అనురక్తుడై ఋత్విక్కులను పిలచి అనేక యజ్ఞములు చేసెను. అనవరతము యజ్ఞధూమము వలన రక్తలోచనులై వారు రాజును చేరి తమకు సెలవీయమని కోరిరి.

రాజు మరికొందరు ఋత్విక్కులను పిలచి యజ్ఞములు చేయ మొదలిడెను.

## శ్వేతకి దీర్ఘకాల యజ్ఞము

రాజు మరల ఒక దీర్ఘకాల యజ్ఞము చేయ ఋత్విక్కులను చేరి ఈ శుభకార్యము చేయ రండని పిలువ వారు నిరాకరించిరి. రాజు ఇవ్వబోవు దాన ధర్మములను కూడా వారు ఆశింపక ఆతనితో "మేము నీ యజ్ఞములను చేసి చేసి క్లాంతులమైతిమి. నీ బుద్ధి చలించినట్లున్నది. అందులకే నీవు మరల యజ్ఞము తలపెట్టితివి. నీ కోర్కెను తీర్చగలవాడు రుద్రుడే. నీవాతని శరణు వేడుము" అని పలికిరి. మహర్షుల వలన తిరస్కృతుడైన రాజు క్రోధముతో కైలాసపర్వతము చేరి కఠినమైన తపస్సు చేయ శంకరుడు సంతుష్టుడై, దర్శనమిచ్చి వరము కోరుకొనమనగా, ఆ రాజు "నా యజ్ఞకార్యము నెరవేరునట్లు వరమీయుడు" అని కోర భగవానుడు "పన్నెండు సంవత్సరములు బ్రహ్మచర్య మవలంబించియున్న నీ కోర్కె తీర్తును" అని ఆశీర్వదింప శ్వేతకి అట్లే దీక్షతో కాలము గడిపి మరల శివుని ప్రార్థింప అతడు దుర్వాసుని రాజు యజ్ఞము చేయ నియోగించెను.

దుర్వాసుడు ఋత్విక్కులు సాయపడ దీర్ఘకాలము నేతిధార ఆగకుండా అగ్నిని వ్రేల్చి యజ్ఞానుష్ఠానము పూర్తి గావించెను. రాజు హృష్టచిత్తుడయ్యెను.

## బహుఘృత భక్షణమున అగ్ని అగ్నిమాంద్యము

ఎక్కువగా నెయ్యి తినుట వలన మాంద్యమున అగ్ని గ్లానితో తేజోహీనుడై బ్రహ్మను చేరి తన పూర్వతేజస్సు పొంద దారి చూపుమని వేడుకొనగ చతుర్ముఖుడు "ఖాండవ వనమందలి నానావిధ జంతుజాల మేధోమాంసములు భక్షించిన నీకు మరల ఆకలి కలిగి తేజస్సు తిరిగి పొందెదవు" అని తెలుప అగ్ని ఖాండవ వనమును యేడుసార్లు భక్షింప ప్రయత్నము చేసెను. కాని అందలి ప్రాణులు ఎన్నెన్నో మార్గముల అగ్నిని ఆర్పితమను తాము రక్షించుకొనుచుండెను.

## 224. అస్త్రములకై అర్జునుడు అగ్నిని ప్రార్థించుట

విఫలమనోరథుడైన అగ్ని బ్రహ్మతో మొరపెట్టుకొనగా అతడు "అనలా! దేవతలకు మేలు కలుగ నర, నారాయణులు మర్త్యలోకమున కృష్ణార్జునులై జన్మించిరి. నీవు వారిని అర్థించుము. తప్పక నీ కోర్కె తీరును" అని పలుక ఆతడటుల వారిని బ్రాహ్మణవేషధారియై తన కోరిక తెలిపెను.

ఆతనికి సహాయము చేయ ఇచ్ఛ కలిగిన అర్జునుడు "ఆర్యా! నా వద్ద అనేక దివ్యాస్త్రములు కలవు. కాని నా భుజవేగమునకోర్చు ధనస్సుగాని, శస్త్రాస్త్రములను మోయగల రథముగాని లేవు. అటులనే కృష్ణుని బాహుబలమునకు తగు అస్త్రము లేదు. కావున నీవు తగిన ఉపకరణములు సమకూర్చిన తప్పక సహాయ్యులము కాగలము" అని పలికెను.

## 225. అర్జునుడు గాండీవము పొందుట

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! అర్జునుని మాటలు విని, అగ్ని మిత్రుడైన వరుణదేవుని స్మరించి పూర్వము విశ్వకర్మచే నిర్మితమైనది, సోమ మహారాజు దానవులతో దానిపై యుద్ధము చేసినదియైన రథమును అర్జునునకు ఇచ్చెను. అది కపిధ్వజము కలది. దాని భీకర నాదము శత్రువుల గుండెలను అదురచేయును. మరియు విచిత్రవర్ణ పరమాద్భుతమైన గాండీవమను చాపమును, అక్షయ తూణీరద్వయము అగ్ని అర్జునునకిచ్చెను.

అర్జునుడు కవచము, ఖడ్గము, గోధాంగులిత్రము ధరించి, రథమునకు ప్రదక్షిణము చేసి, దేవతలకు నమస్కరించి దానిని అధిరోహించి గాండీవము నెక్కు పెట్టి నారిని లాగి ధ్వని చేయ అది భువన విదాకరమయ్యెను.

రథము, ధనస్సు, అక్షయ తూణీరములు పొంది అర్జునుడు సంతుష్టుడయ్యెను.

## కృష్ణుడు, గదాచక్రములను గ్రహించుట

అగ్ని కృష్ణునకు భువన భయంకరమైన సుదర్శనమను చక్రమును, కౌమోదకి అను గదను ఇచ్చెను.

అర్జునుడు, కృష్ణుడు రథారూఢులై అగ్నితో "నీవిక నిర్భయముగా ఖాండవ వనము దగ్ధము చేయుము. పన్నగములను రక్షింపతలచిన ఇంద్రుడే కాదు, సమస్త సురాసురులు కూడా మా ముందు నిలువజాలరు" అని పలుక అగ్ని తన ఏడుశిఖలతో నాల్గువైపుల నుంచి ఖాండవవనము దహనము చేయసాగెను.

## 226. ఖాండవారణ్యమందలి ప్రాణుల సంక్షోభము

అగ్ని వనమును దగ్ధము చేయ దొడగిన ప్రాణులు వేడికి తట్టుకొనలేక నాల్గువైపుల పారిపోసాగెను. అలా చక్రమువలె భ్రమించు రథ చక్రములతో కృష్ణార్జునులు చరించుచు వాటిని పారిపోకుండా వధించసాగిరి. పక్షులు కూడా వారి బారినుండి తప్పించుకొనలేక విగతజీవులు కాదొడంగెను. వాటి రోదనములతో దిక్కులు పిక్కటిల్లసాగెను.

## అగ్నిని ఆప ఇంద్రుడు ప్రయత్నించుట

దేవతలు అగ్ని చర్యను ఇంద్రునకు విన్నవింప అతడు వర్షమేఘములను పంపెను. వర్షము కురిసినను అవి అగ్ని వేడికి అంతరిక్షముననే శుష్కించిపోయెను. క్రోధముతో పురందరుడు భయంకరమైన చీకటి కమ్మిన నల్లని మేఘములను పంప ముషలధారగా వర్షము కురియసాగెను.

## 227. ఇంద్రుని రాళ్లవాన

అర్జునుడు ఆ వర్షధారలను తన శరపరంపరలచే వనమునంతయు ఆచ్ఛాదనము చేసి ఆపెను. ఆతని శరములచే ఒక జీవి కూడా తప్పించుకొనలేక పోవుచుండెను.

ఆ సమయమున పురందర మిత్రుడు నాగరాజు తక్షకుడు కురుక్షేత్రమునకు వెడలియుండెను. ఆతని కుమారుడు అశ్వసేనుని తప్పించుకొనలేకపోవుచుండ కుమారునకై తల్లి అడ్డుపడ అర్జునుడామె మస్తకచ్ఛేదము చేసెను. అశ్వసేనుని రక్షింప ఇంద్రుడు అర్జునునిపై రాళ్లవాన కురిపించి అచేతనుని చేయ, సమయము చూసుకొని అశ్వసేనుడు ప్రాణములతో తప్పించుకొని పారిపోయెను. తెలివి వచ్చిన

అర్జునుడు క్రోధాన్వితుండై ప్రాణులను ఖండములు చేయసాగెను. అర్జునుడు వాయువ్యాస్త్రము మొదలైన దివ్య అస్త్రములతో పెను మేఘములను పారద్రోలెను. యక్ష, రాక్షస, పన్నగ, గంధర్వులా అగ్నియందు మ్రగ్గసాగిరి.

## దేవతలు అర్జునునితో యుద్ధము చేయుట

ఇంద్రుడు, కృష్ణార్జునులతో యుద్ధము సేయదొడగిన ఆతనికి సహాయ పడుటకై కృతాంతుడు కాలదండముతోను, ధనపతి గదతోను, వరుణుడు పాశముతోను, స్కందుడు శక్తితోను, విధాత ధనస్సుతోను, విశ్వకర్ముడు పర్వతముతోను, యముడు పరశువుతోను, సూర్యుడు పరిఘాస్త్రముతోను, మిత్రుడు చక్రముతోను, అనేక అస్త్రములతో ఇతర దేవతలు తలపడిరి.

## 228.

కృష్ణుడు, అర్జునుడు చలింపక వారితో యుద్ధము చేయదొడగిరి. వారిరువురి తేజమును సహింపలేక ఇంద్రాది దేవతలదరూ పరాజితులై యున్న సమయమున ఆకాశవాణి "ఇంద్రా! నీ మిత్రుడు తక్షకునకు హాని జరుగలేదు. కృష్ణుని, అర్జునుని నీవు ఎన్నటికీ పరాజితులను చేయలేవు. వీరే నరనారాయణులు. వారి పరాక్రమము నీకు తెలియనిది కాదు కాన మరలిపొమ్ము" అని పలుక ఇంద్రాది దేవతలు వెనుకకు మరలిరి.

## అర్జునుడు మయదానవుని రక్షించుట

ప్రాణములను కాపాడుకొనుటకై మయదానవుడు, తక్షకుని గృహమునుండి పారిపోవుచుండ అగ్ని కోరికపై, కృష్ణుడు వానిని వధింప సంసిద్ధుడయ్యెను.

ప్రాణభీతితో మయుడు "రక్షింపుము, రక్షింపుము' అని అర్జునుని చేర అతడు శరణాగతునకు అభయమిచ్చెను. అర్జునుడు అభయమిచ్చుటచే కృష్ణుడు, అగ్ని తమ కృత్యమును విరమించుకొనిరి.

## 229. మందపాల మహర్షి ఉపాఖ్యానము

జనమేజయుడిట్లనెను. "మునివరా! మయదానవుడు మృత్యువునెట్లు తప్పించుకొనెనో తెలిసికొంటిని. పిచుకలు యే విధముగా తప్పించుకొనెనో వివరింపుడు" అని ప్రశ్నింప వైశంపాయనుడిట్లు చెప్పదొడగెను.

"పూర్వము మందపాలుడను వేదపరాయణుడు, ధార్మికుడు, తపః పరాయణుడైన ముని జితేంద్రియుడై చాలకాలము తపస్సు నొనర్చి దేహాంతర ప్రాప్తుడై పితృలోకము చేరెను. కాని ఆతడు తపోఫలము పొందలేదు. అంతాతడు ధర్మరాజు వద్దనున్న దేవతలను తన తపఃశక్తి విఫలమగుటకు కారణమడుగ వారు "ఓయీ! బ్రాహ్మణుడా! జన్మమాత్రమున మనుష్యుడు దేవ, ఋషి, పితృ ఋణముల, ఋణపడుచున్నాడు. యజ్ఞముచే దేవ ఋణము, తపస్సుచే ఋషి ఋణము, సంతానముచే పితృఋణము తీరును.

నీకు సంతానము లేకపోవుటచే పితృఋణము తీరలేదు. అది తీరిన నీవు పరమసుఖములను బడయగలవు" అని పలికిరి. అంత మందపాలుడు త్వరితముగా సంతానోత్పత్తికై పిచుక రూపమున జరితయను పిచుకను కూడిన నల్గురు పుత్రులను పొందెను. వారు అండములందుండగనే మగపిచ్చుక జరితను వదిలి లపితయను పిచ్చుకతో వెడలిపోయెను. జరితయే సంతానమును కాపాడుచుండెను.

ఖాండవవనమున అగ్ని రగులుకొనగానే మందపాలుడు అగ్నిని స్తుతించి తన సంతానమును కాపాడుమని వేడికొనగా అగ్ని అంగీకరించెను.

## 230.

ఈ విషయము తెలియని జరిత మిక్కిలి భీతి చెంది తనను, సంతానమును వదలిపోయిన భర్తను దూరుచూ విలపించసాగెను. దగ్గరగానున్న ఒక మూషిక రంధ్రము చూసి ఆమె పుత్రులను అందు ప్రవేశించి ప్రాణములను కాపాడు కొనుడని పల్క వారు అందు ఎలుక ఉన్నదేమో అని ప్రవేశింప భయపడసాగిరి.

## 231. తల్లి పిచుక పిల్లలకు ధైర్యము చెప్పుట

అంత జరిత వారితో ఎలుకనొక గ్రద్ద తన్నుకొనిపోయినదని, తాను చూసితినని, భయపడక రంధ్రము ప్రవేశింపుడని పలికెను. కాని వారికి ధైర్యము చాలలేదు. తుదకు ఆమెయు వారిని వదలి సురక్షిత స్థలమునకు పారిపోయెను.

## 232.

అగ్ని వారిని చుట్టివేయ ముని సంతానమైన జరితారి, సరిసృక్కుడు, స్తంభమిత్రుడు, ద్రోణుడు అగ్నిని అనేక విధముల స్తుతింప అగ్ని సంతోషించి

వారికి తను మందపాలునకిచ్చిన మాటను తెలిపి వరమడుగుమనిన పిల్లులనుండి తమ్ము రక్షింపుమనిన ఆతడు వాటిని భస్మము చేసి, మునిబాలకులను ఆనంద పరచి, ముందుకు సాగెను.

## 233. సంతానమునకై మందపాలుడు విలపించుట

మందపాలుడు సంతానము యెట్టి స్థితిలో నున్నారో యని తలంచుకొనుచూ "లపితా! నా కుమారులు ఎట్లున్నారో?" అని పలుకుచూ రోదించుచుండ ఆమెను తుదకు పరిత్యజించి తన భార్యా పుత్రులను చేరెను. జరిత భర్తను నిందించ మందపాలుడు స్త్రీ చపలత్వమునకు చింతించి పుత్రులతో తాను వారి క్షేమము కాంక్షించువాడనని, అందువలననే అగ్నిని వేడితినని పలుకగా వారును తల్లిని ఊరడించి, అందరూ స్థానాంతరమునకు వెడలిరి.

## 234. ఇంద్రుని అస్త్రదాన ప్రతిశృతి

కృష్ణార్జునుల భుజబలమునకు సంతసించి ఇంద్రుడు వరము కోరుకొను మనగా అర్జునుడు అస్త్రములివ్వమనిన మహాదేవుని కృప పొందిన పిదప ఇత్తునని పలికెను. తమ స్నేహము చెడకుండా చూడుమని కృష్ణుడు వరమడుగ ఇంద్రుడు "తథాస్తు" అని సురులతో స్వర్గమును చేరెను.

అగ్ని పదిహేను దినములు ఆ వనమందలి జంతుజాలముల మాంస, శక్తాదులను గ్రహించి శాంతించెను. తదనంతరము ఆతడు కృష్ణార్జునులను చేరి ధన్యవాదములు తెల్పెను.

మయునితో కృష్ణుడూ, అర్జునుడు అగ్నికి ప్రదక్షిణము చేసి యమునానదీ ఉపకుల ప్రదేశమును చేరి ఉపవిష్టులైరి.

ఖాండవదహన పర్వాధ్యాయము

ఆదిపర్వము సంపూర్ణము

(ఏషియాటిక్ సొసైటీ మహాభారత మూలము ననుసరించి సంకలితమైనది)

# సభాపర్వము

## 1. సభాక్రియా పర్వాధ్యాయము - మయుని సౌజన్యము

నారాయణునకు, నరునకు, సరస్వతికి, వేదవ్యాసునకు నమస్కరించెదను.

వైశంపాయనుడిట్లనెను. "మయుడు వినీతుడై అర్జునుని చేరి తన ప్రాణములు రక్షించినందులకు కృతజ్ఞత తెలిపి, ప్రత్యుపకారము యేమి చేయగలననిన అర్జునుడు సుఖముగా జీవితము గడుపుమని తెలిపి తనకు యెటువంటి సహాయము అవసరము లేదనిన, మయుడు "మీ మాటలు మీ గొప్పతనము చాటుచున్నవి. మీకు సాయపడ నాకు చాల కోరికగా నున్నది. నేను దానవ కులమునకు విశ్వకర్మను. మీ గుణగణములకు వశవర్తినై మీ పెంపు వహింప దలంచుచున్నాను" అని పలుక అర్జునుడు కృష్ణుని అభిమతము తీర్చుమని పలికెను.

అంత కృష్ణుడు మయునితో, మహారాజైన ధర్మరాజునకు అతులనీయమైన సభాగృహము నిర్మింపుమని కోర అందులకాతడు సంతోషముగా అంగీకరించి పంచ సహస్రహస్త పరిమాణ స్థలము నిర్మాణమునకు నిర్ణయించెను.

## 2. శ్రీకృష్ణుడు ద్వారకకు మరలుట

కొంతకాలము ఖాండవప్రస్థ నగరమున వసించిన పిమ్మట కృష్ణుడు ద్వారకకు మరలదలచి ముందుగా కుంతిని కలసుకొని నమస్కరించిన, ఆమెయు ఆతనిని కౌగలించుకొని ఆశీర్వదించి పంపెను. సుభద్రను కలసుకొని కృష్ణుడు తగిన హితోపదేశములు చేసి తదనంతరము అర్జునుని, ధర్మరాజును, భీమ, నకుల సహదేవులను కలసుకొని వారివద్ద సెలవు తీసుకొని అభిమన్యాది పాండు సంతతిని ఆశీర్వదించి, దధిపాత్రలతో బ్రాహ్మణులు స్వస్తివచనములు పలుకుచుండ, వారికి ప్రదక్షిణము చేసి శుభముహూర్తమున గదా, చక్రాది శస్త్రములతోను, గరుడకేతనముతోను శోభిల్లుచున్న రథము నధిరోహించిన సారథియైన దారకుని ప్రక్కకు తప్పించి బంధుప్రీతుడైన ధర్మరాజే పగ్గములను ధరించెను. అర్జునుడు శ్వేతచామరమును వీచెను. భీమ, నకుల, సహదేవులు బ్రాహ్మణులతో పాదచారులై రథముననుసరించిరి. నగరము దాటిన పిమ్మట కృష్ణుడు ధర్మరాజునకు నమస్కరింప అతడు భాష్పలోచనుడై కౌగలించుకొని సుఖముగా ప్రయాణము చేయమని ఆశీర్వదించెను. అర్జునాది పాండవులను కౌగలించుకొని, కృష్ణుడు రథము నధిరోహింప దారకుడు రథము నడిపెను.

ఆతడు క్రమక్రమముగా పాండవులకు దూరమయ్యెను. ఆతడు దృష్టిగోచరుడగు వరకు నచటనే రెప్పవాల్చక చూచుచూ తదుపరి కృష్ణుని మాటలనే తలంచు కొనుచూ పాండవులు పురము ప్రవేశించి సుఖముగా కాలము గడుపసాగిరి.

## 3. మయుడు స్వగృహమునకు మరలుట

వైశంపాయనుడిట్లనెను. "తదనంతరము మయుడు అర్జునునితో "మహాను భావా! దయచేసి నాకు సెలవు ఇవ్వవలసినది. కొద్దికాలములోనే తిరిగి వచ్చెదను. కైలాస పర్వత సమీపమున మైనాక పర్వతమున్నది. అచట బిందు సరోవరతీరమున వృషపర్వుని మణిమయ రమణీయ ద్రవ్యములను నేను పొందుపరచితిని. వానిని నేను తీసుకొనివత్తును. బిందుసరోవరమున వృషపర్వుని శత్రునాశిని, సుదృఢమైన సువర్ణమండితమైన గద గలదు. అది భీమునకు తగినది. అదేగాక మీకు అచట నుండి దేవదత్తమనెడి శంఖమును కూడా తెత్తును" అని పలికిన అర్జునుడందులకు అంగీకరించెను.

మయుడు కైలాస పర్వత సమీపమున బిందు సరోవరమును చేరి మణులను, స్ఫటికశిలలను, మహతియను గదను, దేవదత్తమను శంఖమును తీసుకొని ఖాండవప్రస్థ నగరమునకు తిరిగి వచ్చి భీమార్జునులకు మహతియు, దేవదత్తమును ఇచ్చి సభాస్థలి నిర్మాణకార్యము మొదలిడెను.

గగనచరులు, మహాకాయులు, మహాబలులు అయిన ఎనిమిది వందల మంది రాక్షసులను పనిచేయుచుండ విశాల, విపుల రమణీయ, రత్నప్రాకార మండిత, బహు చిత్రశోభిత, బహుళ ధనసంపన్న, గగనవ్యాప్తమైన సభను మయుడు నిర్మించెను. ఆ సభ స్ఫటికమయ సరోవరములతోను, మణినిర్మిత వేదికలతోను, సరోవరము స్వచ్ఛమైన నీటితోను, సువర్ణ నిర్మిత మత్స్య కూర్మముల తోను వైఢ్యర్య పత్రములతోను ప్రకాశించెను. ఆ సరోవరమందలి హంస, కారండన, సారస, చక్రవాకాది పక్షి సముదాయము జనులను ఆకర్షించుచుండెను. ఆ సభ ఇరువంకల దివ్య ఫలపుష్పభరితమైయుండెను. మరియు సభా భవనము చిత్ర విచిత్రమైన కట్టడములతో నిండియుండెను. మయుడు ఆ సభను పదునాల్గు మాసములలో పూర్తిచేసి ఆ వార్తను ధర్మరాజునకు తెలియజేసెను.

## 4. పాండవులు మయసభను ప్రవేశించుట

ధర్మరాజు అసంఖ్యాకులైన బ్రాహ్మణులకు భక్ష్య భోజ్యములతో విందు భోజనమిడి గోవులను, ధనము దానము చేసి, మంగళవాద్యములు మ్రోగుచుండ,

బ్రాహ్మణులు స్వస్తి వాక్యములు పలుకుచుండ, అన్నదమ్ములతోను, బంధుమిత్రుల తోను, శునక, జైమిని, కౌశిక, మార్కండేయ, భృగు, గౌతమాది మహర్షులతోను, పులింద, అంగ, వంగ, మగధ ఆది ఛప్పన్న దేశ రాజులతోను అందు ప్రవేశించి మల్ల, ఝల్ల, నట, వైతాళికుల విద్యలను చూచుచూ ఆనందము పొందిరి.

సభాక్రియా పర్వాధ్యాయ సమాప్తి

## 5. పాండవసభకు దేవర్షి నారదుని ఆగమనము

మయసభలో ఉన్న పాండవులవద్దకు ముల్లోకములా చరించుచూ నారద మహర్షి వచ్చెను. ఆ ముని సమస్త వేదములు, ఉపనిషత్తులు, న్యాయ, సాంఖ్య, ఛంద, జ్యోతిష శాస్త్రములందు జ్ఞానము కలిగినవాడు. అసాధారణ ధీసంపన్నుడు. మేధావి. త్రిలోకములలో జరుగు విషయముల నాతడు తన యోగబలమున తెలుసుకొనగలిగెడివాడు.

పాండవులు ఆతనికి నమస్కరించి ఉచిత ఆసనమున ఆసీనుని చేసిరి.

కుశల ప్రశ్నానంతరము ముని ధర్మరాజునకు రాజనీతిని ఉపదేశించుచూ "రాజా! నీవు అర్థచింతితుడవై, ధర్మచింతనను మరువలేదు కదా! అధిక విషయాసక్తుడవైన, మనస్సు దూషితమగును. నీ రాజ్యమున వ్యవసాయము, వాణిజ్యము అభివృద్ధి చెందుచున్నవా? దుర్గ సంస్కారాది అష్టవిధ రాజ్యకార్యములు చేయుచుంటివా? సామంతరాజులు వశులై ఉండిరా?" అని పలుక ధర్మరాజు తగు ప్రత్యుత్తరములనివ్వ మహర్షి ఆనందించెను.

## 6. ధర్మరాజు మయసభ యెట్లున్నదని నారదుని ప్రశ్నించుట

## 7, 8, 9, 10, 11

తదనంతరము ధర్మరాజు నారదమహర్షితో "మునివరా! మీరు త్రిభువనములను పరిభ్రమించుచుందురు. మయనిర్మితమైన ఈ సభను మించిన సభ ఎందేని కలదా? వాటి విశేషములను నాకు దయచేసి తెలుపుడు" అని వేడుకొనిన ఆ మహర్షి "రాజా! ఈ భూలోకమున ఈ మయసభ అత్యున్నతమైనది. దీనితో పోల్చదగినది ఇంద్రసభ, యమసభ, వరుణసభ, కుబేరసభ, బ్రహ్మసభలు మాత్రమే" అని వాటి సౌందర్యము సవిస్తరముగా ధర్మరాజునకు తెలిపెను.

## ధర్మరాజుతో నారదమహర్షి రాజసూయ యాగము చేయుమనుట

నారదుడిట్లనెను "మహారాజా! రాజసూయయాగ ఫలముననుభవించు; హరిశ్చంద్రుని చూసి మీతండ్రియైన పాండుమహారాజు నాతో మిమ్ములను కలసుకొనిన ఆ యజ్ఞము చేయ తెలుపుమని కోరెను.

ధర్మరాజా! నీ తండ్రి కోరికను తీర్ప పూనుకొనుము. రాజసూయయాగము క్షత్రియులకుచితమైనది. ఇది ఆచరించిన రాజులు ఇంద్రలోకము చేరి పరమ సుఖములను అనుభవించెదరు" అని పలుక, పాండవులను ఆశీర్వదించి నిష్క్రమించిన ధర్మరాజు తమ్ములతో యజ్ఞ విషయములను ప్రశ్నించి చర్చించెను.

లోకపాల సభాఖ్యాన పర్వాధ్యాయ సమాప్తి

## 12. రాజసూయారంభ పర్వాధ్యాయము

ధర్మరాజు ప్రజలను తన సంతానము వలె చూచుకొనుచూ రాజ్యము చేయసాగెను. అతనిని ద్వేషించువారు ఎవ్వరూ లేరు. అతడు అజాతశత్రువై భీమ ప్రతిపాలనమున, అర్జునుని శత్రునివారణమున సహదేవుని ధర్మాను శాసనమున, నకులుని నమ్రతవలన ప్రజలు నిర్భీకులై యుండ రాజ్యము చేయు చుండెను. అతని రాజ్యమున సుసమయమున వర్షములు పడ పంటలు చక్కగా పండి ప్రజలు సంపన్నులై సుఖముగా ఉండిరి. కృషి, వాణిజ్యాదులు పెంపొందెను.

కొంతకాలము గడచిన పిమ్మట ధర్మరాజు భీమార్జునాది తమ్ములు, మంత్రులు, ధౌమ్య పురోహితుడు, మునులు సభయందు కూడియున్న సమయమున తాను రాజసూయ యాగము చేయ తలపెట్టిన సంగతి తెలుప వారు ఆతనిని ఆ యజ్ఞము చేయ ప్రోత్సహించిరి.

ధర్మరాజు సర్వజ్ఞుడైన కృష్ణుని అభిమతము యెరుంగదలంచి చారులను పంపిన ఆతడు ఇంద్రప్రస్థ నగరమునకు వచ్చిన, పాండవులు ఆతనికి పూజార్చనలు గావించిరి.

సుఖాసీనుడై ఉన్న కృష్ణునితో ధర్మరాజు "కృష్ణా! రాజసూయ యాగము చేయ నాకు అభిలాష కలిగినది. కోరుకున్నంత మాత్రమున జరుగునది కాదీ పని. దీనిని ఏ విధముగా చేయవలెనో నీకు బాగుగా తెలుసును. ప్రపంచమున పూజ్యుడైనవాడు, చక్రవర్తియై సమస్త పృథ్విని తన ఆధీనము చేసికొనిన వ్యక్తియే చేయగలడు. నా బంధుమిత్రులు ఈ యాగము చేయ నన్ను ప్రోత్సహించుచున్నారు. కాని నీ సలహా తీసుకొనకుండా ఈ కార్యము తలపెట్టుట నాకు ఇష్టము లేదు.

కొందరు వ్యక్తులు బంధుత్వమున, స్వార్థమున ప్రియవాక్యములు పలుకుదురు. నీవు అట్టి దోషములు లేనివాడవు. కామక్రోధ వర్జితుడవు. కావున నాకు దయచేసి తగిన సలహా ఇమ్ము” అని పలికెను.

## 13. రాజసూయ యాగమందలి అడ్డంకులు కృష్ణుడు తెలియజేయుట

అంత కృష్ణుడు, “మహారాజా! నీవు సర్వగుణ సంపన్నుడవు. సర్వజ్ఞుడవు. నీవంటివాడు చేయదగిన యాగమిది. కాని ఈ విషయమై మీరు తెలిసికొన వలసినది కొంతయున్నది. పరశురాముడు పృథ్విని నిక్షత్రియము చేసెను. తదుపరి క్షత్రియ కులజులెవ్వరూ యదార్థమున క్షత్రియులు కారు. కాని ఆ ఆచార వ్యవహారములను మాత్రము పాటించుచున్నారు. ఇలావంశమనియు, ఇక్ష్వాకు వంశమనియు ప్రసిద్ధి గాంచిన వంశములందు నూరు కులములు ఉద్భవించినవి. నేడు ఈ వంశస్థులందరిలోను జరాసంధుడు తన భుజబలమున సమస్త భూపతులను జయించి అఖండ భూమండలమునకు యేకాధిపత్యము వహించి యున్నాడు. శిశుపాలుడు, దంతవక్త్రుడు, వకృడు, యవనాధిపతి భగదత్తుడు. పురుజిక్తు, పౌండ్రక వాసుదేవుడు, భీష్మకుడు మొదలైన మహాశక్తి సంపన్నులైన రాజులు అతని అధీనులై ఉన్నారు. ఉత్తరదేశ రాజులు, శూరసేనుడు, శార్వడు, పాంచాలరాజు, మత్స్యరాజు అతనికి భయపడి పారిపోయి, పశ్చిమమున వలసలు ఏర్పాటుచేసుకొనియున్నారు. జరాసంధుని అల్లుడైన కంసుని నేను, నా అనుజుడైన బలరామ సహాయుడనై లోకోపకారార్థము సంహరింప, జరాసంధుడు మాపై పగపూని యుద్ధసన్నిద్ధుడయ్యెను. బహుసంఖ్యాకులైన ఆతని సైన్యమును నాశనము చేయుట బహుకష్టమని యెరింగి మేము మధురా నగరమును వదిలి పశ్చిమమున శత్రు దుర్భేద్యమైన ద్వారకానగరమును నిర్మించుకొని యుంటిమి. దురాత్ముడైన జరాసంధుడు అనేకులైన రాజుల నోడించి గిరిదుర్గమున బంధించి యున్నాడు. నీవు రాజసూయ యాగము చేయదలంచితివేని ముందు జరాసంధునిచే బద్ధులైయున్న రాజులను విడిపించవలెను. అందులకు జరాసంధుని వధించ మార్గము అన్వేషింపుము. ఆతనిని వధించకుండా రాజసూయ యాగము చేయుట దుష్కరము” అని పలికెను.

## 14. కృష్ణ, ధర్మరాజాదులు కలసి ఆలోచించుట

అంత ధర్మరాజు వినీతుడై కృష్ణునితో “మహానుభావా! నీవు సదసద్వివేకివి కావున మాకు పయుక్తమైన విషయములన తెలిపితివి. సామాన్యులైన రాజులు

స్వార్థచింతనతో, స్వఫలాపేక్షతో ఇతరులకు సలహాలనిత్తురు. పూజనీయుడవు కనుకనే నీవిట్లంటివి. ఈ మహావిశాలమైన పృథ్విని సమరమున మనము వశీభూతము చేసుకొనజాలమని నేననుకొనుచున్నాను. యుద్ధమున జననాశనము చేయ నాకు ఇచ్ఛ లేదు. కృష్ణా! మేము నీ భుజబలముపైన ఆధారపడి యున్నవారము. నీవే జరాసంధునకు వెరచి ఇతర స్థలముల ఆశ్రయము చూచుకొన్న మేమెట్లు ఆతనిని ఓడింప ఆలోచన చేయగలము? నీవు, బలభద్రుడు, అర్జునుడు, భీముడు ఈ నల్గురిలో ఎవరు జరాసంధుని వధింప సమర్థులో దయచేసి తెలుపవలెను. నీవు చెప్పినటులనే మేము ఆచరించెదము" అని పలికెను.

ధర్మరాజు మాటలు విని భీముడు "అన్నా! యుద్ధము చేయ వెన్ను చూపి సోమరియైన బలవంతుడైన రాజైనను నశించును. ధైర్యముతో శత్రువునెదుర్కొని విజయమును కాంక్షించిన వ్యక్తి తప్పక సఫలీకృతుడగును. కృష్ణుని బుద్ధి కుశలతతోను, నా బాహుబలముతోను అర్జునుని విజయకాంక్ష తోడను మేము ముగ్గురము కలసి ఆ జరాసంధుని తప్పక వధింపగలము" అని పలికెను.

పాండవులను జరాసంధుని వధింప ప్రేరేపించుచూ కృష్ణుడు "ధర్మరాజా! చాలామంది పరిణామము తెలుసుకొనకుండగనే కార్యము నారంభించి భంగపడుదురు. సత్యయుగమున యవ్వనాశ్వుడను రాజుపన్నులు తీసుకొనక, భగీరథుడు ప్రజాపాలనమున, కార్తవీర్యుడు తపోబలమున, భరతుడు బాహుబలమున చక్రవర్తులైరి. ఒక్కొక్క గుణముతోనే వీరు చక్రవర్తులు కాగా సర్వగుణ సంపన్నుడవైన నీవు వెనుకాడ నవసరము లేదు.

మహారాజా! బృహద్రధుని పుత్రుడైన ఈ జరాసంధుడు రాజులందరు తనవద్ద నతశిరస్కులు కాగా బలపూర్వకముగా చక్రవర్తియై యున్నాడు. ఈతనివద్ద 86గురు రాజులు బందీయై యున్నారు. నూర్గురు పూర్తి కాగానే వారినందరినీ వధింపదలచి యున్నాడు. ఏ మహాత్ముడు ఈ క్రూరకర్మనుండి వానిని ఆపగలడో ఆతడు యశస్కుడై సామ్రాజ్యమును పొందును. ఇందు సందేహము లేదు" అని పలికెను.

## 15. జరాసంధుని వధింప అర్జునుడు తన నిశ్చయము తెలుపుట

అంత ధర్మరాజు "కృష్ణా! సామ్రాజ్యలోభవశుడనై నేను మిమ్ములను ఎట్లు పంపగలను? నాకు భీమార్జునులు రెండు కన్నులవంటివారు. నీవు నా మనస్సమానుడవు. మిమ్ములను పంపి నేను చక్షు, మనశూన్యుడనై ఎట్లు ఉండగలను? ముఖ్యముగా అజేయసైన్య సంపన్నుడైన జరాసంధునిపై మిమ్ములను

ఎట్లు పంపగలను? దీనివలన అనర్థమే జరుగునను శంక కలుగుచున్నది. అందువలన నేను రాజసూయ యజ్ఞమునే మానుకొనదలంచుచున్నాను" అని ధర్మరాజు పలుక అర్జునుడు "మహారాజా! దుష్ప్రాప్యమైన ధనస్సు, శస్త్రము, శరము, వీరత్వము, కార్యనిశ్చయత, యశము, బలము నేను పొందియున్నాను. బలయుతుడయ్యును తేజోహీనుడైన ఓటమి తప్పదు. మనుష్యునకు ధైర్యము, నిశ్చయత ఆవశ్యకములు. అతడే విజయుడగును. జరాసంధుని వధించి, రాజులను ముక్తులను చేయుట కన్నా ఉత్కృష్టమగు కార్యము ఇంకేమున్నది. అందువలన మనము సామ్రాజ్య లాభార్థము ఈ కార్యము చేయుటయే మేలు" అని గంభీరముగా పలికెను.

## 16. జరాసంధ వధార్థము కృష్ణుని ఉపదేశము

"అర్జునా! నీ మాటలు వీరోచితములు. శత్రువు యొక్క దుర్బలత్వము తెలిసికొని ఎదిరించిన తప్పక జయము పొందెదము. అందువలన శత్రు రంధ్రాన్వేషణము చేసి ఆతని సైన్యముతో యుద్ధమునకు తలపడక రహస్యముగా ఆతని పురము చేరి ఆక్రమణ చేయుట మంచిది. ఆ దుర్మార్గుని సంహరించి రాజ్యలక్ష్మినో, వీరస్వర్గమునో పొందుట మేలు" అని కృష్ణుడు పలుకగా, ధర్మరాజు "జరాసంధుడెవ్వడు? అతడు ఇట్టి బలవీర్య సంపన్నుడెట్లయ్యెను" అని కృష్ణుని ప్రశించెను.

## జరాసంధుని జన్మవృత్తాంతము

కృష్ణుడు ఇట్లు చెప్పెను. "మహారాజా! పూర్వము మగధ దేశమును బృహద్రధుడను రాజు పాలించెడివాడు. అతని వద్ద మూడు అక్షౌహిణీసైన్యము కలదు. అతడు కాశీరాజు కుమార్తెలను, ఇద్దరు కవలలను వివాహమాడి ఉభయులను సమానముగా చూసుకొనెడివాడు. యజ్ఞయాగాది క్రియ లాచరించినను ఆతనికి పుత్ర సంతానము కలుగలేదు.

గౌతముని పుత్రుడైన చండకౌశికుని రాకను తెలుసుకొనిన రాజు భార్యలతో ఆతనిని చేరి సేవాశుశ్రూషలు చేసి తన విచారమును వ్యక్తపరుప ముని అతనికి ఒక మామిడిపండు ఇచ్చి నీ కోర్కె తీరునని తెలుప ఆనందముతో గృహాభిముఖుడై భార్యలకు ఆ ఫలమునివ్వ వారు దానిని రెండుభాగములు చేసికొని భక్షించిరి. కొంతకాలమునకు వారిరువురు గర్భవతులైరి. కాని దురదృష్టవశమున వారిద్దరు ఒకే కాలు, ఒకే చేయి, అర్ధదేహములను ప్రసవించిరి. భయ విచారములతో

వారా శరీర ఖండములను కోట బయట పారవేయించిరి. ఆ సమయమున జర యను రాక్షసి మాంసఖండములను చూసి భక్షింప, రెండు భాగములు కలసి పట్టుకొనగా అవి కలసి మహాబలాక్రాంతుడైన కుమారుడై రోదనము చేయసాగెను. రాజుపై ఆదరముతో రాక్షసి తనను చేరవచ్చిన రాజదంపతులకు కుమారుని సమర్పించెను.

## 17. జరాసంధుని నామకరణము

బృహద్రధుడు కుమారుని జాతకర్మాది క్రియలుగావించి జరచేత సంధింప బడెను కాన జరాసంధుడని కుమారునకు నామకరణము గావించెను.

## 18.

తల్లిదండ్రుల ఆదరముతో జరాసంధుడు దినదిన ప్రవర్ధమానుడయ్యెను. ఒకనాడు చండకౌశికుడు అచ్చటకు వచ్చి రాజుచే సేవలను అందుకొని సంతుష్టుడై "రాజా! నీ కుమారుడు, రూపముతోను, బలముతోను, విక్రమముతోను ఐశ్వర్యసంపన్నుడై రారాజులనందరినీ ఓడించి చక్రవర్తియై రాజ్యమును చేయును. శివుని దర్శనము పొందును" అనిపలికి యధేచ్ఛ జనెను.

రాజు కుమారుని రాజ్యాభిషిక్తుని చేసి భార్యలతో తపోవనమున కేగెను. జరాసంధుడు తన భుజబలముతో రాజులను వశీభూతులను చేసుకొనెను.

నేను కంసుని వధించితినని తెలుసుకొని ఆతడు నాపై పగపూని తన పట్టణము నుండియే నన్ను వధింప గదను 101 మారులు త్రిప్పి విసర అది మధురానగరమున నా సమీపమున పతనమయ్యెను. నేటికీ ఆ స్థలమును గదావసానమని పిలుతురు. దుర్బలులు బలవంతునితో కయ్యమాడకూడదని మేము ఆతనిని ఉపేక్షించితిమి" అని కృష్ణుడు పలికెను.

రాజసూయారంభ పర్వాధ్యాయ సమాప్తి

## 19. జరాసంధ వధ పర్వాధ్యాయము

"ధర్మరాజా! జరాసంధుని వధింప సమయమాసన్నమైనది. రణాంగణమున ఆతనిని మనమేమియు చేయజాలము. అందులకు ద్వంద్వ యుద్ధమే తగినది. గర్వాంధుడైన ఆ జరాసంధుడు తప్పక భీమునితో పోరున కిచ్చగించును. భీముడాతనిని తప్పక సంహరించును. కావున నీవు భీమార్జునులను నాతో

పంపుము" అని వాసుదేవుడు పలికిన ధర్మరాజు "కృష్ణా! మేము నీ ఆజ్ఞావర్తులము. నీవు తప్ప ఈ కార్యమున సహాయకులు మాకింకెవ్వరు గలరు? నీవు, అర్జునుడు ఒకే ప్రాణమువంటివారు. మీతో కూడిన వృకోదరుడు ఎట్టి కార్యమునైనా నెరవేర్చగలరు. నేడే భీమార్జునులు నిన్ను అనుసరించెదరు" అని పలికెను.

## జరాసంధుని వధింప భీమాదులు బయలుదేరుట

తదనంతరము భీమ, కృష్ణ, అర్జునులు బ్రాహ్మణ వేషధారులై చంద్ర, అగ్ని, సూర్యుల వలె ప్రకాశించుచూ, వారిని చూసిన ప్రజలు వీరు తప్పక జరాసంధుని వధింతురని తలపోయుచుండ ఖాండవప్రస్థ నగరమునుండి బయలుదేరిరి. గండకి, యమున, చర్మవతి, గంగా, శోణనదులను కాలకూట, కోసల, మిథిల మొదలయిన దేశములగుండా దాటుచూ గోరథ పర్వతము అధిరోహించి మగధపురమును కాంచిరి.

మగధ రాజధానియైన గిరివ్రజపురము వైరాహా, వరాహ, వృషభ, ఋషిగిరి పర్వతములు నాల్గువైపుల కంకణమువలె పరిరక్షింప గౌతమ ఋషి ఆశ్రమముతోను, మణినాగ ఆలయముతోను శోభిల్లుచుండెను.

వారా నగరచైత్యమును సమసించిరి. అచ్చట జరాసంధునిచే సంహరింప బడిన వృషభ రాక్షసుని చర్మముచే నిర్మించబడిన మూడు భేరులు కలవు. అవి ఒకమారు మ్రోగించిన దాని నాదము నెలదినములు వినిపించును. కృష్ణ, భీమ, అర్జునులు ఆ భేరీలను భగ్నము చేసిరి. సుప్రతిష్ఠమైన చైత్యశృంగమును నాశనము చేసి నగరమును ప్రవేశించిరి.

## 20.

వేదపారంగతులైన బ్రాహ్మణులు దుర్నిమిత్తములను గాంచి రాజున కెరిగించిన, జరాసంధుడు పురోహితులను పిలిపించి దీక్ష వహించి, ఉపవాసముండి శాంతులు చేయించసాగెను.

కృష్ణ, భీమార్జునులు విపణి వీధుల తిరుగుచు రాజమార్గము గుండా చరించి, పుష్ప, మాల్య, చందనాదులను బలపూర్వకముగా గ్రహించి, పశుగణమును నిరీక్షించు సింహములవలె అవలోకింపుచుండ, ప్రజలు భీతశంకాకులిత హృదయులై తొలగిపోవుచుండ, క్రమక్రమముగా కక్ష్యాంతరములు దాటుచూ, అహంకారము ఉట్టిపడుచుండ జరాసంధుని సమీపించిరి.

## ఛద్మవేషధారులైన భీమాదులను చూచి జరాసంధుని సంశయము

అంత స్వాగత వాక్యములు పలికి జరాసంధుడు వారిని చేరెను. భీమార్జునులు మౌనమవలంబించియుండ కృష్ణుడు, జరాసంధునితో "రాజా! వీరు నియమమును వహించియున్నారు. అర్ధరాత్రి గడచిన పిమ్మట నీవు వచ్చిన, వీరు నీతో మాటలాడెదరు" అని పలుక, రాజు వారిని యజ్ఞాగారమున ఉండ పనిచి మొదటి రాత్రి గడచిన పిమ్మట మరలిరాగా బ్రాహ్మణ వేషధారులైన ఆ ముప్పురు "స్వస్త్యస్తు" అని ఆశీర్వదించిరి కాని రాజుచే పూజలు పొంద నిరాకరింప, జరాసంధుడు "మీరు ఎవ్వరు? పుష్ప లేపనములతో, రక్తవస్త్రములతో ఉన్నారు. ఆకారమును చూసిన క్షత్రియులవలె కన్పించుచున్నారు. కాని బ్రాహ్మణ వేషములను ధరించి యున్నారు. అందువలన నిజముగా మీరెవ్వరో తెల్పుడు. ద్వారముగుండా ప్రవేశింపక చైత్యకశృంగము భగ్నము చేసి ప్రవేశించిరి. బ్రాహ్మణులు వీరత్వము వాక్యములలో చూపుదురు. మీరెందులకు కార్యములో చూపుచున్నారు? మీరెందులకు నా పూజలను గ్రహింప నిరాకరించుచున్నారు? ఇచ్చటకు వచ్చుటకు కారణమేమో నిక్కముగా పల్కుడు!" అని పలుక కృష్ణుడు గంభీరముగా "ఓ రాజా! నీవు మమ్ము దీక్ష వహించిన బ్రాహ్మణులమని అనుకొనుచున్నావు. క్షత్రియులు కూడా దీక్ష వహింప యోగ్యులని యెరుంగుము. మేము సిరికి స్థానమని పూలమాలను ధరించితిమి. క్షత్రియులు భుజబలమునే కాని వాక్బలము చూపరని నీకు తెలియును కదా! ఓ రాజా! నీకు కోర్కెయున్నదేని నేడే మా భుజబలము నీకు చూపించెదము.

ధీరులు శత్రుగృహమును అప్రకాశ్యముగాను, సుహృత్‌వర్గుల గృహములకు ప్రకాశ్యముగను ప్రవేశింతురు. మేము స్వకార్యార్థము శత్రుగృహమును ప్రవేశించితిమి. అందువలననే నీ పూజలను తిరస్కరించితిమి. ఇదే మా నిత్యవ్రతము" అని పలికెను.

## 21. తన అపరాధము తెలుపుడని జరాసంధుడు ప్రశ్నించుట

అతని మాటలు విని జరాసంధుడు, "మీరు పొరపాటు పడినట్లున్నది. నేను క్షాత్రధర్మము వహించి, ప్రజలకు ఎట్టి అపకారము జరుగకుండా చూచుచుందును. మీ యెడల నేను ఎట్టి అపకారము చేసినట్లు నాకు జ్ఞాపకము లేదు. ఎందులకు మీరు నన్ను శత్రువుగా పరిగణించుచున్నారో దయచేసి తెలుపుడు" అని పలికెను.

## కృష్ణ, భీమాదులు తమ నిజరూపములను ఎరుకపరచుట

అంత కృష్ణుడు, "రాజా! కులమును రక్షింప భారమును గ్రహించిన వ్యక్తి పంప మేము నీ వద్దకు వచ్చితిమి. నీవు ఇంతకు క్రితము ఎవ్వరూ చేయనిది, నీచమైనదియైన పని చేయ సమకట్టితివి. రాజన్యులను బంధించి వారిని పశుపతినాధునకు యజ్ఞపశువులవలె బలి చేయ తలచితివి. నీకన్న బలవీర్యములు కలవాడు లేడనే కదా నీ గర్వము! కాని స్వజాతిని రక్షించుకొన దేహత్యాగము చేయుటకు కూడా సిద్ధపడినవారు ఉన్నారని గ్రహింపుము. సైన్యబలమున నీవు అపారుడవనియు, మహాబలశాలివనియు నీకున్న అహంకారము రూపుమాపుటకే మేము వచ్చితిమి. ఒకరిని మించిన వ్యక్తి మరియొకడు తప్పకయుండును. అహంకారముతో చరించిన కార్తవీర్యాది రాజులు ఎట్లు నశించిరో నీకు తెలియదా? నిన్ను కపటముగా సంహరించుటకే మేము వచ్చితిమి. నేను కృష్ణుడను. వీరిరువురు పాండునందనులు. నీవు వెంటనే బందీలైయున్న రాజులను ముక్తులను చేసి, నిన్ను, నీ కులమును రక్షించుకొనుము. లేదేని మాతో యుద్ధము చేసి యమాలయమునకు చేర సంసిద్ధుడవు కమ్ము!"

"కృష్ణా! నేను వారిని జయించిన పిమ్మటనే దేవపూజార్థము బంధించి యుంచితిని. నన్ను విరోధినిగా తలంచి బ్రతికియున్న రాజు ఒక్కడూ లేడు. నేను క్షాత్రధర్మము ననుసరించియే చరించితిని. నేను మిమ్ము చూసి భయపడు వాడను కాను. నేను యేకాకినైనను మీ ముప్పురితో ఒకేమారు గాని, వేరువేరుగా గాని యుద్ధము చేయ సిద్ధముగా ఉన్నాను" అని జరాసంధుడు పలికి వారితో యుద్ధము చేయ సిద్ధమై, నిజకుమారుడైన సహదేవుని రాజ్యాభిషిక్తుని చేయ ఆజ్ఞనిడి, కౌసిక, చిత్రసేనులను సేనాధిపతులను రప్పించెను. యాదవుల చేత జరాసంధుడు చావడని బ్రహ్మ తెలిపినందున కృష్ణుడు ఆతనితో యుద్ధము చేయ తలపడలేదు.

## 22. భీమునితో జరాసంధుడు యుద్ధము చేయుట

వాసుదేవుడు "రాజా! మా ముగ్గురిలో నీవెవ్వరితో యుద్ధము చేయ దలంచితివో తెలిపిన వారు సిద్ధమగుదురు" అని తెలుపగా జరాసంధుడు భీమునితో పోరు సలుపుదుననెను. పూలు మొదలయిన మంగళద్రవ్యములతోను, ఔషధముల తోను పురోహితులు రాగా జరాసంధుడు సమయోచితముగా కిరీటమును పరిత్యజించి, కవచము ధరించి భీముని ద్వంద్వయుద్ధమునకు ఆహ్వానించెను. అతడును కృష్ణునితో మంత్రణాలోచనము చేసి సంసిద్ధుడయ్యెను.

వారిరువురు బాహుమాత్ర అనలంబులై తొలుత కరగ్రహణ పూర్వకముగా అభివందనము గావించి, తొడలను, భుజములను చరచుకొని భీకరనాదముచేసి మల్లయుద్ధముచేయనారంభించిరి. వారు బాహుపాశ బంధనముతో లలాటముల ఆఘాతము చేయ వారి నుదుట అగ్గిరవ్వలు చెలరేగెను. వారు పూర్ణకుంభ, తృణపీడ, పూర్ణజోగాదులతో వివిధ గతుల యుద్ధము చేయుచుండ వారి సింహనాదములతో దిక్కులు పిక్కటిలసాగెను.

వారు ప్రకర్షణ, ఆకర్షణ, అనుకర్షణ, వికర్షలతో జయాకాంక్షులై యుద్ధము చేయుచుండ నాల్గు వర్ణముల ప్రజలు వచ్చి ఆ ద్వంద్వయుద్ధమును నిరీక్షించసాగిరి.

విశాలవక్షులు, దీర్ఘబాహులు, యుద్ధకుశలురు అయిన ఆ క్షత్రియులిద్దరు కార్తీకమాస ప్రథమ దినమున ద్వంద్వయుద్ధమారంభించి, నిద్రాహారశూన్యులై దివారాత్రులు పదమూడు దినములు యుద్ధము చేయుచుండిరి. జరాసంధుడు అలయుట చూసిన కృష్ణుడు "భీమసేనా! అలసిన శత్రువును నొప్పించుట తగదు. నెమ్మది పడుము" అని నర్మగర్భితముగా పలుక భీముడు పెంపొందిన ఉత్సాహముతో తలపడెను.

## 23. జరాసంధ వధ

ఎంతకూ జరాసంధుని పడవేయలేకపోవుచున్న భీమునికి ఉత్సాహము గరుపుచూ కృష్ణుడు "భీమా! నీకు దైవబలము, వాయుబలము బాసటయై యున్నవి. వాటిని ప్రదర్శింపుమ" అని పలుక భీముడు జరాసంధుని పాదద్వయమును పట్టి నూరుమార్లు గాలిలో త్రిప్పి త్రిప్పి శరీరము శిథిలమగునటుల నేలపడవైచి కాలుపై కాలాన్చి వానిని రెండు ఖండములుగా చీల్చివైచెను. మగధ నగరము భీముని గర్జనముతోను, జరాసంధుని ఆర్తనాదముతోను నిండెను.

జరాసంధుడు మృతినొంద, ఆతని రథముపై భీమార్జునులు అధిరోహించిరి. కృష్ణుడు సారథి అయ్యెను. వారు కారాగారము నుండి రాజులనందరిని బంధ విముక్తులను కావించిరి.

బంధముక్తులైన రాజన్యశేఖరులు, పురప్రముఖులు, బ్రాహ్మణులు కృష్ణ, భీమార్జునులను స్తుతించిరి. కృష్ణుడు వారిని ధర్మరాజు చేయు రాజసూయ యజ్ఞమునకు రండని ఆహ్వానించెను.

మంత్రి సామంతులతో జరాసంధ పుత్రుడు సహదేవుడు కృష్ణాదులను చేరి

రత్న, కనకాదులు కానుకలిచ్చి శరణువేడ, వారును అతనిని అనుగ్రహించి రాజ్యాభిషిక్తుని చేసిరి.

రాజన్యులవద్ద పొందిన వివిధ కానుకలతో కృష్ణ, భీమార్జునులు ఇంద్రప్రస్థ నగరమునకు తిరిగి వచ్చి ధర్మరాజును కలసికొనిరి. కృష్ణుడాతనితో "మహారాజా! జరాసంధుని వృకోదరుడు సంహరించెను. రాజులందరూ ముక్తిపొందిరి. నీకు మాట ఇచ్చిన విధముగా భీమార్జునులు నిరాపదులై తిరిగి వచ్చిరి" అని పలుక ధర్మజుడు ఆతనిని పూజించి తమ్ములను కౌగలించుకొనెను.

తదనంతరము కృష్ణుడు ఆ దివ్యరథమునధిరోహించి పాండవులు, కుంతి, ద్రౌపది, సుభద్ర మొదలైనవారు వీడుకోలు పలుక ద్వారకకు బయలుదేరెను.

"ఓ జనమేజయ మహారాజా! ఇట్లు అజాతశత్రుడైన ధర్మరాజుచే నరపతులందరి చెర తప్పిన వార్త దశదిశలా వ్యాపింప, పాండవులు సుఖులై కాలము గడుపసాగిరి."

జరాసంధ వధ పర్వాధ్యాయ సమాప్తి

## 24. దిగ్విజయ పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! ఉత్కృష్టమైన ధనస్సుతోను, అక్షయతూణీరములతోను, రథముతోను సజ్జితుడైన అర్జునుడు యుధిష్ఠిరుని చేరి, "మహారాజా! నేను ఉత్తరాభిముఖుడనై వెడలి రాజన్యులను నతమస్తకులను చేసి మన ధనాగారమును సమృద్ధిపరుప తలంచుచున్నాను. ఆనతిండు" అని పలికిన, ధర్మరాజు విజయుడవై రమ్మని ఆశీర్వదించి పంపెను.

విజయుడు ఉత్తరమునకు వెడల, అన్న అనుమతిపై భీముడు పశ్చిమమునకు, సహదేవుడు దక్షిణమునకు, నకులుడు తూర్పునకు దిగ్విజయము చేయ బయలుదేరిరి.

## 25. అర్జునుని దిగ్విజయము

అర్జునుడు మొదట కుళింద దేశరాజులను ఓడించి, పిదప కాలకూట దేశమును వశపరచుకొనెను. శాల్మలికద్వీపము నందలి రాజులను జయించి ప్రాగ్జ్యోతిష దేశము చేరెను. దానిని భగదత్తుడను రాజు పాలించుచుండెను. అతడు అర్జునునితో తీవ్రమైన యుద్ధము చేసి తుదకు ఓటమి అంగీకరించి కానుకలు అర్పించెను.

## 26, 27.

అర్జునుడు ఉత్తరగిరిశాను దేశములైన అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరులను వశపరచుకొనెను. ఉలూక దేశస్థుల మదమణచెను. తదనంతరము కుంతీ నందనుడు పౌరవ రాజులైన విశ్వగణులతో యుద్ధము చేసి పౌరవపురము స్వాధీనము చేసికొనెను. కాశ్మీరము జయించి, కాంభోజ దేశము జయించెను. గాంధర్వదేశములోని గాంధారనగరముపై ఆక్రమణ చేయ, వారు అతనిని కానుకలతో సాగనంపిరి. తదుపరి అర్జునుడు ఉత్తర కురుదేశము జయించి, బహువిధ ధన, రత్నములతోను, గుఱ్ఱములు, ఏనుగులు, గోవులతోను ఇంద్ర ప్రస్థము చేరి అన్నకు సంతోషము చేకూర్చెను.

## 28. భీమ దిగ్విజయము

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! భీమసేనుడు, ధర్మరాజు అనుజ్ఞ తీసుకొని పాంచాల నగరము, విదేహ జయించి పూర్వాభిముఖుడై అశ్వమేధేశ్వరుడైన రోచమానుని జయించెను. అనంతరము పుళిందనగరమున సుకుమార, సుమిత్రులను రాజులను ఓడించెను. శిశుపాలుడు భీముని రాక విని నగరము వెడలి వచ్చి ధర్మజుని వశవర్తుడనైతినని పన్నులిచ్చెను.

## 29.

భీముడు తదనంతరము కోసల, మత్స్య, నిషాద, విదేహ, బర్జర, మగధ, వంగ, పుండ్ర దేశములను జయించి వివిధ రత్న, చందన, అగరు, వస్త్ర, మణి, మౌక్తిక, కంబళ, కాంచన, రజతాది మహామూల్య ద్రవ్యరాజములతో ఇంద్రప్రస్థము చేరెను.

## 30. సహదేవుని దిగ్విజయము

దక్షిణ దిశగా బయలుదేరిన సహదేవుడు మధుర, మత్స్య, గోశృంగ, అవంతి, భోజకటపుర, పాండ్య, కిష్కింధలను జయించి మాహిష్మతీనగరము చేరెను. దానిని నీలుడను రాజు పాలించుచుండెను. అతడు సహదేవునితోయుద్ధమునకు తలపడ సహదేవుడు, ఆతని సైనికులు అగ్నిజ్వాలలతో తపింపసాగిరి.

## అజేయమైన మహిష్మతీ నగరము

జనమేజయుడు మునితో "తపోధనా, రాజసూయ యాగము తలపెట్టిన ధర్మరాజుకు విరుద్ధముగా అగ్ని ఎందులకు విపక్షుడయ్యెను" అని ప్రశ్నింప వైశంపాయనుడు ఇట్లు చెప్పెను.

"మాహిష్మతికి రాజైన నీలునకు సర్వాంగసుందరియైన కుమార్తె కలదు. అగ్ని కార్యముల తండ్రికి సాయపడు ఆ రాజపుత్రికను హుతాసనుడు చూచి అనురక్తుడై బ్రాహ్మణ వేషమున రాజును చేరి ఆ కన్యను వివాహమాడెను. నీలునిపై అనుగ్రహించి అగ్ని ఆ పట్టణమును రక్షింతునని మాట ఇచ్చెను.

అందువలననే సహదేవుడు అగ్నికీలలచే పీడింపబడెను. అంత సహదేవుడు శుచియై ఆగ్నేయమంత్రమును జపింప అగ్ని సాక్షాత్కరించి నీలునితో సఖ్యత నెరపి కానుకలర్పించెను. తదనంతరము సహదేవుడు సౌరాష్ట్ర దేశమును, రాక్షస, కర్ణ, ప్రాబరణ, కాలకూట, త్రామాక్షలను వశపరచుకొనెను. ద్రావిడ, పౌంఢ్ర, కేరళ, ఆంధ్ర, తాళిక, కళింగ, కర్ణిక, రాష్ట్రములను జయించి అశేష ధనవస్తు వాహనాదులతో ఇంద్రప్రస్థ నగరమును చేరి ధర్మరాజును ఆనందపరచెను.

## 31. నకులుని దిగ్విజయము

అన్న అనుమతి తీసుకొని నకులుడు పశ్చిమముగా బయలుదేరి రోహితక, దశార్ణ, శిబి, త్రిగర్త, అశ్వష్ట, మాళవాది దేశములను జయించి వాసుదేవునకు వార్త పంప అతడు యాదవకుల సమేతముగా శాసనము అంగీకరించెను. నకులుడు మద్రదేశమును చేర ఆతని మామ శల్యుడు ఆతనిని ఆదరించి వశాను నిమిత్తముగా అమితమైన ధనమిచ్చెను.

తదుపరి నకులుడు సాగరతీర మ్లేచ్ఛ, బర్బర, కిరాత, యవన, శక జాతులను జయించి ఉత్కృష్ట ద్రవ్యములతో ఇంద్రప్రస్థము చేరెను.

దిగ్విజయ పర్వాధ్యాయ సమాప్తి

## 32. రాజసూయ పర్వాధ్యాయము

తదనంతరము ధర్మరాజు సుభిక్షముగా రాజ్యము చేయుచుండ రాజులందరూ అతని వశులై జిగీషా శూన్యులై కానుకలు అర్పించుచూ అతని ననుసరించసాగిరి.

ధనాగారము నిండి, సకల వస్తు సామగ్రులు చేకూర ధర్మరాజును అతని బంధుమిత్రులు యజ్ఞము నారంభింపుమని చెప్పసాగిరి.

ఇట్టి అవసరమున కృష్ణుడు చతురంగసేనలతో ఇంద్రప్రస్థనగరమునకు వచ్చి పాండవులకు ఆనందము చేకూర్చెను.

## కృష్ణుని ఆనతిపై ధర్మరాజు రాజసూయ యాగము ఆరంభించుట

ధర్మరాజు తమ్ములతోను, ధౌమ్య పురోహిత, ద్వైపాయనాది ఋషులతోను కృష్ణునకు ఎదురేగి తీసుకొనివచ్చి సుఖాసీనుని చేసిన పిమ్మట "వాసుదేవా! నీ అనుగ్రహము వలననే అతులనీయమైన ఈ ఐశ్వర్యమునకు అధిపతినైతిని. ఈ సంపదను విప్రులకివ్వ ఇచ్ఛ కలిగినది. కావున నీ అనుమతి గ్రహించి రాజసూయము ప్రారంభింప దీక్ష వహించదలచియున్నాను" అని వేడికొనగా, కృష్ణుడు ఆతనిని పరిపరి విధముల గుణకీర్తనము చేసి "మహారాజా! మహాక్రతువైన రాజసూయము చేయ నీవు ఉపయుక్తుడవు. కావున యజ్ఞదీక్ష వహింపుము. మేమందరమూ నీకు సహాయపడెదము" అనగా ధర్మరాజు, "కృష్ణా! నీవు ఉన్న మాకు అన్ని కోరికలు తీరును. నీ అనుగ్రహమే మాకు కావలసినది" అని వచించి భాతృవర్గముతో యజ్ఞ సామగ్రిని సిద్ధపరుపసాగెను. సహదేవుడు బ్రాహ్మణుల సహాయముతో ఉపకరణములు, అన్నాదులు, మాంగళ్య ద్రవ్యములు సిద్ధపరచెను.

కృష్ణద్వైపాయనుడు పండితులైన ఋత్వికులను పిలిపించెను. బ్రాహ్మ కార్యార్థము తానే దీక్షితుడయ్యెను. ధనంజయ గోత్రుడైన సుసాముడు సామగానార్థము వ్రతుడాయెను. యాజ్ఞవల్క్యుడు, పౌలుడు, ధౌమ్యుడు వారి శిష్యులు హోతలుగను, సదస్యులుగను సిద్ధులైరి. వారు యాజ్ఞవిషయిక చర్చానంతరము సంకల్పము చేసి యజ్ఞస్థానమును శాస్త్రోక్తముగా పూజ గావించిరి. తదుపరి శిల్పకారులచ్చట తగిన ఉత్తమోత్తములైన గృహసమూహము నిర్మించిరి.

తదనంతరము ధర్మరాజు సహదేవుని పిలచి "తమ్ముడా! యజ్ఞమును వీక్షింప బ్రాహ్మణులను రాజన్యులను వైశ్య, శూద్రులను దృతగాములైన దూతలను పంపి పిలిపింపుము" అని ఆజ్ఞాపింప ఆతడటులనే చేసెను.

## యుధిష్ఠిరుని యజ్ఞదీక్ష

యజ్ఞమునకు ఆహుతులైన బ్రాహ్మణులు యుధిష్ఠిరుని రాజసూయ యజ్ఞమునకు దీక్షితుని చేసిరి. అచటకు వేలకొలది బ్రాహ్మణులు, స్నేహితులు, బంధువులు, అమాత్యులు వచ్చిరి. వారు శిల్పకారులు నిర్మించిన సుసజ్జిత స్థానముల విశ్రమించి రుచికరమైన భోజనములతోను, దివ్యాభరణ భూషితులైన

సుందరాంగనల సేవల నందుచూ ఉండునట్లు ధర్మరాజు యేర్పాటు చేయించెను. తదనంతరము ధర్మరాజు, భీష్మ, ద్రోణ, ధృతరాష్ట్ర, విదుర, కృపాచార్యులను, దుర్యోధనాది భాతృ వర్గమును పిలువ నకులుని హస్తినా నగరమునకు పంపెను.

## 33. భీష్మాది కౌరవప్రముఖుల రాక

నకులుడు హస్తినా నగరమునకు వెడలి భీష్మాదులకు నమ్రతతో నమస్కరించి యజ్ఞమునకు ఆహ్వానింప వారును సంతుష్టులై యజ్ఞము నిరీక్షింప బయలుదేరిరి.

ధృతరాష్ట్రుడు, భీష్ముడు, విదురుడు, దుర్యోధనాది భాతృవర్గము, గాంధార రాజు సుబలుడు, మహాబలుడు శకుని, అచలుడు, వృషకుడు, కర్ణుడు, శల్యుడు, బాహ్లీకుడు, సోమదత్తుడు, భూరిశ్రవుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు, ద్రోణాచార్యుడు, సింధుదేశాధిపతి జయద్రధుడు, సపుత్రకుడై యజ్ఞసేనుడు, భరదత్తుడు, సాగర ఉపకుల నివాసులైన మ్లేచ్ఛగణము, పర్వతదేశ రాజబృందము, బృహద్వలుడు, పౌండ్రకుడు, వాసుదేవుడు, వంగ కళింగాధిపతులు, కుంతలుడు, మాళవదేశ రాజులు, అంధకగణము, ద్రావిడ రాజులు, సింహాళేశ్వరుడు, కాశ్మీర రాజు, కుంతిభోజుడు, గౌరవాహనుడు, బాహ్లీకదేశ రాజులు, విరాటరాజు, అతని కుమారులు, సపుత్రకుడై శిశుపాలుడు, బలరామ, అనిరుద్ధ, గద, ప్రద్యుమ్న, శాంబ మొదలైన యాదవులు, యజ్ఞసదస్సులై బ్రాహ్మణులు, బ్రహ్మర్షులు మొదలయిన వారందరూ ధర్మరాజు చేయు యాగమను వీక్షింప వచ్చి ఆతనిచే పూజితులై రమణీయమైనవి. సుసజ్జితములైన వాసస్థానముల విశ్రమించిరి.

## 34. నిపుణతతో ధర్మరాజు యజ్ఞకార్యభారము వహింప తగువారిని నియోగించుట

వైశంపాయనుడిట్లనెను. “తదనంతరము ధర్మరాజు, భీష్మాదులకు నమస్కరించి యజ్ఞము నిర్విఘ్నముగా జరుగునటుల సహాయపడుడని వేడి వారిని తగిన కార్యములందు నియోగించెను. భోజన ద్రవ్యముల చూచుటకై దుశ్శాసనుని, ఇప్రసేవకై అశ్వత్థామను, సంజయుని రాజుల పరిచర్యలకు, కర్తవ్యాకర్తవ్యములను నిరూపింప భీష్మ ద్రోణులను, రజత సువర్ణాది రత్నసమూహముల రక్షణా వేక్షణమున, దక్షిణ ప్రదానమున కృపాచార్యుని, ధృతరాష్ట్ర, సోమదత్త, జయద్రధులను గృహపతులుగను, బ్రాహ్మణ పాదప్రక్షాళనమునకు కృష్ణుని, కానుకలను అందుకొనుటకు దుర్యోధనుని నియోగించెను. వారును అందులకు సంతోషముగా అంగీకరించిరి.

రాజులు ఎన్నెన్నో కానుకలను సమర్పించిరి. ధర్మరాజు యజ్ఞమునకు వచ్చిన బ్రాహ్మణులకు భూరి దక్షిణలతో తృప్తిపరుప ఆనందముతో వారు పదే పదే ఆశీర్వదించిరి.

రాజసూయిక పర్వాధ్యాయ సమాప్తి

## 35. అర్ఘ్యాభిహరణ పర్వాధ్యాయము

యజ్ఞకార్యము సమాప్తి చెందిన పిదప అచటకు వచ్చిన మునులు తమలో పరి పరివిధముల తర్కించుకొనుచున్న అవసరమున నారదుడు యజ్ఞలక్ష్మిని చూచి ఆనందించుచూ క్షత్రియ సంహారము చేయ జననమొందిన యజ్ఞేశ్వరుడైన కృష్ణుని చూచి ఆతని లీలను తనలో తాను కొనియాడుచుండెను.

## భీష్ముని ఆనతిపై శ్రీకృష్ణునకు అర్ఘ్యప్రదానము చేయుట

అంత ధర్మరాజు తాతయైన భీష్ముని చేరి యెవరికి అర్ఘ్య ప్రదానము చేయవలసినదో తెలుపుమనగా అతడు "ధర్మరాజా! ఆచార్యులు, ఋత్విక్కులు, స్నాతకులు, రాజులు, ఇష్టులు. వీరు అర్ఘ్యమునందుకొనతగినవారు. కాని ఇచ్చట ఉన్న వ్యక్తులందరిలోను నక్షత్రముల మధ్యనున్న చంద్రునివలె ప్రకాశించుచున్న శ్రీకృష్ణుడే అన్ని విధముల తగిన మహానుభావుడు" అని పలికిన, సహదేవుడు భీష్ముని ఆనతి తీసుకొని కృష్ణునకు యథావిధిగా అర్ఘ్యప్రదానము చేసెను.

మహాబలపరాక్రాంతుడైన శిశుపాలుడు, కృష్ణుని పూజించుటకు ఓర్చుకొనలేక భీష్ముని, ధర్మరాజును మరియు శ్రీకృష్ణుని నిందింపసాగెను.

## 36. సభలో శిశుపాలుడు శ్రీకృష్ణుని నిందించుట

శిశుపాలుడు ఇట్లనెను. "పాండవులారా! ఇంతమంది రాజన్యులుండ మీరు కృష్ణుని పూజించుట తగదు. అల్పవయస్కులైన మిమ్ములను నిందించుట కన్నా, మీరు సలహా అడుగుచున్న భీష్ముని అనవలెను. దూరదృష్టి, శృతిశక్తి విహీనుడతడు. భీష్మా! ఎన్నడూ రాజు కానటువంటివాడు ఈ కృష్ణుడు. వయస్సులో పెద్దవాడేమో అనుకొనిన వసుదేవుడిచ్చటనే ఉన్నాడు. తండ్రి ఉండగా కుమారుడు పూజార్హుడగునా? మేలు కోరువాడనుకొందమన్న ద్రుపదుని కన్నా పాండవుల మేలు కోరుకొనువాడు కాదు కదా! ఆచార్యుడోయన్న ద్రోణుని కన్నా గొప్పవాడా? ఋత్విక్కుడనుకొనెదమన్న ద్వైపాయనుడిచ్చట నున్నాడే! ఈతడెవ్విధముగా వీరికన్నా అధికులు.

రాజశేఖరులారా! భీష్ముడు, అశ్వత్థామ, దుర్యోధనుడు, కృపుడు మొదలైన ఇంతమంది మహామహులెవ్వరూ తగిన తగినవారు కారా? మనము ధర్మజునిపై కల ప్రేమచే పన్నులనిచ్చితిమి కాని భయపడి కాదే? కాని నేడు అధముడైన శ్రీ కృష్ణుని పూజించి, పాండవులు మనలను అవమానించిరి. ఈతడు మహాత్ముడైన జరాసంధుని వంచించి మోసగించి సంహరించెను. నీచులను నీచులు గౌరవించుట సహజమే కదా! కృష్ణా! అల్పబుద్ధులైన పాండవులచే పూజలనందుకొని, నీవు స్వల్పబుద్ధిని ప్రకటించుకొంటివి" అని పలుకుచూ, ఆసనము వదలి సభను వీడిపోవ సిద్ధపడెను.

## 37. ధర్మరాజు శిశుపాలుని శాంతపరుప ప్రయత్నించుట

వైశంపాయనుడిట్లనెను. "తదనంతరము యుధిష్ఠిరుడు త్వరితముగా శిశుపాలుని చేరి "రాజా! నీవు ఇట్టి మాటలాడుట తగదు. నీకు ధర్మమనిన యేమో తెలియదు. లేకపోయిన నీవిటుల భీష్ముని అవమానించెడివాడవు కాదు. నీకంటె వృద్ధులైనవారు అంగీకరించిన విషయమున నీవు కూడా ఊరకుండుట ఉచితము. కురువంశస్థులందరూ భీష్ముని, కృష్ణుని ఎరుగుదురు కావుననే సమ్మతిని తెలిపిరి. నీవు శాంతింపుము" అని పలికెను.

## భీష్ముడు ధర్మరాజును ఆగుమనుట

ఇది చూచిన భీష్ముడు "ధర్మరాజా! కృష్ణుని అర్చించుట తగదనువారితో నీవు శాంత మధురవాక్యములు పలుక నవసరము లేదు. ఈ సభలో కృష్ణునిచే సమరమున ఓడింపబడని రాజు ఒక్కడూ లేడు. ఇతడు త్రిలోక పూజ్యుడు. ఈతని శౌర్య, వీర్యాదులు తెలిసినవాడను కనుకనే నిన్ను పూజింపమంటిని. ఇతడు నిఖిల వేదవేదాంగపారంగతుడు. బలశాలి. దాన, దాక్ష్య, శృత, శౌచ, లజ్జా, కీర్తి, బుద్ధి, వినయ, అనుపమ, శ్రీ, ధైర్య, సంతోషాది సుగుణాదులు ఈతనియందు విరాజిల్లుచున్నవి. ఈతడు చరాచర విశ్వమునకు సృష్టిస్థితి ప్రళయకర్త. అవ్యక్త ప్రకృతి. సనాతనుడు. సర్వభూతములకు అధీశ్వరుడు. అందు వలన పరమపూజ్యుడన సందేహమేల? శిశుపాలునకు మన చర్యలు ఇష్టము కాకపోయిన అతనిని యధేచ్ఛ చననిమ్ము" అని భీష్ముడు పలికెను.

## 38. శిశుపాలుడు యుద్ధసన్నద్ధుడగుట

సహదేవుడు రాజసభనుద్దేశించి "కేశవుడు మాకు పూజనీయుడు. ఆతనిని కాదన్నవాని మస్తకమును నా పాదమున భిన్నము చేయుదును. సాహసమున్న

యెదురు రండు" అనుచూ పాదమునెత్తి గర్వముగా పలికెను. అందరూ మిన్నకుండిరి. ఆతని తలపై పుష్పవృష్టి కురియ ఆకాశవాణి సాధువచనములు పలికెను. సునీధుడను రాజుపాండవులపై యుద్ధము చేయుడని క్రోధవచనములతో రాజులను ప్రేరేపించి శిశుపాలునకు బాసటయైన, వారందరూ యజ్ఞవిఘాతము చేయ ఆలోచింపదొడగిరి.

ఆర్ఘ్యాభిహరణ పర్వాధ్యాయము

## 39. శిశుపాల వధ పర్వాధ్యాయము

క్రోధాన్వితులగుచున్న రాజసమూహమును చూచి భీతిల్లిన ధర్మరాజు తాతనుచేరి యజ్ఞ విఘాతము జరుగకుండా ఉండు విధము తెలుపుమని ప్రార్థింప భీష్ముడు "ధర్మరాజా! నీవు భీతిచెందకు. సింహము ముందు నిలచిన శునకముల వంటి ఈ రాజులు ఎట్టి అపకారము చేయలేరు. యమసదనము చేర ఉత్సుకులైరి కావుననే శిశుపాలాదులు ఇట్లు వదరుచున్నారు. సకలసృష్టికి కర్తయైన కృష్ణుడు వీరిని త్వరలోనే నాశనము చేయును" అని పలికెను.

## 40.

భీష్ముని మాటలు విని శిశుపాలుడు రక్తారుణ నేత్రుడై "భీష్మా! మమ్ములను నీ మాటలచే భయభీతులను చేయదలంచుటకు సిగ్గుపడవేల? కులదూషకా! అంధుని వంటి నిన్ననుసరించి పాండవులు అంధులవలె సంచరించుచున్నారు. వివేకశూన్యుడవు కనుకనే కేశవుని స్తుతించుచున్నావు. బురదపామును చంపి, పాము పుట్టవంటి రాళ్లగుట్టను ఎత్తి ఈతడు మీచే మహాఘనుడని పొగడబడు చున్నాడు. గో, స్త్రీ వధ గావించిన ఈ అధముని నీవెట్లు పూజ చేయమనుచున్నావు? అధర్మముగా నీవు తీసుకొని వచ్చిన కాశీరాజకన్యను సుక్షత్రియుడు కనుకనే నీ తమ్ముడు గ్రహించలేదు. నీ కన్నుల ముందే ఆతని భార్యలకు ఇతరుల వలన సంతానము కలుగుట నీ క్లీబత్వమును ఋజువు చేయుచున్నది. అపుత్రకుడవైన నీవు అధోలోకమును చేరెదవు."

## 41.

"మహాబలుడైన జరాసంధుని, ఈ కృష్ణుడు కూటనీతితో అన్యాయముగా చంపించెను" అని పలుకగా భీముడు కుపితుడై పళ్లు పటపట కొరుకుచూ ముందుకు రాగా భీష్ముడు అనునయ వాక్యములతో అతనిని శాంతింప

చేయుచుండ, శిశుపాలుడు వికటముగా నవ్వుచూ, భీముని యెడల నిర్లక్ష్య భావము చూపుచూ, "భీష్మా! అతనిని వదులుము. ఆ మూర్ఖునకు తగిన గుణపాఠము ఈ రాజలోకము దర్శించుచుండ నేర్పెదను" అని పలికి భీమసేనుని కవ్వించసాగెను.

## 42. శిశుపాలుని జన్మవృత్తాంతము

అంత భీష్ముడు, వాయునందనునితో, "భీమసేనా! ఈ శిశుపాలుడు శ్రీకృష్ణుని హస్తము చేతనే వధింపబడును. అతడు జననకాలమున నాల్గు చేతులు, మూడుకన్నులతో జన్మింప తల్లిదండ్రులు విచారింపచుండ ఆకాశవాణి, "ఈతడు ఎవనివలన సామాన్యరూపము పొందనో ఆతని చేతనే వధింపబడును" అని పలికెన. కృష్ణుని మేనత్తయైన ఈతని తల్లి కుమారుని, కృష్ణుని ఒడిలో ఉంచగానే ఈతని అనేక నేత్ర, హస్తములు మాయమయ్యెను. పితృష్వశను ఆనందపరుప కేశవుడతని నూరు తప్పులు కాతునని వరమిచ్చెను. కేశవ వరప్రాప్తి పొందిన ఈ చైధ్యాధముడిట్లు దర్పితుడై యుద్ధమునకు సన్నద్ధుడగుచున్నాడు.

## 43.

కౌంతేయా! నేడు ఇన్ని విధముల అవమానించిన శిశుపాలుని యెడల నేను పౌరుషము చూపలేదు. త్వరలోనే ఈతడు వాసుదేవుని యందు లీనమగుట తథ్యము" అని పలికెను.

## 44.

అంత శిశుపాలుడు కృష్ణునితో "నందనందనా! మతిలేని ఈ భీష్మునిచేతను, పాండవుల చేతను పొగడ్తలనందుకొనుట నీకు సిగ్గులేనితనము ప్రకటమగుచున్నది. నీవు రాజువు కావు, దాసుడవు. దుర్మతులు పూజలందుకొన అర్హులు కారు. మగటిమి కలవాడవైన నాతో యుద్ధమునకు సిద్ధుడవు కమ్ము" అని గర్జించుచూ పలుకగా వాసుదేవుడు రాజులను ఉద్దేశించి "ఓ రాజులారా! ఈ శిశుపాలుడు మా పరమశత్రువు. ఈతడు మాకు ఎల్లవేళల కీడు చేయ ప్రయత్నించుచుండును. ఈ దురాత్ముడు మా బంధువైనను, నా తండ్రి అశ్వమేధ యజ్ఞమును పాడుచేయ యజ్ఞాశ్వమును అపహరించెను. మేము లేని సమయమున ద్వారకానగరము ప్రవేశించి ఆ పట్టణమును దగ్ధము గావించెను. భద్రయను కన్యను అపహరించెను. మేనత్తకు ఇచ్చిన మాటకు బద్ధుడనై ఇంతకాలము మిన్నకుంటిని. నేడు సభా మధ్యమున ఈ కులాధముడు నన్ను అవమానించుట మీరందరూ చూచిరి. నేటితో

వీని శతాపరాధములు పూర్తియైనవి" అని పలుకుచూ కాలానల సన్నిభము, సుతీక్ష్ణమైన చక్రమును ప్రయోగింప, అది శిశుపాలుని మస్తకము ఛిన్నము చేసెను. వజ్రాహత పర్వతము వలె ఆ శిశుపాలుడు నేల కూల అందుండి తేజఃపుంజము బయలువెడలి మధుసూదనునిలో ప్రవేశించెను.

ధర్మరాజు ఆనతి ఇవ్వ ఆతని తమ్ములు తమ ఘోషనందనుని అంత్యక్రియలు జరిపించిరి.

## రాజసూయ యజ్ఞ సమాప్తి

ధర్మరాజు శిశుపాలుని పుత్రుని చేది రాజ్యమునకు రాజును చేసి, శంఖ, చక్ర, గదాహస్తుడైన వాసుదేవుడు రక్షింపుచుండ యజ్ఞమును పూర్తిగావించెను. రాజులందరూ ధర్మరాజును కీర్తించి, ఆతని అనుమతి బడసి తమ రాజ్యములకు మరలిరి. విధియుక్తముగా పూజింపబడిన బ్రాహ్మణులు తమ వాసస్థానములకు బయలుదేరిరి.

శ్రీకృష్ణుడు పాండవులవద్ద, మేనత్త కుంతి వద్ద అనుజ్ఞ బడసి, సుభద్ర, ద్రౌపదులతో ప్రియవచనములు పల్కి, గరుడకేతనముతో మనోహరమైన మేఘమపు యను రథమును దారకుడు తీసుకుని రాగా దాని నధిరోహించి ద్వారకా నగరమునకు బయలుదేరెను. పాండవులు ఆతనిని కొంతదూరము సాగనంపి నగరమునకు మరలిరి.

ఆ దివ్య పరిసరముల దుర్యోధనుడు, సుబలనందనుడైన శకుని కొంతకాలముండిరి.

శిశుపాల వధ పర్వాధ్యాయ సమాప్తి

## 45. ద్యూతపర్వాధ్యాయము

తన ఆశ్రమమునకు వెడల సన్నిద్ధుడగుచున్న వ్యాసమహర్షిని పాండవులు సత్కరించి కనకసింహాసనమున కూర్చుండజేసిన పిమ్మట ధర్మరాజు ఆతనితో, "మహానుభావా! దేవర్షియైన నారదుడు త్రివిధములైన ఉత్పాదనములు చేకూరునని తెలిపెను. శిశుపాలుని మృతితో అవి ఆగునా? మీరే మా సంశయమును తీర్పగలిగినవారు. దయచేసి తెలుపుడు" అని కోరెను.

అంత వ్యాసమహర్షి, "రాజా! దుర్యోధనుని అపరాధమున, భీమార్జునుల భుజబలమున, నీవు ఉపలష్యముగా సమస్త క్షత్రియ ఉలము నశించును.

రాజేంద్రా, పదమూడేండ్ల పిమ్మట ఇది జరుగును. దక్షిణముఖుడై వృషభారూఢుడైన పినాకపాణిని నీవు తెల్లవారుఝామున కలలో చూడగలవు. నాశనమునక అది నాందియని తెలుసుకొనుము. నీవు బుద్ధిమంతుడవు. వివేకవంతుడవు. విచారించకుము. విధిని మనము దాటలేము" అని పలికి శిష్యులతో కైలాసమునకు శంకరుని దర్శింప బయలుదేరెను.

తన మూలమున వంశక్షయము కాగలదను ముని మాటలకు ధర్మరాజు పరి పరి విధముల దుఃఖించుచూ తమ్ములను పిలచి ప్రాణత్యాగము చేయదలంచిన అర్జునుడు అన్నను అనేక విధముల ఓదార్చిన పిమ్మట, ధర్మరాజు "ఇకముందు యెవరితోను కఠినోక్తులాడనని, అందరినీ సమభావమున చూచెదనని, యుద్ధ విముఖుడనై నుందునని" ప్రతిన పూని అన్నదమ్ములతో పురము ప్రవేశించెను.

## 46. దుర్యోధనుడు మయసభలో అపహాస్యముల పాలగుట

దుర్యోధనుడు మామయైన శకునితో మయసభలోని చిత్రవిచిత్రములను చూచుచూ, జలభ్రమచే పంచెను పైకి తీసిన అది స్థలమే అయ్యెను. మరల భ్రమింపజేయుచున్నదని మోసపోయి నిజముగా పద్మశోభితమైన నీట కూలిన, భీమాదులు నవ్వసాగిరి. ధర్మరాజు వారిని ఆపి దుర్యోధనునకు కట్టుకొన మంచి బట్టలు ఇచ్చెను. విధివశమున సుయోధనుడు ద్వారమున్న ప్రాంతమున లేదనుకొని తడబడియు, ఉన్నచోట లేదనుకొని గ్రుద్దుకొనియు పదే పదే భీమాదుల అపహాస్యములకు పాలై అవమానము పొంది, యుధిష్ఠిరుని అనుమతి బడసి హస్తినా నగరమునకు బయలుదేరెను.

నిజభవనము చేరిన దుర్యోధనుడు పాండవుల వైభవ, ఔన్నత్యములకు, తనకు జరిగిన అవమానమునకు కుందుచూ, విషాదవదనుడై, మౌనము వహించియుండ, శకుని అతని చేరి కారణమడుగగా, "మామా! ధర్మరాజు చేసిన యాగమున కృష్ణుడు శిశుపాలుని వధించునెడ, ఆతనికి ఎదురునిలుచు జోదు ఒక్కడైనను లేకపోయెను. ఆతని అండతో పాండవులకు సమస్త రాజన్యులు భృత్యులవలె కానుకలర్పించి తమ ప్రాణములను కాపాడుకొనిరి. ఆ పాండవుల ధనసంపత్తియు, వారి యజ్ఞానుష్టానము చూసిన పిమ్మట సంతాపము చెందకుండ యెట్లుండగలను? ముఖ్యముగా వారి రాజ్యలక్ష్మిని వశము చేసుకొందుమన్న నాకు సామర్థ్యముగాని, సహాయకులుగాని లేరు. ధర్మరాజు యొక్క రాజ్యలక్ష్మిని నిరీక్షించిన పిమ్మట దైవమే ప్రధానమని, పౌరుషము నిరర్థకమని తెలియుచున్నది. నేను ఎవరిని సర్వనాశనము చేయ సమకట్టితినో వారు దైవబలమున అత్యున్నతు

లగుచున్నారు. పౌరుషమే అవలంబితులమైన మేము హీనుల మగుచున్నాము. అన్నింటికన్నా ముఖ్యముగా ఆ మయసభలో నాకు జరిగిన అవమానము తలంపునకు వచ్చినపుడు శరీరము జర్జరితమై అవశమగుచున్నది. అవమానభరితమైన ఈ జీవితము గడుపుట కన్నా మరణమే మేలు. ప్రాణ పరిత్యాగము చేయ నాకు అనుమతి ఇమ్ము. దీనుడైన దుర్యోధనుడు మీకు మోము చూపలేకపోయినందులకు క్షమింపుడని నా తల్లిదండ్రులకు తెలుపుము.”

## 47.

ఇట్లు అభిమానధనుడైన దుర్యోధనుడు పలుకగా శకుని, “దుర్యోధనా! పాండవులు తమ భాగమైన రాజ్యమును పాలించుచుండ నీవు క్రోధాన్వితుడవగుట తగదు. నీవు అనేకవిధముల వారిని చంపించదలచినా వారు తమ సుకృతముచే ద్రౌపదిని, అర్ధరాజ్యము పొంది పుత్రాదులతో సుఖముగా ఉన్నారు. దానికి నీకు విచారమేల? అర్జునుడు గాండీవము, అక్షయ తూణీరములు పొంది తన బాహుబలమున రాజులను జయింప నీకు దుఃఖమేల? అగ్నినుంచి రక్షించినందున మయుడు చక్కని సభను నిర్మించి ఇచ్చిన నీకు అసూయ యేల? నాకు సాయపడువారు లేరని నీవెందులకనుకొనుచున్నావు? భీష్మ, ద్రోణ, కృప, కర్ణ, అశ్వత్థామాదులు నీకు బాసటయై లేరా? నీవు కూడా వారి సహాయమున అఖండ భూమండలమూ జయింపజాలవా?” అని ఓదార్చెను.

## జూదమాడ శకుని దుర్యోధనుని ప్రోత్సహించుట

“అటులైన నేడే పాండవులపై దండెత్తి వారిని ఓడించి రాజ్యమును, ధనమును వశము చేసికొందును” అని సుయోధనుడు పలుక శకుని “రాజా! అర్జునుడు, భీముడు, ధర్మరాజు, నకులుడు, సహదేవుడు, కృష్ణుడు, ద్రుపదుడు మొదలైన వారందరూ మహారథులు. నీవే కాదు, దేవతలైనను వారిని రణమున జయింప జాలరు. రక్తపాతము జరుగకుండా యుధిష్టిరుని జయింపు మార్గము తెలిపెదను వినుము.

జూదమనిన ధర్మరాజునకు ఆసక్తి మెండు. కాని నైపుణ్యము తక్కువ. ఆహ్వానించిన తప్పక ఆతడు ద్యూతక్రీడకు వచ్చును. నేను అక్షక్రీడయందు చతురుడను. త్రిభువనములందును నన్ను మించినవారు లేరు. కావున నీవు ఆతనిని జూదమాడ పిలిపించిన నేను నా పాటవము చూపి, ఆతని రాజ్యలక్ష్మిని హరించి నీకు ఇచ్చెదను. ముందుగా మీ నాన్నగారి అనుమతి పొంది

కార్యసన్నిధుడవు కమ్ము” అని ప్రోత్సహించిన దుర్యోధనుడు ఆతనినే తండ్రికి సంగతి తెల్పుమని ప్రార్థింప ఆతడు అంగీకరించి, సుయోధనుడు తోడు రాగా ధృతరాష్ట్రుని చేరెను.

## 48.

వైశంపాయనుడిట్లనెను. “సుబలనందనుడు ధృతరాష్ట్రుని చేరి, “మహారాజా! దుర్యోధనుడు కృశశరీరుడై, చింతాన్వితుడై, దీనవదనుడైయున్నాడు. మీరాతని యోగక్షేమములను విచారింపక మిన్నకుండుట తగునా?” అని పలుక ధృతరాష్ట్రుడు కుమారుని పిలచి కారణమడుగగా అతడు రాజసూయ యాగ వైభవము, పాండవుల ఔన్నత్యము తెలిపి దానివలననే తను నిద్రాహారముల గ్రహింపలేక అశాంతితో కుములుచుంటినని తెలిపెను.

అంత శకుని ధృతరాష్ట్రునితో తన ద్యూతక్రీడా నైపుణ్యము తెలిపి, ధర్మజుని ఆహ్వానించిన ఆతనిని ఓడించి రాజ్యహీనుని చేతునని, అనుజ్ఞ ఇమ్మని కోరెను. అతడు అంగీకరించి క్రీడామందిరము నిర్మింప ఆజ్ఞనిడి, సందేహచిత్తుడై మంత్రియైన విదురుని పిలిపించి, సంగతి తెలిపిన అతడు ద్యూతక్రీడ అన్నదమ్ముల మధ్య శత్రుత్వము కలుగజేయునని తెలిపినను, తాను, భీష్మ, ద్రోణాదులుండ కలహములు జరుగవని, కావున త్వరితముగా బయలుదేరి ధర్మరాజుని ఆహ్వానింపుమని ధృతరాష్ట్రుడు ఆనతిచ్చిన, విషాదవదనుడై విదురుడు భీష్ముని మందిరమునకు వెడలెను.

## 49. తండ్రివద్ద సుయోధనుడు మరల దుఃఖించుట

ద్యూతక్రీడకు యెవరెవరు వచ్చిరి, అది యే విధముగా జరిగెనో దయచేసి తెల్పుడని జనమేజయుడడుగ వైశంపాయనుడిట్లు చెప్పదొడగెను.

ధృతరాష్ట్రుడు కుమారుని పిలచి “నాయనా! కురువంశమున మహామణిమంతుడైన విదురునకు ఈ ద్యూతక్రీడ జరుగుట ఇష్టము లేదు. అతని మాటప్రకారము నడచుకొనుట మనకు మంచిది. సర్వసుఖములను అనుభవించుచున్న నీవు పాండవులపై అసూయ చెందుట యెందులకు? ఈ కార్యమునుండి పరాఙ్ముఖుడవు కమ్ము” అని పలుకగా దుర్యోధనుడిట్లనెను.

“తండ్రీ! జంతుజాలమువలె పొట్టనింపుకొని మహానందమున ఉంటిమని తలంచుట మేలా? పాండవులు దేదీప్యమాన రాజ్యలక్ష్మిని పొంది ఉన్నతు

లగుచుండ పాషాణ హృదయుడవై జీవించుచుంటిని. ధర్మరాజు నన్ను రాజుల కాన్కలను గ్రహింపుమని నియోగింప, ఆ అతులిత ధనరాసులు గ్రహింపుచూ నా భుజములు నొప్పి పెట్ట, ఆ రాజులే వేర్వేరు స్థలములనుంచ నేను సిగ్గుపడితిని. ఆ అతులనీయమైన మయసభలో నేను భ్రమపడి నీటపడగా, ఆ దుష్ట భీమాదులు, ద్రౌపది నన్ను చూసి నవ్వసాగిరి. నిర్గత ద్వారము తెలియక మోసపోయి నా నుదురు బొప్పికట్టి రక్తము కార వినయము నటించుచూ సహదేవుడు ద్వారదేశమును చూప, భీముడు 'అటు కాదు ఇటు' అని మరియొక దిశ చూపి నవ్వసాగెను. నాటి నా దీనదశ తలంచికొనిన శరీరము కంపించుచున్నది.

## 50, 51, 52.

పాండవుల ఔన్నత్యము, మా హీనదశ చూసి దేహత్యాగము చేయ ఇచ్ఛ కలిగినను, ఆత్మహత్య మహాపాతకమని తాళియున్నాను. తండ్రివైన నీవు నా దీనదశ గుర్తించి కర్తవ్యము విచారింపుము."

## 53. ధృతరాష్ట్రుని ఉపదేశము

"వత్సా! ద్వేషము మనుజుని నాశనము చేయును. నీవు నా జ్యేష్ఠుడవు. నా మేలు కోరువాడవైన నా మాటలు వినుము. పాండవులతో వైరము మానుము.

యజ్ఞమే చేయదలచిన సప్తతంతు యజ్ఞము చేయుము. రారాజులందరూ నీ చెంత చేరి కానుకలర్పింతురు. ఇతరుల ధనము అపేక్షించుట తగదు. నీకు కలిగినదానితో తృప్తి పడుము. తృప్తిలేనివానికి ఎన్నడూ సుఖము లభింపదు.

కుమారా! పాండవులకూ, నీకు తాత యొకడే అన్న సంగతి మరచితివా? నీ బాహువుల వంటి పాండవులను నరికెదననకుము. వారు నీ అన్నదమ్ములు, మిత్రులు. మిత్రద్రోహము చేయుట మహాపాతకము. ఇష్టులతోను, బంధు బాంధవులతోను సుఖముగా కాలము గడుపుము" అని ధృతరాష్ట్రుడు పలుకగా, దుర్యోధనుడిట్లనెను.

## 54.

"తండ్రీ! సర్వము తెలిసిన మీరే ఇలాగ ఎందుకంటున్నారో నాకు అర్థము కావడం లేదు. మాకు సరియైన దారి చూపవలసిన మీరే దారి తప్పిన ఇక మాకు మరణమే శరణ్యము. పుత్రుల క్షేమమును కాంక్షింపక అడ్డుపడుచున్నారు.

లోక వ్యాపారము, రాజనీతి వేరని బృహస్పతి తెలుపలేదా? ధర్మమైనా అధర్మమైనా క్షత్రియులు జయము కాంక్షించి ప్రవర్తింపవలెను కదా! వీరు శత్రువులు, వీరు మిత్రులు అని లిఖితముగా ఉన్నదా? మనకు సంతాపము కలుగజేయువారందరూ శత్రువులే. వారిని ఎట్టి ఉపాయము చేతనైనను వధించుట మీ కర్తవ్యము. అసంతోషమే సమృద్ధి ప్రయత్నములకు మూలము కదా! ఇతరుల ధనము కాంక్షించని దేవేంద్రుడు నముచుని సంహరింపలేదా? ఒకే ధర్మము అనుసరించువారు ఒకరికొకరు శత్రువులు కారా? ఉన్నతి పొందుచున్న శత్రువును ఉపేక్షించిన, ఆ శత్రువు మనని నిరూప్మలము చేయక మానునా?

ఓ రాజా! శత్రువుల ఉన్నతికి మీరు యెట్లు హర్షించుచున్నారో నాకు అర్థమగుట లేదు. పాండవుల రాజ్యలక్ష్మిని అపహరించి ఆనందముగా జీవితము గడుపుటయో లేక శరీరత్యాగము చేయుటయో రెండే మార్గములు. ఇక మీరు మీ ఇష్టానుసారము చేయుడు" అని పలికెను.

## 55.

శకుని మరల జూదమందలి నైపుణ్యము తెలుపగా దుర్యోధనుడు తండ్రిని పాండవులను జూదమునకు పిలువ అనుమతి కోర అతడు విదురుని అడిగి తెలిపెదననిన శకుని "రాజా! విదురుడు పాండవ పక్షపాతి అని మీకు తెలియదు. అతడు ఎంతమాత్రము ఈ కార్యమునకు సమ్మతింపడు. మంచిపని చేయునప్పుడు ఇతరుల బుద్ధిబలముపై ఆధారపడి నడుచుట మంచిది కాదు" అని పలికెను.

బలవంతులైనవారితో శత్రుత్వము కలుగునని భయపడుచుండిన తండ్రికి దుర్యోధనుడు సాహసవాక్యముల పలుక ధృతరాష్ట్రుడు అంగీకరించెను.

ధృతరాష్ట్రుని ఆజ్ఞపై చక్కని వేయిస్తంభములు, వజ్రవైడూర్య ఖచితమైన నూరు ద్వారములు కలిగిన తోరణస్ఫటికమను ద్యూత సభ నిర్మింపబడెను. ధృతరాష్ట్రుడు విదురుని పిలిపించి ద్యూతక్రీడకు ధర్మరాజును ఆహ్వానింపుమని ఆజ్ఞ ఇడెను.

## 56.

విదురుడు జూదము వలన అనర్థములు కలుగునని, స్నేహము నశించునని, కులక్షయము కావచ్చునని సందేహమ ప్రకటించిన ధృతరాష్ట్రుడు మనము విధిని తప్పింపలేము. కానున్నది కాక మానదు. నీవు నీ కర్తవ్యమ నెరవేర్పుమని పంపెను.

## 57. పాండవుల వద్దకు విదురుడు వచ్చుట

ధృతరాష్ట్రుని ఆనతిపై విదురుడు రథారూఢుడై ఇంద్రప్రస్థము చేరెను. ధర్మరాజు ఆతని ఆదరించి, పూజార్చనలు కావించి ఆసీనుని చేసి విచారవదనుడైన విదురునితో "మహానుభావా! మీ ముఖము మలినమై ఉన్నది. ధృతరాష్ట్రుడు మొదలైన పెద్దలు, దుర్యోధనాది తమ్ములు, అందరూ క్షేమముగా ఉన్నారా?" అని ప్రశ్నించెను.

"ధర్మరాజా! ధృతరాష్ట్రుడు అతని కుమారులు కుశలమే. అతడు ద్యూతసభ నిర్మించి నన్ను పంపెను. 'తమ్ములతో నీవు వచ్చి సభను అలంకరించి ఆనందముగా సమయము గడుపుము' అని నన్ను చెప్పమనెను.

యుధిష్టిరా! జూదము సర్వనాశ హేతువు. నీకు ఉచితమైన విధముగా చేయుము" అని విదురుడు పలుకగా, ధర్మరాజు అచ్చటకు చనుట మేలా? అని అడిగెను. విదురుడు తన ఉపదేశము ధృతరాష్ట్రుడు వినలేదని పలుకగా ధర్మరాజు, జూదము హేయమైనదైనను, శకుని మాయాజూద నిపుణుడైనను పిలిచిన వెనకాడనని తన ప్రతిజ్ఞ తెలియజేసి ఆహ్వానమును అంగీకరించెను.

మరునాడు ధర్మరాజు ద్రౌపది మొదలైన స్త్రీలతోను, తమ్ములతోను, విదురుని తోడను, వివిధ వాహనముల నధిరోహించి హస్తినా నగరమునకు బయలుదేరెను. గమనకాలమున అతడు కళ్లు వెల్తురును చూడలేకుండా చేయునట్లు విధి బుద్ధిని అపహరించును. అందరూ విధికి వశవర్తులే కదా!" అని పలికెను.

ధర్మరాజు సబాంధవముగా హస్తినా నగరము చేరి భీష్మ, ద్రోణ, కర్ణ, అశ్వత్థామ, సోమదత్త, దుర్యోధన, శల్య, సుబల, దుశ్శాసనాదులను కలసుకొని, ధృతరాష్ట్రునిచే ఆదరింపబడి, గాంధారికి అభివాదనములు తెల్పెను. కౌరవులు పాండవుల రాకకు మనస్సులో ఆనందించి, వారి వైభవము చూసి ఈర్ష్యాన్వితులైరి.

పాండవులు తమ తమ విడుదులకేగి, వ్యాయామమాచరించి, స్నానములు చేసి, దివ్యచందనాదులు లేపనము చేసుకొని భోజనానంతరము రాత్ర సుఖముగా నిద్రించి, తెల్లవారుఝామున వందిమాగధులు పొగడుచుండ మేల్కొని, ఆహ్నిక క్రియలాచరించి రమణీయమైన సభామంటపము ప్రవేశించిరి.

## 58. ద్యూతక్రీడారంభము

వైశంపాయనుడు ఇట్లనెను. తదనంతరము పాండవులు ధర్మరాజు ముందు నడువ సభ ప్రవేశించి తమ తమ ఆసనముల నధిష్ఠింప శకుని ధర్మరాజుని చేరి

"మేము నీ గురించే యెదురుచూచుచున్నాము. ఇక ఆట ప్రారంభించుట మేలని తోచుచున్నది" అని పలుక ధర్మరాజు "కపట ద్యూతక్రీడ నీచమైనది. నీవెందులకు ప్రోత్సహించుచున్నావు. నీచునివలె మమ్ము మాయాక్రీడ సలిపి ఓడింప ప్రయత్నింపకుము" అని హెచ్చరిక చేసెను.

"నిపుణుడైన క్రీడాకారుడు ఎన్నడూ పరాజితుడు కాడు. వెనుకంజ వేయకుము" అని శకుని మరల పలుకగా ధర్మరాజు "ధూర్తునితో జూదమాడుట తగని పని. కపటయుద్ధము సత్పురుషులకు తగని కార్యము. అందువలన జూదమాడుట మంచిది కాదు" అని పలికెను.

అంత శకుని "ధర్మజా! నీవు నన్ను ధూర్తునిగ పరిగణించిన, జూదమనిన భీరుడవైన, ఈ క్రీడనుండి నిరతుడవగుము" అని ఎత్తి పొడిచెను.

ధర్మరాజు తాను జూదమునకు పిలువబడిన తప్పక అంగీకరింతునని పలికి యెవరెవరు ఆడెదరనిన దుర్యోధనుడు "పందెము నేను కాతును. మామ శకుని నా పక్షమున ఆడును" అని తెలుపగా ధర్మరాజు ఇది అసంగతమైన విషయమని పలుకుచూ ఆటకు సిద్ధమయ్యెను.

క్రీడ ఆరంభమగునప్పటికి అచ్చటకు ధృతరాష్ట్రుడు, భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మొదలైనవారందరూ ప్రవేశించి తమ ఆసనములలో కూర్చుండిరి.

ధర్మరాజు ముందు తన మెడలోని మణిమయ హారమును పందెముగా నొడ్డెను. శకుని ఛలపూర్వకముగా పాచికలు వైచుచూ "ఇదిగో నేనే గెలిచాను" అని పలికెను.

## 59

ఇట్లు ధర్మరాజు సువర్ణము, దాసదాసీజనము, రథ, తురగాదులు ఓడిపోసాగెను.

## 60. విదురుని ద్యూతక్రీడా తిరస్కారము

అంత విదురుడు ధృతరాష్ట్రునితో "మహారాజా! సర్వనాశనకారిణియైన ఈ జూదమును ఆపుడు. దుర్యోధనుని రూపమున గోమాయువు నీ గృహమున వశించుచున్నది. నీవు మోహవశుడవై అది తెలుసుకొనలేకపోవుచున్నావు. రాజా! దుర్యోధనుడు జూదమను సురను త్రాగి మత్తుడై ఉన్నాడు. దుష్టుడైన వీనిని పరిత్యజించు. పాండవులకు కీడుచేయ సమకట్టకు. వంశ నిర్మూలనమునకు కారకుడవు కాకుము.

## 61.

జూదము కలహమునకు మూలము. ప్రేమలు నశించును. ఇది మహా భయమునకు హేతువు. దుర్యోధనుడు భయంకరమైన శత్రుత్వమును పుట్టించు చున్నాడు. కపటియైన శకునిని ఆట ఆడకుండా ఆపి, అతని దేశమునకు పంపించు. పాండవులతో యుద్ధము కాకుండా ఆపు" అని పలికెను.

## 62. దుర్యోధనుడు విదురుని అవమానించుట

అంత దుర్యోధనుడు విదురునితో "నీవు పాండవ పక్షపాతివి. వారి గుణ గానము చేయుటయే నీ పని. దయచేసి ఇక మమ్ము యేమీ తెలియని శిశువులవలె లెక్కించి మాటలాడకు. నీవు మా ఉప్పు తింటూ మా విరుద్ధముగా పలుకుటకు సిగ్గుపడవేల? నేను శాంతమూర్తిని కనుకనే నిన్ను ఇంతకాలము క్షమించితిని. నీకు మా పనులు ఇష్టము లేనిచో నీ ఇచ్ఛ వచ్చిన స్థలమునకు చనుము కాని ఉపదేశము చేయ తలపడకుము" అని తిరస్కార పూర్వకముగా పలికెను.

"రాజకుమారా! అల్పమైన మాటకు మిత్రులను వదులుకొను వ్యక్తి ఎన్నడూ ఉన్నతి చెందదు. రాజుల చిత్తవికారములు నాకు తెలియనివి కావు. మందమతివైన నీవు ప్రియవాక్యములు పలుకుచున్నవారు స్నేహితులని నమ్ముచున్నావు. అప్రియములైనను సత్యమును పలుకువాడే మిత్రుడని తెలుసుకొనుము. మీ మంచి కోరువాడను కనక చెప్పితిని. మీకు ఇష్టము లేకపోయిన ఇవే నా నమస్కారములు. నీ చిత్తము వచ్చినట్లుగా ప్రవర్తించుము" అని విదురుడు పలికెను.

## 63. ధర్మరాజు పరాజయము

ధర్మరాజు సమస్త ఐశ్వర్యమును ఓడిన పిదప క్రమముగా నల్గురు తమ్ములను, తదుపరి తనను తాను పణముగా ఒడ్డి ఓడిపోతాడు.

ఆఖరిగా ధర్మపత్నియైన ద్రౌపదిని పణముగా ఉంచగానే సభాసదులు అందరూ అతని యెడల ధిక్కార వాక్యములు పలుకసాగిరి. సభయంతయు నిశ్శబ్దమయ్యెను. భీష్మ ద్రోణాదులు శరీరమునుండి ఘర్మరాశి నిర్గతమవసాగెను. విదురుడు అధోముఖుడై దీర్ఘనిశ్వాసములు వదులసాగెను. ధృతరాష్ట్రుడు ఆనందము పట్టలేక 'జయము లభించినదా? జయము లభించినదా?' అని పదే పదే అడుగసాగెను. కర్ణ, దుశ్శాసనుల ఆనందమునకు అడ్డులేదు. అహంకారమత్తుడైన శకుని 'ఇదిగో గెలిచే'నని పాచికలు వైచిన అతడే విజయము పొందెను.

## 64

ఆనందముతో దుర్యోధనుడు విదురునితో "ఖత్తా! పాండవపత్ని ఇక మా దాసి. దాసి పని చెయ్యడానికి ఆమెను వెంటనే తీసుకొని రావలసినది" అనగా విదురుడు "మూఢుడా! నీ బుద్ధి నశించినది. కాలభుజంగములను రెచ్చగొట్టి మృత్యుముఖమును చేరకుము. పండితులైనవారు కఠోక్తులతో ఇతరుల మనస్సు కష్టపెట్టరని తెలుసుకొనుము. నీవలె పాండవులెన్నడూ ఒకరిని చెడ్డమాటలనలేదు. వారితో వైరము తెచ్చుకొనకు" అని దుర్యోధనుని మందలించెను.

## 65. దుర్యోధనుడు ద్రౌపదిని తీసుకొనిరమ్మని దూతను పంపుట

దుర్యోధనుడు విదురుని ధిక్కరించుచూ ప్రతీకామిని పిలచి ద్రౌపదిని పిలిచికొని రమ్మని పంప అతడు అంతఃపురమున ద్రౌపదిని చేరి "ఓ ద్రుపదనందినీ! ధర్మరాజు జూదమున నిన్ను పణముగా ఒడ్డి, దుర్యోధనునితో ఓడిపోయేడు. నీవు ధృతరాష్ట్ర భవనము చేరి దాసివలె పనిచేయ నన్ను పిలువనంపిరి" అని పలుకగా ద్రౌపది, "మూఢుండా! పణముగా ఒడ్డ ఇతరములేవియూ లేవా? నీవు ప్రలాపములు పలుకుచున్నావు" అని పలుక అతడు ధర్మరాజు సర్వమూ ఓడిన సంగతి తెలుపగా యజ్ఞసేని "సూతాత్మజా! ధర్మరాజు తన్నోడి నన్నొడ్డెనా? నన్నోడి తన్నొడ్డెనా? తెలుసుకొనిరమ్ము" అని తిరిగి పంపిన అతడు సభకు తిరిగి వచ్చి ధర్మరాజునకు సంగతి తెలుప అతడు మిన్నకుండెను. అంత దుర్యోధనుడు "ప్రతీకామీ! నీవు ఆమెను సభకు తీసుకొని రమ్ము. ఆమె ఇచటనే ధర్మజుని జవాబు వినగలదు" అనిన ప్రతీకామి ద్రౌపదికి ఈ వార్త ఎరింగించిన ఆమె "విధాత ఇట్టి దశ మా నుదుట వ్రాసినట్లున్నది. కాని మేము ధర్మము ననుసరించి చరించుదుము. నీవు కురుసభలో సభ్యులను ఈ పరిస్థితిలో నేనేమి చేయవలెనో నిర్ణయింపుమనుము. నేను వారి ఆజ్ఞానుసారము ప్రవర్తింతును" అనిన ప్రతీకామి సభ్యులకు తెలియజేసిన వారు శ్రవణానంతరము అధోముఖులై ఉండిరి. దుర్యోధనుని ఆగ్రహమునకు భయపడి ఎవ్వరూ నోరు విప్పలేదు. దుర్యోధనుని అభిప్రాయము పోల్చుకొనిన ధర్మరాజు దూతను పంపి, యేకవస్త్ర, రజస్వలగా రోదనము చేయుచూ రమ్మని కబురు పంపెను.

దుర్యోధనుడు ప్రతీకామితో ద్రౌపదిని సభలోనే విషయముల తెలిసికొన తెల్పుమని పలికిన,, ద్రౌపదికి భయపడిన సూతుడు మరల సభాసదులను 'పాంచాల రాజకన్యకు యేమి తెల్పుమనెదరు?' అని ప్రశ్నించెను.

## దుశ్శాసనుడు ద్రౌపదిని సభకు ఈడ్చుకొనివచ్చుట

ప్రతీకామి భయపడుట గ్రహించిన దుర్యోధనుడ తమ్మునితో "దుశ్శాసనా! ఈ నీచకులజుడు భయపడుచున్నాడు. నీవు వెంటనే పాంచాలిని ఇచ్చటకు తెమ్ము" అని పంపెను.

అన్నమాట వినగానే, దురాత్ముడైన దుశ్శాసనుడు, రక్తారుణ నేత్రుడై పాండనికేతనము చేరి ద్రౌపదితో "పాంచాలీ! నిన్ను ధర్మరాజు జూదమున ఓడిపోయాడు. నేటినుండి నీవు మా దాసివి. లజ్జను వీడి నీ పనుల చేయ సభ ప్రవేశింపుము."

భీతి చెందిన ద్రౌపది కౌరవస్త్రీలను చేరబోవ దుశ్శాసనుడు ఆమె శిరోజములు పట్టుకొని వికటముగా నవ్వెను.

రాజసూయ యాగమున మంత్రపూత జలముతో సిక్తములైన ఆమె కుంతలములు నేడు దుశ్శాసనుడు బలపూర్వకముగా గ్రహించి సభలోనికి తీసుకొనిపోవుచుండగా ద్రౌపది తాను రజస్వలనని, యేకవస్త్రనని పలుకుచున్నను ఆ దుర్మార్గుడు నీవు వివస్త్రవైనను, నిర్జితవు కనుక, మా దాసివై యుండవలసినదే అని కటువాక్యములు పలికెను. ద్రౌపది దుఃఖముతో 'కృష్ణా! అర్జునా!' అని పిలచుచూ "దురాత్ముడా! గురుజనుల వద్దకు ఇట్టి దశలో నేను కనబడుట ఉచితము కాదు. పాండవులు ధర్మబద్ధులై ఉన్నారు గాని నీ కార్యమునకు క్షమించరు. నీ చర్యను నిందింపని వీరందరూ ధర్మమును వదలినట్లున్నది. భీష్మ ద్రోణాదులు కూడా శక్తిహీనులైనారు. భరతవంశమున ధర్మము నిలుప్తమైనది."

దీనముగా ఇట్లు రోదించుచూ ద్రౌపది భర్తలను కోపముతో చూచెను. వివిధములైన బహుమూల్య రత్నసముదాయము, రాజ్యము పోయినను, తాము దాసులైనను విచారించకపోయినా, దుశ్శాసనుడు ద్రౌపదిని 'దాసి, దాసి' అని సంబోధించుచుండ పాండవులు విచారముతోను, క్రోధముతోను రక్తారుణనేత్రులైరి. రాధేయుడు దుశ్శాసనుని ప్రశంసించుచుండ, శకుని వికటముగా నవ్వసాగెను.

ఆ సమయమున భీష్ముడు ద్రౌపదిని సంబోధించి "సౌభాగ్యవతీ! ఇతరుల వశీభూతుడైన వ్యక్తి పరుల ధనము పణముగా ఉంచజాలడు కాని స్త్రీ భర్త ధనము. ఈ రెండును సమానమైనవి కనుక నిర్ణయింప అసమర్థుడను. ధర్మరాజు సర్వము కోల్పోయినా, ధర్మమును వీడడు. అతడే నిర్ణయింప సమర్థుడు. శకుని మాయాద్యూత విశారదుడైనను ధర్మరాజు అతనితో ఆడి, స్వయముగా నీ

అవమానమును చూచుచూ ఉపేక్ష వహించియున్నాడు. అందులకు నీ ప్రశ్నకు జవాబు ఇవ్వలేకపోవుచున్నాను.”

ద్రౌపది “దుర్మార్గులైన కౌరవులు, శకుని మాయతో ద్యూతక్రీడయందు ఇచ్ఛలేని ధర్మరాజుని వంచించిరి. సభాసదులైన కురువంశీయులు తమ పుత్ర వధువులను మనస్సున ఉంచుకొని నా ప్రశ్నకు జవాబు ఇవ్వవలసినదని కోరుచున్నాను.”

## 66.

దురాత్ముడైన దుశ్శాసనుడు ద్రౌపదితో అప్రియ పరుష వాక్యములు పలుకుచుండ ఆమె దీనదశను చూసి భీముడు అత్యంతకపితుడై అన్నతో “యుధిష్టిరా! ద్యూతక్రీడాసక్తులు ఎటువంటివారైనన తమ అధీనులైన వేశ్యలనైనను దయదలచి పణముగా వారిని వాడరు. నీవు మన సకల ఐశ్వర్యములు కూడా జూదమందు ఓడినా నేను మాటాడలేదు. నీవు మా అధీశ్వరుడవని మమ్ము పణముగా ఒడ్డినా అడ్డు పలకలేదు. కాని నీవు పాంచాలిని పణముగా ఒడ్డి క్షుద్రులైన ఈ క్షుద్రులైన ఈ కౌరవులచే ఆమెను అవమానించుట నేను సహింపజాలను. నీ హస్తములనిపుడే భస్మము గావించెదను. సహదేవా వెంటనే అగ్నిని సిద్ధము చేయుము” అని క్రోధముతో వచింప అర్జునుడు, “భీమసేనా! నీవు ఇటువంటి దుర్వాక్యములను అన్నతో ఎన్నడూ అనలేదు. శత్రువులు మనను ధర్మభ్రష్టులను చేయ ప్రయత్నించుచున్నారు. నీవు వారి మనోవాంఛ పూర్తి చేయకుము. ధర్మరాజు క్షత్రియోచితమైన విధముగా జూదమాడెను. నీవు శాంతి వహింపుము” అని ఆతనిని శాంతింపజేసెను.

## ద్రౌపదిని పణముగా ఒడ్డు విషయమై వికర్ణుని ప్రశ్న

విచారముతో అధోముఖులై ఉన్న పాండవులను, భీతితో వణకుచున్న ద్రుపదకన్యను చూచి ధృతరాష్ట్ర నందనుడు, వికర్ణుడు ఆసనము నుండి లేచి సభికులను ఉద్దేశించి “రాజులారా! యాజ్ఞసేని వచనములకు ప్రత్యుత్తరము ఇవ్వక మిన్నకుండుట న్యాయము కాదు. కురువృద్ధులైన భీష్మ, ధృతరాష్ట్ర, విదురులారా! మీరైనా న్యాయము తెల్పుడు. ద్రోణ, కృపాచార్యాదులు మౌనము వహించి యున్నారేల?” అని సభికులను పదే పదే ప్రశ్నించినను యెవ్వరూ మారుపల్కరైరి. అంత వికర్ణుడు దీర్ఘనిశ్వాసములతో చేతులు కలిపి “మీరెవ్వరూ మారు పలికినా, మానినా, నేను న్యాయమని నమ్మినది తప్పక పలికెదను. పండితులు పల్కినట్లుగా

రాజులకు వ్యసనములు నాలుగు. వేటాడుట, సురాపానము, జూదము, సహజముగా లభింపని వస్తువులయందు ఆకాంక్ష. వీటియందు అనురక్తులయిన వారు వివేకశూన్యులగుదురు. అట్లగుట వలననే ధర్మరాజు పాంచాలిని పణముగా ఒడ్డేడు. ముఖ్యముగా ఆమె పాండవులందరి సహధర్మచారిణి. తనను తానోడిన ధర్మరాజును శకుని ప్రోత్సహించి ద్రౌపది పేరు వచించిన పిమ్మటనే ఆమెను పందెముగా ఒప్పుకున్నాడు. ఇవి అన్నీ ఆలోచించిన ద్రౌపది జయలబ్ధయని ఒప్పుకొనను" అని గంభీరముగా పలుకగా సభికులు యేకవాక్యమున వికర్ణుని ప్రశంసించి శకునిని ధిక్కరించుచూ హర్షనాదములు చేసిరి.

అంత కర్ణుడు, "వికర్ణా! నీవు బాలస్వబావమున ఇట్లనుచున్నావు. భీష్మాది ప్రముఖులు ద్రౌపది పణమున ఓడింపబడినది కావుననే ఊరకున్నారు. స్వయముగా ధర్మరాజు మౌనమును కూడా నీవు గ్రహింపలేవా? ఆమె యేకవస్త్ర యందువా? ఒకే భర్తతో నుండవలసిన స్త్రీ పలువురతో కూడిన వేశ్యయైనదని తెలియదా? వేశ్య యేకవస్త్రయైనను, వివస్త్రయైనను తప్పేమి? అదేకాక ధర్మజుడు తన సర్వస్వమును ఒడ్డి పందెము కాచి ఓడిన ఆమె అతని సర్వస్వములో భాగము కాదా? వారి వస్త్రాదులు కూడా జయింపబడినవి కావా?" అని పలికిన, కర్ణుని మాటలు విని పాండవులు తమ ఉత్తరీయ స్త్రములను తీసి సభామధ్యమున కూర్చుండిరి.

## ద్రౌపదీ మానసంరక్షణ

అంత సభమధ్యమున దుశ్శాసనుడు ద్రౌపది పరిధానము విప్ప సమకూడిన యాజ్ఞసేని, "గోవిందా! ద్వారకావాసా! గోపీజనవల్లభా! జనార్ధనా!" అని ఆ దేవదేవుని పరిపరి విధముల తన మానము కాపాడమని ప్రార్థింపసాగెను. అధోముఖియై, దీనయై దుఃఖించు ఆ కామిని రోదనము విని ఆర్తత్రాణ పరాయణుడై నానావిధ వస్త్రములతో ద్రౌపదిని ఆచ్ఛాదితను చేయ దుశ్శాసనుడు ఎన్ని వలువలను విప్పినా తరుగకుండెను. ధర్ముని మహిమ అనిర్వచనీయము కదా! ధర్మప్రభావమున నానారాగరంజిత వసనములు క్రమక్రమముగా ప్రాదుర్భూతమయ్యెను. అది చూచి సభయందు కలకలము రేగి, మహీపాలురు దుశ్శాసనుని నిందించుచూ ద్రౌపదిని ప్రశంసించసాగిరి.

## దుశ్శాసనుని రక్తపానము చేయ భీముడు ప్రతిజ్ఞ చేయుట

రాజన్యుల మధ్య కూర్చొని యున్న భీముడు కనుబొమలు ముడిపడ, పళ్లు పట పట కొరుకుచూ, రక్తారుణ నేత్రుడై చేతితో భూమిని తట్టుచూ "ఓ

భూపతులారా! నా భీషణ ప్రతిజ్ఞను వినుడు. ద్రౌపదినిట్లు అవమానపరిచిన ఖలుడు, దుశ్శాసనుని, లోకభీకరముగా రణాంగమున వధించి, ఆతని వక్షస్థలము చీల్చి రక్తమును త్రాగనేని పితృపురుషుల గతి తప్పినవాడనగుదును" అని భీషణమైన ప్రతిజ్ఞను చేయ సభికులు హర్షనాదములు చేసి ఆతనిని ప్రశంసించిరి.

కృతకృత్యుడు కాలేని దుశ్శాసనుడు సిగ్గుతో తన ఆసనమున కూర్చుండ, అందరూ అతనిని, అతనిని వారింపక ఊరకుండిన ధృతరాష్ట్రుని నిందింపసాగారు.

## విదురుని నివేదన

అంత విదురుడు సభ్యులను తన బాహువులనెత్తి శాంతింపజేసి "సభ్యులారా! యాజ్ఞసేని ప్రశ్నకు యెవ్వరూ జవాబు చెప్పలేదు. చిన్నవాడైనను వికర్ణుడు తనకు తోచినది, ఉచితమని భావించినది పల్కినాడు. నిజము తెలిసి మిన్నకుండి అర్ధపాప ఫలము. మిధ్యా సిద్ధాంతమువలన పూర్తి పాపఫలము మనకు లభించును.

పూర్వకాలమున ఒక కన్య కొరకై ప్రహ్లాదుని పుత్రుడైన విరోచనుడు ఆంగీరసముని కుమారుడైన సుధన్వుడు తగవులాడి ప్రహ్లాదుని తీర్పు చెప్పమనగా కశ్యపముని వలన సలహాకృతుడై ఆతడు పక్షపాతము చూపక సుధన్వుడు కన్యను వివాహము చేసికొనుటకు తగినవాడని నిర్ణయించి యశస్సు గాంచెను.

కావున మీరుకూడా ఆలోచించి సదుత్తరమివ్వవలసినదిగా కోరుచున్నాను" అని పలికెను.

ఆతని పలుకులకు యెవ్వరు బదులు పల్కకుండా మౌనులైయుండ కర్ణుడు దుశ్శాసనునితో "దుశ్శాసనా! దాసియైన ద్రౌపదిని గృహమునకు తీసుకొని పొమ్ము" అని పలుక అతడు కంపమానయగు ద్రౌపదిని సభలో నుండి ఈడ్చుకొని పోసాగెను.

## 67. విలపించు ద్రౌపదిని భీష్ముడు ఓదార్చుట

ద్రౌపది విలపించుచూ, "దుష్టుడా! క్షణకాలమాగుము. నా ప్రశ్నకు జవాబు విననీ. ఇప్పటివరకూ నానోట పరుషవాక్యము వెడలలేదు. ఇక నేను సహింపజాలను. స్వయంవర సభలో తప్ప పరపురుషుని చూడని నేను భర్తలు నిశ్చేష్టులైయుండ అవమానముల పాలగుచున్నాను. పుణ్యవతియైన స్త్రీకి ఇంతకన్నా సహించరాని కష్టమేమున్నది? శీలవతియైన స్త్రీని అవమానించి కురువంశమున ధర్మము విలుప్తమైనది. సభాసదులారా! మీరు నన్ను ఇక దాసి అనినా,

అనకపోయినా, కులస్త్రీ అనినా అనకపోయినా సహింపను" అని రాగక్రోధముల తీవ్రముగా పలుకుచుండ భీష్ముడు "కళ్యాణీ! ధర్మము చాలా సూక్ష్మభేదము వలన నిర్ణయింపబడినది. విజ్ఞులైనవారే దానిని సరిగ్గా నిర్ణయించలేరు. కష్టములలో ఉన్నామని అధర్మమునకు ఆశ్రయమివ్వరాదు. ప్రస్తుతము నీ పరిస్థితిలో యేది న్యాయమని తర్కవితర్కములు చేసి లాభము లేదు. కౌరవులు లోభమోహముల వశవర్తులైరి. శీఘ్రముగానే వీరి వంశము నశించును. నిన్ను కన్నవారు, మెట్టినింటివారు అత్యంత దుఃఖములో ఉన్నను ధర్మమును వదులలేదు. పాంచాలీ, దుర్భరమైన కష్టములో ఉన్నను నీవు ధర్మపథమునే అనుసరించితివి. వృద్ధులైన ద్రోణాదులు గతాసువులవలె యున్నారు. ఈ సమయమున ధర్మాత్ముడైన యుధిష్ఠిరునే నీవు జయింపబడితివా లేదా అన్న సంగతి నిర్ణయము చేయమనుము" అని ఓదార్చెను.

## 68.

సభయంతయూ నిశ్శబ్దముగా ఉండుట చూచి దుర్యోధనుడు, "యజ్ఞసేనీ! నీవు భీమ, అర్జున, నకుల, సహదేవులను ప్రశ్నింపుము. వారు ధర్మరాజు మిథ్యావాదియని, తాము అతని ప్రభుత్వమును అంగీకరింపమని పల్కిన నీవు దాసత్వ శృంఖలములనుండి ముక్తి పొందెదవు. పరమధార్మికుడు, సత్యసంధుడైన యుధిష్ఠిరుని నిర్ణయమునకు యెవ్వరూ అడ్డు పలుకరు" అనగా, సభికులు పాండవుల దెశ ఉత్సుకులై చూడసాగిరి.

భీముడు సభాసదుల నుద్దేశించి "ధర్మరాజే మా ప్రభువు కానిచో నేనింతసేపు తాళెడివాడినా? పాంచాలి కేశములు పట్టుకొన్న దుశ్శాసనుడు ఇంతసేపటివరకు ఊపిరి పీల్చుకొనేవాడా? ధర్మరాజే మా ప్రభువు, ఈశ్వరుడు. అతడు మేము ఓడితిమన్న ఇంక సందేహమేమున్నది? అతడే అనుమతిచ్చిన క్షుద్రులైన ధృతరాష్ట్ర సంతతిని ధ్వంసము చేసియుండెడివాడను" అని భీకరముగా పలుక భీష్మ ద్రోణాదులాతనిని నీవు అంతటివాడవే అని కీర్తించి శాంతింపజేసిరి.

## 69. కర్ణుని కుత్సితోక్తి

అంత కర్ణుడిట్లనెను. "పాంచాలీ! భీష్మ, ద్రోణ, విదురుల మాటలు నమ్మవద్దు. వారు తమ ధనరాశులను పెంచుకుంటూ, తమ ప్రభువునే దూషించే వ్యక్తులు. బానిస భార్య బానిస కాక మరింకేమౌతుంది? నీవు కౌరవుల అనుగతవు కమ్ము. బానిసలైన పాండవులు ఇక నీ భర్తలు కారు. తమ వంశమర్యాదను మరచి

భార్యను జూదములో ఓడిన ధర్మరాజాదులను వదిలి నిన్ను రక్షింపగలిగినవాడు, ధీమంతుడు అయిన వ్యక్తిని పతిగా వరించు.”

కర్ణుని మాటలు విని భీమసేనుడు ధర్మరాజుతో “రాజా! మనము బానిసలమయ్యామని నేను కోపగించుట లేదు. కాని మీరు ద్రౌపదిని పణముగా ఒడ్డకపోయిన శత్రువులిట్లు పరుషోక్తులు ఆడెడివారు కాదు కదా!” అని పలికెను.

## భీముడు దుర్యోధనుని ఊరువులు భగ్నము చేయుదునని ప్రతిజ్ఞ చేయుట

భీముని మాటలు విని దుర్యోధనుడు “ధర్మరాజా! భీమ, అర్జున, నకుల సహదేవులు నీ అధీనులమని పల్కుచున్నారు. ఇక ద్రౌపది ఓడినట్లో కాదో నీవే చెప్పు” అని ధర్మరాజు నుద్దేశించి పలుకుచూ, నవ్వి ద్రౌపదిని చూచుచూ, తొడమీద బట్ట తొలగించి, సర్వలక్షణ సంపన్నమైన వజ్రతుల్యధృడమైన తొడను చూపెను. కర్ణుడు అది చూచి నవ్వసాగెను. మహాపరాక్రమశాలియైన భీముడది చూచి, కోపముతో, లోహితవర్ణలోచనుడై, ఉచ్చైఃస్వరముతో “భూపాలులారా! నేను ప్రతిజ్ఞ చేయుచున్నాను. మహాయుద్ధమున గదతో దుర్యోధనుని ఊరువులను భగ్నము చేసి నేలకూల్చకపోయిన పితృలోకములను పొందనివాడనౌతాను” అని గర్జించుచున్న ఆ వీరుని శరీర రోమకూపములనుండి వేడి సెగలు బయలు వెడలెను. అంత విదురుడు “రాజులారా! భీముని భీషణ ప్రతిజ్ఞను వింటిరి కదా! ఇక భరతవంశమునకు కీడు రానున్నదనుటలో సందియము లేదు. ధృతరాష్ట్ర తనయులారా! మీరు అన్యాయముగా జూదమాడుటయే కాక కులస్త్రీని సభలో నుంచి వివాదములు చేయుచున్నారు. సభలో అధర్మాచరణము చేసిన సభయే కలుషితమగును. నా ధర్మవాక్యములను వినుడు. ధర్మరాజు తన పరాజయము తరువాతనే ద్రౌపదిని ఒడ్డేడు. అతడెంత మాత్రము ఆమె ఈశ్వరుడు కాడు. అనీశ్వరుడైన వానివద్ద గెల్చుకొన్న సొమ్ము స్వప్నములో దొరికిన ధనము వంటిది. మీరు ధర్మచ్యుతులు కాకుండా ధర్మసంరక్షణము చేయుడు.”

“పాంచాలీ! భీమార్జున నకుల సహదేవులు ధర్మరాజును అనీశ్వరుడనిన నీ దాసత్వము ఇక ఉండదు” అని దుర్యోధనుడు పలుకగా అర్జునుడు “యుధిష్ఠిరుడు మా ఈశ్వరుడు, అతడు మమ్ము యెవరివద్ద ఓడిపోయేడో మీకు అవగతమే” అని వచించెను.

ఇట్లు ఉత్తరప్రత్యుత్తరములు జరుగుచుండగా, ధృతరాష్ట్రుని అగ్నిహోత్ర గృహమునుండి గోమాయువుల, గార్ధభముల ఛీత్కారములు వినిపింపసాగెను. పక్షులు నాల్గువైపుల భయానకముగా కూతలు వేయదొడగెను. తత్వవిదుడైన విదురుడు, గాంధారి ఆ శబ్దములను విని, భీష్మ ద్రోణులు 'స్వస్తి, స్వస్తి' యని పలుకుచుండ ధృతరాష్ట్రుని చేరి ఘోరతర ఉత్పాతములను ధృతరాష్ట్రునకు యెరుకపరచిరి.

## ధృతరాష్ట్రుడు పాంచాలికి వరములిచ్చుట

భీతి చెందిన ధృతరాష్ట్రుడు కుమారుని దూషించి ద్రౌపదితో "కళ్యాణీ! నా కోడంద్రలో నీవే శ్రేష్ఠురాలవు. నీకు నచ్చిన కోరికలు కోరుకొమ్ము" అనగా ఆమె "భరతకులప్రదీపా! నాయందు ప్రసన్నులైన యుధిష్ఠిరునకు దాసత్వమునుండి ముక్తి నిండు. నా కుమారుడైన ప్రతిపాద్యుడు దాసుని కుమారుడని పిలువబడుట నాకిష్టము లేదు."

"కళ్యాణీ! నీ కోర్కెనంగీకరించితిని. నీవు మరియొక వరమడుగుము."

"మహారాజా! భీమ, అర్జున, నకుల, సహదేవులకు ముక్తినిమ్ము."

"నందినీ! అటులనే. నీవు మరియొక వరమడుగుము. యదార్థముగా నిన్ను సత్కరించలేదు. నీవు ధర్మపరురాలవు. నీవు నా ప్రియమైన పుత్రవధువువు."

"మహానుభావా! లోభము ధర్మనాశనమునకు హేతువు. ఇక నన్ను వరములడగమనకుడు. నేను తృతీయ వరము తీసుకొనుటకు ఉపయుక్తురాలను కాదు. వైశ్యులైన ఒకటి, క్షత్రియపత్నులు రెండే, రాజులు మూడు, బ్రాహ్మణులు యెన్నైనా వరములడుగ తగుదురని మీకు తెలియనిది కాదు. స్వతంత్రులైన నా భర్తలు తమ పుణ్యకర్మలచే ఉన్నతులగుదురు."

## 70. ధర్మరాజు భీముని శాంతపరచుట

"ఆహా! యెంత శీలవతి! భార్య సహాయముతో నేడు పాండవులు ముక్తిపొందేరు కదా!" అని కర్ణుడు హేళన చేయ భీముడు అర్జునునితో "నిజమే పాండవులు స్త్రీచే కాపాడబడ్డారు. దుశ్శాసనునిచే అభిమృష్టయైన పాంచాలి యనెడి జ్యోతి వినష్టమైనది కదా!" అని దీనముగా పలుక అర్జునుడు "నీచుల మాటలను లెక్కపెట్టవలదు" అనగా భీముడు వేడి నిట్టూర్పులు విడచుచూ అన్నతో "రాజేంద్రా! వాగ్వాదము చేయ నాకిష్టము లేదు. మీరనుజ్ఞ నిండు, ఈ సభలోనే

శత్రుసముదాయమును యమసదనమునకు పంపెదను” అని పలుక ధర్మరాజు ఆతని “తొందరపడకు ఆగు”మని ధృతరాష్ట్రునితో ఇట్లనెను.

## 71. పాండవులు ఖాండవప్రస్థమునకు మరలుట

“రాజా! మేము యెల్లవేళల మీ ఆజ్ఞానువర్తులము. మా కర్తవ్యమును తెలియజేయుడు.”

అంత ధృతరాష్ట్రుడు “అజాతశత్రు! నీకు శుభము కలుగుతుంది. నీవు సమస్త ధనరాసులను గ్రహించి ఖాండవప్రస్థమును చేరి రాజ్యమేలుకొమ్ము. నీవు మహాప్రాజ్ఞుడవు. ధర్మసూక్ష్మమును తెలిసినవాడవు. వినీతుడవై పెద్దలను తృప్తి పరచితివి. నేను వృద్ధుడనైతిని. నా ఆశీస్సులతో నీవు తప్పక ఉన్నతి పొందెదవు. బుద్ధియున్న చోటనే క్షమ కూడా ఉంటుంది. నీవు క్షమాగుణముతో వర్తింపుము. ఉత్తములు శత్రువుల చెడ్డను యెంచకు, వారి ఉత్తమ గుణములనే పేర్కొనెదరు. నీవు కూడా అట్లే ప్రవర్తించితివి. నాయనా! దుర్యోధనుని నిష్ఠుర వ్యవహారాన్ని మనస్సున ఉంచుకొనకు. వృద్ధులమైన నన్ను, గాంధారిని దయతో చూడుము. ద్యూతక్రీడతో ఆనందముగా సమయం గడపడానికి మాత్రమే పిలిచేను. కౌరవులను లక్ష్యపెట్టకుము. నీయందు ధర్మము, ధనుంజయుని యందు ధైర్యము, వృకోదరునియందు పరాక్రమము, నకులుని యందు స్వచ్ఛత, సహదేవునియందు గురుశుశ్రూష ప్రతిష్ఠింపబడినవి. వత్సా! శుభము కలుగుగాక! ధర్మానురక్తుడవై ఖాండవప్రస్థమునకు సహోదరాదులతో మరలుము.”

పెద్దతండ్రి ఆజ్ఞ తీసుకొని ధర్మరాజు, తమ్ములతోను, ద్రౌపదితోను ఆనందముగా ఇంద్రప్రస్థమునకు మరలెను.

ద్యూతపర్వాధ్యాయ సమాప్తి

## 72. అనుద్యూత పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. తదనంతరము దుర్యోధనుడు, కర్ణుడు, శకుని మొదలైనవారు ధృతరాష్ట్రుని చేరి వినీతులై “మహారాజా! సమస్త ఉపాయములతో శత్రువులను నాశనము చేయమన్న దేవగురుని నీతిని మరచినట్లున్నారు. అస్త్రములు ధరించి పాండవులు తాడిత భుజంగముల వలెనున్న సంగతి మరువకుడు. మేము వారికి అపకారము చేసితిమి. వారు క్షమింపరు. ద్రౌపదికి అపకారము చేసితిమి. వారు క్షమింపరు. ద్రౌపదికి చేసిన అవమానము

యెంతమాత్రము సహింపరు. మీరు అనుమతించిన పన్నెండు సంవత్సరములు అరణ్యవాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాసము పందెముగా మరల జూదమాడెదము. అజ్ఞాతవాస కాలమున పట్టుబడితే మరల 12 సంవత్సరములు అరణ్యవాసము చేయవలెను. దీనితో పాండవుల పీడ వదిలిపోతుంది. శకుని ద్యూతక్రీడా నైపుణ్యము మీకు తెలిసినదే కదా! మాయందు దయదలిచి అనుమతింపుడు" అని కోరిరి.

పుత్రవాత్సల్యమున ధృతరాష్ట్రుడు భీష్మ, ద్రోణ, విదురాదుల సత్వచనములు వినక పాండవులను మరల జూదమాడ చేసెను.

## 73. గాంధారి ఉపదేశము

ధర్మపరాయణురాలైన గాంధారి విచారముతో ధృతరాష్ట్రునితో ఇట్లనెను. "మహారాజ! దుర్యోధనుడు జన్మించగానే గార్దభమువలె అరచినప్పుడే కులనాశనము చేయ జన్మించిన కుమారుని వదలమని విదురాదులు నాడు చెప్పారు. అది సత్యమని ప్రమాణమగు దినము వచ్చుచున్నది. దుర్నీతిపరులైన కుమారుల మాటను ఇకనైనా వినకండి. మీకు చెప్పేటటువంటిదానను కాదు. కులనాశకుడైన కుమారుని త్యజింపుడు. పాండవులతో మైత్రి వహించి ధర్మయుక్తులై పుత్రపౌత్రాదులతో సుఖముగా కాలము గడుపుడు."

ఆమె మాటలు విని ధృతరాష్ట్రుడు "గాంధారీ! వంశనాశనమైనను కుమారుల కోర్కెను కాదనను. వారి ఇష్టానుసారమే పాండవులతో మరల ద్యూతక్రీడ జరగనీ" అని ఆమె మాటను తిరస్కరించెను.

## 74. రెండవమారు ద్యూతక్రీడ

వృద్ధరాజు ఆహ్వానమున వచ్చిన ధర్మరాజాదులు ఉపవిష్టులై ఉండ శకుని "ధర్మరాజా! ఈ మారు ఓడినవారు పన్నెండు సంవత్సరములు మృగచర్మధారులై అరణ్యవాసము, సంవత్సర కాలము అజ్ఞాతవాసము పణముగా ఆడుదము. తదనంతరము వారి రాజ్యము వారు పొందుదురు. అజ్ఞాతవాసకాలమున చిహ్నితులైన మరల అరణ్యవాసము చేయవలె. నీకిష్టమైన క్రీడ ఆరంభింతము."

లోకప్రవాదములను విని, ధర్మభీరువైన ధర్మరాజు కురువంశమునకు వినాశకాలము రానున్నదని నిశ్చయించుకొని ద్యూతక్రీడకు సిద్ధపడెను.

శకుని అక్షనిక్షేపము చేయగా అతడే గెలిచెను.

## 75. పాండవులు అజ్ఞాతవాసము చేయ బయలుదేరుట

వైశంపాయనుడిట్లనెను. అంత పాండవులు నిర్ణయప్రకారము మృగచర్మములే ఉత్తరీయములై వనవాసమునకు ఉద్యుక్తులైరి. దురాత్ముడైన దుశ్శాసనుడు "ఇక దుర్యోధనుడొక్కడే రాజు. ధనోన్మాదమున కౌరవులను కఠినోక్తులాడు పాండవులు రాజ్యలక్ష్మిని కోల్పోయి దీనవేషమున అడవులపాలైనారు. ద్రౌపదీ, సిరి కోల్పోయి, చవటనేలలాంటి ఈ పాండవులతో ఉంటే నీవేమి సుఖపడతావు. రా! మాలో ఒకరిని వరించి సుఖపడు" అని అనేకవిధముల పాండవులను రెచ్చగొట్టి కోపించిన భీమునితో గరు, గరు (రమ్ము) అని ప్రేరేపించసాగెను.

కోపావిష్టుడై నడచుచున్న భీముని వెంట అతనివలె నిరవాగతితో నడచుచూ దుర్యోధనుడు పరిహాసము చేయసాగెను.

భీముడు నడక ఆపి, సగము వెనుకకు తిరిగి "మూడుడా! తొందరపడకు. సవంశముగా మిమ్ములను చంపు దినములు రానున్నవి. నీ వెకిలి చేష్టలతో మమ్మేమియు చేయజాలవు. ప్రళయాంతకమగు యుద్ధమున నీ తొడలు విరచి, నేల దొర్లిస్తాను. పాపాత్ముడైన దుశ్శాసనుని రక్తము తాగుతాను. ధనుర్ధరుడైన అర్జునుడు కర్ణాదులను యమసదనమునకు పంపును. సహదేవుడు కపటియైన శకునిని హతమారుస్తాడు."

భీముడు వచించినట్లే అర్జునుడు, సహదేవుడు శపథములు చేసిరి.

## 76.

ఇట్లు పలువిధముల శపథములు చేసి పాండవులు పెద్దలైన భీష్మాదులను చేరిన, ధర్మరాజు వారికి నమస్కరించి మరల కలసికొందుమన వారు ఆశీర్వదించుటకు కూడా సిగ్గుపడి మనస్సులో ఆశీర్వదించిరి.

## విదురుడు అరణ్యోన్ముఖులగు పాండవులను ఆశీర్వదించుట

విదురుడు ధర్మరాజుతో "నాయనా! నీ తల్లి వృద్ధురాలు, యెన్నడూ కష్టములెరిగి యున్నదికాదు. ఆమెను నా వద్దనుండనిమ్ము" అని కోర అతడు అంగీకరించిన పిమ్మట విదురుడు "వత్సా! అధర్మాచరణము వలన యెన్నటికీ లాభము కలుగదు. మీ పరాజయము తాత్కాలికము. మహావీరులు, సుగుణ సంపన్నులైన మీరు, మీ ధర్మపత్నియైన ద్రౌపది ఒకరికొకరు సాయపడుచు సంతుష్టులై కాలము గడుపుడు. నీవు బుద్ధిలో పురూరవుని జయించితివి.

ధర్మాచరణమున ఋషులను అతిక్రమించితివి. క్రోధమాపుకొనుటలో యముని, క్షమాగుణమున భూమిని, త్యాగమున కుబేరుని, సంయమమున వరుణుని, ఆత్మ ప్రదానమున చంద్రుని, తేజమున సూర్యుని, బలమున పవనుని పరాస్తులను చేసితివి. మీకు యెల్లవేళల శుభము కలుగును. నిర్విఘ్నముగా తిరిగి రండు" అని హితవచనములు పలికెను.

## 77.

ద్రౌపది కుంతీదేవిని చేరి నమస్కరించి భర్తలతో వనముల కేగుటకు అనుమతి కోరిన ఆమె "కుమారీ! కష్టములు వచ్చినపుడు విచారించుట వివేకవంతుల లక్షణము కాదు. నీవు సుశీలవు, సాధ్వివి, సదాచారవ్రతురాలవు. నీ సుగుణముల వలన ఉభయకులములు ఔన్నత్యము పొందినవి. నా ఆశీస్సులు యెల్లవేళలా మిమ్ము కాపాడుగాక! అచిరకాలములోనే మీరు మీ సిరిసంపదలు తిరిగి పొందగలరు. సహదేవుడు కడపటివాడు. వనములలో అతని కెట్టి కష్టము కలుగకుండా చూడుము" అని ఆమె ఆశీర్వదించి పంపెను.

అంత పృథ దీనులవలె వనాభిముఖులై బయలుదేరిన కుమారులనుచూచి, దుఃఖించుచూ "అయ్యో! విధి యెంత దయలేనిది. యాగయజ్ఞములు చేసి, సచ్చరిత్రులై ధర్మపరాయణులైన కుమారుల కెట్టి ఇక్కట్లు వచ్చినవి. ఇది యెవ్వరి అపరాధమనేది? హతభాగ్యురాలనైన నా కడుపున జన్మించుటవలననే వీరిట్టి ఇడుములు పడుచున్నారు కాబోలు. కుమారుల కష్టములు చూడకుండా స్వర్గస్థులైన పాండురాజు, మాద్రి అదృష్టవంతులు, నా వంటి దురదృష్టవంతులు మరొకరుండరు. నాయనలారా! దీనురాలైన మీ తల్లిని వదలి వెళ్లిపోవుట న్యాయమా? కృష్ణా! నీవెచ్చట నున్నావు? అభాగ్యులైన పాండవులను రక్షింపవేమి? వారి యెడల నీవు కూడా దయలేనివాడవైతివా? పాండురాజా, నీవెచ్చట? కుమారులు కపటజూదమున ఓడి నిరాశ్రయులైన నీవెట్లు ఓర్చుకొని ఉన్నావు. నాయనా! సహదేవా! నీవు వీరితో కుపుత్రునివలె వెళ్లకు. దీనురాలైన నీ తల్లిని చూడు. నీవు లేకుండా నేను జీవించలేను. తల్లిని సేవించుట కన్నా పుణ్యకార్యము మరి లేదు" అని పరిపరి విధముల విలపించుచుండ పాండవులామెకు నమస్కరించి అరణ్యములకు నిష్క్రమించిరి.

శోకముతో కుందు కుంతిని అనేకవిధముల ఓదార్చి విదురుడు ఆమెను అంతఃపురమునకు తోడ్కొనిపోయెను. సభలో ద్రౌపదికి జరిగిన అవమానమునకు అంతఃపుర స్త్రీలు రోదించుచూ కౌరవులను నిందించిరి.

పుత్రుల అన్యాయాచరణమునకు ధృతరాష్ట్రుడు వ్యాకుల హృదయుడై విదురుని పిలిపించెను.

## 78.

ధృతరాష్ట్రుడు విదురునితో "విదురా! వనగమన సమయమున ధర్మపుత్రుడైన యుధిష్ఠిరుడు, భీమసేనుడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ధౌమ్య పురోహితుడు, యశస్విని పాంచాలి యెట్లు ప్రవర్తించిరి. నాకు విశదముగా తెలియజేయుము" అని కోరగా విదురుడిట్లనెను. "మహారాజా! అరణ్యమునకు వెడలుచూ ధర్మరాజు ఉత్తరీయముతో ముఖము కప్పుకొనెను. భీముడు పదే పదే యమదండ సదృశమైన బాహువులు చూచుచూ వెడలెను. అర్జునుడు అన్న వెంట చేతులతో ఇసుక చల్లుచూ వెడలెను. ఆలిప్త ముఖమున సహదేవుడు, ధూళి దూసరిత కళేబరమున నకులుడు, విరియబోసిన జుత్తు ముఖమండలమును కప్పిగొనగ పాంచాలి, యామ్య, సామ, రౌద్ర మంత్రములను గానము చేయుచూ ధౌమ్యుడు వెడలిరి."

విదురుని వాక్యములు విని ధృతరాష్ట్రుడు వారిట్లు ప్రవర్తించుటకు కారణమేమనగా విదురుడిట్లనెను –

"అన్యాయముగా తన రాజ్యమును లాగుకొన్నను ధర్మరాజు సహించేడు. కాని తన క్రోధపూరితమైన దృష్టిపడిన వారు దగ్ధులగుదురని ఉత్తరీయమును ముఖమున కప్పుకొనెను. యెప్పుడు తన బాహుబలమున శత్రువులను నాశనము చేయుదునాయని వృకోదరుడు బాహువులను చాచెను. ఇసుకవాన వలె శరవర్షము శత్రువులపై కురిపించు తలంపుతో అర్జునుడు కరముల చాలుకా నిక్షేపము చేసెను. ఇతరులు పోల్చుకొనకుండా సహదేవుడు ముఖమును వాల్చుకొని యుండెను. స్త్రీలు తన మనోహరరూపము చూడకుండా నకులుడు పాంశులిప్తుడయ్యెను. నా యీ దశకు కారకులైన కౌరవులు నశింప ముక్తకేశినై, రక్తమలినమైన వస్త్రములతో మరల హస్తినానగరము ప్రవేశింతునని ద్రౌపది అట్లున్నది. కురుకులము నశించిన పిమ్మట కురువంశపు గురువులిట్లు దీనముగా గానము చేతురని ధౌమ్యుడు సామగానము చేసెను. దీనులైన పాండవులను చూచి ప్రజలు పితృహీనులవలె రోదించిరి. బ్రాహ్మణులు ధృతరాష్ట్రుని స్వార్థమే కులనాశనమునకు కారణమగు చున్నదని పలికిరి. పాండవులు నగరము వీడిన పిమ్మట మేఘములు లేకుండా మెరుపులు మెరిసెను. భూమి కంపించెను. నగరముపై తోకచుక్కలు పడెను.

గ్రద్దలు దేవాలయముల వ్రాలెను. మహారాజా మీ దురాలోచనల వల్ల భరతకుల వినాశనము తెలియచేయుచూ ఇట్టి అశుభ శకునములు కన్పడెను.”

దుర్యోధనాదులు ద్రోణాచార్యుని పాండవుల రాజ్యభారము గ్రహింపుమని కోరగా అతడు “మీ ఈ సుఖములు క్షణికములు. నా శత్రువైన ద్రుపదుడు నన్ను హతమార్చ పుత్రుని పొందియున్నాడు. వారు పాండవుల బంధువులు. వారితో వైరము మనకు శుభప్రదము కాదు” అని పలికిన ధృతరాష్ట్రుడు విదురునితో “పాండవులను వనములనుండి మరల్చుదయో లేక భోగభాగ్యములిచ్చి తృప్తులను చేయుటయో మంచిదని” పలికెను.

## 79. పాండవుల నిర్వసనమున ధృతరాష్ట్రుడు సంజయునితో తన విచారము ప్రకటించుట

వైశంపాయనుడిట్లనెను. పాండవులు జూదమున ఓడి అడవులకు వెడలి పోయిన పిమ్మట ధృతరాష్ట్రుడు దుఃఖముతో దీర్ఘనిశ్వాసములు వదలుచూ యేకాగ్రచిత్తుడై ఉండ సంజయుడచటకు వచ్చెను.

“మహారాజా! మీరు పాండవులను బహిష్కృతులను చేసి సమస్త రాజ్యము నకు అధిపతులైరి. ఇంకనూ విచారమేల?” అని సంజయుడు ప్రశ్నింప ధృతరాష్ట్రుడు –

“మహారథులు, యుద్ధవిశారదులైన పాండవులతో వైరము తెచ్చుకొన్నవారికి విచారము తప్ప ఆనందమెక్కడిది” అన, సంజయుడు “మహారాజా! పతివ్రతయైన పాంచాలిని జుత్తు పట్టుకొని సభకు ఈడ్చుకొని వచ్చి నీ కుమారులు పలికిన మాటలు, చేసిన చేష్టలు, ధర్మాత్ములు కావుననే పాండవులు ఓర్చుకున్నారు. ఈ అనర్థములన్నిటికీ నీవే కదా కారణము” అని నిస్సంకోచముగా నిజము తెలుపగా ధృతరాష్ట్రుడు –

“సంజయా, ద్రౌపదికి కలిగిన అవమానమునకు ఎన్నో భయోత్పాతములు కలుగ విదురుడు గాంధారి యెన్నో విధముల బోధింప నేను పాండవులకు హితము చేకూర్చుటకు, పతివ్రతయైన ద్రౌపది కోపము తగ్గించుటకు వరములిచ్చి వారిని రాజ్యమునకు పంపితిని కాని పుత్రవాత్సల్యమున వివేకశూన్యుడనై మరల ద్యూతక్రీడకు పిలిపించి అన్యాయము చేసితిని.

సంజయా! పాండవులు తమకు జరిగిన అవమానమునకు యెంతమాత్రము సహించరు. వాసుదేవుడు వారికి అండయై యున్నాడు.

అర్జునుడు శరవర్షములు కురిపించుచూ, భీముడు యమకరాళ సదృశమైన గదను గిరగిరా త్రిప్పుచూ తాకిన నా కుమారులు వారిముందు నిలబడగలరా? పాండవులు కౌరవుల కన్నా అధిక బలపరాక్రమవంతులనుటలో సందేహం లేదు. ఆనాడు విదురుడు చెప్పినను పుత్రుల ఔన్నత్యము కొరకై వినకపోయితిని.

పాండవులతో విగ్రహము కాక సంధి చేసుకొనుటయే మేలు" అని విచారముగా పలికెను.

అనుద్యూత పర్వాధ్యాయ సమాప్తి

సభాపర్వము సంపూర్ణము

# అరణ్యపర్వము (వనపర్వము)

## 1. అరణ్యక పర్వాధ్యాయము

నారాయణునకు, నరోత్తముడైన నరునకు, సరస్వతీదేవికి, వేదవ్యాసునకు నమస్కరించి జయముచ్చరించెదను.

జనమేజయుడు వైశంపాయనునిట్లు ప్రశ్నించెను. "ద్విజోత్తమా! ద్యూతక్రీడలో ఓడిన పాండవులు అరణ్యవాసము యెట్లు చేసిరి? వారిని యెవరెవరు అనుసరించిరి? పాండవులు యేయే స్థానములు దర్శించిరి? యెవరెవరిని చూచిరో సవిస్తరముగా దయచేసి తెలుపుడు."

వైశంపాయనుడిట్లనెను –

హస్తినా నగరమునుండి జాతక్రోధులు, శస్త్రధారులై బయలువెడలి ఉత్తరాభిముఖులై పాండవులు ప్రయాణము చేయసాగిరి. పురప్రజలు వారితో తమను కూడా తీసుకొని పొమ్మని, దురాత్ములైన కౌరవులతో ఆ నగరమున వసింపమని పాండవులను వేడిన ధర్మరాజు భీష్ముడు, విదురుడు, కుంతి మొదలైన తమ బంధువులకు క్లేశము కలుగకుండా వారిని ఓదార్చుచూ ఉండుడని పలికి వారిని హస్తినానగరమునకు తిరిగి పంపెను.

సాయంకాలమునకు వారు భాగీరథీ తీరమునకు చేరిరి. పాండవులు గంగానదీ జలములను గ్రహించి, స్నేహసక్తులై సబాంధవముగా వచ్చిన సాగ్నిక, అనాగ్నిక బ్రాహ్మణులు హోమాగ్నులు ప్రజ్వరింపచేసిరి. ధర్మరాజు బ్రహ్మావాదులైన ఆ బ్రాహ్మణ సమూహ పర్యవేష్ఠితుడై వివిధ ప్రసంగములు చేయుచూ రాత్రి గడిపెను.

## 2. పాండవులతో బ్రాహ్మణుల వనగమనేచ్ఛ

మరునాడు ఉదయము తమ వెంట రానున్న బ్రాహ్మణులతో ధర్మరాజు, "మేము రాజ్యమును కోల్పోయి, కందమూలాదులు, వేటాడిన జంతు మాంసము లతో జీవితము గడుపవలసి యున్నది. మీరు మాతో ఇడుములు పడలేరు. దయచేసి నగరమునకు మరలుడు" అని ప్రార్థించ వారు "మాకు భోగభాగ్యములక్కరలేదు. మీ తోటే ఉన్నదానితో తృప్తిపడియుందునని" అని పలుక ధర్మరాజు విప్రులను సేవించలేని తన దుస్థితికి విచారించుచూ కూర్చుండిన శౌనకుడను ముని ఆతనిని

చేరి, "రాజా! మూఢులు శోక, భయములచే విహ్వాలులగుదురు. నీవంటి బుద్ధిమంతులు ఇట్లు మాయాఛన్నులగుట ఉచితము కాదు.

ఈ విషయమై జనకమహారాజు వచనములను వినుము. విశ్వసంసారము శారీరకము, మానసికము యైన రెండుదుఃఖములచే నిండియున్నది. శారీరకమైన రుగ్మతలు కలిగినపుడు మంచివైద్యుడు రోగికి ముందు మంచి మాటలతో మానసిక శాంతికి ప్రయత్నిస్తాడు. మనస్సుకి శాంతి కలిగిన శారీరకముగా ఆరోగ్యము చేకూరును.

స్నేహానురాగములే దుఃఖమునకు మూలము. దానివలననే మనోవికృతి, విషయాసక్తి కలుగును. విషయాసక్తి ధర్మమును నశింపజేయును. విషయా విముక్తుడైనంత మాత్రమున లాభము లేదు. విషయసమాగముడయ్యు తామరాకుపై నీటిబొట్టువలె ఆసక్తుడై ఉన్నవాడే వైరాగ్యలాభము పొంది సుఖపడును.

విషయానురాగమున, కోరికలు, వానిచే ఇచ్ఛ, ఇచ్ఛ వలన తృష్ణ పెంపొందును. తృష్ణయే పాపపు చింతలను కలిగించును. అర్థలాభమున సాధారణ వ్యక్తులు అధర్మాచరణమున, చోరభీతితో అశాంతితో జీవితము గడిపెదరు. పండితులు క్షణికములైన ధనాదులయందు నిస్పృహ వహించియుందురు. ధర్మజా! నీవును అర్థకాంక్షను పరిత్యజించుము."

ధర్మరాజిట్లనెను. "మునివరా, స్వఫలాపేక్షతో కాక నన్ను ఆశ్రయించి ఉన్నవారి కొరకే ధనము కాంక్షించుచున్నాను. అన్నార్తులైనవారికి, సన్యాసులకు, పశుపక్ష్యాదులకు గృహస్థే ఆశ్రయభూతుడై ఉన్నాడు. గృహస్థు పంచదక్షిణలతో (1) బ్రహ్మయజ్ఞము 2) నృయజ్ఞము 3) పితృయజ్ఞము 4) దైవయజ్ఞము 5) భూత యజ్ఞము) పుణ్యమార్జించుకొనును. ఇదే అతని ప్రధాన ధర్మము. మీ ఉద్దేశ్యము కూడా తెలియజేయుడు."

శౌనకుడిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "రాజా! ఇది ఎంత విచిత్రము. యే కర్మలయందు పండితులు పరాఙ్ముఖులగుదురో సామాన్యులు ఆ సంసారసుఖములే వాంఛించుచూ జీవించుచూ యెన్నో జన్మలు అటులనే గడుపుచూ అధోగతిని పొందుదురు. పండితులు కర్మలు పరిత్యజించి యజ్ఞ, అధ్యయన, దాన, తప, సత్య, క్షమ, దమ, అలోబాది అష్టధర్మముల ననుసరించి దేవ పితృ లోకములను చేరుదురు. నీవు పితృమయి, మాతృమయి, కర్మమయి సిద్ధులను పొందియున్నావు. కావున తపస్సుచే సిద్ధిని పొందిన ద్విజోత్తముల భారణపోషణాదులు చేయగలవు."

## 3. ధౌమ్యుడు సూర్యోపాసన చేయుమని ఉపదేశించుట

ధర్మరాజు పురోహితుడైన ధౌమ్యుని పిలచి “మహానుభావా! దేవతుల్యులైన ఈ బ్రాహ్మణులు నా వెంట వచ్చెదమనుచున్నారు. వీరిని నేను పోషింప సమర్థుడను కాను. పరిత్యజించనూ లేను. నేనేమి చేయవలెనో కర్తవ్యము తెలియజేయుడు” అని ప్రార్థించెను.

“ధర్మజా! ప్రాణులన్నియు సూర్యుని వలననే జన్మించినవి. అతని వలననే సమస్త ప్రాణులు జీవనము చేయగల్గుచున్నవి. కావున ఆతనిని ధ్యానించిన కృతకృత్యుడవు కాగలవు” అని ధౌమ్యుడు సూర్యుని అష్టోత్తర శతనామములు తెలిపెను.

ధర్మరాజు శుచియై, సంయతచిత్తుడై, పూజలు చేసి సూర్యుని పలు విధముల స్తుతించెను.

## సూర్యుడు ధర్మరాజునకు అక్షయపాత్ర నిచ్చుట

ధర్మజుని ఉపాసనకు తృప్తిచెందిన దివాకరుడు దివ్యరూపము ప్రత్యక్షమై “రాజా! నీ సమస్తకోరికలు తీరును. పన్నెండు సంవత్సరములు నేను అన్న ప్రదానము చేయుదును. తామ్రనిర్మితమైన ఈ పాత్రను గ్రహింపుము. పాంచాలి భుజించునంత వరకూ మీరు ఉంచిన చతుర్విధపాకములు తరగక అక్షయమగును. పదమూడు సంవత్సరములు గడచిన పిమ్మట నీవు రాజ్యమును మరల పొందుదువు” అని ఆశీర్వదించి అంతర్హితుడయ్యెను. వరమును పొంది, ధౌమ్యునకు నమస్కరించి, తమ్ములను కౌగలించుకొని, ధర్మరాజు అక్షయపాత్రను ద్రౌపదికి ఇచ్చెను.

ద్విజోత్తముల భోజనానంతరము భుక్తశేషములు పాండవులు, ద్రౌపది భుజించి, శుభసమయమున కామ్యక వనమునకు బయలుదేరిరి.

## 4. కురుపాండవుల సంధికి విదురుని ఉపదేశము

వైశంపాయనుడిట్లనెను – పాండవులు వనవాసమునకు వెడలిన పిమ్మట ధృతరాష్ట్రుడు విదురుని పిలచి “విదురా! నీవు బుద్ధిలో శుక్రుని వంటివాడవు. కుపితులైన పాండవులు, పురజనులు మమ్ము సమూలముగా నాశనము చేయకుండా ఉభయ కులములకు శ్రేయస్కరమైన కార్యము తెలియజేయుము” అని కోరగా విదురుడిట్లనెను –

"మహారాజా! మీ కుమారుల యొక్కయు, మీ వంశము యొక్కయు శుభము కోరువాడవైతివేని ధర్మప్రధావలంబివై దుర్యోధనుని పరిత్యజింపుము. పాండవులకు వారి రాజ్యభాగమిమ్ము. భీమసేనుని, ద్రౌపదిని సభామధ్యమున దుశ్శాసనుని క్షమింప వేడుకొనమనుము. ధర్మరాజునోదార్చి రాజ్యాభిషిక్తుని చేయుము. పుత్రవాత్సల్యమున కుమారులను దుష్ప్రవర్తనులను కాకుండా ఆపుము. రాజా! నీవు కోరితివి కావున, శుభాకాంక్షిని కనుక, నా కర్తవ్యము నేను నెరవేర్చెదను. నా ఉపదేశమును మన్నించిన మీకు శుభము కలుగును."

అంత ధృతరాష్ట్రుడు "విదురా! నీవు పాండవ పక్షపాతివి. మా శ్రేయస్సు కోరువాడవు కాదు. పాండవులకై నా కుమారుని పరిత్యజించు మూర్ఖుడను కాను. పాండవులు కూడా నా కుమారులే. కాని దుర్యోధనుడు నా రక్తము పంచుకొని పుట్టినవాడు. ఎవరైనా తమ దేహమునే వదులుటకు ఇష్టపడుదురా? నేనెంత గౌరవించినను, నీవు కపటివై మాకే కీడు తలపెట్టుచుంటివి. ఎంత గౌరవించినను కులట భర్తతో కాపురము చేయునా?ఇచ్చటనుండి నీవు ఇచ్చవచ్చిన చోటికి పొమ్ము. నా కభ్యంతరము లేదు" అని అంతఃపురమునకు వెడలిపోగా 'భ్రష్టస్య కాలా గతిః' అని తలపోయుచూ విదురుడు పాండవులను చేర బయలుదేరెను.

## 5. విదురుడు పాండవులను చేరుట

కామ్యకవనమును చేర పాండవులు గంగానది దాటి కురుక్షేత్రమును అచ్చటినుండి సరస్వతీ, దృషస్వతి, యమునా నదులను దాటి కామ్యకవనమును చేరిరి. ఒకనాడు ధర్మరాజు తమ్ములతోను, భార్యతోను మృగచర్మములపై ఆసీనులై విశ్రమించియుండ త్వరితగమనులగు అశ్వములు పూన్చిన రథముపై వచ్చుచున్న విదురుడు వారికి కనిపించెను. అది చూచి ధర్మరాజు వృకోదరునితో "తమ్ముడా! విదురుడు మరల వచ్చుచున్నాడు. మరల జూదమాడడానికి పిలవడు కదా! హీనుడైన శకుని మన అస్త్రశస్త్రములు కూడా గెల్చుకోడు కదా! భీమా! మరల ద్యూతక్రీడకు పిలచిన నేను కాదనలేనే! గాండీవము కూడా ఇతరుల చేతులలో పడితే మనము తిరిగి రాజ్యాన్ని ఎలాగ పొందుతాము?" అని విచారవదనుడయ్యెను.

పాండవులు విదురుని ఆహ్వానించి విశ్రాంతి తీసుకొనిన పిమ్మట రాకకు కారణమడిగిరి. విదురుడు ధృతరాష్ట్రునితో జరిగిన సంభాషణ తెలిపి, ఆతనిచే తిరస్కృతమై మిమ్ము చేరితిననెను మరియు క్షమతో, ఉన్న సంపత్తిని బంధువర్గముతో అనుభవించు వ్యక్తియే ఉన్నతిని పొందుననెను.

# 6. పాండవుల అభివృద్ధికి భయపడి ధృతరాష్ట్రుడు విదురుని తిరిగి రమ్మనుట

విదురుడు పాండవులను చేరిన సంగతి తెలిసికొని, ఆతని సలహాలతో పాండవులున్నతి పొందుదురని వెరచి, సభలో ఆతని గురించి విచారించుచూ మూర్ఛపోయి, తదుపరి సంజయునితో "సంజయా! పరమధార్మికుడైన నా తమ్ముడు విదురుడు నాకత్యంత ప్రియుడు. స్నేహితుడు. నాకు అతడు పదే పదే స్మరణకు వచ్చుచున్నాడు. నేను పాపాత్ముడనై ప్రియతముడైన తమ్ముని అవమానించితిని. అతడు నిరపరాధి. వినయసంపన్నుడు. సంజయా! శీఘ్రముగా వెడలి అతనిని ఇచ్చటకు తీసుకొనిరమ్ము. నా తప్పులను యెంచవలదనుము. అతనిని చూడ కుండా నేను బ్రతుకలేను" అని పల్కిన సంజయుడు "ప్రభువుల ఆజ్ఞ" అని త్వరితముగా కామ్యకవనమున పాండవుల వద్దనున్న విదురునకు సంగతి తెలుప అతడు పాండవుల అనుమతి గైకొని హస్తినా నగరమునకు మరలి ధృతరాష్ట్రుని చేర అతడు తమ్ముని కౌగలించుకొని "తమ్ముడా! నా అపరాధములను క్షమింపుము" అని వేడికొనగా విదురుడు "మహారాజా! మీరు నాకు గురుతుల్యులు. అందులకే పిలువగానే వచ్చితిని. భరతకులతిలకా! పాండవులు, కౌరవులు నాకు సమానులే. కాని దీనులైయున్న పాండుపుత్రలను చూచి నా మనస్సు వారిపై మరలును" అని పలికెను. ఇట్లు వారు సల్లాపములతో ఆనందమనుభవించిరి.

## 7.

విదురుడు తిరిగి వచ్చి తండ్రితో సరసముగా సంభాషణ చేయుచున్న వార్త విని దుర్యోధనుడు శకునిని, కర్ణుని, దుశ్శాసనుని పిలచి "విదురుడు నాన్నగారి మతి చెరిచి పాండవులకు తిరిగి రాజ్యమిచ్చునట్లు కనిపించుచున్నది. అట్లు జరిగిన ఆత్మహత్యయైనా చేసికొందును కాని వారి ఉన్నతిని మాత్రము చూడను" అనిన శకుని "రాజా! నీవు అనవసరముగా భయపడుచున్నావు. పాండవులు మాట తప్పువారు కాదు. వారు యెట్టి అనురోధములకు తిరిగిరారు. తమ ప్రతిజ్ఞ తప్పరు. నీవ అధైర్యపడకు" అని ఊరడించెను.

అంత కర్ణుడు "రాజా! మేము నీ మేలు కోరువారము. ఏమి జరుగునోయని భయపడి తర్కవితర్కములు చేయుటకన్నా కార్యోన్ముఖులమై మనమందరమూ సైన్యసమేతముగా పాండవులని చుట్టుముట్టి నాశనము చేయుదము. మిత్రహీనులై

పడియున్న వారిని హతమార్చుటకు ఇదే తగిన సమయము” అని పలికిన వారందరూ కర్ణుని వచనముల నామోదించి సన్నాహములు చేయసాగిరి.

వీరి దుష్టబుద్ధిని దివ్యదృష్టిని తెలుసుకొనిన వ్యాసమహర్షి ధృతరాష్ట్రుని చేరి ఇట్లనెను.

## 8.

“ధృతరాష్ట్రా! కురువంశములో అందరికీ శుభము చేకూరేటట్లు చెప్పుచున్నాను. పాండవులను మోసముతో ద్యూతక్రీడలో ఓడించి అడవులకు పంపి మీరు వారికి అపకారం చేశారు. పదమూడు సంవత్సరముల తరువాత వాళ్లు తప్పక ప్రతీకారం తీర్చుకుంటారు. నీ కుమారులు అడవులలో ఉన్న పాండవులతో కయ్యమాడ సిద్ధమగుచున్నారు. అట్లు చేసిన వారు మృత్యుముఖమున పడుట తథ్యము. భీష్మ, విదురాదులతో ఆలోచించి తగిన విధముగా పాండవులతో వైరము కల్గని పద్ధతి నవలంబించుము” అనిన,

## 9.

“మహర్షి! పుత్రవాత్సల్యమున గాంధారి, విదురుడు, భీష్ముడు మొదలగువారు చెప్పిన మాటలు విననైతిని. నా బుద్ధి పెడమార్గమున ఉండుట వలననే ద్యూతక్రీడ జరిగినది. నేడు అన్నియూ తెలిసినా మోహపరవశుడనై పుత్రుని త్యజించ లేకున్నాను” అని ధృతరాష్ట్రుడు తన అసహాయతను తెలియజేయగా వ్యాసమహర్షి అతనికి ఇంద్రుడు సురభివాదన వినిపించి, “నరనాథా!పుత్రులపై ప్రేమానురాగము లుండుట సహజము. నీవు, విదురుడు నాకు సమానమే. నీకు నూర్గురు కుమారులున్నారు. పాండవులు ఐదుగురు. వారు దుఃఖముతో అడవుల తిరుగాడుట చూచిన మనస్సు వ్యాకులత చెందును. కౌరవులకు, కురుకులమునకు శ్రేయస్సు చేకూర్చుచూ, నీ కుమారులను నీ అదుపాజ్ఞలో ఉండేటట్లు చూడు.”

## 10.

“అదేకాక, త్వరలోనే ఇచ్చటకు పాండవులను చూచిన మైత్రేయ ముని రానున్నాడు. అతడు కోపిష్టి. నీ కుమారుని జాగ్రత్తగా ప్రవర్తించమను. లేకపోయిన అతడు శపించును” అని ధృతరాష్ట్రుని హెచ్చరించి స్వస్థానమునకు మరలెను.

## కురుపాండవుల సంధికై మైత్రేయుని రాక

మైత్రేయ మహర్షి రాగా ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు అతనికి సత్కారము చేసి, సుఖాసీనుడై, అలసట తగ్గిన పిమ్మట ధృతరాష్ట్రుడు "మునివరా! దారిలో కురురాజ్యమున ఎటువంటి చికాకు కలుగలేదు కదా! పాండవులంతా కుశలముగా ఉన్నారు కదా! వారు ప్రతిజ్ఞాభంగము చేయ తలచుట లేదు కదా!" అని ప్రశ్నించగా ఆ తాపసి "మహారాజా! కామ్యకవనమున ధర్మరాజు మొదలైనవారిని చూసితిని. నీ కుమారులు కపటద్యూతమున పాండవులను ఓడించి రాజ్యము లాగుకొన్న గర్హిత కార్యమునువింటిని. నీమీద అభిమానమున్నవాడను కనుక ఇచ్చటకు వచ్చితిని. నీవు, భీష్ముడు బ్రతికియుండగా మీ కుమారులిట్లు ఒకరితో నొకరు తగవులాడుకొనుట పాడి కాదు. నీవు ఉపేక్షించి ఊరకుండుట క్షేమము కాదు. తాపసులను చేరినను ఈ సభలో జరిగిన నీచకార్యము కప్పబడదు" అని ధృతరాష్ట్రునితో పలికి తదనంతరము దుర్యోధనునితో ఇట్లనెను. "దుర్యోధనా! నా వాక్యములను వినుము. పాండవులకు కీడు తలపెట్టకుము. ఎల్లజనులకు ముఖ్యముగా కురు, పాండవులకు క్షేమము చేకూరే విధముగా ప్రవర్తింపుము. పాండవులు యోధులు, సత్యసంధులు. వారు దేవద్వేషులైన హిడింబ, బక, కిమ్మీరులను రాక్షసులను, జరాసంధుని వధించిరని నీకు తెలియదా? వాసుదేవుడు వారి ఆత్మీయుడు. దుష్టద్యుమ్నుడు బావమరది. భీమునితో యుద్ధము చేయగల సమర్థుడు వేరొకడు లేడు. పాండవులతో సంధి చేసుకొనుటయే నీకు ఉచితము. క్రోధమునకు లొంగకు" అని పలికెను.

## మైత్రేయముని దుర్యోధనుని శపించుట

ఆతని పలుకులకు బదులు పలుకక దుర్యోధనుడు తొడలు చరుచుకొనుచు, కాలి బొటనవేళ్లతో నేలను అదుముచూ వికటముగా నవ్వి పరాఙ్ముఖుడయ్యెను. అవమానితుడైన ముని క్రోధముతో ఆచమన పూర్వకముగా శపించెను.

"దుర్యోధనా! యే అభిమాన గర్వమున నన్ను అవమానించితివో, ఆ అభిమానము చూర్ణమగునట్లు, మహాసంగ్రామమున భీముడు నీ తొడలు భగ్నము చేయును."

ముని శాపమునకు భయపడి ధృతరాష్ట్రుడు ప్రీతివాక్యములతోను, సత్కారముతోను అతనిని ప్రసన్నుని చేసుకొని, కుమారుని శాపవిమోచనము తెలుపుమని ప్రార్థింప, "రాజా! పాండవులతో సంధి చేసుకొనిన శాప విమోచనము

కలుగును. అట్లు చేయనిచో నా మాటలు నిష్ఫలము కావు" అనినంత ధృతరాష్ట్రుడు అతనితో భీముడు కిమ్మీరుని యెట్లు వధించెనో తెలుపుమనిన ముని "నీ కుమారుడు నా మాటలను లక్ష్యపెట్టలేదు. ఇక ఇచ్చట నేనుండను, విదురుని వలన ఆ సంగతి తెలుసుకో" అని సభను వీడి స్వస్థానమునకు మరలిపోయెను.

అరణ్యక పర్వాధ్యాయ సమాప్తి

## 11. కిమ్మీరవధ పర్వాధ్యాయము

తదనంతరము ధృతరాష్ట్రుడు విదురునితో "క్షాత్రా! భీమునితో నిశాచరుడు యెందులకు తలపడెను. భీముడాతనిని యెట్లు వధించెను. నాకు సవిస్తరముగా తెలుపుము" అనిన విదురుడిట్లు చెప్పదొడగెను.

"మహారాజా! వనవాసమునకు హస్తినా నగరమునుండి బయలుదేరిన పాండవులు మూడవ దినము సాయంకాలమునకు కామ్యకవనమును చేరిరి. రాక్షస బాధచే మునులు ఆ స్థానమును త్యజించిరి. కృష్ణజినధారులైన పాండవులను దూరమునుండి చూచిన రాక్షసుడు, చేతిలో వెలుగుచున్న కాగడాతోను, రక్తవర్ణ నేత్రములతోను, పెద్ద కోరలతోను, మేరు పర్వతమువంటి శరీరముతోను, దారికి అడ్డుగా నిలబడి రాక్షసమాయ విస్తరింపజేయుచూ భీకరనాదము చేయగా, మృగ, మహిష, శార్దూల, వరాహ, భల్లూకాది వన్యమృగములు, పక్షులు భయముతో నాల్గువైపుల పరుగులిడుచుండ, ఆ స్థలమంతయు ధూళితో నిండిపోయెను.

వాని భీషణమైన రూపము చూడగానే భీతిల్లిన ద్రౌపది తెగిన తీగవలె మూర్ఛిల్లి పాండవుల మధ్య పర్వతముల మధ్య సెలయేరువలె నుండెను.

ధౌమ్య పురోహితుడు వివిధమంత్ర ప్రయోగములతో రాక్షసమాయ నివారించెను. మాయ వీడిన పిదప, యముని వలె వారిముందు నిల్చున్న నిశాచరుని చూచి ధర్మరాజు వానితో "నీవెవ్వరు? యెందులకు మా మార్గమునకు అడ్డు నిల్చొనియుంటివి?" అని పలికిన వాడు "నేను బకాసురుని అన్నను. నా పేరు కిమ్మీరుడు. ఈ జనశూన్య కామ్యక వనము నానివాసము. యుద్ధమున చనిపోయిన నరుల మాంసము భక్షించి జీవింతును. నా ఆహారమై వచ్చిన మీరెవ్వరు? మిమ్ములను యుద్ధమున జయించి, చంపి, భక్షించి నా ఆకలి తీర్చుకొందును" అని పలికెను.

ధర్మరాజు తనను తాను పరిచయము చేసుకొనుచూ "నేను పాండురాజు కుమారుడను. నా పేరు యుధిష్టిరుడు. రాజ్యమును కోల్పోయి వనవాసమునకు

వచ్చితిమి. వీరు నా తమ్ములు. భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు" అనెను.

"ఓహో, నేడెంత సుదినము! నా తమ్ముని చంపిన అధముని నాశనము చేయదలంచిన నా చిరకాల వాంఛ నేడు తీరనున్నది. నా స్నేహితుడైన హిడింబాసురుని వధించి, ఆతని చెల్లెలను అపహరించిన భీముని నేడు నీ సమక్షముననే వధించి నా తమ్మునికి, స్నేహితునకు రక్తతర్పణము గావించి, మనసారా భుజించెదను" అని అట్టహాసము చేయ ధర్మరాజు "నీ చెడు తలంపు యెన్నటికీ సాధ్యము కాదు" అనెను.

రాక్షసుని వధింప ధనస్సును సంధింపబోయిన అర్జునుని ఆపి, భీముడు రాక్షసునితో యుద్ధమునకు తలపడెను. కురుసభలో సుయోధనాదులచే పొందిన అవమాన భారమునంతయూ ఒకేమారు తీర్చుకొను విధమున ఆతడు కిమ్మీరుని యెదుర్కొనిన వారి మధ్య శిలలతోను, మహావృక్షములతోను సంగ్రామము జరిగి తుదకు మల్లయుద్ధమునకు తలపడిరి. భీముడాతనిని గిరగిర త్రిప్పి నేల పడవైచి పశువు వలె గొంతుక నులిమి చంపివైచెను.

ధర్మరాజాదులు ఆతని వీరత్వమునకు యెంతయో ప్రశంసించిరి.

## పాండవులు ద్వైతవనమున వసించుట

ఇట్లు పాండవులు ద్వైతవనమును రాక్షసుల బాధనుంచి విముక్తి చేయ అచటి తాపసులందరూ తిరిగి వచ్చి పాండవులను కీర్తించి సుఖముగా కాలము గడుపసాగిరి.

రాజా! నేను నిహతుడైన కిమ్మీరుని పర్వత సదృశమైన మృతదేహమును చూచితిని" అని విదురుడు తెలుప ధృతరాష్ట్రుడు దీర్ఘనిశ్వాసము వదలి చింతా నిమగ్నుడయ్యెను.

కిమ్మీరవధ పర్వాధ్యాయ సమాప్తి

## 12. అర్జునాభిగమన పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. "జనమేజయ మహారాజా! పాండవులు రాజ్యమును కోల్పోయి అడవులలో నివసించుచున్నారను వార్త విని భోజ, అంధక, వృష్ణి వంశీయులైన రాజులు, పాంచాలదేశపు రాజు, అతని బంధువర్గము, చేది దేశాధిపతి ధృష్టకేతుడు, కేకయరాజు మొదలైనవారందరూ వారి దర్శనముకై

వచ్చి అందరూ పాండవులను పరివేష్టించి కూర్చొనియుండ కృష్ణుడు "ధర్మరాజా! మేమందరమూ నీకు బాసటగా యుందుము. దురాత్ములైన దుర్యోధన, కర్ణ, శకుని, దుశ్శాసన చతుష్టయము, వారి వంశము సమూలముగా నాశనము చేయుదుము. నీ రాజ్యము నీకు తిరిగి లభించును" అని క్రోధముగా పల్కుచున్నాడు, మధ్యదిన మార్తాండుని వలె నున్న ఆతనిని కీర్తించుచూ అర్జునుడిట్లనెను. "మహానుభావా! నారాయణుడవై బదరికాశ్రమమున పదివేల సంవత్సరములు తపస్సు చేసిన మహానుభావుడవు. క్షేత్రజ్ఞుడవు. సృష్టి స్థితి లయ కారకుడవు. అదితి గర్భమున జనించి విష్ణునామమున ప్రసిద్ధుడవైతివి. నిసంధాది సహస్ర రాక్షసులను సంహరించితివి. బ్రహ్మను భీతినొందించిన మధుకైటభులను చంప నుదుటినుండి శూలపాణిని సృష్టించితివి."

"పార్థా! నీవే నేను, నేనే నీవు. మనము నరనారాయణులము. మన మధ్య భేదము లేదు" అని కృష్ణుడు వచించెను.

## కృష్ణునితో ద్రౌపది తమ కష్టములు తెలియజేయుట

అంత పాంచాలి కృష్ణుని చేరి పలు విధముల ఆతనిని కీర్తించి, "కృష్ణా! పాండవుల సహధర్మిణి, దుష్టద్యుమ్నుని చెల్లెలను, నీ ప్రియసఖినియైన నన్ను నీచులైన కౌరవులు సభామధ్యమున యే స్త్రీకి జరుగరాని విధముగా అవమానించినా ఇంకనూ బ్రతికియున్నాను. వారు నన్ను దాసియని పిలుచుచుండ, భర్తలై రక్షింపలేని మహావీరులమని చెప్పుకొను భర్తలున్న యేమి? లేకున్న యేమి? దుష్టాత్ములైన దుర్యోధనాదులు వీరిని కాలకూట విషమిచ్చి, లక్షా గృహమున దహనము చేయ ప్రయత్నించి, పలు విధముల బాధలు పెట్టి నేడు రాజ్యచ్యుతులను చేసినను వీరు ధర్మపథమని చేతులు కట్టుకొని యున్నారు. నాడు నీవలననే నా మానము రక్షింపబడినది. నీవే మాకు దిక్కు" అని అశ్రుపూర్ణ లోచనయై యున్న ద్రౌపదిని ఓదార్చుచూ వాసుదేవుడు "చెల్లెలా! నీవు విచారించవలదు. నీవు కంటినీటిని పెట్టినట్లే నిన్ను అవమానించిన కౌరవులు అర్జునుని తీవ్రబాణముల వలన, భీముని గద వలన సంహరింపబడ గోలుగోలున యేడుస్తూ కన్నీటిని కార్చు దినము త్వరలోనే రానున్నది. భూమండలము తలక్రిందులైనను నేనాడు మాట వమ్ము కాదని తెలిసికొనుము" అని ఆమెను ఓదార్చెను. అర్జునుడు, దుష్టద్యుమ్నుడు కూడా ఆమెను శాంతవచనములతో ఓదార్చిరి.

## 13, 14.

తదుపరి కృష్ణుడు, ధర్మరాజుతో "మహారాజా! మీరు ఆపదలలోనున్న సమయమున నేన ద్వారకానగరమున లేను. కాకపోయిన ఆ సమయమున మిమ్ములను చేరి, ధృతరాష్ట్రుని ప్రీతివాక్యములతోను, హితవచనములతోను ద్యూతక్రీడనుంచి విరమింపజేసెడివాడను. నా మాటను వారు వినకపోయిన వారిని నాశనము చేసెడివాడను. నేను ద్వారకకు మరలిన పిమ్మట యయుధానుని వలన మీ సంగతి తెలుసుకొన్న వెన్నవెంటనే ఇచ్చటకు వచ్చితిని. మంచివారికే కదా యెల్లప్పుడు ష్టములు" అని పలికెను.

"కృష్ణా! ఆ సమయమున నీవెచ్చటనుంటివి? యేమి చేసితివి?" అని ధర్మరాజు ప్రశ్నింపగా కృష్ణుడు –

"భరతశ్రేష్ఠా! నేను రాజసూయ యాగమున శిశుపాలుని వధించితినని తెలిసికొన్న సాళ్వుడు ద్వారకానగరమును చేరి శిశు, బాల, వృద్ధుల ననేకుల సంహరించి, కృష్ణుడేడని తిరిగి తిరిగి తన నగరమునకు వెడలిపోయెను. ఇంద్రప్రస్థమునుంచి తిరిగి వచ్చి సంగతి తెలుసుకొని నేను శౌభనగరమును చుట్టుముట్టి రణమున సాళ్వుని సంహరించితిని. అందువలననే మిమ్ము ఆ సమయమున ఆదుకొనలేకపోయితిని" అని పలికెను.

## 15. శౌభధ్వంసము - సాళ్వ వధ వృత్తాంతము

"కృష్ణా! సాళ్వుని సంహారము సవిస్తరముగా తెలుపవలసినది" అని ధర్మరాజు కోరగా కృష్ణుడు –

"ధర్మరాజా! పుత్రశ్రవుని కుమారుని నేను వధించితినని తెలుసుకొన్న సాళ్వుడు ద్వారకా నగరమును నాల్గువైపులా చుట్టుముట్టెను. ద్వారకా నగర దుర్గము ఆ సమయమున గద, సాంబాది వీరులచే పరిరక్షింపబడియుండెను. శత్రువును చూసిన ద్వారకానగర వీరులు ఆత్మరక్షణార్థమై తగుచర్యలు తీసుకొని సంసిద్ధులైరి.

## 16.

జాంబవతీ నందనుడైన సాంబుడు తన గదతో సాళ్వుని సేనాధిపతియైన వేగవానుని సంహరించెను. క్షేమవృద్ధియను సేనాధిపతి అతని బాణముల ధాటికి తట్టుకొనలేక పారిపోయెను. రుక్మిణీ కుమారుడు చారాదేష్ణుడు విపాధ్యుడను దానవుని సంహరించెను.

## 16.

తదనంతరము మకరకేతనుడైన ప్రద్యుమ్నుడు కాంచనరథారూఢుడై సాళ్వుని ఎదుర్కొనెను. వారిరువురి మధ్య తీవ్రమైన యుద్ధము చెలరేగెను. ప్రద్యుమ్నుని బాణములచే జర్జరితుడయ్యు సాళ్వుడు తీవ్ర శరపరంపరతో ప్రద్యుమ్నుని మూర్ఛితుని చేసెను.

## 18.

అతనిని రక్షించుటకై సారథి యుద్ధభూమినుండి రథమును దూరమగా తీసుకొనిపోయిన, తెప్పరిల్లిన రుక్మిణీనందనుడు సారథిని మందలించి రథమును రణక్షేత్రమునకు మరల్చుమనెను.

## 19.

మహావేగముగా రథారూఢుడైన ప్రద్యుమ్నుడు, దుష్టదానవుడైన సాళ్వుని యెదిరించిన, సాళ్వుడు నూరు బాణములను ఒకేమారు ప్రయోగింప, ప్రద్యుమ్నుడు వానిని మార్గమధ్యముననే ఖండించి వాడియైన బాణములతో అసురుని నొప్పించి, తుదకు బ్రహ్మాస్త్రమున అతనిని వధింపబూనిన, ఆకాశమునుండి యుద్ధమును పరికించుచున్న ఇంద్రుడు, నారదుడు మొదలైనవారు ఆతనిని శత్రుసంహారమునుండి, ఇతడు నీ తండ్రియైన కృష్ణుని వలననే మృతినొందునట్లు విధాత లిఖితమ్ము. దానిని వమ్ము చేయకుము అని ఆపిరి. ప్రాణములను పొందిన సాళ్వుడు మాయారథారూఢుడై ఆకాశమార్గమున ససైన్యముగా రాజధానికి పారిపోయెను.

## 20, 21

ధర్మరాజా! రాజసూయ యజ్ఞానంతరము నేను ద్వారకా నగరమునకు మరలి, సాళ్వుని నీచ ప్రవర్తనను తెలిసికొని, అతనిని వధించిన పిదపనే ద్వారకా నగరమును ప్రవేశింతునని ప్రతినపూని, అస్త్రధారినై, రణదుందుభులు మ్రోయుచుండ రథమునెక్కి, పాంచజన్యము పూరించి బయలుదేరితిని. కతిపయ దినములకు సాళ్వుని నగరము చేరి పాంజన్యము పూరించి యుద్ధమున నన్ను జయింపలేనని మాయాచ్ఛన్ను జేసి నా తండ్రియైన వసుదేవుడు మృతిచెందినట్లు మాయ చేయ మొదట నేను మోసపోయినను, తుదకు అది మాయగా యెరింగి చైతన్యప్రాప్తుడనైతిని.

## 22.

తదనంతరము యక్ష, రాక్షస, దానవ, విపక్ష రాజ భస్మాస్త్రకారి, అరాతి కులవిమర్ధనము, సాక్షాత్తు కృతాంత స్వరూపము, మహాతీవ్రము యైన చక్రమును ప్రయోగించి ఆ దానవుని సంహరించి బంధుమిత్రులకు ఆనందము చేకూర్చితిని.

రాజా! అందువలననే నేను హస్తినా నగరమునకు వచ్చి, ఆ జూదమును ఆపలేకపోయితిని. ఇప్పుడు గతజల సేతుబంధనము చేసి లాభమేమియూ లేదు. మా సహాయము కావలసిన తప్పక చేకూర్తుము" అని పలికి ప్రీతివచనములతో, బంధుమిత్రులతో ద్వారకానగరమునకు మరలెను. దుష్టద్యుమ్నుడు మొదలైనవారు కూడా నిజనగర గమనాభిముఖులైరి.

## 23.

తమతో వచ్చిన బ్రాహ్మణులకు పాండవులు భూరి దక్షిణాదులతో సంతృప్తులను చేసి తమ తమ స్వగృహములను చేరుడని వెనుకకు పంపిరి.

## 24.

తమతో ఉన్నవారందరూ మరలిన పిమ్మట ధర్మరాజు, తమ్ములు, ద్రౌపది, ధౌమ్యపురోహితులను కూడియుండ "మనము ఈ అడవులలో పన్నెండు సంవత్సరములు గడపవలసి యున్నది. అందువలన ఫలపుష్పములతోను, నానావిధ మృగ పక్షి సముదాయముతోను కూడి సజ్జన జనాశ్రితమై కళ్యాణకరమైన స్థానమును అన్వేషింపుడు" అనిన ధనుంజయుడు, "అన్నయ్యా! యెల్లలోకములను పరిభ్రమించు నారద మహర్షి మీకు ఆత్మీయుడు. మీకు తెలియనిదేమున్నది. అయినను, ఇచ్చటకు సమీపముననే ద్వైతవనమందు జలాశయములతోను, ఫలపుష్పములతోను, ద్విజగణనివాసమైనదియైన స్థలము కలదు" అనిన ధర్మరాజు సంతసించి, తమ్ములు, భార్య, ఆగ్నికాది పరివారముతో అచటకు చనెను. మహీరుహ ఛాయను విశ్రమించు వారిని అచటి మునులు, ద్విజులు చేరి స్వాగత వాక్యములు పల్కి ఆహ్వానించిరి.

## 25. పాండవులకు మార్కండేయముని ఉపదేశము

పాండవులు అచటనే ఆశ్రమము నిర్మించుకొని దినములు గడుపుచుండిరి. ఒకనాడు సూర్యసమాన తేజోసంపన్నుడైన మార్కండేయముని అచటకు వచ్చెను. పాండవుల ఆతిథ్యము గ్రహించి ముని విశ్రమించుచూ ధర్మరాజును చూచి,

అడవులలో నున్ననాటి రామచంద్రుడు జ్ఞప్తికి రాగా దరహాసము చేయగా, యుధిష్ఠిరుడు, "మునివరా! మీరెందులకు మమ్ములను చూచి నవ్వినారు? మీ హాస్యము చూసి తపస్వులు అందరూ లజ్జితులైనారు" అని ప్రశ్నింప మార్కండేయుడు "వత్సా! నేను ఆహ్లాదించలేదు, హాస్యమాడనూ లేదు. నేటి నీ దశను చూచి నాటి దాశరథి జ్ఞప్తికి వచ్చాడు. ధనుర్ధరుడు, ఇంద్రసమానుడు, మహాత్ముడు అయిన అతడు కూడా సత్యవ్రత పరిపాలనకై అడవుల వసించాడు. నీవు కూడా అతని వలెనే సత్యసంధుడవై ప్రతిజ్ఞానుసారము అడవులనున్నావు. దీనిని గడపిన పిమ్మట పురుషాకార సహాయుడవై తప్పక రాజ్యలక్ష్మిని పొందెదవు" అని హితవచనములతో, ఆదరించి, యధేచ్ఛ చనెను.

## 26. బక ఋషి వలన యుధిష్టరాదులు ఉపదేశము పొందుట

ఒకనాడు సాయంకాలము, ఒక వంక మునుల ఋక్-యజుర్వేద ఘోష, మరియొక వంక రాజన్యుల శరాసన విసాంసృతజ్యా ఘోషణము మిను ముట్టుచుండ, క్షాత్ర బ్రహ్మతేజముల కలయిక వలన అనిర్వచనీయమైన శోభ పెంపొందుచుండ, దాళభ్య వంశీయుడైన రుకుడను ముని, ధర్మరాజుతో బ్రహ్మతేజము యొక్క గొప్పతనము తెలిపి, క్షాత్రధర్మము బ్రహ్మతేజమును ఆశ్రయించిననాడు తప్పక జయించునని తెలిపి, త్వరలోనే అతడు కూడా విజయము పొందగలడని వక్కాణిస్తాడు.

## 27. ద్రౌపదీ విలాపము

వైశంపాయనుడిట్లనెను – శోకాభిభూతులై వనవాసము చేయుచూ ఒకనాడు సంధ్యాసమయమున పాండవులు, ద్రౌపది ఉపవిష్టులై మాట్లాడుకొనుచున్న సమయమున పాంచాలి ధర్మరాజుతో "నాథా! విధి యెంత విపరీతమైనది. దురాత్ముడైన దుర్యోధనుడు మనలను రాజ్యభ్రష్టులను చేసి, అడవులలో తిరుగునట్లు చేసియూ తృప్తి పడలేదు. మనము హస్తినానగరము వదలు తరి దుర్యోధన, కర్ణ, శకుని, దుశ్శాసనులు వికటముగా నవ్వుచూ పరిహాసము చేయుట నేను యెన్నడూ మరువజాలను. మహారాజులైన మీరు స్వర్గ సింహాసనారూఢులై, రాజన్యులతోను, మంత్రులతోను పరివేష్టింపబడియుండవలసినది. నేడు అడవులలో పడు ఇడుములను చూచుచూ నేనెట్లు ఓర్చుకొనగలను? ప్రతిజ్ఞకు కట్టుబడియుండుట వల్లనే నేడు భీమార్జునులు మహావీరులై యుండియూ, తలవాల్చికొనియున్నారు కదా! రాజభోగములను అనుభవించుచూ, చిర సుఖులైన మాద్రి తనయులు

వనవాసక్లేశము అనుభవించుచున్నారు కదా! ఇవి అన్నియూ చూచుచుండియూ మీరు ముముక్షువువలె శాంతులై యుండుట తగునా? క్రోధశూన్యులైన క్షత్రియులుండరను లోకోక్తిని మీరు వమ్ము కావించుచున్నారా? సమయ మాసన్నమైనప్పుడు క్రోధము చెందని వ్యక్తిని శత్రువులు ఉపేక్షించెదరని తెలియదా?” అని మరియు ఇట్లనెను –

## 28. బలి-ప్రహ్లాదుల ఉపాఖ్యానము

“ఈ సమయమున బలి–ప్రహ్లాద సంవాదమనెడి ఉపాఖ్యానము దయచేసి వినవలసినదని కోరుచున్నాను. ఒకప్పుడు దానవరాజైన బలి, ధర్మజ్ఞుడైన తాతతో క్షమ, తేజస్సులలో యేది శ్రేయస్కరమైనది అని ప్రశ్నింప, ప్రహ్లాదుడిట్లనెను. “వత్సా! కేవలము తేజస్సు వలన గాని, క్షమ వలన గాని శ్రేయస్సు కలుగదు. యెల్లవేళలా క్షమ వహించు రాజును సేవకులు లక్ష్యపెట్టరు. శత్రువుల నాశనమ చేయుదురు. అతడ పడు ఇక్కట్లు ఇన్నని వర్ణించజాలము.”

“అందువలన ఓ ధర్మరాజా! నీవు తేజస్సు చూపు కాలము ఆసన్నమైనది. క్రోధము ప్రకటించి రాజోచితముగా ప్రవర్తింపుడు” అని ద్రౌపది పలికెను.

## 29. ధర్మరాజు ద్రౌపది నోదార్చుట

అంత ధర్మరాజు ద్రౌపదిని ఓదార్చుచూ, “ప్రియా, క్రోధము మనుష్యుని విచక్షణా జ్ఞానశూన్యుని చేసి అమంగళ కార్యములకు హేతువై లోకక్షయమును చేయును. పాపకార్యములను చేయించును. గురుజనులను కూడా చంపించును. శ్రేష్ఠుని కూడా కఠోరవాక్యములతో తూలనాడజేయును. అందువలననే పండితులు దానిని వర్జింతురు. సాధుజన నిగర్హితమైన క్రోధమును వహింప నీవు నన్నేల ప్రేరేపించుచున్నావు? మంచిదినములు కానప్పుడు బలవంతులైనను క్రోధము వహింపక, ఓర్మితో కార్యము సానుకూలము చేసుకొనవలెను. లోకములో అందరూ క్రోధపరవశులైన తండ్రి కుమారుని, భార్య భర్తను వినష్టపరుచ లోకము జనశూన్యమై నశింపదా? క్షమయే అన్ని శుభములకు మూలమని తెలుసు కొనుము” అని నుడివెను.

## 30.

అంత ద్రౌపది “నాథా! ఇట్లు మీ మతిభ్రంశము చేసిన ఆ విధాతను దూరవలెను. అన్నిటిలోను కర్మయే ఉత్తమమైనది. స్వకర్మను వదలి ధర్మము,

దయ, క్షమ అని కూర్చున్న వ్యక్తి ఉన్నతి చెందదు. మీరు ఈ గుణములచేతనే గదా రాజ్యశ్రేష్ఠుడవని నుతికెక్కితిరి. కాని మహారాజా! మీరు ఋజుత, మృదుత, వదాన్యత, లజ్జాశీలత, సత్యవాదితలతో పరాకాష్ఠను చేరినా, ద్యూతవ్యసన జనిత విపరీత బుద్ధి యెట్లు పొందితిరి? నాటి మీ ప్రవర్తనే కదా నేడు మన ఈ దశకు కారణము" అని మరియు ఇట్లు చెప్పదొడంగెను.

"ఓ ధర్మరాజా! చరాచర సమస్త ప్రాణులూ ఈశ్వరునకు వశీభూతులు. సమస్త ప్రాణుల సుఖదుఃఖములకు అతడే విధాత. మన పూర్వజన్మ కృత కర్మానుసారము మన జీవితమను శిల్పమునతడు తయారుచేయును. మన భాగ్యమిట్లుండ మిమ్ములనని యేమి లాభము?"

## 31, 32

ద్రౌపది మాటలను వినిన యుధిష్ఠిరుడు "యాజ్ఞసేని! మనము ఫలము నపేక్షించి యెన్నడూ కర్మను అనుష్ఠించరాదు. నేను ఫలమునపేక్షింపక, గృహస్థ ధర్మానుసారము మెలగువాడను. నీవు నాస్తికుని వలె విధాతను దూరుట తగదు. ఆతని లీలను తెలుసుకొనుట మనవంటి సామాన్యుల వశము కాదు" అని పలుకగా ద్రౌపది "నాథా! నేను ధర్మమును అవమానింపదలచి ఇట్లనలేదు. సమస్త చరాచరజగత్తు కర్మబద్ధమై యున్నదని, పరమేశ్వరుడు కూడా కర్మకు అధీనుడు అని తెలియజేయుటయే నా అభిమతము. మనమిప్పుడు మహా అనర్థమునకు యెదురు నిలిచియున్నాము. మీరు ఈ సమయమున పురుషాకారము అవలంబించిన దీనిని దాటగలుగుదుము" అని పలికెను.

## 33. భీముడు రోషపరవశుడగుట

ద్రౌపదీ, ధర్మజుల సంవాదము, మౌనియై వినుచున్న వృకోదరుడు ప్రవర్ధమానమగుచున్న క్రోధముతో అన్నతో ఇట్లనెను. "రాజా! దయచేసి మీరు ధర్మపన్నాలు వదిలి రాజ్యమును తిరిగి పొందు ఉపాయమును ఆలోచింపుడు. ధర్మార్థ కామవిహీనులమై అడవుల తిరుగుట మనకేల? దుష్టదుర్యోధనుడు మనలను యుద్ధమున ఓడించి తన తేజోప్రభావమున మన రాజ్యమును గ్రహించలేదే! కపట జూదమున మాయతో అపహరించాడు. అల్ప మాత్రమైన ధర్మరక్షార్థము రాజ్యమును వదలి దారుణమైన దుఃఖసాగరమున మునిగియున్నారు. మీ తెలివి తక్కువ వలననే మనము రాజ్యభ్రష్టులమైనాము. మీ ప్రియము చేకూర్చుట కొరకు మాత్రమే మిత్రులకు దుఃఖము, శత్రువులకు ఆనందము

చేకూర్చుచూ, మహావీరులమై యుండియు, అసక్తులవలె పడియున్నాము. వైరులు మనలను లక్ష్యపెట్టక పిరికిపందలుగా యెంచుచున్నారు. మీరు అనుజ్ఞ ఇచ్చిన సంగరమున వారిని ఓడించి రాజ్యలక్ష్మిని గ్రహింతుము. లేదా మృత్యువునే కౌగలించుకొనిన వీరస్వర్గమును పొందుదుము. కర్మహీనులమై యుండుట కన్నా దేహము త్యజించుట శ్రేయము కాదా! బలవంతులకే వసుంధర వశమైయున్నది. అతనికే సర్వసౌభాగ్యములు చేకూరును. బలవంతునకే అన్ని కార్యములు సుసాధ్యములు. మీరు పరాక్రమము చూపి శత్రు సంహారము చేయుడు. మహాధనుర్ధరుడైన అర్జునుడు, గదాయుద్ధ విశారదుడనైన నేను మీకు అండగా ఉందుము."

## 34.

వైశంపాయనుడిట్లనెను. "సత్యవ్రతుడు, మహానుభావుడుయైన యుధిష్ఠిరుడు భీమసేనుని మాటలు విని, ధైర్యమవలంబించుచూ, "తమ్ముడా! వాడియైన ఈటెల వంటి నీ మాటలు నా మనస్సును గాయపరచుచున్ననూ నిన్ను కాదనలేకపోవు చున్నాను. నా అన్యాయ ఆచరణ వల్లనే నేడు మీరు, ద్రౌపది ఇట్టి కష్టము లనుభవించుచున్నారు. రాజ్యలోభియై దుర్యోధనుడు పిలచినట్లు తెలిసినా, శకుని మాయా జూదమున వంచించుచున్నాడని తెలుసుకొన్నా, ఓర్మిని కోల్పోయి మతిభ్రష్టుడనై రాజ్యమును పరుల పాలు కావించాను. కాని పన్నెండు సంవత్సరములు అరణ్యవాసము, సంవత్సర కాలము అజ్ఞాతవాసము చేయుదునన్న నా ప్రతిజ్ఞను మాత్రము తప్పలేను. మాట తప్పి జీవించుట కన్నా మరణమే మేలు కదా! తమ్ముడా! నాడు కురుసభలో నా చేతులను వ్రయ్యలు చేతునని గదాయుధమును యెత్తిన నీవు దించక యుండిననే మేలయ్యెడిదేమో కదా! నేను మీ దుఃఖము చూచు దురవస్థ నాకు తప్పెడిది కదా! మహావీరా! నేను మాటను తప్పనన్నది నిశ్చయమని తెలుసుకొమ్ము. ప్రాణముల కన్నా ధర్మమే మిన్నయని నేనెంచెదను. రాజ్యము, ధనము, పుత్రులు, యశము, ఇవియన్నియు సత్యమునకు సాటి రావు కదా!" అని పలికెను.

## 35.

"మహారాజా! నీవనినట్లు మనము ఈ అరణ్య అజ్ఞాతవాసములను పూర్తిచేయు తలంపుతో మిన్నక ఉండుట అజ్ఞానము కాదా? మనము కలకాలము నివసించియుందుమని యెట్లు చెప్పుచున్నావు? మృత్యువు యే నిమిషముననైన

ఆసన్నము కాగలదు కదా! భుజబలమును ఆశ్రయించి, శత్రువులను నిర్జించి ఐశ్వర్యమును అనుభవించుడు. నేను, అర్జునుడు, నకుల సహదేవులు సంగ్రామ ప్రియులమై, నీ ఆజ్ఞ కొరకై వేచియున్నాము. దుర్బలులు, నీచులుయైన వ్యక్తుల మన రాజ్యమును కైవశము చేసికొనియున్నారు. మహావీరులమై యుండియు మనము కష్టములను అనుభవించుచున్నాము. దయ, ధర్మము అంటూ సమయము గడిపే మీరు బ్రాహ్మణ కులమున జన్మింపక క్షత్రియవంశమున యెందుకు జన్మించారో అర్థము కావడం లేదు. బుద్ధి, బల, శాస్త్ర, అభిజాత్య సంపన్నులమైన మనము యెట్లు అజ్ఞాతవాసము గడుపగలము. భయంకరమైన అగ్నిని యెండుగడ్డితో కప్పియుంచగలరా? మనము అప్పుడే పదమూడు నెలలు అరణ్య వాసము గడిపేము. దీనినే పదమూడు సంవత్సరములుగా గణించి శత్రు నాశనమునకు కృతసంకల్పులు కండు" అని భీముడు, ధర్మజుని ఉత్తేజపరుప తలచెను.

## 36. భీముని ధర్మరాజు ఓదార్చుట

వైశంపాయనుడిట్లనెను - భీముని వచనములు విన్న యుధిష్ఠిరుడు దీర్ఘనిశ్వాసము విడచుచూ ఇట్లు తలపోసెను. "భీముడు నాకు రాజధర్మము తెలిపేడు. కాని పూర్వాపరయుక్తముగా ధర్మసూక్ష్మములను యెరింగిన నేను దానిని యెట్లు ఉల్లంఘించగలను?" అనుకొని ప్రకాశముగా "వృకోదరా! నీవు అన్నది యదార్థము.కాని నా మాటలను ధ్యానముగా వినుము. యే పనులు తొందరపడి సాహసముగా యెదుర్కొనతలతురో ఆ కార్యములు మహాపాపములతో నిండియుండును. మంచి సలహాతో పూర్వాపరములు ఆలోచించి చేయు కార్యము పుణ్యవంతమగును. నీవు చపలచిత్తునివలె, బలదర్పితుడవై, అసమసాహసిక కార్యమాచరింప ప్రవృత్తుడవైతివి. ఇందులకు నా అసమ్మతి కారణములు గ్రహింపుము.

భూరిశ్రవుడు, శల్యుడు, భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, దుర్యోధనుడు మొదలైనవారు అస్త్రవిద్యా విశారదులు. మనవలన పరాభవము చెందిన రాజులందరూ నేడు దుర్యోధనుని వద్ద అమిత ధనము గ్రహించి అతని అనుయాయులై అతనికి అండగా నిలచియున్నారు. వారందరూ సంగ్రామమే ఆసన్నమైన దుర్యోధనునకు సహాయపడుదురు. భీష్మ, ద్రోణ, కృపాచార్యులకు ఉభయపక్షములు సమాన స్నేహభాజనములయ్యు, రాజప్రదత్త అన్న గృహీతులమని సుయోధనుని పక్షమే వహించి ప్రాణములొడ్డి యుద్ధము చేయుదురు. వారు

దివ్యాస్త్రవేత్తలు, వారిని దేవతలు కూడా జయింప జాలరు. అస్త్రవిశారదుడు, అభేద్య కవచధారియైన కర్ణుని యెదుర్కొనుట సామాన్యమైన విషయము కాదు. నీవు సహాయహీనుడవై వీరినందరిని యెదుర్కొని సుయోధనుని గెల్చుట దుష్కరము. భీమా! అధికమేమి పలుకుదును. ధనుర్ధరాగ్రణియైన కర్ణుని తలచుకొనినపుడల్లా నేను నిద్రను కోల్పోవుచున్నాను."

## ధర్మరాజాదుల వద్దకు వ్యాసమహర్షి వచ్చుట ధర్మరాజును ప్రతిస్మృతియను రహస్య విద్యాదీక్షితుని చేయుట

కినుకపూనియున్న భీముడు అన్న మాటలు విని, తూష్ణీభావము చూపుచూ, మొగము త్రిప్పుకొని మౌనము వహించెను. ఆ సమయమున మహాయోగియైన వేదవ్యాసుడచ్చటకు వచ్చి, పాండవుల వలన ఉచిత మర్యాదలను పొంది ధర్మరాజుతో "ఓ నరాధిపా! దివ్యదృష్టి వలన మీ మనోగత అభిప్రాయము తెలుసుకొని, భీష్మ, ద్రోణ, కర్ణాదులవలన నీ భయము తొలగించు విధి తెలియజేయుటకై మీ వద్దకు వచ్చితిని" అని. అతనిని యేకాంత స్థానమునకు తీసుకొని పోయి "భరతసత్తమా! నీకు సిద్ధిరూపమైన ప్రతిస్మృతియను విద్యను ప్రసాదించుచున్నాను. నీవద్దనుండి ఈ విద్యను పొంది అర్జునుడు అస్త్రములకొరకై సాధన చేసిన మహాదేవుని, మహేంద్రుని అనుగ్రహము బడసి దివ్యాస్త్రములు పొందును. అతనిని సామాన్య మానవునిగా గణింపకుము. అతడు నరుడను మహాతేజః సంపన్నుడైన ఋషి, నారాయణుడు ఇతని సహాయకుడు. ఇతనిని యెవ్వరూ జయింపజాలరు. ఇంద్ర రుద్రులవద్ద అస్త్రములనుపొంది మహత్కార్యములను సాధించును. కౌంతేయా! మీరు వెంటనే ఈ స్థలము వదిలి మరియొక స్థానమును చేరుడు. లేనిచో ఇచ్చట మనుపష్యాదులు ఓషధులు నశించును" అని యుధిష్ఠిరునకు ప్రతిస్మృతి విద్యను నేర్పి అంతర్హితుడయ్యెను.

ధర్మరాజు ఋషిదత్తమైన విద్యను జపించుచూ, అతని ఆదేశానుసారము భార్య, తమ్ములు, బ్రాహ్మణ గణములతో కతిపయ దినములకు కామ్యక వనము చేరి అచ్చట నివసించసాగెను.

## 37. అస్త్ర విద్యాస్త్ర లాభార్థము అర్జునుడు తపస్సు చేయుట

వైశంపాయనుడిట్లనెను – కొంతకాలము గడచిన పిమ్మట ఒకనాడు ధర్మరాజు అర్జునుని యేకాంత ప్రదేశమునకు తోడ్కొనిపోయి ఇట్లనెను. "వత్సా!

భీష్మ, ద్రోణ, కృప, కర్ణాదులు మహాధనుర్వేత్తలు. శక్తిసంపన్నమైన అస్త్రముల ప్రయోగోప సంహారములు తెలిసినవారు. దుర్యోధనుడు అధికమైన ధనము వీరికి ప్రదత్తము చేసియున్నాడు. వీరు తప్పక అతనికి బాసటగా నిలచియుందురు. మా ఆశలన్నీ నీ మీదనే యున్నవి. వేదవ్యాసమహర్షి వలన నేను పొందిన విద్యను నీకు నేర్పెదను. దీనిని సాధన చేయుచూ తపస్వివై ఉత్తరదిక్కుగా పయనించి పురందరుని సందర్శించి తేజోసంపన్నమైన అస్త్రములను గ్రహింపుము" అని అతనికి ఆ రహస్య విద్యను నేర్పెను.

ప్రతిస్మృతి విద్యను పొంది అర్జునుడుపురందర సందర్శనార్థమై త్రికరణముల సిద్ధుడై కవచము, ధనస్సు అక్షయ తూణీరాదులు గ్రహించి అగ్నికి ఆహుతిగావించి బ్రాహ్మణులకు దక్షిణ తెచ్చి, వారు స్వస్తి వాక్యములు పల్కుచుండ ధార్తరాష్ట్రుల వధ సాధనార్థమై దీర్ఘనిశ్వాసము పరిత్యజించి, ఊర్ధ్వదృష్టితో ప్రయాణాభి ముఖుడయ్యెను.

ప్రయాణమునకు వెడలు అర్జునుని చూచి ద్రౌపది దీనవదనయై అతనిని చేరి, "ఆర్యపుత్రా! నీ జననకాలమున నీ మాతృమూర్తి కుంతి అభిలాష, నీ కోరిక తీరుగాక! నాడు కౌరవ సభలో పొందిన దుఃఖము కన్నా నేడు నిన్ను వీడియుండుట దుఃఖతరముగానున్నది. దీనబ్రాహ్మణుని ఇంటినైనా సరేగాని, మరల క్షత్రియ కులమున జన్మింపజేయవలదని విధాతను ప్రార్థించుచున్నాను. మా సుఖదుఃఖములన్నియూ నీవే. నీవు లేని జీవితము నిస్సారమగును.

నీవు యే కార్యము కొరకై చనుచున్నావో అది సఫలమగును. నీకు మంగళమగును. హ్రీ, శ్రీ, కీర్తి, ద్యుతి, ఉత్తమ, పుష్టి, లక్ష్మి, సరస్వతి నీకు దారిలో రక్షణనిత్తురు. నీవు పెద్దలను సర్వదా పూజించువాడవు. అందువలన వసు, రుద్ర, ఆదిత్యాదులు నీకు శుభము చేకూర్చెదరు" అని పలుకగా అర్జునుడు ఆమెను ఓదార్చి, భాతృగణమునకు, ధౌమ్య పురోహితునకు ప్రదక్షిణ మాచరించి, శరాసనము గ్రహించి ప్రయాణమయ్యెను. అతడు కతిపయ దినములకు అడవులు, నదులు, కొండలు దాటుచూ, హిమాలయము గంధమాధన పర్వతము దాటి ఇంద్రకీల పర్వతము చేరెను. బ్రాహ్మణ వేషమున ఇంద్రుడు అర్జునుని పరీక్షించిన పిమ్మట, శంకరుని మెప్పించుమని, అనంతరము తాను అస్త్రములనిచ్చెదనని చెప్పి అంతర్హితుడయ్యెను.

అర్జునాభిగమన పర్వాధ్యాయము సమాప్తము

## 38. కైరాత పర్వాధ్యాయము

జనమేజయుడు, వైశంపాయనుని ఇట్లు ప్రశ్నించెను. "మునివరా! మహావీరుడైన అర్జునుడు యెట్లు దివ్యాస్త్రములను పొందెను? యే విధముగా ఇంద్రుని, రుద్రుని తృప్తిపరచి వరములను పొందెను? ఆ విషయములను దయచేసి తెలుపుడు. ఓ బ్రాహ్మణా! లోమహర్షతుమలమైన ధనుంజయ మహాదేవుల సంగ్రామము సవిస్తరముగా వినిపింపగోరెదను.

## అర్జునుడు మహాదేవుని కొరకై తపస్సు చేయుట

వైశంపాయనుడిట్లనెను. "యుధిష్టిరుని నిర్దేసానుసారము దివ్య అస్త్రములు పొందు తలంపున బయలుదేరిన అర్జునుడు తుదకు దివ్యఫల పుష్ప భరితము, వివిధ పశుపక్ష్యాదులతో నిండిన ఇంద్రకీల పర్వత ప్రదేశమును చేరెను.

అచట దండ, అజినములతోను, దర్భఆసనముపై తపస్సు ఆరంభించెను. మొదటి మాసము మూడు దినములకొకమారు, ద్వితీయమాసమున ఆరుదినముల కొకమారు, తృతీయ మాసమున పక్షమున కొకమారు ఫలములు భక్షింపుచూ, చతుర్థమాసమున వాయుభక్షకుడై ఊర్ధ్వహస్తములతో, కాలివ్రేళ్లతో మాత్రమే భూమిని తాకుచూ తీవ్రమైన తపమాచరింపుచుండ అతని తపఃప్రభావమును గాంచి కలతచెందిన మనస్సు కలవారై మునులు మహదేవుని చేరి సంగతి తెలుపగా అతడు "మీరు భయము పొందెదరేల? అతని మనోవాంఛ నాకు తెలుసు. అతడు స్వర్గ యైశ్వర్యములకై తపమాచరింపుట లేదు. అతని కోరిక నేడే తీర్చెదను. మీరు సృష్టచిత్తులై మరలుడు" అని వారిని స్వస్థానములకు పంపెను.

## 39. కిరాత రూపమున హరుడు అర్జునుని తపోవనమును చేరుట

తదనంతరము శివుడు, కిరాత వేషధారియై ధనుర్బాణములు ధరించి, తగు వేషమున కాత్యాయనియు సహస్రాధికులైన ఆమె చెలికత్తెలు వెంట రాగా అర్జునుని తపోవనమునకు ప్రయాణమయ్యెను. భూతగణములు నానా వేషముల అతనిని అనుసరించిరి. క్రమక్రమముగా వారు ఆశ్రమము సమీపించిరి. ఆ సమయమున మూకనామధేయుడైన రాక్షసుడు వరాహరూపధారియై తీవ్రగతిని అర్జునుని దెస చనగా అతడు ఆ వనవరాహమును సంహారము చేయదలంచి వింట అమ్మును చేర్చుచుండ, మాయా కిరాతకుడు ఆతనిని ఉద్దేశించి "ఓయి! తాపసీ! తాళుము. ఈ వరాహమును నేను ముందుగా లక్ష్యము చేసితిని" అని బిగ్గరగా కేకవేసెను. అర్జునుడు ఆతని మాటలను లక్ష్యపెట్టక బాణమును వరాహముపై వదిలెను.

అదే సమయమున శంకరుడు కూడా దానిపై అమ్ము వేయ, ఉభయముల శరముల ఇరుదిక్కుల నాట ఆ రాక్షసుడు చక్రమువలె గిరగిర తిరుగుచూ నేలకూలెను.

అంత అర్జునుడు కోపముతో "ఓయి! కిరాతకా! నీవిచ్చటకు ఇందరు పరివారముతో యేల వచ్చితివి? నీవెవరు? వేట నియమములు ఉల్లంఘించి నేను చంపబోవు వరాహము పైకేల నేలవైచితివి? ఇప్పుడే నిన్ను నేను సంహరింతును" అన, కిరాతకుడు నవ్వుచూ, "ఓయీ వీరుడా! నన్ను చూసి భయపడవలదు. మేము ఈ అడవుల చరించువారము. నేను ఈ వరాహమును చంప వెంటబడి వచ్చుచుండ నీవు నా మాటలను లక్ష్యపెట్టక బాణమేసి, నన్నే తప్పు పట్టుచున్నావు. చూడగా, నీవు మందబుద్ధి వలెను, గర్వితుని వలెను కన్పించుచున్నావు. నేడే నిన్ను యమసదనమునకు పంపెదను. ప్రాణరక్షణార్థము సంసిద్ధుడవు కమ్ము" అని పలికెను.

అర్జునుడు అమిత రోషముతో కిరాతునిపై శరపరంపరలు వేయ అతడు వాటిని సహాస్యముగా ఓర్చుకొని "ఓ వీరుడా! ఇంతకన్నా శక్తివంతములైన బాణములు లేవా? వాటిని ప్రయోగింపవేమి?" అనుచూ తాను కూడా అర్జునునిపై బాణములు వేయసాగెను.

మహారోషముతో అర్జునుడు శక్తిసంపన్నమైన బాణవర్షమును ఆ కపట కిరాతకునిపై వేయ అవి అన్నియూ వ్యర్థమగుట చూచి, "అమోఘమైన శక్తిగల ఇతడు యెవ్వడు? యక్షుడా? దేవతా? లేక రుద్రుడా? మహాదేవుడు తక్క ఇంకెవ్వరైన తప్పక సంహరింతును'' అని తలపోసి మరల బాణము వేయదొడంగెను. అంత ఆతని అక్షయతూణీర ద్వయము శరశూన్యమాయెను. ధైర్యమును కోల్పోని అర్జునుడు వింటితోనే హరుని మోద అతడు బలవంతముగా దానిని గ్రహింప వారిరువురి మధ్య తీవ్రమైన మల్లయుద్ధము చెలరేగెను. కొంతసేపు ఇట్లు మల్లయుద్ధము చేసిన పిమ్మట శంకరుడు అర్జునుని తన ఇరు బాహువుల మధ్య బట్టి తీవ్రముగా పీడనము చేయ పార్థుడు తెలివితప్పి గతాసువు వలె నేలకూలి కొంతసేపటికి తెలివి రాగా, రుధిరాక్త కళేబరముతోను, దుఃఖిత చిత్తముతోను మట్టితో శివలింగము చేసి పూలమాలవైచి పినాకపాణిని అర్చించి కిరాతకుని మరల యెదుర్కొన సిద్ధుడై అతని శిరోభాగమున స్వదత్త మాల్యము చూసి జ్ఞానోదయము పొంది శంకరుని పాదములపై పడెను.

దేవాధిదేవుడైన మహాదేవుడు ప్రసన్నచిత్తుడై "ఫాల్గుణా! నీ అద్భుత శౌర్య, వీర్యములకు నేను సంతసించితిని. నీవంటి వీరుడు క్షత్రియ కులమున ఇంకొకడు

లేడు. నీవు సామాన్యుడవు కాదు. పురాతనమైన ఋషివి. నీకు దివ్యచక్షువు ప్రసాదించుచున్నాను. నన్ను అవలోకింపుము. నీవు నరుడను మునివి. దేవతలు కూడా నిన్ను నిర్జించలేరు. నేను ప్రఫుల్ల చిత్తముతో పాశుపతాస్త్రము ప్రసాదించు చున్నాను. దీనిని గైకొన నీవే సమర్థుడవు" అని పలుక అర్జునుడు, పార్వతీదేవితో యున్న శూలపాణినిన సందర్శించి ఇట్లు కీర్తించెను. "దేవదేవా! మహాదేవ, నీలకంఠా, జటాధర, దక్షయజ్ఞ వినాసనా! లలాటాక్ష! నా నుతులనందుకొమ్ము. పినాకధారీ, మహేశ్వర, ప్రధాన పురుష, దేవేశా! నీ యెడ నేను అపరాధము కావించితిని. ఈ దీనుని క్షమింపుము. ఉమావల్లభా! అజ్ఞాన వశమున నీతో యుద్ధము చేయబూనితిని. నీ శరణాపన్నుడను. నా తప్పులను మన్నింపుము."

## 40. అర్జునుడు పాశుపతాస్త్రము పొందుట

అంత భవానీపతి హాస్యవదనమున అతనిని క్షమించితినని, కౌగలించుకొని, ఓదార్చి "ధనుంజయా! నీవు గత జన్మమున నరుడను ఋషివి. నారాయణునితో నీవు అనేక ఆయత వత్సరములు తపస్సు చేసితివి. ఆ తపోబలము వలననే ఈ భూభారము వహించియున్నారు. నీవే గాండీవము ధరింప అర్హుడవు. నా మాయా ప్రభావముచేత నీ ఆయుధము గ్రహించితిని. వాటిని తీసుకొమ్ము. నీ భక్తికి ప్రసన్నునైతిని. నీ అభీష్టము తెల్పుము. తప్పక నెరవేర్చుదును" అని పలికెను.

"మహాదేవా! నాపై నిజముగా అనుగ్రహము కలిగిన భీష్మ, ద్రోణ, కర్ణాదులను పరాజితులను చేయగలిగినది, భూత, పిశాచ, రాక్షసాదులను దగ్ధము చేయునదియైన బ్రహ్మ శిరోనామకమైన పాశుపతాస్త్రము ప్రదానము చేయుడు" అని అర్జునుడు పలుక శంకరుడు "పార్థా! మహాశక్తిసంపన్నమైన ఈ అస్త్రమును ధారణ, మోక్షణ ప్రతిసంహార యుక్తముగా నీకు ఇచ్చెదను. మనుష్యులే కాదు, ఇంద్ర, యమ, కుబేర, వరుణ, పవనాదులు కూడా దీనిని యెదుర్కొనలేరు. దీనిని తేజోహీనులపై ప్రయోగింపకుము. అట్లు చేసిన లోకమునే దహించును."

అర్జునుడు శుచియై వచ్చి మహాదేవుని వద్ద ఆ దివ్యాయుధము గ్రహించినంత అతడు రెండవ రుద్రుని వలె ప్రకాశించసాగెను. మేదినీ మండలము కంపింప, సహస్ర శంఖ, దుందుభినాదము మినుముట్టెను. ఆ దృశ్యమును దేవతలు గుంపులుగా వచ్చి సందర్శింపసాగిరి.

మహాదేవుడు, అర్జునుని శరీరమును స్పృశించిన అతని శరీరము క్లేశ శూన్యము ఆయెను. శూలపాణి, అర్జునుని నమస్కారములందుకొని, స్వర్గమునకేగ అనుజ్ఞనిడి కైలాసాభిముఖుడయ్యెను.

## 41.

వైశంపాయనుడిట్లనెను. "పినాకపాణి అంతర్హితుడైన పిమ్మట, అర్జునుడు తాను శంకరుని చూడగలిగినందులకు, స్పర్శసుఖము పొందినందుకు ముఖ్యముగా శత్రువును తుదుమాడగల శక్తిసంపన్నమైన అస్త్రము పొందగలిగినందులకు ఆనందనమున ఓలలాడుచుండ, కుబేరుడు, యముడు, వరుణాదులు అతనిని చూచుచూ సంతసించిరి.

ఐరావతారూఢుడైన ఇంద్రుడు మహర్షులు స్తోత్రములు చేయుచుండ అచ్చటకు వచ్చెను.

దక్షిణ దిక్కునకు అధిపతియైన యముడు అర్జునుని చేరి, "అర్జునా! లోకపాలకులమందరము ఇచ్చటకు వచ్చితిమి. నీవు దివ్యజ్ఞానార్హుడవు. మేము నీకు దివ్యజ్ఞానమును ప్రసాదించెదము. మహర్షివైన నీవు బ్రహ్మనిర్దేసానుసారము మర్త్యలోకమున జన్మించితివి. నివాతకవచాది రాక్షసులు, భీష్మ, ద్రోణ, కర్ణాదులందరూ నీచేతనే హతులగుదురు" అని అతనికి 'దండము'నివ్వ, అర్జునుడు విధియుక్తముగా యమదండమును గ్రహించెను.

జలేశ్వరుడైన వరుణ దేవుడు అర్జునునకు వరుణపాశమును ప్రయోగోపసంహార యుక్తముగా ప్రదానము చేసెను.

కుబేరుడు ప్రశ్వాపణమను అమోఘ అస్త్రమును ఇచ్చెను.

అంత దేవరాజు, ఇంద్రుడు "అర్జునా! నీవు ఉత్కృష్టమైన సిద్ధులను పొంది దేవత్వము పొందితివి. దేవకార్యార్థమై స్వర్గమునకు రమ్మని కోరుచున్నాను. అందులకు సిద్ధము కమ్ము. మాతలి రథమును తీసుకొని భూలోకమునకు వచ్చును. ఆ రథము నధిరోహించి నీవు స్వర్గమునకు వచ్చిన పిమ్మట నీకు దివ్యాస్త్రములను ఇచ్చెదను" అని పలికిన, కుంతీనందనుడా లోకపాలకులను జల, ఫలాదులతో పూజ చేసిన వారు తృప్తులై ఆశీర్వదించి స్వస్థానములకేగిరి.

కైరాత పర్వాధ్యాయ సమాప్తి

## 42. ఇంద్రలోకాభిగమన పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! లోకపాలకులు వెడలిపోయిన పిమ్మట అర్జునుడు దేవరాజు యొక్క రథము కొరకై నిరీక్షించుచుండెను. అంత వివిధ ఆయుధ సజ్జితమైనది, దశసహస్ర తురంగయుక్తమైనది, వైజయంతీ పతాక

విరాజితమైనదియైన ఇంద్రరథము భీషణ ఘోషణము దిక్కులు పిక్కటిల మతలి సారథిగా, అర్జునుని చేరెను.

మాతలి రథము దిగి, విజయునకు నమస్కరించి, "మహానుభావా! నిన్ను చూడ దేవరాజు అభిలాష కలిగి ఈ రథము పంపినాడు. సత్వరము తోడ్కొని రమ్మని నన్ను పంపినాడు" అని పలికిన అర్జునుడు మహాపుణ్యాత్ములు కూడా సందర్శించి స్పృశించజాలని యా మహాద్భుతమైన రథము నధిరోహింపగల సౌభాగ్యమునకు సంతసించి, గంగలో స్నానము చేసి, పవిత్రుడై, నియమిత జపము సంపూర్ణము గావించి, పితృతర్పణము చేసి, అంత కాలము తాను నివసించిన పర్వతరాజమునకు నమస్కరించి, "గిరీంద్రా! స్వర్గాభిలాషులైన పుణ్యశీలురకు నీవు ఆశ్రమ స్థానము. నీ దయవలన చాతుర్వర్ణముల వారు స్వర్గ సుఖములనుభవించుచున్నారు. ఇచ్చటి నానా తీర్థములను సందర్శించి, చల్లటినీట స్నానము చేసి తియ్యటి ఫలములను భక్షించి, సుఖముగా కాలయాపన చేసి నీ దయవలన నా అభీప్సితార్థము పొందితిని. నా అభినందనములు గైకొని నాకు సెలవు ఇప్పించుము" అని ఆ పవిత్ర శృంగరాజమువద్ద వీడ్కోలు పొంది, సూర్య సంకాశ దివ్యరథము నధిరోహించి, మాతలి రథము నడుపుచుండ పుణ్యతమ సుకృత ఫలమున నక్షత్రమండలమై ప్రకాశించు పుణ్యలోకములను దాటుచు స్వర్గద్వార దేశమును చేరెను.

## 43. అర్జునుని దేవతలు ఆహ్వానించుట

వైశంపాయనుడిట్లనెను. "విమానముల చరించు సిద్ధ, చారణ గణులను, వివిధ ఫలపుష్పములతో విరాజిల్లు వృక్షములను పరివేక్షించుచూ, సుగంధ పుష్పముల సౌరభము ఆఘ్రాణించుచూ, దివ్యగీ నినాదములు వినుచు అర్జునుడు అమరావతీ నగరమును ప్రవేశించెను.

అంత దేవ, గంధర్వ, సిద్ధ, చారణులు ఆతనిని కీర్తించుచూ, పూజించి ఆహ్వానించిరి. అప్సరాంగనలు నివాళులిచ్చిరి. మహర్షులు మంగళ వాక్యములు పలుకుచూ, ఆశీర్వదించిరి. అతనిని ఆహ్వానించుచూ దివ్య వాద్యములు మ్రోగెను. శంఖ దుందుభినాదముతో దిక్కులు పిక్కటిల్లెను.

తదనంతరము పార్థుడు నక్షత్రముల మధ్య చంద్రుని వలె, సిద్ధ, సాధ్య, మారుత్, అశ్వనీకుమార, ఆదిత్య, వశుగణ, రాజర్షిగణ, రుద్ర, బ్రహ్మర్షి, తుంబుర,

నారద, హుహు ఆది గంధర్వుల మధ్య ప్రకాశించు దేవేంద్రుని చేరి నతమస్కుడై నమస్కారము చేయ, అతడు సింహాసనమును దిగి, ఆత్మజుని ఆలింగనము చేసుకొని మస్తకాఘ్రాణము గావించి, కరము గ్రహించి తనతో సింహాసనమున కూర్చుండబెట్టుకొనెను.

ద్వితీయ వాసవుని వలె వెలుగొందు అర్జునుని స్నేహవాత్సల్యమున ఇంద్రుడు శరణిక్షేపమున కఠినమై బంగార స్తంభముల వలె వెలుగొందు కరములను, బాహువులను నిమురుచూ హర్షోత్ఫుల్ల హాస్యవదనముతో, మరల మరల అర్జునుని మొగము గాంచుచూ ఆనందము అనభవించెను.

తుంబురుడు మొదలైన గంధర్వులు మధుర స్వరమున గానము చేయుచుండ, ఘృతాచి, మేనక, రంభ, పూర్వచిత్త, స్వయంప్రభ, ఊర్వశి, మిశ్రకేశి, దండగౌరి, వరూధిని, గోపాలి, చిత్రసేన, చిత్రలేఖ మొదలైన అప్సరాంగనలు నాట్యము సలిపిరి.

## 44.

ఇట్లు అన్ని విధముల గౌరవ సన్మానితుడైన అర్జునుడు ఇంద్రుని వద్ద మహాస్త్రముల ప్రయోగము, సంహారము నేర్చుకొనెను. ఇంద్రుడు అతనికి వజ్రము, అశని మొదలైన అస్త్రములను ప్రదానము చేసెను. తదనంతరము దేవరాజు నియోగానుసారము విజయుడు స్వర్గరాజ్యమున ఐదు సంవత్సరములు గడపెను. వాసువుని వలన నియోగింపబడిన చిత్రసేనుని స్నేహము చేసి ఆతనివద్ద నృత్య, గీతములు అభ్యసించెను.

అపురూపమైన సుఖసంపదలందు వసించుచున్ననూ, తామరాకుపై నీటి వలె వానియందు లగ్నము కాక ఆతని మనస్సు తమ కుటుంబ దుస్థితిని, అన్నదమ్ములు, భార్య యొక్క కష్టములనే జ్ఞప్తికి తెచ్చెడిది.

## 45.

ఒకనాడు దేవసభలో నృత్యము చేయుచున్న ఊర్వశిని తదేక దృష్టితో అర్జునుడు నిరీక్షించుట ఇంద్రుడు గమనించి, మరునాడు చిత్రసేనుని పిలచి ఊర్వశితో తన ఆజ్ఞగా అర్జునునికి కామకళాప్రాజ్ఞని చేయుమని తెలుపగోర అతడు అట్లే ఊర్వశికి తెలుప ఆ సురాంగన అంతకుముందే తన మనసు అర్జునునిపై మరలుగొన్నందున అంగీకరించెను.

## 46.

పార్థుని సమాగమలాలసమైన ఊర్వశి స్నానాది క్రియలాచరించి, గంధ, మాలాదులతోను, రమణీయమైన వేషభూషనాదులతో అర్జునుని చేరి "పురుషశ్రేష్ఠా! దేవరాజు, గంధర్వరాజుల ఆజ్ఞానుసారము నీ శుశ్రూష కావించుటకొరకై వచ్చితిని. నిన్ను పతిగా పొందుట నా చిరకాల అభిలాష. నా మనోరథమును తీర్చుము" అని వేడిన అర్జునుడు "కళ్యాణీ! నీవు నాకు కుంతి, ఇంద్రాణుల వలె పూజనీయురాలవు. మా వంశమునకు కారకురాలవగుటచే నిన్ను నేను తదేకముగా చూచితిని కాని వేరొండు కాదు. నీ వలననే పురువంశము ఉద్భవించినది. నీవు నాకు పరమ పూజ్యనీయురాలవు. నేను నీకు కుమారుని వంటివాడను. దయచేసి స్వస్థానమునకు మరలుడు" అని పలుక ఊర్వశి తన చాతర్యమునుపయోగించి అతనిని వశపరచుకొన ప్రయత్నించి విఫల మనోరథయై తుదకు "పార్థా! అనంగపీడితురాలనై నీ తండ్రి ఆజ్ఞానుసారము నిన్ను చేరిన నన్ను తిరస్కరించితివి కాన మానహీనుడవై, క్లీబత్వమున స్త్రీమధ్య నృత్యము చేయుచూ కాలము గడుపుమ" అని శపించి, కోపముతో తన వాసస్థానమున కేగెను.

అర్జునుని శాపవృత్తాంతము చిత్రసేనుని వలన తెలుసుకొనిన ఇంద్రుడు విజయుని చేరి, "కౌంతేయా! నీవంటి సత్పుత్రుని గన్న కుంతి ధన్యురాలు. ఊర్వశీ శాపమునకు చింతింపకుము. అది నీకు వరము వలె శ్రేయస్కరమని భావింపుము. అరణ్యవాస కాలము గడచిన పిమ్మట అజ్ఞాతవాస కాలమున నీకు క్లీబత్వమున రాజాంతఃపురమున నర్తకివై సమయము గడుపగలవు. ఆ సంవత్సర కాలము గడచిన పిమ్మట పురుషత్వమును పొందెదవు" అని ఓదార్చెను.

## 47. ఇంద్రసభలో పార్థుడు లోమస మహర్షిని కలుసుకొనుట

వైశంపాయనుడిట్లనెను. "ఒకానొక సమయమున లోకసంచారియైన లోమసమహర్షి దేవసభకు వచ్చి ఉచితాసనమును గ్రహించి, ఇంద్రునితో సమానముగా అర్ధాసనమున కూర్చొనియున్న అర్జునుని చూచి, క్షత్రియుడైన ఈతడు దేవాసనమును గ్రహింప యెట్లు సమర్థుడయ్యెనని ఆలోచింపుచుండ అతని ఉద్దేశ్యమును తెలుసుకొనిన ఇంద్రుడు, "మునిసత్తమా! నీ ఆలోచనకుతప్పక జవాబు తెలుసుకొనము. ఈతడు కేవలము మానవుడు కాదు. నా వరము వలన పుట్టి దేవతాంశము పొందినవాడు. అదేకాక విష్ణు, జిష్ణులైన నరనారాయణలను బదరికాశ్రమవాసులైన మునులలోని నరుడీతడు. ఈతడు, నారాయణుడు నా

కోరికపై దేవతలను పీడించు నివాత కవచాదులను రాక్షసులను చంప భూమిపై జన్మించినారు. అందులకే నేను ఇతనికి అమోఘమైన అస్త్రములను ఇచ్చితిని. త్వరలోనే అర్జునుడు పుడమికి మరలును" అని పలికి ముని శంకను తీర్చి "మహర్షీ! మహారాజైన యుధిష్ఠిరుడు ఇప్పుడు కామ్యకవనమున ఉన్నాడు. నీవు నా కోరిక మన్నించి అతనిని కలుసుకొని, అర్జునుని కుశల వార్త తెలిపి అతడు భీష్మ ద్రోణాదులను తునుమాడగల శస్త్రాస్త్రములను మహేశ్వరుని యొక్కయు, నా యొక్కయు కృపవలన పొందెనని, త్వరలోనే వారిని కలసికొనగలడని తెలియజేయుము" అని పలుక ఆతడట్లేయని పార్థ గమనాభిలాషులైయున్న ధర్మరాజాదులను కలసికొని సంగతులు తెలిపి వారిని ఆనందపరచెను.

## 48. అర్జునుని అభ్యుదయమునకు ధృతరాష్ట్రుడు భయపడుట

జనమేజయుడు ఇట్లు ప్రశ్నించెను, "మునివరా! అమిత తేజుడైన అర్జునుని ఉన్నతిని విని యేమనెను?" అనవైశంపాయనుడిట్లనెను. "రాజా! మహాప్రాజ్ఞుడైన ధృతరాష్ట్రుడు వేదవ్యాసుని వలన అర్జునుని పెంపు నెరింగి, సంజయునితో "సూతా! మునివరుని వలన అర్జునుని అభివృద్ధిని నీవు కూడా వింటివి కదా! దుశ్చరిత్రుడైన దుర్యోధనుడు రాజ్యచ్యుతుడగుట తథ్యము. త్రిజగముల మేటియైన అర్జునుడు భూమండలమంతకూ అధికారియగును. వాటి తూపులకు మొనగాడైన అర్జునుని యెదిరింప యెవరి తరము? మృత్యువునకు అధిపతియైన యముడు కూడా అతని చేర ఇచ్ఛగింపడు."

"పాండవులతో యుద్ధము సంభవించిన దురాత్ములైన నా కుమారులు మృత్యుకరాళ దంష్ట్రముల చిక్కుకొనుట తప్పదు. గాండీవధారిని యెదుర్కొను మేటి విలుకాడు కనిపించుట లేదు. భీష్మ, ద్రోణ, కర్ణాదులు మనవంకనున్నను జయము నిశ్చయమని చెప్పజాలము" అని విచారముగా పలుక సంజయుడాతనితో ఇట్లనెను.

## 49.

"మహారాజా! మీరు పలికిన వాక్యములు సత్యములు. భవానీపతి అర్జునుని పరీక్షింప కిరాత వేషధారియై రాగా వారి యుద్ధమును తిలకింప దిక్పాలకులు వచ్చితిరి అని వింటిమి కదా! మహేశ్వరుడే అర్జునుని తేజహీనుని చేసి ఓడింపజాలక వరములిచ్చెను. అటువంటి విజయుని మానవమాత్రుడు యెదిరింపజాలడు. హీనబుద్ధులైన కుమారులు ద్రౌపదిని అవమానపరచి

పాండవుల అమిత క్రోధమునకు గురియైనారు. నాడు పవనాత్మజుని శపథములు జ్ఞప్తియున్నవా? ఆ మహాయోధుడు మాట తప్పువాడు కాదు. ఇంతగా చెప్పనేల? కఠోక్తులైనను నీ కుమారుల అంత్య దినములు వచ్చినవని యెరుంగుము.”

## పాండవుల భయముచే ధృతరాష్ట్రుడు రోదించుట

## 50, 51

సంజయుని మాటలు విని, ధృతరాష్ట్రుడు రోదించుచూ, “సంజయా! సర్వ అనర్థములకు మూలము ద్రౌపదిని సభాస్థలికి రప్పించుటయే. అంధుడనని సుయోధనుడు నా మాటను లెక్కింపక దుశ్చరిత్రుడైనాడు. దుర్మతులైన శకుని, కర్ణుడు వానికి బాసటగా నిలచి చెడుతలంపులు కలిగించుచుందురు. ధనుంజయుని హస్తముల వీరి మరణము నిక్కము. వాసుదేవుడు వీరికి అండ. ఆతని సహాయము పొందినవారికి పుడమిపై అజేయమైనది యేమున్నది? నాడు జూదక్రీడా సమయము నాడే విదురుడు నాతో, ‘మహారాజా! పాండవులను నీ కుమారులు కౌశలమున ఓడించుటకై ప్రయత్నించుచున్నారు. అటుల జరిగిన కురుకులము యొక్క రక్తము యేరులై ప్రవహించును’ అని పలికెను. అది ఈనాడు నిజము కానున్నది కాబోలు” అని పలికి దీర్ఘనిశ్వాసము విడచెను.

ఇంద్రలోకాభిగమన పర్వాధ్యాయ సమాప్తి

## 52. నలోపాఖ్యాన పర్వాధ్యాయము

## పార్థుని కొరకై పాండవుల విచారము

జనమేజయుడు ఇట్లనెను. “మహాత్మా! పార్థుడు అస్త్రలాభార్థము చనిన తరి పాండవులు యెచ్చట నివసించిరి? దయచేసి సవిస్తరముగా తెలియజేయుడు” అని కోరగా వైశంపాయనుడిట్లనెను. “మహారాజా! అస్త్రములను పొంద అర్జునుడు వెడలిన పిమ్మట పాండవులు, భార్యయైన ద్రౌపదితో కామ్యకవనమున నివసించుచుండిరి. ఒకనాడు వారందరూ నిర్జన ప్రదేశమున తృణాచ్ఛన్నమైయున్న ప్రదేశమున కూర్చుండి తమలో తాము మాట్లాడుకొనుచూ, అర్జునుని తలచుకొని, అతని చేష్టలను జ్ఞప్తికి తెచ్చుకొని విలపించుచుండిరి. త్వరితముగా కోపము చెందు భీముడు, అన్నతో అనుజ్ఞ ఇచ్చిన జనార్ధన సహాయుడనై కౌరవులను తునుమాడెదనని పలుక, ధర్మజుడు ఆతనిని శాంతవచనములతో ఓదార్చుచున్న సమయమున మహర్షి బృహదశ్వుడు ఆ ప్రాంతమునకు రాగా, యుధిష్ఠిరుడు

యెదురేగి, మునికి అర్ఘ్య పాద్యములు సమర్పించి సుఖాసీనుని చేసి, ఆయాసము తీర్చుకొనిన పిమ్మట, "మునివరా! నా దాయాదులు మోసముతో నన్ను జూదమున ఓడించి, రాజ్యము కైవశము చేసుకొనినారు. అందులకే ఇట్లు దుఃఖితుడనై అరణ్యమున వసించుచున్నాను. జూదమున ఓడిన నాటినుంచి నా బంధుమిత్రులు నన్ను అనిన మాటలతో మనస్సు తూట్లుపడినది. మాలో అమిత తేజస్కుడైన అర్జునుడు సమరవిజయా కాంక్షుడై మమ్ములను వదలినాడు. అతని చింతతో మేము గతాసువులవలె కాలము గడపుచున్నాము. మా అర్జునుని యెప్పుడు మేము కన్నులారా కాంచగలము? నా వంటి దురదృష్టవంతుడు, దుఃఖజీవి మరియొకడు లేడు కదా!" అని విచార వదనుడై పలుకగా బృహదశ్వుడిట్లనెను. "రాజా! నావంటి దుఃఖిత వ్యక్తులు యెన్నడైనా ఉన్నారా అని ప్రశ్నించితివి. అందులకు నీకు ఒక ఉపాఖ్యానము తెలిపెదను. సావధానచిత్తుడవై వినుము. నీవు అడవులలో ఉన్ననూ, భార్య, తమ్ములు, బ్రాహ్మణులతో కూడియున్నావు. జూదమాడి నిషధాధిపతియైన నలుడు బంధు బాంధవహీనుడై ఆఖరికి భార్యను కూడా యెడబాసి పలు కష్టములు పడెను" అనిన ఆ చరిత్రను విశదముగా తెలుపుమని ధర్మరాజు వేడెను.

## 53. దమయంతీ జన్మవృత్తాంతము

బృహదశ్వుడిట్లనెను. "మహారాజా! నిషధ దేశమునకు వీరసేనుని కుమారుడైన నలుడు రాజు. అతడు రూపవంతుడు, సర్వగుణ సంపన్నుడు, ఉదార స్వభావుడు, సత్యవాది, జితేంద్రియుడు, ధనుర్ధరశ్రేష్ఠుడు. అతనికి జూదక్రీడపై అనురాగము కలదు. ఆ మహీపతి ప్రజారంజకముగా రాజ్యము చేయుచుండెను.

విదర్భ దేశమునకు రాజు భీమసేనుడు. అతడు దమనుడను బ్రహ్మర్షి దయచే దమ, దాంత, దమన అను ముగ్గురు కుమారులను, దమయంతి యను కుమార్తెను పొందెను. దమయంతి అసామాన్య రూపలావణ్యములు గలది. ఆమె అందము దేవతల కన్నా మిన్నయని, సౌందర్యరాశియని గణతికెక్కెను. నలుని రూపము కూడా జగద్విఖ్యాతి చెందుట వలన వారిరువురు ఒకరికొకరు తగుదురని లోకులనుకొనుట వారి కర్ణగోచరములై దర్శనరహితముగానే ఒండొరులపై ప్రేమ జనించి అభివృద్ధి చెందసాగెను.

దమయంతీ విరహతాపమున నలుడు ఉద్యానవనమున చరించుచుండ, అచటకు కాంచనపక్షయుక్తమైన హంసల గుంపు వ్రాలి సరోవరమున కమ్మని తామరతూండ్లు తినుచుండెను. అందొక హంస నలుని వద్ద చరించుచుండ అతడు

దానిని పట్టుకొనగా ఆ హంస, "రాజా! దయయుంచి నన్ను వదలుము. అట్లు చేసిన తప్పక ఉపకారముచేసెదను. నీవు తలంచుచున్న దమయంతి వద్దకు చని, నీ రూపలావణ్యములు వర్ణించి, నీయెడ ఆమెకు ప్రీతి కలుగునట్లు చేసెదను" అనగా నలుడు ఆ హంసకు ముక్తి కలిగించెను.

## 54.

ఆ హంసయూ విదర్భదేశమున దమయంతిని చేరి, తప్పించుకొనునట్లే నటించుచూ ఆమె హస్తముల చేరి, నలుని గుణములను వర్ణించి, అంతకు క్రితమే ఆమె మనస్సు నలునిపై ఆకర్షింపబడియున్నట్లు తెలుసుకొని, ఆ వార్త నలునికి తెలిపి అతనికి సంతోషము చేకూర్చెను.

## దమయంతీ స్వయంవరము

నల విరహమున కృశాంగియైయున్న సంగతి తెలుసుకొనిన భీమసేనుడు ఆలోచించి దమయంతీ స్వయంవరము చేయ నిశ్చయించి ఆ సంగతి కుమార్తెకు, భార్యకు తెలిపి, వార్తాహరులచే వివిధ రాజులను స్వయంవరమునకు రమ్మని ఆహ్వానములు పంప వారు చిత్ర విచిత్ర వేషములను ధరించి, తమ తమ రథములపై విదర్భకు రాగా అతడు వారిని సాదరముగా ఆహ్వానించి మంచి వసతులు కల్పించెను.

ఆ సమయమున లోకసంచారి నారదమహర్షి అందందు చరించుచూ ఇంద్రసభను చేర, దేవరాజు అతనిని ఉచితరీతిని సత్కరించి భూలోక విశేషములు తెలుపుమనిన ఆతడు దమయంతి రూపలావణ్యములను వర్ణించి, స్వయంవర వార్త తెలుప, ఆమె పాణిని గ్రహింప ఇంద్ర, వరుణ, అగ్ని, యములు ఉత్సుకత కలవారై తాము కూడా ఆ స్వయంవర సభకు తమ వాహనములపై బయలుదేరిరి.

## 55.

విదర్భ దేశాధీశుని ఆహ్వానమున స్వయంవరమునకు వెడలుచున్న నలుని, ఖేచరగమనులైన దిక్పాలకులు చూచి, అతని మనోహరరూపము గాంచి కింకర్తవ్యతా విమూఢులై, తుదకు తమ వాహనములతో అతని మార్గమునకు యెదురుగా పుడమిని అవతీర్ణులైరి.

దేవేంద్రుడు నలునితో, "నిషధ రాజేంద్రా! నీవు ధర్మ పారాయణుడవు, సత్యప్రియుడవు. మా దూతవు కమ్ము" అని పలుక నలుడు అంగీకరించి

కారణమడుగ మహేంద్రుడు "రాజా! మేము దేవతలము, నేను త్రిదశాధిపతియైన ఇంద్రుడను. ఇతడు అగ్ని. ఇతడు జలేశ్వరుడైన వరుణుడు. ఇతడు యముడు. దమయంతి కొరకై మర్త్యలోకమునకు వచ్చితిమి. నీవు దమయంతి వద్దకు చని మాలో ఒకరిని పతిగా వరింపుమని ఆమెను ఒప్పింపుము. నీకు శుభము కలుగును."

ఇంద్రుని మాటలు విని నలుడు కరములు జోడించి, "లోకపాలకులారా! మీరు యెట్టి తలంపుతో వెడలుచున్నారో నేను కూడా దమయంతిని వివాహమాడు తలంపుతో యున్నాను. యే స్త్రీ రత్నమును పొందు తలంపుతో నేనున్నానో, ఆమెను ఇంకొకరు వివాహమాడ ప్రయత్నము చేయలేను కదా! నను క్షమింపుడు" అనగా, మహేంద్రుడు "రాజా! ఆడిన మాట తప్పుట క్షత్రియోచితము కాదు. మా మాటలను త్రోసిపుచ్చకుము" అనిన ప్రతిజ్ఞాభంగమునకు వెరచి, నలుడు అంగీకరించి, దేవప్రభావమున ఇతరులకు కనబడకుండునట్లు వరము పొంది, విదర్భ చేరి, అంతఃపురమున దమయంతిని సమీపించెను.

## దేవతల ఆజ్ఞానుసారము నలుడు దమయంతిని కలసుకొనుట

దమయంతికే తప్ప ఇతరులకు కనబడకుండా ఉండునట్లు దేవతా ప్రభావము పొందిన నలుడు విదర్భదేశమును చేరి అంతఃపురమున దమయంతిని సమీపింప ఆమె నలుని చూచి, అతని రూప లావణ్యములను, ధైర్యగంభీర వదనమును గాంచి, ఇతడు యక్షుడా, గంధర్వుడా, దేవతా అని అబ్బురపడి అతని తేజఃప్రభావమునకు అభిభూతయై సిగ్గుతో తల వంచుకొని, అనంతరము "మహాభాగా! మీరెవరు? పరులెవ్వరూ చొరజాలని ఈ ప్రదేశమునకు యెట్లు వచ్చితిరి?" అని ప్రశ్నించిన నలుడు తనను పరిచయము చేసుకొని, దేవతల కోర్కె తెలిపి, ఆమె ఉద్దేశ్యము తెలుపుమని కోరెను.

## 56. దేవతల కోర్కెను దమయంతి తిరస్కరించుట

అంత దమయంతి, "మహారాజా! నాడు హంస మీ రూపగుణాదులు తెలిపిన నాటినుండి మీయందే మనస్సు లగ్నము చేసికొని యుంటిని. అందులకే మా తండ్రి చేయు స్వయంవరమునకు అంగీకరించితిని. నేడు మీరు కాదనిన నాకు ప్రాణత్యాగము చేయుట తక్క వేరొండు మార్గము కన్పించుట లేదు" అని పలికెను.

దమయంతి వచనములు విని, నలుడు "సుందరీ! సృష్టి, స్థితి కారకులైన దిక్పాలకులు పాదధూళికి కూడా నేను సరిపోను. వారిని పొందిన నీవు

స్వర్గసుఖములను అనుభవింపగలవు. నా వంటి సామాన్యమానవుని కన్న వారెన్నో రెట్లు తగినవారని యెరుంగుము. అదేకాక దేవకార్యార్థినై వచ్చి, స్వార్థసిద్ధికి యెట్లు ప్రయత్నింపగలను? నా దౌత్య ధర్మము తప్పని విధముగా ప్రయత్నింపుము" అని వేడిన దమయంతి, "మహారాజా! నేను నిన్ను తప్ప ఇతరులను వివాహమాడ ననుట నిక్కము. నీవు ధర్మము తప్పినవాడవు కాకుండా లోకపాలకులను కూడా స్వయంవరమునకు రమ్మనుము. వారి యెదుటనే నిన్ను నేను వరింతును" అని నుడివిన, నలుడు ఆమెకు వీడ్కోలు తెలిపి అంతఃపురము వీడి, దిక్పాలకులను చేరి జరిగినదంతయూ వారికి తెలిపెను.

## 57. స్వయంవర సభలో దమయంతి పతి అన్వేషణ

పుణ్యతిధినాడు, శుభకాలమున, విదర్భ దేశాధీశుని ఆహ్వానమున రాజులు స్వయంవర సభామంటపమును అలంకరింప, సర్వాభరణ భూషితయైన దమయంతి భూపాలగణముల మనస్సు, నయనములు అపహరించి ప్రవేశించెను. రాజన్యుల నామములు వినుచు నలుని కొరకు ధృక్కులు సారించుచు, ఒకే స్థలమున వరుసగా నలభ్రాంతి కలిగించుచూ ఐదుగురిని చూచి దేవతా ప్రభావమని యెరింగి "ఓ దేవతలారా! హంస వాక్యమును విన్ననాటినుంచి, నిషధాధిపతినే పతిగా వరించితిని. అన్య పురుషగామినినై పాపచారిణిని కాకుండా నన్ను ఆశీర్వదింపుడు. నలుని పతిగా పొందుటకై నేను చేసిన పూజలు సుఫలము నిచ్చునట్లు, మీమీ నిజరూపములు ప్రకటించి, పుణ్యశ్లోకుడైన నలుని గుర్తించి, వరింప వరమిందు" అని ప్రార్థించెను.

### దమయంతి నలుని వరించుట

దమయంతి నివేదనను విన్న దిక్పాలకులు త్రికరణముల ఆమె నలుని యందే మనస్సు నిల్పుకొనినట్లు తెలుసుకొని తమ నిజరూపములు ప్రకటింప, ఆ ఇందువదన వరమాలను నలుని కంఠసీమ నలంకరించి, అతనిని పతిగా వరించెను.

ఇంద్రాదులు ప్రశంసా వాక్యములు పలుకుచుండ నలుడు దమయంతితో "కళ్యాణీ! సురులను దిక్కరించి నన్ను వరించిన నీకు జీవితాంతము ప్రణయపాశా బద్ధుడనై ఉందును" అని పలికిన, ఆమె ఆనందపరవశ ఆయెను.

తదనంతరము సురులు, నలునకు వరములిచ్చి, దంపతులను ఆశీర్వదించి స్వస్థానముల కేగిరి. నలుడు అగ్నిసాక్షిగా దమయంతిని వివాహమాడి, కొంత

కాలము అత్తవారి ఇంట ఆనందముగా గడపి, విదర్భాధీశుని వద్ద సెలవు తీసుకొని, దమయంతితో స్వనగరమునకు తిరిగివచ్చెను. ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడచూ, యజ్ఞయాగాదులు కావించుచూ, దమయంతీ మనోభిరాముడై, ఇంద్రసేనుడను కుమారుని, ఇంద్రసేని అను కుమార్తెను పొంది సుఖముగా కాలము గడపుచుండెను.

## 58. నలుని నాశనము చేయ కలి సంకల్పించుట

బృహదశ్వుడు ఇట్లనెను "మహారాజా! దమయంతి స్వయంవరానంతరము స్వస్థానములకు మరలుచున్న దిక్పాలకులను మార్గమధ్యమున కలి ద్వాపరములు కలసుకొనిరి. దమయంతిని వివాహమాడదలంచిన కలి, ఆమె సురులను ధిక్కరించి నలుని వరించుట తెలుసుకొని క్రోధావిష్టుడై నలుని రాజ్యచ్యుతుని చేసి నాశనమ చేతునని ప్రతిన పూనెను.

## 59. నలుని దేహమున కలి ప్రవేశించుట

స్వీయవాంఛను తీర్చుకొనుటకై కలి నలుని వద్దకు వచ్చి ఆతనిలో ప్రవేశించుటకై ఛిద్రాన్వేషణము చేయుచుండెను. ఇట్లు పదకొండు సంవత్సరములు గడచినవి. దైవదుర్విపాకమున నలుడొకనాడు బయలుకు వెడలి తిరిగి వచ్చునెడ పాదప్రక్షాళనము చేసికొను సమయమున పాదములు కొంతమేర తడియకుండెను. సమయమునకై కాచికొనియున్న కలి నలుని దేహమున ప్రవేశించెను.

కలి ప్రేరితుడైన నలుని తమ్ముడు పుష్కరుడు భాతృ సన్నిధానమునకు వచ్చి, అక్షక్రీడకై ప్రేరేపించెను. అంతకు క్రితమే కలి పుష్కరునికి తన ప్రభావసంపన్నమైన పాచికలను ఇచ్చి ధైర్యముగా వెడలుమనెను.

కలి మాయా ప్రబావమున నలుని విచక్షణా జ్ఞానశూన్యుడై తమ్ముని కోర్కెను అంగీకరించెను. ఆ జూదములో నలుడు సువర్ణ, యాన, వసన, వాహనాదులు క్రమముగా కోల్పోవసాగెను. ముందు మంత్రి, సామంతాదులు నలుని క్రీడనుండి నిరాసక్తుని చేయ ప్రయత్నించి, కార్యము సానుకూలము కాకుండుటచే దమయంతిని చేరి ఆమెను భర్తను జూదమునుండి మరల్పుమని వేడిరి. ఆమెయు భర్తను చేరి పరిపరి విధముల వేడికొన్నను, కలి ప్రభావమున ఆతడు ప్రత్యుత్తర మీయకపోయిన, దుఃఖముతోను, సిగ్గుతోను, దమయంతి అంతఃపురమునకు తిరిగి వచ్చెను.

## 60. అరిష్టములు కలుగనున్నవని అనుమానించిన దమయంతి సంతానమును పితృగృహమునకు పంపుట

బృహదశ్వుడిట్లనెను. "మహారాజా! ద్యూతక్రీడా ఉన్మత్తుడైన నలుని సన్మార్గమున రప్పింపదలచి, దమయంతి అతని ప్రియపరిచారికయైన మధుర భాషిణిని రప్పించి, అంతవరకు రాజు కోల్పోయిన అపార ధనధాన్యాదులు, వస్తు వాహనముల పట్టిక కూర్చి, ఆతనికి చూపి, జూదక్రీడా విముఖుని చేయుమని పంపెను.

విఫలమనోరథయై తిరిగి వచ్చిన చేటిని పంపి దమయంతి రథసారథిని రప్పించి అతనితో "ఓయీ! రాజు నీ యెడల యెల్లవేళలా దయ కలిగి యుండెడివాడు. నేడు దురవస్థయందున్న అతనికి సహాయపడు సమయము వచ్చినది. విధి నేడు వక్రించినది. సమస్త రాజ్యము కోల్పోవు సమయము రానున్నట్లు నాకు తోచుచున్నది. కావున నీవు మా కుమార్తెను, కుమారుని వారి తాతగారైన కుండిన నగరాధీశుని వద్దకు చేర్చుము. నీకు సమ్మతమైన నీవునూ ఆ మహారాజు ఆశ్రితుడవు కాగలవు" అని పలికిన వార్ష్ణేయుడను ఆ సారథి మంత్రుల సలహాను కూడా తీసుకొని నలుని సంతానమును రథమున నిడుకొని విదర్భ చేరి, వారిని, రథమును, అశ్వములను భీమసేన మహారాజునకు అప్పగించి, ఆతనివద్ద సెలవు తీసుకొని, ఋతుపర్ణ మహారాజు వద్ద సారథియై జీవితము గడుపసాగెను.

## 61. సర్వము కోల్పోయిన నలుడు పురము త్యజించుట

క్రమముగా నలుడు రాజ్యము, సర్వసంపదలను జూదమున ఓడిపోయెను. అన్న సర్వస్వము కోల్పోయినట్లు తెలుసుకొనిన పుష్కరుడు అతనిని హేళన చేయుచూ, "మహారాజా! మరల క్రీడ ఆరంభింతుమా? ఈమారు యేమి పందెముగా ఒడ్డెదరు? దమయంతి మాత్రమే మిగిలియున్నది! ఆమెనే పణముగా నుంచెదరా?" అని తిరస్కారపూర్వకముగా పలుకగా, క్రోధానలమున ప్రజ్వలితుడైన రాజు, శరీరముపై నున్న ఆభరణాదులు తొలగించి పుష్కరునికి ఇచ్చి, యేకవసన ధారులై భార్యాభర్తలు పురమును వదిలి, పులిమేరలలో ఆశ్రయ మేర్పరచుకొనిరి. ఆ దంపతులకు సహాయపడువారికి మరణదండన విధింతునని పుష్కరుడు ప్రకటించుటచే యెవ్వరూ వారి దెస కూడా చూచుటకు కూడా భయపడసాగిరి.

తుదకు వారు జనపదములు వదలి కాననమున పయనించుచుండ ఒక స్థలమున నలుడు తరుఛాయను చరించుచున్న పక్షులను చూచి క్షుద్బాధ నివారించుకొనుటకై వస్త్రమును పైన వేయ, ఆ యేకవస్త్రమును ఆ పక్షులు గ్రహించి అంబరమున యెగిరి, “ఓ నలమహారాజా! మేము నీ సర్వస్వమును దోచిన పాచికలము. నీవు స్వతంత్రుడవై ప్రస్థానము చేయుట ఇష్టపడక వస్త్రమును గ్రహించు నెపమున వచ్చితిమి” అని పలుకుచూ, అంబురయుక్తముగా మాయమయినవి.

భార్య యొక్క అర్ధవసనము గ్రహించి నలుడు లజ్జను నివారించుకొనెను. అట్లు కొన్ని దినములు పయనించిన పిమ్మట నలుడు నదీనదములు చూసి ఆ మార్గము కుండిననగరమునకు దారియని పలుక దమయంతి భీతి చెంది తాను యేకాకియై పితృగృహమునకు చేరనని, నలుని కూడా రమ్మని వేడ అతడు “లలనా! దుఃఖమున ఉన్నవానికి భార్య ఒక్కతియే మిత్రురాలు. యే భోగభాగ్య సంపన్నుడనై ఒకనాడు నీవద్దకు వచ్చితినో, అవి కోల్పోయి, బికారినై నీ పితృగృహమునకు నీతో రాలేను. నన్ను క్షమింపుము” అని పలికెను.

## 62. కలి ప్రభావమున నలుడు దమయంతిని వదిలిపోవుట

దురదృష్టవంతుడైన తనతోయున్న ఆమె ఇంకనూ మిక్కుటమగు శ్రమలకోర్చుకొనవలసి యుండునని, తాను వదలిచనిన ఆమె యెట్లైనను పితృగృహమును చేరి సుఖముగా నుండునని తలంచి, ద్వాదశాదిత్యులను, వసువులను, మరత్ గణములను ఆమెను రక్షింపుదని ప్రార్థించి, తాను ధరించిన వసనభాగమును వేరుపరచి, ఒకవంక కలి ప్రభావము మరియొక వంక ఆమెపైనున్న ప్రేమయు ఆకర్షించుచుండ విచార, వికల మనస్కుడైన నలుడు పదే పదే వెనుతిరిగి చూచుచూ నిద్రించు దమయంతిని వీడి అరణ్యమార్గమున యేకాకియై చనెను.

## 63. నలపరిత్యక్త దమయంతి విలాపము

బృహదశ్వుడిట్లనెను. “మహారాజా! నిషధరాజు వెడలిపోయిన పిమ్మట మేల్కొనిన దమయంతి నాధుని గాంచక, అందందు వెదకుచూ, కానక, భీతిని చెంది, “సత్యవ్రతుడవు, ధర్మపరాయణువైన నీవు ఇటుల పాపాత్ముని వలె నన్ను వదలిపోవుట ఉచితముకాదు. వెంటనే తిరిగి వచ్చి నీ భార్యను కాపాడుము” అని పలు విధముల రోదించసాగెను.

పతిని గూర్చి విలపించుచున్న దమయంతిని అరణ్యమందలి ఒక మహాకాయ అజగరము ఆమెను ఆహారముగా మ్రింగసాగెను. భర్తయందే మనస్సు నిల్పి దీనముగా రోదించుచున్న దమయంతి తన నిజస్థితిని గుర్తించజాలకుండెను. ఆమె విలాపమును విన్న ఒక వ్యాధుడు అచ్చటకు వచ్చి, ఆమె దశను చూచి త్వరితముగా నిశితశస్త్రముతో ఆ దుష్టసర్పమును చంపి దమయంతిని రక్షించి, అర్ధవసనయై, మేఘాచ్ఛాదిత చంద్రునివలె నున్న ఆ సుందరీ రత్నమును గాంచి, మదనవికారమున ఆమెను గ్రహింప ప్రయత్నించి, శాపగ్రస్తుడై, విగతజీవుడై నేలకూలెను.

## 64.

భర్తృవియోగమున దీనయు, దుఃఖితయుయైన దమయంతి, ఉన్మాదిని వలె తిరుగుచూ తరులతాదులను, నదీనదములను తన భర్త జాడ అడుగుచూ ఒక ముని ఆశ్రమము చేరిన, మునులు ఆమె పరిచయమడిగి తెలుసుకొని, "కళ్యాణీ! విచారింపకుము. ఉత్తరకాలమున నీవు పతిని కలసుకొందువు. అతడు తన రాజ్యమును తిరిగి పొందును. మీ కుటుంబము సుఖముగా కాలము గడుపుదురు" అని ధైర్యము చేకూర్చి అంతర్హితులైరి.

అటుల వనమున తిరుగుచూ ఒక నదీతీరమును చేరిన దమయంతి యేనుగులు, గుఱ్ఱములు, ఒంటెలు మొదలైన వాహనములతో నదిని దాటుచున్న వర్తకుల సార్థమును కాంచెను. ఆ బిడారులు అర్ధవసనధారిణి, కృశశరీర, మలినవర్ణయై ధూళి ధూసరిత కేశకలాపముతో ఉన్మత్తవలెనున్న దమయంతిని గాంచి, యక్షిణియో, పిశాచమో అని భయపడసాగిరి.

దమయంతి వారికి తన స్థితిని తెలియజేయగా శుచియను నాయకుడైన వర్తకుడు ఆమెయందు దయ కలిగి ఆదరముగా సంభాషించి తమతో వచ్చుటకు అనుజ్ఞ ఇచ్చెను.

## 65.

చేది రాజ్యాభిముఖులై చనుచున్న ఆ వర్తకులతో దమయంతి పయనించ సాగెను. కొద్ది దినముల తరువాత ఆ అరణ్యమందు పద్మసౌగంధికమను సరోవర సమీపమున ఆ సార్థవాహులు ఆగి, గుడారములు నిర్మించి, వంటలు చేసికొని, భుజించి, చీకటి పడుచుండగా మార్గ క్లేశయుక్తులగుటచే సుఖముగా నిద్రించసాగిరి.

అర్థరాత్రి సమయమున మదస్రావమున విభ్రాంతి చెందియున్న యేనుగుల గుంపు నీటిని త్రాగుటకై సరోవర తీరమునకు వచ్చి అచ్చట బిడారుల యేనుగులను గాంచి క్రోధముతో వాటిని సంహరింప యెదుర్కొనెను.

కొండలవలె ఢీకొనుచున్న ఆ యేనుగుల గుంపుచే విశ్రమించుచున్న పెక్కుమంది వర్తకులు మరణించిరి.

తప్పించుకొన్నవారందరూ సూర్యోదయానంతరము కలసికొని తమ దీనస్థితికి విలపించుచూ, ఇట్టి దుర్విపాకమునకు మనతో కలసిన ఆ వనితయే కారణమని ఆమెను చంపిన తమ కష్టములు తీరునని అనుకొనుచుండ, దమయంతి వారి మాటలు విని భయముతో, అరణ్యమధ్యమునకు పారిపోయి, ఒంటరిగా నుండ వెరచి ఆ బిడారుల వెంటనే, వారికి కనిపించకుండా ప్రయాణము చేయుచూ సాయంకాలమునకు చేది దేశాధిపతియైన సుబాహుడను నృపతి నగరమును చేరెను.

## సుబాహు నృపతి పురమున దమయంతి వసించుట

జరాజీర్ణమైన అర్ధవసనముతోను, మలినదేహముతోను, విరగబోసికొనిన కురులతోను ఉన్న దమయంతిని నగరములోని బాలకులు వింతగా చూచుచూ యెగతాళి చేయుచూ ఆమె వెంట నడువసాగిరి. ఆ సమయమున రాజమాత ప్రాసాద ఉపరిభాగమునుండి ఆమెను చూచి, కులీనవంశ స్త్రీగా యెరింగి పనికత్తెను పంపి ఆమెను పిలిపించి, అట్టి దీనదశకు కారణమడిగిన దమయంతి, “నేను సైరంధ్రిని. ఫలమూలములను మాత్రమే ఆహారముగా తీసుకొందును. నా భర్త గుణవంతుడు. కాని విధివైపరీత్యమున జూదమాడి సర్వమును కోల్పోయినాడు. అడవులలో యే కారణముననో నన్ను వీడి చనినాడు. నేను ఆతని కొరకై వెదకుచున్నాను.”

దమయంతి దీనదశ గాంచి రాజమాత “భద్రే! నీవు మావద్దనే వసింపుము. నీ భర్తను నేను వెదికించెదను” అనిన దమయంతి “తల్లీ! మీవద్ద నివసించుటకు నాకు అభ్యంతరము లేదు. కాని నా నియమములను పాటించగలిగిననే ఉండగలను. నేను యెవ్వరి యెంగిలి తినను. పాదములు పట్టను. పురుషులతో ప్రసంగింపను. నా భర్తను వెదకు బ్రాహ్మణులను నా వద్దకు పంపిన ఆతని రూపగుణములను వారలకు తెలిపెదను” అని పలికిన రాజమాత ఆమె వచనములకు అంగీకరించి, తన కుమార్తెయైన సునందను పిలచి ఆమెతో

దమయంతిని సఖిగా ఉంచుకొనమని పలికెను. దమయంతియ భోగములను అంటక నిరుద్వేగముగా కాలము గడుపసాగెను.

## 66. దావాగ్నినుంచి కర్కోటకుని నలుడు రక్షించుట

బృహదశ్వుడిట్లనెను. "మహారాజా! దమయంతిని వీడిన నలుడు అరణ్య మధ్యమున ప్రయాణము చేయుచూ దావానలము ప్రజ్వరిల్లుటను గాంచెను. ఆ సమయమున "ఓ నలమహారాజా! శీఘ్రముగా వచ్చి నన్ను రక్షింపుము" అన్న కేక విని ఆ దెసకు చని మంటల మధ్యనున్న సర్పమును గాంచిన, ఆ పన్నగము "రాజా! నేను నాగవంశ సంజాతకుడను. కర్కోటకుడు నా పేరు. నారదముని శాపమున ఇట్లు చలనము లేక పడియున్నాను. 'నలమహారాజు నిన్ను రక్షింప, శాపముక్తుడవుదువని ఆతడు తెలిపెను. నా శరీరమును లఘుతరము చేయుదును. నన్ను కాపాడుము" అని శరీర ప్రమాణము తగ్గించి అంగుష్ట సమానుడైన, నలుడు ఆ సర్పమును రక్షించి అగ్నినుండి దూరముగా వచ్చెను. అంత కర్కోటకుడు "రాజా! లెక్కించుచూ అడుగులు వేయుమని అనిన, నలుడు పది అడుగులు లెక్కించుసరికి, నలుని ఆ సర్పరాజము కాటు వేసెను. సర్పవిష ప్రభావమున నలుడు తొలి తన రూపు కోల్పోయి వికృతాకారుడయ్యెను.

కర్కోటకుడు నిజరూపమును పొంది నలుని ఓదార్చుచూ "మానవులు నిన్ను గుర్తించకుండా ఉండుటకే నీ రూపు మార్చితిని. నీకు దుఃఖము కలిగింప నీ శరీరమును ఆశ్రయించుకొనియున్న క్రూరుడు నా తీవ్ర విషముచే దగ్ధమగుచూ మిక్కుటముగా బాధపడును. నా విషప్రభావమున నీకు శత్రు భయము కలుగదు. నీవు సంగ్రామమున విజయము పొందెదవు. నీవు అయోధ్యా నగరమున ఇక్ష్వాకు వంశస్థుడైన ఋతుపర్ణుని వద్దకు చనుము. బాహుకుడను రథసారథిగా నిన్ను పరిచయము చేసుకొనుము. ఋతుపర్ణ మహారాజు ద్యూతక్రీడాసక్తుడు. అక్షవిద్యా విశారదుడు. నీవు ఆతనికి అశ్వచాలన విద్య నేర్పి అక్షవిద్యా పారంగతుడవైన ఐశ్వర్యము తిరిగి పొంది భార్యాపుత్రులను కలుసుకొందువు. నేను ఇచ్చు ఈ వస్త్రయుగ్మము ధరించిన నీ నిజరూపమును పొందెదవు" అని పలికి కర్కోటకుడు, నలునకు దివ్యవసనయుగళము ఇచ్చి, మంచి మాటలతో ఊరట చేకూర్చి అంతర్హితుడయ్యెను.

## 67. ఋతుపర్ణ నృపతి వద్ద నలుడు అశ్వాధ్యక్షుడిగా యుండుట

కర్కోటకుడు చెప్పిన విధముగా ప్రయాణము చేసి నలుడు ఋతుపర్ణుని సభ చేరి, రాజుతో "రాజా! నా పేరు బాహుకుడు. అశ్వచాలనములోను,

అశ్వశిక్షణలోను, అశ్వపరీక్షలోను నన్ను మించినవారు లేరు. నన్ను నీవద్ద ఉంచుకొని పోషించమని కోరుచున్నాను."

ఋతుపర్ణుడు నలుని మాటలకు సమ్మతి తెలిపి, తన రథచాలకులైన వార్ష్ణేయుడు, జీవలుడు అన్నవారిని నలుని అధీనులను చేసి తన అశ్వశాలయందలి అశ్వముల పర్యవేక్షణ చేయుమని అడిగెను.

నలుడు ఋతుపర్ణుని ఆదేశానుసారము అశ్వపర్యవేక్షకుడై దినములు గడుపుచుండెను. సాయంకాల సమయములందు భార్యా, పిల్లలూ జ్ఞప్తికి రాగా విలపించు నలుని జీవలుడు కారణమడుగగా తన అనుచిత కార్యము వలన భార్యావిహీనుడనైతినని అహర్నిశము రోదించెడివాడు.

## 68. నల-దమయంతుల కొరకై భీమ నృపతి అన్వేషించుట

బృహదశ్వుడిట్లనెను. "ఓ రాజా! రాజ్యమును కోల్పోయి కుమార్తె, అల్లుడు గర్భదరిద్రులవలె నిజనగరమును వదిలి చనినట్లు తెలుసుకొన్న విదర్భాధిపతి బహుసంఖ్యకులైన బ్రాహ్మణులను పిలచి, తగిన ధనమిచ్చి నలదమయంతుల జాడ కనుగొన్నవారికి వేయి గోవులను, నగరతుల్యమైన గ్రామమును ఇత్తునని వారిని వెతకుటకు నలుదిక్కుల పంపెను.

వారిలో సుదేవుడను బ్రాహ్మణుడు పలు దేశముల చరించుచూ తుదకు చేది దేశమునకు వచ్చి రాజాంతఃపురమున సునందతో నున్న దమయంతిని గాంచి, ఆమెతో "వైదర్భీ! నేను నీ అన్నకు స్నేహితుడను. నా పేరు సుదేవుడు. మీ తండ్రిగారైన భీమసేన మహారాజు పెక్కుమంది బ్రాహ్మణులను మీ దంపతులను వెదుకుటకు పంపెను. భాగ్యవశమున నిన్ను కనుగొంటిని. నీ కుమార్తె, కుమారుడు, సహోదరులు, తల్లితండ్రులూ కులాసాగానే ఉన్నారు" అని పలికిన, ఆతనిని గుర్తించిన దమయంతి సుహృద్గణముల వార్తల నడుగుచూ దఃఖముతో రోదించసాగెను.

## 69.

కుమార్తె వలన సైరంధ్రి బ్రాహ్మణుని కలుసుకొని రోదించుచున్న వార్త తెలుసుకొనిన రాజమాత అచ్చటకు వచ్చి, బ్రాహ్మణుని కారణమడిగిన అతడు దమయంతి పరిచయముచేసి పూర్వ వృత్తాంతమంతయూ తెలిపిన, కన్నుల నీరునిండ రాజమాత దమయంతిని ఓదార్చుచూ, "బిడ్డా! నీవు యెవ్వరో కాదు.

స్వయముగా నా చెల్లెలి కుమార్తెవు. నేను, మీ జననీ దశార్ణ దేశాధిపతి కుమార్తెలము. నీవు నా పితృగృహమున జన్మించినపుడు చూచితిని. నీవు అన్యథా తలంపకుము. ఈ ఐశ్వర్యమంతయు నీ అధీనమే" అని పలికిన దమయంతియు ఆనందించి, పెద్దతల్లితో "మీవద్ద నేను యెంతో సుఖముగా కాలము గడిపితిని. చాలాకాలము నుండి ప్రవాసినై నున్న నాకు తల్లిదండ్రులను చూడ అనుజ్ఞ ఇందు" అని కోరిన, రాజమాత సంతసించి, అనేక భక్ష్య, భోజ్యములతోను, ధనముతోను, సేనాయుతముగా పల్లకిపై దమయంతి పితృగృహమునకు పంపెను.

కుమార్తెను గాంచిన భీమసేన మహారాజు కుటుంబము మిక్కిలి సంతసించిరి. అతడు సుదేవునకు వేయి గోవులను, పెద్ద గ్రామమును, ధన ధాన్యములను ఇచ్చి గౌరవించెను.

దమయంతి పితృగృహమును చేరిన పిమ్మట ఆమె దీనవదనమును గాంచి, భీమసేనుడు నలుని వెదకుటకై పలువురు బ్రాహ్మణులను వేడ వారు ఇనుమడించిన ఉత్సాహముతో దమయంతిని ముందుగా కలుసుకొని, ఆమె తనను నలుడు కారడవులలో అర్థవసనగా వీడి చనుట, దాని కారణమేమని ప్రశ్నించునట్లుగా చెప్పిన వాక్యములను జ్ఞప్తియుంచుకొని వానిని వివిధ దేశముల ఉచ్చరించి నలుని వెదుకసాగిరి.

## 70. పర్ణాదుడను బ్రాహ్మణుడు దమయంతితో నలుని వృత్తాంతము యెరింగించుట

బృహదశ్వుడిట్లనెను. "మహారాజా! కొంతకాలము జరిగిన పిమ్మట పర్ణాదుడను బ్రాహ్మణుడు కుండిన నగరమునకు తిరిగి వచ్చి, దమయంతితో "కళ్యాణీ! నేను పలు దేశములు నలునికై తిరుగుచూ, అయోధ్యా నగరాధిపతియైన ఋతుపర్ణుని సభలో నీవు పల్కిన మాటలు వక్కాణింపగా యెవరునూ యెట్టి సమాధానము ఇవ్వలేదు. నేను రాజు వద్ద సెలవు తీసుకొని వచ్చు సమయమున అతనివద్ద రథచాలకునిగా యున్న కురూపి, పొట్టి చేతులవాడు యైన బాహుకుడను వ్యక్తి నాతో "కులకాంతలు కష్టములను యెదుర్కొని తమను రక్షించుకొనెదరు. ఆమెయందు నమ్మకమున్నందువలననే నలుడు ఆమెను వదలగలిగెను. అదేకాక రాజ్యభ్రష్టుడు, శ్రీహీనుడు, ఆకలితో మాడుచున్నవాడుయై విచారముతో నున్న నలుని యెడ కోపము చెందుట దమయంతికి ఉచితకార్యము కాదు" అని నాతో

పలుకగా త్వరితగతిని ఆ విషయము తెలుపవచ్చితిని అని తెలుపగా దమయంతి అతనిని తగువిధముగా గౌరవించి, నలుడు తిరిగి వచ్చిన పిమ్మట తప్పక మరల సత్కరింతుననెను.

దమయంతి తల్లిని కలుసుకొని విషయము తెలిపి సుదేవుని రప్పించి, "బ్రాహ్మణోత్తమా! నీవు త్వరితముగా అయోధ్యా నగరమునకు యేగి, దమయంతి ద్వితీయ స్వయంవరము రేపేయని, అనేకులు రాజులు వచ్చుచున్నారని తెలుపుము. నలుడు బ్రతికి ఉన్నాడో లేదో తెలియక దమయంతి ఇట్లు చేయుచున్నది అని తెలుపుము" అని చెప్పి పంపెను. ఈ విషయము రాజైన భీమసేనునికి మాత్రము తెలియజేయలేదు.

## 71. దమయంతి స్వయంవర వార్త విని ఋతుపర్ణుడు విదర్భకు బయలుదేరుట

బృహదశ్వుడిట్లనెను. "మహారాజా! సుదేవుని వలన దమయంతి స్వయంవర వార్త తెలుసుకొని ఋతుపర్ణ మహారాజు బాహుకుని పిలిపించి, "ఓ అశ్వవిద్యా ప్రవీణా! నీ విద్యను ప్రదర్శించు సమయము ఆసన్నమైనది. దమయంతి రెండవ స్వయంవరము రేపే అని తెలిసినది. ఒక దినములో విదర్భను మనము చేరవలెను. తగిన యేర్పాట్లు చేయుము" అని పలుకగా, ఆ మాటలు వినిన బాహుకుడు, నన్ను రప్పించుటకే ఇట్లు చేయుచున్నదని ఒకమారు, చంచలమైన స్త్రీజాతి భర్త లేకపోయిన యెట్టి కార్యమైనను చేయనేర్చునని మరియొకమారు అనుకొనుచు డోళాందోళిత మనస్కుడై యేది యెట్లును కుండిన నగరమునకు చని, యదార్థము తెలుసుకొనుటయే మేలని నిర్ణయించుకొని, రాజు అశ్వశాలకేగి తగిన అశ్వములను యెంచి, వాటిని రథమునకు పూన్చి వార్ష్ణేయునితో రాజు వద్దకు రాగా అతడు రథము నారోహించెను.

బాహుకుని రథచాలనము చూచి వార్ష్ణేయుడు, "ఇతడు దేవసారథియైన మాతలియైన కావలెను లేదా నలమహారాజుయైనను అయిఉండవలెను. ఇట్లు రథము నడుపగలవారు మరియొకరు లేరు. కాని ఇతని రూపము మాత్రము నలమహారాజు కాదని తెలుపుచున్నది" అని పలు విధముల తలంచసాగెను. తీవ్రఘోషముతో వెడలుచున్న రథమును చూచి ఋతుపర్ణుడు కూడా, బాహుకుని విద్యకు మిక్కుటముగా సంతసించెను.

## 72.

రాజు ఉత్తరీయము గాలికి యెగిరిపోగా, రథము క్షణకాలము ఆపుమని అతడు బాహుకునితో చెప్పగా అతడు "నీ ఉత్తరీయము యోజన దూరము వెనుక పడియున్నది దానిని తీసుకొని వచ్చుట అసాధ్యమని తెలిపెను. ఋతుపర్ణుడు తన సంఖ్యా విద్య ప్రభావముచే వటవృక్షము యొక్క పత్రములు, ఫలముల సంఖ్య చెప్పుసరికి బాహుకుడు ఆశ్చర్యపడి, రథమాపి ఒక శాఖ ఖండించి వాటి సంఖ్యను రాజును అడిగి లెక్కించి, సరియని నిర్ధారణ చేసుకొన్న పిమ్మట అతనితో "దయచేసి ఈ విద్య నాకు తెలుపుడు. మీకు నేను అశ్వచాలన విద్య నేర్పుదును" అనిన రాజు అంగీకరించి అక్షవిద్యను బాహుకునకు నేర్పెను.

అక్ష విద్యా ప్రభావమున కర్కోటకుని విషముతో బాధపడుచున్న కలి నలుని శరీరము విడచి బయటకు వచ్చెను. క్రోధాన్వితుడైన నలుని శరణు వేడి ప్రాణములను రక్షించుకొని, నలుని చరిత్ర చిరకాలము స్మరణీయమై ఉండునని ఆశీర్వదించి కలి బిభీతి వృక్షమును ప్రవేశించెను. కలిముక్తుడై నలుడు అలౌకిక తేజోసంపన్నుడై రథము నధిరోహించి, గతక్లేశుడు, సుస్థకాయుడుయై రథము నడుపసాగెను.

## 73.

సాయంకాలమునకు వారు విదర్భ నగరము ప్రవేశించిరి. వారి రాకకు కారణము తెలియకపోయినను భీమసేన మహారాజు, ఋతుపర్ణుని ఆదరించి, వచ్చిన కారణమడుగగా అతడును స్వయంవరపు యేర్పాట్లు కాని, ఇతర రాజశ్రేష్ఠులను గాని కానక ఆశ్చర్యమును బయటకు తెలియనీయక "మిమ్ము దర్శించ కోరిక కలిగి వచ్చితిని" అని పలికి తమకై యేర్పరచిన విడిది ప్రవేశించెను.

## 74.

అయోధ్యా నగరాధిపతి రథము కుండిన నగరము ప్రవేశించునపుడే ఆ రథము చేయు శబ్దమును బట్టి దమయంతి ఆ రథము నడుపుచున్నది నలుడని నిర్ధారణకు వచ్చెను. అయినను తాను తలంచు విషయము నిర్ణయించుటకొరకై కేశినియను ఉత్తమురాలైన దాసిని పిలిచి, ఆమెతో "ఋతుపర్ణుని రథచాలకునితో ప్రసంగించి, అతడు పర్ణాదుడను బ్రాహ్మణునితో చేసిన సంభాషణ విషయమై ప్రస్తావించి అతని జవాబులు తెలుసుకొని రమ్మని పంపెను.

కేశినితో ప్రసంగించుచూ బాహుకుడు "తాము ఉదయముననే అయోధ్య నుండి బయలుదేరితిమనియూ, ఋతుపర్ణుడు కాక మూడవ వ్యక్తి వార్ష్ణేయుడను నలుని సారథియని తెలిపెను.

కేశిని "మీరు పర్ణాదునితో నలమహారాజు విషయము ప్రసంగించిరి. అతని విషయము మీకు యేమైనా తెలియునా?" అని ప్రశ్నింపగా బాహుకుడు "అతడు ఛద్మవేషమున ఉన్నాడు. అతనిని ఇతరులు పోల్చుకొనలేరు" అని బాహుకుడు ప్రత్యుత్తరమిచ్చెను. దమయంతి పరిత్యజించు విషయము కేశిని ప్రస్తావింప బాహుకుడు కన్నుల నీరు గారుచుండ "రాజ్యమును, సంపదలను కోల్పోయి క్షుద్బాధతో నున్న నలుడు భార్య యెటులనైన పితృగృహమును చేరునని అర్థవసనుగా వదలి చనెను. అతనిపై క్రోధము చెందుట కులస్త్రీలకు తగదు" అని పలికెను.

## 75.

కేశిని దమయంతి వద్దకు చని అన్ని విషయములను యెరిగింపగా ఆమె అతడు తప్పక నలుడనియు, ప్రచ్ఛన్నరూపమున యే కారణముననో యున్నాడనియు తలంచి, దాసితో కుమార్తెను, కుమారుని పంపెను. ఆమె నలుడు వండుచున్న మాంసము తెప్పించుకొని రుచి చూచి అది నలుని వంటయని తలపోసెను.

బాహుకుడు ఇంద్రసేనను, ఇంద్రసేనుని చూచి కౌగలించుకొని ముద్దాడి కేశినితో నీవు ఇచ్చటకు పదేపదే వచ్చుట యుక్తము కాదు అని పలికి రాజ సంతానముతో పంపివేసెను.

## 76.

అన్ని విషయములలోను అతడు నలునిగా తెలియుచున్నను రూపము విషయమై అనుమానించు దమయంతి ప్రత్యక్షముగా నిర్ధారణ చేసుకొనుటకై తల్లిని కలుసుకొని ఆమెతో విషయము తెలియజేసి తండ్రితో చెప్పియో చెప్పకనో, బాహుకుడు తనతో ప్రసంగింప అనువు కల్పింపుమని వేడగా, రాజమాత భీమసేన నృపతికి సంగతులన్నియు తెలుప అతని అనుమతిని పొంది బాహుకుని దమయంతితో మాటలాడ పనిపెను.

నలుడు, దమయంతి ఒకరినొకరు చూసుకొని కన్నుల నీరునిండ అనిమిషనేత్రులై కొంతసేపు చిత్రప్రతిమల వలె నుండిరి. తదనంతరము నలుడు

తనను కలి యే విధముగా ఆవహించి చెడు కార్యములను చేయించెనో తెలిపి అక్ష హృదయ విద్యానంతరము యే విధముగా తనను వీడినది తెలిపెను.

నాడు స్వయంవర సభలో తనను యెట్టి పరిస్థితులలోను వదలనని మాట నిచ్చిన మీరు తప్పరని తెలిసియే మిమ్ము మరల పొందు తలంపుతో రెండవ స్వయంవర విషయము ఋతుపర్ణ మహారాజునకు సుదేవుని ద్వారా కబురు పంపితిని అని దమయంతి పలుక ఆకాశవాణియు ఆమె వచనములు సత్యములని మారు పలికెను.

నలుడు తనకు నాగరాజు ఇచ్చిన పరిశుద్ధ వసనములు ధరించినంతనే అతడు వికృతరూపము పోగా పూర్వపు దివ్యరూపము పొందెను. దమయంతి నలుని బాహువుల చేరి ఆనందబాష్పములు కార ఈ సంతోష విషయము తెలియజేయ వారును మిక్కిలి సంతసించిరి.

## 77. నలుని రాకకు విదర్భదేశ ప్రజలు సంతసించుట

బృహదశ్వుడిట్లనెను. "మహారాజా! మరునాడు ప్రాతఃకాలమున కాలకృత్యానంతరము సపత్నీకుడై నలుడు విదర్భరాజ దంపతులను చేరి నమస్కరింప వారును ఆనందించిరి. బ్రాహ్మణులకు భూరి దానములు చేసిరి. ప్రజలు మహానందముతో ఉత్సవములు చేసికొనిరి.

ఋతుపర్ణ మహారాజు నలుని కలుసుకొని తాను అతని యెడల తెలియక అపరాధము కావించిన క్షమింపుమనిన నలుడు "మహారాజా! మీరు నాయెడ యెంతయో ఆదరము చూపితిరి. మీవద్ద నేను యెంతో సుఖముగా కాలము గడిపితిని. నాకు యెల్ల విధముల సహాయపడిన మీకు నా ధన్యవాదములు. మీరు తెల్పిన అక్ష విద్యా ప్రభావముననే నన్ను కలి వదిలెను. దయచేసి అశ్వవిద్య గ్రహింపుడు" అని పలుక అతడునూ ఆనందముగా నలుని వద్ద అశ్వవిద్యను నేర్చుకొని అందరివద్ద సెలవు తీసుకొని తన రాజ్యమునకు మరలిపోయెను.

## 78. నలుడు స్వదేశమునకు తిరిగి వచ్చుట

బృహదశ్వుడిట్లనెను. "కౌంతేయా! నిషధ రాజు నెలదినములు అత్తవారింట ఆనందముగా గడిపి అనంతరము పరిజనములతోను, రథ, గజ, తురగాదులతో త్వరితగతిని రాజధానిని చేరి, పుష్కునితో "పుష్కా! నేను విపుల ధనరత్నములతో వచ్చితిని. మరల జూదమాడుదము రమ్ము. ఈ మారు ధనము కోల్పోయిన దమయంతిని పణముగా నుంచెదను. తుదకు నన్ను ఒడ్డి కూడా ఆడ సిద్ధముగా

నున్నాను. ద్యూతక్రీడ నీకు ఇష్టము లేకపోయిన యుద్ధమునకు సిద్ధము కమ్ము" అని కఠినముగా పలికిన పుష్కలుడు దమయంతి దొరుకునని ఉత్సాహముగా సిద్ధపడెను.

జూదమున పుష్కరుడు సర్వమును కోల్పోగా నలుడు "మూఢుడా! ఇంతకు క్రితమే కలి ప్రభావమున నన్ను ఓడించగలిగితివి. ఇప్పుడు తలచుకొన్న నీకు ప్రాణదండన విధించగలను కాని నీవు నా పినతండ్రి కుమారుడవు. తమ్ముడవు. నేను నా ధనమునే గ్రహించుచున్నాను. నీ సంపదను గ్రహించి, నీ రాజ్యమునకు మరలి పొమ్ము. అన్నదమ్ముల స్నేహము చెడుట నాకిష్టము లేదు. నీవు చిరాయువు కమ్ము" అని పలుక పుష్కరుడు అన్నను కౌగలించుకొని నెల దినములచట ఉండి అనంతరము సైన్యముతో తన రాజ్యమునకు చనెను.

## 79.

నలుడు విజయము పొంది రాజ్యమునకు తిరిగి వచ్చినందులకు ప్రజలు ఆనందించి, రాజును ఉత్సాహముతో ఆహ్వానించిరి. విదర్భ మహారాజు కుమార్తె దమయంతిని, మనుమని, మనుమరాలిని అనేక బహుమతులతోను, దాసదాసీ జనముతోను, సైన్యముతోను అత్తవారింటికి పంపెను. నలుడు భార్య, పిల్లలతో సుఖముగా రాజ్యము చేయుచూ, యజ్ఞ యాగాదులు కావించుచూ జీవితము గడిపెను.

## బృహదశ్వుడు పాండవులను ఓదార్చుట

బృహదశ్వుడిట్లనెను. "ఓ పాండురాజకుమారా! నీవును అచిరకాలములోనే బంధు బాంధవులతో ప్రకాశించెదవు. విచారింపకుము. తమ్ములతోను, భార్యతోను, బ్రాహ్మణ పరివృత్తుడవై పుణ్య కథాశ్రవణము చేయుచూ, ధర్మోపదేశములను పొందుచూ ఉన్న నీకన్నా నలుడు జూదమాడి అధికమైన దుఃఖములను పొందెను. అయినను ధర్మపరాయణుడగుట వలన రాజ్యమును తిరిగి పొందెను. నీవును నీ రాజ్యము మరల పొందెదవు. ఇందుసంశయము లేదు. సకల దుఃఖములను నివారించు అక్ష హృదయమనెడి విద్య గ్రహింపుము" అని ధర్మరాజునకు ఆ విద్య నేర్పి ఆశీర్వదించి యధేచ్ఛ చనెను. పాండవులును అర్జునుని విషయము చర్చించుచూ మునులను అతని విషయమై ప్రశ్నించుచుండిరి.

నలోపాఖ్యాన పర్వాధ్యాయ సమాప్తి

# 80. తీర్థయాత్రా పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. "జనమేజయ మహారాజా! అర్జునుడు అస్త్ర సంపాదనకు వెడలిన పిమ్మట, ఒకనాడు పాండవులు అందరూ కూడియున్న సమయమున ద్రౌపది ధర్మరాజుతో, "మహారాజా! అర్జునుడు మనలను వీడి చనిననాటినుండి, ఇచ్చట తరులు, గిరులు అతనినే జ్ఞాపకమునకు తెచ్చుచున్నవి. అతని విరహమును నేను భరింపజాలకున్నాను" అని పలికిన భీమ, నకుల, సహదేవులు కూడా అట్టి వచనములనే అన్నతో పలికిరి.

## 81.

అట్టి సమయమున దేవముని నారదుడక్కడకు వచ్చి సుఖాసీనుడైన పిమ్మట, ధర్మరాజు అతనితో తమ పరిస్థితులను తెలియజేసి తీర్థయాత్రలు చేయ ఇచ్ఛ కలిగినదని తెలిసి వాటిని దయచేసి తెలియజేయుమని వేడగా అతడు "ధర్మజా! పూర్వము భీష్ముడు గంగాద్వారమున వసించి దేవ, ఋషి, పితృగణములకు తర్పణము చేసియుండునెడ పులస్త్యుడను ఋషి అతనిని కలుసుకొనుటకై వచ్చెను. భీష్ముడు తనను పరిచయము చేసుకొని తాను తీర్థయాత్రలు చేయదలంచుచున్నట్లు, నాటి దర్శన ఫలమును వివరింపుమని వేడుకొనగా, పులస్త్యుడు వివిధ తీర్థ స్థానములను వర్ణించి చెప్పెను. అవి నీకు తెలిపెదను. సావధానుడవై వినుము.

## 82.

పులస్త్యుడిట్లనెను. "భీష్మా యెవరు హస్తద్వయము, పదద్వయము, విద్య, తపస్సులను యేకమనము చేసి సుసంయతులై ఉందురో వారే తీర్థయాత్రలు చేయుటకు అర్హులు. భూమండలమున దశసహస్ర కోటి తీర్థస్థానములు కలవు" అని పుష్కరతీర్థము, కణ్వాశ్రమము, అర్బుదతీర్థము, శంకుకర్ణేశ్వర తీర్థము, మోక్షతీర్థము, రుద్రకోటి, సరస్వతీ సుగమము, కురుక్షేత్రము మొదలైనవి వర్ణించి, సప్తసారస్వత తీర్థము వర్ణించి, "ఇచ్చట తపఃసిద్ధుడైన మంకనకుడను మహర్షి నివసించెడివాడు. ఒకనాడు కుశాగ్రమున ముని హస్తము కోసుకొనగా ఆ గాయమునుండి శాకరసము రాసాగెను. మహర్షి అది చూచి ఆనందముతో నృత్యము చేయసాగెను. అతని నృత్యమును గాంచి వెరుగుపడిన మునులు శంకరుని చేరి ఈ ముని నృత్యమును దయచేసి ఆపునట్లు చేయుడని ప్రార్థింప మహాదేవుడు మంకనకుని చేరి, "మునిసత్తమా! యెందులకు నీవిట్లు నాట్యమాడు

చున్నావు. నీ ఆనందమునకు కారణమేమి?" అని ప్రశ్నింప అతడు "నేను తపస్విని, ధర్మపథమున నడచువాడను. కుశాగ్రమున నా చేయి కోసికొనగా శాకరసము నిర్గతమగుచున్నది. మీకు కన్పించుటలేదా? అందులకే ఆనందముతో నృత్యము చేయుచున్నాను" అని ప్రత్యుత్తరమివ్వ శంకరుడు చిరునవ్వుతో "బ్రాహ్మణోత్తమా! ఇందు ఆశ్చర్యపడు విషయమేమిటో నాకు కన్పించుట లేదు. నన్ను నిరీక్షింపుము" అని భవానీపతి తన వేలి చివర బొటన వ్రేలుతో గాయపరుప అందుండి హిమసన్నిభ భస్మము రాలసాగెను. ఆ దృశ్యము చూచి ముని లజ్జితుడై మహాదేవునకు సాష్టాంగపడి, అనేక విధముల కీర్తించి "శూలపాణీ! నీవే లోకములకుకర్తవు, నియక్తవు. సృష్టి స్థితి లయ కారకుడవు. నా అజ్ఞానమును క్షమించి తపోవృద్ధి చెందునట్లు వరమిమ్ము" అని వేడిన, దేవదేవుడు సంతసించి ముక్తి కలుగునట్లు వరమిచ్చి తిరోహితుడయ్యెను.

## 83, 84, 85.

"మరియు ఓనసతీర్థము, కృతశౌచ తీర్థము, రామహ్రదము, వంశమూలక తీర్థము, కపిల తీర్థము, నీతావనతీర్థము, మానుషతీర్థము, బ్రహ్మస్థానము, సరకతీర్థము, మిశ్రకతీర్థము, వ్యాసస్థలి, మృగధూమ తీర్థము, వామనక తీర్థము, పవనహ్రద తీర్థము, నైమిషకుంజము, అగ్నితీర్థము, కార్తికేయ తీర్థము, సరస్వతీ-అరుణాసంగమ తీర్థము, శతసహస్రక సౌహస్రక తీర్థము, రేణుకా తీర్థము, పంచవటీ తీర్థము, కురుతీర్థము, ఆపగాతీర్థము, రుద్రమార్గము, పావన తీర్థము, సన్నిహతీ తీర్థము, దేవీస్థానము, గాంగాద్వారము, నాగతీర్థము, కృత్తికా తీర్థము, నైమిషతీర్థము, బహుధాతీర్థము, మణినాగ తీర్థము, మహేశ్వరపథము, కామన తీర్థము, గౌరీ శిఖరము, సంవేద్య తీర్థము, వైతరణీ తీర్థము, బదరికాతీర్థము, గాయత్రీ స్థానము, దేనహ్రదము, మేధావికతీర్థము, ప్రయాగ తీర్థము దర్శింపతగిన తీర్థములు అని పులస్త్యుడు భీష్మునకు తెలిపెను.

"కావున ధర్మరాజా! నీవును ఈ తీర్థములను దర్శింపుము. కశ్యప, ఆత్రేయ, విశ్వామిత్ర, గౌతమ, వశిష్ట, శౌనక, వ్యాస, దూర్వాసాది మునులు నీ రాకకై ఎదురు చూచుచున్నారు. మహర్షి లోమసుడు వచ్చిన అతనితో తీర్థయాత్రలను చేయ సిద్ధము కమ్ము. నీవు పుణ్యచరిత్రుడవు. తప్పక నీ కోరిక తీరును" అని నారదుడు తెలిపి, ఆశీర్వదించెను.

## 86. ధౌమ్యునితో యుధిష్టిరుని వనాంతరగమన ప్రార్థన

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! తదనంతరము ధర్మరాజు ధౌమ్యునితో "బ్రాహ్మణశ్రేష్ఠా! భీష్మాది యోధులను యెదుర్కొనుచింతతో అర్జునుడు అస్త్రములను పొందుటకై వెడలియున్నాడు. అందువలన మేము ఈ కామ్యకవనమున నిశ్చింతగా చరింపలేకున్నాము. మేము సుఖముగా కాలముగడుప మరియొక రమణీయ వనమును తెలుపుడు. అచ్చటకు పోయి అర్జునుని కొరకై నిరీక్షించుచూ యుందుము."

## 87-90.

అని పలికిన ధౌమ్యుడు తూర్పున నైమిషాది తీర్థమును పాంచాల దేశ మందలి ఉత్పలవనమును, దక్షిణమున గోదావరీ ప్రాంతము, పశ్చిమమున నర్మదా తీరప్రాంతమును, ఉత్తరమున యమునాతీర ప్రాంతమును వర్ణించి ధర్మరాజునకు తెలిపెను.

## 91. పాండవుల వద్దకు లోమసమహర్షి వచ్చుట - అర్జునుని రాక తెలుపుట

వైశంపాయనుడిట్లనెను, "జనమేజయ మహారాజా! ధౌమ్యుడిట్లు ధర్మరాజు నకు తీర్థ సముదాయములను వివరించి చెప్పు సమయమున లోమసముని అచ్చటకు వచ్చి ఉపనీతుడయ్యెను. ధర్మరాజు అతనిని ఉచితరీతిని సత్కరించి, రాకకు కారణమడిగిన అతడు, "ఓ కౌంతేయా! నేను వివిధ లోకములను చరించుచూ దేవలోకమునకు చని, దేవసభలో ఇంద్రసభలో ఇంద్రుని అర్ధ సింహాసనము గ్రహించిన అర్జునుని చూచి వెరుగొందితిని. తదుపరి శచీపతి ఆజ్ఞానుసారము మిమ్ము కలియుటకై వచ్చితిని.

అర్జునుడు ఈశ్వరుని వద్ద పాశుపతాస్త్రమును పొందెను. ఇంద్రాది దిక్పాలకులు అనేక శస్త్రాస్త్రములను అతనికి ఇచ్చిరి. దేవలోకమున అతడు నృత్య, గీత వాద్యాదులను అభ్యసించినాడు. సురరాజు అర్ధసింహాసనమును గ్రహించినాడు.

ఇంద్రుడు నాతో "ద్విజోత్తమా! మీరు మనుష్య లోకమునకు చని, అర్జునుడు శస్త్రాస్త్రములను పొందినాడనియు, దేవకార్యానంతరము తిరిగి వచ్చుననియు

పాండవులకు తెలియజేయుడు. కాలమును పుణ్యతీర్థములను దర్శించుచూ గడుపుడనుడు. వారికి మీరు ఆయా తీర్థముల మహత్యము తెలియజేయుడు” అని పలికెను.

## 92, 93.

అర్జునుడు నాతో “ఓ తపోధనా! మీరు నా అన్నదమ్ములకు, భార్యకు నా క్షేమసమాచారము తెలియజేయుడు. తీర్థయాత్రా సమయమున వారికి రాక్షస బాధ కలుగకుండా రక్షింపుడు” అని చెప్పెను.

కావున ఓ ధర్మరాజా! ఇంద్రుడు, అర్జునుడు కోరిన విధముగా మీ తీర్థయాత్రలుయెట్టి ఒడుదుడుకులు జరుగకుండా క్షేమముగా జరిపించుటకై వచ్చితిని. దుర్గములైన ఆ ప్రదేశములను నేను ఇంతకు ముందే చూచియుంటిని. మరల మీతో మరియొక మారు చూచెదను. మీరు ప్రయాణమునకు సిద్ధము కండు” అని పలికెను.

అంత యుధిష్టిరుడు “ఓ బ్రాహ్మణోత్తమా! మీ వాక్యములు విని నాకెంతయో ఆనందము కలిగినది. దేవతలతో చరించిన మీ దర్శన భాగ్యమును పొందిన నేను ధన్యుడను. మీరు ఉచిత సమయము తెలిపిన మేము బయలుదేరెదము” అనిన ముని, “మహారాజా! అధికమైన పరిజనములతో ప్రయాణము చేయుట మిక్కిలి కష్టము కావున అల్పపరివారమును మాత్రమే తోడనుంచుకొనుట శ్రేయము” అని వ్రాక్కుచ్చిన, ధర్మరాజు శ్రమదమములకు ఓర్చుకొను కొద్దిమంది బ్రాహ్మణులను తప్ప మిగిలినవారిని, ధృతరాష్ట్రుని పోషణలో ఉండుడని పంపివేసెను.

ద్రుపదనందనితో తీర్థయాత్రలకై కృతసంకల్పులైన పాండవులను చూచుటకై వ్యాస, పర్వత, నారద మహర్షులు వచ్చి, “పాండవులారా! మనస్సు పరిశుద్ధముగా నుంచుకొని తీర్థప్రదేశములను సేవింపవలెను. మానుష, దేవ వ్రతులై, మానసిక, శారీరక నియమములతో పవిత్రులై యుండిన సకల శుభములను పొందెదరు.”

పాండవులు శుచులై, మునులకు ప్రదక్షిణ నమస్కారములు గావించి, వారివద్ద సెలవు తీసుకొని, చీరాజిన జటాధారులై, ధౌమ్య పురోహితుడు, బ్రాహ్మణులు వెంటరాగా, మృగశిరా నక్షత్రయుక్త పౌర్ణమి దాటి పుష్య నక్షత్రమున తీర్థయాత్రలకు పూర్వాభిముఖులై బయలుదేరిరి.

## 94.

ప్రయాణము చేయుచూ, ధర్మరాజు లోమసునితో, "దేవర్షీ! అధర్మ పరాయణులైన నా శత్రువులు ఉన్నతిని చెంది సర్వసుఖములను అనుభవించు చున్నారు. ధర్మము ననుసరించిన నేను యెందుల కిట్లు దరిద్రునివలె అడవుల వెంట భార్యతోను, తమ్ములతోను తిరుగుచున్నాను" అని ప్రశ్నించిన ముని, "మహారాజా! మనుష్యుడు అధర్మాచరణలవల్ల మొదట అభ్యుదయము చెందినను తరువాత తానే ప్రభువను అహంకారము చెంది సమూలముగా నాశనము చెందును. అహంకారము చేత క్రోధము, దానివలన నిర్లజ్జత జన్మించి రాక్షసులు వినాశము చెందుదురు. ధర్మపరాయణము, పుణ్యపర్యటనలు చేయు దేవతలు ఉన్నతిని పొందుచున్నారు. ఇదే సనాతన ధర్మము. నృగ, శిబి, ఉశీనక, భగీరథ, గయ, పురు, పురూరవాది రాజులు మహాత్ముల దర్శనమునను, తీర్థగమనముల వల్లను, తీర్థస్నానముల వలనను, తపస్సువలనను, పాపములు వీడినవారై యశస్సు, ధనము రెండింటిని పొందిరి. నీవును వారివలె ఉన్నతిని పొందెదవు. కీర్తిని పొందెదవు. అధర్మమున మోహాచ్ఛన్నులైన ధార్తరాష్ట్రులు దైత్యులవలె అనతి కాలములోనే నశించెదరు. ఇందు సందేహము లేదు" అని ఓదార్చెను.

## 95. పాండవుల తీర్థయాత్ర

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! మహావీరులైన పాండవులు క్రమముగా నైమిషారణ్యమున ఉపస్థితులైరి. అచ్చట గోమతీ నదీతీరమున తీర్థములను సందర్శించి, ఆ పుణ్యనదిలో స్నానమాడి దేవ, పితృ తర్పణములను కావించిరి. అచటనుండి కన్యాతీర్థము, గోతీర్థము, దర్శించి ప్రయాగకు వచ్చి అచ్చట గంగా యమునల సంగమ స్థలమున స్నానమాచరించి బ్రాహ్మణులకు దానములిచ్చిరి. అచటినుండి రాజర్షి గయుడు మహాయజ్ఞము చేసిన స్థానమును చూచిరి.

## 96. అగస్త్య తీర్థము - వాతాపి, ఇల్వల్యుల ఉపాఖ్యానము

తదనంతరము కుంతీ నందనులు దుర్జయ తీర్థమునకు వచ్చి అగస్త్యా శ్రమమున వసించిరి. అచ్చట ధర్మరాజు లోమసుని ఇట్లు ప్రశ్నించెను. "ఓ బ్రాహ్మణోత్తమా! ఇచ్చట అగస్త్య మహర్షి యెందులకు వాతాపిని జీర్ణించు కొనెను? మునికి ఆతనిపై యేల కోపము కలిగెను? నాకు దయచేసి వివరముగా తెలుపుడు.

"మహారాజా! పూర్వకాలమున మణిమతి అను పట్టణమున ఇల్వల్యుడను ఒక దైత్యుడు నివసించెడివాడు. అతని తమ్ముని పేరు వాతాపి. ఒక సమయమున ఇల్వల్యుడు ఇంద్రతుల్యుడైన కుమారుడు కలుగునట్లు వరమిమ్మని బ్రాహ్మణుని కోరగా అతడు నిరాకరింప జాతక్రోధుడై, మృతినొందినవారిని ఆహ్వానించి బ్రతికించు శక్తియున్నవాడు కావున, తమ్ముడైన వాతాపిని మేక రూపమున ఉండగా సంహరించి ఆ మాంసమును అతిథులుగా వచ్చిన బ్రాహ్మణులకు పెట్టెడివాడు.

భోజనానంతరము బ్రాహ్మణులు విశ్రమించు సమయమున ఆ దుష్ట దానవుడు 'వాతాపీ' అని గట్టిగా పిలచెడివాడు. వాతాపి బ్రాహ్మణుని శరీరము చీల్చుకొని బయటకు నవ్వుచూ వచ్చెడివాడు.

ఆ దినములలో మహామునియైన అగస్త్యుడు, గోతిలో అధోముఖులై వ్రేలాడుచున్న పితృదేవతలను కలుసుకొని, తాను అనపత్యుడైయుండటమే వారి ఇట్టి దశకు కారణమని తెలుసుకొని, వివాహము చేసుకొన సంకల్పము కలిగినట్లు వారికి తెలిపి ఆనందపరుస్తాడు.

## లోపాముద్ర ఉపాఖ్యానము

సంతానకామియైన అగస్త్యముని తగిన స్త్రీ రత్నమును కానక, సమస్త ప్రాణులయందలి సౌందర్యము గ్రహించి, చక్కని స్త్రీ రూపము నిర్మించి, సంతాన విహీనులైన విదర్భ దంపతులకు ఇవ్వ వారు చక్కని కుమార్తెను గాంచిరి. జ్యోతిష్కులు ఆ బాలికకు లోపాముద్ర యని పేరిడిరి. శుక్లపక్ష చంద్రునివలె ఆ బాల దినదిన ప్రవర్ధమానయై యౌవ్వనవతి అయ్యెను. అగస్త్యుని భయముచే ఆ బాలను ఉద్వాహమాడ యెవ్వరునూ ముందుకు రారైరి.

## 97.

అట్టి సమయమున అగస్త్యుడు విదర్భరాజును చేరి, "రాజా! నేను పుత్రార్థినై వివాహమాడ తలంచుచున్నాను. మీ కన్యను నాకు సంప్రదానము చేయుడు" అని అడిగెను.

ముని శాపమనకు వెరచి, వెనకముందులాడుచున్న తల్లిదండ్రులతో లోపాముద్ర, "తండ్రీ! మీరు నాకై విచారింపకుడు. ముని హస్తమున నన్ను సమర్పించి నిర్భీతులు కండు" అని పలికెను.

వివాహ కార్యము సంపన్నమైన పిదప ముని భార్యతో "నీవు ఇప్పుడు మునిపత్నివి. విలువైన ఆభరణములు, వస్త్రములు వదలుము" అని పలుక ఆ సాధ్వి ఆభరణములు వీడి నారబట్టలతో భర్తను అనుసరించెను.

గంగాద్వార తీర్థమున అగస్త్యుడు సహధర్మిణితో వసించుచూ కఠోరమైన తపస్సు చేయసాగెను. లోపాముద్ర పతికి పరిచర్యలు ప్రీతితో చేయుచుండెడిది.

ఆమె పరిచర్యలకు సంతసించి, ఋతుమతియై యుండు అవసరమున ముని భార్యను చేరబోవ ఆమె, "నాథా! మీతో మునివేషధారిణియై, మీ మనస్సుకు నచ్చిన విధముగా నడచుకొనుచున్నాను. నా మీద నిజముగా మీకు ప్రేమయున్న, నా తండ్రిగారి ఇంటివద్దనున్న సుఖభోగములతో మిమ్ము కలియు నా కోరిక తీర్పుడు" అని పలికిన, ఆమె కోర్కెను తీర్చ తపోబలమును వ్యయపరచుట కిష్టపడని అగస్త్యుడు ధనార్థము బయలుదేరెను.

## 98. ధనమునకై అగస్త్యుడు ఇల్వల్యుని చేరుట

ధనము కొరకై ముని శృతర్వుడు, బ్రధ్నశ్వుడు, త్రశదస్యుడు అను రాజులను చేరి వారి ఆదాయ వ్యయములు సమానముగా ఉండుటచే వారివద్ద ధనము గ్రహించుటచే ప్రాణులకు క్లేశము కలుగునని గ్రహింపక వారందరూ కలసి ధనశాలియైన ఇల్వల్యుని వద్దకు చనిరి.

## 99.

ఇల్వల్యుడు వారిని గౌరవముగా ఆహ్వానించి మునుపటివలెనే మేక రూపమున ఉన్న వాతాపిని వధించి, పక్వము చేసి, మునిని, రాజులను భోజనమునకు కూర్చొనుడని వేడెను. భీతి చెందిన రాజన్యులను శాంతులను చేసి, అగస్త్యుడు తాను మాత్రమే మాంసము తిందుననియు, వాతాపిని నశింపచేయుదుననియూ పలికి, ఇల్వల్యుడు వడ్డించుచుండ మాంస భక్షణము గావించిన పిదప, అగస్త్యుని అధోదేశమునుండి మేఘగర్జన వలె భీకరమైన శబ్దము వెలువడెను.

ఇల్వల్యుడు వాతాపిని పదే పదే పిల్చుచుండ, ముని నవ్వుచూ "వాతాపిని నేను జీర్ణము చేసుకొంటిని. మరి అతడు రాడు" అని పలికిన భీతిచెందిన ఇల్వల్యుడు "మహాత్మా! మీ రాకకు కారణము తెల్పుడు. మీ ఆజ్ఞను శిరసావహింతును" అని వేడుకొనగా, మహర్షి "ఓయీ! అసురుడా! నీవు

ధనవంతుడవని తెలిసి, ధనము కొరకై నీ వద్దకు వచ్చితిని. ఈ రాజులు నీ అంతటివారు కాదు” అనిన ఇల్వల్యుడు రాజులొక్కొక్కరికి పదివేల గోవులను, అదే సంఖ్య సువర్ణములను ఇచ్చెను. మునికి ఇరవై వేల గోవులను, అదే సంఖ్య సువర్ణములను, బంగారు రథము, దానిని లాగుటకు మనోవేగమున ప్రయాణించు రెండు గుఱ్ఱములను ఇచ్చెను.

రాజులు తమ స్థానములకు వెడల తగిన వస్తువులతో మహర్షి రథముపై భార్యను చేరెను.

కోరిక తీరిన లోపాముద్ర గర్భవతియై, యేడు సంవత్సరములు గడచిన పిమ్మట, భర్త ఆశీర్వచనము ప్రకారము సహస్ర వ్యక్తి తుల్యుడైన కుమారుని గాంచెను. అతడే ధృఢాస్యుడు. అతడు చిన్నతనమునుండి తండ్రి అగ్ని సందీపన కాష్టములను తెచ్చుటచే ఇంధవాహుడని పేరు వడసెను.

ఉత్తముడైన కుమారుడు అగస్త్యునకు జన్మించుటచే పితృదేవతలు ఇష్టలోకమలకు చనిరి. ఆనాటినుండి ఈ స్థలము అగస్త్యాశ్రమమని పేరు గాంచినది.

ఓ రాజా! అగస్త్యుడిచ్చుట ప్రహ్లాద వంశజుడైన వాతాపిని నాశనము చేసెన. పావనియైన గంగానది ఇచ్చుట ప్రవహించుచున్నది.

## పరశురామ తీర్థ వృత్తాంతము

లోమసమహర్షి భృగుతీర్థమును చూపి, “ధర్మరాజా! పూర్వము పరశురాముడు ఈ తీర్థమున స్నానమాచరించి, శ్రీరాముని వలన కోల్పోయిన తేజస్సు తిరిగి పొందెను. నీవును తమ్ములతోను, భార్యతోను ఇచ్చుట స్నానము చేయుము. దుర్యోధనుని వలన కోల్పోయిన తేజస్సు తిరిగి పొందెదవు” అని పలుకగా ధర్మరాజు అటులనే స్నానమాచరించి, తేజస్సు వృద్ధిపొంద, పితృ కార్యానంతరము మహర్షిని చేరి, “ఓ తాపసీ! యెందువలన పరశురాముడు తేజస్సు కోల్పోయెను. మరల దానిని యెట్లు తిరిగి పొందెను? దయచేసి తెలుపుడు” అని వేడ ముని ఇట్లనెను.

రావణుని చంపుటకై దేవతలలో అగ్రగణ్యుడైన విష్ణువు దశరథుని కుమారునిగా జన్మించి, రాముడని ప్రఖ్యాతి గాంచెను. భృగువంశమున జన్మించిన పరశురాముడు అతని చరిత్ర విని, శక్తిని పరీక్షింప అయోధ్యకు చని, క్షత్రియ

కులాంతకమైన మహాధనస్సును రామునకందించుచూ, హాస్యనదమున, "రాజేంద్రా! ఈ శరాసనమున నేను క్షత్రియ కులమును నిర్మూలము చేసితిని. నీవు శక్తికలవాడవైన ఈ ధనస్సును యెక్కుపెట్టుము" అనెను.

రాముడు ఆ విల్లును యెక్కుపెట్టుటయే కాక అమ్మును యెక్కుపెట్టి ఆకర్ణాంతము లాగి, పరశురాముని గర్వము, తేజస్సు హరించుచూ, "భార్గవా! నీవు అత్యంత బలదర్పితుడవైతివి. అయినను నిన్ను క్షమించుచున్నాను, నీకు దివ్యచక్షువు ప్రసాదించుచున్నాను. నన్ను నిరీక్షింపుము" అని వసు, రుద్రాది సహితముగా సమస్త చరాచర జగత్తును తనలోన చూపి బాణము వదిలిన అది పరశురాముని తేజస్సును హరింపజేసి రాముని చేరెను. భయము, లజ్జలతో మహేంద్ర పర్వతము చేరి నివసించియున్న పరశురాముని చేరి, అతని పితృ దేవతలు ధైర్యవచనములు పలికి వధూసరయను నదిని చేరి స్నానమాచరింపు మనిరి. పరశురాముడు వారి ఆదేశానుసారము ఆచరించి కోల్పోయిన తేజస్సును తిరిగి పొందెను.

## 100. లోకకళ్యాణమునకు దధీచి ఆత్మత్యాగము

యుధిష్ఠిరుడు ఇట్లనెను. "ఓ ద్విజోత్తమా! అగస్త్యమహర్షి ఆచరించిన కార్యములను విశదము తెలియజేయ వేడెదను" అనిన లోమసముని ఇట్లనెను.

"ధర్మరాజా! అగస్త్యుని అలౌకిక క్రియలను తెలిపెదను. సావధానుడవై వినుము.

సత్యయుగమున కాలకేయులను రాక్షసులు, వృత్తాసురుని నాయకత్వమున దేవతలపై దండెత్తిరి. వృత్తాసురుని వధింప ఉపాయము తెలుపుమని ఇంద్రాది దేవతలు బ్రహ్మను ప్రార్థింప అతడు దధీచి అను ఋషి అస్తికలతో తయారు చేయబడిన వజ్రాయుధ సహాయమున ఇంద్రుడు సహాయమున ఇంద్రుడు వృత్తాసురుని సంహరింపగలడని తెలిపెను. దేవతలు పితామహుని ఆజ్ఞ గైకొని, దధీచిని చేరి, వందనమాచరించి, బ్రహ్మావాక్యములను అతనికి తెలిపిన, అతడు "దేవతలారా! నేను అన్నమాట తప్పువాడను కాను. ప్రాణ పరిత్యాగము చేసి మీకు తప్పక ఉపకారము చేసెదను" అని యోగమార్గమున శరీరమును త్యజించెను.

విశ్వకర్మ ముని అస్థికలతో ఉగ్రకాంతి గల భీషణ వజ్రమును నిర్మించి పురందునకు ఇచ్చెను.

## 101, 102.

తదనంతరము దేవదానవుల మధ్య జరిగిన భీకరమైన పోరాటములో తుదకు ఇంద్రుడు విష్ణుమూర్తిని ధ్యానించి అతని తేజస్సును పొంది బలవంతుడై వజ్రాయుధము ప్రయోగించి వృత్తాసురుని వధించెను.

నాయకుడు మృతి చెంద కాలకేయులు సముద్రమున జొచ్చి ఆత్మరక్షణ కావించుకొని, దేవతలను నొప్పించుట కొరకై తపో, విద్యా సంపన్నులైన వ్యక్తులను నష్టపరచదలచి, రాత్రి కాలమున వశిష్ట ఆశ్రమము, భరద్వాజుని ఆశ్రమము, చ్యవనాశ్రమమున చేరి పెక్కురు మునులను చంపి, సూర్యోదయ సమయమునకు సముద్రమున ప్రవేశించుచుండిరి. ఇట్లు వారు ప్రతి రాత్రి దుష్టకార్యములు ఆచరించుచుండ అగ్నిహోత్రములు ఆరిపోయెను. వేదపఠనము ఆగిపోయెను. యజ్ఞ యాగాదులు విలుప్తములయ్యెను.

## 103

భీతి చెందిన మానవులు పలు దిక్కులకు పారిపోవుచుండిరి. మానవుల బాధలను మాన్ప దేవతలందరూ కూడి, నారాయణుని కడకేగి, పలు విధముల స్తుతించి, ప్రజలను కాపాడుమనిరి.

అంత నారాయణుడు "సురులారా! మునులను బాధించుచూ, నాశనము చేయుచున్న దుర్మార్గులు కాలకేయులను రాక్షసులు. వారు పగటిపూట సముద్ర గర్భమున ఆత్మగోపనము గావించుకొని, రాత్రులందు ఈ దుష్టకార్యములను కావించుచున్నారు. సముద్రమును శోషింపజేయుటయే దానికి మార్గము. ఈ కార్యము చేయగలిగిన వ్యక్తి అగస్త్యముని ఒక్కడే. కావున మీరు అతని సహాయమపేక్షించుడు" అని పలికెను.

తదనంతరము దేవతలు, నారాయణుని యొక్కయు, బ్రహ్మ యొక్కయు అనుమతి తీసుకొని అగస్త్య మహర్షిని చేరి, "మహానుభావా! పూర్వము మీరు మతిభ్రంశము చెందిన నహుషుని శిక్షించితిరి. భాస్కరుని గతి ఆపబోయిన మిధ్యాచల మస్తకము వ్రాలునటుల చేసితిరి. భయార్తులమైన మమ్ము కాపాడ వరమిందు" అని ప్రార్థించిరి.

## 104. సూర్యుని గతి నిరోధింప వింధ్యాచలము శరీరము పెంచుట

ధర్మరాజు ఇట్లనెను, "మునీశ్వరా! వింధ్యాచలము యెందులకు కోపించి శరీరము వృద్ధి కావించెను. సవిస్తరముగా తెలియజేయుడు" అనిన, లోమసమహర్షి "మహారాజా! పూర్వము అద్రి రాజైన సుమేరువును సూర్యుడు ప్రదక్షిణము కావించుట గమనించిన వింధ్యగిరి భాస్కరునితో తనను కూడా ప్రదక్షిణము కావించుమనిన, విశ్వనిర్మాణమును నేను మార్చలేనని అది తన వలన కాదని సూర్యుడు పలుక కోపించి వింధ్యాచలము సూర్యచంద్రుల దారి అడ్డుటకై తన శరీరము విపరీతముగా పెంచెను.

దేవతలు వింధ్యగిరిని యథారూపమునకు రమ్మని కోరిన అతడు వినకపోయిన, సురులు అగస్త్యాశ్రమమున కేగి వింధ్యాద్రిని ఆపుమనిరి.

అగస్త్యమహర్షి దేవతల కోరిక మన్నించి, వింధ్యాచలమును చేర, గిరిరాజు నతమస్తకుడై మునికి నమస్కారము చేయ, మౌని "నేను దక్షిణాపథమునకు వెడలుచున్నాను. నాకు దారి ఇమ్ము. నేను తిరిగి వచ్చిన పిమ్మట నీ శరీరము పెంపు చేయమని దక్షిణావర్తమునకు వచ్చెను. తిరిగి అతడు వెళ్లనందున వింధ్యాద్రి ముని భయముతో అట్లే హ్రస్వరూపమున యుండెను."

ఇట్లని లోమస మహర్షి "రాజా! ఇట్లు వింధ్యాచలమును అణచిన ముని, దేవతలతో "సురులారా! మీ రాకకు కారణమేమి? తప్పక మీకు సహాయపడెదను. తెలుపుడు" అని ఆశ్వాసమిచ్చిన పిమ్మట సురులు నారాయణుని వచనములు పల్కి, కాలకేయులను వధింప సముద్రమును పానము చేయుమన ముని అంగీకరించి, సురులు, మునులు వెంటరాగా సముద్రమునకు ప్రయాణమయ్యెను. ఆ మహాద్భుత కార్యమును నిరీక్షింప ఉరగ, గంధర్వ, యక్ష, కిన్నర, కింపురుషాదులు వారి వెంట చనిరి.

## 105.

పెద్ద కెరటములు విరిగిపడుచు మునిని హాస్యమాడుచున్నదేమో అనుచున్నట్లున్న సముద్రమును అగస్త్యుడు ఒక పురీషముతో నిశ్శేషము కావించెను. దేవతలు తేజోహీనులైన రాక్షసులపై తలపడిరి. వారును మిక్కిలి రోషముతో పోరాడి చాలమంది చనిపోగా హతశేషులు పాతాళలోకమునకు పారిపోయిరి.

దానవులను హతమార్చిన దేవతలు మునితో అతడు త్రాగిన సలిలమును తిరిగి వదలుమని ప్రార్థింప అతడు ఆ నీరు జీర్ణమైనదని, సముద్రము నిండుటకు వేరొక మార్గమును చూచుకొండని తెలిపెను.

స్వర్గమునకు తిరిగి వచ్చి, సురులు బ్రహ్మను చేరి జరిగినది తెలుపగా అతడు "మీరు విచారింపక స్వస్థానముల కేగుడు. బహుకాలము గడచిన పిమ్మట భగీరథుడు తన జ్ఞాతులకై ఈ పయోనిధిని మరల నింపును. దానికై నిరీక్షింపుడు" అని ధైర్యము చెప్పి పంపెను..

యుధిష్ఠిరుడు ఇట్లనెను, "బ్రాహ్మణోత్తమా! భగీరథుడు యెవ్వడు? అతడు ఇట్టి కఠిన కార్యము యేల తలపెట్టెను? సముద్రము యెట్లు నిండెను? ఈ విషయము తెలిసికొన కౌతూహలము జన్మించినది. మీరు అనుగ్రహించి సవిస్తరముగా తెలియజేయ వేడుచున్నాను" అని మునిని ప్రార్థించెను.

(రెండవ భాగము సమాప్తము)

# మూడవ భాగము

# అరణ్య పర్వము

## 106. సగర వృత్తాంత వర్ణన

లోమస మహర్షి ధర్మరాజుతో ఇట్లనెను, "మహారాజా! పూర్వము ఇక్ష్వాకు వంశమున సగరుడను రూపగుణ సంపన్నుడైన రాజు జన్మించెను. అతడు తన భుజబలముతో రాజన్యులను జయించి నిరవచ్ఛిన్నముగా రాజ్యము చేయసాగెను. అతనికి వైదర్భి, శైబ్య అనెడి ఇద్దరు రాణులు కలరు. సంతానము కలుగనందున రాజు భార్యలతో కైలాస పర్వతమున కేగి కఠోరమైన తపస్సు కావించి పశుపతిని మెప్పించిన, శూలపాణి సగరునకు దర్శనమిచ్చి, ఒక భార్యకు అరవై వేలమంది మహాబలపరాక్రమవంతులైన కుమారులు జన్మింతురనియు తదనంతరము వారందరూ ఒకే కాలమున మృతిచెందుదురనియు, రెండవ భార్యకు ఒకే కుమారుడు జన్మించి వంశోద్ధారకుడగుననియు వరమిచ్చి అంతర్హితుడయ్యెను.

కొద్ది దినములకే సగరుని భార్యలు గర్భవతులైరి. యధాకాలమున వైదర్భికి గుమ్మడిపండు జన్మించెను. మహారాజు ఆకాశవాణి పనుపున గింజలను తీసి అరవై వేల భాగములు చేసి నేతి కుండలలో భద్రపరిచెను. మహాదేవుని ఆశీర్వాద మహత్యమున వాటినుండి అరవై వేలమంది తేజోవంతులైన కుమారులు జన్మించిరి. వీరు దినదిన ప్రవర్ధమానులై క్రూరకర్మలను ఆచరించుచూ, లోకులను అవమానించుచూ, దేవ, గంధర్వాదులతో కూడా జగడమాడ నారంభించిరి.

సగర కుమారుల దుష్కృత్యములు దేవతలు తెలుపగా బ్రహ్మ త్వరలోనే వారు నశింతురని పలికెను.

## 107. సగర సంతానమును కపిల మహర్షి భస్మము చేయుట

బహుకాలము అతీతమైన పిమ్మట సగర మహారాజు అశ్వమేధ యజ్ఞము చేయ సమకట్టి ఉత్తమాశ్వమును చరించుటకై వదిలెను. ఆ అశ్వము వెంట రక్షణకై సగరుని కుమారులు వెడలిరి. దైవ వశమున ఆ కురగము జలశూన్యమైన సముద్రాభ్యంతరము ప్రవేశించి మాయమయ్యెను. అది చూడని సగర తనయులు తిరిగి తిరిగి అశ్వమును గాంచక విచారముతో తండ్రికీ వార్త తెలియజేయ అతడు అశ్వరహితులై తిరిగి రావలదని వారిని మరల గుఱ్ఱమును వెదుకుటకై పంపెను. వారు భూలోకమంతయూ తిరిగి తురగమును కానక తుదకు శుష్కసముద్రములోని

గొయ్యను చూసి ఉత్సాహముతో పలుగులు మొదలైనవి తీసుకొని పాతాళమువరకు త్రవ్విరి. వారి ఈ కార్యము వలన యెన్నో ప్రాణులు ఛిన్న శరీరులై మృతి చెందెను.

పాతాళమున వారు ఒకచోట యజ్ఞాశ్వమును చూచిరి. సమీపముననే నిశ్చలుడైయున్న కపిల మహర్షిని గాంచి సగర తనయులు ఇతడే దొంగయని తలంచి, అతనిని దూషించి, గుఱ్ఱమును తీసుకొన ముందుకు వచ్చిరి. కోపోద్దీపితుడైన ముని తీక్షణ దృక్కులతో వారిని భస్మీభూతులను కావించెను.

ఈ విషయము నారదమహర్షి వలన తెలుసుకొన్న రాజు, రెండవ భార్య శైబ్య కుమారుడైన అశమంజుని పుత్రుడైన అంశుమానుని పిలచి, “వత్సా! నా నిమిత్తమై అరువది వేలమంది కుమారులు కపిలమహర్షి కోపానలమున దగ్ధులైరి. ఈ యజ్ఞము పూర్తి చేయలేకపోయిన ధర్మభ్రష్టుడనగుదును. నాడు ధర్మము రక్షించుట కొరకే కదా, పౌరుల హితము కోరి నీ తండ్రి అసమంజుని త్యజించినాను” అని తన దుఃఖమును తెలియజేసెను.

ధర్మరాజు ఇట్లనెను, “తపోధనా! సగర నృపతి యెందులకు తనకుమారుని పరిత్యజించెనో తెలియజేయుడు” అని కోరగా లోమసుడిట్లు చెప్పసాగెను.

“రాజా! సగర మహారాజునకు శైబ్య వలన అసమంజుడను కుమారుడు జన్మించెను. అతడు బాల్యకాలమున దుర్బలులైన బాలకులను పట్టి నీట ముంచి మృతప్రాయులను చేసెడివాడు. పౌరులు తమ బాధలను రాజునకు తెలియజేయ అతడు ధర్మపరాయణుడు కావున ధూర్తుడైన పుత్రుని త్యజించెను.”

అనంతరము సగర మహీపతి మనుమనితో, “కుమారా! నీ తండ్రిని అరువది వేలమంది కుమారులను పోగొట్టుకొని యజ్ఞకార్యము యే విధముగా పూర్తిచేయగలనా అని చింతించుచున్నాను. నీవు ఆ అశ్వమును తీసుకొని వచ్చి నన్ను నరకము నుండి రక్షింపుము” అని పలికెను.,

అంశుమానుడు తాత కోరిక తీర్చు తలంపుతో సగరసంతానము కావించిన సముద్ర మార్గము గుండా కపిల మహర్షిచెంతకు వెడలి, భక్తి పూర్వకముగా నమస్కరించి, మునిని సంతుష్టాంతరంగుని చేసి, యజ్ఞాశ్వమును ఇప్పించు మనియు, సగర కుమారులకు ముక్తి ప్రసాదించు మనియు వేడగా అతడు, “భరతవంశావతంశా! నీ యెడ నేను పరితుష్టుడనైతిని. సగరుడు నిన్ను పొంది కృతార్థుడైనాడు. నీ పౌత్రుని వలన సగర కుమారుల ముక్తికి గంగ భూమిపై అవతరించును. అశ్వమును తీసుకొని వెళ్లి నీ తాత యజ్ఞము పూర్తికావించుము. నీకు శుభము కలుగును” అని ఆశీర్వదించి, తురగమునిచ్చి పంపెను.

అంశుమానుడు ముని ఆజ్ఞను గైకొని అశ్వముతో తాతను చేరి, జరిగిన దంతయూ తెలిపెను. సగరుడు నిర్విఘ్నముగా యజ్ఞము పూర్తి చేసి, మనుమనికి రాజ్యమొసగి స్వర్గప్రాప్తి పొందెను.

అంశుమానుడు ధర్మపథావలంబియై రాజ్యము కావిచంమీచుండెను. అతనికి దిలీపుడను కుమారుడు కలిగెను. దిలీపుడు యుక్తవయస్కుడైన పిమ్మట రాజు రాజ్యము కుమారుని హస్తములనుంచి పరలోక ప్రాప్తి చెందెను.

దిలీపుడు తన పూర్వ పురుషులకు ఉత్తమగతులు ప్రాప్తించుటకు, భాగీరథిని భూలోకమునకు రప్పించుటకై యెన్నో విధముల ప్రయత్నించెను. కాలక్రమమున అతనికి భగీరథుడను కుమారుడు కలిగెను. భగీరథుడు సత్యవాది, ధర్మ పరాయణుడు, ధీమంతుడు, అసూయాశూన్యుడు. తండ్రి తరువాత అతడు రాజ్యసింహాసనము అధిరోహించెను.

## 108. భగీరథుడు గంగాదేవిని ఆరాధించుట

లోమస మహర్షి ధర్మరాజుతో “మహారాజా! భగీరథుడు రాజ్యపాలనము చేయుచూ లోకుల ముఖమున తన పితృపురుషుల దుర్గతిని తెలుసుకొని, విచారించి, తుదకు రాజ్యమును మంత్రులకు అప్పగించి తపస్సుచే గంగాదేవి దయ సంపాదింపదలంచి హిమాలయముల కేగెను.

ఆ హిమశృంగసాను దేశమున భగీరథుడు ఫల, మూలములను మాత్రమే భక్షించుచూ దేవ పరిమాణమున వేయి సంవత్సరములు కఠోరమైన తపస్సు కావించెను.

అతని తపస్సునకు మెచ్చి మూర్తిమతియైన గంగాదేవి దర్శనమిచ్చి అభీప్సితార్థము కోరుకొమ్మనిన, ఆ మహీపతి, “వరదాయినీ! సగర మహారాజు యొక్క అరువది వేల మంది కుమారులు అశ్వాన్వేషణమునకు వెడలి కపిలదేవుని కోపానలమున భస్మమైనారు. వారు నా పూర్వ పురుషులు. అకాల మృత్యువు సంప్రాప్తమైనందున వారు స్వర్గలాభము పొందలేదు. నీ సలిలమున అభిషిక్తులైన వారు సద్గతిని పొందెదరు. తల్లీ! నా పూర్వజుల సద్గతి లాభమునకు నీవు అవనీతలమునకు రమ్మని వేడుచున్నాను” అని ప్రార్థించెను.

సర్వలోక నమస్కృతయైన గంగ భగీరథుని వాక్యములను విని, ఆనందించి, “రాజా! నీ కోరిక తప్పక తీర్తును. కాని నేను భూమిపై అవతరించు సమయమున నా వేగము సహింపరానిది. ఈ త్రిలోకములలోను నా వేగమును భరించ గలిగిన

వాడు మహాదేవుడైన శంకరుడు మాత్రమే! అతడు నా ప్రవాహ వేగమును మస్తకమున ఆపి నీకు సహాయపడగలడు. నీవు ఆతనిని ప్రార్థింపుము" అని తెలుపగా భగీరథుడు, గంగాదేవి ఆదేశానుసారము కైలాస పర్వతమున కేగి కఠోర తపోనుష్ఠానమున కాలక్రమమున భవానీపతిని మెప్పించి తన పితృదేవతల స్వర్గప్రాప్తికి గంగను ధరింప వరము వేడెను.

## 109. భగీరథుని తపస్సునకు మెచ్చి శివుడు గంగను ధరించుట

లోమస మహర్షి ఇట్లనెను, "మహారాజా! భగీరథుని వాక్యములను విని భవానీపతి అతనితో "నీ ప్రార్థనానుసారము పరమ పవిత్రమైన దేవనది గంగను ధరింప నేను సిద్ధముగా నున్నాను. నీవు స్వర్గమునుండి ఆమెను రమ్మని కోరుము" అని, భగీరథునితో హిమాచలమున కేగెను.

మహాదేవుని వాక్యానుసారము, భగీరథుడు గంగను ధ్యానింప ఆమె, ఖేచర గమనులు ఆసక్తితో తిలకించుచుండ ఆకాశమునుండి భూమిపై ప్రవహింపసాగెను. ముత్యాలహారము వలె పడు ఆ మందాకినిని శూలపాణి తన లలాటమున ఆపగా మూడు ధారలై గంగ ప్రవహింప దొడంగెను.

స్వర్గము నుండి భువిపై అవతరించిన సురతరంగిణి భగీరథునితో "మహారాజా! నీ కొరకై నేను భూతలమునకు వచ్చితిని. నీవు ముందుగా నడచుచూ, నాకు దారి చూపుము" అని పలుకగా, భగీరథుడు ఆమె జలములతో పునీతులను చేయ సగర తనయులు భస్మీభూతులైన సాగరము దెస నడువ, గంగ అతిని అనుసరించెను.

శంకరుడు గంగాధారియై దేవతలు స్తుతించుచుండ కైలాసమునకు చనెను.

మహీపతి భగీరథుడు భాగీరథితో సముద్రమును చేరి, సాగరము గంగాజలముల పరిపూరకమాయెను.

గంగాజలముల పితృ పురుషులకు స్వర్గప్రాప్తి కలిగించి భగీరథుడు సఫల మనోరథుడయ్యెను.

## 110. కౌశికి మొదలైన తీర్థ దర్శనము

వైశంపాయనుడిట్లనెను, జనమేజయ మహారాజా! తదనంతరము పాండవులు నంద, అపరనంద యను నదుల స్నానమాడి, కతిపయ దినములకు హేమకూట

పర్వతమును చేరిరి. ఋషభుడను ముని ఆజ్ఞానుసారము అది సామాన్యులకు చేరరాని స్థలమై, దేవతలకు ఆవాసస్థానమై యుండెను.

అటు పిమ్మట పాండవులు కౌశికీ నదీతీరము చేరిరి. అచ్చట విశ్వామిత్రుని ఆశ్రమముండెడిది. కాశ్యప వంశీయుడైన ఋష్యశృంగుడు అచటనే నివసించెడివాడు. ధర్మరాజు ఋష్యశృంగుని చరిత్ర వినిపించుమని కోరగా లోమసముని ఇట్లు చెప్పదొడంగెను.

## ఋష్యశృంగుని చరిత్ర

దేవకల్పుడైన కశ్యపుని కుమారుడు విభాండకుడు చిన్నతనము నుండియే కఠోరమైన తపస్సు చేయసాగెను. ఇట్లు బహుకాలము తపస్సు ఆచరించియుండు నవసరమున, ఒకనాడు నదిలో స్నానము చేయుచూ ఊర్వశి యను దేవకన్యను కాంచగా, రేతస్సు పతనమయ్యెను. బ్రహ్మశాపవశమున మృగరూపమున ఉన్న ఒక దేవకన్య ఆ రేతః పూర్ణ సలిలము త్రావి గర్భిణి అయ్యెను. ఆ వేడికి పుట్టిన కుమారుడే ఋష్యశృంగుడు. అతని శిరోదేశమున ఒక శృంగముండెడిది కావున అతడు ఋష్యశృంగుడని పిలుబడెడివాడు. ఆతడు తండ్రి వద్ద పెరిగి పెద్దవాడయ్యెను. కాననమందున తండ్రిచే పెంచబడుటచే వేరొకరిని యెరుగక బ్రహ్మచర్యానుష్ఠానమున నిర్మల మనస్కుడై ఆతడు పెరిగెను.

ఆ సమయమున దశరథునకు స్నేహితుడైన లోమపాదుడను రాజు చంపానగరము రాజధానిగా అంగదేశమును పాలించుచుండెడివాడు.

అంగరాజు స్వేచ్ఛా విహారియై, అబద్ధములాడి పురోహితులైన బ్రాహ్మణులను అవమానించుట వలన వారు కోపించి రాజ్యము వీడి చనిరి. అందుచే ఇంద్ర ప్రభావమున ఆ రాజ్యమున వర్షములు పడక ప్రజల బాధపడసాగిరి.

రాజు మంత్రులను, మునులను పిలచి అట్టి స్థితికి కారణమడిగిన, ఒక ఋషిపుంగవుడు బ్రాహ్మణులను అవమానించుట వలననే ఇట్టి స్థితి కలిగిన దనియు, వారిని సత్కరించి మరల రప్పించి, బ్రహ్మచర్యవ్రతావలంబియై యున్న ఋష్యశృంగుని రాజ్యమునకు రప్పించిన తప్పక వర్షములు కురియునని తెలిపెను.

లోమపాదుడు ద్విజులను సత్కరించి చంపా నగరమునకు రప్పించెను.

ఋష్యశృంగుని రాజ్యమునకు తీసుకొని వచ్చుటకై ఒక వారవనితను నియమించి ఆమెకు కార్యార్థమై ధనరత్నములను ప్రదానము చేయ, ఆమె నగరమున చక్కని ఉద్యానవనమును నిర్మించి, ఆనందము చేకూర్చు పలు వస్తు

సముదాయములతోనున్న అందమైన పడవతో, రూపయవ్వనవతులైన కామినులతో విభాండకుని ఆశ్రమ ప్రాంతము చేరి, విభాండక మహర్షి ఆశ్రమమున లేని సమయమున రూపవతియు, చతురమతియునైన తన కుమార్తెను ముని కుమారుని వద్దకు పంపెను.

## 111.

నిపుణురాలైన ఆ వేశ్యబాలిక ఋష్యశృంగుని వద్దకు చేరి కుశల ప్రశ్నలు వేయగా, అతడు మునిగా సత్కరించబోయెను. ఆ లలన అతనిని హావభావ చేష్టలతో అనురాగము కలుగచేసి, తన ఆశ్రమమునకు రమ్మని, విభాండక మహర్షి రాకముందే నౌకకు మరలిపోయెను.

వేశ్యకుమారిపై మనస్సు లగ్నమై దీర్ఘనిశ్వాసములు విడచుచూ, నిత్య కృత్యములు మాని చేతనాహీనుడై ఋష్యశృంగుడు ఉన్న సమయమున ఆతని తండ్రి ఆశ్రమమునకు మరలి, కుమారుని దశ గాంచి, కారణమేమని ప్రశ్నించెను.

## 112.

ఋష్యశృంగుడు విభాండకునితో "తండ్రీ! నేడు మన ఆశ్రమమునకు ఒక వింత బ్రహ్మచారి వచ్చెను. ఆతని శరీరము బంగారపు రంగులో నున్నది. కమలముల వంటి కన్నులున్నవి. కంఠమున, నడుమున, చేతులకు, కాళ్లకు ఆభరణములున్నవి. ఆతడు కాలు, చేతులు కదుపు సమయమున వానికున్న నగలు ఆనందము కలిగించు చక్కని శబ్దము చేసెడివి. ఆతడు ధరించిన బట్టలు, మన వస్త్రముల వలె కాక మెత్తగాను, అందముగాను ఉన్నవి. ఆతని స్వరము కోకిల కంఠము కన్నా మధురముగా యన్నది. ఆతని శరీరమునండి సువాసన నిర్గమించెడిది. ఆతడు నన్ను కౌగలించుకొని తన ముఖమండలమును నా మోముపై ఆన్చగా నా శరీరము ఆనందముతోను, యేదో వింత అనుభవముతోను పులకించినది. అతడు నేను ఇచ్చిన ఫలములను ఆరగింపక తాను తెచ్చిన మధురమైన పదార్థములను నాకు తినిపించెను. అతడు నాకు ఇచ్చిన సలిలమును త్రాగగా యెంతో తృప్తి పొందితిని. ఆ సమయమున భూమి కదలుచున్నట్లు భ్రమించితిని. ఆతడు వెడలినప్పటినుండియు నాకు ఆతని చేష్టలే జ్ఞప్తికి వచ్చు చున్నవి. అతని సహచర్యముతో జీవితము గడుపవలెనని యున్నది. అతని వలెనే తపోనుష్టానము చేయవలెనని కోరిక కలిగినది" అని అమాయకముగా బదులు పలికెను.

## 113.

విభాండకుడు కుమారునితో "వత్సా! రాక్షసులు మన తపస్సు విఘ్నము చేయుటకు కామరూపులై వచ్చి, భ్రమను కలిగింతురు. వారిని నమ్మరాదు" అని పలికి ఆ మాయావిని వెదుక బయలువెడలి మూడు దినములు అందందు తిరిగి యెచటను కాంచక ఆశ్రమమునకు బయలుదేరెను.

విభాండక ఋషి వెడలిన పిమ్మట ముని కుమారుని ప్రలుబ్ధ పరుచగా వచ్చిన వారకన్యను చూచి ఋష్యశృంగుడు ఆనందముతో యెదురేగి, "ఓ బ్రాహ్మణుడా! నా తండ్రి రాక ముందే మనము నీ ఆశ్రమమునకు పోవుదము.పద" యనిన, ఆమె తన కార్యమ సానుకూల పడినందులకు సంతసించి ఆతనిని నౌకకు తీసుకొనిపోయి, అతని మనస్సు రంజింపచేయుచూ, నగరమునకు తీసుకొని వచ్చి ఉద్యానవనమున ప్రవేశింపచేసెను. మునికుమారుడు అంగ రాజ్యమున ప్రవేశించగానే సమృద్ధిగా వర్షములు కురిసెను. లోమపాదుడు ఆనందముతో అపురూప సౌందర్యవతియైన తన కుమార్తె శాంతతో ఋష్యశృంగునితో వివాహము కావించి, మునిబాలకునకు ఆనందము చేకూర్చెను.

తదనంతరము రాజు గోపాలకులను, కృషికులను పిలచి వారితో విభాండక మహర్షి కోపము తగ్గి, ఆనందము కలుగునట్లగా తాము ఋష్యశృంగుని అధికృతులమని తెలుప ఆజ్ఞ ఇచ్చెను.

వారును రాజు చెప్పిన విధముగా కొడుకును వెదకుచూ క్రోధముతో నున్న విభాండక మహర్షికి యెన్నో ఉపచారములు కావించి, తామ అతని కుమారుని సేవకులమని పలికి ఆనందము చేకూర్చిరి.

ముని లోమపాదుని సభ ప్రవేశించి రాజుచే సత్కారములనందుకొని, కుమారుని ఔన్నత్యమును, మెరుపుతీగ వలెనున్న కోడలినీ చూచి ఆనందించి, తనయునితో "వత్సా! మహారాజునకు సర్వకార్యముల సహాయపడుచూ కుమారుడు జన్మించిన పిదప అడవుల కేగుము" అని పలికి ఆశీర్వదించి యధేచ్ఛ చనెను.

ఋష్యశృంగుడు తండ్రి యానతి శిరసావహించి, యథాసమయమున ఆశ్రమమునకు వెడలెను. పతి సేవా పరాయణురాలైన శాంత అతనితో అనుకూలవతియై కీర్తి గాంచెను.

## 114. పాండవులు వైతరిణీ మొదలైన తీర్థములను గాంచుట

వైశంపాయనుడిట్లనెను, "జనమేజయా! తదనంతరము ధర్మరాజాదులు కౌశికీ తీర్థము నుండి గంగాసాగర సంగమము చేరి, అచ్చట స్నానమాచరించి, కళింగదేశమున స్రోతస్వతి వైతరిణీ నదిని చేరిరి. లోమసమహర్షి అచ్చటి తీర్థ విశేషములు వారికి తెలియజేసెను.

## 115. పాండవులు మహేంద్రపర్వతమున పరశురాముని ఆశ్రమమునకు చనుట

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా, మహేంద్ర పర్వతమునకు చని అచ్చట మునుల ఆశీర్వాదము పొంది, ధర్మరాజు పరశురాముని అనుచరుడైన ఆకృతవర్ణుడను మహావీరునకు నమస్కరించి పరశురాముడు యెందులకు క్షత్రియ వంశమును నాశనము చేసెనో సవిస్తరముగా తెలుపుమని వేడగా ఆతడు ఇట్లు చెప్పదొడంగెను.

## 116. కార్తవీర్యార్జునుని చరిత్ర

మహావీరుడైన కార్తవీర్యునకు వేయి చేతులు గలవు. అతడు దత్తాత్రేయుని వరము వల్ల లభించిన బంగారు విమానముతో భూమిని యేక చక్రాధిపతిగా యేలసాగెను. కార్తవీర్యుని ధాటికి దేవతలు కూడా వెరచి, తుదకు ఇంద్రుడు విష్ణుమూర్తిని దర్శించి, కార్తవీర్యుని వధింప వేడెను. నారాయణుడు అమరేంద్రుని మాటలు మన్నించి, స్వీయ రమణీయ బదరికాశ్రమమున ప్రవేశించెను.

కన్యాకుబ్జ దేశమున మహాబలుడైన గాధియను పేరుగాంచిన నరపతి గలడు. అతని వనవాసకాలమున సర్వాంగ సుందరియైన పుత్రికారత్నమును గాంచెను. ఆమె రూపయవ్వనములు గాంచిన భార్గవుడు, ఋచీక మహర్షి తనకు ఆ కన్యారత్నమును దానము చేయుమని వేడ, రాజు తమ కులమున కన్యాదాన కాలమున వేయి ఉత్తమాశ్వములను శుల్కముగా గ్రహించు ఆచారము కలదని తెలియజేసెను. ఋచీకుడందులకు అంగీకరించి వరుణదేవుని ప్రార్థించి వేయి ఉత్తమాశ్వములను పొంది రాజునకు సమర్పింప, గాధి తన కుమార్తెను భాగీరథీ తీరమున కన్యాకుబ్జమున ఋచీకునితో వివాహము కావించెను.

భృగుమహర్షి సుఖముగా ఉన్న కుమారుడు, కోడలిని చూచుటకు కన్యా కుబ్జమునకు వచ్చెను. ఋచీకుడు, సత్యవతి అతనికి నమస్కరించిరి. రాజునూ

ఆతనిని ఉచితరీతిని సత్కరించెను. కోడలు సత్యవతి చేసిన సేవా శుశ్రూషలకు సంతసించి భృగుమహర్షి ఆమెను వరమడుగుమనగా ఆమె తనకు, తన తల్లికి పుత్రసంతానము కలుగునట్లు వరమిమ్మని వేడెను. ముని వేరు వేరుగా పరమయత్న సహకారమున చేసిన లేహ్యములను సత్యవతికి ఇచ్చి వాటిని భక్షించిన పుత్రులు కలుగుదురనెను. విధివశమున ఆ అంగనలు ఒకరికై నిర్దేశించిన లేహ్యమును మరియొకరు తినుట తెలుసుకొని మహర్షి కోడలితో "భద్రే! మీరు విపరీతముగా ప్రవర్తించుటచే నీకు క్షత్రియ వృత్తిధారియు, నీ తల్లికి బ్రాహ్మణుడును కలుగుదురు" అని వచించిన సత్యవతి, "మహానుభావా! మాకు అటువంటి పుత్రులు జన్మించుట ఇష్టము లేదు. కాని మీ మాట నిలచుటకై పౌత్రులు కలిగిన అభ్యంతరము లేదు" అనిన "తథాస్తు" అని ముని అనుమోదము తెలిపెను.

తదనంతరము సత్యవతి తేజోరూప లావణ్యుడైన కుమారుని గాంచెను. ఆతడే జమదగ్ని. దినదిన ప్రవర్ధమానుడై బాలకుడు వేదాధ్యయనమును, ధనుర్వేదమును, చతుర్విధ అస్త్రోపసంహారములను నేర్చుకొనెను.

## 117. జమదగ్ని-రేణుక

విద్యావంతుడైన జమదగ్ని, బహుకాలము తపమాచరించిన పిదప ప్రసేన జిత్తుడను రాజును చేరి, అతని కుమార్తె రేణుకను ప్రార్థింప, రాజు సంతోషచిత్తుడై రేణుకా జమదగ్నుల వివాహము కావించెను. వారికి ఐదుగురు కుమారులు కలిగిరి. రుమద్వానుడు, సుషేణుడు, వసువు, విశ్వావసువు మరియు పరశురాముడు. పుత్రులలో పరశురాముడు కనిష్టుడైనను గుణప్రభావమున జ్యేష్ఠత్వము పొందెను.

ఒకనాడు ఫలములను తెచ్చుటకై వెడలిన రేణుక స్నానము చేయుటకై నదిని చేరి, దైవవశమున భార్యతో జలక్రీడలాడుచున్న చిత్రరథుడను రాజును చూచి మదనుని పాలబడెను. ఇది తెలుసుకొనిన జమదగ్ని కుపితుడై ఆశ్రమమునకు క్రమముగా తిరిగి వచ్చిన పెద్దకుమారులను తల్లిని చంపమని ఆజ్ఞాపింప, మాతృహత్యకు వెరచి పరాన్ముఖులైరి. ముని శాపమున వారు జడప్రాయులై సంజ్ఞాహీనులైరి.

అట్టి అవసరమున ఆశ్రమమునకు మరలిన పరశురామునితో జమదగ్ని తల్లిని చంపుమనగా, ఆతడు తక్షణమే చేతనున్న గొడ్డలితో తల్లి శిరచ్ఛేదము కావించెను. కొంతసేపటికి కోపము తగ్గి శాంతించిన మహర్షి కుమారునితో, "వత్సా! నా నిర్దేశానుసారము నీవు దురూహమైన కార్యము చేసితివి. నీకు తోచిన

వరము కోరుకొమ్ము” అని ఆదేశింప, పరశురాముడు వినీతుడై తండ్రితో, “తండ్రీ! మీరు ప్రసన్నులైన నా తల్లి, అన్నలను పునర్జీవితులను చేయుడు. నేను ఆమెను వధించితినన్న సంగతి ఆమెకు జ్ఞప్తికి రాకుండా చేయుడు. మాతృహత్యా పాతకము నాకు అంటకుండా ఉండునట్లును, సంగ్రామమున అప్రతిద్వందుడనై ఉండు నట్లును దీర్ఘాయువును ప్రసాదింపుడు” అని వరమడిగిన జమదగ్ని “తథాస్తు” అనెను.

ఒకనాడు జమదగ్ని, కుమారులు ఆశ్రమమున లేని సమయమున కార్తవీర్యుడు ఆశ్రమమునకు వచ్చిన రాజునకు ఉచితరీతిని రేణుక సత్కరించెను. ఆశ్రమమున ఉన్న హోమధేనువును బలాత్కారముగా రాజు తీసుకొనిపోయెను. ఇది తెలిసికొనిన పరశురాముడు యేకాకిగా కార్తవీర్యుని యెదుర్కొని ఆతని వేయి చేతులు ఖండించి, సంహరించెను.

## 118.

జాతక్రోధులైన రాజకుమారులు పరశురాముడు సమిధలను తీసుకొని వచ్చుటకై వెడలిన సమయమున ఆశ్రమమునకు వచ్చి రణవిముఖుడైన జమదగ్నిని బాధించి, చంపివైచిరి.

తండ్రి మృతికి విలపించి, ఆతని అంత్యక్రియలు కావించి పరశురాముడు క్షత్రియకులమును నిర్మూలము చేయుదునని ప్రతిజ్ఞ కావించి, ముందుగా కార్తవీర్యుని పుత్రులను సంహరించి తదనంతరము ఇరువది ఒక్కమారు దండెత్తి పుడమిని క్షత్రియ శూన్యము గావించెను. శమంత పంచక తీర్థమున రుధిరమయ పంచహ్రదములను ప్రస్థుతి చేసి పితృదేవతలకు తర్పణము గావించెను. ఆ సమయమున ఋచీకుడు అచ్చట ఆవిర్భవించి రామునకు అభిలషిత వరములిచ్చెను.

అనంతరము పరశురాముడు యజ్ఞము కావించి ఇంద్రాది దేవతలను తృప్తులను గావించి, ఋత్విక్కులకు భూరిదానములిచ్చి, పుడమిని కశ్యపునకు దానము గావించి మహేంద్ర పర్వతమున వసింపసాగెను.”

ఇట్లు అకృతవర్ణుని వలన పరశురాముని చరిత్ర విని ధర్మరాజాదులు చతుర్దశినాడు ముని దర్శనము పొంది, మరునాడు దక్షిణముగా ప్రమాణము చేసిరి.

## 119. పాండవులు ప్రభాస తీర్థమునకు చనుట

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! సచ్చరిత్రులైన పాండవులు సాగర తీర్థమును, గోదావరీ తీర్థమును, అగస్త్యతీర్థమును, నారీ తీర్థమును దర్శించి తుదకు అతి ప్రఖ్యాతి గాంచిన ప్రభాస తీర్థము చేరిరి. దర్మపరాయణుడైన యుధిష్ఠిరుడు తమ్ములు, బార్యతో జలవాయువులు మాత్రమే భక్షించుచూ పన్నెండు దినములు కఠోరమైన తపస్సు కావించెను.

పాండవులు ప్రభాస తీర్థమునకు వచ్చిరని తెలుసుకొని, వృష్టి కులావతంశులైన బలరాముడు, కృష్ణుడు, సాత్యకి మొదలైనవారు అచ్చటకు వచ్చి, ధరాశాయులై, మలినదేహులై యున్న పాండవులను చూచి మిక్కిలి దుఃఖించిరి.

అనంతరము ధర్మరాజు, బలరామ, కృష్ణాదులను ఆహ్వానించి సత్కరించెను. వారును ఆదరవచనములు పలికి, ఉచితమైన ఆసనముల కూర్చొనగా, పాండవాగ్రజుడు వారికి వనవాస వృత్తాంతములను, అర్జునుని అస్త్రలాభమును, ఇంద్ర సన్నిధాన గమనమును వినిపించెను.

## 120.

బలరాముడు, సాత్యకి పాండవుల దీనస్థితికి మిక్కిలి విచారించి, తాము పాండవులకు సర్వవిధముల సహాయపడ సిద్ధముగా ఉన్నామనియు; దురాత్ములైన కౌరవులను నాశనము చేసి, ధర్మరాజునకు రాజ్యమిప్పింతుమనియు పలుకగా, ధర్మరాజు వారి అభిమానమునకు తన కృతజ్ఞత తెలియజేసి, తాను ధర్మమును వీడి అధర్మాచరణము చేయజాలనని వారిని వారించి స్వస్థానమునకు పంపెను.

## 121.

పాండవులు పయోష్ణియను తీర్థమును చేర, లోమసమహర్షి వారికి అచ్చట గయుడను రాజు యేడు అశ్వమేధములను చేసిన వృత్తాంతము తెలియజేసెను.

## 122.

అట్లు ప్రయాణము చేయుచూ, పాండవులు నర్మదానదీ తీరమున వైడూర్య పర్వత సమీపమునకు రాగా, లోమసమహర్షి ధర్మరాజుతో, "రాజా! ఇచ్చట శర్యాతి అను రాజు చేసిన యజ్ఞములో చ్యవనుడు అశ్వనీకుమారులను సోమరస పానార్హులను కావించెను" అని పలుకగా యుధిష్ఠిరుడు వివరముగా ఆ కథ వినిపింపుమని వేడెను.

## 122. చ్యవనుడు - సుకన్య

లోమసుడు ఇట్లనెను, "ధర్మరాజా! భృగుమహర్షికి చ్యవనుడను కుమారుడు కలిగెను. చ్యవనుడు ఒక సరోవర తీరమున వీరాసనమున కూర్చొని నిశ్చలుడై కఠోరమైన తపస్సు యొనరించుచుండ, కాలక్రమమున ఆతని చుట్టూ పుట్టలు కట్టెను.

ఒకనాడు శర్యాతి అను రాజు నాలుగువేల మంది రాణులతోను, సుకన్య అను కుమార్తెతోను, మంత్రి సామంతులతోను ఆ సరోవర ప్రాంతమునకు విహారార్థము వచ్చెను.

బాల్యవశమున రాజకుమార్తె సుకన్య పుట్టలో ప్రకాశించుచున్న చ్యవనుని కన్నులను విచిత్రవస్తువనుకొని పుల్లతో పొడిచెను.

అంతకు క్రితమే ఆమె సౌందర్యము గని ముగ్ధుడైన ముని తనను బాధించుటచే కుపితుడై శర్యాతి సైన్యసముదాయముల మలమూత్రములను బంధించెను.

వారి బాధకు కారణము కుమార్తె చేసిన కార్యమే అని తెలుసుకొని రాజు మునిని చేరి క్షమింపుమనగా, ఆతడు సుకన్యతో తన వివాహము గావించిన క్షమింతుననెను. రాజు అందులకు అంగీకరించి, మునితో సుకన్య వివాహము గావించి, గతక్లేశుడై రాజధానికి మరలెను.

## 123. అశ్వనీకుమారుల దయచే చ్యవనుడు యౌవ్వనము పొందుట

లోమసుడిట్లనెను, "కొంతకాలము గడచిన పిమ్మట అశ్వనీకుమారులు కృతస్నాతయై, అపురూప సౌందర్యముతో అలరారుచున్న సుకన్యను గాంచి, "లలనా! నీవెవ్వరు? యెందులకు ఇట్లు ఒంటరిగా కాననమున ఉంటివి?" అని ప్రశ్నింప, సుకన్య "సురులరా! నేను శర్యాతి అను రాజుయొక్క కుమార్తెను. చ్యవనమహర్షి భార్యను. సుకన్య నా పేరు" అని ప్రత్యుత్తరమిచ్చెను.

"కళ్యాణీ! మేలైన వస్త్రాభరణము లేకనే సౌదామిని వలెయున్న నిన్ను నీ తండ్రి యేల ముసలివాడు, కామభోగ వర్జితుడైన మునితో వివాహము కావించెను? ఈతడు నిన్నేమి సుఖపెట్టగలడు? మాలో ఒకరిని వివాహమాడి జన్మసార్థక పరచుకొనుము. నీవు అంగీకరించిన నీ భర్తకు కూడా యవ్వనము ప్రాప్తించునట్లు చేయుదుము. అప్పుడైనను నీవు మా మువ్వురిలో ఒకరిని యెన్నుకొనవచ్చును"

అని అశ్వనీకుమారులు పలుకగా, ఈ విషయము సుకన్య భర్తకు తెలియపరచగా, ఆతడు అంగీకరించినా, అశ్వనీకుమారుల పనుపున చ్యవనుడు వారితో సరోవరమున కృంగు విడిన ముగ్గురూ దివ్యాకృతులతో, యువకులై, సమవేష భూషణములతో వెలువడిన పతివ్రతయైన సుకన్య భర్తనే యెన్నుకొనెను. తనకు చేసిన ఉపకారమునకు సంతసించి చ్యవనుడు అశ్వనీకుమారులకు యజ్ఞభాగ మిప్పింతునని వాగ్దానము చేసెను.

## 124.

తమ జామాత రూపయవ్వనములు పొందిన సంగతి తెలుసుకొని శర్యాతి అరణ్యమునకు వచ్చి చ్యవనుని, సుకన్యను గాంచి ఆనందించెను. చ్యవనుడు రాజుతో యజ్ఞము చేయమనియు, దానికి తాను సహాయపడుదునని తెలుపగా, రాజు అంగీకరించి, యజ్ఞమునకు కావలసిన వస్తుసముదాయము కూర్చుకొని, చ్యవన సహాయుడై యజ్ఞము ప్రారంభించెను.

ఆ క్రతువులో చ్యవనుడు అశ్వనీకుమారులకై సోమరసము భాగించబోగా, వారు సామాన్య చికిత్సకులనియు, మర్త్యలోకమున తిరుగువారనియు, సురసమానులు కాకపోవుటచే యజ్ఞభాగమునకు అర్హులు కారనియు పలికి ఇంద్రుడు వారించబోయిన, ముని ఆతని మాటలను లెక్కింపక, అశ్వనీకుమారుల భాగము తానే గ్రహింప కుపితుడై ఇంద్రుడు వజ్రము ప్రయోగింప సమకట్టెను.

రణోన్ముఖులైన శచీపతిని చూచి చ్యవనుడు భుజము చరిచి, మంత్రోచ్ఛారణ పూర్వకముగా ఆహుతి ప్రదానము చేసిన, అతని తపోబలమున అందుండి అతిదీర్ఘకాయుడైన మదాసురుడు ఉత్పత్తి చెంది, గుహవంటి నోరు తెరచుకొని వికటాట్టహాసము చేయుచూ ఇంద్రుని మ్రింగుటకై ఆతని దెస చనెను.

## 125.

కృతాంతుని వలె తన దెస వచ్చు రాక్షసుని చూచి, ఇంద్రుడు భయపడి చ్యవనునితో, "విప్రోత్తమా! నేను నిజము పలుకుచున్నాను. నేటినుండి అశ్వనీ కుమారులు యజ్ఞభాగము పొంద అర్హులు. అమోఘ వచన సంపన్నుడవైన నీ మాటలు వ్యర్థము కావు. నీయొక్కయు, శర్యాతి రాజు యొక్కయు కీర్తి వృద్ధిపరచుటకే నేను ఇట్లు ప్రవర్తించితిని. నామీద దయదలంచి, మీ ఇచ్ఛానుసారము చేయుడు" అని వేడికొనగా, ముని శాంతించి ఇంద్రునకు ముక్తి నిచ్చి, 'మదము'భాగించి, స్త్రీజాతియందును, సురాపానమునందును, జూదము

నందును నిక్షిప్తపరచెను” అని లోమస మహర్షి పలుకగా, పాండవులు శ్రద్ధా భక్తులతో చ్యవన సరోవరమున స్నానము కావించి ముందుకు చనిరి.

## 126. మాంధాత జన్మవృత్తాంతము

యమునానదీ ప్రాంతమును పాండవులు చేరగా, లోమసమహర్షి ఆ స్థానమున కృష్ణుడు తపస్సు చేసెననియూ, సోమకుడు, మాంధాత యజ్ఞములను చేసిరని తెలుపగా, ధర్మరాజు ఆ తాపసిని బహువిచిత్రమైన మాంధాత జన్మవృత్తాంతము తెలియజేయమని కోరగా ఆతడిట్లు చెప్పదొడగెను.

“ఇక్ష్వాకు వంశమున యవనాశ్వుడను రాజు కలడు. అతడు వేయి యజ్ఞములను గావించి బ్రాహ్మణులకు భూరి దానములను చేసినను పుత్రుని ముఖము చూచు బాగ్యము పొందక తుదకు రాజ్యమును మంత్రుల ఆధీనము కావించి, వనమున భార్యాసహితముగా నివసించసాగెను.

అచ్చట రాజునకు సంతానము కలుగుటకై భార్గవమహర్షి యజ్ఞము కావించి, సలిలపూరితమైన యజ్ఞకలశమును జాగ్రత్తపరచియుంచెను.

ఒకనాటి రాత్రి రాజు మేల్కొని దాహముతో ఇటునటు తిరిగి ముని భద్రపరచిన కలశములోని నీరు త్రాగెను.

మరునాడు ఉదక శూన్యమైన కలశమును గాంచి ముని ప్రశ్నింప యవనాశ్వుడు తాను దాహము తీరుటకు గ్రహించిన సంగతి తెలియజేయ, మహర్షి “రాజా! ఆ నీటిని త్రావి నీవు అత్యంత గర్హితమైన కార్యము చేసితివి. అది నీ సంతానము కొరకై రాణి త్రాగుటకు నేను భద్రపరచితిని. దైవబలము అజేయమైనది. అత్యంత తేజోసంపన్నుడైన కుమారుని నీవే ప్రసవించెదవు. నా ఆశీర్వాదమువలన గర్భక్లేశము నీకు కలుగదు” అని పలికెను.

ముని వచనముల ప్రకారము శతవత్సరములు గడచిన పిమ్మట, రాజు యొక్క పార్శ్వదేశమును ఛేదించుకొని పుత్రుడు జన్మించెను. ఋషి ఆశీర్వాదము వలన రాజునకు యెట్టి హానియూ కలుగలేదు.

దేవతలు ఆ అద్భుత శిశువును చూడవచ్చిరి. దేవగణములు సురరాజుతో “ఈ బాలకుడేమి త్రావు”ననగా, ఆతడు తన చూపుడు వ్రేలును బాలకుని నోటనుంచి, “మాం ధాస్యతి” అని పలుకుటచే ఆ బాలకుడు మాంధాత అని ప్రసిద్ధిగాంచెను.

తదనంతరము యవనాశ్వ తనయుడు సురరాజుచే అభిషిక్తుడై త్రిలోకములను జయించెను. అప్రతిహతుడై ఆ వసుధాధిపతి బహురత్నములను చేర్చి, యజ్ఞములను కావించి ఇంద్రాది దేవతలను తృప్తిపరచెను. ఆ మహావీరుడు అమిత తేజస్కుడైన గాంధార రాజును జయించి, సంహరించెను. బహుకాలము ప్రజారంజకముగా రాజ్యము చేసి, స్వర్గము చేరెను. ఆతడు యజ్ఞము చేసిన స్థలమిది.”

ముని వలన మాంధాత చరిత్ర విని, ధర్మరాజు సోమకుని వృత్తాంతము తెలుపమని లోమసుని కోరెను.

## 127. సోమక నృపతి వృత్తాంతము

లోమస మహర్షి ఇట్లనెను. “ధర్మరాజా! సోమక నృపతి అతిధార్మికుడు. అతనికి నూర్గురు భార్యలు కలరు. బహుకాలము గడచినను రాజునకు సంతానము కలుగలేదు.

తుదకు వృద్ధావస్థలో రాజునకు ఒక కుమారుడు కలిగెను. ఆతని పేరు ‘జంతుడు’. లేకలేక కలిగిన సంతానమగుటచే నూర్గురు రాణులూ ఆ కుమారుని కంటిరెప్ప వలె కాపాడి, పెంచుచుండిరి.

రాజు ఒకనాడు కొలువు తీరి యుండు సమయమున అంతఃపురమునుండి రోదన ధ్వనులు వినిపింప సోమకుడు మంత్రులతో త్వరితముగా వెడలి కుమారుని ఒక చీమ కరచుటయే కారణమని తెలుసుకొని, సభకు తిరిగి వచ్చి, మంత్రులతోను, పురోహితులతోను ఒకడే కుమారుడు కలుగుటవలని కష్టములను దీనముగా తెలియజేయగా, పురోహితుడైన బ్రాహ్మణుడు రాజుతో, “రాజా! నీ దుఃఖమును నేను ఒక క్రతువు చేసి మాన్పగలను. అందులకు నీవు ఒక కఠినమైన కార్యము చేయవలెను” అని పలుక రాజు సవిస్తరముగా తెలుపుమని కోరగా, ఆ పురోహితుడు, “రాజా! ఆ యజ్ఞమున నీ కుమారుడైన ‘జంతుని’ యొక్క క్రొవ్వు ఆహుతి చేసి పొగలను నీ రాణులు ఆఘ్రాణించిన నూర్గురు రాణులకు అమిత తేజస్కులైన నూర్గురు కుమారులు కలుగుదురు. ‘జంతుడు’ మరల తన తల్లి గర్భముననే జన్మించును. ఆతని యెడమ భాగమున బంగారు రంగు మచ్చ యుండును” అని తెలుపగా రాజు అందులకు ఒప్పుకొనెను.

## 128.

తదనంతరము పురోహితుడు యజ్ఞము గావించి, బలాత్కారముగా రాజకుమారుని గ్రహించి, ఆహుతి చేసిన రోదనము చేయుచూ, పొగను ఆఘ్రాణించి రాణులు మూర్ఛ పొందిరి.

కొంత కాలమునకు నూర్గురు రాణులు గర్భవతులై నూర్గురు పుత్రులను పొందిరి. తన తల్లికి జ్యేష్ఠుడై 'జంతుడు' జన్మించెను. పురోహితుడు చెప్పిన విధముగా అతని వామపార్శ్వమున సౌవర్ణ చిహ్నము కలదు.

కాలక్రమమున రాజు, పురోహితుడు కాలగ్రాసమున నిపతితులైరి. యమసదనమున మిక్కుటమైన బాధలు పడుచున్న తన పురోహితుని చూచి రాజు యముని కారణమడుగగా, నాడు రాజు కొరకై ఆతడు చేసిన నిర్దయాపూరితమైన క్రతువే కారణమని తెలుసుకొని సోమకుడు యముని వేడి ఋత్వికునితో పాపఫలమనుభవించి, తదనంతరము స్వర్గము చేరెను."

## 129 & 130.

పాండవులు సోమకతీర్థమున స్నానమాచరించి, సరస్వతీ తీర్థము, సింధు తీర్థము, విష్ణుపదమను అనుత్తమ తీర్థము దర్శించి, విపాసా నదీతీరము చేరిరి. పుత్రశోకమన గ్రుమ్మరుచూ వశిష్ట మహర్షి ఈ నదిలో స్నానము చేసి ఆ దుఃఖము నుండి ముక్తుడయ్యెను. కావున ఆ నదికి విపాస అని పేరు కలిగెను.

## 131.

వితస్తానదీ తీరమున పాండవులకు లోమసమహర్షి ఉశీవరుడు యజ్ఞము చేసిన స్థలము చూపి ఆతని చరిత్ర తెలిపెను.

## ఉశీనర ఉపాఖ్యానము

"ధర్మరాజా! మహా ధార్మికుడైన ఉశీనర నృపతిని పరీక్షించుటకై అగ్ని పావురముగాను, ఇంద్రుడు గ్రద్దగాను కామరూపులై, గ్రద్ద పావురమును తరుముచుండ, పావురము రాజు ఒడిలో వ్రాలి శరణు వేడెను.

ఆకలితో నున్న గ్రద్ద తన ఆహారమును విడువుమని రాజును కోర, శరణాగత వత్సలుడైన రాజు ఆ పక్షికి ఇతర జంతు మాంసము ఇత్తుననిన, ఆ గ్రద్ద ఇయ్యకొనకపోయిన, తన శరీర ఖండమునే ఇత్తునని వాగ్దానము చేసి, త్రాసు

తెప్పించి, కపోతము నొక వంకనుంచి, తన శరీరభాగములను కోసి రెండవ వైపున వేయసాగెను. కపోతమునకు సరిపడు మాంసము కాకయుండుట గమనించి, రాజు తానే తులాయంత్రమున కూర్చుండగా, దేవతలు పుష్పవృష్టి గావించిరి. ఇంద్రుడు, అగ్ని తమ నిజరూపములు తాల్చి, రాజును స్వస్థుని చేసి, అక్షయ వరములిచ్చి స్వస్థానముల కేగిరి.

## 132. అష్టవక్రుడు-శ్వేతకేతు వృత్తాంతము

ఇట్లు తీర్థయాత్రలు చేయుచూ బ్రాహ్మణులతోను, మునులతోను పాండవులు ఉద్దాలక మహర్షి ఆశ్రమమును చేరిరి. అచ్చట లోమసమహర్షి వారికి ఉద్దాలక మహర్షి తనయుడైన శ్వేతకేతుని, మనుమడైన అష్టవక్రుని చరిత్ర వారికి తెలిపెను.

"ఉద్దాలక మహర్షికి కహోడుడను శిష్యుడు కలడు. కహోడుడు గురువునకు సేవాశుశ్రూషలు చేయుచూ బహుకాలము అధ్యయనము గావించెను. ఉద్దాలకుడు ఆతని పరిచర్యలకు సంతసించి తన కుమార్తెయైన సుజాతతో ఆతని వివాహము కావించెను.

కొద్దికాలమునకు సుజాత గర్భవతి అయ్యెను. ఒకనాడు కహోడుడు వేదము చదువుచూ శిష్యులకు నేర్పు సమయమున గర్భమున ఉన్న శిశువు "తండ్రీ! మీరు చెప్పు విద్యలన్నియు నేను గర్భస్థుడనై వినుచున్నాను. వీరి పఠనము తగిన విధముగా జరుగుట లేదు. శబ్దములను తప్పుగా ఉచ్చరించుచున్నారు" అని పలుకగా, కుపితుడై కహోడుడు అష్టస్థలముల వక్రుడవు కమ్మని శపించెను.

ధనసేకరణకై కహోడుడు జనకుడను రాజు ఆస్థానమున ఉన్న 'వంది'యను పండితునితో వాదము గావించి ఓడిపోగా, మాటప్రకారము వంది ఆతనిని జలమగ్నుని కావించెను.

ఈ వార్త తెలుసుకొనిన ఉద్దాలకుడు విచారించి కుమార్తెతో యెట్టి పరిస్థితిలోను కుమారునకు ఈ వార్త తెలియనీకుమని చెప్పగా ఆమె అటులనే అంగీకరించెను.

అందువలననే అష్టవక్రునకు తండ్రి వృత్తాంతము తెలియక ఉండెను. అతడు ఉద్దాలకుని తండ్రియని, శ్వేతకేతుడు అన్నయని అనుకొనెడివాడు.

అష్టవక్రుడు పన్నెండు సంవత్సరములవాడైన పిదప ఒకనాడు ఉద్దాలకుని తొడపై కూర్చొని ఉండగా, శ్వేతకేతు కోపముతో "నీవు కూర్చున్నది తండ్రి

తొడపై కాదని మాత్రము తెలుసుకో!" అని పలుకగా, అష్టవక్రుడు తల్లి వద్దకు చని, జరిగిన సంగతి అంతయూ తెలిసికొని, తన తండ్రి మృతికి కారణమైనవానిని నాశనము చేయదలంచెను.

## 133.

మరునాడు అష్టవక్రుడు, శ్వేతకేతునితో జనకుని యజ్ఞమునకు చని ధనమార్జింతుమని ఒప్పించి, తల్లికి, తాతకు తెలియకుండా రహస్యముగా బయలుదేరిరి.

దారిలో జనకుడు వారికి కన్పించెను. రాజు తమను బాలకులుగా తలంచి ముందుగా పయనించుచుండుట చూచి, అష్టవక్రుడు "రాజా! నీకు ధర్మము తెలిసినట్లు లేదు. ప్రయాణావసరమున ముందుగా బ్రాహ్మణులు, తరువాత అంధులు, బధిరులు, స్త్రీలు, భారవాహులు, ఆఖరుగా క్షత్రియులు ఉండవలెనని నీకు తెలియదా?" అని పలుకగా రాజు వారికి దారి ఇచ్చెను.

రాజసభను ప్రవేశింపబోయిన అష్టవక్రుని, శ్వేతకేతును ముందుగా ద్వారపాలకులు, అనంతరము జనకనృపతి వారించిరి. వారి విద్యను గాంచి సంతుష్టి చెంది లోనికి పోనిచ్చిరి.

## 134. వందితో అష్టవక్రుని వాగ్వాదము

తదనంతరము అష్టవక్రునకు, వందికి ఇట్లు శాస్త్ర చర్చ జరిగెను.

వంది ఇట్లనెను, "అగ్ని ఒకడే అయినా యెన్నో రకముల దీప్తి చెందును. ఒకే సూర్యుడు సమస్త లోకమునకు వెలుగునిచ్చును".

అష్టావక్రుడిట్లనెను, "ఇంద్రుడు, అగ్ని ఇద్దరూ స్నేహితులు. నారదుడు, పర్వతుడు ఇద్దరూ దేవర్షులు. అశ్వనీకుమారులు ఇద్దరు."

వంది ఇట్లు వచించెను, "లోకులు స్వకర్మానుసారము త్రివిధములుగా జన్మింతురు. జ్యోతులు మూడు, లోకములు మూడు".

అష్టవక్రుడు, "ఆశ్రమములు నాలుగు, నాలుగు వర్ణములు, దిక్కులు నాలుగు".

వంది, "అగ్ని ఐదు ప్రకారములు, యజ్ఞములు ఐదు విధములు, ఇంద్రియములు ఐదు".

అష్టవక్రుడు "అగ్నిధానమున ఆరు గోవులను దానము చేయుదురు. ఋతువులు ఆరు, కృత్తికలు ఆరు".

వంది, "గ్రామ్య పశువులు సప్తవిధములు. వన్యపశువులు యేడు విధములు. సప్తమహర్షులు లోక విఖ్యాతులు. వీణ సప్తతంత్రి".

అష్టవక్రుడు, "అష్టపాద శరభము సింహమును చంపును. వసువులు యెనమండుగురు. అష్టకోణ విశిష్ట యూపము అన్ని యజ్ఞముల ఉపయోగింతురు".

వంది, "పితృయజ్ఞమున మంత్రములు తొమ్మిది విధములు. త్రిగుణాత్మకమైన ప్రకృతి తొమ్మిది విధముల సృష్టిని సంపన్నము చేయును".

అష్టవక్రుడు, "దిక్కులు పది. స్త్రీలు పదినెలలు గర్భము వహింతురు. పదిమంది కూడిన అది ఉపదేష్టమనబడును."

వంది, "ప్రాణుల ఇంద్రియ విషయములు పదకొండు. స్వర్గమున ఏకాదశ రుద్రులు ప్రసిద్ధులు".

అష్టవక్రుడు, "మాసములు పన్నెండు, జగతీచ్ఛందమున ప్రతి పాదమున పన్నెండు అక్షరములు. ప్రాకృత యజ్ఞములు పన్నెండు రోజులలో సమాప్త మయ్యేడివి. ద్వాదశాదిత్యులు త్రిలోక విఖ్యాతులు".

తదనంతరము వంది త్రయోదశి తిథియని పూర్తి గావించలేకపోయినందున అష్టవక్రుడు జయము పొందినట్లు ప్రకటించబడినది.

ఇంతకు క్రితము బ్రాహ్మణులను వంది చంపించినట్లే, ఆతనిని నీట ముంచి చంపవలెనని అష్టవక్రుడు కోరగా, వంది తాను వరుణదేవుని కుమారుడననియు, వరుణ యజ్ఞమునకై తాను జలముల గుండా బ్రాహ్మణులను పంపితిననియు, యజ్ఞము సమాప్తి చెందుటచే వారు త్వరలోనే తిరిగివత్తురనియు తెలిపెను. అటులనే కహోడుడు, ఇతర బ్రాహ్మణులు జలమునుండి బయటకు వచ్చి అందరకూ ఆనందము చేకూర్చిరి. ధన కనక వస్తు వాహనములతో కహోడుడు, అష్టవక్రుడు, శ్వేతకేతుడు ఆశ్రమమునకు తిరిగి వచ్చిరి. తండ్రి ఆజ్ఞానుసారము అష్టవక్రుడు 'సమంగా' నదియందు స్నానమాడగా అతని దేహ క్రమము తొలగి పోయెను. కావున ఓ ధర్మరాజా! నీవును ఈ నదియందు స్నానము చేసి శుభములను పొందుము" అని లోమసుడు తెలుపగా యుధిష్ఠిరుడు తమ్ములతోను, భార్యతోను సమంగా నదియందు స్నానము చేసి పితృతర్పణమొసంగెను.

# 135. భరద్వాజ ఋషి లోకాంతర వృత్తాంతము

సమంగా నదీ ప్రాంతమున రైభాశ్రమమును పాండవులు దర్శించు నవసరమున, లోమసుడు వారికి భరద్వాజ మహర్షి, ఆతని కుమారుడైన యవక్రీతుని చరిత్ర వారికి తెలిపెను.

లోమసుడిట్లనెను, "మహారాజా! భరద్వాజ మహర్షియు, రైభ్యుడును పరమ స్నేహితులై సద్భావమున మెలగుచుండిరి. రైభ్యునకు అర్వావసువు, పరావసువు అను ఇద్దరు కుమారులు గలరు. భరద్వాజునకు యవక్రీతుడను ఒక్క కుమారుడు కలడు. రైభ్యుడు, అతని కుమారులు అసాధారణ విద్యాబుద్ధి సంపన్నులు. భరద్వాజుడు తాపసి మాత్రమే. రైభ్యుని, అతని కుమారుల యొక్కయు యశస్సు నలుదిక్కుల వ్యాపించెను.

వారి కీర్తి ప్రతిష్ఠలకు విద్యయే కారణమని యవక్రీతి తాను, తన తండ్రీ విద్యాసంపన్నులగుటకై కఠోరమైన తపస్సు చేయదొడగిన, ఇంద్రుడు ఆతని కడకు వచ్చి, విద్యకై తపస్సు చేయుట తగు కార్యము కాదని యెన్నో విధముల నచ్చచెప్ప బూనిననూ యవక్రీతి వినక మరల తపస్సు కావింపదొడగిన, విసిగిన ఇంద్రుడు యవక్రీతుని వచనానుసారము తండ్రీ, కొడుకులు విద్యాగరిష్ఠులగునట్లు వరమిచ్చెను.

ఈ సంతోషవార్త యవక్రీతుడు తండ్రికి తెలియజేయ, భరద్వాజుడు కుమారునితో, "వత్సా! దేవరాజు వలన వరము పొంది నీవు తీరని దుఃఖము పొందుదువని నాకు తోచుచున్నది. నీకు ఒక ఇతిహాసము వినిపించెదను. వినుము. పూర్వము బలాధి యను ఋషి యుండెడివాడు. ఆతడు పుత్రశోకమున ఉద్విగ్నుడై అమరుడగు పుత్రుని కొరకై దుష్కరమైన తపస్సు చేయగా దేవతలు ఆతనితో "నీవు అమరసదృశుడైన కుమారుని కోరుకొనుము. మనుజలోకమున అమరులు యెట్లుందురు? నీకు కలుగు కుమారుని జీవితము యేదో ఒక నిమిత్తాధీనమై యుండును" అనిన, ఆ ముని యెదుటనుండు కొండను చూపి "అవి నశ్వరమైన ఈ భూధరము నా కుమారుని జీవిత నిమిత్తమవుగాక" అని కోరగా దేవతలు 'తథాస్తు' అనిరి.

పిదప బలాధికి మేధావి అను కుమారుడు కలిగెను. తన ఆత్మ వృత్తాంతము తెలుసుకొనిన ఋషిపుత్రుడు, పెద్దలను అవమానించుచూ నిందనీయమైన ప్రవర్తనతో మెలగుచూ ఒకనాడు తేజోసంపన్నుడైన ధనుషాక్షుడను ఋషి

ఆశ్రమమునకు వెడలి అతనికి అపకారము చేయబోయిన ముని కోపించి, భస్మమవమని వపించి, తన శాపము వ్యర్థమగుట గని, దివ్యదృష్టితో ఆతని నిమిత్తమైన మహీధరమును గాంచెను.

రోషపరవశుడైన ముని పెద్ద యెద్దతో మేధావి జీవన నిమిత్తమైన కొండను త్రవ్వించి సమతలము గావించగా, మేధావి మృతిచెందెను. కుమారుని మృతికి రోదించుచున్న బలాధిని గాంచి మునులు "మనుష్యులు దైవనిర్ణయము మార్చజాలరు. అందువలననే నీ కుమారుడు దివంగతుడయ్యెను" అని పలికి ఓదార్చిరి.

కావున కుమారా! తపస్వి తనయుడవైన నీవు వరలాభదర్పితుడవైన వినష్టము చెందెదవు. అటుల కాకుండా ప్రవర్తింపుము" అని పలుకగా, యవక్రీతి మృదువచనములతో తండ్రిని ఓదార్చెను.

## 136. యవక్రీతుని జీవననాశము

లోమసుడిట్లనెను, "ఓ రాజా! నిర్భీకుడైన యవక్రీతుడు ఇచ్ఛానుసారము తిరుగుచూ ఒకనాడు రైభ్యుని పరమ రమణీయమైన ఆశ్రమప్రాంతమును చేరి, అచ్చట రైభ్యుని పుత్రవధువును కాంచి, మోహితుడై బలాత్కారముగా రమించి చనెను.

ఈ సంగతి తెలుసుకొనిన రైభ్యుడు ఒక జటను తీసి అగ్నిలో వ్రేల్చగా, పుత్రవధువు వలె ఒక రమణి ప్రావిర్భవించెను. మరల మరియొక జట తీసి అగ్నిలో వేయగా ఉగ్రనయనుడైన రాక్షసుడు జన్మించెను. వారిని యవక్రీతుని చంపి రండని ముని ఆజ్ఞాపింప వారు త్వరితముగా యవక్రీతుని చేరి, కపటముగా మునిపుత్రుని కమండలము తస్కరించిన పిమ్మట రాక్షసుడు యువక్రీతుని శూల పాణియై వధింప చేరెను. భీతి చెందిన యవక్రీతుడు చెరువులకు, నదులకు, యెచ్చటకు చనినను జలము దొరుకక శుష్కించెను. తుదకాతడు తండ్రి అగ్ని గృహమున శరణు పొంద ప్రయత్నింప, వాకిటనున్న శూద్రుడు, అశుచివని లోనికి పోకుండా అడ్డెను. అదే సమయమున వెంట వచ్చుచున్న రాక్షసుడు యవక్రీతుని వధించి చనెను.

## 137. పుత్రశోకమున భరద్వాజుడు జీవితము త్యజించుట

ఆశ్రమమునకు తిరిగి వచ్చి, శూద్రుని వలన పుత్రుని మృతికి కారణము తెలుసుకొని భరద్వాజుడు మహాదుఃఖముతో రోదించుచూ, కుమారుని మృత

కళేబరము ఒడిలో తీసుకొని "వత్సా! వేదములన్నియు నీలో ప్రతిఫలించునట్లు తపస్సుతో వరముపొందితివి. బ్రాహ్మణులలో ఉత్తముడ వనిపించుకొంటివి. రైభ్యుని ఆశ్రమము వద్దకు పోవద్దని నీతో చెప్పితిని. కాని కాలాంతక సమమైన ఆశ్రమమును చేరితివి. నీవు నాకు ఒక్కడవే కుమారుడవని తెలిసినను, దుర్మార్గుడైన ఆ రైభ్యుడు నిన్ను సంహరించెను. అందుచే నేడు అతిదయనీయమైన పుత్రశోకమున బాధపడుచున్నాను. నిరపరాధినైన ఏ విధముగా పుత్రశోకము ననుభవించుచున్నానో అట్లే రైభ్యుని జ్యేష్ఠపుత్రుడు తప్పు లేకుండగానే అతనిని వధించును. నేను ఈనాడు పుత్రశోకమున దయనీయమైన స్థితిలో ఉంటిని కావుననే దానికి కారణమైనవానినే శపించుచున్నాను' అని పలికి, కుమారుని దహనము చేసి, తాను కూడా ఆ మంటలలోనే పడి దేహత్యాగము చేసెను.

## 138. పరావసువు తండ్రిని చంపుట

లోమసుడిట్లనెను, "మహారాజా! ఆ సమయమున బృహద్యుమ్న మహీపతి రైభ్యాత్మజులైన అర్వావసు, పరావసువులను యజ్ఞము చేయుటకై ఆహ్వానింప వారు అంగీకరించి యజ్ఞము కావించుచుండిరి. ఆశ్రమమున రైభ్యుడు, పరావసువు సహధర్మచారిణి మాత్రమే వసించుచుండిరి.

ఒకనాడు పరావసువు భార్యను చూచుటకై సంధ్యాసమయమున, చీకటి పడుచున్నవేళ ఆశ్రమమునకు వచ్చుచుండెను. దారిలో అరణ్యమధ్యమున శయనించు రైభ్యుని క్రూరమృగమని భావించి సంహరించెను. దగ్గరకు చని తండ్రియని గుర్తించి, విచారించి, అంత్యక్రియలు సలిపి, తమ్మునివద్దకు చని, తాను యజ్ఞము చేయుదుననియు, తన నిమిత్తమై బ్రహ్మహింసన వ్రతము చేయుమనియు తమ్ముని కోరెను. అర్వావసువు అందులకు సమ్మతి తెలిపి, కొద్ది దినములలో ఆ వ్రతము పూర్తిచేసి యజ్ఞస్థలమునకు రాగా పరావసువు రాజుతో తన తమ్ముడు పితృహంతకుడని పరిచారకులచే పరాభవించి పంపించెను.

తదనంతరము అర్వావసువు, మౌనమవలంబించి, వనము ప్రవేశించి, దివాకరుని ఆశ్రయించి, అతికఠోరమైన తపోనుష్ఠానమున, సూర్యమంత్రములతో వేదము రచించెను. సంతుష్టుడైన మరీచిమాలి మునివద్దకువచ్చి, వరము కోరుకొమ్మనగా, ఆతడు తన తండ్రియైన రైభ్యుడు, భరద్వాజుడు, యవక్రీతుడు పునర్జీవితులగునట్లును, తన తండ్రికి తనను వధించినది తన కుమారుడే అని తెలియకుండా ఉండునట్లును, అన్నకు పితృహత్యాపాతకము తగులకుండునట్లును,

తను రచించిన వేదవాక్యములు ప్రతిష్ఠ చెందునట్లును వరమడిగిన, సూర్యుడు 'తథాస్తు' అని ఆశీర్వదించి వరమిచ్చెను.

తదుపరి భరద్వాజాదులు పునర్జీవితులైన, యవక్రీతుడు దేవతలను తాను బహువ్రతానుష్ఠానములను చేసినను యేల రైభ్యునిచే చంపబడితినని ప్రశ్నింప, వారు నీవు నేర్చిన విద్య గురుముఖమున నేర్చుకొనినది కాదు. అందులకే నీవు హతుడవైతివి అని పలికిరి.

కావున ధర్మరాజా! నీవును ఈ ఆశ్రమ స్థలమున కొంతకాలము వసించిన సర్వపాపములును తొలగును.

## 139-144.

పాండవులు హిమాచల పర్వతములలో మందర పర్వతమును, నారాయణుడు వరాహ రూపమున భూమిని మోసిన నందనవనమును సందర్శించి గంధమాదన పర్వత సమీపమునకు వచ్చిరి. అచ్చట పెనుగాలి వీచగా పాండవులు, మునులు, బ్రాహ్మణులు, పెద్ద చెట్లను రెండు చేతులలోను పట్టుకొని తమను తాము రక్షించుకొనిరి.

ఆ గాలి పూర్తిగా తగ్గకుండగనే శిలలలో పెద్ద వర్షము కురిసెను. వర్షము వెలసి, సూర్యుడు బయటకు వచ్చిన పిమ్మట పాండవులు అందరూ కలసుకొని మంచుతో నిండిన మార్గమున ముందుకు ప్రయాణము సాగించిరి.

అతిక్లిష్టమైన ఆ మంచుదారిలో నడువలేక ద్రౌపది మూర్ఛపోగా, కాళ్లు చేతులు మర్దన చేసి వెచ్చటి బట్టలు కప్పి నిప్పుసెగ ప్రక్కనుంచగా కొంతసేపటికి ఆమెకు తెలివి వచ్చెను.

## భీముడు స్మరింప ఘటోత్కచుడు వచ్చుట

అనంతరము ద్రౌపది పరిస్థితి చూచి ధర్మరాజు భీమునితో, "భీమా! దారిలో మంచుతో కప్పబడిన యెన్నో పర్వతములున్నవి. ఆమె వీటిని యెట్లు దాటకలదు?" అని పలికిన భీముడు, "మహారాజా! నేను మిమ్ము, నకుల సహదేవులను, ద్రౌపదిని తీసుకొని పోగలను. అదేకాక హిడింబ వలన నాకు కలిగిన కుమారుడు ఘటోత్కచుడు మహాబలుడు కలడు. మీరు అనుమతించిన ఆతని రప్పింతును," అనిన, ధర్మరాజు అంగీకరించిన, వృకోదరుడు ఆత్మజుని తలచుకొనగానే, ఆతడు అక్కడకు వచ్చి, పాండవులకు, బ్రాహ్మణులకు నమస్కరించి, వారి ఆశీస్సు

లందుకొని భీమునితో, “తండ్రీ! మీరు నన్నేల స్మరించితిరి. ఆజ్ఞ ఇందు. తక్షణమే నెరవేర్చెదను” అని పలుకగా, ప్రీతుడై భీమసేనుడు పుత్రుని ఆలింగనము చేసుకొనెను.

## 145.

అంత ధర్మరాజు, ద్రౌపదిని ఘటోత్కచుడు తీసుకొని వచ్చిన, తాము వెనుక నడుచుకొని వచ్చెదమనగా, ఘటోత్కచుడు, మహాబలులైన తన రాక్షసానుచరులు మిగిలినవారిని మోయుటకు తగినంత మంది ఉన్నారని తెలిపి, ధర్మరాజు అనుమతితో వారిని తీసుకొని వచ్చెను.

ఘటోత్కచుడు ముందుగా ద్రౌపదిని తన భుజముల నిడి ముందు వెడలుచుండ మిగిలిన రాక్షసులు పాండవులతోను, బ్రాహ్మణులతోను ఆకాశ మార్గమున ప్రయాణము చేయసాగిరి. మహర్షి లోమసుడు మాత్రము స్వకీయ ప్రభావము వలన ద్వితీయ భాస్కరుని వలె వారిని అనుసరించెను.

ఇట్లు వారు యెన్నో నదులు, కొండలు దాటి తుదకు అత్యంత రమణీయమైన బదరికాశ్రమమును చేరిరి. అచ్చటనున్న మునులు పాండవులను ఆదరముగా ఆహ్వానించిరి. పాండవులు రమణీయమైన ఆ పరిసరముల చరించుచూ, నరనారాయణుల ఆశ్రమము సందర్శించియూ, దివ్య భాగీరథీ జలముల స్నానమాడియూ సుఖముగా కాలము గడిపిరి.

## 146. ద్రౌపది సమీపమున బంగారు కమలము పడుట

అర్జునుని కలసికొను ఇచ్ఛతో పాండవులు అచ్చట ఆరు రాత్రులు గడిపిరి. ఒకనాడు చక్కగా మెరయుచున్న సహస్రదళ పద్మము ఆకస్మికముగా గాలికి ఈశాన్య దిశనుండి ద్రౌపది ముందు పడెను. రమణీయ పరిమళభరితమైన ఆ సౌగంధిక పుష్పమును చేతగొని ద్రౌపది చెంతనున్న భీమసేనునితో, “నాథా! ఉత్కృష్టమైన ఈ పుష్పమును చూడుము. దీనిని యుధిష్టిరునకు ఇచ్చెదను. నీకు నిజముగా నామీద ప్రేమయున్న ఈ పూవులు పెక్కు తీసుకొని రమ్మని కోరుచున్నాను. వాటిని మనము కామ్యకవనమునకు తీసుకొనిపోయెదము” అని పలికి ధర్మరాజునకు ఆ పుష్పమునివ్వ చనెను.

ప్రియమైన భార్యకు ఆనందము చేకూర్చుటకై భీమసేనుడు విల్లు, అమ్ములు ధరించి త్వరితగతిని ఈశాన్యదిశగా లతాగుల్మములతోను, వివిధ జంతువులతోను

నిండియున్న గంధమాధన పర్వతము అధిరోహించి బహు విధములైన పుష్పముల గంధము ఆఘ్రాణించుచూ, చల్లని పిల్లవాయువులు వీచుచుండ ప్రయాణము చేయసాగెను.

దారిలో భీముడు తనలో తాను, 'అర్జునుడు స్వర్గమును సందర్శింప చనినాడు. నేను అన్నతో చెప్పకుండా ఇటు పుష్పములను తీసుకొని వచ్చుటకై వచ్చినాను. ధర్మరాజు మాకై యెంత విచారించుచున్నాడో! నకుల సహదేవులు అన్న అతనికి మిక్కిలి ప్రేమయే కాని భుజబలముపై నమ్మకము తక్కువ. ఏది యేమైనను త్వరితముగా పుష్పములను సంగ్రహించి మరలి చనుట మేలు' అని తలపోయుచూ, తన మార్గమునకు అడ్డువచ్చు చెట్లను పడదోయుచూ ముందుకు వెడల అతని భీకర గర్జనలకు .........., వానర, సింహ, మహిషాది జంతువులు నలుదిక్కుల పారిపోవసాగెను.

ఇట్లు ముందుకు వెడలు మారుత తనయుడు ఒక కదళీవనమును దాటి, వేలకొలది నీటి పక్షుల గుంపును ఆకసమున చూచి తప్పక ఆ జలపుష్పముల స్థానమటే ఉండునని ఆ దిశ చనసాగెను.

## హనుమంతునితో భీముని సాక్షాత్కారము

కపి కులాగ్రగణ్యుడైన హనుమంతుడు ఆ అరటితోటలో వసించుచుండెను. భీకరమైన వృకోదరుని నాదము విని హనుమంతుడు వచ్చుచున్నది యెవరో తెలుసుకొని, ఆతడు ఇతరుల వలన అవమానము పొందకుండ హెచ్చరించుటకై సంకీర్ణమైన కాలిబాట ప్రక్కనున్న బండరాయిపై తానుండి మార్గమును అవరోధము చేయుచూ తోకనుంచి, రాక్షస కులనాశనియైన ఆ లాంగూలమును నేలపై మోది లోకభీకరమైన శబ్దము చేసెను.

ఆ శబ్దము విని, భీముడు వెరుగుపడి కదళీవనము నాలుగు దిక్కుల తిరిగి, సన్నని కాలిబాటను చూచి లోన ప్రవేశించెను. అచ్చుట తోకతో మార్గమును అడ్డి శిలాప్రదేశమున విశ్రమించియున్న పింగళవర్ణుడు, పీనహ్రస్వగ్రీవుడు, విపులస్కంద ద్వయమువాడు, క్షీణమధ్యముడు, దీర్ఘలోముడు, ఈషదున్నీలితలోచనుడు అయిన కపివరుని గాంచి, సామాన్యమైన ఒక కోతి అని భ్రమించి, వేగముగా అచ్చుటకు వచ్చి, భీషణమైన సింహనాదము చేసెను.

హనుమంతుడు కొద్దిగా కన్నులు తెరచి, భీముని దెస చూచి, సహాస్య వదనమున "నేను రోగపీడితుడను, ఇచ్చట సుఖముగా నిద్రపోవుచున్నాను. నీవు

నన్నేల లేపితివి? చూచిన జ్ఞానము కలవాడివిగా కన్పించుచున్నావు. ప్రాణుల యెడ దయ కలిగి ఉండవలెనని తెలియదా? మనుష్యులు ధీశక్తిసంపన్నులు. వారు జంతువుల యెడ దయ చూపవలెను. నీకు ధర్మము యెడ నమ్మకము లేదా? పండితుల సన్నిధిని చరించలేదా? యెందులకిట్లు మనుష్య సంచార శూన్యమైన అరణ్యమునకు వచ్చితివి? ఈ ఉద్యానవనము దాటిన తరువాత అగమ్యమైన పర్వతములున్నవి. ఇది దేవమార్గము. మనుష్యులు ఈ మార్గమున చరింపజాలరు. నీవు వెనుకకు మరలుటయే మేలు. నీవు నా మాటలు విని ఫల, మూలమును భక్షించి నిజస్థానమున కేగుము. సాహసించి మృత్యువును కోరుకొన వలదు" అని పలికెను.

## 147. భీముడు-హనుమంతుడు ఒకరినొకరు పరిచయము చేసుకొనుట

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! మహావీరుడైన భీముడు, హనుమంతుని మాటలు విని, "నీవు యెవరవు? ఎందులకిట్లు వానర శరీరమున ఉన్నావు? నేను క్షత్రియుడను. కురుకులోత్పన్న సోమవంశీయుడైన పాండురాజు కుమారుడను. కుంతీ గర్భమున వాయుదేవుని ఔరసజాతుడను. నా పేరు భీమసేనుడు. వెంటనే దారి ఇమ్ము" అని పలికెను.

హనుమంతుడు నవ్వుచూ "ఓయీ! నేను వానరుడను. నీవు కోరిన మార్గము నివ్వను. వెంటనే ఇచ్చటినుంచి వెడలిపోకపోయిన మృత్యువును కౌగలించు కొనెదవు" అనిన, భీమసేనుడు "నాకు మృత్యువే రానీ, మరే విపత్తు అయినా రానీ, దానికి నీవు చింతించవలసిన కారణము లేదు. నాకు దారి ఇమ్ము లేదా నా భుజబలము చవిచూచెదవు" అని పలుకగా హనుమంతుడు "నేను అత్యంత వ్యాధిపీడితుడనై ఉన్నాను. మార్గమే కావలసిన నన్ను దాటి పొమ్ము" అనెను.

భీముడంత వానరాగ్రణితో ఇట్లనెను, "నిర్గుణుడైన పరమాత్మ ప్రాణులందరి దేహమున అధిష్టించి యుండును. అందుచే ఆతనిని నేను అవమానించజాలను. అటువంటి భూతభావమే లేనివాడనైన యెప్పుడో నిన్ను, ఈ పర్వతమును, హనుమంతుడు సముద్రమును దాటినట్లు దాటి ఉండెడివాడిని" అనిన

"ఓ నరశ్రేష్ఠా! హనుమంతుడెవరు? ఆతడెందులకు సాగరము లంఘించెను. తెలిసిన నాకు తెలియజేయుము" అని అంజనాసుతుడు పలుకగా, భీముడిట్లనెను. "ఆ వానరరాజు నా అన్న. అతడు పరమగుణవంతుడు, బుద్ధి, బలమూ రెండూ

కలిగినవాడు. రామాయణమున సువిఖ్యాతుడు. అతడు రాముని భార్యను చూచుటకై శతయోజన విశృతమైన సముద్రము ఒక్క గెంతులో దాటెను. నేను బలవిక్రమములలో నా అన్నకు సమానమైనవాడిని. అందువలన వెంటనే లేచి నాకు దారి ఇమ్ము. లేదా నిన్ను వెంటనే యమసదనమునకు పంపెదను."

భీముడు బలోన్మత్తుడు, బాహువీర్యదర్పితుడై ఉన్నాడని తెలుసుకొనిన హనుమంతుడు మనసులోనే నవ్వుకొని, "మహాశయా! ముసలితనము వలన లేచే శక్తి పూర్తిగా పోగొట్టుకున్నాను. దయచేసి నా తోక తొలగించి నీ దారిని పొమ్ము" అని వచించెను.

గర్వోన్నతుడై ఉన్న భీముడు బలహీనమైన ఈ వానరము తోకను పట్టి యమాలయమునకు పంపుదునని తలంచి, యెడమ చేతితో కోతి తోక పట్టు కొనెను. కాని ఎత్తలేకపోయెను. తరువాత రెండు చేతులు ఆన్చి, శక్తిని కూడదీసు కొని ప్రయత్నించెను కాని కదల్పలేకపోయెను. అతని కనుబొమలు ముడిపడినవి. కళ్లు వికృతమైనవి. శరీరమునుండి చెమట కారసాగెను. తోక మాత్రము కదలలేదు. తన అసమర్థతకు సిగ్గుపడి వంచిన తలతో హనుమంతుని పార్శ్వదేశమున నిలబడి, చేతులు జోడించి, వందనము చేసి, భీముడు "ఓ కపిశ్రేష్ఠా! నీవు ప్రసన్నుడవు కమ్ము. అజ్ఞానవశమున నేను నీ యెడ చెడ్డ వాక్యములు పలికితిని. నన్ను క్షమిం చుము. నీవు సిద్ధుడవా? సాధ్యుడవా? దేవతవా? యెవ్వరవు? నీ వృత్తాంతము గోపనీయము కానిదైన నాకు వినిపింపుము. అనుగ్రహము చూపి మీ పరిచయము తెలియజేయుడు" అని దీనముగా వేడికొనెను.

అంత హనుమంతుడిట్లనెను. "భీమా! నన్ను తెలుసుకొనదలంచితివి కావున చెప్పుచున్నాను. వినుము. నేను కేసరి క్షేత్రమున సమీరణుని ఔరసమున జన్మించినవాడను. నా పేరు హనుమంతుడు. వానరాధిపతియైన సుగ్రీవుని స్నేహితుడను. మంత్రిని. దేవాగ్రగణ్యుడైన విష్ణుమూర్తి రాముడై జన్మించెను. అతడు భార్యయైన సీత, తమ్ముడైన లక్ష్మణునితో దండకారణ్యమున నివసించు సమయమున రాక్షసాగ్రగణ్యుడైన రావణుడు, మారీచుని బంగారు లేడి రూపమున పంపి రాముని వంచించి సీతను అపహరించుకొనిపోయెను."

## 146.

ఇట్లు నాటి, సీతాపహరణము, సీతాన్వేషణాది విషయము జ్ఞప్తికి తెచ్చుకొని, కపిరాజు మరల భీమునితో "రాముడు పట్టాభిషేకము చేసుకొనిన పిదప నన్ను

వరము కోరుకొమ్మనగా నేను, "రామచంద్రా! సంసారమున నీ నామము ఉన్నంత కాలము నేను జీవించియుండునట్లు వరమిమ్ము" అని కోరగా ఆతడు నా అభిలషిత వరము ప్రసాదించెను. సీతాదేవి దయవల్ల నాకు కావలసిన ద్రవ్యములన్నియు కోరుకున్నపుడు లభించును. అప్సరాకన్యలు యెల్లవేళలా రామచరిత్ర గానము చేయుచూ నాకు ఆనందము చేకూర్చుచుందురు. కురునందనా! ఈ దారి మనుష్యులకు అగమ్యమైనది. నీవు తెలియక పరాభూతుడవగుదువేమోనని మార్గమును ఆపియుంటిని. నీవు అన్వేషించుచున్న సరోవరము ఇచ్చటకు సమీపముననే ఉన్నది" అని పలికెను.

## 149.

వైశంపాయనుడిట్లనెను, "జనమేజయ మహారాజా! మహావీరుడైన భీముడు ఇట్లు హనుమంతుని సంగతి తెలుసుకొని ఆనందించి, "మహానుభావా! నేను మిమ్ము దర్శించిన నా జన్మ ధన్యమైనది. దయచేసి నాడు సముద్రము దాటు సమయమున ఉన్న మీ రూపు చూపి నన్ను కృతార్థుని చేయ ప్రార్థించుచున్నాను" అనిన, హనుమంతుడు యుగధర్మము ననుసరించి మునుపటి తన రూపము లేదని, భీమునకు యుగముల ధర్మము తెలిపి, భీముడు మరల వేడికొనగా తన శైలసదృశ్యమైన భీకరరూపము చూపెను.

## 150.

హనుమంతుడు యథారూపమునకు మరలిని పిమ్మట భీముడాతనితో, "మహానుభావా! మహాబల సంపన్నుడవైన నీవు ప్రక్కన ఉండగా, రామునకు రావణుని చంపవలసిన అగత్యమేమున్నది. నీవే వానిని సంహరించి, సీతను తేగలవు కదా!" అని ప్రశ్నించిన, హనుమంతుడు, "భీమసేనా! నీవు పలికినది సత్యము. రావణుని నేను అతిసులభముగా సంహరింపగలిగెడివాడను. కాని నేను అట్లు కావించిన రాముని కీర్తికి కళంకము కలిగెడిది. రావణుని, అతని అనుచరులను చంపి రామచంద్రుడు యెనలేని కీర్తిని గాంచెను."

## 151.

"వృకోదరా! నీవు కూడా అన్న ఆజ్ఞానువర్తివి. ధర్మజ్ఞుడవు. ఇదే నీవు వెళ్లవలసిన దారి. భగవానుడైన పవనుడు నీకు యెల్లవేళలా అండయై యుండుగాక! అని భీముని రెండు బాహువులతో చెంత చేర్చుకొని కౌగలించుకొనగా, భీముని శ్రమదమములు తొలగి మిక్కుటముగా బలము అభివృద్ధి చెందెను.

ప్రేమాతిశయమున గొంతు బొంగురుపోవ, కన్నుల ఆనందబాష్పములు వర్షించుచుండ, రామదూత, "తమ్ముడా! నీకు అవసరమైన నన్ను తలచుకొనుము. తప్పక నీకు అండగా నిలతును. నీ మనుజదేహమును స్పృశించి రాఘవకుల తిలకుడైన రామచంద్రుని స్మృతి కలుగుచున్నది. తమ్మునిగా వరము కోరుకొనుము. నీవు కోరుకొనిన నేడే హస్తినానగరమునకు ఆకాశమార్గమున చని మహాశిలా ఘాతమున ధార్తరాష్ట్రులను నశింపజేసి మీకు రాజ్యమిప్పింతును, కాదా దుర్యోధనుని బంధించి నీ కాళ్ల ముందు పడవైతును" అని వాత్సల్యముతో పలుకగా భీమసేనుడు "వానరపుంగవా! నీ దయవలన అనాధలమనుకొన్న మేము సనాధులమైతిమి. నీ ప్రసాదజనిత తేజఃపుంజమున నేను శత్రువులను వధించెదను" అనిన హనుమంతుడు భీమునితో "భ్రాతా! నా అనుజుడవైన నీవు యుద్ధమున సింహనాదము చేసినపుడు నా స్వరమును కూడా నీ నాదముతో కలసి వృద్ధిపరచి శత్రువులను భీతావహులను చేతును. ధనుంజయుని ధ్వజారూఢుడనై మీకు యెల్లవేళలా శుభము చేకూర్తును" అని అంతర్హితుడయ్యెను.

## 152-153.

అనంతరము భీమసేనుడు హనుమంతుడు చూపిన మార్గమున చని మరునాడు ప్రభాతసమయమున మనోహర గిరిశిఖరము నుండి పారు నీటితో యేర్పడిన సరస్సును చూచెను. ఆ సరస్సు నలువంకల వివిధ తరులతా గుల్మములు శోభాయమానమై, వివిధ పక్షిసముదాయముతో కోలాహలముగా నుండెను. భీముడు ఆ సరస్సు నీటిని ద్రావి సౌగంధిక వనము దెస చూచెను. ఆ వనమునకు రక్షకులుగా నున్న రాక్షసులు మునివేషముతోను, వీరుని వలె అస్త్రములతోను ఉన్న భీముని సమీపించి, "నీవెవ్వరవు? ఇచ్చటకు యేల వచ్చితివి?" అని ప్రశ్నించిరి.

## 154. భీముడు సౌగంధిక పుష్పములను కోయుట

భీమసేనుడిట్లనెను, "రాక్షసులారా! నేను పాండునందనుడను. నా పేరు భీమసేనుడు. నా భార్య కోరగా సౌగంధిక పుష్పముల కొరకై వచ్చితిని."

అంత రాక్షసులు, "ఇది యక్షుల క్రీడా స్థలము. నీకు ఈ పుష్పములు కావలసిన కుబేరుని అనుజ్ఞ కోరి రమ్ము" అనగా అతడు "ఓరీ! ఇచ్చట అనుజ్ఞకై మీ కుబేరుడు లేడు. అతడున్నను నేను అతనిని యాచింపను. నేను క్షత్రియుడను.

కావలసినది బలపూర్వముగా గ్రహించుటయే క్షాత్రధర్మము కాని యాచించుట కాదు. అదీకాక ఈ సరోవరము పర్వతము యొక్క సెలయేరునుండి జన్మించినది కాని కుబేరుని భవనములో లేదు. అతనికి దీనిపై యెంత అధికారమున్నదో ఇతరులకు కూడా అంతే అధికారమున్నది" అని వారిని ధిక్కరించి పలికిన, కుబేరానుచరులకు, భీమసేనునకు మధ్య తీవ్రమైన పోరాటము చెలరేగెను. కొంతవడి పోరాడి ఆతని ధాటికి తాళలేక రాక్షసులు పారిపోయిరి.

నిష్కంటకుడైన పవనసుతుడు సరోవరమున దిగి మనోహరమైన సౌగంధిక పుష్పములను కోయసాగెను. కుబేరుడు అనుచరుల వల్ల వార్త తెలుసుకొని, "వీరులారా! భీముడు పాంచాలి కొరకై కమలములను కోయుచున్నాడు. అతనికి మీరు అడ్డుపడకుడు" అని పలికెను.

## 155. ఉపద్రవములు చూచి పాండవులు భీముని అన్వేషించుట

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! ఇక్కడ రాక్షసులకు, భీమునకు ఘోరమైన యుద్ధము జరుగుచుండ అక్కడ బదరికాశ్రమమున సంగ్రామ సూచకమైన ఇసుక వర్షము, తోకచుక్కలు రాలుట, సూర్యుడు ప్రభాశూన్యుడై యుండుట జరిగెను. మృగములు, పక్షులు కర్కశమైన నాదము చేసెను. భూమి కంపించెను.

ధర్మరాజు ఈ అలక్షణములు చూచి తమ్ము పరాభవింప ప్రయత్నము చేయుచున్నారని తలంచి, నలుదిక్కుల చూచి, భీముని కానక పాంచాలిని ప్రశ్నింప ఆమె అతడు పుష్పముల కొరకై వెడలిన సంగతి చెప్పెను.

భీమునకు సహాయులగుటకై ధర్మరాజు ఘటోత్కచుని, అతని అనుచరులను పిలిపించి త్వరితముగా బ్రాహ్మణులతోను, ద్రౌపదితోను ఆకాశమార్గమున సౌగంధికవతీ సరస్సు చేరెను.

అచ్చట వారు ఒక భుజముపైన అనేక పుష్పములతోను, మరియొక భుజమున గదాది ఆయుధములను ధరించియున్న భీమసేనుని గాంచిరి. ధర్మరాజు తమ్ముని ఇటువంటి సాహసము ఇంకెన్నడూ చేయవలదని మందలించెను.

అచ్చటకు తిరిగి వచ్చి నమస్కరించిన రాక్షసానుచరులను యుధిష్ఠిరుడు ఆదరించి, ఓదార్చెను. పాండవులు కుబేరుని అనుమతితో ఆ స్థలమున కొంతకాలము నిలచి యథేచ్ఛగా సంచరించిరి.

## 156.

ఒకనాడు ధర్మరాజు తమ్ముడైన భీమునితో, "తమ్ముడా! లోమస మహర్షి సహాయముతో మనము రమణీయమైన ఋష్యాశ్రమములను, యెన్నో పర్వతములను, సరోవరములను, సాగరము, ఇలా, సరస్వతీ, సింధు, యమున, నర్మదా మొదలైన నదులను, గంగాద్వారము, నారాయణాశ్రమము మొదలైన సర్వతీర్థములను దర్శించితిమి. ఇప్పుడు సిద్ధగణ సేవితమై వైశ్రహదమున వశించుచుంటిమి. ఇక ముందుకు పోవు దారి చూడుము" అని పలుకగా, ఆకాశవాణి "రాజా! ఇక మీరు ముందుకు ప్రయాణము చేయలేరు. వచ్చిన మార్గముననే బదరికాశ్రమమునకు తిరిగి వెడలుడు. అచ్చట వృషపర్వుని ఆశ్రమమును సందర్శించి, ఆష్టిషేణుని ఆశ్రమమునకు వెడలుడు. ధనుంజయుడు మిమ్ము అచ్చట కలియును" అని పలుకగా, ఆ దైవవాణిని వినిన మునులు, బ్రాహ్మణులును ధర్మరాజుతో అట్లే చేయుమనిరి.

ధర్మరాజు వారి వాక్యములను అంగీకరించి తమ్ములతోను, భార్యతోను, మునులతోను, బ్రాహ్మణులతోను బదరికాశ్రమమునకు తిరిగి వచ్చి అచ్చట సుఖముగా కాలము గడుపసాగెను.

తీర్థయాత్రా పర్వాధ్యాయము సమాప్తము

## 157. జటాసురవధ పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! కైలాస పర్వతమున పాండవులు బ్రాహ్మణులతో అర్జునుని కొరకై యెదురుచూచుచూ వసించుచుండిరి. ఘటోత్కచుడు, ఇతర రాక్షసులు పాండవుల వద్ద సెలవు తీసుకొని స్వస్థానములకు మరలిరి.

ఆ సమయమున జటాసురుడను రాక్షసుడు భీముడు లేని సమయమున ధర్మరాజు, నకులుడు, సహదేవుడు, ద్రౌపదులను అపహరించదలంచి, వారు అసహాయులగుటకు ధనస్సు, తుణీరములు మొదలైన ఆయుధములను ముందుగా దొంగిలించుటకు తగిన సమయము అపేక్షించియుండెను. తుదకు తన పని సానుకూల పరచుకొనుటకై తాను శాస్త్రవిశారదుడు, మంత్రకుశలుడైన బ్రాహ్మణుడనని పాండవులతో పరిచయము చేసుకొని, పాండవులను ఉపాసించుచూ వారితో నివసించసాగెను. ధర్మరాజు ఆతడు ఛద్మవేషియని తెలియక ఆదరించి తమ కడ యుంచుకొనెను.

ఒకనాడు భీమసేనుడు వేటకై బయటకు వెడలెను. లోమసాది మహర్షులు స్నానము కొరకు, పూలు కోయుటకు వెడలిరి. ఇదే మంచి అదను అని జటాసురుడు వికటాకారము ధరించి పాండవుల ఆయుధములు, పాండవ త్రయమును, ద్రౌపదిని తన భుజస్కంధముల నిడుకొని పారిపోవసగెను. సహదేవుడు యెటులనో రాక్షసుని బాహువుల నుండి తప్పించుకొని, ఖడ్గసహాయుడై ఆతని అదలించుచూ, భీమసేనుని బిగ్గరగా పిలచుచూ రాక్షసుని వెంట పడెను.

ధర్మరాజు రాక్షసుని క్రూరకార్యము చూచి ఆతనిని ఆశ్రితుడవై మా అన్నము తిని మాకే కీడు తలచుట మహాపాపమని పలు విధముల దూరి, తుదకు దుర్భరమైన భారము ధరించిన రాక్షసుని తగ్గెను.

ఇత్యవసరమున భీముడు గదను దరించి, రెండవ యముని వలె అచ్చటకు వచ్చి మహాకోపముతో, "ఓరీ పాపాత్ముడా! నీవు బ్రాహ్మణ వేషమున మా వద్దకు వచ్చిన నాడే మా అస్త్రములపై నీ దృష్టి చూచి నీ దురుద్దేశ్యమును తెలుసుకొంటిని. కాని అన్న ముఖము చూచియు, ఆశ్రితుడై వచ్చితివనియు మిన్నకుంటిని. నేడు నీ నిజరూపము చూపితివి. గాలము త్రాటి చివరనున్న ముల్లును చేప మ్రింగినట్లు, కృతాంతుని కాలసూత్రమున ఉన్నట్లున్న ద్రౌపదిని నీవు అపహరించ పూనితివి. నీకు ఇక అధిక క్లేశము వీరిని మోసి కలుగకుండా బక హిడింబుల మార్గముననే నిన్ను పంపెదను" అని హుంకరించుచూ పలికిన జటాసురుడు భీతితో ముందుగా ద్రౌపది, ధర్మరాజాదులను నేల దిగవిడిచి, "నీ కొరకే తాపీగా వెడలుచున్నాను. నీవు నేడు మృత్యుసన్నిధికి చేర ఉత్సుకుడవై నన్ను చేరితివి. నీ రక్తము నేడు ధారపోసి, బక, హిడింబుల ఆత్మలకు శాంతి చేకూర్తును" అని పెద్ద గదతో భీమునితో తలపడెను.

తనకు సాయముగా నిలచుటకై వచ్చు నకుల సహదేవులనువారించుచూ భీముడు, "తమ్ములారా! మీరు ఆగుడు. నా ధర్మము, సుకృతి, యజ్ఞము, అన్నదమ్ముల తోడుగా శపథము చేయుచున్నాను. తప్పక అధముడైన ఈ రాక్షసుని నాశనము చేయుదును" అని పలికి రాక్షసునితో తలపడెను.

## భీముడు జటాసురుని వధించుట

అనంతరము మహాబలులైన జటాసురుడు, భీముడు క్రోధముతో పళ్లు పటపట కొరుకుచూ, జలధరముల వలె గర్జించుచూ, సింహనాదములు చేయుచూ పెద్ద పెద్ద చెట్లను వేళ్లతో ఊడబెరకి ఒకరిపైనొకరు విసరసాగిరి. కొంతసేపటికి

అచ్చటనున్న వృక్షములన్నియూ సమూలముగా నాశనము కాగా, పెద్ద బండరాళ్లతో ప్రహారము చేయసాగిరి. అనంతరము మదించిన యేనుగుల వలె మల్లయుద్ధమునకు తలపడిరి. వారి పిడికిలి గ్రుద్దులతో ఆ స్థలము గుభిల్లుమను శబ్దములతో మారుమ్రోయసాగెను. ఆ సమయమున మహావీరుడైన భీమసేనుడు రాక్షసుని నొసట ముష్టితో భీకరమైన ప్రహారము చేయ ఆతడు దాని తీవ్రతకు నేలబడి వెంటనే మరల లేచి భీముని దెస చనెను. ప్రతిద్వంది అలసియున్నట్లు గమనించి, భీముడు ఆతనిని భూమినుండి పైకెత్తి గిరగిర త్రిప్పి తల బ్రద్దలగునట్లు నేల మోదిన, ఆ దానవుడు వికటముగా అరచి ప్రాణములు విడచెను. స్వర్గమున కధిపతియైన ఇంద్రుని వలె భీముడు ప్రకాశించుచుండ బ్రాహ్మణులు ఆతనిని పొగడుచుండ, ధర్మరాజాదుల వద్దకు చనెను.

జటాసుర వధ పర్వాధ్యాయ సమాప్తి

## 158. యక్షయుద్ధ పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను. “రాజా! రాక్షసుని చంపిన అనంతరము ధర్మరాజాదులు బదరికాశ్రమమునకు తిరిగి వచ్చి మరల వసించసాగిరి.

కొన్ని దినముల తరువాత ధర్మరాజు తాము తీర్థయాత్రలు చేయుచూ నాలుగు సంవత్సరములు గడచినవని, ఐదవ సంవత్సరాంతమున అర్జునుడు తిరిగి వచ్చునని తమ్ములకు తెలిపి బదరికాశ్రమము నుండి బయలుదేర అనుమతించిన వారందరూ ప్రయాణము చేయుచూ యెనిమిదవ దినమునకు వృషపర్వుడను రాజర్షి ఆశ్రమమును చేరిరి.

అచ్చట వారు తమ పరిచయము తెలుపగా ఆ మహర్షి కుమారుల వలె వారిని ఆదరించెను. అచ్చట పాండవులు యేడు రాత్రులు నివసించిరి.

అచ్చటనుండి వారు వృషపర్వుని అనుమతి తీసుకొని పయనించి, నాల్గవ దినమునకు మృగ, పక్షి, వృక్ష, లతా, శాఖ, మృగ, పక్షియుక్త, సరోవర, పల్వల సంకీర్ణమైన సుమనోహర మాల్యవాన పర్వతమును చేరిరి.

## పాండవులు గంధమాదన పర్వత శోభ దర్శించుట

అనంతరము గంధమాదన పర్వతము వారి నయనగోచరమయ్యెను. ఈ పర్వతమున విద్యాధరులు, కిన్నరులు, కింపురుషులు, సిద్ధులు, సాధ్యులు చరించి వసించుచుందురు. సింహ, వ్యాఘ్ర, గజ, శరభాది వనమృగములు అచ్చట

చరించుచుండును. పాండునందనులు ద్రౌపదితో ఆ మనోహర హృదయానందకర, నందనవనతుల్య గంధమాదనము క్రమముగా ప్రవేశించిరి. పక్షులు వింత వింత శబ్దములు చేయసాగెను. ఆ స్థలము ఆమ్ర, అమ్రాతక, కర్మరంగ, నారికేళ, తాదూక, ముంజాతక, ఆంజార, దాడిమ, బీజపూరక, పనస, లకూచ, కదళీ, ఖర్జూర, అనమ్ల, వేతస, పారావత, చంపక, నీప, బిల్వ, కపిత్థ, జంబూ, కుంకుమ, బదరీ, ప్లక్ష, వట, అశ్వత్థ, క్షీరిక, భల్లాతక, అమలక, హరీతక, బిభీతక మొదలైన ఫలవృక్షములతోను, చంపక, అశోక, కేతక, వకుళ, పున్నాగ, సప్తపర్ణ, కర్ణికార, పాటల, కూటజ, మందార, ఇందీవర, పారిజాత, కోవిదార, దేవదారు, శాల, తాల, తమాల పిప్పల, హిందూక, శాల్మలీ, కింరుక ఆది పుష్ప వృక్షములతోను, చకోర, భృంగ, శుక, కోకిల, కలమిక, హరీత, ప్రియక, చాతకాది పక్షి సందోహముతోను నిండియుండెను. సరస్సులు కుముద, కల్హార, కమల, పుండరీకాది జలపుష్పములతోను, కాదంబ, కూరర, కారండవ, చక్రవాక, జలకుక్కుట, ప్లవ, హంస, బక, మద్గాది జలపక్షులతోను శోభాయమానమై యుండెను. ఆ ఫలములను తినుచు, పుష్పముల సుగంధము ఆఘ్రాణించుచూ పాండవులు తుదకు ఆష్టిషేణుని ఆశ్రమమును చేరిరి.

## 159. రాజర్షి ఆష్టిషేణుని ఆశ్రమమునకు పాండవులు వెడలుట

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! అనంతరము పాండవులు ఆష్టిషేణుని ఆశ్రమమును చేరి, తమ నామములను తెలిపి నమస్కరించిరి. పాండవ పురోహితుడు ధౌమ్యుడు, ఆ రాజర్షికి యథాయోగ్య సన్మానము గావించెను.

మహర్షి వారిని కూర్చొనమని, సుఖాసీనులైన పిమ్మట కుశల ప్రశ్నలు వేసి, వివిధ ధర్మములు ఉపదేశించి, ధర్మరాజుతో, "రాజా! యే వ్యక్తి తండ్రిని, తల్లిని, అగ్నిని, గురువును, ఆత్మను – ఈ ఐదింటిని పరితుష్టులను చేయునో ఆతడు ఉభయ లోకములందును జయము పొందును. మీరు అర్జునుడు ఇచ్చటకు వచ్చువరకు స్వేచ్ఛగా సంచరింపుచూ నివసింపుడు. త్వరలోనే మీరు శత్రువులను నాశనము చేసి విజయము పొంది, మీ రాజ్యమును సుఖముగా పాలింతురు" అని ఆదరముగా పలికెను.

## 160.

ఇట్లు ఆ మహర్షి ఆశ్రమమున మధురమైన ఫలములను, తాము చంపిన జంతువుల మాంసమును తినుచూ, మధువు త్రావుచూ, ప్రతి దినము లోమస

మహర్షి వలన వివిధ పుణ్యగాలు వినుచూ ఐదవ సంవత్సరమును సుఖముగా గడపిరి.

ఒకనాడు పక్షిరాజైన గరుత్మంతుడు ఒక మహానాగుని కాళ్లతో పట్టుకొని ఆశ్రమ సమీపమున వ్రాలిన, పాండవులు ఆ దృశ్యమును చూచి మిక్కిలి వెరుగుపడిరి. ఆ సమయమున గరుత్మంతుని రెక్కల వేగమునకు యెగిరిన ఒక దివ్యమాల, పంచవర్ణశోభితమైనది ద్రౌపది సమీపమున పతనమయ్యెను.

ద్రౌపది ఆ కుసుమములను చూసి తెమ్మనిన భీమసేనుడు అస్త్రములను ధరించి గిరిశిఖరము నధిరోహించి, వైశ్రవణుని పట్టణము చూచెను. మహా వైభవముతో నున్న ఆ పట్టణము గాంచి, స్వీయ పూర్వ సంపత్తి జ్ఞాపకము రాగా దీర్ఘనిశ్వాసము విడచి, శంఖము పూరించగా, రక్షకులైన యక్షులు, రాక్షసులు వచ్చిరి. వారితో భీమసేనునకు జరిగిన యుద్ధములో వారనేకులు మరణించి మిగిలినవారు పారిపోవుచుండగా మణిమానుడను మహావీరుడు వారిని ఆపి, భీమునితో ఘోరమైన ద్వంద్వ యుద్ధము చేసి తుదకు మరణించెను.

## 161.

ఇచ్చుట ధర్మరాజు తమ్ముని కానక ద్రౌపది వలన సంగతి తెలుసుకొని, నకుల సహదేవులో త్వరితముగా కుబేర నగరమున కేగి, అచ్చుట రాక్షసులను సంహరించి నిల్చియున్న భీముని గాంచిరి. ధర్మరాజు భీముని సాహసమునకు మందలించెను.

ఎవడో మర్త్యుడు వచ్చెనని తెలిసి కుబేరుడు రథారూఢుడై వచ్చి, పాండవులను గాంచెను.

ధర్మరాజు, నకులుడు, సహదేవుడు, కుబేరునకు నమస్కరించిరి.

కుబేరుడు ధర్మరాజుతో భీముని మందలింపకుమని, అతని వలన తన శాపవిమోచనమైనదని పలికెను. ధర్మరాజు అది యెట్లని అడిగిన కుబేరుడు తాము ఆకాశమార్గమున వెడలు సమయమున మణిమానుడు తపస్సు చేసుకొనుచున్న అగస్త్యునిపై ఉమ్ముటచే అతడు కోపించి భీమునిచేత చంపబడి తదుపరి మరల సైన్యసమేతముగా పునర్జీవితుడవగుమని శపించెను. అందువలన ఇట్లు జరిగెనని కుబేరుడు ధర్మరాజుతో పలికెను.

## 162.

కుబేరుడు ధర్మరాజుతో, "యుధిష్ఠిరా! త్వరలోనే మీరు అర్జునుని కలసుకొందురు. మీరు ఆశ్రమమునకు మరలుడు" అని వారికి దివ్య పుష్పముల నిచ్చి పంపిన పాండవులు ఋషి ఆశ్రమమునకు మరలిరి.

## 163-164.

ఒకనాడు సప్తమహర్షులు పాండవుల కడకు వచ్చి, ఆశీర్వదించి, అర్జునుడు త్వరలోనే వచ్చి వారికి ఆనందము చేకూర్చుననియూ, పోయిన రాజ్యము తిరిగి పొంది సుఖముగా రాజ్యము పాలింతురనియు పల్కిరి.

ఇక్కడ ధనుంజయుడు ఇంద్రాలయమున ఐదు సంవత్సరములు గడిపి, ఆగ్నేయ, వారుణ, సౌమ్య, వాయువ్య, వైష్ణవ, ఐంద్ర, పాశుపత, బ్రాహ్మ, పరమేష్ఠ్య, యామ్య, ధాత్ర, సావిత్ర, వైశ్రవాస్త్రములను పొంది, శతక్రతువునకు నమస్కరించి, అతని అనుమతి బడసి, ఆనందముతో గంధమాదన పర్వతమునకు బయలుదేరెను.

యక్షయుద్ధ పర్వాధ్యాయ సమాప్తి

## 165. నివాతకవచ యుద్ధ పర్వాధ్యాయము

### అర్జునుడు గంధమాదనమునకు మరలి అన్నదమ్ములను కలియుట

వైశంపాయనుడిట్లనెను, "రాజా! మహావీరుడైన అర్జునుడు తల కిరీటముతోను, మెడలో పూలహారములతోను, అంగమున అభినవ ఆభరణములతోను సూర్యునివలె ప్రకాశింపుచూ, ఇంద్రరథము నారోహించి, మాతలి రథము తోలుచుండగా గంధమాదనమునకు అన్నదమ్ముల వద్దకు వచ్చెను.

ధౌమ్యునకు, ధర్మరాజునకు, భీమునకు నమస్కారము చేసి, తమ్ములను కౌగలించుకొని ఆశీర్వదించి, అర్జునుడు ద్రౌపదిని చేరి ఆమెతో ప్రీతి సంభాషణలు జరిపెను. మాతలి పాండవులచే సన్మానితుడై స్వర్గమునకు మరలెను. తదనంతరము అర్జునుడు తన యాత్రా విషయములను సంక్షిప్తముగా తెలిపెను.

## 166.

మరునాడు ఉదయము పాండవులు నిత్యనైమిత్తికములు కావించి కూడియుండునెడ ఇంద్రుడచ్చటకు వచ్చి, పాండవుల నమస్కారములందుకొని,

ధర్మరాజుతో, "రాజా! మీకు శుభము కలుగును. హృతరాజ్యము తిరిగి పొందెదరు. మీరు మరల కామ్యకవనమునకు చనుడు" అని పలికి ఆశీర్వదించి సహస్రాక్షుడు దేవగంధర్వులతో అమరావతికి మరలెను.

## 167. ధర్మరాజు అడుగగా అర్జునుడు అస్త్రాదులు లభించిన తెరంగు తెలుపుట

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! పురందరుడు మరలిన పిమ్మట ద్రౌపది, తమ్ములతో కూడియున్న ధర్మరాజు అర్జునునితో, "తమ్ముడా! నీవు ఇంతకాలము యేవిధముగా సురలోకమున కాలము గడిపితివో, అస్త్రశస్త్రములను యెట్లు సంపాదించితివో సంపూర్ణముగా మాకు వినిపించి ఆనందము చేకూర్చుము" అని కోరగా, అర్జునుడు తనకు పినాకపాణి పాశుపతాస్త్రము ఇచ్చిన తెరంగు, ఇంద్రుడు, దేవతలు అస్త్రములను ఇచ్చిన వైఖరి వారికి విశదము తెలిపి,

## 168.

మరల ఇట్లనెను, "కొంతకాలము గడచిన పిమ్మట ఒకనాడు సహస్ర లోచనుడు నన్ను ఆదరముగా పిల్చి, "వత్సా! నీవు శంకరుని వలన, నా వలన, ఇతర దిక్పాలకుల వలన అమోఘమైన అస్త్రములు పొందితివి. ఆ అస్త్రముల ప్రయోగ, సంహార, ఆవృత్తి, ప్రాయశ్చిత్త, ప్రతిఘాతాది పంచవిధులను విధియుక్తముగా నేర్చుకొంటిని. నేడు నిన్ను మనుజులే కాదు సురులు కూడా జయింపజాలరు. నీవు సర్వవిధముల దక్షుడవు, అప్రమత్తుడవు, సత్యవాదివి. జితేంద్రియుడవు, మహావీరుడవు. ఇప్పుడు నీవు గురుదక్షిణ ఇచ్చు సమయము ఆసన్నమైనది" అని పలికిన నేను అతనితో అతడు కోరిన పని నెరవేర్తుననగా ఆతడు, "అర్జునా! నివాతకవచులను రాక్షసులు సాగరగర్భమున వసించుచున్నారు. వారికచ్చట దుర్భేద్యమైన దుర్గమున్నది. వారు నా పరమశత్రువులు. వారు అతి బలవంతులు. ఒకే ప్రకారము నుందురు. వారు మూడు కోట్లమంది గురుదక్షిణగా వారిని చంపి నాకు ఆనందము చేకూర్చుము" అని పలికెను.

## గురుదక్షిణగా నివాతకవచులను చంపుటకై అర్జునుడు బయలుదేరుట

అనంతరము పాకశాసనుడు నా మస్తకమున మణిమయమైన కిరీటము నుంచి, తన అంగమున ఉన్న అలంకారములతో నన్ను అలంకరించి, అభేద్యమైన

కవచమును ధరింపచేసెను. నేను గాండీవమును, ఇతర అస్త్రములను ధరించి, మాతలి రథము తోలుచుండగా, దేవేంద్రుని అపూర్వమైన రథము నారోహించి యుద్ధమునకు బయలుదేరితిని.

మునులు నన్ను ఆశీర్వదించి, దేవదత్తమను శంఖమునిచ్చి మున్ను ఇంద్రుడు శంబర, నమూచి, వృత్తాది రాక్షసులను వధించిన విధముగా నివాత కవచులను నిశ్శేషులను చేసి రమ్మని పలికిరి.

నేను పెద్దల ఆశీర్వాదముల నందుకొని విజయకాంక్షతో బయలుదేరితిని."

## 169. నివాత కవచులతో అర్జునుని యుద్ధము

అర్జునుడిట్లనెను, "మహారాజా! అనంతరము మేము క్రమముగా సాగరము చేరితిమి. అది రత్నములతోను, ముత్యములతోను, తిమి, తిమింగిల, తిమింగిల గిలము, మకరము, కచ్ఛపము మొదలైన జంతువులతోను నిండి, పెద్ద పెద్ద కెరటములు విరిగిపడుచుండ శోభాయమానమైయుండెను.

ఆ సముద్రాన రాక్షసనగరమును గాంచి మాలి అచ్చటకు రథము తోలెను. నేను దేవదత్తమును పూరించి రాక్షసులను సంగరమునకు ఆహ్వానించితిని. అం రాక్షసులు మహాశూల, గద, ముషల, పట్టిస, కరవాల, రచక్ర, శతఘ్ని, పరశు, శర, శరాసనాది ఆయుధములతో వికటహాసము చేయుచూ బయలువెడలిరి."

## 170.

"మహారాజా! అనంతరము నివాత కవచులు నలుదిక్కులనుండి నన్ను ఆక్రమణ చేసిరి. అంత వారితో నాకు భీషణమైన సంగ్రామము జరుగసాగెను. మాతలి అతికుశలుడు కావున, రథమును చిత్రగతుల నడుపుచూ రాక్షసుల అస్త్రములను వ్యర్థం కావించదొడంగెను. నేను ప్రయోగించిన బ్రహ్మాస్త్రముతోను, దేవేంద్రుడిచ్చిన మాధవ యనెడి బాణముతోను పెక్కురు రాక్షసులు దగ్ధులు కాగా మిగిలినవారు మాయాయుద్ధము చేయదొడగిరి."

## 171.

అర్జునుడిట్లనెను, "మహారాజా! అనంతరము రాక్షసులు మాయాప్రభావమున రాళ్ల వర్షము కురిపింప, వజ్రతుల్యమైన బాణములో వాటిని పిండి చేసితిని. వారు జలధారలు కురిపింప ఆగ్నేయాస్త్రముతో ఆపితిని. తుదకు వారు తమ మాయచే అన్నివైపుల చీకటి క్రమ్ముకొనునట్లు చేయగా 'సర్వభూత విమోహిని'

అను అస్త్రమును ప్రయోగించి చీకటిని పారద్రోలితిని. పిదప యెందరో రాక్షసులు నా చేత చంపబడిరి.

## 172.

రాక్షస సంహారమొనర్చి వారి సుందర నగరమును చూచి, నేను మాలిని ప్రశ్నింప ఈ నగరము మొదట దేవతలదనియు, రాక్షసులు బలాత్కారముగా ఆక్రమించిరనియు, బ్రహ్మ వారితో అర్జునుని వలన రాక్షస బాధ తీరునని తెల్పెననియు వివరముగా తెలిపెను.

## 173. కాలకంజాది దానవులు అర్జునునితో యుద్ధము చేయుట

అర్జునుడిట్లనెను, “నరనాథా! తదుపరి మేము దేవపురి, అమరావతీ నగరమునకు తిరిగి వచ్చితిమి. దారిలో ఒక పట్టణమును గాంచి వివరములడిగిన మాతలి, “అర్జునా! ఇది హిరణ్యపురము. పూర్వము పులోమ, కాలక అను రాక్షసులు బ్రహ్మను ప్రార్థించి వారి సంతతివారు రాజ్యము చేయునట్లుగా ఈ పట్టణము నిర్మించిరి. వారు మానవుల వలన మాత్రమే నిహులగుదురు” అని తెలుపగా నేను ఆ నగరముపై దాడిచేసి రాక్షస శూన్యము కావించితిని.

మహారాజా! ఇంద్రుడు, నేను కాలకంజాది రాక్షసులను, నివాత కవచులను నాశనము కావించినందులకు సంతోషించి, నన్ను బహువిధముల ప్రశంసించెను.”

## 174.

అని, అర్జునుడు మరల, “రాజా! నీవు భీష్మ, ద్రోణాదులకు భయపడవలసిన అవసరము యెంత మాత్రము లేదు. వారిని సంహరింపగల పెక్కు అస్త్రములను నేను పొందితిని” అని వచించి, అన్నదమ్ములకు కానుకగా తీసుకొని వచ్చిన దేవదత్త శంఖము, హిరణ్మయమాల, ఆభరణములు, దివ్యవస్త్రములు చూపెను. ధర్మరాజు తమ్ముని యెన్నో విధముల ప్రశంసించెను.

## 175.

మరునాడు అర్జునుడు తాను పొందిన అస్త్రములను చూపి ప్రయోగించి చూప ఉత్సుకుడైన నారదుడు వచ్చి లోకభీకరమైన అస్త్రములను ప్రయోగింప వలదనెను.

నివాత కవచయుద్ధ పర్వాధ్యాయ సమాప్తి

## 176. అజగర పర్వాధ్యాయము

జనమేజయుడిట్లనెను, "తపోధనా! ధనుంజయుడు ఇంద్రసభనుండి తిరిగి వచ్చిన పిమ్మట పాండవులు అతనిని కలసి యెట్లు కాలము గడిపిరి? వారేయే కార్యములు గావించిరి?"

అని ప్రశ్నింపగా, వైశంపాయనుడు అతనికి కుబేరుని మనోహరమైన ఆ ప్రదేశములో అర్జునుడు తిరిగి వచ్చిన పిమ్మట, పాండవులు ఆనందముగా నాల్గు సంవత్సరములు గడిపిన సంగతి తెలిపెను. ఇంతకు క్రితమే పాండవులు ఆరు సంవత్సరములు వనవాసము చేసినందున మొత్తము పది సంవత్సరములు పూర్తి అయ్యెను.

ఒకనాడు పాండవులందరూ విశ్రమించియుండు నెడ భీమ, అర్జున, నకుల, సహదేవులు అన్నయైన ధర్మరాజుతో ప్రీతికూర్చు మాటలు పలికి, తాము జాగ్రత్తగా అజ్ఞాతవాస కాలము పూర్తిచేసి, మరల ధర్మజునకు రాజ్యప్రాప్తి కలుగునటుల చేతుమని పరి పరి విధముల ఉత్సాహ వచనములు పలికిరి.

ధర్మరాజు తమ్ములతో కుబేరపురికి ప్రదక్షిణము గావించి, గంధమాదన పర్వతమునకు నమస్కరించి, తిరుగు ప్రయాణమునకు సన్నాహములు కావింప లోమసాది మహర్షులను అనుమతి వేడెను.

ఘటోత్కచాదులు మరల వారిని మోసుకొని తీసుకొని వచ్చుచుండ, రమణీయ తీర్థములను దర్శించుచూ పాండవులు ప్రయాణము చేయసాగిరి.

## 177. గంధమాదన పర్వతము నుండి పాండవులు బదరికాశ్రమమును చేరుట

వైశంపాయనుడిట్లనెను, "నరనాథా! భరతకులాగ్రగణ్యులైన పాండవులు గంధమాదన పర్వతమును వీడి అనేకములైన నదులు, కొండలు, గుహలు, అడవులు దాటి రాజర్షియైన వృషపర్వుని మనోహరమైన ఆశ్రమమును చేరిరి.

అచ్చట ఒక రాత్రి వసించి, అచటనుండి బదరికాశ్రమమునకు మరలిరి. అత్యంత సుఖకరమైన నరనారాయణులు చరించిన ఆ స్థలమునందు పాండవులు నెల దినములు గడిపి అనంతరము కిరాతరాజైన సుబాహుని రాజ్యమును ప్రవేశించిరి. క్రమముగా చీన, తుషార, దరద ప్రాంతములను అతిక్రమించి

సుబాహు నగరమును చేరిరి. కిరాతరాజు పాండవులను ఆహ్వానించి అతిథి సేవలు చేసి వారి మన్నన పొందెను.

పాండవులు ఘటోత్కచాదులకు వీడ్కోలు తెలిపి, యామూన పర్వత ప్రాంతమున విశాఖయూపమను స్థలమున నివసింపదొడగిరి. అచ్చట వరహా, మృగ, పక్షి కులములను వధించి భక్షించుచూ సంవత్సర కాలము యధేచ్ఛగా గడిపిరి.

అచ్చట ఒకనాడు ఒక పర్వత కందరమున భీముడు ఒక భీషణమైన భుజంగము చుట్టివేయ మిక్కిలి బాధపడుచుండు నెడ ధర్మరాజు అచ్చటకు వచ్చి భీముని బంధవిముక్తుని కావించెను.

పన్నెండవ సంవత్సరము గడపుటకై పాండవులు అచ్చటనుండి సరస్వతీ నదీ తీరప్రదేశమైన ద్వైత వనమును చేరిరి.

## 178. అజగర సర్పము భీముని బంధించుట

జనమేజయుడిట్లనెను, "బ్రాహ్మణోత్తమా! అసంఖ్యాకులైన యక్షులను సంహరించినవాడు, కుబేరుని యుద్ధమునకు ఆహ్వానించినవాడు, వేయి నాగుల బలము కలవాడు అయిన భీమసేనుడెట్లు అజగర సర్పముచే ఆక్రమించబడి భీతుడయ్యెను? ఆ విషయము విన కుతూహలము జన్మించెను. అనుగ్రహించి తెలుపుడు" అని ప్రార్థింప వైశంపాయనుడిట్లనెను.

"మహారాజా! పాండవులు ద్వైతవనమున నివసించు సమయమున ఒకనాడు భీముడు విల్లు, అమ్ములు, ఖడ్గము మొదలైన ఆయుధములు ధరించి, ఆ అరణ్యమందలి మనోహర ప్రదేశములను తిలకించుచూ మృగములను, వరాహములను, యేనుగులను వేటాడుచూ, అడ్డము వచ్చిన చెట్లను కూలద్రోసి సింహనాదము చేయుచూ, నిర్భీకుడై చరించసాగెను.

అట్లు చరించు భీముడు అరణ్యమధ్యమున మహాకాయము గలిగిన భుజంగమును గాంచెను. ఆ సర్పము పర్వతాకారముతోను, గుహవంటి నోటితోను, భీషణమైన కోరలతోను, దీర్ఘముగా గాలి విడచుచూ భయము కల్పించునదై యుండెను.

ఆ సర్పము భీమునిపై పడి అతనిని తన శరీరముతో చుట్టివేయ అతడు బ్రాహ్మణ వర ప్రభావమున యెంత ప్రయత్నించినను సర్పము బారినుండి తప్పించుకొనలేకపోయెను.

## 179. శాపగ్రస్తమైన సర్పము తన పరిచయము తెలుపుట

వైశంపాయనుడిట్లనెను, "అవనీనాథా! భుజంగమును యేమియూ చేయలేక, వశీభూతుడైన భీముడు "భుజగేంద్రా! నీవెవ్వరు? నన్ను ఇట్లెందుకు బంధించితివి. మహాబలుడనైన నన్ను నీవెట్లు వశపరచుకొనగలిగితివి. ఇది నీ విద్యాబలమా? వరప్రభావమా?" అని పలుకగా, ఆ సర్పము, "ఓయి! నేనెంతో ఆకలితో నున్నాను. దేవతలు నేడు నిన్ను నాకు ఆహారముగా ఇచ్చేరు. మహర్షుల శాపముచే నాకీ సర్పరూపము ప్రాప్తించినది. విశదముగా తెలిపెదను వినుము. మీ వంశమందే 'ఆయు' అను రాజు యొక్క కుమారుడనైన నా పేరు నహుషుడు. అగస్త్యముని శాపమున నేను సర్పమునైతిని. దినములో ఆరవ భాగముతో నా చేతబడిన జీవి యేదీ తప్పించుకోలేదు. నీవు బలహీనుని వలె చిక్కితినని కించపడవలసిన అవసరము లేదు. ఇది బ్రాహ్మణ శాపప్రభావము.

నేను మహర్షిని శాపమునుంచి విముక్తి నివ్వమని వేడగా అతడు, "రాజా! నీవు సర్పమువైనను నీ జ్ఞానము నశింపదు. నీవు వేయు ప్రశ్నలకు యెవ్వరు తగిన ప్రత్యుత్తరము ఇవ్వగలరో వారి వలన నీవు శాపముక్తుడవగుదువు" అని పలికెను. నాటినుండి నేను ఈ హేయజీవితము గడపుచూ, ముక్తినపేక్షించి ఇచ్చట ఉన్నాను" అని పలికెను.

సర్పము బారిన పడిన భీముడు తన మృతి వలన తల్లికి, భార్యకు, అన్నదమ్ములకు కలుగు సంతాపమునకై పరిపరి విధముల చింతించెను.

ఇచ్చట ధర్మరాజు దుశ్శకునములను గాంచి, ద్రౌపదిని చేరి, భీమసేనుడేడని ప్రశ్నింపగా ఆమె అతడు చాలాసేపటి క్రితము చనెనని, యెచ్చటకు వెడలెనో తెలియదని పలుకగా, యుధిష్ఠిరుడు ద్రౌపదీ రక్షణార్థము అర్జునుని నియోగించి, నకుల సహదేవులను బ్రాహ్మణుల హస్తముల సమర్పించి, ధౌమ్య పురోహితుడు వెంటరాగా భీముని అన్వేషింప బయలుదేరెను.

వృకోదరుడు కూల్చిన జంతువులను, పడద్రోసిన మహీరుహములను కాంచుతూ తుదకు సర్పముచే చుట్టబడియన్న భీముని గాంచెను.

## 180. ధర్మరాజు సర్పము బారినుండి భీముని రక్షించుట

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! అనంతరము ధర్మరాజు భీముని వలన ఆ భుజంగము శాపవశమునయున్న నహుషునిగా యెరింగి, అతని ఆహారము

నిమిత్తము ఇతరములైన వనజంతువులను నిత్తునని, తన తమ్ముని వీడుమని ప్రార్థింపగా నహుషుడు తన ఆహారమును అట్లు విడువజాలనని తన ప్రశ్నలకు తగిన ప్రత్యుత్తరమిచ్చిన భీముని వదలుదునని పలికిన ధర్మరాజు అందులకు సమ్మతించెను.

సర్పమిట్లనెను, "బ్రాహ్మణుడెవ్వరు? సర్వవేద్యమైనదేది?"

ధర్మరాజు: "సత్యము, దానము, క్షమ, శీలము, తపము యెవ్వరి యందుండునో ఆతడే బ్రాహ్మణుడు. సుఖదుఃఖ వర్జితమైన బ్రహ్మమే సర్వవేద్యము."

## 181.

ఇట్లు సర్ప, యుధిష్ఠిరుల మధ్య చాలాసేపు ధర్మసంవాదము జరిగిన పిమ్మట నహుషుడు భీముని వదలి, శాపము తీరుటచే సర్పరూపము వదిలి, నిజరూపమున సురలోకమునకు చనెను.

అనంతరము ధర్మరాజు భీముని తోడను, ధౌమ్యుని తోడను ఆశ్రమమునకు తిరిగి వచ్చి అందరకూ ఆనందము చేకూర్చెను.

అజగరపర్వాధ్యాయ సమాప్తి

## 182. మార్కండేయ సమస్యా పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! ఇట్లు పాండవులు అచ్చట వసించు చుండగా గ్రీష్మకాలము దాటి వర్షాకాలము సమీపించెను. నల్లని మేఘములు ఆకసమున క్రమ్మి కుండపోతగా వర్షములు కురియదొడగెను. ఆకాశము నుండి సూర్యుడు మాయమయ్యెను. నదులు, సెలయేరులు నీటితో నిండి తీవ్ర నాదములతో ప్రవహించసాగెను.

అనంతరము శరత్కాలము ప్రవేశించెను. అడివి చక్కటి గడ్డితోను, పూలమొక్కలతోను శోభాయమానముగా నుండెను. నదులు, చెరువులు నిర్మలమైన నీటితో పక్షుల కిలకిలారావములతో మనోహరముగా నుండెను. పాండవులు అచట ఆనందముగా సమయము గడిపి, కార్తీక పౌర్ణమినాడు, బ్రాహ్మణులతోను, మహర్షులతోను, ధౌమ్యపురోహితునితోను బయలుదేరి కొలది కాలమునకు కామ్యక వనము చేరిరి.

## 183.

పాండవులు కామ్యక వనమును చేరి అచ్చట సుఖముగా కాలము గడుపుచున్న సమయమున ఒక బ్రాహ్మణశ్రేష్ఠుడు పాండవులతో "మహానుభావులారా! మీ హితాకాంక్షియైన కృష్ణుడు అర్జునుని చూచుటకై త్వరలోనే రానున్నాడు. మహాతపఃపరాయణుడైన మార్కండేయ మహర్షి కూడా మిమ్ము కలియును. ఆతని వలన మీరు యెన్నో పుణ్యగాథలను వినగలరు" అని పలికెను.

బ్రాహ్మణ వాక్యానుసారము కొద్ది కాలమునకే కేశవుడు సత్యభామాసహితుడై సులక్షణ సంపన్నమైన తురంగములు పూన్చిన రథముపై కామ్యకవనమున పాండవులను సమీపించి, రథము దిగి ధర్మరాజునకు, భీమునకు, ధౌమ్యునకు నమస్కరించి, నకులసహదేవుల నమస్కారములందుకొని, అర్జునుని ప్రేమతో కౌగలించుకొనెను. సత్యభామయు ద్రౌపదిని చేరి పదే పదే ఆలింగనము కావించుకొనెను.

పాండవులు కృష్ణునకు యథావిధిగా సత్కారము గావించి, అతడు సుఖాసీనుడైన పిమ్మట ఆతని వద్దనే తాము కూడా కూర్చుండి కుశల ప్రశ్నలు వేసిరి.

ఆ సమయమున కృష్ణుడు ధర్మరాజుతో "రాజా! రాజ్యలాభము కన్నా ధర్మము ఉత్కృష్టమైనది. నీవు అట్టి ధర్మము నవలంబించి ఇహలోకమును, పరలోకమును కడా జయించితివి. నీవు ధర్మానుసారము యాగము, యజ్ఞము కావించితివి. నీవు కామపరతంత్రుడవై యెట్టి చెడ్డ కార్యమునూ చేయలేదు. అర్థలాభమునకై ధర్మమును వీడలేదు. అందువలననే ధరణీతలమున నీవు ధర్మరాజువని ప్రసిద్ధి చెందితివి. నీకు యెన్ని భోగభాగ్యములు కలిగినను మనస్సు దానము, సత్యము, తపము, క్షమ, ధృతుల యందే నిల్పియుండెదవు. మీ ప్రతిజ్ఞా కాలము పూర్తి అయిన పిమ్మట తప్పక నీవు మరల రాజ్యమును పొంది సుఖముగా ప్రజాపాలనము చేయుదువు" అఇ పలికి పాండవులకు అభిమన్యుడు, సుభద్ర, ప్రతివింధ్యాది ఉపపాండవుల యొక్క క్షేమ సమాచారము తెలిపి వారికి ఆనందము చేకూర్చెను. యుధిష్ఠిరుడు వినయముగా కృష్ణునితో, "కేశవా! నీవే మాకు అన్ని విధముల రక్షకుడవు. మేము నీ శరణాపన్నులము. సుఖములలోను, కష్టములలోను కూడా నీవే మా ఉపదేష్టవు. మా ప్రతిజ్ఞానుసారము ఇంచుమించు పన్నెండు సంవత్సరముల అరణ్యవాసము పూర్తియైనది. అజ్ఞాతవాస కాలము కూడా గడిపి

నిన్ను కలుసుకొందుము. కేశవా! మా యెడ నీ ప్రేమానురాగములు చిరకాలముంచుమని ప్రార్థించుచున్నాను" అని పలికెను.

## మార్కండేయ మహర్షి రాక

ఆ సమయమున ధర్మాత్ముడు, రూపగుణ సంపన్నుడు, అజరుడు, అమరుడు, మహాతపశ్శాలియైన మార్కండేయుడు అచ్చటకు వచ్చెను. అతడు బహుసహస్ర వయస్కుడయ్యు యాబది సంవత్సరముల వానివలె కన్పించెడివాడు. మహర్షి అచ్చటకు రాగానే, పాండవులు, కృష్ణుడు, బ్రాహ్మణులు భక్తిపూర్వకముగా అతనిని అర్చించిరి.

సుఖాసీనుడైన మార్కండేయునితో కృష్ణుడు "మునిసత్తమా! దయచేసి మీరు మాకు భూపతి, స్త్రీ, ఋషుల సదాచార వ్యవహారములను సవిస్తరముగా వినిపింపుమని ప్రార్థించుచున్నాను" అని మార్కండేయుని కోరెను.

అట్టి సమయమున నారద మహర్షి కూడా లోకములు సంచరించుచూ అచ్చటకు వచ్చి, వందనాభిధానానంతరము ఉచితాసనము గ్రహించి, కృష్ణాదుల దర్శచింతనకు యెంతయో సంతోషించెను.

అంత మార్కండేయ మహర్షి వారు కోరిన వృత్తాంతము ఉపాఖ్యాన పూర్వకము నిర్ణయించి తెలియజేయుటకు కాలము పట్టును కావున, మధ్యాహ్న సమయము దానికి మంచిదని నిర్ణయించెను.

ముని వాక్యానుసారము భోజనాదులయిన పిమ్మట ఆ మధ్యాహ్నము అందరూ ముని సమీపమున ఆసీనులైన పిమ్మట యుధిష్ఠిరుడు, "మునివరా! మా కష్టములు, ధార్తరాష్ట్రుల సుఖభోగములు గమనించి, శుభాశుభ కర్మ ఫలితమెట్లుండునన్నది తెలుసుకొన ఇచ్ఛ కలిగినది. యెందులకు మనుష్యులకు సుఖదుఃఖములు కలుగును? మనుష్యులు పరలోకమున కర్మఫలము అనుభవించ వలెనా? దేహి దేహమును త్యజించిన పిమ్మట పరలోకముల యెట్లు శుభాశుభ ఫలముల భోగము పొందును? ఇహలోకముల వాటి ఫలితము యెట్లు కనిపించును? మృతుల కర్మకలాపము లెక్కడ నుండును? దయచేసి మాకు తెలియజేయుడు" అని ప్రార్థించెను.

అంత మార్కండేయుడు, "రాజా! నీవు జ్ఞానివి. అయినను ముందుగా మనుష్యులు ఇహపరలోకముల యెట్లు సుఖదుఃఖములను అనుభవించుచున్నారో తెలిపెదను. వినుము.

సత్యవాదులు, బ్రహ్మస్వరూపులు, పుణ్యాత్ములు, సఫలమనోరథులైన మహాత్ములు ఉభయలోకముల యధేచ్ఛ సంచరించి దీర్ఘజీవులై యుందురు.

శంకితచిత్తులు, దుష్కులజాతులు, దురాత్ములు, పాపిష్టులు అయిన వ్యక్తులు అల్పాయువులై తమ తమ కర్మముల ననుసరించి గతులను పొందుదురు.

మనుష్యుడు దేవనిర్మితమైన దేహముతో యెన్నో శుభాశుభ కర్మసంచయము కావించును. ఆయువు పూర్తియైన పిమ్మట కళేబరము వదలి మరియొక యోనిలో జన్మించును. ఆత్మ క్షణము కూడా దేహశూన్యమై యుండదు. దేహాంతర ప్రాప్తి చెందినప్పుడు సకృత కర్మఫలము ఛాయవలె అతనిని అనుసరించును. అదే అతని సుఖదుఃఖములకు కారణమగును. హీనప్రాణులు చర్విత చర్వణమైన ఈ పంకిలము నుండి యెన్నడూ బయటకు రాజాలరు.

తపస్సు చేసినవారు, స్థిరవ్రతులు, సత్యవ్రతులు, గురుశుశ్రూష చేయువారు, సుశీలురు, విశుద్ధ స్వభావులు, దాంతులు, పవిత్ర యోని సంభూతులు, శుభలక్షణ సంపన్నులు, జితేంద్రియులు, కర్మభూమికి వచ్చినను మరల సురలోకములకు మరలుదురు. వారు కర్మఫలమందు ఆపేక్ష లేనివారై యుందురు.

మనుష్యలోకమున పరమశ్రేయములనుకొనునవి కొన్ని ఇహలోకమునను, కొన్ని పరలోకమునను, కొన్ని ఉభయముల ప్రాప్తించును.

ధనధాన్యములతో ఇహలోకమున సుఖముల ననుభవించువారు వానిని పరలోకమున పొందరు. యోగులు, జితేంద్రియులు పరలోకముల సుఖములను అనుభవింతురు. యెవ్వరు ఇహలోకమున సుఖములనుభవించుచూ దారా పరిగ్రహణము చేసి, ధర్మానురక్తులై ప్రవర్తింతురో వారు ఇహపరలోకముల సుఖములను అనుభవింతురు.

మూఢులు విద్యా, తపశ్శూన్యులై అనపత్యులై ఉందురో ఇహపరలోకములు రెండింటియందును సుఖవిహీనులగుదురు.

ధర్మరాజా! మీరు అన్ని గుణములలో మిన్నయైనవారు, సురకార్యము సాధించుటకై భూమిపై అవతరించిరి. స్వకార్యము పూర్తికాగా మీకు సురలోక ప్రాప్తి కలుగును."

## 184. ద్విజాతి మహత్యము

పాండవులు ద్విజాతి మహత్యము తెలుపుమని కోరగా మార్కండేయుడు ఇట్లు చెప్పదొడంగెను. "రాజా! హైహయ కులోద్భవుడైన ఒక రాజు కుమారుడు

వేటకై చని అరణ్యమున చరించుచూ కృష్ణాజినము ధరించియున్న మునిని లేడియను భ్రమతో బాణము వేసి వధించి, తాను చేసిన దుష్కృత్యమునకు వగచుచూ స్వకులరాజన్యుల వద్దకు చని తన కృత్యమును తెలియజేసెను.

హైహయకుల రాజులు అతని మాటలు విని అడవికి చని మృతదేహమును గాంచి ఆతడెవ్వరి తనయుడో తెలుసుకొనుటకై అన్వేషించుచూ కాశ్యపనందనుడైన అరిష్టనేమి ఆశ్రమము వద్దకు వచ్చిరి.

వారిని పూజించి సత్కరించబోయిన మునితో తాము బ్రహ్మహత్య కావించితిమనియు పూజార్హులము కామని పలికిన ముని, "నా తపోబలమును ఇప్పుడే చూపెదను. మీరు యెట్టి బ్రహ్మహత్య కావించితిరో నాకు చూపుడు" అని పలికిన వారు జరిగినది మునికి తెలిపి మృతుడైన ముని దేహము కొరకై అన్వేషించిరి. కాని వారికి కళేబరము యెచ్చటా కన్పింపలేదు.

అప్పుడు అరిష్టనేమి రాజులతో, "నృపతులారా! మీరు నాశనము చేసితిమనుకొన్న వ్యక్తి నా కుమారుడే! అతడిదిగో" అని ముని కుమారుని వారికి చూపి, విస్మయ సాగరమున మునిగిన రాజ్యశ్రేష్ఠులతో, "నృపతులారా! నా కుమారుడు యెట్లు మృత్యువును జయించెనని మీరు ఆశ్చర్యపడవలదు. మృత్యువు మమ్మేమియు చేయజాలదు. యెందులకనిన మేము సత్యమునే పలికెదము. అబద్ధమాడము. స్వధర్మానుష్ఠానము చేయుదుము. సదాచారములనే ఉపదేశము చేయుదుము. అతిథులకు, భృత్యులకు ఆహారమిడిన పిమ్మటనే మేము భుజింతుము. మేము దాంత, శాంత, వదాన్య, క్షమశీలురము" అని పలికి ఆశీర్వదించి రాజులను స్వస్థానమునకు పంపెను.

## 185. అత్రిఋషి చరిత్ర

పూర్వము వేనుడను రాజు అశ్వమేధ యజ్ఞము చేయుచుండగా అతని వద్ద ధనము పొంది కుటుంబమునకు శ్రేయస్సు చేకూర్చుటకై అత్రియను మహర్షి రాజు వద్దకు చని "మహారాజా! నీవు ధీమంతుడవు, ధన్యుడవు. భూమండలమునకు ప్రథముడవు. ధర్మాత్ముడవు" అని పలుకగా గౌతమ మహర్షి అతనిని ధిక్కరించి ప్రథమ పరిపాలకుడు ఇంద్రుడే అని పలుకగా వారి వాగ్వాదమును విని సనత్కుమారుడు, "ప్రజలను పాలించి, రాజ్యమును రక్షించువాడు కావున రాజు ప్రథముడే" అని తీర్పునిచ్చిన వేనుడు సంతసించి అత్రిని గౌరవించి, ధనధాన్యములిచ్చి ఆనందపరిచెను.

## 186 & 187.

గోదాన ఫలమును మార్కండేయుని వలన విన్న పిదప ధర్మరాజు, "మునివరా! వైవశ్వత మనువు చరిత్ర వినిపించి మాకు ఆనందము చేకూర్చుడని" పలికిన ముని ఇట్లు చెప్పదొడంగెను.

"ధర్మరాజా! పూర్వము వివశ్వతుని కుమారుడు అధిక తేజోసంపన్నుడు, రూపసంపద కలిగిన 'మనువు' బదరికాశ్రమమున ఆయుత వర్షములు కఠోరమైన తపస్సు ఆచరించి పితృపితామహులకు మిన్నయైన వాడయ్యెను.

అతడొకనాడు నదిలో స్నానము చేయు సమయమున ఒక చేప, "మునివరా! నన్ను ఇతర మత్స్యములు చంప సమకట్టుచున్నవి. రక్షింపుము" అని ప్రార్థింప దయదలిచి ముని దోసిట ఆ మత్స్యమును గ్రహించి ఒక చిన్న నూతిలో జారవిడచెను. దినదినప్రవర్ధమానమగుచున్న ఆ చేపను ముని తటాకమునను, తదుపరి గంగానదియందును, తుదకు సాగరమున ఉంచి దానికి సహాయపడి ఆనందము చేకూర్చెను.

మత్స్యము మునితో, "ఓ కరుణామయా! నీవు నన్ను అన్ని విధముల రక్షించితివి. నేను కూడా నీకు ప్రత్యుపకారము చేసెదను. కొద్దికాలములోనే స్థావరజంగములను నాశనము చేయు ప్రళయము రానున్నది. నీవు రజ్జు సంయుక్తమైన నౌకను సిద్ధపరచి, సప్తర్షులతోను, భిన్నభిన్న బీజములతో నౌక నధిరోహించి నాకై యెదురుచూడుము. ప్రళయకాలమున నేను వచ్చి మిమ్ము సంరక్షించెదను" అని పలికి సముద్ర మధ్యమునకు చనెను.

ప్రళయము వచ్చుసరికి మహర్షి మనువు మత్స్యము ఆదేశించినట్లు సిద్ధమై యుండ పర్వతాకారముతో నున్న ఆ మత్స్యము మునిని సమీపింప అతడు దాని శృంగమునకు రజ్జువుతో నౌకను చేర్చెను. ఆ మీనము నౌకను సముద్రమున తేల్చుతూ తీసుకొనిపోయెను.

నల్లని మేఘములతో ఆకాశమంతయూ యేకమై పడిన వర్షముతో ప్రపంచమంతయూ జలమగ్నమయ్యెను. సృష్టియంతయు ప్రళయజలమున విలీనము కాగా కేవలము సప్తర్షులు, మనువు, మత్స్యము మాత్రమే పరిదృశ్యమానులైరి. ఇట్లు ఆ మీనము నౌకను లాగుచూ అనేక సంవత్సరములు ఆ జలముల చరించెను.

కొంతకాలము గడిచిన పిమ్మట మీనము ఆదేశించిన ప్రకారము హిమాలయ

శృంగమునకు నౌకను కట్టి మనువు ఉంచినందున ఇప్పటికిని ఆ శిఖరమును 'నౌకాబంధన శృంగమని' పిలిచెదరు.

అనంతరము ఆ మత్స్యము ఋషులతో "మహర్షులారా! నేను బ్రహ్మను. మత్స్యరూపమున మిమ్ము రక్షించితిని. నా ఆశీర్వాదబలమున ఇక వైవశ్వత మనువు దేవాసుర, మనుష్యాదులను, జంతువులను, వృక్షములను సృష్టించును" అని తెలిపి అంతర్ధానమయ్యెను.

వైవశ్వ మనువు సృష్టి కార్యము ఆరంభించెను.

## 188-191.

అనంతరము మార్కండేయ మహర్షి పాండవులకు మనుసృష్టి విధానము, యుగములు, అందు కలియుగమందలి విభీషిక ఆఖరిగా కలి ఆవిర్భావము వర్ణించి తెలిపెను. పిదప ప్రళయకాలమున విష్ణుమూర్తి శిశురూపమున వటపత్రశాయియై యుండుటయు, సత్యయుగము, ఆగమమును తెలిపెను.

## 192. సూర్యవంశీయుడైన పరీక్షిత్తు అను రాజు వృత్తాంతము

మార్కండేయ మహర్షి మరల పాండవాదులకు బ్రాహ్మణ మహత్యము ఉదాహరణ పూర్వకముగా ఇట్లు చెప్పదొడంగెను.

"మహారాజా! పూర్వము అయోధ్యా నగరమును ఇక్ష్వాకు వంశస్థుడైన పరీక్షిత్తుడన్న రాజు పాలించుచుండెను. అతడు ఒకనాడు వేటకు వెడలి కొంతసేపటికి అలసి, దాహముతో అందందు తిరుగుచూ ఒక తటాకమును గాంచి, దప్పిక తీర్చుకొని, ఒక చెట్టు నీడన విశ్రమించెను.

కొంతసేపటికి రాజు కమనీయమైన గానము విని, వెంటనే ఆ దెసకు చని, అపురూప సౌందర్యవతియైన ఒక కన్యారత్నమును గాంచి, మోహించి నను పెండ్లి చేసుకొమ్మని కోర ఆ యువతి "రాజా! నాకు జలాశయాదులు చూపనని ప్రతిజ్ఞ చేసిన నిన్ను వివాహమాడ నాకు అభ్యంతరము లేదు" అనిన రాజు అంగీకరించి, గాంధర్వ విధిని ఆమెను వివాహము చేసుకొని, తన నగరమునకు తిరిగి వచ్చి, జలాశయము లేని పూదోట నిర్మించి అచ్చుట ఆ రమణితో సుఖముగా కాలము గడుపసాగెను.

దుర్భాగ్యవశమున ఒకనాడు రాజు భార్యతో విహరించుచూ తటాకమున చేరి స్నానము చేయుటకై నీట దిగిన ఆ స్త్రీరత్నము కనుపింపక మాయమయ్యెను.

నిహమున చింతాక్రాంతుడైన రాజు అక్కడ ఒక ఖేకమును గాంచి, అదే తన భార్య మాయమగుటకు కారణమని సేవకులచే కనిపించిన కప్పల నన్నింటిని చంపమని ఆజ్ఞాపించెను.

వంశనిర్మూలనకు వెరచి, ఖేకరాజు పరీక్షిత్తుని చేరి ఈ పనినుండి విరమించుకొమ్మని, అతని వద్దనుంచి వెడలిపోయిన స్త్రీరత్నము తన కుమార్తెయేననియు, ఆమె ఇంతకు క్రితము మాయచే యెందరో రాజులను మోసగించినదనియు తెలుపగా రాజు ఆ రమణిని తిరిగి ఇమ్మని కోరగా ఖేకరాజు వంశమును రక్షించుకొనుటకై కుమార్తెను రాజునకు సమర్పించి, ఆమె దుష్కర్మలకు కోపగించినవాడు కనుక, "నీ కుమారులు బ్రాహ్మణుల హిత సాధనము నుండి పరాన్ముఖులగుదురు గాక" అని శపించి తన రాజ్యమునకు చనెను.

పరీక్షిత్తునకు శల, దల, బల అను ముగ్గురు కుమారులు కలిగిరి. కొంతకాలము తరువాత రాజు 'శలుని' రాజుగా చేసి వానప్రస్థాశ్రమమునకు అరణ్యమునకు చనెను.

ఒకనాడు శలుడు వేటకు వెడలి ఒక లేడిపై బాణము వేసి వెంటాడుచుండ అతని రథము నడుపు సారథి వారు ద్వయమున్ననే ఆ లేడిని పట్టగలవనగా రాజు వాటి విశేషము తెలుపుమనెను.

సారథి రాజుతో, "రాజా! 'వామి' అని పిలవబడు ఈ గుఱ్ఱముల జంట వామదేవుడను మునివి. అవి యెంతో వేగముగా పోగలవు" అని తెలుపగా రాజు ముని వద్దకు చని తాను లేడిని వధించి, గుఱ్ఱములను తిరిగి ఇత్తునని తెలిపి ఆ అశ్వములను తన రథమునకు పూన్చి త్వరలోనే ఆ లేడిని సంహరింపగలిగెను.

బ్రాహ్మణ హితుడు కాని రాజు ఆ గుఱ్ఱములను వామదేవునకు తిరిగి ఇవ్వలేదు.

వామదేవుడు శిష్యుడైన ఆత్రేయుని పంపగా రాజు ఆ గుఱ్ఱములు రాజుల వద్ద ఉండవలసినవని పంపివేసెను. తుదకు ముని స్వయముగా వచ్చి అడిగినను రాజు అశ్వములను తిరిగి ఇవ్వనందున వామదేవుడు కోపించి శపింప ఘోరరూపముతో, శూలములు ధరించియున్న రాక్షసులు రాజును సంహరించిరి.

అన్న తరువాత 'దులుడు' సింహాసనమును అధిష్టించెను. ముని మరల అతని వద్దకు వచ్చి తన ఘోటకములను ఇప్పింపుమని కోరగా దులుడు మునిపై

విషోక్తమైన బాణము ప్రయోగించెను. ముని తపప్రభావమున ఆ బాణము దలుని కుమారుడైన శ్యేనజిత్తునకు తగిలి అతడు మృతినొందెను.

రాజు మరల బాణము ప్రయోగింప యెక్కుపెట్టినను వామదేవుని ప్రభావమున విడువలేకపోయెను. పిదప ముని ఆజ్ఞపై రాణిని తాకగా ముక్తుడయ్యెను.

రాణి మునిని పరిపరి విధముల ప్రార్థింపగా ముని వారి కుమారుని పునర్జీవితుని చేసెను. రాజు ముని ప్రభావమునకు ఆశ్చర్యపడి, మునికి నమస్కరించి తనను రక్షింపుమని వేడుకొని, అతని గుఱ్ఱములను, వమీద్వయమును తిరిగి ఇచ్చి సుఖముగా కాలము గడిపెను.

## 193.

అనంతరము మార్కండేయ మహర్షి పాండవాదులకు ఒక దాలభ్యులను మునుల చరిత్ర, ఒక మహర్షి అధిక కాలము జీవించుట యందలి సుఖ దుఃఖములు ఇంద్రునకు వివరించుట తెలిపెను.

## 194-196.

మరల క్షత్రియుల మహత్యము తెలియజేయుచూ ముని అగ్ని, ఇంద్రుడు డేగ, పావురముల రూపముతో శిబియను రాజును పరీక్షించుట, శిబి పావురమును రక్షించుటకై తన శరీరమును త్యాగము చేయుట విశదముగా వినిపించెను.

## 197. సౌభాగ్యశాలురు మహత్య కీర్తనము

వైశంపాయనుడిట్లనెను. "రాజా! మహామునియైన మార్కండేయుడు యుధిష్టిరుడు కోరగా భాగ్యశాలుర మహత్యము ఇట్లు చెప్పదొడంగెను. "విశ్వామిత్రుని తనయులు అష్టక, ప్రతర్దను, వసుమన, శిబులు. ఒక సమయమున అష్టకుడు అశ్వమేధయాగము చేసి తమ్ములతో రథమెక్కి చనుచుండ మార్గమున దేవర్షి నారదుడు అక్కడకు రాగా, మునికి నమస్కరించి, అతనిని కూడా రథారూఢుని చేసిరి.

అనంతరము వారిలో ఒకడు, "మునీశ్వరా! మేము ఈ శరీరమును వదలి స్వర్గవాసులమైన పిదప మాలో యెవరు ముందుగా భూతలమునకు అవతీర్ణులగుదురు" అని ప్రశ్నింపగా ముని, 'అష్టకుడు' అని, యెందులకనగా,

"అతడు అంతకు క్రితమే తాను దానము చేసిన లెక్కలేని గోవులను చూసి తనవిగా ప్రకటించెను" అని బదులు పలికెను. మరల మిగిలిన ముగ్గురు అదే ప్రశ్న వేయగా, "ప్రతర్దనుడు పతనమగును. యెందులకనగా అతడు నాతో రథముపై వెడలు సమయమున అశ్వముల కొరకై వచ్చి అప్పుడే ఇవ్వమన కోర రథమునకు ఉన్న గుఱ్ఱములను దానము చేసి, గర్వముతో 'నా వద్దనున్నవి అన్నీ దానం చేసేనని' పలికి అహంకారం ప్రకటించాడు".

"తరువాత, వసుమనుడు పుడమిపై జన్మిస్తాడు. యెందులకనగా అతడు తన రథమును దుక్కిన నాతో మూడుమార్లు ఇది మీదే అన్నాడు కాని నాకు ఇవ్వలేదు."

శిబి మాత్రము చిరకాలము స్వర్గవాసుడగునని, అతడు యశోలోభమునకు, అర్థలోభమునకు వశుడు కాకుండా గృహమునకు వచ్చిన అతిథికి తన కుమారుని వధించి వండిపెట్టి, బ్రాహ్మణుడు తాను తినక రాజునే తినమనగా దానికి కూడా నిశ్చలచిత్తుడై సిద్ధపడెను. బ్రాహ్మణుడు అతని భక్తికి సంతోషించి, ఇది నిన్ను పరీక్షించుటకు చేసితినని రాజకుమారుని పునర్జీవితుని చేసెను.

## 198. ప్రాచీనుల పరిచయము

ధర్మరాజు మీకన్నా ప్రాచీనులెవ్వరున్నారని ప్రశ్నింపగా, మార్కండేయముని, "ఒకానొక సమయమున ఇంద్రద్యుమ్న మహారాజు క్షీణపుణ్యుడై స్వర్గభ్రష్టుడై, తనను గుర్తించినవారు ఉన్న మరల స్వర్గమును చేరగలుగుదునని నా వద్దకు వచ్చి, ప్రత్యభిజ్ఞానము చేయుమని కోరగా, అతని పరిచయం తెలియదని తెలుపగా రాజు, నాకన్నా ప్రాచీనులు ఇంకెవరైనా ఉన్నారా?" అని వేడెను.

అనంతరము నేను, రాజు హిమాలయములలో ఉన్న ప్రాచీనమైన ప్రావారకర్ణుడను ఉలూకము వద్దకు, అచ్చటనుండి నాడీజంఘుడను బకము వద్దకు తుదకు అందరమూ కలసి అకూపారుడను కచ్ఛపము వద్దకు వెడలితిమి.

ఆ కచ్ఛపము రాజును చూచి, పోల్చుకొని, "ఇతడు ఇంద్రద్యుమ్న మహారాజు. ఇతడు యజ్ఞములను చేయు సమయమున లక్షలాది ధేనువులను దానము చేసెను. వాటి కాలి డెక్కల రాపిడి వల్ల యేర్పడిన హ్రదమిది. అప్పటినుండి నేను ఇచ్చట నివసించుచున్నాను" అని పలికెను.

కచ్ఛపము యొక్క మాటలు పూర్తికాగానే దేవలోకమునుండి దేవరథము

అచ్చటకు రాజర్షిని స్వర్గమునకు కొనిపోవుటకు వచ్చెను. కీర్తిమంతుడైన రాజు ముందుగా మమ్ము మా స్థానములకు చేర్చి అనంతరము స్వర్గమునకు చనెను.

## 199-200. దుంధుమారుని చరిత్ర

మార్కండేయ మహర్షి దానమహత్యము, యమలోకము, అందలి శిక్షావిధులను పాండవులకు తెలిపిన తరువాత ధర్మరాజు మునిని కువలాశ్వునకు దుంధుమారుడను పేరు యెందులకు వచ్చినదో తెలుపుమని కోరగా అతడిట్లు చెప్పదొడంగెను. "యుధిష్ఠిరా! పూర్వము ఉదంకుడనెడి తాపసి, మరుధన్వ అనే ప్రదేశమున ఆశ్రమము నిర్మించుకొని విష్ణుని ఆరాధించుచూ బహుకాలము దీర్ఘమైన తపస్సు ఆచరించెను.

అతని భక్తికి మెచ్చి హృషీకేశుడు, ఉదంకునకు దర్శనమిచ్చి వరము వేడుకొనుమనగా అతడు, "రాజీవలోచనా! నాయందు ప్రీతుడవైన నా మనస్సు యెల్లవేళలా సత్యము, ధర్మముల యెడ నిలచి, ఇంద్రియ నిగ్రహపరుడనై భక్తితో నిన్ను ధ్యానించుచూ నీలో లీనమగునట్లు వరమిమ్ము" అని ప్రార్థింప నారాయణుడు, "ద్విజోత్తమా! నా ప్రసాదమున నీ కోరిక తీరును. నీ వలన లోకమునకు శుభము జరుగును. లోకములను బాధింప ధుంధుడను రాక్షసుడు తపస్సు వలన బలవృద్ధుడైయున్నాడు. ఇక్ష్వాకు వంశస్థుడైన బృహదశ్వుని కుమారుడు కువలాశ్వుడు నా యోగబలము వలన ఆ రాక్షసుని సంహరించి ధుంధుమారుడని ప్రసిద్ధిగాంచును. దీనికి నీ ఉత్సాహము, ప్రేరణా ఆవశ్యకములు" అని పలికి అంతర్హితుడయ్యెను.

## 201.

ఇక్ష్వాకుడను రాజు అయోధ్యానగరమును పాలించెడివాడు. కాకుత్సుడు అతని కుమారుడు. కాకుత్సుని కుమారుడు అనేనుడు, అనేనుని పుత్రుడు పృధుడు, పృధుని కుమారుడు విశ్వగాశ్వుడు. అతని కుమారుడు అద్రి, అద్రి తనయుడు యవనాశ్వుడు. యవనాశ్వుని కుమారుడు శ్రావుడు. అతని పుత్రుడు శ్రావంతకుడు. అతడు శ్రావంతి అను నగరమును నిర్మించెను. శ్రావంతకుని కుమారుడు మహాబలుడైన బృహదశ్వుడు. బృహదశ్వుని కుమారుడు కువలాశ్వుడు. కువలాశ్వునకు ఇరువది యొక్క వేల కుమారులు. వారు విద్వాంసులు, బలవంతులు. తేజోసంపన్నులు. బృహదశ్వుడు కుమారుని రాజ్యాభిషిక్తుని చేసి తాను వానప్రస్థాశ్రమమున తపస్సు చేసుకొనుటకు బయలుదేరెను.

ఆ సమయమున ఉదంక మహర్షి బృహదశ్వుని కడకు వచ్చి తన ఆశ్రమ సమీపమున ఎడారిలో అతిబలుడు. వరదాన ప్రభావుడు అయిన ధుంధుడను రాక్షసుడు యెడారి ఇసుకలో దాగి ధూళితో ఆ పరిసరములను నింపియు, అగ్నిశిఖలను నలుదిక్కుల ప్రసారము చేసియు సాధుజనులకు కీడు చేయుచున్నా డనియు, వానప్రస్థాశ్రమమునకు చనుట ఆపి, ఆ రాక్షసుని సంహరింపుమనియు భగవానుడైన విష్ణు అనుగ్రహము పొందెదవనియు తెలిపెను.

## 202.

బృహదశ్వుడు ఉదంకుని వచనములు విని, "మునివరా! నేను అస్త్రశస్త్రములను పరిత్యజించితిని. కాని మీ కోరిక యెన్నడూ వ్యర్థము కాదు. నా కుమారుడైన కువలాశ్వుడు మహావీరుడు. అతడు తన పుత్రులతో మీ కోర్కె తీర్చును" అని పలుకగా ముని, "తథాస్తు" అనెను. రాజర్షి బృహదాశ్వుడు ముని కోరిక కుమారునితో తెలిపి తాను అరణ్యమునకు చనెను.

అంత మార్కండేయునితో ధర్మరాజు, "మునీశ్వర! ధుంధుడు యెవరి కుమారుడు? అతనికి ఇట్టి శక్తి సామర్థ్యములు యెట్లు కలిగెను?" అని అడుగగా మునీశ్వరుడు ఇట్లు చెప్పదొడగెను.

## మధుకైటభుల వృత్తాంతము

"ధర్మరాజా! ప్రళయకాలమున సర్వలోకేశ్వరుడైన నారాయణుడు శేషభుజంగశాయియై యోగనిద్రయందు ఉండెను. ఆ సమయమున అతని నాభి దేశమునుండి సూర్యసదృశ ప్రభాసంపన్నమైన పద్మము అందుండి వేదచతుష్టయము, మూర్తి చతుష్టయము, ముఖ చతుష్టయముతో బ్రహ్మ ఉద్భవించిరి.

బ్రహ్మ జన్మించిన కొంతకాలమునకు మహాపరాక్రమవంతులైన మధుకైటభులను దానవులు విష్ణు బాహుద్వయము నుండి ఉద్భవించి కమలయోగిని భయపింపసాగిరి. అసుర భయమున బ్రహ్మ యోగనిద్రయందున్న పద్మనాభుని పద్మనాళమును కంపించి హెచ్చరించెను. నారాయణుడు మేల్కొని దానవులను చూచి, "దానవులారా! మీ యందు నాకు ప్రీతి జన్మించినది. వరము కోరుకొనుడు" అనిన, మదోన్మత్తులైన రాక్షసులు "సురోత్తమా! మేముభయులము వరదాతలము. నీవు ఆలోచింపక మావద్ద వరములడిగి పుచ్చుకొనుము" అని సాడంబరముగా పలికిరి.

వారి మాటలు విని సహస్రవదనమున భగవానుడు, "మీరు అసామాన్య వీరసంపన్నులు. మీవంటి పౌరుషము కలవారు మరి లేరు. లోకహితార్థము మిమ్ము వధించుటకై నాకు వరమిండు."

సత్యవాక్య పరిపాలకులైన దానవులు అనావృత ఆకారమున వధింపుమని కోరగా, విష్ణుమూర్తి కొంతసేపు ఆలోచించి వారిని తన అనావృతమైన తొడపై నిడి చక్రముతో వారి శిరచ్ఛేదము చేసెను.

## 203.

మధుకైటభుల కుమారుడు ధుంధుడు. అతడు ఘోరమైన తపస్సు చేసి దేవ, దానవ, యక్ష, సర్ప, గంధర్వ, రాక్షస గణముల వల్ల చావు లేకుండా బ్రహ్మవలన వరము పొందెను.

అనంతరము పితృవధ జనిత క్రోధముతో దేవతలను పెక్కు ఇడుములు పెట్టి ఉదంకుని ఆశ్రమ సమీపమున ఇసుకలో దాగి నాల్గువైపులా ధూళి, అగ్నిశిఖలు వ్యాపించునట్లు చేసి ప్రజలను పీడించసాగెను.

ఆ రాక్షసుని సంహరింప కువలాశ్వుడు కుమారులతో అచ్చటకు వచ్చెను. కువలాశ్వుని కుమరుడు ఆ ప్రదేశము త్రవ్వగా నిద్రించుచున్న తేజోమయుడైన ధుంధుని కాంచి తీక్షణమైన శర, గదా, ముసల, పట్టిస, పరిఘ, ప్రాస, ఖడ్గాది అస్త్రములతో ప్రమారము కావింపదొడంగిరి. దానవుడు వారి అస్త్రముల నన్నింటిని భక్షించి, సకల లోకభయంకరమైన మంటలు నోటినుండి బయల్పరచి క్షణమాత్రములో కువలాశ్వుని కుమారులను భస్మావశేషులను కావించెను.

కువలాశ్వుడు కుమారుల మృతికి వెనుతీయక నారాయణుని వలన వృద్ధిపొందిన బలము కలవాడై దానవునితో తలపడి తన శరీరమునుండి రాశీకృత సలిలము బయల్పరచి రాక్షసుని తేజస్సు నాశనము చేసెను. అనంతరము బ్రహ్మాస్త్రము ప్రయోగించి క్రూరస్వభావుడైన దానవుని వధించెను.

రాజు కావించిన వీరకృత్యమునకు దేవ, యక్ష, గంధర్వాదులు సంతసించి వరములిచ్చి స్వస్థానమునకు చనిరి.

కువలయాశ్వుడు ధృడశ్వ, కపిలాశ్వ, చంద్రాశ్వులనెడి రాక్షసుల బారినుండి తప్పించుకున్న ముగ్గురు కుమారులతో ఉదంక మహర్షి ఆశీర్వాదము పొంది రాజధానికి మరలెను. ధుంధుడను రాక్షసుని చంపెను కావున కువలయాశ్వుడు ధుంధుమారుడని ప్రసిద్ధి పొందెను.

## 204. పతివ్రతా మహత్యము

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! అనంతరము యుధిష్ఠిరుడు మార్కండేయ మహర్షిని తల్లిదండ్రులను, గురువులను పూజించే వ్యక్తుల యొక్కయు, పతిభక్తి కలిగిన స్త్రీల యొక్కయు మహత్యము తెలుపుమని కోరగా, మునీశ్వరుడు ఇట్లు చెప్పదొడంగెను.

## 205.

"ధర్మరాజా! కౌశికుడనెడి తపఃపరాయణుడైన బ్రాహ్మణుడు ఒకనాడు వృక్షమూలమున కూర్చుండి వేదపఠనము చేయుచుండగా, ఒక కొంగ అతనిపై రెట్ట వేసెను. బ్రాహ్మణుడు కోపముతో పైకి పక్షి దిశ చూడగా, అతని దృష్టి తగులగానే కొంగ మృతి చెంది నేలకూలెను. తన కోపమునకు అతడు మిక్కిలి విచారించెను.

అనంతరము బ్రాహ్మణుడు భిక్షాటనము చేయుటకు గ్రామము ప్రవేశించి, ఒక గృహస్థుని ఇంటికి వెడలి భిక్ష వేడగా, గృహిణి క్షణకాలమాగుడని భిక్ష తెచ్చుటకు ఇంటిలోనికి వెళ్లెను. ఆ సమయమున ఆకలితో నున్న ఆమె భర్త గృహమునకు మరలగా పతి సేవయందు నిమగ్నురాలైన గృహిణి బ్రాహ్మణుని సంగతి మరచిపోయెను.

భర్త నిద్రించిన పిమ్మట వాకిటనున్న బ్రాహ్మణుని మాట జ్ఞాపకమునకు వచ్చి త్వరితముగా భిక్షను పాత్రయందుంచి బ్రాహ్మణుని వద్దకు వచ్చెను.

కౌశికుడు బ్రాహ్మణులను లక్ష్యపెట్టక అవమానించితివని కోపముతో ఆమె దెస చూచెను.

ఆమె భయపడక, "తపోధనా! కోపము పరిత్యజింపుడు. నీ క్రోధదృష్టి నన్నేమీ చేయలేదు. నేను కొంగననుకోకు. పతి సేవయందు నిమగ్నురాలనగుటచే మీ సంగతి మరచిపోయితిని. క్షమింపుడు. స్త్రీకి పతిభక్తి కన్నా మించినది లేదు. ఆ ప్రభావము వలననే మీ సంగతి నాకు తెలిసినది. నా మాటలు తప్పుగా భావింపకుడు. ధర్మము చాలా సూక్ష్మమైనది. మీరు స్వాధ్యాయనిరతులు, శుచిసంపన్నులు, ధర్మజ్ఞులు. కాని యథార్థ ధర్మము మీకు అవగతము కాలేదు. మిథిలా నగరమున ధర్మవ్యాధుడను వ్యాధుడు కలడు. అతని వద్దకు చనిన ధర్మ విషయమైన సంగతులన్నియు అతడు మీకు తెలుపును" అని పలికి బ్రాహ్మణుని పంపించెను.

## 206-215.

ఆ కౌశికుడు ధర్మార్థ జ్ఞానసముపార్జనకు క్రమముగా నదులు, అడవులు దాటుచూ మిథిలా నగరమున ధర్మవ్యాధుని సమీపించెను.

అతనిని చూడగానే ధర్మవ్యాధుడు ఆసనము వదిలి మునితో ఆదరముగా, "ద్విజోత్తమా! కుశలమే కదా! పతివ్రతా శిరోమణి పంపగా మీరు ఇచ్చటకు వచ్చితిరి. మీకు ఈ స్థలము కొత్త. మీరు అంగీకరించి నా గృహమున పదార్పణము చేయుడు" అని పలికి బ్రాహ్మణుడు అతని సేవలను పొంద సమ్మతించిన పిమ్మట తన రమణీయ గృహమునకు తోడ్కొని చని, ఆసన, పాద్యాలతో కొలిచి సుఖావశిష్టుని చేసెను. అనంతరము కౌశికుడు ధర్మవ్యాధునితో "ఓయీ! నీవంటివానికి మాంసము అమ్ముకునే పని అయోగ్యమైనది. నీ పరిస్థితి చూసి నాకు విచారము కలుగుచున్నది" అని పలుకగా ధర్మవ్యాధుడు, "ద్విజోత్తమా! ధర్మానుసారము నేను కులవృత్తి చేయుచున్నాను. అందులకు మీరు అన్యధా భావించవలదు. నేను నిత్యము మంచిపనులనే చేయుచుందును. వృద్ధులను, గురువులను పూజింతును, సత్యమునే యెల్లప్పుడు పలుకుదును. యెవ్వరి యెడల అసూయ పడను. యథాసాధ్యము దానము చేయుదును. దేవతలకు, అతిథులకు, భృత్యులకు భోజనమిడిన పిమ్మటనే నేను భుజింతును. యెవ్వరిని దూషించను.

ద్విజోత్తమా! పూర్వజన్మమున మనము చేసిన కర్మల ననుసరించియే మనకు ఈ జన్మము లభించును" అని కర్మసిద్ధాంతము బోధించెను. పిదప కౌశికుడు అతనిని ప్రశ్నించి యెన్నో ధర్మవిషయములను తెలుసుకొనెను.

ధర్మవ్యాధుడు తన తల్లిదండ్రులను బ్రాహ్మణునకు చూపి, వారిపై తన భక్తిశ్రద్ధలను, మాతాపితృ పూజవలన కలిగెడి దివ్యఫలము తెలియజేసెను. తుదకు క్రిందటి జన్మలో తాను బ్రాహ్మణుడనేనని, కాని రాజుల స్నేహము చేసి వేటలో తెలియక మునిపై బాణమువేసి అతని శాపమున ఇట్లు జన్మించితిననియు, కాని పూర్వజన్మ స్మృతి ఉన్నదనియు, మాతృ, పితృ భక్తితో తాను స్వర్గమును చేరుదుననియు తెలిపెను.

కౌశికుడు ధర్మవ్యాధుని వద్ద సెలవు తీసుకొని స్వస్థానమునకు మరలెను.

## 216-221.

అగ్ని తేజోహీనుడగుట వలన అంగిరసుడు, అతని సంతతి, అగ్ని సంతతిగా ప్రసిద్ధిచెందుతారు.

## 222. కార్తికేయుని జన్మవృత్తాంతము

మార్కండేయ మహర్షి ఇట్లు చెప్పదొడంగెను, "కురువంశోత్తమా! అగ్నినందనుడు, అమిత తేజఃసంపన్నుడు అయిన కార్తికేయుని చరిత్ర తెలిపెదను. సావధానుడవై వినుము.

పూర్వకాలమున దేవతలు, అసురులు తరుచు యుద్ధము చేయుచుండిరి. దేవసైన్యములు క్రమముగా క్షీణించుట గమనించి ఇంద్రుడు తగిన సేనా నాయకుడుండిన బాగుండునని తలంచి, మౌనమవలంబించి ఒకనాడు మానస శైలమున సంచరింపుచుండ "రక్షింపుడు" అని చేయు స్త్రీ ఆర్తనాదము విని, త్వరితముగా చని, కేశియను దానవుడు ఒక స్త్రీని బలవంతముగా తీసుకొనిపోవుట చూచి వానితో తలపడెను. ఇంద్రుని పరాక్రమమునకు తాళలేక రాక్షసుడు పారిపోగా,

## 223

దేవరాజు ఆమెతో "నీవెవ్వరవు? ఇచ్చుటకు యేల వచ్చితివి?" అని ప్రశ్నింపగా ఆ లలన, "నేను ప్రజాపతి కన్యను. నా పేరు దేవసేన. నేను నా అక్క అయిన దైత్యసేన ఇచ్చుటకు విహరింపవచ్చెడివారము. దైత్యసేన కేశి యను రాక్షసుని యందు అనురక్తురాలైనది. అందువలన అతడు ఆమెను తన గృహమునకు తీసుకొనిపోవుటయే కాక అతనియందు ఇష్టంలేని నా యందు కూడా మోహపరవశుడై బలాత్కారముగా కొనిపోవదలంచిన సమయమున మీరు నన్ను రక్షించితిరి. నాకు బలవీర్యసంపన్నుడు, సురాసుర నమస్కృతుడైన వ్యక్తిని వివాహమాడ తలంపు కలదు. కావున నాకు దేవ, దానవ, యక్ష, కిన్నర, రాక్షస, దైత్యాదులను ఓడింపగల వీరుని చూసి పుణ్యము కట్టుకొనుడు" అని వేడగా ఇంద్రుడు ఆమె తేజస్సును చూచి, ఆమె పతి యెవ్వరగుదురో తెలుపుమని బ్రహ్మను వేడగా అతడు "ఇంద్రా! నీ సైన్యమునకు సేనా నాయకత్వము వహించు వీరుడు జన్మించుచున్నాడు. అతడే ఈ నారీరత్నము యొక్క భర్తయగును" అని తెలిపెను.

ఒకానొక సమయమున సప్తమహర్షులు యజ్ఞము చేయుచూ అగ్నిని ఆహ్వానించి దేవతలకు హవిర్భాగములను సమర్పించిరి.

ఆ సమయమున హుతాసనుడు యేడుగురు ఋషిపత్నులను చూచి కందర్పుని పాలబడియెను. అగ్నిశాల యందు ప్రవేశించి, ఆ ప్రదేశమును విడువక

వారిని చూచుచూ సమయము గడపి, తుదకు విరహబాధకు ఓర్వలేక వనము ప్రవేశించి అందందు తిరుగసాగెను.

## 224.

దక్షుని కుమార్తె స్వాహాదేవి అంతకు క్రితమే అగ్నియందు మనస్సు నిలిపి యున్నది కావున, అగ్ని పరిస్థితిని చూచి, ప్రతిదినము ఒక్కొక్క ఋషిపత్ని రూపమున అగ్నిని కూడి రేతస్సును 'కాంచకుండము' అను హ్రదమున నిక్షేపము చేయసాగెను. యేడవ దినము ఆమె మహాపతివ్రతయైన అరుంధతి రూపమును మాత్రము తాల్చలేకపోయెను.

ఆ రేతస్సునుండి ఆరు మస్తకములతోను, పన్నెండు కళ్లతోను, పన్నెండు చేతులతోను ఒక కుమారుడు జన్మించెను. తేజోమయమైన స్కన్న (స్ఖలితమైన) రేతస్సు నుండి జన్మించెను కావున ఆతడు స్కంధుడని పేరుగాంచెను.

## 225.

మహాబలవంతుడైన స్కంధునకు కార్తికేయుడను నామము కలదు. అతని జన్మకు తమ భార్యలే కారణమని ఋషులు ఆగ్రహించి తమ భార్యలను పరిత్యజించిరి. అది తెలుసుకొని స్వాహాదేవి మహర్షులను చేరి జరిగినదంతయూ తెలిపెను. విశ్వామిత్రుడు యజ్ఞకార్యములు నిర్వర్తించినందున అంతయూ తెలుసుకొని ఋషులతో వారి భార్యల తప్పు లేదని తెలిపి, కార్తికేయుని జాతకర్మాది విధులు గావించెను.

## 226.

తన దేవరాజ్యము లాగుకుంటాడేమోనని ఇంద్రుడు దేవసైన్యముతో స్కంధునితో తలపడి, ఓడిపోతాడు.

## 227-228.

అసమాన తేజోపరాక్రమవంతుడవు కావున నీవే ఇంద్రత్వము వహింపుమని కార్తికేయుని ఇంద్రుడు కోరగా అతడు ఇంద్రపదవి తిరస్కరించెను. ఇంద్రుని అనురోధమున దేవతలకు శుభము చేకూర్చుటకు, దానవులను నాశనము చేయుటకు దేవతల సేనాధిపతిగా ఉండుటకు అంగీకరించెను.

అపుడు ఇంద్రుడు మొదలైన దేవతలు స్కంధుని సేనాధిపతిగా అభిషిక్తుని

చేసిరి. మహర్షులు మంగళవాక్యములు పలికిరి. కార్తికేయుని మస్తకమున కాంచనమయమైన ఛత్రము పట్టిరి. త్రిపురారిదేవి మొదలైనవారు వచ్చి అతని మెడలో విశ్వకర్మ నిర్మించిన బంగారు పతకము వైచిరి.

బ్రాహ్మణులు అగ్నిని రుద్రుడని పిలుతురు. రుద్రరూపుడైన అనలుని ఉత్కృష్ట శుక్రమున శ్వేతపర్వతమున స్కంధుడు జన్మించెను. అందువలన అతడు రుద్రపుత్రునిగా ప్రసిద్ధి చెందాడు. ఇట్లు అతడు రుద్రరూప వహ్నిచే ఋషిపత్నుల రూపము ధరించిన స్వాహాదేవి వలన జననమొందాడు.

అనంతరము షడాననుడు దేవ నిర్దేశానుసారము దేవసేనను వివాహము చేసికొనెను.

## 229-230.

కుమారుని ఉన్నతికి ఆనందించి స్వాహాదేవి స్కంధుని వద్దకు చని, "కుమారా! నేను దక్షప్రజాపతి కుమార్తెను. నా పేరు స్వాహ. చిన్నతనమునుండియు హుతాసనుని యందు మనస్సు నిలిపియుండెడిదానను. కావున నేను తుదకు ఋషిపత్నుల రూపమున అతనిని చేరుటచే నీవు జన్మించితివి. నీ వలన మా యొక్క కలయిక జరుగునట్లు చూడుము" అనిన షణ్ముఖుడు, "నేటి నుండి బ్రాహ్మణులు చేయు అగ్ని కార్యములన్నియూ 'స్వాహ' అని నీ పేరు చెప్పియే అగ్నికి సమర్పింతురు" అని ఆమెకు ఆనందము చేకూర్చెను.

అనంతరము భగవానుడు ప్రజాపతి స్కంధునితో, "త్రైలోక్య విజేతా! నీవు త్రిపురనిసూదనుడైన మహాదేవుని వద్దకు చనుము. మహాదేవుడు అగ్నియందు, ఉమ స్వాహాదేవియందు సమావిష్టులై లోకహితార్థము నిన్ను ఉత్పత్తి కావించిరి. నీవు అజేయుడవు" అనిన స్కంధుడు అటులనే మహాదేవుని వద్దకు చని పూజలొనరించెను.

## 231.

శివుని ఆజ్ఞ ప్రకారము లోహితాంబరుడు, రక్తమాల్యాభిభూషితుడు, సువర్ణ చర్మధారి అయిన స్కంధుడు కనకసంకాశ రథారూడుడై, భూతనాధుడైన శంకరుని తోను, దేవి పార్వతితోను, దేవసైన్యముతోను కూడా దైత్యులతో యుద్ధమునకు తలపడి మహిషాసురాది అనేక దానవ శ్రేష్ఠులను సంహరించి దేవతలకు ఆనందము చేకూర్చెను.

మార్కండేయ సమస్యాపర్వాధ్యాయము సమాప్తము.

# 232. ద్రౌపదీ సత్యభామా సంవాద పర్వాధ్యాయము

వైశంపాయనుడు ఇట్లు చెప్పదొడంగెను, "మహారాజా! కృష్ణునితో అరణ్యమున పాండవులను చూడవచ్చిన సత్యభామ, ద్రౌపదితో యేకాంత ప్రదేశమున ఇష్టాగోష్ఠి చేయుచూ, "ద్రౌపదీ! లోకపాల సదృశులైన నీ ఐదుగురు భర్తలు నీవనిన యెన్నడూ కోపగించరు. నీ ఆజ్ఞానువర్తులై ఉందురు. నిన్ను తప్ప ఇతర స్త్రీలను తలంచరు. దీనికి కారణమేమి? జపతపాదుల వలననా? ఓషధుల వలననా? నీవు వారిని యెట్లు వశీభూతులను కావించుకొంటివి? ఆ ఉపాయము నాకు తెలిపిన నేను కూడా కృష్ణుని నా ఆజ్ఞానువర్తిని కావింతును" అని పలుకగా పతివ్రతయైన ద్రౌపది ఇట్లు చెప్పదొడంగెను.

"సత్యభామా! నీవు నన్ను చెడ్డ ప్రవర్తనగల స్త్రీలను ప్రశ్నించినట్లు ప్రశ్నించితివి. నీకు నేనేమని జవాబు ఇవ్వగలను? నీవు బుద్ధిమతివి. ముఖ్యముగా కృష్ణమహిషివి. ఇటువంటి సంశయము నీకు యెట్లు కలిగినది? మంత్రముల వలనను, తంత్రముల వలనను భర్తను యెవ్వరూ వశపరచుకొనలేరు.

పాండవులు నాయందు ప్రేమానురాగములతో యెందులకుందురనగా, నేను యెల్ల సమయములందు కామ, క్రోధ, అహంకారములను పరిత్యజించి వారికి పరిచర్యలు చేయుచుందును. చెడ్డమాటలను యెన్నడూ పలుకను. చెడ్డపనులు చేయుటకై ప్రోత్సహింపను. వారి ఇంగితము పోల్చుకొని వారి పనులు సమకూర్చుదును. ఇతర పురుషుల దెస యెన్నడు దృష్టి నిలపను. భర్తలు స్నాపానాదు లాచరించునపుడు యెన్నడూ భంజింపను. వారు రాగానే ఆసనాదులు సమకూర్చి ఆనందపరచెదను. రోజూ గృహమును శుభ్రముగా నుంచి, చక్కగా వంట చేసి భర్తల ఆరోగ్యము బాగుగా ఉండునట్లు ప్రవర్తింతును. దుష్టులైన స్త్రీలతో యెన్నడూ స్నేహము చేయను. భర్తల నిర్దేశానుసారమే అలంకరించుకొందును. అత్తగారైన కుంతి సేవాశుశ్రూషలు యెంతో భక్తి సహకారమున చేయుదును. పూర్వము యుధిష్ఠిరుని వద్దకు వచ్చే యెనిమిదివేల మంది బ్రాహ్మణుల అన్నపానాదులు, సత్కారాదుల యొక్క పర్యవేక్షణ చేసెడిదానను. దాసదాసీజనుల కార్యములు సరిగ్గా ఉన్నవో లేదో అవలోకనము చేసెడిదానను. ధర్మరాజు యొక్క ఆయవ్యయము లన్నియు నా చేతుల మీదుగానే జరిగెడివి. ఇట్టి కార్యములన్నియు చేయుచుందును. కనుకనే పతులందరూ నా యందు ప్రేమగా యుందురు" అనిన సత్యభామ తనను క్షమింపుమనియు, పరిహాసమునకు కూడా కోపగించుకొనవలదనియు పలికెను.

## 233-234

అనంతరము శ్రీకృష్ణుడు, సత్యభామ, మార్కండేయ మహర్షి పాండవులతో ఆదర వచనములు పలికి, త్వరలోనే వారి కష్టములు తీరు సమయము రానున్నదని పలికి స్వస్థానములకు చనిరి.

## 235. ఘోషయాత్రా పర్వాధ్యాయము

పాండవులతో వివిధ స్థలముల సంచరించిన బ్రాహ్మణుడొకడు హస్తినా నగరమున ధృతరాష్ట్రుని సన్నిధానమునకు చని, ఉచిత సత్కారము పొంది, అతనితో వనవాసము చేయుచూ పాండవులు పడుచున్న కష్టములను చెప్పెను.

అనాథుల వలె అరణ్యముల సంచరించుచూ, హంసతూలికా తల్పగతులగు వారు నేలపై పడుకొని, కాషాయాంబరములు ధరించి, క్రూరమృగముల మధ్య చరించుచున్న పాండవుల యొక్కయు, ద్రౌపది యొక్కయూ దీనదశకు ధృతరాష్ట్రుడు కొంతవడి దుఃఖించి, మరల వేయి యేనుగుల బలము కలవాడైన భీముని, దేవలోకమునకు చని అనేక అస్త్రశస్త్రములను పొంది అజేయుడైన ధనుర్ధరునిగా పరిణతి చెందిన అర్జునుని యొక్కయు సంగతి తలంచుకొని వారు తమ దీనస్థితికి కారకులైన కౌరవుల యెడల యెట్లు క్రోధాన్వితులగుచున్నారో అని భయపడతాడు.

## 236.

ధృతరాష్ట్రుని వచనములు విన్న శకుని దుర్యోధనుని, కర్ణుని రహస్యాలోచనకు పిలచి, దుర్యోధనునితో, "కురుశ్రేష్ఠా! నీవు స్వీయబుద్ధిబలమున పాండవుల రాజ్యలక్ష్మిని నీదిగా చేసుకొంటివి. బ్రాహ్మణులు కీర్తించుచుండ, వేలాది హితులు, బంధువులు, బాంధవులతో కూడి కనుసన్నలలో మెలగు భృత్యులతో మహా వైభవముగా జీవితము గడుపుచున్నావు. నాడు రాజసూయ యాగము చేసి పాండవులు తమ వైభవము ప్రకటించినటులనే నేడు నీ ఉన్నతస్థితి వారికి చూపు సమయము ఆసన్నమైనది.

రాజా! నేడు వారు రాజ్యము కోల్పోయి, బికారులవలె తిరుగుచున్నారు. వారి దుఃఖదశ కన్నులారా చూచి ఆనందింపుము. నీ ధనధాన్యములను వారికి చూపి అసూయతో బాధపడునట్లుగా చేయుము" అని పలికెను. కర్ణుడు కూడా అటులనే శకునిని సమర్థించెను.

## 237.

దుర్యోధనుడు వారితో, “మామా! కర్ణా! మీరిద్దరూ చెప్పిన మాటలు నాకెంతో నచ్చాయి. అడవులలో కాషాయ బట్టలతో తిరుగు ద్రౌపదిని చూచుట కన్నా నాకు ఆనందము కలిగించు దృశ్యము మరేమున్నది? ధర్మరాజునకు, భీమార్జునులకు నా వైభవము చూపుట కన్నా సంతోషము కలిగించు కార్యము మరొకటి ఉన్నదా? కాని మన ఉద్దేశ్యము తెలుసుకొన్న ధృతరాష్ట్ర మహారాజు గాని, విదురుడు గాని యెంతమాత్రము ఒప్పుకొనరు” అని పలుకగా, ఘోషయాత్ర నెపమున బయలుదేరుదుమని శకుని పలికి తాను ధృతరాష్ట్రునితో మాటలాడి ఒప్పింతుననెను.

## 238.

అనంతరము దుర్యోధనాదులందరూ ధృతరాష్ట్రుని సమీపించి కుశల ప్రశ్నలు వేసిరి. ఆ సమయమున శకుని నిర్దేశానుసారము సమంగుడను గోపాలుడు ధృతరాష్ట్రుని సమీపించి, “మహారాజా! గోగణములన్నియ రాజ్యసమీపమున ఉన్నవి” అని తెలుపగా, కర్ణుడు, శకుని అంధ నృపతితో “కౌరవరాజా! ఘోషపల్లె రమణీయమైన ప్రదేశము. అచ్చట గోవులను వయస్సు ప్రకారము వేరుచేసి, లెక్కించుటయే కాక మాకు వేటాడుటకు యెంతో ఉత్సాహముగా ఉన్నది. మీ కుమారుడైన దుర్యోధనుడు కూడా మృగయాభిలాష కలిగియున్నాడు. కావున అరణ్యగమనమునకు అనుజ్ఞ ఇందు.”

అనిన ధృతరాష్ట్రుడు, “మీరు చెప్పిన ధేనుగణన ఉచితమే కాని నర వ్యాఘ్రముల వంటి పాండవులు అచ్చట వసించుచున్నారు. మీరు హితాహిత జ్ఞానము లేనివారు. అత్యంత గర్వితులు. అచ్చటకు చని పాండవుల యెడ అపరాధము గావించిన వారు తమ తపఃప్రభావమున మిమ్ము దగ్ధము చేయుదురు. లేదా దేవతల వల్ల పొందిన దివ్యాస్త్రములతో మిమ్ము భస్మము గావించెదరు. బహు సంఖ్యాకులమని మీరు గర్వపడకుడు. వారిని మీరు జయింపజాలరు. అందువలన మీ అరణ్యగమనము నాకు ఇష్టము లేదు” అని పలికెను.

ధృతరాష్ట్రుని మాటలు విని శకుని, “మహారాజా! పాండవ జ్యేష్ఠుడైన ధర్మరాజు పరమ ధార్మికుడు. అతడు పన్నెండు సంవత్సరములు అరణ్యవాసము చేయుదునని ప్రతిజ్ఞ చేసెను. అతని తమ్ములు అతని మాటకు యెదురాడరు. అందువలన ప్రతిజ్ఞాభంగము గావించి మామీద కోపము వహింతురని మీరు

తలంచకుడు. అసలు మేము వారి ఆశ్రమ సమీపమునకే చనము. మీరు భయపడకుడు" అని ప్రీతి కలుగునట్లు పలుకగా, ధృతరాష్ట్రుడు అనిచ్ఛా పూర్వకముగా, అమాత్య సమేతముగా దుర్యోధనునకు ద్వైతవన గమనమునకు అనుజ్ఞ ఇచ్చెను.

తండ్రివద్ద అనుమతి లభించగానే దుర్యోధనుడు కర్ణ, శకుని, దుశ్శాసనాది భాతృవర్గముతోను, అంతఃపుర కాంతలతోను, సైన్యముతోను, సామంతులతోను, మంత్రులతోను ఘోషయాత్రకు బయలుదేరెను. వేలాది రథ, గజ, తురగాదులతోను, అసంఖ్యాకములైన శకట, ఆపన, వేశ్య, వణిక, దాసదాసీ జనముతో వారు సర్వసన్నాహములు కావించి అత్యంత కోలాహలముతో ద్వైత వనమునకు బయలుదేరిరి.

## 239.

ఇట్లు ప్రయాణము చేయుచూ వారు ఆభీరపల్లియ చేరి అచ్చట తగిన గృహనిర్మాణము కావించుకొని విశ్రమించిరి.

దుర్యోధనాదులు గోపాలకుల మంచిచెడ్డలు గమనించియు, వారికి బహుమతులు ఇచ్చియు ఆనందము చేకూర్చిరి. అనంతరము వయస్సు ప్రకారము గోగణన జరిగెను.

పౌరులు, సైనికులు నృత్యగీత వాద్యములతో ఆనందముగా కాలము గడుపసాగిరి.

దుర్యోధనాదులు మృగ, మహిష, వరాహ, భల్లూకాదులను వేటాడి తమ మృగయాకాంక్షను తీర్చుకొనసాగిరి.

ఆ సమయమున ఫలపుష్ప వృక్షములతో శోభించుచున్న ద్వైతవనమనెడి సరోవర సమీపమున యుధిష్ఠిరాదులు ఆశ్రమము నిర్మించుకొని వసించుచుండిరి. ధర్మరాజు సహధర్మిణియైన ద్రౌపదితో యేకదివస యజ్ఞము కావించుచుండెను.

ఈ సంగతి తెలుసుకొని దుర్యోధనుడు తమ వైభవము పాండవులకు తెలుపుటకై పరిచారకులను సరోవరపు మరియొక దెస తమ స్థావరములను యేర్పాటుచేయుడని పంపెను. మార్గమున అచ్చట నివసించుచున్న గంధర్వులు, "ఈ స్థానము దేవ నివాసమని" వారిని తిరిగి పంపిరి.

## 240. గంధర్వులతో దుర్యోధనాదులు యుద్ధము చేయుట

చారుల వలన గంధర్వులు తమను ఆటంకపరుచుట తెలిసికొని దుర్యోధనుడు మిక్కిలి కోపించి, సైన్యములను సిద్ధపరచి కర్ణ, శకుని, దుశ్శాసన, వికర్ణాదులతో యుద్ధమునకు బయలుదేరెను. కౌరవుల ఆర్భాటము తిలకించి గంధర్వులు ఈ సంగతి వారి రాజైన చిత్రసేనునకు తెలుప అతడు వివిధ శస్త్రధారులైన బహు సంఖ్యాక గంధర్వులను కౌరవులతో యుద్ధము చేయుటకు పంపెను.

ఆ యుద్ధములో కర్ణుడు విజృంభించి అనేక గంధర్వులను సంహరించగా భీతులై వారు చిత్రసేనునకు ఈ వార్త తెలుప చిత్రసేనుడు రథారూఢుడై రాధేయుని యెదుర్కొని, మాయా యుద్ధమున అతని రథ, తురగ, సారథులను ఖండ ఖండము కావింప భీతుడై కర్ణుడు, వికర్ణుని రథమారోహించి తానే రథము నడుపుకొని రణ స్థలము వీడి పారిపోయెను. అది గమనించిన అనేకులు కౌరవసైనికులు ప్రాణములు అరచేతిలో నుంచుకొని పలాయనము గావించిరి.

## 241.

దుర్యోధనుడు మాత్రము మొండిధైర్యముతో చిత్రసేనుని యెదుర్కొనగా అతడు కురురాజు అస్త్రములన్నియు క్రమముగా ముక్కలు కావించి చివరకు అతనిని శస్త్రరహితుని కావించి తుదకు జీవితావస్థయందే బందీని చేసెను. అటులనే దుశ్శాసన, వివింశతి, వింద, అనువిందాది ధృతరాష్ట్ర తనయులు, రాజపత్నులు గంధర్వుల వశులైరి.

అనంతరము కురు సైన్యములోని మంత్రి సామంతాదులు దుర్యోధనుని దశకు వగచి పాండవులను చేరి భాష్పాకులలోచనులై శరణు వేడిరి.

భీతులై దీనభావమున యుధిష్ఠిరుని తమ రాజును రక్షింపుమని వేడుచున్న కౌరవ సైన్యమును గాంచి భీముడు ఆనందముతో “మేము యెంతో ప్రయత్నము చేసి సైన్యములు సమకూర్చుకొని చేయదలచు కార్యమును గంధర్వులు నేడు సంపన్నము గావించిరి. దుశ్చరిత్రులైన ధార్తరాష్ట్రుల కపట ప్రవర్తనకు నేడు తగిన ప్రతిఫలము లభించినది” అని పలుకుచూ మిక్కుటమగు హర్షము ప్రకటించగా, ధర్మరాజు అతనిని వారించుచూ,

## 242.

"వృకోదరా! కౌరవులు భయార్తులై మనను శరణు కోరిరి. జ్ఞాతులయందు వివాదము సహజము. కాని పరుల వలన కులమునకు యెట్టి అవమానము జరిగినను సత్పురుషులు దానికి ప్రతీకారము చేయుటయే తమ ధర్మముగా నెంతురు. దుర్యోధనుడు తన వైభవమును ప్రకటించుటకు ఇచ్చటకు వచ్చెననుట సత్యము కాని గంధర్వులు వారిని బంధించి మన కులమునకే కళంకము తెచ్చిరి. కావున స్వకుల సంరక్షణార్థము దుర్యోధనాదులను మనము రక్షింపవలెను. కావున భీమా! నీవు అర్జునుడు, నకుల సహదేవులు వెంటనే యుద్ధమునకు సంసిద్ధులు కండు.

"సుయోధనుడు నేడు ఆపదలో మన సహాయము అపేక్షించుచున్నాడు. యజ్ఞదీక్షయందు నేను ఉండకపోయిన స్వయముగా బయలుదేరెడివాడను. మీరు గంధర్వులతో మంచిమాటలతో దుర్యోధనాదులను విడువుమని శాంతిగా కోరుడు. వారు వినకపోయిన పక్షమున శక్తిని ప్రయోగింపుడు" అని పలికెను.

యుధిష్ఠిరుని మాటలు విని అర్జునుడు, "గంధర్వులు సంధి ద్వారా దుర్యోధనుని విడువకపోయిన భూమిపై గంధర్వుల రక్తపుటేరు పారేటట్టు చేస్తాను" అని అన్న మాటలకు అంగీకారము తెలుపగా కౌరవ సైనికులు రక్షింపబడ్డామని దీర్ఘమైన నిట్టూర్పులు విడిచారు.

## 243.

ధర్మరాజు ఆజ్ఞానుసారము భీమార్జున, నకుల సహదేవులు కవచములు ధరించి, వివిధ అస్త్రములను గ్రహించి, ఇంద్రసేనాది సారథులు రథములు సిద్ధపరుప వాటిని అధిరోహించి త్వరితముగా గంధర్వుల దెస చనిరి.

కొంతసేపటికి వారు ఆకాశమార్గమున దుర్యోధనాదులను తీసుకొని పోవుచున్న గంధర్వులను చూచి, వారిని తమకు ఇవ్వమని కోరగా వారు తాము తమ రాజకార్యము ఆచరించుచుంటిమని నిరాకరింప పాండవ గంధర్వుల మధ్య తీవ్రమైన యుద్ధము చెలరేగెను.

## 244.

అర్జునుడు తీవ్ర శరవర్షమున అనేకులు గంధర్వులను సంహరించెను. అతని ఇంద్రజాల, సౌర, ఆగ్నేయాది అస్త్రములకు గంధర్వులు ఓర్చుకొనలేక

పోయిరి. ఆ సమయమున గంధర్వరాజు చిత్రసేనుడు పెద్ద గద ధరించి అర్జునుని దెస రాగా అతడు శరసమూహమున ఆ గదను ముక్కలు చేసెను. చిత్రరథుడు అంతర్హితుడై మాయా యుద్ధము చేయసాగెను. అంత అర్జునుడు కోపముతో శబ్దభేది బాణములో గంధర్వుని మిక్కిలి నొప్పింప అతడు, "అర్జునా! ఆగుము. నేను నీ ప్రియసఖుడను. చిత్రసేనుడను" అనిన, అర్జునుడు, మిగిలిన పాండవులు కూడా యుద్ధము చేయుట ఆపిరి.

## 245.

అనంతరము అర్జునుడు, చిత్రసేనునితో, "రాజా! నీవేల కౌరవుల నిగ్రహమునకు ప్రయత్నించితివి?" అని ప్రశ్నింప గంధర్వరాజు, "ధనుంజయా! స్వస్థానమునందుండి మేము దుర్యోధనుని దురభిప్రాయము తెలుసుకొంటిని. అతడు పాండవులు అనాథలై ఉన్నారని, దాసదాసీజనముతో వారి దుర్దశను చూచుటకు, ద్రౌపదిని పరిహాసము చేయుటకు ఇచ్చటకు వచ్చిరి. ఇంద్రుడు ఇతని చెడ్డ తలంపు తెలుసుకొని దుర్యోధనుని బంధించి తెచ్చుటకై నన్ను పంపెను. అందులకే నేను వచ్చి ఈతనిని బంధించి తీసుకొనిపోవుచున్నాను" అని తెలిపెను.

అర్జునుడు తమ హితుడవైన దుర్యోధనాదులను వదులుమనిన వారందరూ యుధిష్ఠిరుని వద్దకు చనిరి. అజాతశత్రుడైన ధర్మరాజు కౌరవులను, వారి స్త్రీలను ముక్తులను కావించి గంధర్వులను ప్రశంసించి, "గంధర్వులారా! సమర్థులైనను మీరు కౌరవులను హింసింపలేదు. ఇది పరమసౌభాగ్య విషయము. వీరిని మీరు వదలి మా కులమర్యాదను రక్షించిరి. మీ దర్శనము కలిగి కృతార్థులమైతిమి" అని సాదరముగా వారికి వీడ్కోలు తెలిపెను.

చిత్రసేనాదులు, పాండవుల అనుమతి తీసుకొని, అప్సరసలతో బయలుదేర, ఇంద్రుడు అమృతవర్షము కురిపించి, నిహత గంధర్వులను పునర్జీవితులను చేసెను.

అంత యుధిష్ఠిరుడు దుర్యోధనుని సమీపించి, "తమ్ముడా! ఇటువంటి సాహసము ఇకనెన్నడూ చేయకుము. దానివలన అనర్థములు కలుగుటయే కాక సుఖము పొందజాలవు. ఇక దుశ్చింతను మాని సుఖముగా గృహమున కేగుము" అని ఆదరముగా పలికెను.

దుర్యోధనుడు సిగ్గుతో తల వంచుకొని, సగము చచ్చినవాని వలె, ధర్మరాజు వద్ద అనుజ్ఞ తీసుకొని నగరమునకు బయలుదేరెను.

జరిగినదంతయూ తలచుకొని దుఃఖముతో అతని హృదయము విదీర్ణమయ్యెను.

కౌరవులు వెడలిపోయిన పిమ్మట పాండవులు సురులు, భూసురులు ప్రవేశింప పరమాహ్లాదమున ద్వైతవనమున కాలము గడుపసాగిరి.

## 246.

ధర్మరాజు వద్ద సెలవు తీసుకొని, తమకు జరిగిన అవమానమునకు చింతించుచూ, దుర్యోధనుడు చతురంగ సేనలతో నగరాభిముఖమగా పయనించ సాగెను. మార్గమున నీటితో నిండియున్న జలాశయమును గాంచి, విశ్రమింప విడుములు యేర్పరచుకొనిరి. దుర్యోధనుడు అందమైన పల్యంకమున కూర్చొనియుండు సమయమున కర్ణుడు అతనిని సమీపించి, "కురునందనా! కామరూపులైన గంధర్వులను జయించి నీవు, సహోదరులు తిరిగి వచ్చినందులకు నాకు యెంతో ఆనందముగా ఉన్నది. గంధర్వుల ప్రతాపమునకు సహింపలేక నేను వెనుతిరిగితిని. నీ అమానుష యుద్ధమున నీవు నిర్భీకుడవై యెదిరించి గెలపొందుట చెప్పుకొనవలసిన విషయము'' అని అనేక విధముల పొగుడుచుండగా దుర్యోధనుడు అతనిని ఆపి, గద్గద స్వరమున ఇట్లనెను.

## 247.

"రాధేయా! నీకు మా యుద్ధ విషయము యేమియూ తెలియదు. అందుకే నీ మాటలకు నేను కోపగించుట లేదు. నేను యుద్ధమున స్వీయప్రభావమున విజయుడనైతినని భ్రమించుచున్నావు. అది సత్యము కాదు. గంధర్వులు మాయా యుద్ధమున మమ్ము అసమర్థులను చేసి పుత్ర, కళత్ర, అమాత్య సహితముగా బంధించిరి.

మన సైనికులు, మంత్రులు కొందరు పాండవులను చేరి ప్రార్థింప, ధర్మాత్ముడైన యుధిష్టిరుడు మమ్ము రక్షింప తమ్ములను పంప, వారు గంధర్వులతో యుద్ధము చేసి జయించిరి. గంధర్వరాజు చిత్రసేనుడు అర్జునునితో తన పరిచయము తెలిపి, వారి మైత్రి జ్ఞప్తికి తెచ్చిన వారు యుద్ధము ఆపిరి. అర్జునుడు మమ్ము వదులుడని గంధర్వునితో పలుకు సమయమున భూమి బ్రద్దలైన అందులో ప్రవేశింప ఇచ్ఛ కలిగినది. జీవితముపై ఆశ నశించినది.

అనంతరము వారు ధర్మరాజు వద్దకు తోడ్కొని పోయి బంధముక్తులను గావించిరి. కర్ణా! నేను కులస్త్రీల ముందు బంధింపబడి, యుధిష్టిరుని ముందు

ఉపహారస్వరూపుడనైతిని. దీనికన్నా దుఃఖజనకమైన విషయము మరేమున్నది? యెవరి రాజ్యము నేను లాగుకొని అడవుల పాలు చేసితినో వారి దయా దాక్షిణ్యములతో బంధవిముక్తుడనైతిని. ప్రాణదానము పొందితిని. ఇట్టి అవమానకరమైన బతుకు కన్న యుద్ధమున మరణించిన మేలై ఉండెడిది. దానివలన వీరస్వర్గమైనను లభించెడిది.

కర్ణా! నేడే నీవు తమ్ములతోను, బంధువులతోను నగరము ప్రవేశింపుము. నేను ఇచ్చుటనే ప్రాయోపవేశము చేసెదను. ఇట్టి అవమాన భారముతో హస్తినా నగరము ప్రవేశింపలేను. శత్రువులకు ఆనందము, హితులకు అవమానము కలిగించి, నేడు కరినగరము యెట్లు ప్రవేశింతును? భీష్మ, ద్రోణాదులేమనెదరు? నేనేమి జవాబివ్వగలను? యుద్ధమున విక్రమము ప్రదర్శింపబోయి, ఆత్మదోషమున స్థానభ్రష్టుడనై, అవమానముల పాలైతినని యెట్లు వచింపగలను?

దుర్వినీతులైన వ్యక్తులు శ్రీ, విద్య, యైశ్వర్యము లభించినను వాటిని నిలుపుకొనలేరు. బలగర్వమున మోహావిష్టులై నేడు గర్హితకార్య మాచరించి యెట్టి విపత్తులో ఉన్నానో చూడు. అందువలన నేను ప్రాయోపవేశము చేసెదను. అదే నాకు శరణ్యము" అని దుశ్శాసనుని సంబోధించి, "దుశ్శాసనా! నిన్ను రాజ్యాభిషిక్తుడను చేయుచున్నాను. బంధువుల యెడ ఆదరముతోను, బ్రాహ్మణుల యెడ భక్తితోనూ మెలగుచూ రాజ్యము చేయుము. ఇక నీవే మన కులమునకు ఆధారము" అనిన దుశ్శాసనుడు అన్న పాదములపై వ్రాలి, తనకు రాజ్యము అక్కరలేదని, అతనిని తన పట్టుదల వదిలి శత సంవత్సరములు రాజ్యము చేయుమని కోరెను.

## 249.

అంత కర్ణుడు దుర్యోధనుని ఉద్దేశించి, "రాజా! నీవు, నీ తమ్ములు అనవసరముగా విచారించుచున్నారు. పాండవులు మిమ్ము శత్రువుల బారినుండి రక్షించుటయందు ఆశ్చర్యమేమున్నది. అది వారి కర్తవ్యమని తెలిసికొనుము. వారు మీ రాజ్యమున వసించి పరమ సుఖమున కాలము గడుపుచున్నారు. రాజ్యములో నివసించువారు రాజు హితము చేకూర్చుచుందురు కదా! పాండవులు కూడా అటులనే ప్రవర్తించిరి. దీనికి విషాదము పొందవలసిన అవసరమేమున్నది? నిశ్చింతగా నగరమునకు బయలుదేరుము" అని అతనిని మరలింపదలచినను దుర్యోధనుడు కర్ణుని వచనములు అంగీకరించలేదు.

## 250.

శకుని దీనవదనముతోనున్న దుర్యోధనునితో, "మహారాజా! నీవు తెలివితక్కువ పిల్లవానివలె అనుచిత కార్యము చేయబోవుచున్నావు. పాండవులు నీకు ఉపకారము చేసితిరని వగువ పనియేమున్నది? నీవు కూడా వారిని రప్పించి, వారి రాజ్యభోగము వారికి పంచి ఇచ్చి, సంధి కావించుకొని బంధుమిత్రాదులందరూ నిన్ను పొగుడుచుండ సుఖముగా కాలము గడుపుము" అని పలికెను.

వారి మాటలను విని దుర్యోధనుడు, "ధర్మము, ధనము, సుఖము, ఐశ్వర్యము, ప్రభుత్వము, భోగము, వీటిలో దేనియందును నాకు కోరిక, వాంఛ లేవు. నేను ప్రాయోపవేశము చేయ నిశ్చయించుకున్నాను. మీరు నా మాటలకు యెదురు చెప్పక నగరమునకు చని గురుజనులను సేవించుచుండుడు" అని నిరాశాపూరితమైన వచనములు పలికిన వారు, "మహారాజా! నీవు లేకుండా మేము హస్తినానగరమును ప్రవేశింపము" అని పలికిరి.

దుర్యోధనుడు స్నేహితులు, అమాత్యులు, తమ్ములు యెన్ని చెప్పినను వినక, దేహత్యాగము చేసి, స్వర్గము చనుటకు నిశ్చయించి, జలము స్పర్శించి, శుచియై, చీర వసనములు ధరించి, కుశదర్భలు పరచి వానిపై శయనించి, మనస్సును యేకాగ్రతలో నిలిపి బాహ్యక్రియలు అన్నియూ పరిత్యజించెను.

ఆ సమయమున దేవతలచే ఓడింపబడి పాతాళమున నివసించుచున్న దైత్యులు దుర్యోధనుని మరణేచ్ఛ తెలుసుకొని, జ్ఞాతిక్షయమునకు వెరచి, శుక్రాచార్య ప్రోక్త అధర్వణ వేద యజ్ఞకార్యము కావించి అగ్నికి ఆహుతి కావించిరి. అద్భుతరూపశాలియైన దేవత ఆవలించుచూ ఉద్భవించి, దానవుల కోరిక ప్రకారము దుర్యోధనుని వారి చెంతకు తెచ్చెను.

## 251.

దానవులు దుర్యోధనునితో, "మహారాజా! పూర్వము మేము మహేశ్వరునికై తపస్సు చేసి నిన్ను పొందితిమి. నీ శరీరములోని పూర్వార్థము వజ్రముతో అభేద్యముగా సృష్టించబడినది. పశ్చిమకాయము దేవి పుష్పములతో రమణీ మనోహరముగా శంకర, పార్వతులచే నిర్మింపబడినది. నీ శరీరము సామాన్య మానవదేహము కాదని తెలుసుకొమ్ము. నీకు సహాయము చేయుటకే దానవులు

పుడమిపై జన్మించిరి. మేము భీష్మ ద్రోణాది వీరులలో ప్రవేశించి, దయ, మమత లేకుండా శత్రువులను వధించునట్లు చేయుదుము.

అర్జునుని విషయమై నీవు విచారింపవలదు. నరకాసురుని ఆత్మ కర్ణునిలో ప్రవేశించి కృష్ణార్జునులపై పగ తీర్చుకొనును. మేము సుసప్తకులను శతసహస్ర దానవులను అర్జునుని సంహరింప నియుక్తులను కావించితిమి. నీవు శోకమును మానుము. మా అండదండలతో నీవు అభివృద్ధి చెందెదవు" అని పలికి దేవతను రప్పించి దుర్యోధనుని యథాస్థానమందుంచిరి.

మరునాడు దుర్యోధనుడు పాండవులను జయింతునన్న ధైర్యము పొంది, పై విషయము యెవ్వరికి తెలుపలేదు. కర్ణుడు మరల దుర్యోధనుని చెంతకు వచ్చి, "మహారాజా! నీవు శయ్యనుంచి లెమ్ము. అర్జునుని నేను తప్పక వధింతునని శపథము చేయుచున్నాను" అని పలికెను.

దుర్యోధనునకు దానవుల మాటలు జ్ఞాపకమునకు రాగా బుద్ధిని స్థిరపరచుకొని, ధైర్యమవలంబించి, హస్తినానగరమునకు ప్రయాణమగుటకు అందరకూ ఆజ్ఞ ఇచ్చెను. స్వల్పకాలములోనే వారు కరినగరము చేరిరి.

## 252.

పాండవుల వల్ల ముక్తిని పొంది హస్తినానగరమును చేరిన దుర్యోధనుని చూచి భీష్ముడు, "వత్సా! నాడే నిన్ను ద్వైతవనమునకు చనవలదని నేను హితము తెలిపితిని. నీవు నా మాటలను అవహేళనము చేసి వెడలితివి. నీవు శత్రువుల చేతిలో చిక్కిపోగా ధర్మజ్ఞులైన పాండవులు విడిపించిరి. దీనికి నీకు సిగ్గు వేయుట లేదా? సూతపుత్రుడు నిన్ను, నీ భార్యలను గంధర్వుల చేతిలో వదిలి పిరికిపంద వలె పారిపోయెను. ఈతడు శౌర్య, వీర్య సంపన్నులైన పాండవులతో యెన్నడూ సమము కాడని నేడైనా అర్థమైనదా? కావున కులవృద్ధికి పాండవులతో సంధి కావించుకొని సుఖముగా ఉండుము" అని పలికెను.

దుర్యోధనుడు తాత మాటలను లెక్కింపక పరిహాసపూర్వకముగా నవ్వుచూ, కర్ణ, దుశ్శాసనాదులతో అచ్చటనుండి వెడలిపోయెను. దుర్యోధనునిచే తిరస్కరింపబడి, సిగ్గుతో భీష్ముడు తన భవనమునకు మరలెను.

అనంతరము దుర్యోధనుడు మంత్రులను, కర్ణుని పిలచి, "మనము యెట్టి పని చేసిన ధనము, యశస్సు కూడా లభించునో, ఆలోచింపుడు" అని కోరిన కర్ణుడు, "మహారాజా! భీష్ముడు యెల్లవేళలా నిన్ను, నన్ను దూషించుచూ,

పాండవులను ప్రశంసించుచుండును. నాడు పాండవులు మేదినీ మండలము జయించిరని విచారించకుము. నీవు అనుమతించిన నేను దిగ్విజయ యాత్ర గావించి సమస్త పృధ్విని నీ పాదాక్రాంతము చేయుదును” అని గంభీరముగా పలికెను.

కర్ణుని వచనములకు దుర్యోధనుడు సంతసించి, “అంగరాజా! నీవంటి స్నేహితుడు లభింప నేను ధన్యుడనైతిని. నా జన్మ సార్ధకమైనది. నీ అభిమతము ప్రకారము విజయయాత్రకు సిద్ధము కమ్ము” అనెను.

ఇట్లు మహావీరుడైన కర్ణుడు దుర్యోధనుని అంగీకారము పొంది, శుభముహూర్తమున, బ్రాహ్మణులు స్వస్తివాక్యములు పలుకుచుండ, రథము నధిరోహించి విజయోత్సాహమున బయలుదేరెను. ఆ సమయమున అతని రథ నిర్ఘోషము త్రిలోకముల ప్రతిధ్వనించెను.

## 253. కర్ణుని దిగ్విజయ యాత్ర

వైశంపాయనుడిట్లు చెప్పదొడంగెను, “మహారాజా! అనంతరము కర్ణుడు సైన్య పరివృత్తుడై ముందుగా ద్రుపదుని జయించి, రజత, రత్న సముదాయములు గ్రహించి, ఉత్తర దిశగా ప్రయాణించి పర్వత రాజ్యములను జయించి పన్నులు పుచ్చుకొనెను. అనంతరము పూర్వదిశగా పయనించి, అంగ, వంగ, కళింగ, మండిక, మిథిల, మాగధ, యోధ దేశములు జయించి దక్షిణాభిముఖుడై ముందుగా రుక్మితో యుద్ధము చేయగా ఆతడు ఓడి సువర్ణము సమర్పించి సంధి చేసుకొనెను. పిదప కర్ణుడు పాండ్య, కేరళ, నీలదేశములు జయించి, శిశుపాలుని కుమారుని జయించి, పశ్చిమమున మ్లేచ్ఛ, ఆగ్నేయ, శశక, యవన, బర్బర దేశములు జయించి అమిత ధన రత్నరాసులు గ్రహించి హస్తినా నగరమును చేరెను.

దుర్యోధనుడు బంధువులతోను, బాంధవులతోను కర్ణునకు యెదురేగి యధోచిత ఉపచార, అర్చనలు గావించి, “కర్ణా! నీకు శుభము కలుగుగాక! బార్హ్లీక, భీష్మ, ద్రోణులు చేయలేని కార్యము నీవు చేయగలిగితివి. పాండవులు నీకు సరిరారని మరల ఋజువు చేసితివి. నీవు మా కులమును, కీర్తిని వృద్ధిపరచితివి” అని ప్రశంసించెను.

ధృతరాష్ట్రుడు, గాంధారి తమకు నమస్కరించిన కర్ణుని కౌగలించుకొని ఆశీర్వదించిరి. శకుని కర్ణుడు తప్పక అర్జునుని జయించునని ఆనందించెను.

## 254. దుర్యోధనుడు వైష్ణవ యజ్ఞము చేయుట

అంత దుర్యోధనునితో కర్ణుడు, "భూమండలమున నీ శత్రువులెవ్వరూ ఇక లేరు. నీవు ఇంద్రునివలె నిర్విఘ్నముగా రాజ్యము చేయుము" అనిన, దుర్యోధనుడు, "అంగరాజా! నీవు అండగా నిలచియుండగా నాకు దుర్లభమైనది యేమున్నది. పాండునందనుని రాజసూయ యాగము చూచిన దినమునుండి ఆ యజ్ఞము చేయ నాకు కుతూహలము కలదు. స్నేహవత్సలుడవైన నీవు నా కోర్కె తీర్చుము" అనిన మహావీరుడైన కర్ణుడు, "రాజా! అందరు రాజులు నీకు వశులైరి. అందువలన నీవు బ్రాహ్మణులను పిలిపించి యజ్ఞోపకరణములన్నియూ సిద్ధము చేసుకొనుము. వేదపారంగతులైన ఋత్విక్కులు వచ్చి నీ కార్యము సఫలము గావించెదరు. వెంటనే నీవు మహాయజ్ఞమునకు సిద్ధము కమ్ము" అని ప్రోత్సహించెను.

దుర్యోధనుడు పురోహితుని పిలిపించి అతనికి సంగతి తెలియజేయగా అతడు, "మహారాజా! యుధిష్ఠిరుడు జీవితుడై యున్నంతవరకు మీ వంశములో యెవ్వరూ రాజసూయ యాగము చేయకూడదు. ముఖ్యముగా మీ తండ్రిగారైన ధృతరాష్ట్రుడుండగా మీరా యజ్ఞము చేయుట నీతివిరుద్ధము. కావున దానితో సమానమైనది, పుణ్యకరమైనదియైన వైష్ణవ యజ్ఞమును మీరు ఆచరింపుడు. దీనివలన మీ కోరికలన్నియు తీరును" అనిన దుర్యోధన, కర్ణ, శకునాదులు అంగీకరించి యజ్ఞమునకు కావలసిన బంగారపు నాగలి మొదలైన ద్రవ్యము లన్నియు సమకూర్చుకొనిరి.

## 255.

దుర్యోధనుడు యజ్ఞదీక్ష వహించి, ధృతరాష్ట్రుడు, విదురుడు, భీష్ముడు మొదలైనవారి ఆశీస్సులు గ్రహించి, యజ్ఞమును నిరీక్షింప దేశదేశముల రాజ ప్రముఖులను ఆహ్వానింప దూతలను పంపెను. అందులో ఒకనితో దుశ్శాసనుడు ద్వైతవనమున పాండవులను, అచ్చటి ఋషులను దుర్యోధనుని వైష్ణవ యజ్ఞమును దర్శింప రమ్మని ఆహ్వానింపుమనెను.

దూత అటులనే పాండవులతో తెలియజేయగా యుధిష్ఠిరుడు, "మా పూర్వపురుషుల కీర్తి పెంపొందించుచూ దుర్యోధనుడు ఉత్కృష్టమైన యజ్ఞము కావించుచున్నందులకు మాకు ఆనందముగా ఉన్నది. మా ప్రతిజ్ఞానుసారము

అరణ్య అజ్ఞాత వాసములు పదమూడు సంవత్సరములు పూర్తికాకుండా రాలేమని తెలియజేయుము" అని నెమ్మదిగా చెప్పెను.

అనంతరము భీమసేనుడు దూతతో "ఓయి! పదమూడు సంవత్సరముల అనంతరము ధర్మరాజు చేయబోవు యుద్ధ యజ్ఞములో అతనితో సాక్షాత్కారము కలుగనని దుర్యోధనునితో తెలియజేయుము. మా కోపానలము వారిపై పడుచుండ ధృతరాష్ట్ర తనయులు హోమాగ్నిలో దగ్ధమగుచుండ నేను కూడా వారిని కలియుదునని చెప్పుము" అని ఊరకుండెను.

మిగిలిన పాండవులు యెవ్వరు దూతతో యెట్టి కటోక్తులను ఆడక మిన్నకుండిరి. దూత హస్తినానగరమునకు చని జరిగినదంతయూ తెలియజేసెను.

అనంతరము దుర్యోధనుడు భూపాలురు, బ్రాహ్మణులు, ప్రజలు రాగా యజ్ఞమును పూర్తిగావించి, హస్తినానగరము ప్రవేశించెను.

## 256.

వందిమాగధులు పొగుడుచుండ దుర్యోధనుడు నగరము ప్రవేశించి తల్లిదండ్రులకు భీష్మ ద్రోణాదులకు నమస్కరించి, అనుజుల నమస్కారము లందుకొని, విచిత్రసింహాసనమున ఉపవిష్టుడై ఉండ కర్ణుడు, "మహారాజా! నీవు యజ్ఞమును యెట్టి ఆటంకములు పూర్తిగావించితివి. పాండవులను నాశనము చేసిన తరువాత నీవు చేయు రాజసూయ యజ్ఞమును చూచిననాడు నిజముగా నేను ధన్యుడనైతినని తలంతును" అనిన దుర్యోధనుడు "మహావీర! నీవు పాండవులను వధించి నాచే రాజసూయము చేయింతువా?" అని అతనిని కౌగలించుకొనెను.

అంత కర్ణుడు, "మహారాజా! అర్జునుని వధించు వరకు ఇతరులచే పాదధారణము, జలగ్రహణము చేయను. సురను పుచ్చుకొనను. నేలనే పరుండెదను. అర్థులను పరాఙ్ముఖులను చేయను" అని శపథము కావించెను. కర్ణుని ప్రతిజ్ఞ విని ధృతరాష్ట్ర, దుర్యోధనాదులు మిక్కిలి సంతసించిరి.

చారుల వలన కర్ణుని ప్రతిజ్ఞ విని ధర్మరాజు కర్ణుని అభేద్యమైన కవచము స్ఫురణకు రాగా రాత్రులందు నిద్ర చెడి అశాంతిగా సమయము గడుపసాగెను.

ఘోషయాత్రా పర్వాధ్యాయ సమాప్తి

## 257. మృగస్వప్నోద్భవ పర్వాధ్యాయము

ఒకనాటి రాత్రి ధర్మరాజు కలలో ద్వైతవనమందలి మృగములు అతనితో కంటనీరు నింపి మా వంశములు మీ మృగవధ వలన నిర్మూలము కానున్నవి. మాయందు దయతలచి వనాంతరమునకు జనుడని వేడుకొనగా యుధిష్టిరుడు మరునాడు తమ్ములకు, ద్రౌపదికి తన స్వప్నవృత్తాంతము తెలిపి, "ఇక మనము అరణ్యవాసము సంవత్సరము, యెనిమిది మాసములు చేయవలెను. ఆ సమయమును మనము కామ్యక వనమున గడుపుదము" అనిన వారు అంగీకరించి, బ్రాహ్మణులతోను, సేవకులతోను కామ్యకవనమును చేరిరి.

మృగస్వప్నోద్భవ పర్వాధ్యాయ సమాప్తి

## 258. వ్రీహిద్రౌణిక పర్వధ్యాయము

కామ్యక వనమున పాండవులు సంవత్సర కాలము గడిపి, మిగిలిన సమయము యెప్పుడు గడుచునా అని అత్యంత దుఃఖముతో కాలము గడుపుచున్న సమయమున వారి వద్దకు కృష్ణద్వైపాయనుడు వచ్చి, వారి ఆతిథ్యము స్వీకరించి, విషణ్ణవదనుడై ఉన్న ధర్మరాజుతో, "యుధిష్టిరా! సుఖదుఃఖములు వెలుగునీడల వంటివి. అనంతమైన సుఖము అనుభవింపవలెననిన మనుజుడు తపోనుష్టానము గావించవలెను. సత్యము, సరళత, కోపము లేకపోవుట, దమము, శమము, అసూయ లేకపోవుట, అహింస, శుచి, ఇంద్రియనిగ్రహము మనుష్యునకు పవిత్రత చేకూర్చును. ఇహలోకమున చేసిన కార్యములకు పరలోకమున ఫలితము ననుభవింతురు.

అదేకాక జగత్తుపై దానమును మించినదేమియు లేదు. న్యాయముగా ఆర్జించిన ధనము దేశ, కాల పాత్రములు ఆలోచించి చేసిన దానము అనంత సుఖములు కలుగజేయును. దీనికి ఉదాహరణముగా ముద్గలుడను మహర్షి చరిత్రను తెలిపెదను. సావధానుడవై వినుము.

## 259. మహర్షి ముద్గలుని ఉపాఖ్యానము

వ్యాసమహర్షి మరల ఇట్లు చెప్పదొడంగెను. "ధర్మనందనా! కురుక్షేత్రమున సత్యవాది, అసూయా శూన్యుడు, జితేంద్రియుడు అయిన ముద్గలుడు అను ధర్మాత్ముడైన మహర్షి కలడు. అతడు రైతులు పొలములలో వదలివైచిన ధాన్యము సేకరించి జీవితము గడిపెడివాడు. అతడు పదిహేను దినములలో ఒక ద్రోణము

నిండా గ్రహించి దానితో పదిహేను దినములు ఇంటికి వచ్చిన అతిథులకు అన్నము ఇడి మిగిలినది తాము తినెడివారు.

ఒకానొక సమయమున దూర్వాసమహర్షి ముద్గలుని ఆశ్రమమునకు వచ్చి అన్నమంతయూ తానే భుజింపగా ముద్గలుడు అతని కుటుంబము ఉపవాసముండిరి. ఇట్లు దూర్వాసుడు ఆరుమార్లు చేసెను. కాని ముద్గలునిలో యెట్టి మార్పు గమనింపలేదు. అంత దూర్వాసుడు సంతసించి, 'మునివరా! ఆకలి యెంతవానినైనను ధైర్యచ్యుతుని చేయును. కాని నీవు యెంత ఆకలితో నున్నను అతిథిని ఆదరముతో చూచితివి. నీకు తప్పక స్వర్గము ప్రాప్తించును' అని పలికెను.

దూర్వాసుని వాక్యానుసారము అచ్చటకు హంససారసయుక్తమైనది, బంగారు మువ్వలు గలదియైన విచిత్ర విమానము వ్రాలగా, దేవదూత స్వర్గమును చేరుటకు దానిని అధిరోహింపుమని ముద్గలుని కోరగా ముని దేవదూతతో స్వర్గము యొక్క గుణము, నియమము, సుఖము, దోషము తెలియజేయమని కోరెను.

## 260.

అపుడు దేవదూత ముద్గలునితో "మునివరా! ధార్మికులు, జితేంద్రియులు, శాంతులు, ధర్మమందు అనురక్తి కలవారు మాత్రమే చేరగలరు. లోకులు స్వర్గమున పూర్వకృత ఫలమును అనుభవింతురు. క్రొత్తకర్మరేవియూ అనుష్ఠింతురు. పుణ్యఫలము పూర్తికాగానే మరల భూమిపై జన్మింతురు. పృధివి కర్మభూమి, స్వర్గము ఫలభూమి" అని తెలియజేసెను.

దేవదూత మాటలు విని ముద్గలుడు అతనితో "ఓయి! ఆర్జించిన పుణ్యము తరిగిపోగానే స్వర్గభ్రష్టుడనై నరలోకమున జన్మించి దారుణమైన దుఃఖము పొందుట నాకు ఇష్టము లేదు. ఏ స్థలమునకు చేరిన మరల తిరిగి రానక్కరలేదో, శోకము, దుఃఖము, మనస్థాపము ఉండదో అట్టి స్థానమును నేను అన్వేషింతును" అని ముద్గలుడు దేవదూతను పంపివైచి, తనకు కలిగినదానితోనే అతిథులను గారవించి జితేంద్రియుడై, యోగనిరతుడై కాలము గడిపి ముక్తిని పొందెను.

కావున కౌంతేయా! రాజ్యచ్యుతుడనైతినని విచారింపకుము. నీ తపోబలము వలన వాటిని తిరిగి పొందెదవు. సుఖదుఃఖములు చక్రము వలె మరల మరల తిరుగుచుండును. పదమూడు సంవత్సరములు పూర్తికాగానే హృతరాజ్యము తిరిగి పొందెదవు" అని స్వీయ ఆశ్రమమునకు చనెను.

వ్రీహిద్రౌణిక పర్వాధ్యాయ సమాప్తి

## 261. ద్రౌపదీహరణ పర్వాధ్యాయము

వైశంపాయనుడు ఇట్లు చెప్పదొడంగెను. "జనమేజయ మహారాజా! ఒకానొక సమయమున దూర్వాసుడు పదివేలమంది శిష్యులతో హస్తినా నగరమునకు చనెను. దుర్యోధనాది కౌరవులు కోపిష్టియైన మునికి వినయము, అణకువలతో సేవకుల వలె పరిచర్యలు గావించిరి.

దూర్వాసుడు అచ్చట ఒకప్పుడు ఆకలి వేయుచున్నది. వెంటనే భోజనమిడు డనియు, ఒకప్పుడు ఆకలిగా లేదు భోజనము చేయనని, మరల కొద్దిసేపటిలోనే ఆహారమునకు సిద్ధమగుచూ చిత్రవిచిత్రముగా ప్రవర్తించినను దుర్యోధనుడు అన్నీ సహించి, ముని వచనానుసారము ప్రవర్తింపగా ముని సంతసించి, "భారతా! నీకు శుభము జరుగుగాక! నీ యెడ ప్రసన్నుడనైతిని. వరము కోరుకొనుము" అని పలుకగా అంతకు క్రితమే కర్ణాదులతో నిశ్చయించిన విధముగా దుర్యోధనుడు, "బ్రాహ్మణోత్తమా! ధర్మరాజు మా కులమునకు జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు, శీలసంపన్నుడు. అతడు ఇప్పుడు తమ్ములతో అరణ్యమున నివసించుచున్నాడు. మీరు శిష్యులతో ద్రౌపది భోజనము చేసి విశ్రమించియున్న సమయమున అతని వద్దకు అతిథిగా చనుడు" అనిన ముని సంతోషముగా అంగీకరించెను.

## 262.

ఒకనాడు పాండవులు, ద్రౌపది భోజనాదులు కావించి, సుఖాసీనులై ఉన్న సమయమున దూర్వాసుడు తన పదివేలమంది శిష్యులతో అచ్చటకు వచ్చిన, ధర్మరాజు తమ్ములతో యెదురేగి మునిని ఆదరముతో తీసుకొనివచ్చి ఆసనమున కూర్చుండబెట్టి, యథావిధి పూజార్చనలు కావించి తమ ఆతిథ్యము గ్రహింపుమని చేతులు జోడించి ప్రార్థించి, త్వరితముగా ఆహ్నిక క్రియలు కావించుకొని రమ్మని కోరెను.

తమకందరకు అతడెట్లు ఆతిథ్యము కావింపగలడనీ అనుకొనుచూ దూర్వాసుడు శిష్యులతో నదికి బయలుదేరెను.

ఇక్కడ దూర్వాసుడు స్నానము చేయుటకు శిష్యులతో వెడలగా అక్కడ ద్రౌపది వీరికెట్లు ఆతిథ్యము చేయగలనని చింతించి కంసనిసూదనుడు, మధు సూదనుని ప్రార్థింప, అతడు త్వరితముగా అచ్చటకు చని, ద్రౌపదితో, "చెల్లీ! నాకు మిక్కుటముగా ఆకలి వేయుచున్నది. మిగిలిన విషయములు తర్వాత మాట్లాడుకొనవచ్చు. వెంటనే భోజనము పెట్టుము" అనిన ద్రౌపది సిగ్గుతో, "దేవా!

నా భోజనము వరకూ సూర్యుడిచ్చిన పాత్ర నిండియుండును. కాని నేడు అప్పుడే భోజనము చేసితిని. ఇప్పుడు అందులో యేమియూ లేదు" అనగా కృష్ణుడు, "పరిహాసమాడుటకు సమయము కాదు. ఆకలితో నాకు శోష వచ్చుచున్నది. వెంటనే ఆ పాత్రను తెమ్ము" అనిన, అతని మాటను దాటలేక ద్రౌపది పాత్రను తీసుకొని వచ్చి చూపగా, దాని అంచున కొద్దిగా అంటుకొని ఉన్న శాకాన్నమును గోవిందుడు ఆరగించి, "దీనితో విశ్వాత్మ ప్రీతుడు, పరితుష్టుడు అయ్యెను" అని, భీముని పిలిచి వెంటనే బ్రాహ్మణులను 'భోజనమునకు రమ్మని' ఆహ్వానింపుమనెను.

నదిలో స్నానమాచరించుచున్న దూర్వాసుడు, శిష్యులు మిక్కుటముగా భుజించినట్లుగా అనుభూతిని చెందినవారైరి. అంత దూర్వాసుడు, "మనము వృథాగా రాజర్షియైన ధర్మరాజుతో వంటలు చేయుమంటిమి. ఇప్పుడు అవి స్వీకరించకపోయిన అపరాధుల మగుదుము. అంబరీషుని మాట జ్ఞాపకము వచ్చినప్పుడు ఇప్పటికీ నాకు వణుకు పుట్టును. ముఖ్యముగా పాండవులు ధర్మపరాయణులు, శౌర్యశీలురు, కృతవిద్యులు, వ్రతధారులు, తపస్వులు, సదాచార పరాయణులు, నారాయణ భక్తులు. వారికి కోపము వచ్చిన మనను భస్మము చేయగలరు. అందువలన వారితో చెప్పకుండా పారిపోవుటయే మేలు" అని శిష్యులతో త్వరితముగా పలాయనము గావించెను.

పిలవ వచ్చిన భీముడు నదీ తీరమున మునిని, శిష్యులను గానక అందందు తిరిగి కొందరు మునుల వలన దూర్వాసుని పలాయన వృత్తాంతము విని ఆశ్రమమునకు రాగా పాండవులతో కృష్ణుడు దుర్వాసుని దురుద్దేశము తెలియజేసెను.

## 263. ద్రౌపదిని చూచి జయద్రథుని చెడ్డతలపు

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! ఒక దినమున పాండవులు ఆహార నిమిత్తము బయటకు వెడలిన సమయమున, ధౌమ్యాదులు కూడా పుష్పచయనాది కృత్యములకు అందందు చనగా, ఆశ్రమమున ద్రౌపది ఒక్కతెయే యుండెను.

ఆ సమయమున సింధు దేశాధిపతియైన జయద్రథుడు సైన్య, సామంతులతో వివాహ దర్శన నిమిత్తము శాల్వదేశమునకు కామ్యక వనముగుండా వెడలుచూ ఆశ్రమ ద్వారము చెంత నిలుచొనియున్న ద్రౌపది అపురూప సౌందర్యము గాంచి, మోహితుడై, తన గృహమునకు కొనిపోవ దలంచి, కోటికాస్యుని ఆమె యెవరో తెలుసుకొని రమ్మని పంపెను.

## 264.

కోటికాస్యుడు ఆమెను సమీపించి, "ఓ నారీరత్నమా! నేను సురథుడను రాజు కుమారుడను. నా పేరు కోటికాస్యుడు" అని అచ్చట రథమున నిలచియున్న రాజుల పేర్లు తెలిపి, "సుకేశీ! నీవెవరి భార్యవు? యెవరి కుమార్తెవు? దయచేసి తెలుపుము" అని పలికెను.

## 265.

అంత ద్రౌపది, "రాజా! నీతో ఇట్లు మాటలాడుట రూదృశ స్త్రీలకు ఉచితము కాదు. నా భర్తలుగాని, ఇంకెవ్వరూ కూడా ఆశ్రమమున లేరు. కాని నీవు నా బంధువర్గములోని వాడవని మాటలాడుచున్నాను. నేను ద్రుపదరాజు కుమార్తెను. నా పేరు 'కృష్ణ'. యుధిష్ఠిరుడు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు నా భర్తలు. వారు ఇప్పుడు ఆహారసంగ్రహణార్థము వేటకు చనియున్నారు. వారు వచ్చు సమయమైనది. మీరు కొద్ది సమయము విశ్రమింపుడు. నా భర్తలు వచ్చి మీకు ఉచితరీతిని ఆతిథ్యమిచ్చెదరు" అని అతిథుల వలె పూజింప పర్ణశాల ప్రవేశించెను.

## 266.

కోటికాస్యుడు జయద్రథాదులతో ఆమె యెవ్వరో తెలిపి వెనుతిరుగుడనిన మోహపరవశుడైన జయద్రథుడు రథము దిగి ఆశ్రమము ప్రవేశించగా ద్రౌపది అతనికి ఆతిథ్యమివ్వబోయిన, కామాతురుడైన ఆ రాజు, "పాండవులు రాజ్య భ్రష్టులు, శ్రీభ్రష్టులు అయి ఉన్నారు. నన్ను వరింపుము. వారిని పరిత్యజింపుము. సింధుదేశమున నా అంతఃపురమందు స్వర్గసుఖములు అనుభవించుచూ సుఖముగా నుండుము" అని పలికిన ద్రౌపది భర్తలకై యెదురు చూచుచూ అతనిని యెన్నో విధముల భయపించి నివారింప ప్రయత్నించెను.

## 267.

మదోన్మత్తుడైన జయద్రథుడు ఆశ్రమమునకు తిరిగి వచ్చిన ధౌమ్య పురోహితుని ప్రక్కకు నెట్టివైచి ద్రౌపదిని బలాత్కారముగా రథమున నిడి బయలు దేరగా, ధౌమ్యుడు, "పాపాత్ముడా! పాండవులను జయింపక ఈమెను నీవు యెన్నడూ తీసుకొని పోజాలవు. యెందులకిట్టి దుష్కృత్యము ఆచరించుచుంటివి? క్షత్రియ ధర్మము వీడుట తగదు. అచిరకాలములోనే నీవు చేయు పాపమునకు

తగిన ఫలితమును యుధిష్ఠిరాదుల వలన తప్పక పొందెదవు” అని పదాతి సైన్యము మధ్య ద్రుపదనందనిని అనుసరించసాగెను.

## 268.

మృగములను వేటాడుచూ పాండవులందరూ ఒకచోట కలసుకొనిరి. ఆ సమయమున కామ్యకవనమున పశుపక్షుల దీనరవములను, అశుభ సూచనలు గమనించి యుధిష్ఠిరుడు తమ్ములతో తనకు ఆందోళనముగా నున్నదని వారితో త్వరితముగా ఆశ్రమము చేరి, ద్రౌపది పరిచారిక వలన సంగతి తెలుసుకొని వెంటనే వివిధ శస్త్రములు ధరించి, రథారూఢులై జయద్రథుడు చనిన వైపు త్వరితముగా చని, కొంతసేపటికి అతని సైన్యమును రథముపై జయద్రథునితో ద్రౌపదిని గాంచిరి.

## 269.

తమ దిశగా వచ్చుచున్న పాండవుల రథములను చూచి జయద్రథుడు “పాంచాలీ, నీ కొరకై నీ పతులు ఐదుగురూ వచ్చుచున్నట్లున్నది. యెవ్వరెవ్వరో తెలుపుము” అనిన ద్రౌపది, “మూఢుడా! నీవనిన ఇక నాకెంతమాత్రమూ భయము లేదు. పాండవుల సమక్షము నుండి నీవు ఇక ప్రాణములతో బయటపడవు. అయినను ధర్మానుసారము నీకు వారిని తెలియజేసెదను.

ధ్వజాగ్రమున నంద, ఉపనందులను మృదంగములు ఉన్నవాడు, బంగారు వన్నెవాడు, యెత్తైన నాసిక కలవాడు యుధిష్ఠిరుడు. పాండవాగ్రజుడు. నీకు ఇంకా ప్రాణములపై ఆశయుండిన అతని శరణు వేడుము.

శాలవృక్షము వలె పొడవైనవాడు, ఆజానులంబిత బాహువులు కలవాడు, కుంచించిన భ్రూద్వయముతో, పదే పదే పెదిమలు కొరుకుచున్నవాడు భీముడు. అతనితో శత్రుత్వము పొంది బయటపడినవాడెవ్వడూ లేడు.

కపిధ్వజము కలవాడు అర్జునుడు. మహాధనుర్ధరుడు. మహాయోధుడు. అతని ప్రక్కనున్నది మహావీరుడైన నకులుడు. ఖడ్గయుద్ధమున సిద్ధహస్తుడు.

సూర్యసమాన తేజోనుతుడు, సహదేవుడు. మహాధార్మికుడు. అన్నల మాట జవదాటడు. కుంతీదేవికి ప్రియపాత్రుడు.

నీవు మోహపరవశుడవై వారిని అవమానించితివి. దానికి తగిన ప్రతిఫలము ఇప్పుడే పొందెదవు” అని సింధుదేశాధీశుని హెచ్చరించెను.

భయముతో చేతులు జోడించిన పదాతులను వదలి మిగిలిన యోధులపై పాండవులు శరవర్షము కురిపింపసాగిరి.

## 270.

జయద్రధుడు మంత్రిసామంతులను, తోటి రాజులను, సైన్యమును ఉత్సాహపరచుచూ యుద్ధము చేయసాగెను. భీముడు గదతో మోది శత్రు సైన్యమును సాక్షాత్తు యముని వలె యమసదనమునకు పంపసాగెను. అర్జునుడు తీవ్రశరముల శత్రువుల శిరస్సులను బంతుల వలె తెగవేయదొడంగెను. యుధిష్ఠిరుడు శతసంఖ్యాక సువీరదేశీయులను సంహరించెను. నకులుడు ఖడ్గధారియై శత్రుసంహారము చేయసాగెను. సహదేవుడు వాడి శరములతో గజారూఢులను భూతలముపై పడవేయదొడంగెను.

ధనుర్ధరుడైన త్రిగర్తుడు గదతో యుధిష్ఠిరుని గుఱ్ఱములను మోది చంపిన, అతడు బాణఘాతమున నిపీడుని చేయ రక్తము కక్కుకొని నరికిన వృక్షము వలె నేలకూలెను. ధర్మజుడు అశ్వహీన రథమును వదిలి సహదేవుని రథము అధిరోహించెను.

నకులుడు సురధుడను రాజును సంహరించి, భీముని రథము యెక్కెను.

భీముడు కోటికాస్యుని సారథిని గదతో మోది సంహరింప అశ్వములు భీతితో రథము లాగుకొని పారిపోయెను. భీముడు అనేకులైన శిబి, ఇక్ష్వాకు, త్రిగర్త, సింధుదేశ వీరులను సంహరించెను. పాండవుల తేజము సహింపలేక సైనికులు నలువైపులా పారిపోసాగిరి.

తన సైన్యముల పరిస్థితి చూచి జయద్రధుడు భీతుడై ద్రౌపదిని వదిలి త్వరితముగా రథము నడుపుకొని పారిపోసాగెను.

ధర్మరాజు ధౌమ్యునితో నున్న పాంచాలిని చూచి వారిని తన రథముపై యెక్కించుకొనెను.

జయద్రధుడు యుద్ధరంగము వీడి పారిపోవుట చూచి, అర్జునుడు, సైన్య సంహారము చేయుచున్న భీముని ఆపి, యుధిష్ఠిరాదులను సమీపించి, "మహారాజా! శత్రువులు నిశ్శేషితులగుచున్నారు. మిగిలినవారు పారిపోవుచున్నారు. కావున మీరు నకుల సహదేవులతోను, ధౌమ్యునితోను ద్రౌపదిని తీసుకొని ఆశ్రమమునకు మరలుడు. దురాత్ముడైన జయద్రధుడు పాతాళమున ప్రవేశించినను వధింతుము.

ఇందు సందేహము లేదు” అనిన యుధిష్ఠిరుడు, “మహావీరా! నరాధముడైన జయద్రధుడు దుష్కర్మము ఆచరించాడు. ఇందు సందేహము లేదు. కాని చెల్లెలు దుశ్శల, పెద్దమ్మ గాంధారిని తలచుకొని అతనిని చంపకపోవుటయే ఉచితము” అని పలికెను.

సిగ్గుతో తలవాల్చుకొనియున్న ద్రౌపది, భీమార్జునులతో, “ఓ వీరులారా! రాజ్యమును, భార్యను అపహరించినవారిని క్షమింపరాదు. ఆ అధముని సంహరించి రండు” అని పలికెను.

భీమార్జునులు జయద్రధుడు పారిపోయిన దిక్కుగా రథములను త్వరితముగా నడిపి చనిన అనంతరము మహారాజు యుధిష్ఠిరుడు, నకుల, సహదేవ, ధౌమ్యులతో కృష్ణను తీసుకొని ఆశ్రమమునకు మరలి చింతాన్వితులై ఉన్న మార్కండేయాది మునులకు హర్షము చేకూర్చెను.

ఇక్కడ భీముడు, అర్జునుడు రథముపై మహావేగమున పారిపోవుచున్న జయద్రధుని గాంచిరి. అంత అర్జునుడు మంత్రపూత శరములను వదలి జయద్రధుని రథాశ్వములను చంపగా అతడు మహాభయమున రథము దిగి అడవిలోనికి పారిపోసాగెను.

రథముపై అచ్చటకు సమీపించిన అర్జునుడు జయద్రధుని ఉద్దేశించి, “రాజపుత్రా! ఈ సాహసము, బలముతోనేనా నీవు కన్యాహరణమునకు సిద్ధ పడితివి? తాళుము! ఈ విధముగా పలాయనము కావించుట క్షత్రియ లక్షణము కాదు” అనినను, ప్రాణభయమున సిగ్గును వదలిన జయద్రధుడు ఆగలేదు. అది గమనించిన భీమసేనుడు రథము దిగి ఆ దురాత్ముని దెస అతిత్వరితముగా చనెను.

ద్రౌపదీహరణ పర్వాధ్యాయ సమాప్తి.

## 271. జయద్రధ విమోక్షణ పర్వాధ్యాయము

భీముడు త్వరితముగా జయద్రధుని చేరి అతని జటాజూటములను గ్రహించి అనవరతము ప్రహారము చేయసాగెను. నేలకూలబడిన జయద్రధుని గుండెలపై కూర్చొని బీముడు వజ్రముష్టితో ఆఘాతము చేయదొడంగిన అతడు కరుణ స్వరముతో విలపించుచూ మూర్ఛితుడయ్యెను.

అర్జునుడు అది గమనించి, వృకోదరుని ఆపుచూ “భీమా! దుశ్శల విషయము జ్ఞాపకముంచుకొమ్మనిన అన్న మాటను వ్యర్థము చేయకుము” అని

శాంతింపజేసెను. అంత భీమసేనుడు, "ఈ పాపాత్ముడు ద్రౌపదికి దుఃఖము చేకూర్చాడు. ఈతనిని నేను తప్పక వధించెడివాడను. కాని అన్న మాటను జవదాటను" అని అర్థచంద్రబాణముతో జయద్రధుని మస్తకమున ఐదు స్థానముల ముండనము గావించి పంచచూడుని గావించెను.

అనంతరము వాయునందనుడు తీవ్రస్వరమున "ఓరీ మూఢుడా! నీవు జీవితమందే ఆశయున్న, సభలో అందరిముందు మా దాసుడవని అంగీకరించవలెను. యుద్ధమున ఓడిన శత్రువును ఇట్లు చూచుట చిరప్రసిద్ధము" అనిన జయద్రధుడు అంగీకరించెను.

భీమార్జునులు జయద్రధుని బందించి ఆశ్రమమునకు తిరిగి వచ్చి, అన్న పాదముల ముందు అతనిని పడవైచి, "మహారాజా! ఇతడు దాసత్వమును స్వీకరించాడు. ఇక ఇతని విషయము మీరు, ద్రౌపది నిర్ణయింపుడు" అనిన యుధిష్ఠిరుడు, "నా మాటలు మన్నించినవాడివైన ఈతనిని బంధవిముక్తుని కావింపుము" అనెను.

ద్రౌపది యుధిష్ఠిరుని అభిప్రాయము తెలుసుకొని, భీమునితో, "ఈ దురాచారుడు మీ దాసత్వమును ఒప్పుకున్నాడు. నీవు ఈతనిని ముండసము గావించి పంచచూడుని చేసితివి. కావున వెంటనే ఇతనికి ముక్తిని ప్రసాదింపుము" అని పలికెను.

జయద్రధుడు బంధవిముక్తుడైన పిమ్మట ధర్మరాజు, "నరాధమా! నిన్ను దాసత్వమునుంచి విముక్తుడను కావించుచున్నాను. ఇటువంటి గర్హిత కార్యములెననడూ ఆచరింపకుము. నీవు క్షుద్రుడవు. క్షుద్రాశయుడవు. ఇట్టి నీచపు బ్రతుకు బ్రతుకుటేల?" అని కోపము తగ్గించుకొని, "నీ రథ, గజ, తురగాదులతో స్వదేశమునకు చనుము. ఇక ఇటువంటి అధర్మాచరణములను కావింపకుము. భగవంతుడు నీకు సద్బుద్ధినిచ్చుగాక!" అని అతనిని పంపివేసెను.

అనంతరము జయద్రధుడు సిగ్గుతో, విషాదమనస్కుడై గంగా ద్వారమునకు జని భగవానుడు శంకరుని మనస్సున నిలుపుకొని కఠోరమైన తపస్సు గావించి, అతని దయ సంపాదింప, భవానీపతి ప్రత్యక్షమై వరము కోరుకొమ్మనెను.

జయద్రధుడు "దేవదేవా! పంచపాండవులను నేను జయించునట్లు వరమిమ్ము" అని కోరగా శంకరుడు "వత్సా! అర్జునుడు నరనారాయణులలో నరాంశసంభూతుడు. అతనిని సామాన్యులు జయింపజాలరు. కావున అర్జునుడు

తప్ప మిగిలినవారిని ఒక దినము జయింప వరమిచ్చుచున్నాను” అని తెలిపి అంతర్హితుడయ్యెను.

జయద్రధ విమోక్షణ పర్వాధ్యాయ సమాప్తి

## 272. రామోపాఖ్యాన పర్వాధ్యాయము

వైశంపాయనుడు ఇట్లు చెప్పదొడంగెను, “జనమేజయ మహారాజా! జయద్రధుని వద్దనుంచి ద్రౌపదిని రక్షించి తిరిగి వచ్చిన పాండవులు ఒకనాడు, మార్కండేయాది మహర్షులతో కూడియున్న సమయమున, యుధిష్ఠిరుడు మార్కండేయ మహర్షితో, “మునివరా! విధి మాకు యెట్లు విపరీతముగా నున్నదో గమనించితిరా! లేకపోయిన అయోనిజ, వేదిమధ్య సంభూత, పాండురాజు పుత్రవధువు, మా సహధర్మిణియైన ద్రుపదనందనికి ఇట్టి దురవస్థ యేల? ఆమె యెన్నడూ పాపము కాని, నిందనీయమైన పని చేయలేదే! పాపాత్ముడైన జయద్రధునిచే బలపూర్వకముగా అపహరింపబడినది. భాగ్యవశమున ఆమెను రక్షింపు కొనగలిగితిమి.

బ్రాహ్మణశ్రేష్ఠా! మీరు త్రికాలజ్ఞులు. మీకు తెలియనిదేమియూ లేదు. మీరు యెన్నడైనా మావంటి హతభాగ్యులను చూచుటగాని, వినుటగాని జరిగినదా? దయచేసి నా అనుమానము తీర్చుడు” అని పలుకగా మార్కండేయ మహర్షి ఇట్లు చెప్పసాగెను.

## 273. శ్రీరామచరిత్ర

“ధర్మరాజా! పూర్వము మహాబలపరాక్రాంతుడయిన రావణుడు ఆశ్రమము నుంచి జానకిని హరించి, మార్గమున జటాయువును చంపి లంకకు పోగా, శ్రీరాముడు సీతను కానక నీకన్నా యెక్కువ దుఃఖమును పొందెను. పిదప సుగ్రీవుని సహాయమున వానరులతో సేతుబంధనము గావించి దశాననుని సంహరించి జానకిని రక్షించుకొనెను. ఆ చరిత్ర విపులముగా చెప్పెదను. సావధానుడవై వినుము.

రావణుని తాత ప్రజాపతి. ప్రజాపతి మానసపుత్రుడు పులస్త్యుడు. పులస్త్యుని కుమారుడు వైశ్రవణుడు. వైశ్రవణుడు తండ్రిని పరిత్యజించి పితామహుని చేరుటచే పులస్త్యుడు కోపించి దేహము త్యజించి, కుమారునిపై ప్రతీకారము తీర్చుకొనుటకు విశ్రవుడను పేర ద్విజ కులమున జన్మించెను.

వైశ్రవణుడు పితామహుని దయచే అమరత్వము, ధనము, లోకపాలత్వము పొంది కుబేరుడయ్యెను. అతని కుమారుడు నలకూబరుడు. మహాదేవునితో సఖ్యత పొంది, రాక్షసగణ పరిపూర్ణమైన లంకను, పుష్పక విమానమును పొంది యక్షగణ పరివృతుడై రాజ్యము చేయసాగెను.

## 274.

కుబేరుడు తండ్రి కోపమునకు భయపడి శాంతింపజేయుటకు పుష్పోత్కట, రాకా, మాలిని అను ముగ్గురు రాక్షసకాంతలను అతని సేవలకై నియోగించెను. విశ్రవుడు వారి సేవా శుశ్రూషలకు సంతసించి లోకపాలకులైన కుమారులను, కుమార్తెలను ప్రసాదించెను. పుష్పోత్కటకు రావణ కుంభకర్ణులు, మాలినికి విభీషణుడు, రాకకు ఖరుడను కుమారుడు, శూర్పణఖ యను కుమార్తె జన్మించిరి. వీరిలో విభీషణుడు రూపవంతుడు, ధార్మికుడు, సత్కర్మ నిరతుడు. సర్వజ్యేష్టుడైన రావణుడు మహాబలపరాక్రాంతుడు, ఉత్సాహశీలుడు. కుంభకర్ణుడు అందరికన్నా బలవంతుడు, మాయావి, సంగ్రామనిపుణుడు. ఖరుడు బ్రహ్మద్వేషి, మాంస లోలుపుడు, మహాధనుర్ధరుడు. శూర్పణఖ యెల్లవేళలా సిద్ధులకు విఘ్నములు కావించి భయపించెడిది. రావణాదులందరూ మహాబలవంతులు, వేదవేత్తలు, వ్రతచారులు. వీరు తండ్రి ఆజ్ఞప్రకారము గంధమాదన పర్వతముపై నివసించు చుండిరి.

కుబేరుని వైభవము గాంచి ఈర్ష్యాపరవశుడై రావణాదులు బ్రహ్మకొరకై ఘోరమైన తపస్సు కావించిరి. పంచాగ్నుల మధ్య నుండియు, వాయువు మాత్రమే భక్షించియూ అతడు తపస్సు చేయసాగెను. కుంభకర్ణుడు అధఃశ్శిరుడై తపస్సు కావించెను. విభీషణుడు పత్రములను మాత్రమే భక్షించి తపస్సు చేసెను. ఖరుడు, శూర్పణఖ రావణాదులకు తపోనుష్టాన కాలమున పరిచర్యలు చేయుచుండిరి. ఇట్లు రావణాదులు వేయి సంవత్సరములు తపస్సు చేసిన తరువాత దుర్ధర్షుడైన రావణుడు తన మస్తక ఛేదనము గావించి అగ్నిలో ఆహుతి గావించెను.

అంత బ్రహ్మ వారికి ప్రత్యక్షమై "మీయందు ప్రసన్నుడనైతిని. అమరత్వము తప్ప కోరిన వరము లడుగుడు. రావణా! నీవు మస్తక చ్ఛేదనము కావించి ఆహుతి చేసితివి కావున నీకు కావలసినన్ని శిరములుద్భవించును. నీవు కామరూపివి, శత్రుభీకరుడవు అగుదువు" అనెను.

రావణుడు, "ప్రభో! దేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షస, సర్ప, కిన్నర,

భూతగణములను జయించు వరమిమ్ము" అని కోరిన బ్రహ్మ మనుష్యాది ప్రాణులు తప్ప మిగిలిన నీవు కోరినవారి వలన యెట్టి భయమును పొందవు. వారిని అనాయాసముగా జయింతువు" అని వరమిచ్చెను. నరమాంసభక్షకుడైన రావణుడు మనుష్యులను తుచ్ఛులుగా తలంచి బ్రహ్మవాక్యములకు సంతసించెను.

కుంభకర్ణుడు 'నిర్దయ' కోరబోయి 'నిద్ర'ను వరముగా పొందెను.

విభీషణుడు, "తన మనస్సు ధర్మము తప్పకుండా ఉండునట్లు వరమిమ్మనిన బ్రహ్మ, "వత్సా! రాక్షసయోనియందు జన్మించియూ అధర్మబుద్ధిని పరిత్యజించిన నీవు అమరుడవు కమ్ము" అని అమరత్వము ప్రసాదించెను.

మహావీరుడైన దశాననుడు బ్రహ్మవద్ద వరములు పొంది కుబేరుని సంగ్రామమున ఓడించి, రాజ్యచ్యుతుని కావించి, లంకాధిపతి అయ్యెను. ధనేశ్వరుడు లంకను పరిత్యజించి, యక్ష, రాక్షస, గంధర్వ, కింపురుషాదులతో గంధమాదన పర్వతమునకు చనెను. రావణుడు బలపూర్వకముగా అతని పుష్పక విమానమును హరింప కుబేరుడు క్రోధముతో "దుర్మార్గుడా! నీకు యెన్నడూ పుష్పకము వాహనము కాదు. నిన్ను యుద్ధమున జయించు మహావీరునకే ఇది వాహనమగును. నేను నీ అన్నను. గురుతుల్యుడను. అయినను నన్ను నీవు అవమానించితివి. ఈ అపరాధమునకు త్వరలోనే యమసదనము చనెదవు" అని శపించెను.

కుబేరుడు విభీషణుని యెడ తృప్తుడై యక్ష రాక్షస సైన్యములకు అధిపతిని గావించెను.

రావణుడు కామరూపియై దేవ, దైత్యగణములను ఓడించి వారి ఐశ్వర్యము హరించి, లంకను సుఖముగా రాజ్యము చేయసాగెను.

## 275.

రావణుని బాధలకు సహింపజాలక దేవతలు బ్రహ్మను శరణు వేడిరి. బ్రహ్మ ఆదేశమున దేవతలు వానరులై జన్మించిరి. దుందుభి అను గంధర్వకన్య మంథరగా జన్మించెను.

## 276.

ఇక్ష్వాకు వంశమున దశరథుడను రాజునకు ముగ్గురు భార్యలు. కైకేయి, సుమిత్ర, కౌసల్య. రావణ సంహార నిమిత్తము కమల యోని దశరథునకు

జన్మించెను. కౌసల్యకు రాముడు, కైకేయికి, సుమిత్రకు భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు కలిగిరి.

రాముడు ఆజానుబాహుడు, నీలకుంచిత కేశకలాపుడు. విశాల వక్షస్థలుడు. అతడు సర్వశాస్త్ర విశారదుడు, సర్వధర్మవేత్త, ధర్మరక్షకుడు, బృహస్పతితో సమాన మైన బుద్ధిబలము కలవాడు. అతనిని చూచి దశరథుడు పరమ ప్రీతుడయ్యేవాడు.

విదేహరాజు కన్య జానకిని రాముడు ధనుర్భంగము గావించి వివాహ మాడెను.

వృద్ధాప్యము సమీపించినందున దశరథుడు మంత్రిసామంతులను పిలచి, రాముని యువరాజు పట్టాభిషేకమునకు ముహూర్తము నిశ్చయించెను.

ఈ వార్త తెలుసుకొన్న మంధర కైకేయిని సమీపించి, ''నీవు దురదృష్టవంతురాలవు. రాముడు రాజైన కౌసల్య రాజమాతయగును. కావున నీ మంచి జరుగు ఉపాయము ఆలోచింపుము" అని ఆమెను ప్రేరేపించెను.

కైకేయి మంచి వస్త్రములను, ఆభరణములను త్యజించి కోపగృహము చేరగా రాజు ఆమెను చేరెను. అప్పుడు కైక, "మహారాజా! నీవు నాకిచ్చిన వరముల ప్రకారము, నా కుమారుడైన భరతుని రాజ్యాభిషిక్తుని చేయుము. రాముని పదునాల్గు సంవత్సరములు అడవులకు పంపుము" అని కోరగా దశరథుడు విచారముతో మిన్నకుండెను.

ఈ వార్త తెలుసుకొన్న దాశరథి పితృవాక్య పరిపాలనార్థము వనములకు చనెను. అతనిని సీత, లక్ష్మణుడు అనుసరించిరి. పుత్రవిరహమున దశరథుడు కాతరుడై కళేబరము పరిత్యజించెను.

అయోధ్యకు తిరిగి వచ్చిన భరతుడు సంగతి తెలుసుకొని, మిక్కిలి విచారించి అన్నను తిరిగి తెచ్చుటకు చిత్రకూటమునకు చనెను. తండ్రి మాట జవదాటరాదని రాముడు పాదుకలను ఇచ్చి భరతుని పంపగా అతడు నందిగ్రామమున సింహాసనముపై రాముని పాదుకలుంచి, రాజ్యము చేయసాగెను.

లోకుల రాకకు శంకించి రాముడు దక్షిణ దిశగా పయనించి దండ కారణ్యమున గోదావరీ నదీతీరమున పర్ణశాలను నిర్మించుకొని నివసింపసాగెను.

తాపసులను రక్షించుటకు రాముడు ఖర, దూషణులను సహస్రాధికులైన రాక్షసులను సంహరించెను.

రామ, లక్ష్మణులచే తిరస్కరింపబడి, జానకిని భయపించబోయి ఛిన్ననాస, ఛిన్నోష్ఠి అయిన శూర్పణఖ అన్న రావణుని చేరి తన దుర్దశ యెరిగించెను.

## 277.

రావణుని ఆదేశమున మారీచుడు బంగారుజింకయై ఆశ్రమ సమీపమున చరించుచుండ సీత దానిని చూచి రామునితో దానిని తెమ్మని వేడెను. సీతకు ఆనందము చేకూర్చుటకు రాముడు ధనుర్బాణములు గ్రహించి జింక వెంట చనెను. చాలాదూరము చనిన పిదప రాముడు జింకపై బాణము వేయగా, మాయావియైన మారీచుడు మరణించుచూ, "హా సీతా! హా లక్ష్మణా" అని కేకవైచెను.

ఆ కేకలను విని సీత రాముని ఆక్రందనమని భ్రమించి లక్ష్మణుని పంపెను.

ఆ సమయమున రావణుడు ముని వేషమున ఆశ్రమమును సమీపించి, సీతను రథమున నిడుకొని లంకకు బయలుదేరెను.

## 278.

'హా రామా! హా లక్ష్మణా!' అని సీత రోదించుచుండ ఆ రోదనము విన్న జటాయువను పక్షిరాజు సహాయపడ వచ్చెను. జటాయువు తన స్నేహితుడైన దశరథుని పుత్రవధువును అపహరించు రావణునితో యుద్ధమునకు తలపడెను. క్రూరాత్ముడైన రావణుడు జటాయువు వలన ఆహతుడై చివరకు ఖడ్గముతో రెక్కలను ఖండింపగా, జటాయువు నేల కూలెను.

రావణుడు త్వరితముగా లంకా నగరమును ప్రవేశించెను.

ఇక్కడ రాముడు మృగరూప మారీచుని సంహరించి, రాక్షస మాయకు వెరచుచూ దారిలో లక్ష్మణుని చూచిన అతడు తనను సీత పంపిన సంగతి తెలియజేసెను. అన్నదమ్ములు పర్ణశాలను చేరి సీతను కానరైరి.

వారు అందందు వెదుకుచూ రెక్కలు తెగి పడియన్న జటాయువును సమీపింప అతడు "వత్సా! నీకు శుభము కలుగుగాక! నేను నీ తండ్రి దశరథుని స్నేహితుడను. నా పేరు జటాయువు. నీ భార్య సీతను రక్షించబోగా రావణుడు నన్నిట్లు గావించెను" అని పలికిన రాముడు యే దిశగా సీతను రావణుడు తీసుకొనిపోయెననగా దక్షిణ దిశ చూపి జటాయువు ప్రాణములు విడిచెను. రాముడు జటాయువు అంత్యేష్టి క్రియలు గావించెను.

అరణ్యమార్గమున ప్రయాణము చేయుచున్న రామలక్ష్మణులను రెండు బాహువులతోను కబంధుడను రాక్షసుడు బంధించి కబళించబోవ ఆ శూరా గ్రేసరులు వాని బాహువులు ఖండించి విముక్తులైరి. తేజస్వియైన దివ్య పురుషుడు కబంధుని శరీరమునుండి వెడలి ఆశ్చర్యముగా చూచుచున్న రామచంద్రునితో "రాజనందనా! నేను గంధర్వుడను. నా పేరు విశ్వావసువు. బ్రాహ్మణ శాపమున రాక్షసునిగా జన్మించితిని. మహాత్మా! లంకాధిపతియైన రావణుడు సీతను అపహరించెను. మీరు సుగ్రీవుని వద్దకు చనుడు. అతడు ఇక్కడకు దగ్గరనున్న ఋష్యమూక పర్వతముపై నున్నాడు. అతడు మీవలెనే భార్యా వియోగమున బాధపడుచున్నాడు. మీరు తప్పక జానకిని తిరిగి పొందెదరు" అని పలికి నమస్కరించి అంతర్హితుడయ్యెను.

## 279.

పంపా సరోవర తీరమున రాముడు జానకికై మిక్కిలి దుఃఖించుచుండ లక్ష్మణుడు అతనిని బహువిధముల ఓదార్చెను. వారిని పర్వతము నుండి కాంచిన సుగ్రీవుడు, సంగతి తెలుసుకొని రమ్మని మంత్రియైన హనుమంతుని పంపించెను.

హనుమంతుడు రామలక్ష్మణులకు తన పరిచయము తెలిపి వారి సంగతి తెలుసుకొని, సుగ్రీవునితో సఖ్యత చేకూర్చెను.

సుగ్రీవునికి మేలు చేకూర్చ రాముడు అతని అన్న వాలిని సంహరింప, సుగ్రీవుడు కిష్కింధకు రాజయ్యెను. సుగ్రీవుని వలన పూజింపబడి రాముడు మాల్యవంత పర్వతమున నాలుగు నెలలు గడిపెను. ఇక్కడ లంకానగరమున అశోకవనమున, రావణుని ధిక్కరించి జానకి రామనామస్మరణ జేయుచూ రాక్షస స్త్రీల మధ్య నుండెను.

ఒకనాడు త్రిజట అను రాక్షసి తాను కలలో రావణుని మృతి, రాముడు లంకకు వచ్చి సీతను రక్షించుట తెలియజేసి జానకికి ఆనందము చేకూర్చెను.

## 280.

ఒకనాడు రావణుడు సీతవద్దకు చని, తన ఐశ్వర్యమును చూపి వివాహము చేసుకొమ్మని ప్రార్థించెను. పతిపరాయణయైన సీత రాముని మహిమ తెలిపి అతనిని శరణు వేడుమనెను.

## 281.

తమ కార్యమునెడ ఉపేక్ష వహించుచున్నాడని రాముని వలన ప్రేరితుడైన లక్ష్మణుడు కిష్కింధకు చన, సుగ్రీవుడు నమస్కరించి, “సౌమిత్రా! నేను మీ సహాయము పొంది మిన్నకుండలేదు. నలుదిక్కుల వానర సైన్యములను సీత జాడ నెరుంగ పంపితిని. ఉత్తరము, తూర్పు, పడమరల నుంచి నా అనుచరులు తిరిగి వచ్చిరి. ఇంకా దక్షిణమునకు వెడలిన, హనుమంత, అంగద, జాంబవంతాదులు మరల లేదు” అని పలుక కొందరు అనుచరులు సుగ్రీవుని సన్నిధికి వచ్చి, హనుమంతాదులు మధువనము ప్రవేశించి ఫలములు భక్షించుచున్నారని తెలుపగా, సుగ్రీవుడు వారు తప్పక కార్యసాఫల్యము పొందియుందురని తలంచెను.

అనంతరము రామలక్ష్మణులు, సుగ్రీవాదులు కూడియుండగా హనుమంతుడచ్చటకు చని, “రామా! మీకు ప్రియము చేకూర్చు వచనములు తెలుపుచున్నాను. నేను నీ జానకిని చూచితిని. ఆమె కుశలముగా నున్నది. మేమందరమూ దక్షిణ దిక్కుగా పయనించి జటాయువు సోదరుడైన సంపాతి వలన రావణుడు సీతను లంకానగరమునకు కొనిపోయినట్లుగా యెరింగితిమి. నేను సముద్రము దాటి లంకానగరమున అశోకవనములో మాత జానకిని గాంచి తమ క్షేమసమాచారము యెరిగించితిని. ఆమె తమకివ్వమని ఇచ్చిన మణిని గ్రహింపుడు” అని తాను తీసుకొనివచ్చిన శిరోచూడామణి రామునకు అర్పించి, ఆనందము చేకూర్చెను.

## 282.

అనంతరము సుగ్రీవుడు వానరసైన్యము సిద్ధపరుప రామలక్ష్మణులు సైన్యసముదాయముతో ఒక శుభముహూర్తమున బయలుదేరి దక్షిణ దిశగా పయనించుచూ సాగరతీరమును చేరిరి.

రాముడు జలధిని దాటుటకు రత్నాకరుని జలశూన్యము చేయదలంచగా అతడు రాముని చేరి, “రామా! నాపై కోపింపకుము. నన్ను శోషింపజేసిన, ప్రపంచమే నాశనమగును. నీకు నేను దారి ఇచ్చిన ఇతరులు కూడా నన్ను భయపెడుదురు. నీ సైన్యములో విశ్వకర్మ ఆత్మజుడైన నీలుడనువాడు కలడు. అతడు నాపై వైచిన శిలకాష్టాదులను ధరించి, సేతు నిర్మాణమునకు సహాయుడనగుదును” అని ప్రార్థింప రాముడు సంతసించెను.

కొద్దికాలములోనే వానరులు నీలుని సహాయమున జలనిధిపై సేతు బంధనము కావించిరి. ఆ సమయమున రావణునిచే అవమానింపబడిన ఆతని తమ్ముడు విభీషణుడు రాముని శరణుజొచ్చెను.

## 283.

రాముడు సైన్యసమేతుడై లంకానగరము ప్రవేశించి, రాజధర్మము ప్రకారము అంగదుని రావణుని వద్దకు దూతగా పంపెను. అంగదుడు, రాముని మాటలుగా రావణునితో, "రాజా! నీవు బలపూర్వకముగా నా భార్యను కొనివచ్చుటయే కాక, లోకకంటకమైన అనేక దుష్కార్యములను ఆచరించితివి. కావున రణమందు నిన్ను సబాంధవముగా యమసదనమునకు పంపెదను. సిద్ధము కమ్ము" అని తెలుపగా రావణుడు అంగదుని బంధించ ప్రయత్నించి విఫలుడయ్యెను.

## 284.

అనంతరము పూర్వము దేవాసురుల యుద్ధము జరిగినట్లు రామరావణ యుద్ధము ఆరంభమయ్యెను. ఆ సంగ్రామము భీరువులకు భయవృద్ధి, లోమర్షణము గావించెను. రామ, రావణులు శక్తి, శూలాది బహు అస్త్రశస్త్రాదులతో యుద్ధము కావింపదొడంగిరి. లక్ష్మణుడు ఇంద్రజిత్తు తీవ్ర నాయకములతో యుద్ధము కావించిరి.

## 285-286.

ఆ యుద్ధమున రావణుని ప్రహస్తాది సేనాధిపతులు అనంతరము, కుంభకర్ణుడు మృతులైరి.

## 287.

కుంభకర్ణుడు మరణించిన వార్త తెలుసుకున్న రాక్షసరాజు రావణుడు, కుమారుడైన ఇంద్రజిత్తును పిలచి, "వత్సా! పూర్వము దేవతలకు రాజైన ఇంద్రుని ఓడించి నాకు యశము చేకూర్చితివి. ఇపుడు నీ వీరత్వము ప్రదర్శించు సమయ మాసన్నమైనది. కుంభకర్ణుడు, ప్రహస్తుడు శత్రువులను యేమియూ చేయలేక పోవుటచే వారి వలన ప్రాణములు కోల్పోయిరి. నీవు ఆ మానవాధములను నాశనము చేతువని ఆశించుచున్నాను. ఆనాడు వాసవుని మదమణచినట్లు నేడు నీ ప్రకాశమును చూపుము" అని మేఘనాధునితో పలుకగా అతడు తండ్రికి

నమస్కరించి, అస్త్రశస్త్రములను ధరించి, సైన్యసమేతుడై యుద్ధరంగమును చేరి, లక్ష్మణుని యుద్ధమునకు ఆహ్వానించి, ఘోరమైన యుద్ధము చేసెను. అతడు మాయా యుద్ధమున రామలక్ష్మణులను తీవ్రశరములతో శరీరము నింప వారు మూర్ఛిల్లిరి.

## 288.

అంత సుషేణుడు రామలక్ష్మణులను చేరి వారి శరీరమున నున్న శరములను తీసి ఔషధులు వాడగా రామలక్ష్మణులు గతక్లేశులైరి.

ఆ సమయమున సుస్థులై ఉన్న రాముని వద్దకు విభీషణుడు వచ్చి, కమండలముతో ఉదకమిచ్చి, "రామచంద్రా! కైలాసపర్వతమునుండి కుబేరుని అనుచరుడు ఈ జలము తీసుకొని వచ్చెను. ఇది కన్నులకు రాసుకొన్న యెడల మాయతో అంతర్హితులగుచున్న రాక్షసులను చూడగలరు" అని పలికిన రాముడు, లక్ష్మణుడు తమ కన్నులను ఆ నీటితో కడుగుకొనిరి. సుగ్రీవుడు, జాంబవంతుడు, హనుమంతుడు, అంగదుడు, నీలుడు మొదలైన వానర ప్రముఖులునూ అట్లు కావించిన వారి కన్నులు అతీంద్రియములయ్యెను.

అనంతరము లక్ష్మణుడు మరల యుద్ధమునకు వచ్చిన ఇంద్రజిత్తును అమోఘమైన అస్త్రములు ప్రయోగించి సంహరించెను.

## 289.

ఇంద్రజిత్తు మరణ వార్త విని దశగ్రీవుడు అత్యంత కోపముతో రత్నాలంకృతమైన రథము నధిరోహించి యుద్ధమునకు బయలుదేరెను.

వానరులు రావణుని సేనలపై వృక్షములు, శిలలు విసరసాగిరి. రావణుడు మాయతో తన శరీరమునుండి యెందరో రాక్షసులను బయల్పరుప రాముడు దివ్యాస్త్రములతో వారిని సంహరించెను. రావణుని మరల మాయతో రాముని రూపమున లక్ష్మణునిపైనను, లక్ష్మణుని రూపమున రామునిపైనను రాక్షసులను ప్రేరేపించెను. లక్ష్మణుడు రావణుని మాయను పోల్చుకొని అన్నను హెచ్చరింపగా రాముడు రాక్షసులను యమసదనమునకు పంపెను.

అనంతరము రాముడు, దేవేంద్రుడు పంపిన రథము నధిరోహించి, మాతలి రథము నడుపుచుండగా రావణుని యెదుర్కొనెను. రామరావణుల యుద్ధము తీవ్రముగాను, భయంకరముగాను జరుగసాగెను. దానిని చూచుటకు దేవతలు

ఆకాశమున వచ్చిరి. వారు పటాహాది వాద్యములు వాయించి, సింహనాదము చేసియు రామునికి ఉత్సాహము పుట్టించిరి. రావణుడు ప్రయోగించిన భయంకరమైన శూలమును రాముడు సుతీక్ష్ణమైన బాణములతో ఛేదించెను. రావణుని వివిధ అస్త్రములనన్నిటినీ వ్యర్థము చేసి రాముడు బంగారు రెక్కలతో వాడిగానున్న బాణమును తూణీరమునుండి తీసి బ్రహ్మాస్త్ర మంత్రపూతముగా దానిని చేసి రామునిపై నిక్షేపము గావించెను. అంత భువన భయంకరమైన గర్జనతో ఆ అస్త్రము సారథి, రథ, అశ్వ సహితముగా రావణుని భస్మముగావించెను.

## 290.

రావణుని వధ గాంచి, లక్ష్మణుడు, వానరులు మిక్కిలి ఆనందించిరి. దేవతలు, ఋషులు రాముని స్తుతించి పూలవాన కురిపించిరి.

రాముడు విభీషణునకు లంకా రాజ్యమిచ్చెను. అనింద్యయను రాక్షసి జానకిని తోడ్కొని రాముని సమీపించి, సీతను గ్రహింపుమని వేడుకొనెను.

శత్రువు ఇంటిలో నివసించిన భార్యను శ్రీరాముడు గ్రహించుటకు అంగీకరింపకపోయిన, అగ్ని, వాయువు, వారుణుడు మొదలైన పంచభూతములు, బ్రహ్మ ఆమె పునీతయని, ఆమెను సందేహింపక గ్రహింపుమని అనిరి. ఆ సమయమున పితృదేవతలలోనున్న దశరథుడు, "నాయనా! రామచంద్రా! నీ అసమాన ధైర్య పరాక్రమములకు యెంతో సంతోషించితిని. నేను అనుజ్ఞ ఇచ్చుచున్నాను. జానకితో సుఖముగా రాజ్యము చేయుము" అనిన రాముడు తండ్రి మాటను అంగీకరించెను.

బ్రహ్మవరము కోరుకొమ్మనగా రాముడు మృతిచెందిన వానరులను పునర్జీవితులను చేయుమని వేడ, బ్రహ్మ వారినందరినీ నిద్రనుంచి లేచినట్లు బ్రతికించెను.

సీత హనుమంతునితో, "వత్సా! హనుమా! రాముని కీర్తి భువిలో ఉన్నంత కాలము నీవు జీవితుడవై ఉందువు. నా ప్రసాదమున యెల్లవేళలా నీకు మంచి భోజ్య వస్తువులు సమకూడును" అని వరమిచ్చెను.

రాముడు, సీత, లక్ష్మణుడు పుష్పకవిమానముపై సుగ్రీవాది వానరులతో అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడయ్యెను.

రాముడు దేవతల సహాయముతో గోమతీనదీ తీరమున పది అశ్వమేధ యజ్ఞములను చేసెను.

## 291.

ఇట్లు రామచంద్రుడు వనవాసము చేసి నీకన్నా పెక్కు ఇడుములు పడెను. కావున ధర్మరాజా! నీవు చింతించకుము. శోకము ధీరుల లక్షణము కాదు. త్వరలోనే నీవు తిరిగి రాజ్యమును పొందెదవు" అని మార్కండేయ మహర్షి బోధించెను.

రామోపాఖ్యాన పర్వాధ్యాయ సమాప్తి

## 292. పతివ్రతామహత్య పర్వాధ్యాయము

అనంతరము ధర్మరాజు మార్కండేయ మహర్షితో ద్రౌపది తమను ద్యూతక్రీడా సమయమున దాసత్వమును రక్షించుట మొదలైనవి తెలిపి, ద్రౌపది వంటి పతివ్రతలు ఇంకెవరైనా ఉన్న వారి చరిత్ర తెలుపమని కోరగా, ముని ఇట్లు చెప్పదొడంగెను.

## సావిత్రి ఉపాఖ్యానము

"ధర్మరాజా! పూర్వము మద్రదేశమున అశ్వపతి యనెడి పరమధార్మికుడు, సత్య ప్రతిజ్ఞుడు, జితేంద్రియుడు, దానశీలుడు అయిన నరపతి యుండెడివాడు. చాలాకాలము వరకు సంతానము కలుగనందున రాజు సావిత్రీదేవిని ఉపాసించి, పదునెనిమిది సంవత్సరములు హోమము గావించిన దేవి ప్రసన్నురాలై రాజు సమ్ముఖమునకు వచ్చి, "మద్రరాజా! నీ భక్తికి మెచ్చితిని. వరము కోరుకొమ్ము" అనిన, రాజు తనకు బహుసంఖ్యక సంతానము ప్రసాదింపుమనిన, భగవతి, "రాజా! నీ కోర్కె నాకు పూర్వమే తెలుసు. అందువలననే విధాతను ప్రశ్నించితిని. అతనిచే నీవు త్వరలోనే తేజస్వినియైన కుమార్తెను పొందెదవు" అని వరమిచ్చి అంతర్ధానమయ్యెను.

ఆనందముతో రాజు గృహమునకు మరలెను. కొంతకాలమునకు రాజ మహిషి గర్భవతియై చక్కని కుమార్తెను గాంచెను. సావిత్రీదేవి మహిమచే జన్మించినందున ఆ బాలికకు సావిత్రి అని నామకరణము చేసిరి. క్రమక్రమముగా సావిత్రి యుక్తవయస్కురాలై అపురూప సౌందర్యవతిగా పేరుగాంచెను. ఆమె తేజస్సును గాంచి యే రాజకుమారుడువివాహమాడ ముందుకు రాకపోయిన రాజు చింతించి, కుమార్తెతో తగిన వరుని అన్వేషించుకొనుమని అమాత్యులతో

పంపెను. సావిత్రి, మంత్రులతో హేమరథము నధిరోహించి, వివిధ తీర్థ స్థానములను, ఆదేశములను చూడసాగిన...

## 293.

ఒకనాడు అశ్వపతి నారదమహర్షితో కూడియున్న సమయమున అమాత్యులతో సావిత్రి తిరిగి వచ్చి తండ్రితో, "పితా! ద్యుమత్సేనుడను రాజు శాల్వదేశమునకు రాజు. దుర్భాగ్యవశమున అతడు అంధుడు కాగా శత్రువులు రాజ్యము లాగుకొనగ అతడు భార్యతోను, సంవత్సర వయస్కుడైన కుమారునితోను అడవులకు చని తపస్సు చేసుకొనుచూ కాలము గడుపసాగెను. తల్లిదండ్రులు యెల్లవేళలా సత్యము పలుకువారు కాన ఆ రాజకుమారుడు సత్యవంతుడని పేరుగాంచెను. బాల్యకాలమున చక్కని గుఱ్ఱపు బొమ్మలు చేయువాడని చిత్రాశ్వుడని కూడా ప్రసిద్ధుడయ్యెను. నేను ఆ రాజకుమారుని పెండ్లాడతలంచితిని" అని తెలియజేసెను.

నారదమహర్షి రాజుతో సత్యవంతుడు సకల సద్గుణ సంపన్నుడే గాని అల్పాయువని, అతని ఆయుష్షు మరియొక సంవత్సరము మాత్రమే యున్నదని తెలిపెను.

అంత అశ్వపతి అల్పాయుష్కుడైన వానిని వరించవలదని చెప్పినను, తన మనస్సు ఆ రాజకుమారుని పైననే యున్నదని సావిత్రి తండ్రి మాటను అంగీకరించలేదు. నారదమహర్షి కూడా సావిత్రినే సమర్థించెను.

## 294.

అశ్వపతి వివాహమునకు కావలసిన సామగ్రులను కూర్చుకొని, మంత్రులతోను, సామంతులతోను, కుమార్తెతోను ద్యుమత్సేనుని వద్దకు చని, తన అభిప్రాయము తెలిపి, అతనిని అంగీకరింపజేసి సత్యవంతునితో సావిత్రి వివాహము కావించెను.

సావిత్రి అలంకారములను పర్యిజించి, భర్తకు, అత్తమామలకు సేవలు చేయుచూ, నారదమహర్షి మాటలు మధ్య మధ్య జ్ఞాపకము రాగా చింతించుచూ కాలము గడుపసాగెను.

## 295.

కాలక్రమమున సత్యవంతుడు మృతినొందు దినము ఆసన్నమయ్యెను. నారదమహర్షి తెలిపిన ప్రకారము ఇక నాల్గు దినములుండగా సావిత్రి త్రిరాత్రివ్రతము చేయసాగెను. ఆమె కఠోరనియమములను చూచి అత్తమామలు వారింప ప్రయత్నించి ఆమె దృఢసంకల్పము తెలుసుకొని, నిరతులైరి. మూడు రాత్రులు గడచిన నాల్గవ దినమున అత్తమామలకు, మునులకు నమస్కరించి, దీర్ఘసుమంగళిగా జీవితము గడుప ఆశీర్వచనములు పొంది, గృహమునకు కావలసిన కఱ్ఱలు తెచ్చుటకు బయలుదేరిన పతితో, తానుకూడా వచ్చెదనని తెలిపి, అత్తమామల అనుజ్ఞ గొని బయలుదేరెను.

## 296.

దంపతులిరువురు యెన్నో ఫలములను కూర్చిన పిదప, సత్యవంతుడు కట్టెలు కొట్టుచూ, విపరీతముగా తలనొప్పిగా నున్నదని భార్య ఒడిలో తలనిడి విశ్రమించెను.

సావిత్రి నారదుని మాటలు తలచుకొని భీతితో ఉన్న సమయమున, యెఱ్ఱని బట్టలు కట్టుకొని, రక్తనయనములతోను, శ్యామవర్ణముతోను తేజోసంపన్నుడైన వ్యక్తి చేతిలో పాశము ధరించి సత్యవంతుని ప్రక్క నిలచియుండుట చూచి, భర్త తలను నెమ్మదిగా భూమిపైనిడి, నిలుచొని, కరములు జోడించి, "మహానుభావా! మిమ్ములను చూచిన దేవతలవలె నున్నారు. మీరెవ్వరు? యెందులకు ఇచ్చటకు వచ్చితిరి?" అని భక్తిపూర్వకముగా అడిగిన, అతడు "సావిత్రీ! నీవు పతివ్రవు. కావున నన్ను పరిచయము చేసుకొనుచుంటిని. వినుము. నేను యముడను. నేటితో నీ భర్త సత్యవంతుని ఆయుఃప్రమాణము తీరినది. ఇతడు పరమధార్మికుడు కనుక నా దూతలను పంపక నేనే వచ్చితిని" అని సత్యవంతునిపై పాశము వేసి, అంగుష్టప్రమాణమైన ప్రాణపురుషుని గ్రహించి దక్షిణాభిముఖముగా చనసాగెను. ప్రాణములు పోగా సత్యవంతుని శరీరము తేజోహీనమయ్యెను.

పతి ప్రాణములు కొనిపోవుచున్న యముని సావిత్రి అనుసరించగా, యముడు, "కళ్యాణీ! నీవు నా వెంట రావలదు. నీ భర్త అంత్యక్రియలు కావించి, ఊర్ధ్వలోకములు పొందునట్లు చేయుము" అని పలికెను.

అంత సావిత్రి, "మహానుభావా! పతిని విడచి నేను యెట్లు ఉండగలను? గార్హస్థ్యజీవితమును ఇప్పుడు పరిత్యజింపలేను కదా!" అనిన యముడు, "లలనా!

యుక్తిపూర్ణమైన నీ మాటలకు సంతసించితిని. పతి ప్రాణములు తప్ప మరియేమైనను కోరుకొనుము".

"ప్రభో! నా మామగారి అంధత్వము పోయి, శక్తి వృద్ధిచెందునట్లు వరమిండు" అనిన యముడు వరము ప్రసాదించి వెనుకకు మరలుమనిన సావిత్రి, "దేవా! పతిని వదలి నేను యెచ్చటకు మరలగలను? సాధుజనులతో ఒక్కమారు కలుసుకొన్ననూ, మిత్రత్వము ప్రాప్తించి, చిరకాల మనోరథములు ఈరునని పెద్దలు చెప్పుదురు. కావున మీవంటివారి స్నేహమును పొందిన నా అభీష్టము యెట్లు తీరకపోవును?" అని పలికెను.

"నారీమణీ! నీ వచనములు అత్యంత మధురములు. నీకు రెండవ వరము ఇచ్చుచున్నాను. కోరుకొనుము" అనిన సావిత్రి, "తన మామగారు మరల రాజ్యము పొందునట్లు వరమడిగిన యముడు అనుగ్రహించి, వెనుకకు చనుమనెను.

మరల తనను అనుసరించుచున్న సావిత్రికి యముడు ఆమె తండ్రి అశ్వపతికి నూర్గురు కుమారులు కలుగునట్లు వరమిచ్చెను.

అయినను సావిత్రి యముని వెంట చని యెన్నో విధముల కీర్తింప యముడు ఆమె సంభాషణకు సంతసించి నాల్గవ వరము కోరుకొమ్మనెను.

అంత సావిత్రి "సత్యవంతుని వలన నాకు బలవీర్య సంపన్నులైన నూర్గురు కుమారులు కలుగునట్లు వరమిండు" అని ప్రార్థింప యమధర్మరాజు, "తథాస్తు" అనెను.

అనంతరము పతివ్రతయైన సావిత్రికి సంతోషము చేకూర్చుచూ యముడు సత్యవంతుని పునర్జీవితుని కావించెను.

## 297.

సావిత్రి భర్తను కలుసుకొని జరిగినదంతయూ తెలిపి, భర్తతో ఆనందముగా ఆశ్రమమునకు తిరిగి వచ్చెను.

## 298.

కొలదికాలములోనే అంధత్వము నుండి విముక్తి పొందిన ద్యుమత్సేనుడు చక్షుష్మానుడై సైన్యము సమీకరించి హృతరాజ్యము తిరిగి పొందెను.

సావిత్రి, సత్యవంతుడు పుత్రప్రాప్తిని పొంది సుఖముగా కాలము గడిపిరి.

పతివ్రతా మహత్య పర్వాధ్యాయము సమాప్తము

## 299-300. కుండలాహరణ పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను, "జనమేజయ మహారాజా! అరణ్యమున పాండవుల అరణ్యవాసకాలము పూర్తియగు సమయమున వారికి హితము చేకూర్చుటకు ఇంద్రుడు కర్ణుని కవచకుండలములను గ్రహింప తలంచెను.

ఇది తెలుసుకొని సూర్యుడు కర్ణునకు కలలో బ్రాహ్మణ వేషమున కన్పించి, "వత్సా! కర్ణా! దేవరాజు ఇంద్రుడు పాండవులకు మేలు కలుగజేయుటకు నీవద్ద కవచ కుండలములు బ్రాహ్మణ వేషమున ప్రార్థించును. నీవు వాటివలననే శత్రువులను జయింపగలవు. వారు నీకెట్టి అపకారము చేయజాలరు. కావున నీవు ఆ కవచ కుండలములను మాత్రము దానము చేయవలదు" అని తెలుపగా కర్ణుడు, "మహానుభావా! నేను కోరినది ఇత్తునని ప్రతిన పూనియుంటిని. నేడు ప్రాణములపై ప్రేమతో కీర్తిభ్రష్టుడను కాలేను. నన్ను క్షమింపుడు" అని తన అసక్తత తెలిపిన, తనకు తన హితులకు కీడు జరుగు పని యెన్నడూ చేయవలదు అని తెలుపగా మరల కర్ణుడు తాను అసత్యవాదినను అపవాదు భరింపజాలననిన, సూర్య భగవానుడు, "వత్సా! దేవరాజు నిన్ను అర్జుననిచే వధించుటకే కుండలములను ప్రార్థించుచున్నాడు. కావున నీవు ఇంద్రునకు కవచ కుండలములను దానము చేయుటకు ముందు శత్రుఘాతినియైన అస్త్రమొకటి ఇమ్మనుము. అది పుచ్చుకొనిన పిదపే అతని కోరిక తీర్చుము" అని తెలిపి దివాకరుడు అంతర్హితుడయ్యెను.

## 301. కర్ణ జన్మవృత్తాంతము

జనమేజయుడు, "ఓ తపోధనా! కర్ణుడు యెట్లు జననమొందెను? అతనికి సహజ కవచ కుండలములు యెట్లు సంప్రాప్తించెను? దయచేసి నాకు విశదముగా తెలుపుము" అని ప్రార్థింపగా వైశంపాయనుడు ఇట్లు చెప్పదొడంగెను.

## 302.

పూర్వము మహాతేజోసంపన్నుడు అయిన దూర్వాసమహర్షి కుంతిభోజుడను రాజువద్దకు రాగా అతడు తమ ఆతిథ్యము స్వీకరించుమనగా ముని, "తన మాటకు యెదురాడక సేవాశుశ్రూషలు చేసిన ఉందునని" తెలుపగా రాజు అంగీకరించి కుమార్తె పృథను పిలిపించి, "తల్లీ! ఈ బ్రాహ్మణుడు మన గృహమున కొంతకాలము వసించును. అతని ఇచ్ఛానుసారము ఉచితరీతిని సేవలు చేసి మన కులము పేరును నిలుపుము. నీవు బాలికవు. నా కన్యవు. బ్రాహ్మణులు అతి తేజో

సంపన్నులు. కోపస్వభావులు. కావున జాగరూకతలతో సేవలు చేయుము. నీవు వృష్ణికుల సంభూతుడైన శూరసేనుని కుమార్తెవు. వసుదేవుని చెల్లెలువు. నీ తండ్రి ఆనందముతో నీ పిన్నవయసున నాకు పెంచుకొనుటకు ఇచ్చెను. నా సంతతిలో నీవే శ్రేష్ఠురాలవు. నీవు రాజకులమున జన్మించితివి. అసాధారణమైన రూప, గుణ సంపన్నురాలవు. రాగక్రోధములు విసర్జించి బ్రాహ్మణుని ఆరాధింపుము" అని కుమార్తెను ముని సేవలకు నియోగించెను.

## 303-304.

తండ్రి ఆజ్ఞానుసారము కుంతి మునికి సేవలాచరింప ముని సంతసించి, "కళ్యాణీ! నీ పరిచర్యలకు నేను ఆనందించితిని. అనన్య సులభమైన వరము కోరుకొని సీమంతులలో అగ్రగణ్యవుగా యశస్సు పొందుము" అనిన కుంతి, "బ్రాహ్మణోత్తమా! మీకు, నా తండ్రికి సంతోషము కలిగించుట కన్నా నాకు కావలసినదేమున్నది? వరముల ప్రయోజనమేమున్నది?" అని పలుకగా ఋషి "చారుహాసినీ! నీవు నావద్ద వరములు కోరుకొనకపోయినా, నేను నీకు దేవతలను ఆహ్వానింపగల మంత్రముపదేశించుచున్నాను. గ్రహింపుము. దీనివలన నీకు వారు వశులగుదురు" అని అధర్వవిహితమైన మంత్రములు కుంతికి నేర్పెను.

అనంతరము ముని కుంతిభోజుని, కుంతిని ఆశీర్వదించి, యధేచ్ఛ చనెను.

## 305.

వైశంపాయనుడిట్లనెను. "రాజా! ఒకనాడు నవోదిత సూర్యుని గాంచి కుంతి దివ్యదృష్టిని పొంది, అతని మనోహరమైన కవచము, కుండలములను, తేజో సంపదను గాంచి విమోహితయై, ముని తెల్పిన విద్య యొక్క బలాబలములు తెలుసుకొన బాలికా సులభమైన ఉత్సుకత కలిగి, శుచియై, దివాకరుని ఆహ్వానించెను.

యోగప్రభావమున దివాకరుడు ఆత్మను ద్విధావిభక్తము గావించి, రెండు రూపములు వహించి, ఒక మూర్తిని తాపప్రదానార్థముంచి, అంగద, ముకుట మండితమైన అన్యమూర్తితో కుంతిని సమీపించి, "కళ్యాణీ! మంత్ర ప్రభావమున నీ వశుడనైతిని, నీకెట్టి మేలు చేయగలను? తెలుపుము" అని ఆదరముగా పలికెను.

"మహానుభావా! తెలియక బాలికా సులభ స్వభావమున మిమ్ము ఆహ్వానించి, అపరాధము చేసితిని. క్షమింపుడు" అని వేడుకొనెను.

## 306.

సూర్యుడు యెన్నో అనునయవాక్యములతో ఆమెను అనుకూలవతిని గావించి, ఆమె కోరిన విధముగా కన్యాత్వమునకు భంగము రాదనియు, కవచ కుండలములతో కుమారుడు కలుగుననియు తెలిపెను.

## 307.

కుంతీ దివాకరుల సంగమమున ఆమెకు కన్యకాకాలము కనకోజ్వల కుండలుడు, కవచధారి, సింహనేత్రుడు, వృషస్కంధుడు అయిన తేజోసంపన్నుడైన కుమారుడు కలిగెను.

లోకాపవాదమునకు వెరచి కుంతి, ధాత్రి, మధుచ్ఛిష్టవిలప్తమైన మంజూష తేగా మెత్తటి పాన్పు వైచి, కుమారుని అందులో నిద్రపుచ్చి, "వత్సా! ఆకాశము, పృథివి నిన్ను రక్షించుగాక, నీ జన్మకు కారకుడైన సూర్యభగవానుడు నిన్ను రక్షించుగాక, ఆదిత్య, వసు, రుద్ర, సాధ్య, దేవరాజాదులు, దిక్పాలకులు నిన్ను కాపాడుదురు గాక" అని ఆశీర్వదించి, "నాయనా! విదేశముల నున్నను నీ కవచ కుండలములను చూచి, నేను తప్పక గుర్తించెదను. అయ్యో! నిన్ను పెంచి పెద్దచేయలేని దీనావస్థయందున్నాను. నిన్ను యెత్తుకొని పాలిచ్చు స్త్రీ యెంత అదృష్టవంతురాలు. యెన్ని నోములు నోచుకొన్నది. ఇట్టి కమలముల వంటి కన్నులు, ప్రశస్తమైన లలాటము కల కుమారుని పొందుచున్నది. ఆటలాడి మలినమైన దేహముతో ఆమెను ఆలింగనము చేసుకొని కమ్మటి మాటలతో ఆనందింపజేసెదవు. నాకు అట్టి భాగ్యము లేదు. దీనురాలనైన నా కాఠిన్యమునకు క్షమింపుము" అని పదే పదే ముద్దాడి విలపించుచూ, ఆ పేటికను అశ్వనదియందు వదిలి గృహమునకు మరలెను.

## 308.

ఆ పేటిక క్రమముగా నదీ ప్రవాహమున కొట్టుకొనిపోవుచు, చర్మవతీ నదిలోనికి, అచటినుండి యమునానది గుండా గంగానది చేరి, చంపానదీ తీరమున ధృతరాష్ట్రుని సఖుడైన అతిరథ సూతుని భార్యయైన రాధ కంటబడెను. ఆమె భర్తతో ఆ మంజూషను తెమ్మనగా అతడు జాగ్రత్తగా దానిని తెచ్చి మూత తీయగా అపురూప రూపలావణ్యములుగల బాలకుని గాంచి, సంతానము లేని తమకు భగవంతుడే ఈ కుమారుని ప్రసాదించెనని ఆనందించి బాలకుని భార్యయైన రాధకు అందించి, ఆనందము చేకూర్చెను.

ఆ బాలకునకు వసురూప కవచము, కుండలములుండుటచే బ్రాహ్మణులు 'వసుసేను'డని పేరిడిరి. అతని మరియొక పేరు వృషుడు. కుంతి చారుల వలన కుమారుని వృత్తాంతము అంతయూ తెలుసుకొనెను.

కర్ణుడు తండ్రి హస్తినా నగరమునకు పంపగా కృప, ద్రోణుల వద్ద అస్త్రవిద్య నభ్యసించెను. అతడు దుర్యోధనునితో కలసి పాండవులకు కీడు తలంచెడివాడు. అర్జునుని యందు ద్వేషము పూని, ద్వంద్వయుద్ధము చేయ దలంచెడివాడు.

కర్ణుడు ప్రతిదినము వేదపఠనము గావించి సూర్యతర్పణము గావించి, ఆ సమయమున వచ్చిన బ్రాహ్మణులకు లేదనక అడిగినది ఇచ్చెడివాడు.

## 309.

పాండవులకు మేలు చేయుటకై ఇంద్రుడు ఒకనాడు బ్రాహ్మణ వేషమున కర్ణుని చేరి, అతని సహజ కవచకుండలములను దానమడుగగా కర్ణుడు, "విప్రోత్తమా! ధనము, వస్తువులు, వాహనములు, గోవులు, భూములు కోరుకొనుము. నేను కవచము, కుండలములు ఇయ్యజాలను. ఇవి నన్ను యెల్లవేళలా రక్షించును" అని పలికిన బ్రాహ్మణుడు అవి తప్ప మరేమియూ వలదని పదే పదే అనగా కర్ణుడు సహాస్య వదనమున, "దేవదేవేశా! మిమ్ము నేను ముందే గుర్తించితిని. నీవు సర్వభూతములకు అధీశ్వరుడవు. కావున మీరే నాకు వరమిండు. నేను కవచ కుండలములు ఇచ్చిన లోకులచే సులభముగా వధింపబడుదును. మీరు కూడా లోకములో హాస్యాస్పదులగుదురు. కావున కవచకుండలములకు వినిమయముగా నేను కోరిన వరమిండు. అటులయిన నేను కవచకుండలములను ఇవ్వగలను" అనెను.

"కర్ణా! నా రాక నెరింగి సూర్యదేవుడు నిన్ను సావధానునిగా చేసెను. ఇందులో సందేహము లేదు. వజ్రము తప్ప మరేమైనను కోరుకొనుము" అని ఇంద్రుడు అనెను.

అంత కర్ణుడు, "దేవరాజా! యెవరిని చూసిన నా మనమున భయము సంచరించునో అటువంటి శత్రువును చంపు అస్త్రమునిమ్ము" అనిన ఒక్కసారి మాత్రమే ప్రయోగింపగల అస్త్రమును కర్ణునకిచ్చి, ఇంద్రుడు కవచ కుండలములను గ్రహించి, ఆశీర్వదించి దేవలోకమునకు చనెను.

ఆ సమయమున దేవతలు కర్ణునిపై పుష్పవృష్టి కురిపించి అభినందించిరి.

కుండలాహరణ పర్వాధ్యాయ సమాప్తి

## 310. ఆరణేయ పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లు చెప్పదొడంగెను. "నరనాథా! జయద్రథునివల్ల అపహరింపబడిన ద్రౌపదిని రక్షించుకొని కామ్యకవనమును వదలి పాండవులు ద్వైతవనము ప్రవేశించి నివసించసాగిరి.

ఒకనాడు ఒక బ్రాహ్మణుడు పాండవుల వద్దకు వచ్చి, ధర్మరాజుతో, "రాజా! ఒక జింక చెట్టు కొమ్మకు శరీరము రాసికొనుచు ప్రమాదవశమున ఆ వృక్షమునకు కట్టిన అరణి, మంథదండము కొమ్ములకు తగులగా వానితో అడవిలోనికి పారిపోయెను. నా అగ్నిహోత్రము పాడవకుండా దయచేసి వాటిని తెచ్చి ఇచ్చి నాకు మేలు చేకూర్చుడు" అని ప్రార్థించెను.

ధర్మరాజు బ్రాహ్మణునితో ధైర్యవచనములు పలికి, తమ్ములతో అస్త్రములు ధరించి అడవిలోనికి వెదుకుటకు బయలుదేరెను.

## 311.

వారు అడవిలో ఆ మృగము కొరకు వెదకి వెదకి యెందునూ కానక, తుదకు అలసి, దాహముతో ఒక మఱ్ఱిచెట్టు నీడను విశ్రమించిరి.

అన్న ఆజ్ఞపై నకులుడు వృక్షము నెక్కి జలాశయ చిహ్నములు గాంచి, జలము తెచ్చుటకు బయలుదేరెను. నకులుడు రాకపోవుసరికి ఒక్కొక్కరే తమ్ములందరూ చనగా తుదకు ధర్మరాజు వారిని అన్వేషించుచూ ఒక సరోవర తీరమును చేరెను.

## 312.

ఆ సరోవరతీరమున దేవతలను కూడా ధిక్కరింపగల బలవీర్యములు గల అతని సహోదరులు విగతజీవులై పడియుండుట గాంచెను.

కన్నుల నీరు నిండగా ధర్మరాజు తమ్ముల కొరకు పరిపరివిధముల విలపించెను. తుదకు దాహము తీర్చుకొనుటకై నీటిలో దిగుసరికి అంతరిక్షము నుండి ఇట్లు వినిపించెను. "రాజపుత్రా! నేను శైబాలుడను మాంసభోజిని. పక్షిని. నేనే నీ తమ్ములను యమసదనమునకు పంపితిని. నా ప్రశ్నలకు జవాబు ఇవ్వక నీరు గ్రహించిన నీ దశ కూడా అటులనే అగును. కౌంతేయా! సాహసము చేయవలదు. ఈ సరోవరము నా అధీనము. ముందుగా నా ప్రశ్నలకు ప్రత్యుత్తర మిచ్చియే జలములను గ్రోలుము."

ఆ మాటకు ధర్మరాజు, “మహాబలా! నీవు సామాన్యమైన పక్షివి కాదు. నీవెవరు? యెందులకు ఇచ్చట వసించుచుంటివి?” అని ప్రశ్నింపగా “కౌంతేయా! నీకు శుభము కలుగుగాక, నేను జలచరపక్షిని కాదు. యక్షుడను. నేనే నీ తమ్ములను వధించితిని. నా మాటలు వినక వీరు జలములను త్రావుటచే ఇట్లైరి. అందువలన నీవైనను నా ప్రశ్నలకు జవాబులిమ్ము” అని పలికిన ధర్మరాజిట్లనెను.

“యక్షా! నీ ఆధీనమున నున్న వస్తువును బలవంతముగా తీసుకొను కోర్కె నాకు లేదు. నీవు అడగదలచుకొన్నవి తెలుపుటకు నాకు అభ్యంతరము లేదు. ఆత్మశ్లాఘ్యమున పండితులు నిందింతురు. కావున నా సాధ్యానుసారము ప్రత్యుత్తరమిత్తునని నీకు మాటనిచ్చుచున్నాను” అని క్రమముగా యక్షుని ప్రశ్నలకు తగిన జవాబులు ఇచ్చెను.

యక్షుడు: ఆదిత్యుని యెవరు ఉత్పత్తి చేసిరి? ఎవరు అతని నాల్గువైపుల ఉంటారు? యెవరు అస్తమింపచేస్తారు? యెవరిలో ప్రతిష్ఠితుడై ఉంటాడు?

ధర్మ: బ్రహ్మ ఆదిత్యుని సృష్టించెను. దేవతలు అతని చదుర్దిశలా చరింతురు. ధర్ముడు అతనిని అస్తమింపజేయును. సత్యమందు ప్రతిష్ఠితుడై ఉంటాడు.

యక్ష: దేనివలన శ్రోత్రియుడగును? దేనివలన మహత్యము పొందును? పుత్రవంతుడగును? దేనివలన బుద్ధి వికసించును?

ధర్మ: శృతి వలన శ్రోత్రియుడగును. తపస్సు వలన మహత్యము పొందును. యజ్ఞము వలన పుత్రుని పొందును. వృద్ధుల సేవచే బుద్ధి వికసించును.

యక్ష: బ్రాహ్మణుల దేవ, సాధు, మనుష్య, అసాధు భావములేవి?

ధర్మ: వేదపఠనము దేవభావము. తపస్సు సాధు ధర్మము. మృత్యువు మనుష్య ధర్మము. పరీవాదము అసాధు భావము.

యక్ష: క్షత్రియుల దేవ, సాధు, మనుష్య, సాధ, అసాధు భావములు ఏవి?

ధర్మ: క్షత్రియులకు అస్త్రశస్త్రములు దేవభావము. యజ్ఞము సాధుభావము, భయము సాధ భావము, పరిత్యాగము అసాధు భావము.

యక్ష: యజ్ఞీయ సామ, యజుఃస్సులేవి?

ధర్మ: ప్రాణము యజ్ఞీయ సామము, మనస్సు యజ్ఞీయ యజుస్సు.

యక్షు: ఆవపనకారి, నివపనకారి, ప్రతిష్టామానుడు, ప్రసకారులకు శ్రేష్ఠమైనవి ఏవి?

ధర్మ: ఆవపనకారులకు (దేవతర్పణము చేయువారు) వర్షము, నివపనకారులకు (పితృతర్పణము చేయువారు) బీజము, ప్రతిష్టామానులకు ధేనువులు, ప్రసూతికారులకు పుత్రులు శ్రేష్ఠులు.

యక్ష: ఏ వ్యక్తి ఇంద్రియ సుఖములను అనుభవించుటకు సమర్థుడు? బుద్ధిమంతుడు, లోకపూజితుడు అయి జీవితుడయ్యును, యెవరు జీవితుడు కాదు?

ధర్మ: ఏ వ్యక్తి దేవతలను, అతిథులను, భృత్యులను, పితృదేవతలకు శ్రాద్ధ అర్చనాదులు కావింపడో జీవితుడయ్యును జీవితుడు కాడు.

యక్షు: పృథివి కన్నా బరువైనదెవరు? ఆకాశము కన్నా ఉన్నతుడెవరు? వాయువు కన్నా వేగము కలదెవ్వరు? గడ్డి కన్నా తేలికైనదేమి?

ధర్మ: తల్లి భూమి కన్నా గురుతరము. తండ్రి ఆకాశము కన్నా ఉన్నతుడు. మనస్సు వాయువుకన్నా శీఘ్రగామి. ఆలోచన తృణము కన్నా తేలిక.

యక్షు: నిద్రించినా కన్నులు మూయనిదెవరు? జన్మించినా స్పందించనిదెవరు? దేనికి హృదయము లేదు? వేగమునకు పెరిగేదెవరు?

ధర్మ: చేప నిద్రించినా కన్నులు మూయదు. జన్మించీ స్పందించనిది గ్రుడ్డు. పాషాణమునకు హృదయము లేదు. నది వేగముచే పెరుగును.

యక్షు: ప్రవాసికి మిత్రుడెవరు? గృహవాసికి మిత్రుడెవరు? రోగికి మిత్రుడెవరు? ముమూర్షునకు మిత్రుడెవరు?

ధర్మ: ప్రవాసికి తోడనున్నవాడు, గృహవాసికి భార్య, రోగికి చికిత్సకుడు, ముమూర్షునకు దానము మిత్రులు.

యక్షు: సర్వభూతములకు అతిథి యెవ్వరు? ధర్మ: అగ్ని

యక్షు: సనాతన ధర్మమేది? ధర్మ: జ్ఞానయోగము.

యక్షు: అమృతమేమిటి?

ధర్మ: యజ్ఞశేషము అమృతము.

యక్షు: సముదయ జగత్తుయే పదార్థముచే ఆవరించబడినది?

ధర్మ: సముదయ జగత్తు వాయువుచే ఆవరించబడినది.

యక్షు: యెవరు ఒక్కరే సంచరిస్తారు?

ధర్మ: సూర్యుడు యేకాకిగా సంచరిస్తాడు.

యక్షు: యెవరు పదే పదే జన్మించెదరు?

ధర్మ: చంద్రుడు పదే పదే జన్మించును.

యక్షు: హిమమునకు ఔషము యేమిటి?   ధర్మ: అగ్ని.

యక్షు: ధర్మము, యశస్సు, స్వర్గము, సుఖము వేటిని ఆశ్రయించుకొని ఉన్నవి?

ధర్మ: ధర్మము దాక్షిణ్యమును, యశస్సు దానమును, స్వర్గము సత్యమును, సుఖము శీలమును ఆశ్రయించుకొని ఉన్నవి.

యక్షుడు: మనుష్యుని ఆత్మ యెవ్వరు?

ధర్మ: పుత్రుడు మనుష్యుని ఆత్మ.

యక్షు: దేముడిచ్చిన స్నేహితుడెవరు?

ధర్మ: దేముడిచ్చిన స్నేహితుడు భార్య.

యక్షు: ధన్యులలో ఉత్తములెవరు? ధనములలో ఉత్తమమైనదేది? లాభములలో ఉత్తమమైనదేది? సుఖములలో ఉత్తమమైనదేది?

ధర్మ: దాక్షిణ్యము చూపువాడు ధన్యులలో ఉత్తముడు. విద్య ధనములలో ఉత్తమము. ఆరోగ్యము లాభములలో ఉత్తమము. సంతోషమే సుఖములలో ఉత్తమము.

యక్షు: ప్రధాన ధర్మమేది?

ధర్మ: అబద్ధమాడకుండుట.

యక్షు: యే ధర్మము ఫలమునిచ్చును?

ధర్మ: వైదికధర్మము.

యక్షు: దేనిని ఆధీనములో ఉంచుకొనిన శోకము కలుగదు?

ధర్మ: మనస్సును ఆధీనములో ఉంచుకొనిన శోకము కలుగదు.

యక్షు: యెవరితో సంధి చేసుకొనిన అది భంగము కాదు?

ధర్మ: మంచివారితో సంధి చేసుకొనిన అది భంగము కాదు.

యక్షు: యేది వదలిన హితము చేకూరును?

ధర్మ: అహంకారము వదలిన హితము చేకూరును?

యక్షు: యేది వదలిన శోకము కలుగదు?

ధర్మ: క్రోధము వదలిన శోకము కలుగదు.

యక్షు: యేది వదలిన అర్థవంతుడగును?

ధర్మ: త్యాగము చేసిన అర్థవంతుడగును.

యక్షు: యేది వదలిన సుఖము కలుగును?

ధర్మ: లోభము వదలిన సుఖము కలుగును.

యక్షు: బ్రాహ్మణునకు, నట, నర్తకులకు, భృత్యులకు, రాజులకు దానము చేయవలసిన ఆవశ్యకత యేమి?

ధర్మ: ధర్మము నిమిత్తము బ్రాహ్మణునకు, యశస్సు కొరకు నటులకు, నర్తకులకు, భరణము కొరకు భృత్యులకు, భయము తొలగించుకొనుటకు రాజులకు దానము చేయవలెను.

యక్షు: ప్రజలు దేనిచే కప్పబడి ఉంటారు? అప్రకాశితులగుతారు? మిత్రులను పరిత్యజిస్తారు? స్వర్గము చేరుటకు అసమర్థులగుతారు?

ధర్మ: ప్రజలు అజ్ఞానముచే కప్పబడి ఉంటారు. తమస్సుచే (చీకటి) అప్రకాశితులై ఉంటారు. లోభముచే మిత్రులను పరిత్యజిస్తారు. సంగహేతువుచే స్వర్గము చేరుటకు అసమర్థులగుతారు.

యక్షు: మృతపురుషుడెవరు? మృతరాష్ట్రమేది? మృతశ్రాద్ధమేది? మృతయజ్ఞమేది?

ధర్మ: దరిద్రుడు మృతపురుషుడు. అరాజక రాజ్యము మృతరాష్ట్రము. శోత్రియము కాని శ్రాద్ధము మృతశ్రాద్ధము. దక్షిణ లేని యజ్ఞము మృతయజ్ఞము.

యక్షుడు: తప, దమ, క్షమ, లజ్జల లక్షణమేమిటి?

ధర్మ: స్వధర్మము ననుసరించుటయే తపము. మనస్సును నిగ్రహించుటయే దమము. ద్వంద్వసహిష్ణుతే క్షమ, చెడ్డపనినుంచి వెనుతిరుగుటయే సిగ్గు.

యక్షు: జ్ఞానము, శమము, దయ అని వేటిని అంటారు?

ధర్మ: తత్వార్థ ఫలసిద్ధియే జ్ఞానము. ప్రశాంతమైన మనస్సే శమము. అందరి సుఖము కోరుటయే దయ.

యక్షు: పురుషులు జయింపజాలని శత్రువెవ్వరు? అనంమైన వ్యాధి యేది? యెటువంటివారు సాధువులు? యెటువంటివారు అసాధువులు?

ధర్మ: క్రోధమే జయింపరాని శత్రువు. లోభమే అనంతమైన వ్యాధి. అన్ని ప్రాణులకు మంచి చేయువారే సాధువులు. దయలేనివారు అసాధువులు.

యక్షుడు: మోహము, మానము, బద్ధకము, శోకము, వీని లక్షణములేవి?

ధర్మ: ధర్మవిషయములందు అనభిగ్యత మోహము. ఆత్మాభిమానమే మానము. ధర్మానుష్ఠానము చేయకపోవుటచే అజ్ఞానమే శోకము.

యక్షు: స్థైర్య, ధైర్య, స్నాన, దానముల లక్షణములేవి?

ధర్మ: స్వధర్మమందు స్థిరత్వమే స్థైర్యము. ఇంద్రియ నిగ్రహమే ధైర్యము. మనో మాలిన్యములను పరిత్యజించుటయే స్నానము. ప్రాణులను రక్షించుటయే దానము.

యక్షు: పండితుడెవరు? నాస్తికుడెవరు? మూర్ఖుడెవరు? కామము, మాత్సర్యము యేవి?

ధర్మ: ధర్మజ్ఞుడైన వ్యక్తియే పండితుడు. మూర్ఖుడే నాస్తికుడు. నాస్తికుడే మూర్ఖుడు. సంసారహేతువే కామము, హృత్తాపమే మాత్సర్యము.

యక్షు: అహంకారము, దంభము, దైవము, పశుత్వము యేవి?

దర్మ: అజ్ఞానరాశి అహంకారము. ధర్మపరాయణుడనని చెప్పుకొనుటయే దంభము. దానఫలమే దైవము. ఇతరుల యెడ నేరారోపణ చేయుటయే పశుత్వము.

యక్షు: ధర్మ, అర్థ, కామములు పరస్పర విరుద్ధములు. యెటుల వీనిని యేకత్రము కావించవచ్చును?

ధర్మ: ధర్మము , భార్య వీరిద్దరూ వశులైన ధర్మ, అర్థ, కామములను యేకత్రము కావించవచ్చును.

యక్షు: యెవ్వరు అక్షయ నరకము పొందుదురు?

ధర్మ: పిలిచి ఇవ్వనివారు. ఉండియూ లేదనువారు అక్షయ నరకము పొందుదురు.

యక్షు: కులము, పని, స్వాధ్యాయము, శృతము వీనిలో యేది బ్రహ్మత్వమునకు కారణము?

ధర్మ: కుల, స్వాధ్యాయ, శృతముల వలన బ్రాహ్మణత్వము జన్మింపదు. వృత్తమే బ్రాహ్మణత్వమునకు కారణము. బ్రాహ్మణుడు కేవలము అధ్యయన, శాస్త్రచింతన చేసిన చాలదు. అతడు క్రియను చేయువాడు, యోగనిష్ఠాపరుడు అయిననే పండితుడగును. చతుర్వేదములను అధ్యయనము చేసినను దుర్వర్తుడైన బ్రాహ్మణునిగా పరిగణింపబడడు. అగ్నిహోత్రపరాయణుడే యధార్థ బ్రాహ్మణుడు.

యక్షు: ప్రియవాక్యముల వలన లాభమేమి? వివేచనతో పనిచేసిన యేమి లాభము? బహుమిత్రులవలని లాభమేమి? ధర్మమున అనురక్తుడైన లాభమేమి?

ధర్మ: ప్రియవాది అందరికీ ఇష్టుడగును. వివేచనాపరుడు జయమును పొందును. బహుమిత్రశాలి సుఖముగా వసించును. ధర్మానురక్తుడు సద్గతి పొందును.

యక్షు: సుఖి యెవ్వరు? ఆశ్చర్యకరమైనదేమి? పథమేది? స్థిరత్వము లేనిదేమిటి?

ధర్మ: ఋణశూన్యుడై, ప్రవాసి కాక, రోజులో ఐదవ భాగము గృహమున గడుపువాడు సుఖి. ప్రాణులు ప్రతిదినము యముని సదనమునకు చనుచున్నను, తాము చిరంజీవులమగుదుమనుకొనుటయే ఆశ్చర్యము. వేదములు, స్మృతులు భిన్నములు. మునులు వేరు. వారి అభిమతములు వేరు. కావున సత్పురుషులు నడుచు పద్ధతియే పథము. తర్కమునకు స్థిరత్వము లేదు.

ఇట్లు ధర్మరాజు యక్షుని ప్రశ్నలకు ఉత్తరమివ్వగా అతడు సంతసించి, “రాజా! చనిపోయిన నీ తమ్ములలో ఒకరిని పునర్జీవితుని చేతును. యెవరిని బ్రతికించమందువో తెలుపుము?” అనగా యుధిష్టిరుడు, “శ్యామకళేబరుడు, లోహితలోచనుడు, విశాలవక్షుడుయైన నకులుని బ్రతికింపుము” అని కోరుకొనెను.

భీమార్జునులను వదలి, అతనిని కోరుకొనుటకు కారణమేమని యక్షుడు ప్రశ్నింపగా ధర్మరాజు, “మహానుభావా! నను ధర్మము అనుసరించువాడను. కుంతి, మాద్రి మా తల్లులు. ఇద్దరూ పుత్రరతులై ఉండుటయే నా వాంఛ. అందువలననే నకులుని బ్రతికించుమంటిని” అని తెలిపెను.

## 313.

యక్షుడు యుధిష్టిరుని వచనములకు సంతసించి, పాండవులనందరినీ పునర్జీవితులను కావించెను.

అంత యుధిష్టిరుడు, “మహానుభావా! మీరు యెవ్వరు? సామాన్య యక్షుని వలె లేరు!” అని ప్రశ్నించెను.

ఆ సమయమున ధర్ముడు కుమారునకు నిజరూపము చూపి, “వత్సా! నేను నీ తండ్రిని. ధర్ముడను. నిన్ను చూచుటకే వచ్చితిని. యశము, సత్యము, దమము, శౌచము, హ్రీం, దానము, తపస్సు, బ్రహ్మచర్యము నా శరీరము. అహింస, సమత, శాంతము, తపము, మాత్సర్యము లేకుండుట నా ఇంద్రియములు. నీవు పంచయజ్ఞములందు అనురక్తుడవై కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను జయించితివి. నేను నిన్ను పరీక్షించుటకే వచ్చితిని. నీ ప్రవర్తనకు మిక్కిలి సంతసించితిని. నీకు శుభము కలుగును. వరము కోరుకొనుము” అని పలుకగా ధర్మరాజు బ్రాహ్మణుని అరిణి, మంధదండములను ఇవ్వ ప్రార్థించెను.

"నాయనా! నిన్ను పరీక్షించుటకే నేనే మృగరూపమున అపహరించితిని. వాటిని ఇచ్చుచున్నాను. నీవు మరియొక వరము కోరుకొనుము" అనిన ధర్మరాజు, "మేము అరణ్యములలో పన్నెండు సంవత్సరములు అరణ్యవాసము చేసితిమి. పదమూడవ సంవత్సరము ఆసన్నమైనది. అజ్ఞాతవాస కాలమున మమ్మెవ్వరూ పోల్చుకొనకుండ వరమిండు" అని కోరెను.

ధర్ముడు, "తథాస్తు" యని, "మీరు ఛద్మవేషములను పరిగ్రహించకపోయినను యెవ్వరూ పోల్చుకొనలేరు. మీరు మారు రూపములతో ఈ సంవత్సర కాలము విరాటనగరమున ఉండుడు. ధర్మరాజా! ఇవిగో బ్రాహ్మణుని అరణి, మంథ దండము. వాటిని ఆతనికి తిరిగి ఇమ్ము. వత్సా! నీవు నా ఆత్మజుడవు. విదురుడు నా అంశజుడు. నీవనిన తృప్తుడనైతిని. మూడవ వరము కోరుకొనుము" అని ప్రేమతో పలికెను.

అంత ధర్మరాజు లోభ, మోహ క్రోధములను జయించి, సత్య, దాన, తపములందు మనస్సు నిలచునట్లు వరమిమ్మని కోరగా, ధర్ముడు అతని కోరిక తీర్చి, పదే పదే ఆశీర్వదించి అంతర్హితుడయ్యెను.

## 314.

పాండవులు ఆశ్రమమునకు తిరిగి వచ్చి, బ్రాహ్మణునకు అతని వస్తువుల నిచ్చి, మరునాడు ఆశ్రమస్థిత మునులను కూడి వారితో తాము కౌరవులతో నిర్ణయించుకొనిన విధముగా, పన్నెండు సంవత్సరములు అరణ్యవాసము గడిపి, ఇక సంవత్సర కాలము అజ్ఞానవాసము గడుపు సమయము ఆసన్నమైనదని తెలుపగా, మునులు వారిని తగు విధముగా ఓదార్చి, వారు నిర్విఘ్నముగా అజ్ఞాతవాసము గడుపుదురని ఆశీర్వదించి, తమ తమ స్థానముల కేగిరి.

పాండవులు అజ్ఞాతవాస కాలప్రస్తుతికి అచ్చటకు క్రోసు దూరమున ద్రౌపదితోడను, ధౌమ్యునితోడను, శాస్త్రవేత్తలు, మంత్రకుశలురు, సంధి విగ్రహ కాలజ్ఞులయిన పండితులతో సమావేశమైరి.

ఆరణేయ పర్వాధ్యాయ సమాప్తి

వనపర్వము సంపూర్ణము

# విరాటపర్వము

## 1. పాండవ ప్రవేశ పర్వాధ్యాయము

నరనారాయణులకు, దేవి సరస్వతికి నమస్కరించి జయము పలుకుచున్నాను.

అనంతరము జనమేజయుడు, "బ్రాహ్మణోత్తమా! నా పూర్వజులు పాండవులు, వారి భార్య ద్రౌపది యెట్లు అజ్ఞాతవాసకాలము గడిపిరి? సవిస్తరముగా తెలుపుడు" అనిన వైశంపాయనుడిట్లు చెప్పదొడంగెను.

"మహారాజా! ధర్ముని వద్ద వరములను పొంది ధర్మరాజు తమ్ములతో ఆశ్రమమునకు తిరిగి వచ్చి, బ్రాహ్మణులతో జరిగినది చెప్పి, యే బ్రాహ్మణుని అరణి, మంథదండము పోయినవో అతనికి అవి ఇచ్చెను.

అనంతరము ధర్మరాజు అర్జునునితో తాము భద్రంగా నివసింపగలిగిన స్థానములు తెలుసుకొని, తుదకు ధర్మదేవత తెలిపిన ప్రకారము బలవంతుడు, ధర్మశీలుడు, వదాన్యుడు, ముఖ్యముగా పాండవుల యెడ అనురక్తుడు అయిన మత్స్యరాజు విరాటుని యొద్ద అజ్ఞాతవాసకాలము గడుప నిచ్చయించి, యెవ్వరెవ్వరు యెట్టి వేషములతో ఉందురో నిర్ణయింపుడనెను.

### యుధిష్ఠిరుని ఛద్మరూపధారణ

ఆ సమయమున అర్జునుడు, "మహారాజా! మీరు విరాట నగరమున యే పని అవలంబించి కాలయాపన చేయుదురు? మీరు ధీరస్వభావులు, వదాన్యులు, లజ్జాశీలురు, ధార్మికులు, సత్యప్రతిజ్ఞులు. కావున ఈ విపత్సమయములో యే కర్మను అవలంబింతురు? అయ్యో! ధర్మరాజా! యేనాడు కొద్దిపాటి దుఃఖమును అనుభవించి యెరుగరే! నేడు ఈ ఘోరవిపత్తును యెట్లు దాటుదురు?" అనిన ధర్మరాజు, "తమ్ములరా! నేను విరాటభూపతి వద్ద కంకుడను పేర లక్ష హృదయజ్ఞుడు, ద్యూతప్రియుడు అయిన బ్రాహ్మణ వేషమున ఉందును. అతనితో ద్యూతక్రీడా నిరతుడనై ఆనందము కలిగింతును. పూర్వము ధర్మరాజు స్నేహితుడనని తెలిపెదను" అని "వృకోదరా! నీవు విరాటనగరమున యెట్లు నివసింతువు?" అని ప్రశ్నించెను.

## 2. భీమార్జునులు తమ ప్రచ్ఛన్నవేషములను తెలియజేయుట

"ధర్మరాజా! నేను పాకశాలకు అధ్యక్షుడనని తెలిపి, నా పేరు వల్లభుడని తెలియజేయుదును. చక్కని వంటలను వండియు, బలిష్టమైన హస్తి, వృషభాదులతో పోరాడియు రాజునకు ఆనందము కలిగింతును. ఇంతకు క్రితము యుధిష్ఠిరుని సూపకారకుడననియు, మల్లయుద్ధ విశారదుడననియు యెరిగింతును" అని భీముడు తెలుపగా అర్జునుడు, "మహారాజా! విరాటరాజు వద్ద పేడివానిగా పరిచయము గావించుకొందును. నా పేరు బృహన్నలయని తెలిపెదను. విల్లు యెక్కుపెట్టుటచే భుజములందు యేర్పడిన ఆఘాత చిహ్నములను వలువలతో కప్పుకొని, చెవులకు కుండలములు, కరముల శంఖములు దరించి, మస్తకమున వేణితో ఉందును. అంతఃపుర స్త్రీలను నృత్యగీత, వాద్యములతో ఆనందింప జేయుదును. మునుపు ద్రౌపది పరిచారికనని తెలిపెదను.

## 3.

అంత నకులుడు, "మహారాజా! నేను అశ్వవిద్యయందు, అశ్వరక్షణయందు నిపుణుడన. గ్రంధికుడను పేర అశ్వరక్షకునిగా ఉందును. ఇంతకు క్రితము యుధిష్ఠిర మహరాజు వద్ద అశ్వశాలాధ్యక్షునిగా నుంటినని తెలిపెదను" అని తెలుపగా, సహదేవుడు, "నేను గోవులను పరీక్షించి, సంరక్షించుట యందు నేర్పు కలవాడను, తంత్రీపాలుడను పేర విరాటరాజు గోరక్షకునిగా నుందును" అని యెరిగించెను.

తనవైపు కరుణార్ద్రదృక్కులు నిల్పిన ధర్మరాజుతో ద్రౌపది "మహారాజా! నేను కేశసంస్కార కుశలురాలను. సైరంధ్రియను పేర రాజమహిషి సుధేష్ణ వద్ద పరిచారికగా ఉందును. పూర్వము ద్రౌపది పరిచారికనని పరిచయము కావించు కొందును" అని తెలిపెను.

## 4. ధౌమ్యుడు పాండవులకు రాజగృహమున యెట్లుండవలెనో ఉపదేశించుట

అనంతరము ధర్మరాజు, పురోహితుడైన ధౌమ్యుని, ద్రౌపది పరిచారికను, సూతుని, పౌరులను, ద్రుపదుని భవనమునకు చని అగ్నిహోత్రమును రక్షించుటకు నిర్ణయించెను. ఇంద్రసేనుడు మొదలైన సేవకులను రథములతో ద్వారకా నగరము

నకు వెడలునట్లు స్థిరపరచెను. యెవరైనను వారిని ప్రశ్నించిన ద్వైతవనమున పాండవులతో విడిపోయితిమని చెప్పుడనెను.

ఆ సమయమున ధౌమ్యుడు పాండవులను ఉద్దేశించి, "పాండవులారా! రాజులతో యెట్లు నివసించవలెనో, వ్యవహరించవలెనో వివరించెదను. సావధానులై వినుడు. రాజులతో నివసించుట చాలా క్లిష్టము, క్లేశకరము. మీరు సమ్మానము, అసమ్మానము జరిగినను జాగ్రత్తగా ఛద్మవేషము ప్రకటము కాకుండా ప్రవర్తింపుడు. రాజభవనమున యెవరిని కలుసుకొనదలచినను రాజు అనుమతిని ముందుగా పొందవలెను. రహస్య విషయములను యెవ్వరితోను చర్చించకూడదు. రాజు మనను ఆదరించుచున్నాడని అతడు లేని సమయమున అతని ఆసనమున కాని, పర్యంకమున గాని కూర్చుండుట విపత్తును కొనుటయే అని తెలుసుకొనుడు. రాజు అడుగకుండా యే విషయము తమంత తాము తెలుపకూడదు. రాజ మహిషితోను, అంతఃపుర పరిచారికలతోను విరోధము తెచ్చుకొనకూడదు. రాజు ఇష్టపడని వ్యక్తులతో స్నేహము చేయరాదు. 'నేను వీరుడను, తెలివైనవాడనని' రాజుల వద్ద గర్వము ప్రకటించరాదు.

రాజసభలో రాజుకు యెడమవైపున కూర్చొనవలెను. అధికముగా హస్త, పద, ఉష్ఠ సంచాలనము చేయరాదు. గట్టిగా మాట్లాడరాదు. గోపనముగా నిష్ఠీవనము, వాతాపి పరిత్యజించవలెను. అతిహాస్యము, హాస్యసంవరణములు విరుద్ధము. మృదుహాస్యము శ్రేయము. రాజును, రాజపుత్రులను స్తుతించవలెను. రాజును ఛాయవలె అనుసరించి అతని హితకరమైన పనులు చేయవలెను. పాండవులారా! ఇట్లు ఆచరించిన మీరు అజ్ఞాతవాసము గడిపి అచిరకాలములోనే మీ రాజ్యము తిరిగి పొందెదరు" అని పలికెను.

పాండవుల జయమును అభిలషించుచూ ధౌమ్యుడు అగ్నిని ప్రజ్వలింపజేసి, మంత్రోచ్చారణ పూర్వకముగా ఆహుతి ప్రదానము చేసిన పిదప, పాండవులు అగ్నికి, తపోధనులైన బ్రాహ్మలకు ద్రౌపదిని ముందుంచుకొని ప్రదక్షిణము గావించి బయలుదేరిరి.

పాండవులు వెడలిపోయిన పిమ్మట ధౌమ్యుడు మొదలైనవారు అగ్ని హోత్రముతో పాంచాలనగరమునకు వెడలిరి. ఇంద్రసేనాదులు యాదవుల వద్దకు రథాదులతో చని సుఖముగా కాలము గడిపిరి.

## 5. వృక్షశాఖకు అస్త్రములను కట్టి పాండవులు విరాటనగరము ప్రవేశించుట

ఇట్లు పయనించుచూ పాండవులు ద్రౌపదితో విరాటనగరమును సమీపించి, స్మశానమున ఒక శమీవృక్షమును సమీపించి, తమ ఐదుగురి గాండీవాది ధనస్సులను మౌర్వీచ్యుతులను గావించి, ఖడ్గములు, అమ్ములు మొదలైనవాటిని ఒకటిగా కట్టిరి. నకులుడు ఆ శమీవృక్షమును అధిరోహించి, అస్త్రములను భద్రముగా కొమ్మకు కట్టి, లోకులు దుర్గంధమునకు అచ్చటకు రాకుండా ఒక మృతశరీరమును కట్టి, అచ్చట చరించు మేషపాలకులతోను, గోపాలురతోను వృద్ధుడైన తమ బంధువు చనిపోగా కులాచారము ప్రకారము అట్లు వృక్షమునకు కట్టితిమని తెలిపిరి.

అనంతరము ధర్మరాజు తమకు జయుడు, జయంతుడు, విజయుడు, జయక్సేనుడు, జయద్వలుడు అని సాంకేతికనామములు యేర్పరిచి, తమ్ములతోను, భార్యతోను అజ్ఞాతవాసకాలము పూర్తిచేయ విరాటనగరము ప్రవేశించెను.

## 6. యుధిష్టిరుడు దుర్గను పూజించుట

విరాటనగర సమీపమున దుర్గామందిరమున పాండవులు, ద్రౌపది దేవికి పూజలు సలిపిరి. ధర్మరాజు దేవిని "యశోదా నందినీ, నారాయణప్రణయణీ, భువనేశ్వరి, దివ్యమాల్య విభూషితా, బాలార్క సదృశా, చతుర్భుజే, మయూరపింఛ వలయే, పీనపయోధరే, పృథునితంబినీ, నానా ఆయుధధారిణీ, కామచారిణీ, కాళి, మహాకళి, దుర్గే, సురేశ్వరీ, కీర్తి, లక్ష్మి, ధృతి, సిద్ధి, లజ్జా, విద్యా, బుద్ధి, సంధ్యా, రాత్రి, ప్రభా, నిద్రా, జ్యోత్స్నా, కాంతి, క్షమా, దయా, మాతా! నేను రాజ్యభ్రష్టుడనై నీ శరణు జొచ్చితిని. మమ్ములను రక్షింపుము" అని పలు విధముల కీర్తింపగా అష్టభుజాదేవి ప్రత్యక్షమై, "రాజా! కొద్దికాలములోనే నీవు సంగ్రామమున విజయము పొందెదవు. కౌరవ సైన్యమును జయించి, తమ్ములతో నిష్కంటకముగా రాజ్యభోగములను అనుభవించెదరు. మీరు విరాటనగరమున ఉన్న సమయమున యెవ్వరూ మిమ్ము గుర్తింపజాలరు" అని ఆశీర్వదించి అంతర్ధానము చెందెను.

## 7. ధర్మరాజు విరాటనగరము ప్రవేశించుట

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! తదనంతరము యుధిష్టిరుడు వైడూర్య, కాంచనమయ అక్షగుటికలను, పంచకొంగున కట్టుకొని ముందుగా బయలుదేరి విరాటరాజు సభను ప్రవేశించి, రాజు, సభికులు యే మహారాజో అని భ్రమించు

చుండగా విరాటుని సమీపించి, "రాజా! నేను బ్రాహ్మణుడను. వ్యాఘ్రపది గోత్రుడను. నా పేరు కంకుడు. పూర్వము యుధిష్ఠిరుని ప్రియసఖునిగా ఉండెడి వాడను. ద్యూతక్రీడయందు నిపుణత కలవాడను. మీ కొలువులో ఉండుటకు ఆశపడి వచ్చితిని" అని పలుకగా విరాటుడు, "నీ కోరిక నాకు సమ్మతమే. నాతో మత్స్యదేశమును శాసింపుము. ద్యూతానురక్తులనిన నాకు అత్యంత ప్రియులు".

అంత కంకుభట్టు తాను నీచులతో జూదమాడననియు, ధనమందు కాంక్ష లేనివాడననియు తెలిపిన రాజు అందులకు అంగీకరించి, అనుచరవర్గమునకు తనను గౌరవించినట్లే కంకుభట్టును కూడా గౌరవింపుడని ఆజ్ఞ ఇడెను.

## 8.

అన్న చనిన పిదప భీముడు యెఱ్ఱని వస్త్రములు ధరించి, ఒక చేత ఒరతీసిన కత్తి, మరియొకచేత గరిట, కవ్వము ధరించి సూపకారుని వేషమున మత్స్యరాజును సమీపించెను. సూర్యుని వలె ప్రకాశించుచూ, ఉన్నతమైన స్కంధములతో నున్న భీముని రాజు పరిచయమడుగగ అతడు, "మహారాజా! నేను సూపకారుడను. నా పేరు వల్లభుడు. పూర్వము యుధిష్ఠిర మహారాజువద్ద వంటశాలకు అధ్యక్షునిగా ఉండెడివాడను. నా వంటి మల్లయుద్ధవిశారదులు అరుదు. సింహములతోను, యేనుగులతోను పోరాడి మీకు ఆనందము చేకూర్చగలను" అని పలికిన, విరాటరాజు, "వల్లభా! నీవు తప్పక మా వంటశాలకు అధికారివిగా ఉండుము. కాని నీవు సామాన్యమైన వంటవానిగా కనిపించుట లేదు. ధరామండలము యేలు లక్షణములు కలవాడవు. యేది యేమైనను నీవు యథేచ్ఛగా మావద్ద నివసింపుము" అని అనుజ్ఞ ఇచ్చెను.

## 9.

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! అనంతరము ద్రౌపది కోమలమైన కేశరాశి వేణిగా రచించి, మలిన వస్త్రములతో సైరంధ్రి వేషమున దీనభావముతో రాజమహిషి సుధేష్ణను సమీపించి, "మహిషీ! నేను సైరంధ్రిని, చక్కగా జడ అల్లగలను, మల్లిక, ఉత్పల, కమల, చంపకాది పుష్పముల మాలలు కూర్చగలను. నేను ఇంతకు క్రితము పాండవపత్ని ద్రౌపదికి దాసిగా ఉండెడిదానను. ఆమె నన్ను మాలిని అని పిలిచెడిది. నన్ను మీ వద్ద దాసిగా ఉంచుకొనుడు" అని వేడుకొనగా, రాజపత్ని, "నీవు అపురూప సౌందర్యవతివి. నిన్ను చూచి మొగవారే

అని చెప్పనేల స్త్రీలు కూడా మోహపరవశులగుదురు. రాజు నిన్ను చూసిన నన్నే పరిత్యజించవచ్చును" అని సందేహము ప్రకటింపగా, సైరంధ్రి, "భవానీ! మీరు సందేహింపవలదు. నన్ను యే పురుషుడూ కన్నెత్తి చూడలేదు. ఐదుగురు గంధర్వులు నా భర్తలు యెల్లపుడూ నన్ను కాపాడుచుందురు. నేను ఉచ్ఛిష్టమును తినను. పాదప్రక్షాళనము కావింపను" అనగా రాణి ఆనందముగా సైరంధ్రిని తన అంతః పుర పరిచారికగా ఉంచుకొనెను.

## 10.

అనంతరము సహదేవుడు గోపవేషమున విరాటుని సమీపించి, "రాజా! పాండవ జ్యేష్ఠుడైన ధర్మరాజు యొక్క బహుసంఖ్యాక గోవులను పర్యవేక్షించెడి వాడను. నా పేరు తంత్రీపాలుడు. గోవును చూడగానే దాని జాతిని, వయస్సు చెప్పగలను. గోవుల క్షీరము వృద్ధిపొందించుట, రోగములు రాకుండా చూచుట యందు నేర్పరిని. నన్ను మీ కొలువులో ఉంచుకొనుడు అని పలుకగా రాజు, "నావద్దనున్న పశుసంపదకు నీవు సంరక్షకుడవు కమ్ము" అని అతనిని తన ఆశ్రితుని కావించుకొనెను.

## 11.

పరమ సుందరుడు, ఉన్నతకాయుడు అయిన అర్జునుడు స్త్రీల వలె కుండలములను, చేతులకు శంఖపు గాజులను ధరించి, సుదీర్ఘమైన కేశములను ఉన్యోచన పూర్వకముగా విరాటరాజు సభామంటపమును సమీపించెను.

అతనిని చూచి మత్స్యరాజు, "మహానుభావా! నీవు స్త్రీవలె కుండలములు, శంఖవలయాదులు ధరించితివి. పురుషుని వలె శర, శరాసన, కవచాదులు ధరించితివి. అమరసదృశమైన రూపమున వెలుగొందుచున్నావు. పేడివాడివనిన నమ్మకము కలుగుట లేదు. నీవు నా కుమారుని తుల్యుడవు. నేను వృద్ధుడను. నీవే రాజ్యము శాసింపుము" అని పలుకగా అర్జునుడు, "మహారాజా! నేను నృత్య, గీత, కార్యములయందు దక్షుడను. నన్ను దేవి ఉత్తరకు నృత్యశిక్ష గరుప నియోగింపుడు. నా పేరు బృహన్నల. నన్ను మాతృపితృహీనునిగా భావించి, ఆదరింపుడు" అని పలుకగా, విరాటుడు "నీ మనోరథము పూర్ణమగుగాక! నేటినుండి ఉత్తరకు, ఇతర అంతఃపుర స్త్రీలకు నృత్యము నేర్పుము" అని ఆదరముగా పలికెను.

## 12.

అశ్వశాలలోని అశ్వములను పరీక్షించుచూ వచ్చు నకులుని చూచి విరాటుడు యెవ్వరివని ప్రశ్నింపగా నకులుడు, “మహారాజా! నేను అశ్వరక్షకుడను. అశ్వముల గుణములను, లక్షణములను చక్కగా తెలిసినవాడను. పూర్వము యుధిష్ఠిర మహారాజు వద్ద అశ్వశాలాధ్యక్షునిగా నుండెడివాడను. నా పేరు గ్రంధికుడు” అనిన రాజు అతనిని తన అశ్వశాల పర్యవేక్షకునిగా నియోగించెను.

పాండవ ప్రవేశ పర్వాధ్యాయ సమాప్తి

## 13. సమయపాలన పర్వాధ్యాయము

ఇట్లు పాండవులు విరాటనగరము ప్రవేశించి, తాము ముందుగా నిర్ణయించుకొన్న విధముగా ద్రౌపదితో మత్స్యరాజు కొలువులో ఉండి తమ తమ పనులను కావించుచూ నాలుగు నెలలు గడిపిరి.

## బ్రహ్మోత్సవము-మల్లక్రీడ-జీమూతమల్ల వధ

విరాటనగరమున బ్రహ్మోత్సవము మహాసంరంభమున జరుగు సమయమున దేశదేశములనుంచి మల్లయుద్ధ నిపుణులు రాజువద్ద తమ విద్యలను ప్రదర్శించిరి. వారిలో జీమూతమల్లుడన్నవాడు అందరినీ మించి, తనను యెదుర్కొనగలిగినవారు లేకుండా చేసెను. అదిగాంచి విరాటరాజు సూపకారుడైన వల్లభుని పిలిపించి అతనిని జీమూతమల్లునితో మల్లయుద్ధము చేయుమని కోరగా, భీముడు తన ఛద్మవేషము బయల్పడునని శంకించియూ, రాజాజ్ఞను మీరజాలక, రాజునకు నమస్కరించి, శార్దూలము వలె మెల్లమెల్లగా మహారంగమున ప్రవేశించి కటిబంధనము గావించి, జీమూతమల్లుని ఆహ్వానించెను.

ఆ వీరులిద్దరూ కొదమసింగముల వలె మల్లయుద్ధమునకు ఒకరినొకరు ఢీకొనిరి. భీకరముగా నాదము చేయుచూ, బాహుప్రహారములతోను, ముష్టి ఘాతములతోను, పదాఘాతములతోను, చపేటా ఘాతములతోను, మస్తక సంఘట్టనములతోను ఘోరమైన సంగ్రామము కావించిరి. భీముడు జీమూతుని యెత్తి గిరగిర త్రిప్పి నేలపై విసిరివేయగా అతడు ప్రాణములు విడచెను. అనంతరము భీముడు తనను యెదుర్కొనువారు లేకపోవుటచే యేనుగులతోను, సింహములతోను పోరాడి రాజునకు, అంతఃపుర స్త్రీలకు ఆనందము చేకూర్చెను. విరాటుడు సంతసించి వల్లభునకు అత్యధిక ధనమునిచ్చి గౌరవించెను.

కంకుభట్టు రాజకుమారులకు అక్షక్రీడ నేర్పుచు, బృహన్నల అంతఃపుర కాంతలకు నృత్యగీతములు నేర్పుచూ నకుల సహదేవులు అశ్వగోరక్షకులుగాను, సైరంధ్రి పరిచారికగాను కాలము గడుపుచుండిరి.

సమయపాలన పర్వాధ్యాయము సమాప్తము

## 14. కీచకవధ పర్వాధ్యాయము

ప్రచ్ఛన్నవేషధారులై పాండవులిట్లు విరాటనగరమున పది నెలు గడిపిరి. ఒకనాడు విరాటభూపతి సేనాధిపతి, శ్యాలకుడు అయిన మహాబలుడు కీచకుడు సహోదరియైన సుధేష్ణ వద్దకు చని, అచ్చట అపురూప సౌందర్యవతియైన సైరంధ్రిని గాంచి మోహపరవశుడై, అక్కను మె యెవరని ప్రశ్నింపగా, ఆమె తమ్ముని వారింప ప్రయత్నించెను. కాని కామాంధుడైన కీచకుడు సైరంధ్రిని చేరి, తనను వరింపుమని పరి పరి విధముల వేడుకొనెను.

పతిపరాయణయైన ద్రౌపది అతనిని తిరస్కరించుచూ, "సూతపుత్రా! మోహావిష్టుడవు కావద్దు. యెందులకు వృధాగా జీవనము పోగొట్టుకొందువు? మహాపరాక్రమవంతులైన ఐదుగురు గంధర్వులు నా భర్తలు యెల్లవేళలా నన్ను కాపాడుచుందురు. యెన్నటికీ నీవు నన్ను పొందజాలవు. గంధర్వులు కుపితులైన తప్పక నిన్ను సంహరింతురు. మృత్యుముఖమును ప్రవేశింపకుము. నీవు తెలివితక్కువ బాలకుని వలె ప్రవర్తించుచున్నావు. నా భర్తలే క్రోధాన్వితులైన నీట దాగినను, అంతరిక్షమునకు చనినను నిన్ను ప్రాణములతో విడువరు. కావున మంచిదారిని దృష్టి నిలిపి ప్రాణములు రక్షించుకొనుము" అని తీవ్రముగా పలికి తన కార్యమున అంతఃపురమున చనెను.

## 15.

అనంతరము అనంగశరజర్జితుడైన కీచకుడు దేవి సుధేష్ణను చేరి, "సహోదరీ! గజగమనయైన సైరంధ్రి నన్ను చేరు ఉపాయము ఆలోచింపుము. ఆమె నాకు వశము కాకపోయిన నేను నిశ్చయముగా ప్రాణత్యాగము చేయుదును" అని యెన్నో విధముల ప్రార్థింపగా ఆమె, "నీవద్దనుంచి మద్యమును తెచ్చుటకు ఆమెను పంపెదను. ఈ లోపున ఆమెను సంతోషపరచుటకు తగిన యేర్పాట్లు చేసుకొనుము" అని తమ్ముని పంపి, అనంతరము సైరంధ్రిని పిలిచి, ఆమె చేతిలో హిరణ్మయ పాత్రనుంచి, కీచకుని వద్దనుంచి మేలురకము మద్యము తెమ్మని ఆజ్ఞాపించెను.

కంటినీటితో రాణి మాటలను త్రోసిపుచ్చలేక ద్రౌపది భయపడుచూ కీచకుని ఆలయమునకు బయలుదేరెను. మార్గమున మనస్సులో "నేను భర్తలను తప్ప అన్యపురుషుల యెడ ఆసక్తురాలను కాదేని, ఆ పుణ్యవశమున కీచకుడు నన్ను యేమియూ చేయలేకపోవుగాక" అని పదే పదే అనుకొని, జగద్రక్షకుడైన సూర్యదేవుని ప్రార్థింపగా, ఆమె అభిమతము నెరింగి దివాకరుడు ప్రచ్ఛన్నముగా ఆమెను రక్షించుటకు రాక్షసుని ప్రేరేపించెను.

క్రమముగా కక్ష్యంతరములు దాటి సైరంధ్రి కీచకుని సమీపింప దురాత్ముడైన కీచకుడు ఆమె వచ్చుటను చూచి, మిక్కిలి ఆనందించెను.

## 16.

"సుందరీ! రమ్ము. నీకై చక్కని బట్టలను, నగలను ఉంచితిని. సుఖముగా తినుటకు భక్ష్యభోజ్యములు సిద్ధముగా నున్నవి. వీనిని అనుభవించి నన్ను ఆనందింపజేయుము" అని ఆహ్వానింపగా ద్రౌపది తనను రాజమహిషి పంపిన కారణము తెలిపి, సురను ఇమ్మనిన, కామమున కళ్లు మూసుకుపోయిన కీచకుడు ఆమె కొంగును గ్రహించి బలాత్కరించబోయిన, ద్రౌపది అతనిని త్రోసి, గబగబా అడుగులు వేయుచూ విరాటుడు, యుధిష్టిరుడు మొదలైనవారు కూర్చొనియున్న సభామంటపమును ప్రవేశించెను. ఆమె వెంటనే త్వరితముగా వచ్చిన కీచకుడు ఆమె కేశములు గ్రహించి నేల పడవైచి, భూపాలుని సమక్షముననే ఆమెను కాలితో తన్నెను. ఆ సమయమున సూర్యప్రేరితుడైన రక్షకుడైన రాక్షసుడు వాయువేగమున కీచకుని మోదగానే అతడు నరికిన చెట్టువలె నేలపడెను.

సభలోనున్న యుధిష్టిరుడు, భీముడు ద్రౌపది పరాభవము గాంచి మిక్కిలి ఉద్విగ్నులైరి. కీచకుని వధించు అభిలాషతో భీముడు రోషముతో పళ్లు పటపట కొరకసాగెను. అతని కన్నులు యెఱ్ఱనయ్యెను. లలాటమున స్వేద బిందువులు నిండ భృకుటి ముడివైచెను. అతని వీరావేశము చూచి, తన కాలి బొటనవ్రేలితో భీముని వ్రేలు నొక్కి "ఓయి! కట్టెలే కావలసి వచ్చిన బహిర్దేశమునుంచి తెమ్ము" అని అతనిని హెచ్చరించెను.

ద్రౌపది తన భర్తలను రక్షింపుడని పిలుచుచూ, ధర్మమును వదలితివి అని విరాటరాజును నిందింపగా, రాజు యధార్థముగా మీ తగవుకు కారణము తెలుసుకొనకుండా యెట్లు విచారింపగలనని అంటాడు. సభికులు మాత్రము కీచకుని దుష్ప్రవర్తనకు అతనిని నిందింపసాగిరి.

తమ ప్రేయసి దుర్దశకు మిక్కిలి కోపముతో లలాటమున ఘర్మజము నిండ, ధర్మరాజు అతికష్టమున కోపమును అణచుకొని, ద్రౌపదితో, "సైరంధ్రీ! ఇక నీవు ఇచ్చట నిలువవలదు. త్వరితముగా సుధేష్ణ ఆలయమునకు చనుము. వీరపత్నులు మ భర్తల కొరకు యెన్నో కష్టములు పడినను సద్గతిని పొందెదరు. నీ పతులు కోపము ప్రదర్శించు సమయము ఇంకనూ ఆసన్నము కాలేదనుకొందును. లేకపోయిన ఈసరికి సూర్యసమాన తేజస్కులైన ఆ గంధర్వులు వచ్చి ఉండెడివారు. సిగ్గులేని నటి వలె రాజసభలో సమయము వ్యర్థము చేయకుము. వెంటనే ఈ స్థలము వీడుము. ఉపయుక్త సమయమున గంధర్వులు నీకు అప్రియము చేయదలచినవారిని సంహరించి, నీకు ప్రియము చేకూర్తురు. వారు తప్పక నీ దుఃఖమునకు ఉపశమనము కావింతురు" అనగా రోషముతో ద్రౌపది "వారిలో జ్యేష్ఠుడు ద్యూతక్రీడచే శోచనీయమైన దశకు వచ్చాడు. కాని నేను వారి గురించి ధర్మానుష్టానమే చేతును" అని అంతఃపురమునకు చని సుధేష్ణతో కీచకుడు తనకు కావించిన అవమానము తెల్పి తప్పక తన గంధర్వ పతులు అతనిని వధింతురని తెలిపెను.

## 17.

ద్రౌపది కీచకుడు కావించిన అవమానమునకు పదే పదే స్మరణకు రాగా, అతని మృత్యువును కోరుకొనుచు నిజనివాసము చేరి, మలిన వస్త్రములను వదలి స్నానము చేసి, "యేమి చేతును? యెచ్చటకు పోదును?" అని అనుకొనుచూ రోదించి తుదకు భీమసేనుడు తప్ప తనను ఓదార్చి మేలుచేయువారు లేరని తలంచి, రాత్రియైన తరువాత రహస్యముగా వృకోదరుని మందిరము చేరెను. అతడు నిశ్చింతగా నిద్రించుచుండుట చూచి, అతనిని లేపుచూ, "నాథా! కీచకుడు కావించిన అవమానమును భరించి ఇట్లు నిద్రించుట నీవంటివారికి తగదు. లెమ్ము! ప్రతీకారము తీర్చుకొను ఉపాయము ఆలోచింపుము" అనగా భీముడు నిద్ర లేచి, ద్రౌపదిని ఓదార్చసాగెను.

## 18-20.

అంత ద్రౌపది భీమసేనునితో, "నాథా! ధర్మరాజునకు భార్యయైన స్త్రీకి సుఖమెక్కడిది. నీవు యేమియూ జరగనట్లు ఇంకను యెట్లు ఓర్చుకొని ఉన్నావు? నాడు ప్రతీకామి నన్ను దాసీ అని పిలచినప్పటి అవమానము ఇంకే స్త్రీయైనను పొందినదా? దురాత్ముడైన జయద్రధుని వలన నేను పొందిన అవమానము ఇంకే

స్త్రీయైనను అనుభవించినదా? నేడు ధూర్తుడైన కీచకుడు మత్స్యరాజు యెదుటనే నన్ను కాలితో తన్ని అవమానించెను. ఇట్టి కష్టములో నేనున్ననూ నా యెడ నీవు దయ చూపుట లేదు. ఇక జీవించి లాభమేమి? మీ అన్నవలె ధనరాసులనే కాక తమను తాము పణముగా నుంచుకొని జూదమాడువారు ఇంకెక్కడైనా ఉన్నారా? మహావీరుడవైన నీవు నేడు సామాన్యుని వలె జీవించుచున్నావు. నేను దాసినై పెక్కు ఇడుములు పడుచున్నను. కోమలములైన నా చేతులు యెట్లు పొక్కులెక్కి మృదుత్వమును కోల్పోయినవో గమనింపుము" అని భీముని వక్షస్థలముపై తలనుంచి రోదించసాగెను.

## 21.

భీముడు ఆదరముతో ద్రౌపది చేతులు నిమురుచూ, "ప్రేయసీ, నీవు విచారింపవలదు. ధర్మరాజు సమయము కొరకు వేచియున్నాడు. ఆతడు సభలో ఆపకపోయిన ఆ క్షణముననే కీచకుని సభలో నాశనము చేసియుండెడివాడను. నీ యెడ దుశ్శాసన, కర్ణాదులు ఆచరించిన కృత్యములకు నా మనస్సు దావాగ్నివలె యెల్లవేళలా మండుచున్నది. నీవు ఆదరించకపోయిన యుధిష్ఠిరుడు దేహత్యాగము చేయును. అతనితో మేము కూడా లోకాంతప్రాప్తులమగుదుము. సీత, సావిత్రి మొదలైన పతివ్రతల వలె నీకు కొద్దికాలము తాళుము. తప్పక మన కష్టములు తీరును. నీవు తిరిగి రాజమహిషి వగుదువు" అనిన ద్రౌపది, "నాథా! నేను యుధిష్ఠిరుని నిందించుట లేదు. నేను కొద్దికాలమైనను ఇక్కడ ఉండుట మహావిపత్కరమైనది. రాజమహిషి సుధేష్ణ నా సౌందర్యము చూచి రాజు నన్ను పరిగ్రహించి ఆమెను ఉపేక్షించునో అని భయపడుచూ నా యందు కోరిక పుట్టిన దురాత్ముడైన కీచకుని వద్దకు సురను తీసుకొని రమ్మని పంప ఆ పాపాత్ముడు నను బలాత్కారము చేయబోయి తుదకు సభలో అందరి సమక్షమున కాలితో తన్నెను.

నీవు మునుపు నన్ను జటాసురుని బారినుండి రక్షించితివి. జయద్రథుని మదమణంచితివి. రాజాశ్రితుడైన ఈ కీచకుడు నన్ను శాంతిగా ఉండనీయడు. ఆ దురాత్ముడు సూర్యోదయమునకు జీవించియున్న యెడల నేను విషము త్రాగి ప్రాణములు వదలుదును" అని దీనముగా యేడ్వదొడంగెను.

భీముడు ప్రియభార్యను కౌగలించుకొని, కన్నీరు తుడిచి, ఓదార్చి, కీచకుని తలచుకొని క్రోధముతో వేడి నిట్టూర్పులు విడచుచూ ఇట్లనెను.

## 22.

"యాజ్ఞసేనీ! విచారింపకుము. నీవు కోరిన విధముగా కీచకుని తప్పక వధింతును. విరాటరాజు యొక్క నృత్యశాలకు పెక్కురు బాలికలు నాట్యమునకు వత్తురు. అచ్చట చక్కటి పల్యంకము కలదు. నీవు కీచకునితో రేపు రాత్రి అచ్చటకు రమ్మని, తప్పక అతని కోరిక తీర్తునని పలుకుము. ఈ విషయము ఇతరులకు తెలియకుండా జాగ్రత్తగా యుండుము. అతడిక యముని ఇంటిలోనివాడని తలంచుము" అని పలికిన ద్రౌపది ప్రాభాతకాలము వరకు భీముని వద్దనుండి పిదప అంతఃపురమునకు చనెను.

ఉదయముననే కీచకుడు మహాసంరంభముతో ద్రౌపదిని సమీపించి, "సునయనీ! నేను భూపాలుని సమక్షముననే నిన్ను పదాఘాతము చేసితిని. నిన్ను అతడు రక్షించగలిగాడా! విరాటరాజు పేరుకే మత్స్యదేశమునకు రాజు. నిజమునకు నేనే రాజును, సేనాధిపతిని. సుందరీ! నా ముద్దు చెల్లించుము. మహాసౌఖ్యముల నోలలాడించి, నీ పాదసేవకుడనై యుందును" అని పలికెను.

ద్రౌపది సిగ్గు నటించి రాత్రియైన పిమ్మట తనను నాట్యశాలలో యేకాంతముగా కలసుకొనుమనిన, మదాంధుడైన కీచకుడు ఆనందముగా వెడలిపోయెను.

ద్రౌపది భీముని కలసుకొని జరిగినది తెలిపి, కీచకుని వధించుటకు సంసిద్ధుడవు కమ్మని తెలిపెను. వృకోదరుడు ఆమెను ధైర్యమవలంబించుమని, తప్పక కీచకుని వధించి ఆమెకు ఊరట కలిగింతునని తెలిపెను.

సాయంకాలము చీకటి పడిన తరువాత కీచకుడు అలంకరించుకొని ద్రౌపది చెప్పిన విధముగా నాట్యశాలను చేరెను. అంతకు క్రితమే వచ్చియున్న భీముని ద్రౌపదిగా భావించి ఆనందముతో కౌగలించుకొని, "ప్రేయసీ! నా కోరిక తీరినది. నీవంటి అందాలరాశిని యెన్నడూ చూడలేదు. నా జన్మ ధన్యమైనది" అనగా భీముడు "కీచకా! నిజముగానే నీ జీవితము నేటితో ధన్యమయ్యేటట్లు చూస్తాను. నీ కామమునకు తగిన ప్రతిఫలము ఇప్పుడే చవిచూపెదను" అని కీచకుని కేశములను గ్రహింప అతడు విదిలించుకొని భీమునితో కలియబడెను. ఆ అంధకారమున ఈ ఇరువురు తాడిత భుజంగములవలె చాలాసేపు పోరాడిరి. తుదకు మహాబలుడైన భీముడు కీచకుని నేల పడవైచి గుండెల మీద కూర్చొని, పశువును చంపినట్లు పీక నొక్కి చంపెను. అనంతరము సైరంధ్రిని పిలచి,

"నిన్ను అవమానించిన అధముని చంపి ఋణము తీర్చుకొంటిని" అని పలికి కోపము చల్లారిన పళ్లు కొరుకుచూ కీచకుని కాళ్లు చేతులు, తల మొండెములోనికి త్రోచి మాంసపిండము వలె చేసి, ద్రౌపదికి అగ్ని ప్రజ్వలించి చూపి, "నిన్ను కామించినవారికి కీచకునికి పట్టిన దశ కలుగును. నీవు నిర్భీకురాలవు కమ్ము" అని కీచకుని శరీరమును మరియొకమారు కాలితో తన్ని ద్రౌపదితో చెప్పి తన నివాసస్థానమున కేగెను.

ద్రౌపది ఆనందముతో తనను అవమానించిన కీచకుని పరిణతి చూడుడని సభాసదులను పిలచెను.

ద్రౌపది వచనములు విని అనేకులు ఆ మందిరమును ప్రవేశించి, హస్త పాద విహీనమై, రక్తముతో తడిసియున్న కీచకుని శరీరమును చూచి ఆశ్చర్యము పడి, 'ఈతని చేతులేవి, తల యేది, కాళ్లు యేవి?' అని అబ్బురపడసాగిరి.

## 23.

ఉపకీచకులు, ఇతర బంధువులు కీచకుని సమీపించి, రోదించుచూ, కొంసేపటికి తెప్పరిల్లి, దగ్గరనే నిలిచియున్న సైరంధ్రిని చూచి, కీచకుని మృతికి ఆమెయే కారణమని ఆమెను వధింపదలంచి, విరాటరాజును సమీపించి, "రాజా! పాపాత్మురాలైన ఈ సైరంధ్రి వలననే కీచకుడు ప్రాణములు కోల్పోయెను. అందువలన ఈమెను మేము అతని శరీరముతో పాటు దగ్ధము చేయదలంచితిమి. మీరు అనుజ్ఞ ఇందు" అని పలుకగా, భీతుడైన రాజు వారి మాటకు సమ్మతి తెలియజేసెను.

వారు సైరంధ్రిని బంధించి, కీచకుని మృతదేహముతో స్మశాన భూమికి బయలుదేరగా, దీనయై ద్రౌపది రోదించుచూ, జయ, జయంతా, విజయ, జయత్సేన, జయద్వలా అని భర్తలను సంకేతిక నామములతో పిలచుచూ, రక్షింపుడని ప్రార్థింపసాగెను.

ద్రౌపదీ విలాపములను వినిన భీముడు త్వరితముగా వేషము మార్చుకొని రాజమార్గమున గాక, వేరొక మార్గమున నగరము దాటి స్మశాన వాటికను సమీపించి, విశాలమైన భూరుహమొకటి పెకలించి ఉపకీచకులను సమీపించ సాగెను. వారును ఆతనిని సైరంధ్రిని రక్షించుటకు వచ్చిన గంధర్వునిగా భావించి, అపర కృతాంతుని వలె మహావృక్షముతో వచ్చు ఆ మహావీరునకు వెరచి, ద్రౌపదిని వదిలి పారిపోసాగిరి. మహాకోపముతో భీముడు 105 మంది ఉపకీచకులను

వృక్షముతో మోది చంపి, ద్రౌపదితో, "ప్రియురాలా! నిన్ను కష్టపెట్టిన వారికందరికీ ఇట్టి శాస్తినే చేయుదును. నీవిక భీతి చెందక నగరము ప్రవేశింపుము" అని ఆమెను రాజమార్గమున పంపి తాను వేరొక దారిని నగరము ప్రవేశించెను.

## 24.

ఉపకీచకుల ఘోరమైన చావు చూచిన కొందరు నాగరికులు రాజును సమీపించి, "మహారాజా! మహాబలుడైన గంధర్వుని వలన ఉపకీచకులందరూ మరణించిరి. లోకైక సౌందర్యవతియైన సైరంధ్రియందు ఆసక్తులై బహు సంఖ్యాకులైన వ్యక్తులు గంధర్వులచే చంపబడుట తథ్యము. కావున తగిన విధముగా ప్రవర్తింపుడని మిమ్ము హెచ్చరించుచున్నాము" అని పలికిరి.

అనంతరము విరాటరాజు ఉపకీచకుల దహన సంస్కారమునకు తగిన యేర్పాట్లు గావించి, పిదప సుధేష్ణను పిలచి, "రాణీ! నీవు సైరంధ్రి తిరిగి వచ్చిన గంధర్వుల కార్యమునకు రాజు భీతిచెందెననియు, ఇక యెందైనను చనుమనియు నా మాటగా తెలియజేయుము" అని పలికెను.

ఇక్కడ ఉపకీచకుల బారినుండి భీమునిచే రక్షింపబడిన ద్రౌపది శుచియై, నగరము ప్రవేశింపగా, గంధర్వుల ప్రతాపమును వినిన పౌరులు కొందరు ఆమెను చూచి భయముతో పారిపోసాగిరి. కొందరు గట్టిగా కన్నులు మూసుకొనిరి.

క్రమముగా కభ్యాంతరములు దాటుచూ ద్రౌపది రంధనశాల వద్దనున్న బీమునకు సంకేతిక భాషలో కృతజ్ఞత తెలిపి, అంతఃపురము ప్రవేశింపగా విరాటరాజు కన్యలకు నాట్యము నేర్పుచున్న బృహన్నల ఆమెను చూచి, పాపాత్ముల బారినుండి రక్షింపబడినందులకు సంతోషము ప్రకటింపగా, ద్రౌపది కోపముతో, "కళ్యాణీ! బృహన్నలా! నీవు అంతఃపుర కాంతలతో పరమసుఖమున వసించుచున్నావు. సైరంధ్రి వృత్తాంతము నీకేల? ఆమె పడుచున్న కష్టములు నీకు తెలియవు కనుకనే, సహాస్యముగా కుశల ప్రశ్నలు వేయుచున్నావు" అని పలుకగా అర్జునుడు, 'సైరంధ్రీ బృహన్నలకు నీ క్లేశము పూర్తిగా తెలుసు. నీవు బృహన్నలను పశు-పక్షులలో జమ చేయవలదు. ఒకే స్థలమున నివసించువారు యొకరికి కోపము వచ్చిన అందరూ దుఃఖముననుభవించరు. ఒకరి మనస్సులోని విషయము మరియొకరికి పూర్తిగా తెలియదు కనుకనే నా మనస్సులోని భావము గ్రహించలేకపోయితివి" అని పలికెను.

అనంతరము ద్రౌపది రాజగృహమును ప్రవేశింపగా, సుధేష్ణ ఆమెను చూచి, “సైరంధ్రీ! వెంటనే నీవు ఇచ్చువచ్చిన స్థలమునకేగుము. మహారాజు గంధర్వుల కృత్యమునకు భీతిచెందిరి. నీవు అసామాన్య రూపవతివి. యువతివి. పురుషుల హృదయములు అతిచంచలములైనవి. మరియు నీ భర్తలైన గంధర్వులు కోపస్వభావులు. అందువలన నీవిచటనుండుట మాకు క్షేమము కాదు” అనిన, ద్రౌపది, “దేవీ! మరియొక పదమూడు రోజులు నన్ను దయదలచి ఉండనిండని మహారాజునకు తెలియజేయుడు. ఈ లోపున గంధర్వులు కృతకార్యులగుదురు. అనంతరము వారు నన్ను ఇచ్చటనుండి తీసుకొని పోయెదరు. మీకు, మహారాజునకు శుభములు కలుగజేయుదురు” అని వేడికొనెను.

కీచకపర్వాధ్యాయ సమాప్తి

## 25. గోహరణ పర్వాధ్యాయము

వైశంపాయనుడు జనమేజయునితో ఇట్లనెను, “మహారాజా! ఈ విధముగా కీచకుడు, ఉపకీచకులు నాశనము కాగా, ప్రజలలో నాల్గువైపులా గంధర్వుల శౌర్య వీర్యగాథలు వ్యాపించెను.

అంతకు క్రితము పాండవుల రథములను ద్వారకకు మరలిన సంగతి, ధౌమ్య పురోహితాదులు పాంచాల రాజువద్దకు చనిన వార్త తెలిపి, పాండవుల జాడ తెలియలేదని గూఢచారులు, మహావీరుడైన కీచకుని యొక్కయూ, ఉపకీచకుల యొక్కయూ ఘోర మరణవార్త దుర్యోధనాదులకు తెలియజేసిరి.

## 26.

దుర్యోధనుడు, కర్ణుడు, దుశ్శాసనుడు, శకుని మొదలైనవారు పాండవుల జాడ తెలియలేదని తాము పంపిన వార్తావాహకుల వలనను, చారుల వలనను తెలుసుకొని వారు యే క్రూర మృగముల పాలపడియో, రాక్షసుల చేతనో నాశనమయి ఉందురనియు, లేదా రాజ్యము కోల్పోయితిమన్న బెంగతో ఆత్మహత్య చేసుకొనియుందురని భావించి తమ అభిప్రాయము తెలియజేసిరి.

## 27.

వారి మాటలు విని ద్రోణాచార్యుడు, “పాండవులు అసాధారణ శౌర్యశాలురు, కృతవిద్యులు, బుద్ధిమంతులు, జితేంద్రియులు, ధర్మజ్ఞులు. వారు ప్రచ్ఛన్న వేషధారులై చరించుచుందురు. సమయము రాగానే తప్పక తమ పరిచయము

తెలియజేయగలరు. కావున వారిని పోల్చుగొనగలిగిన చారులను, బ్రాహ్మణులను పంపి వెదికించుటయే మేలు" అని తెలియజేసెను.

## 28.

అంత కురుపితామహుడైన భీష్ముడు, ద్రోణాచార్యుని అభిమతమును ప్రశంసించి, "పాండవులు సర్వశుభలక్షణ సంపన్నులు, సత్యవ్రత పరాయణులు, క్షాత్రధర్మానుసారులు. వారు యెంతమాత్రము నాశనము చెందలేదని తెలుసుకొనుడు. ఎవ్వరూ వారికి కీడు చేయలేరు. సభలో న్యాయసంగతమైన మాటలను తెలుపవలెను గావున పాండవుల విషయమై కొన్ని సంగతులను తెలియజేసెదను. వినుడు.

మహారాజైన యుధిష్ఠిరుడు యెచ్చటనుండునో అచ్చట రాజులు అన్యాయాచరణ కావింపరు. ప్రజలు శాంతిగా, అసూయా, ఈర్ష్యాశూన్యులై వసింతురు. అచ్చట సమయానుకూలముగా వర్షములు పడును. భూమి సస్యశ్యామలమైయుండును. ఫలములు రసాములై సుగంధముతో విరాజిల్లును. చోరభీతి యుండదు. గోవులు అభివృద్ధిచెంది అధికముగా పాలనిచ్చును. కావున అట్టి స్థానములందు అన్వేషించిన పాండవుల జాడ తెలుసుకొనవచ్చును" అని తన ఉద్దేశ్యమును తెలియజేసెను.

## 29.

కృపాచార్యుడు కూడా భీష్మ ద్రోణుల మాటలను సమర్థించెను.

## 30. సేనాధిపతి కీచకుడు లేని విరాటరాజ్యముపై దండెత్తుట

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! పూర్వము మహాబలుడైన కీచకుడు, శాళ్వులతో కలసి త్రిగర్తదేశముపై దండెత్తి సుశర్మను ఓడించెను. ఇప్పుడు కీచకుడు వధింపబడుటచే తన పగ తీర్చుకొనుటకు తగిన సమయము ఆసన్నమైనదని దుర్యోధనునితో, "మహారాజా! కీచకుని సహాయముతో విరాటుడు నన్ను పలుమార్లు దండెత్తి ఓడించెను. మహాబలుడైన కీచకుడు నేడు గంధర్వులచే యముని పాలబడినాడు. విరాటరాజు కూడా హతదర్పుడై, బలహీనుడై ఉన్నాడు. ఈ సమయమున కౌరవులు, త్రిగర్తులు యేకమై విరాటరాజుపై దండెత్తిన బహురత్న, ధన, గ్రామ, రాజ్య, గోసమూహములను కైవసము చేసుకొనవచ్చును. దీనితో మీయొక్క బలము కూడా అభివృద్ధి చెందును" అనిన కర్ణుడు కూడా దుర్యోధనుని

ప్రోత్సహించుచూ, “రాజా! వెంటనే భీష్మ, ద్రోణ, కృపాచార్యాది గురువులతో సంప్రదించి, యుద్ధయాత్ర చేయుట మేలు. అర్థహీనులు, బలహీనులు, పౌరుషహీనులు అయిన పాండవులను అన్వేషించుట యేల? వారు కాలగ్రాసులై ఉంటారు. కావున నిశ్చింతగా విరాటనగరమునకు వెడలి గోసముదాయము, ధనరాసులు గ్రహించుటయే ఉత్తమము” అని అంటాడు.

దుర్యోధనుడు అందులకు అంగీకరించి, తమ్ముడైన దుశ్శాసనునితో, వృద్ధులతో మంత్రణాలోచనము చేసి సైన్యము సిద్ధము కావింపుమని ఆజ్ఞాపించెను.

సుశర్మ తన సైన్యముతో కృష్ణపక్ష సప్తమినాడు ప్రయాణము కాగా కౌరవులు మరునాడు అష్టమి తిథిని విరాటరాజ్యమునకు ససైన్యముగా బయలుదేరిరి.

## 31. సుశర్మతో విరాటరాజు యుద్ధము

సుశర్మ తన సైన్యముతో మత్స్యదేశము ప్రవేశించి విరాటుని బహు సంఖ్యాకములైన గోవులను తన వశము చేసుకొనగా గోపాలకులు విరాటుని చేరి, త్రిగర్తాధిపతి సుశర్మ గోవులను అపహరించిన సంగతి తెలియజేసిరి.

విరాటుడు సైన్యములను యుద్ధమునకై సిద్ధము చేసి, తాను, తమ్ములైన శతానీకుడు, మదిరాక్షుడు, జ్యేష్ఠపుత్రుడు శంఖుడు, ఇతర రాజులు, రాజ కుమారులు, చిత్ర విచిత్రములై కాంచన, లోహ నిర్మితములైన కవచములను ధరించి వివిధ ఆయుధములను సమకూర్చుకొని యుద్ధమునకు సిద్ధమైరి. ఆ సమయమున మత్స్యరాజు తమ్ముడైన శతానీకునితో యోధులైన కరకునకు, వల్లభునకు, గోపాలునకు, తామ్రగంధికి ధ్వజపతాక సంపన్నమైన రథములను, ఆయుధములను, కవచములను ఇమ్మని తెలియజేసెను. ఇట్లు యెనిమిదివేల రథములతోను, వేయి యేనుగులతోను, అరవై వేల అశ్వికులతోను విరాటుడు, సబాంధసైన్యయుక్తముగా పాండవులతో యుద్ధమునకు బయలుదేరెను.

## 32.

మధ్యాహ్న కాలమున నగరము నుండి బయలువెడలి సుశర్మ సైన్యమును మత్స్యదేశము యెదుర్కొనగా తీవ్రమైన యుద్ధము చెలరేగెను. సాయంకాలమగు సరికి ఇరువైపుల పలువురు సైనికులు మృతిచెందిరి. ఆ సమయమున విరాటరాజు, సుశర్మల మధ్య ద్వైరథ యుద్ధము ఆరంభము కాగా మత్తేభములవలె ఒకరినొకరు తాకి వివిధ అస్త్రములను ప్రయోగించుచూ యుద్ధము చేయసాగిరి.

## 33.

సాయంకాలమగుటచే ఆవరించిన చీకటులు మరికొంతసేపటికి చంద్రోదయము కాగా తొలగిపోయెను. అంత ఆ క్షత్రియగణము ద్విగుణీకృత ఉత్సాహముతో యుద్ధము చేయసాగెను.

మహావీరుడైన త్రిగర్తాధిపతి విరాటుని పార్శ్వరక్షకులను సంహరించి, అనంతరము అతని సారథిని, అశ్వములను నాశనమొనరించి, విరాటుని బంధించి తన రథమున ఇడి త్వరితముగా నిజనగరాభిముఖుడయ్యెను. రాజు శత్రువునకు వశుడగుటతో మత్స్య సేనలు భయముతో పారిపోసాగెను.

ఇది పరికించిన యుధిష్ఠిరుడు భీమునితో, "వృకోదరా! సుశర్మ మన రాజును బంధించి తీసుకొనిపోవుచున్నాడు. మనము అతని అధికారములో సుఖముగా కాలము గడుపుచున్నాము. మనము కృతజ్ఞత చూపు కాలము ఆసన్నమైనది. వెంటనే నీవు ఆతనిని విడిపింపుము" అని ఆజ్ఞాపింపగా భీముడు అతి ఉత్సాహముతో ప్రక్కనున్న భూధరమును పెకలించి యుద్ధము చేయబూనగా, ధర్మరాజు వారించుచూ తాము ఇంకనూ ప్రచ్ఛన్నముగా ఉండటమే మేలనుచూ, "భీమా! సాహసము ప్రకటించకుము. మనుష్యోచితమైన ధను, శక్తి, ఖడ్గాదులతోనే ఎదుర్కొనుము. నకుల సహదేవులు నీకు చక్రరక్షకులై ఉందురు" అని భీముని పంపెను.

మహాబలపరాక్రాంతుడైన భీముడు శరాసనమును గ్రహించి శరవర్షమును కురిపించుచూ, "తిష్ఠ, తిష్ఠ" అని మహావేగమున సుశర్మను తాకెను. కాలాంతకుని వలె తన సేనలను నాశనము చేయుచూ తనను చేరుచున్న భీముని చూచి, సుశర్మ వెరుగుపడి, క్రోధముతో భీమునిపై శరప్రయోగము చేయసాగెను.

ఆ సమయమున యుధిష్ఠిరుడు వేయిమందిని, భీముడు యేడువేలమందిని, నకులుడు యేడువందలమందిని, సహదేవుడు మూడు వందల మందిని త్రిగర్త సైనికులను సంహరించిరి.

భీముని ధాటికి ఓర్వలేక సుశర్మ రథము దిగి పారిపోసాగెను. వృకోదరుడు విరాటరాజును బంధవిముక్తుని గావించి, సుశర్మతో, "రాజకుమారా! రణస్థలము నుంచి పారిపోవుట కాపురుషుల లక్షణము. ఈ బలముతోనా విరాటరాజు గోధనమును అపహరించబూనితివి? సైనికులను వదలి పారిపోవుట క్షత్రియుల లక్షణము కాదు. ఆగుము!" అనుచు త్వరితముగా ఆతని వంక చని, క్షుద్ర

మృగముపై పడిన సింహము వలె, సుశర్మ కేశాకరణము గావించి యెత్తి నేల పడవైచి ప్రహారము చేయగా అతడు మూర్ఛపోయెను. ఓడిపోయిన సుశర్మ యుధిష్ఠిరుని ఆజ్ఞానుసారము విరాటరాజు వద్ద దాసుడనని తలవంచిన పిమ్మట భీముడాతనిని బంధవిముక్తుని కావించెను.

## 34.

విజయము పొందిన విరాటరాజు, పాండవులు ఆ రాత్రి సమరరంగముననే గడిపిరి. విరాటరాజు పాండవుల విక్రమమునకు మిక్కిలి సంతసించి, ధన ప్రదానము చేసి గౌరవముగా, "మీ వలననే నేడు నేను సుశర్మనుండి రక్షింప బడుటయే కాక విజయము పొందితిని. నేటినుండి రాజ్యసుఖములన్నియు నాతో సమానముగా అనుభవించుటకు ఆహ్వానించుచున్నాను" అని పలుకగా పాండవులు, "రాజా! మీరు శత్రుహస్తములనుంచి విముక్తులైరి. ఇదే మాకు సంతోషము" అని చేతులు జోడించి నమస్కరించిరి.

అనంతరము విరాటరాజు, యుధిష్ఠిరుని వాక్యానుసారము సేవకులను నగరమునకు తమ విజయమును ప్రకటింపుటకు, మరునాడు మంగళ వాద్యములతో యెదురు వచ్చుటకు ఆజ్ఞాపించెను.

మరునాడు వారందరూ జయోత్సాహముతో, మంగళవాద్యములతో నగరము ప్రవేశించిరి.

## 35. కౌరవులు విరాటరాజు గోవులను అపహరించుట

జనమేజయునితో వైశంపాయనుడిట్లనెను – మహారాజా! విరాటరాజు త్రిగర్తులతో యుద్ధము చేయుచున్న సమయమున దుర్యోధనుడు స్వీయ అమాత్యుల తోను, భీష్మ, ద్రోణ, కర్ణ, కృప, అశ్వత్థామ, శకుని, దుశ్శాసన, వివింశత, వికర్ణ, చిత్రసేన, దుర్ముఖాది మహారథులతోను మత్స్యదేశమును చేరి విరాటుని అరువది వేల గోవులను తమ ఆధీనము చేసుకొనిరి. గోపాలురు త్వరితముగా విరాట నగరమును చేరి, రాజకుమారుడైన ఉత్తరునితో, కౌరవులు తమ గోధనమును అపహరించిన వైనము తెలిపి, వాటిని విడిపింపుమని ప్రార్థించిరి.

## 36.

అంత ఉత్తరుడు, "క్రిందటిమాటు జరిగిన నెలదినముల యుద్ధములో నా సారథి చనిపోయెను. వెంటనే నాకు తగిన సారథిని చూడుడు. పొగరుమోతులైన

ఆ కౌరవులను, భీష్మ, ద్రోణాదులను అవలీలగ ఓడించి మన గోవులను మరలించెదను. వారినే చెప్పనేల స్వయముగా ధనుంజయుడు వచ్చినా హేలగా జయింపగలను" అని డంబములు పలుకుచూ, అంతఃపురకాంతలతో వీరాలాపము లాడసాగెను.

ఉత్తరుని ఆత్మశ్లాఘమును విన్న అర్జునుడు, ద్రౌపదిని ప్రక్కకు పిలచి, బృహన్నలకు సారథ్యము వచ్చునని, ఆతనిని సారథిగా వరింపుమనియు తెలియజేయుమనెను.

అనంతరము సైరంధ్రి ఉత్తరునితో, "రాజకుమారా! బృహన్నల పూర్వము అర్జునుని రథసారథ్యము చేసెను. పాండవుల గృహమున నివసించిన నాకు ఈ సంగతి తెలుసును. ధనుంజయుడు ఖాండవప్రస్థ కాలమున ఈతని సారథ్యముతోనే సర్వభూతములను జయించెను.కావున మీరు ఈతనిని సారథిగా గ్రహింపుడు" అని సిగ్గుపడుచూ మెల్లగా పలికెను.

ఆమె మాట విని ఉత్తరుడు, "సైరంధ్రీ! నీవు చెప్పినది నిజమైనను నేను స్వయముగా ఆతనిని సారథిగా ఉండమని కోరలేను కదా!" అని పలుకగా, చెల్లెలైన ఉత్తరతో చెప్పించిన తప్పక ఆతని కోరిక నెరవేరునని సైరంధ్రి తెలియజేసెను.

## 37.

సర్వాంగసుందరియైన ఉత్తర బృహన్నలను చేరి తన అన్నయైన ఉత్తరుని ఉద్దేశ్యము తెలుపగా, బృహన్నల ఉత్తరుని కడకు జని, "రాజపుత్రా! యుద్ధములో సారథ్యము చేయుట నా వశమా? నాట్య, గానములందు ప్రవేశము కలదు కాని సారథ్యము చేయు శక్తి యెక్కడ?" అనగా, ఉత్తరుడు పదే పదే సారథ్యము వహింపుమని కోరెను.

అర్జునుడు ఉత్తరునిచే బ్రతిమాలించుకొని, కవచము విపరీతముగా ధరించగా రాజకుమార్తెలు నవ్వసాగిరి. ఉత్తరుడు వారిని వారించి, బృహన్నలచే కవచము ధరింపచేసి, తాను ఉత్తమమైన కవచము ధరించి, అంతఃపురకాంతలు మంగళవాక్యములు పలుకుచుండగా, రథము నెక్కి, బృహన్నల సారథ్యముతో యుద్ధమునకు బయలుదేరెను.

## 38.

ఉత్తరుని ఆదేశానుసారము బృహన్నల మహావేగముగా రథము నడుప సాగెను. వారు నగరము బయట స్మశానమున ఉన్న శమీ వృక్షమును చేరుసరికి కౌరవసేనలు కనుపించెను. వారిని చూడగానే ఉత్తరుడు మేను వణుకగా, చెమటలు పోసి, కంపిత స్వరముతో, “బృహన్నలా! రథము నాపుము. కౌరవులతో యుద్ధము చేయు శక్తి నాకు లేదు. చూడుము! నా ఒడలు వణుకుచున్నది. ఈ కౌరవులను దేవతలు కూడా జయింపజాలరు. ఈ సైన్యమును మహాయోధులైన ద్రోణ, కర్ణ, భీష్మ, కృపాది ధనుర్ధరులు రక్షించుచున్నారు. వారితో యుద్ధము చేయుట అటుండనిమ్ము, చూడగానే నా గుండెలు దడదడలాడుచున్నవి. శరీరము పట్టు తప్పుచున్నది. నేను చిన్నవాడను కనుకనే తండ్రిగారు నన్ను ఇంటి వద్దనుంచిరి. బృహన్నలా! నేను యేకాకిని, బాలకుడను. ముఖ్యముగా పరిశ్రమ యెరుగని వాడను. కృతాస్త్రులు, బహుసంఖ్యాకులైన కౌరవులతో యుద్ధము చేయుట అవివేకము. వెంటనే రథము మరలింపుము” అని దీనముగా పలుకగా, బృహన్నల, “రాజకుమారా! నీవు ఇట్లు పిరికివానివలె మాటలాడెదవేల? మీరు కోరుటచేతనే కదా నేను రథమును తోలుకొని ఇచ్చటకు వచ్చితిని. యెందులకు నీవిట్లు పరాఙ్ముఖమగుచున్నావు? యుద్ధములో జయించి, గోవులను మరలించకపోయిన అంతఃపుర కాంతలు నిన్ను చూచి నవ్వరా? నేను సైరంధ్రి, ఉత్తర కోరగా నీ వెంట వచ్చితిని. కౌరవులను ఓడించకుండా యెట్లు వెనుకకు మరలుదును? నీవు ధైర్యమవలంబింపుము” అని ధైర్యవచనములు పలికెను.

బృహన్నల మాటలు విని, ఉత్తరుడు “బృహన్నలా! కౌరవులు సర్వమూ అపహరించుకొని పోనీ! ఆ బాలవృద్ధులు నన్ను చూచి నవ్వనీ! నగరము శూన్యము కానీ! నేను మాత్రము యుద్ధము చేయలేను” అని విరాట తనయుడు పలికి రథము దిగి పారిపోగా, బృహన్నల, “మహాశయా! యుద్ధమున వెనుతిరుగుట క్షత్రియోచిత ధర్మము కాదు. భీతుడై పలాయనము చేయుట కన్నా రణమున మృతుడగుట శ్రేయస్కరము” అనుచూ తాను కూడా రథము దిగి, జడలల్లలాడగా, వసనములు చెదరగా, కౌరవులు పరిహాసము చేయుచుండగా, త్వరితముగా ఉత్తరుని ఆపగా అతడు బృహన్నల పాదములపై పడి, “బృహన్నలా! నన్ను రక్షింపుము. బ్రతికి ఉన్న బలుసాకు తినవచ్చును. నన్ను వదలిన నీకు మణిమాణిక్యాదులను, చక్కని వస్త్రములను, భూములను, వాహనములను ఇత్తును” అని దీనాలాపములాడగా, బృహన్నల కౌరవులు అర్జునుడేమో అని శంకించు

చుండగా, ఉత్తరునితో తాను యుద్ధము చేయుదునని ఒప్పించి, ఉత్తరుని రథము నెక్కించుకొని నిష్క్రమించెను.

ఆ సమయమున అనేకములైన దుర్నిమిత్తములను గని ద్రోణాచార్యుడు, "వీరులారా! నాకు యెన్నో అశుభసూచనలు కనిపించుచున్నవి. ఆత్మరక్షణార్థము వెంటనే వ్యూహరచన కావింపుడు. క్లీచ్ఛ వేషమున వచ్చినది తప్పక అర్జునుడే! అతడు త్రిలోకాధిపతియైన మహాదేవుని, దేవరాజైన ఇంద్రుని మెప్పించి యెన్నియో మహాస్త్రములను పొందియున్నాడు. ఆతనిని యెదిరించగల వీరుడు మనలో ఒక్కడైనను లేదు" అని పలుకగా కర్ణుడు రోషముతో, "ఆచార్యా! మీరు యెల్లవేళలా అర్జునుని గుణములను పొగుడుచుందురు. ఆతడు నాతోగాని, దుర్యోధన మహారాజుతో గాని, షోడశాంసము కూడా సమానుడు కాడు" అనగా దుర్యోధనుడు, "కర్ణా! నారీరూపమున వచ్చినది అర్జునుడే అయిన అజ్ఞాతవాస కాలమున బయల్పడినందులకు మరల వారు పన్నెండు సంవత్సరములు అరణ్య వాసము చేయవలెను. ఇతరులెవ్వరైనా నా నిశితశరములతో సంహరింతును" అని వచింప, భీష్మ, ద్రోణ, కృపాచార్యాదులు ప్రశంసించిరి.

## 40. అర్జునుడు శమీవృక్షము నుండి అస్త్రములను దింపుమని ఉత్తరునితో చెప్పుట

వైశంపాయనుడిట్లనెను. "మహారాజా! మహాబలపరాక్రాంతుడైన అర్జునుడు ఉత్తరునితో శమీవృక్షమును చేరి, "రాజకుమారా! నా వేగమునకు నీ అస్త్రములు తాళలేవు. ఈ వృక్షముపై పాండవుల అస్త్రములున్నవి. అందు సహస్రకార్ముక సమానమైన గాండీవమున్నది. దానిని దింపుము" అని పలుకగా

## 41.

ఉత్తరుడు, "బృహన్నలా! ఈ వృక్షమున శవదేహమున్నట్లు వినియుంటిని. క్షత్రియుడనై నేను యెట్లు మృతకళేబరమును తాకగలను?" అనిన బృహన్నల అది మృతకళేబరము కాదనియు, అస్త్రములనియు తెలిపిన, ఉత్తరుడు శమీవృక్షము నధిరోహించి, అస్త్ర సముదాయము క్రిందకు దించి, కప్పబడిన ఆవరణము విప్పి చూడగా ఝృంభణశీల భీషణ భుజంగముల వలెనున్న కర్ముకములను గాంచి వెరుగుపడి అర్జునునితో ఇట్లనెను.

## 42.

"బృహన్నలా! ఈ మహాకార్ముకములు, ఖడ్గములు, గదలు, తూణీరములు యెవరివి? వీటిని చూడగా నాకు మిక్కిలి భయాశ్చర్యములు కలుగుచున్నవి. నాకు యధార్థముగా తెలియజేయుము."

## 43.

ఉత్తరుని మాటలను అర్జునుడు, "రాజపుత్రా! ఈ ధనస్సు గాండీవము. దీనితోనే అర్జునుడు దేవదానవులను జయింపగలిగెను. దీనిని ముందుగా బ్రహ్మ వేయి సంవత్సరములు, ప్రజాపతి వేయి సంవత్సరములు, పురందరుడు అయిదువందల సంవత్సరములు, చంద్రుడు అయిదు వందల సంవత్సరములు, వరుణుడు నూరు సంవత్సరములు ధరించిరి. ఇది ధనుంజయునివద్ద అరవై ఐదు సంవత్సరముల నుంచి ఉన్నది.

ఇంద్రరోపచిత్రితమైన ఈ కార్ముకము యుధిష్ఠిరునిది, కాంచనమయమైన సూర్యత్రయముతో నున్నది నకులుని ధనస్సు. సుపార్శ్వహేమ విగ్రహశరాసనము భీమునిది. సువర్ణశలభయుక్తమైనది సహదేవుని శరాసనము. ఈ తూణీరములు ధనుంజయునివి. స్థూలములు, దీర్ఘములు, అర్థచంద్రాకృతిలోనున్న శరనికరములు భీమునివి. పంచశార్దూల చిహ్నములున్నవి బాణములు నకులునివి. సూర్యసదృశలోహ శరములు సహదేవునివి. బంగారు రెక్కలుగలవి యుధిష్ఠిరుని బాణములు. వ్యాఘ్ర చర్మ నిర్మితకోశమున నున్నది భీముని దివ్యఖడ్గము. బంగారు పిడి కలిగిన కరవాలము యుధిష్ఠిరునిది" అని అన్ని ఆయుధములను చూపెను.

## 44.

ఆ అస్త్రశస్త్రములను చూచి ఉత్తరుడు, "ఈ ఆయుధములకు అధికారులైన పాండవులెక్కడ? వారి భార్య పాంచాలి యెచ్చటనున్నది? దయచేసి తెలియ జేయుము" అనిన అర్జునుడు, "నేను పార్థుడను. నీ తండ్రి సభలో సభాసదుడై ఉన్న కంకుభట్టు యుధిష్ఠిరుడు. వల్లభుడను పావకుడు భీముడు. అశ్వపాలుడు నకులుడు, గోపాలకుడు సహదేవుడు. యెవరికొరకై కీచకుడు వధింపబడ్డాడో ఆమె ద్రౌపది, సైరంధ్రిగా మీ భవనమున కాలము గడుపుచున్నది" అని తెలుపగా ఉత్తరుడు, "పార్థునకు పది పేర్లు కలవని వింటిని. వానిని వర్ణించిన మీ మాటలను నమ్మగలను" అనిన అర్జునుడిట్లు చెప్పసాగెను.

"ఓ విరాటతనయా! అర్జున, ఫాల్గుణ, జిష్ణు, కిరీటి, శ్వేతవాహన, బభత్సు, విజయ, కృష్ణ, సవ్యసాచి, ధనుంజయ, ఇవి నా పేర్లు. ఇవి నా అన్వర్థ నామములు.

నేను జనపదములను జయించి ధనమును సంగ్రహించుటచే ధనంజయుడనియు, సమరాంగణమున రణవిశారదులైన వీరులను జయింపక వదలను కావున విజయుడనియు, నా రథమునకు తెల్లని గుఱ్ఱములు పూన్చబడును కావున శ్వేతవాహనుడనియు, హిమాలయమున ఉత్తర ఫాల్గుణీ నక్షత్రమున జయించిఇని కావున ఫాల్గుణుడనియు, నేను దేవరాజు సహాయార్థము దానవులను సంహరించు సమయమున ఆతడు నా శిరస్సుపై అమూల్యమైన కిరీటముంచుటచే కిరీటి అనియు, యుద్ధరంగమున బీభత్స కార్యములను చేతును కావున బీభత్సు అనియు, రెండు చేతులతోను బాణములను ప్రయోగింతును కావున సవ్యసాచి అనియు, నిర్మలమైన పనులను చేతును కావున అర్జునుడనియు, శత్రువులను వశపరచుకొందును కావున జిష్ణు అనియు, కృష్ణవర్ణుడనగుటచే కృష్ణ అనియు నాకు పేర్లు కలిగెను" అని తన పేర్లు, వాని అర్థమును తెలియజేసెను.

అనంతరము అర్జునుని వచనములు విన్న ఉత్తరుడు ఆశ్చర్యముతోను, గౌరవముతోను నమస్కరించి, "మహానుభావా! మీ పరిచయభాగ్యమును పొంది నా జీవితము ధన్యమైనది.

## 45.

తెలియక నేనన్న మాటలను దయచేసి క్షమింపుడు" అని మరల, "మీ వచనములను నేను పూర్తిగా నమ్ముచున్నాను. మీ ఆజ్ఞానుసారము ప్రవర్తించుదును" అని పలికెను.

అంత అర్జునుడు, "రాజకుమారా! నేను నీ యెడ ప్రసన్నుడనైతిని. నీవు భయపడవలదు. నేనొక్కడనే నీ శత్రువులను సంహరింతును" అని అభయమిచ్చెను. ఉత్తరుడు, అర్జునుని ఆదేశానుసరము అతని అస్త్రములను రథముపై నిడెను.

ఉత్తరుడు పేడివానిగా తమ వద్ద నుండుటకు కారణమడుగగా అర్జునుడు తమ అజ్ఞాతవాస విషయమాతనికి తెలిపెను.

తన బాహువులపైనున్న పలుచని వలువలను వదలి అర్జునుడు కవచము ధరించెను. రథము నధిరోహించి అస్త్రములను ధ్యానించి, నమస్కరించెను. గాండీవమును యెక్కుపెట్టి టంకారనాదము చేసెను. ఆ శబ్దమునకు దిక్కులు

పిక్కటిల్లెను. భూమి కంపించెను. ఉల్కాపాతమయ్యెను. కౌరవులా శబ్దము విని, తప్పక ఇది గాండీవనాదమే యని భావించిరి.

నీవొక్కడవే యెట్లు కౌరవులనందరినీ జయింతువని ఉత్తరుడు భయపడుతూ ప్రశ్నింపగా అర్జునుడు ఆతనికి ధైర్యము చేకూర్చుచూ తాను గంధర్వులతో యుద్ధము చేయునాడు, ఖాండవదహనము నాడు, నివాతకవచులతో యుద్ధము చేయునాడు, ద్రౌపదీ స్వయంవరమునాడు తనకు పెక్కురు సహాయకులు లేరని తెలిపెను.

## 46.

అనంతరము అర్జునుడు రథముపైనున్న సింహధ్వజమును తీసి శమీవృక్ష సమీపమున నుంచి పావన పుత్రుని ప్రార్థింప వానర చిహ్నితమైన ధ్వజము రథము నలంకరించెను. అర్జునుడు రథము నధిరోహించి నారి సారించి, శంఖము పూరించి రథము బయలుదేరింపగా అతిభీషణ గర్జనలతో రథము పరుగెత్తసాగెను. ఆ రవమునకు భయపడుచున్న ఉత్తరునితో అర్జునుడు ధైర్యవచనములు పలికెను.

ఆ సమయమున కౌరవసైన్యములో ద్రోణుడు, దుర్యోధనునితో "మహారాజా! ఇది తప్పక అర్జునుని రథ ధ్వనియే. మన అస్త్రశస్త్రములు తేజోహీనముగా కన్పించు చున్నవి. సైనికులు, అశ్వములు, యేనుగులు అధోవదనముతో ఓడినట్లున్నవి. మనపై గ్రద్దలు తిరుగుచున్నవి. నక్కలు దీనముగా అరచుచున్నవి. ఇట్టి అశుభ సూచనలు మన పరాజయమును, నాశనమే సూచించుచున్నవి. కావున తగిన వ్యూహము పన్ని సిద్ధపడుట ఉచితము" అని పలికెను.

## 47.

అంత దుర్యోధనుడు, భీష్మ, ద్రోణ, కృపాచార్యులను ఉద్దేశించి జూదక్రీడా సమయమున తాము యేర్పరచుకొన్న నియమము ప్రకారము అజ్ఞాతవాస కాలము పూర్తి అయినట్లు తోచుట లేదనియు, నియమము తప్పిన పాండవులు మరల 12 సంవత్సరములు అరణ్యవాసము చేయవలెననియు, తెలివైనవారు, బుద్ధిమంతులు కూడా ఒక్కొక్కప్పుడు ఆశకు లోబడుదురనియు పలికెను.

## 48.

కర్ణుడు తమతో యెవ్వరు యుద్ధమునకు వచ్చుచున్నారో తెలియకుండానే భీతివచనములు పలుకుట పిరికితనమనియు, పాండవాభిమానముతో ద్రోణాచార్యులు ఇట్టి పిరికిమందు వేయుచున్నారనియు, అర్జునుడే కాదు

హరిహరాదులు వచ్చినను జంకక యుద్ధము చేసి, తప్పక విజయలక్ష్మిని పొందెదమనియు పలికెను.

## 49.

అంత కృపాచార్యుడు, "రాధేయా! నీవు యుక్తాయుక్తములను విచారింపక మూఢుని వలె మాటలాడుచున్నావు. వృద్ధులు అన్ని విషయములను పరీక్షించియే ఒక నిర్ణయమునకు వత్తురని తెలుసుకొనుము. దేశకాల పాత్రములను తెలుసుకొని యుద్ధము చేయవలెను. యేకాకిగా సుభద్రను తెచ్చినవాడు, కిరాతరూపుడైన శంకరుని యెదుర్కొన్నవాడు అయిన అర్జునుని యెదిరించుట సామాన్యము కాదు. బీరములకు పోయి అర్జునుని ఒంటరిగా యెదిరింతునన్న నీపై నాకు జాలి కలుగుచున్నది. అవమానము నుంచి రక్షింపబడవలెనన్న ద్రోణ, భీష్మ, అశ్వత్థామాది వీరులందరితో యేకమై ఆతనిని యెదుర్కొనుట శ్రేయము" అని పలికెను.

## 50.

ఆ సమయమున ద్రోణపుత్రుడైన అశ్వత్థామ అచ్చుటకు వచ్చి, కర్ణునితో "కర్ణా! మనమింకను గోధనముతో హస్తినాపురము చేరకుండానే నీవు సర్వమును ఆధీనపరచుకున్నవాని వలె గొప్పలు చెప్పుకొనుచున్నావు. నిజముగా గొప్ప గొప్ప పనులు చేసెడి ధీమంతులు మౌనమవలంబింతురు కాని నీవలె డంబములకు పోరు.

మీరు పాండవుల రాజ్యమును మాయాజూదమున గెల్చుకొన్నారు. కాని యుద్ధము చేసి కాదు. మహావీరుడైన అర్జునుడు, తమ ధర్మపత్నియైన ద్రౌపదికి మీరు చేసిన అవమానమును మరువలేదు. ప్రతీకారమును కూడా తీర్చుకొనక శాంతింపడు.

ధర్మపరాయణుడు, అస్త్రవిశారదుడుయైన అర్జునుని యెడ ఆచార్యుడు ఆదరాభిమానములు ప్రేమతో మెలగుట పాత కాదు.

అన్యాయముగా ప్రవర్తించిన మీరే నేడు పాండవులను యెదుర్కొనాలి. శకునితో సహితముగా మీరు అస్త్రములను గ్రహిస్తారో, పాచికలనే బయటకు తీస్తారో నిర్ణయించుకొనండి. మత్స్యరాజు వచ్చిన నేను యుద్ధము చేయుదును కాని అర్జునుడే వచ్చిన నేను యుద్ధము చేయను" అని పలికెను.

## 51.

అంత భీష్ముడు ద్రోణ, కృపాచార్య, అశ్వత్థామల వచనములను సమర్థించుచూ, "ఇట్టి సమయమున మనలో మనము తగువులాడుకొనుట ఉచితము కాదు. కర్ణుడు వీరులను ప్రబోధించుటకు యిట్టి మాటలనెనని తలంచి ఆతనిని క్షమింపుడు.

బ్రహ్మ తేజస్సు కల ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, అశ్వత్థామల సహాయము తోనే మనము ఈ పరిస్థితిని యెదుర్కొనగలము" అని తన అభిమతమును తెలిపెను.

తాత మాటలను విన్న దుర్యోధనుడు త్వరితముగా కర్ణ, భీష్మాదులతో ద్రోణుని చేరి, తమను క్షమింపుమని ప్రార్థించగా ఆతడు సంతసించి, భీష్మునితో, "గాంగేయా! మహాతీవ్రముగా వచ్చుచున్న అర్జునుని బారినుండి మహారాజైన దుర్యోధనుని రక్షించుట మన మొదటి కర్తవ్యము. ఇంతకు క్రితము సమయము కాకుండగనే అర్జునుడు బయల్పడెనని దుర్యోధనుడు పలికెను. అర్జునుడు అజ్ఞాతవాస కాలము పూర్తికాకుండా బయటపడునంతటి మూర్ఖుడు కాడని నా నమ్మకము. వీరిని పరీక్షింపుడు" అని పలికెను.

## 52.

అంత భీష్ముడు కాల, కాష్ట, ముహూర్త, దిన, పక్ష, మాస, గ్రహ, నక్షత్ర, ఋరీరి, సంవత్సరాదులకు మూలమైన కాలచక్రమును తెలిపి, గణన కావించి, పాండవుల అరణ్య, అజ్ఞాతవాసకాలము పూర్తియైనదనియు, మహావీరులైన పాండవులు ధర్మపరాయణులు కావున తమ మాటను తప్పరనియు, ఆ వచ్చు చున్నది అర్జునుడే కావున యుద్ధమునకు తగు సన్నాహములు కావింపుడనియు తెలిపెను.

తదనంతరము భీష్ముడు తమ సైన్యమును నాల్గు భాగములు చేసి ఒక భాగముతో దుర్యోధనుడు నగరమునకు మరలునట్లు, మరియొక భాగము గోవులను తోలుకొనిపోవుటకు మిగిలిన సైన్యముతో ద్రోణ, కృప, కర్ణ, అశ్వత్థామాదులతో తాను అర్జునుని యెదుర్కొనెదనని నిర్ణయించెను.

## 53.

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! కొలదిసేపటిలోనే మహావీరుడైన అర్జునుడు రథఘోష దిక్కులు పిక్కటిల్ల కౌరవులను సమీపించి, ధనుష్టంకారము కావించి, గురువులైన ద్రోణునకు, భీష్మునకు నమస్కార, కుశల బాణములు వైచి, యోధాగ్రేసరులను అందరినీ పేరు పేరునా ఉత్తరునకు చూపి, అభిమానధనుడైన దుర్యోధనుని కానక, తుదకు సైన్యముతో పురమునకు పలాయనము కావించుచున్న కురునాధుని వీక్షించెను. ఆతడు ముందుగా శత్రువులపై వాడియైన బాణములు వైచి, గోవులను విరాటనగరము దిశ మరల్చెను.

## 54. కౌరవులతో అర్జునుని యుద్ధము

దుర్యోధనుడు యెట్టి ఆపదకు గురికాకుండా కర్ణుడు ముందుగా చిత్రసేనుడు, వికర్ణుడు మొదలైనవారు తనకు సాయపడుచుండగా అర్జునుని యెదుర్కొనెను. అర్జునుడు మహావేగముతో వారలను తాకెను. వికర్ణుడు అర్జునుని బాణముల వాడికి ఓర్వలేక పారిపోయెను. కర్ణుని సహోదరుడు విగతజీవుడై నేలకూలెను.

అనంతరము కర్ణార్జునుల మధ్య కొంతవడి తీవ్రమైన ద్వంద్వయుద్ధము జరిగెను. వారు ఒకరిపై నొకరు శరపరంపరలను వేయుచూ ప్రత్యర్థి బాణములను త్రుంచుచూ లోకులు దిగ్భ్రాంతులై నిరీక్షింపునట్లు యుద్ధము కావించిరి. తుదకు కర్ణుడు వాడియైన అర్జునుని బాణములు శరీరమును నొప్పింప రథము మరల్చి పారిపోయెను.

## 55.

వైశంపాయనుడిట్లనెను, "నృపవరా! ఇట్లు రాధేయుడు రణరంగమును వీడి పారిపోగా దుర్యోధనాది వీరులు తమ సైన్యముతో అర్జునుని చుట్టుముట్టి శరవర్షమును కురిపింపసాగిరి. సముద్రము వలె తన దిశగా వచ్చిన కౌరవసేనపై అర్జునుడు దివ్యమైన అస్త్రములను ప్రయోగించెను. ప్రచండమార్తాండుని వలె ఆతడు కౌరవసేనలను దగ్ధము కావించదొడంగెను. ఎందరో కౌరవ సైనికులు అంగములు ఛిన్నాభిన్నములు కాగా మృతిచెందసాగిరి.

అర్జునుడు కురువీరులనుద్దేశించి యెన్నో దివ్యాస్త్రములను వేసెను. అశ్వత్థామపై యెనిమిది, దుశ్శాసనునిపై పన్నెండు, కృపునిపై మూడు, భీష్మునిపై ఆరు, దుర్యోధనునిపై నూరు బాణములు వైచి నొప్పించెను.

## 56.

ఆనాటి అర్జునుని మేటి యుద్ధము పరికింప గరుడ గంధర్వాది దేవతలు, వసువులు, రుద్రులు, పితృదేవతలు విమానములో వచ్చిరి. కుమారుని విద్యా పటిమను గాంచి ఇంద్రుడు మిక్కిలి ఆనందించెను.

## 51.

అనంతరము అర్జునుడు రథమును కృపాచార్యుని దెస మరల్చుమని, ఆచార్యునకు రథప్రదక్షిణము కావించి, శంఖము పూరించి, యుద్ధమునకు సన్నద్ధుడు కాగా, కృపుడు కూడా తన శంఖమును భీకరనాదముతో పూరించి అర్జునునితో యుద్ధమునకు తలపడెను. వారు ఒకరిపై ఒకరు వాడియైన బాణములను వైచుచూ తమపై వచ్చెడి బాణములను భిన్నము సేయుచూ యుద్ధము చేయదొడంగిరి. అర్జునుడు వైచిన బాణములకు కృపుని రథాశ్వములు కూలగా ఆతడు మరియొక రథము నధిరోహించి యుద్ధము చేయగా అర్జునుడు ఆచార్యుని కార్ముకములను ఒక్కొక్కటే ముక్కలు చేయసాగెను. కృపాచార్యుడు కోపముతో సర్వవిభూషితమైన శక్తిని అర్జునునిపై ప్రయోగింప, ఆతడు పది సాయకములతో ఆ శక్తిని పది ముక్కలగునట్లు చేసెను. అనంతరము పార్థుడు తీక్షణమైన బాణములతో కృపుని అశ్వములను, సారథిని చంపి, ఆచార్యుని కవచము ఛేదించి నిరాయుధుని సేయగా ఆతడు ఇతర కౌరవయోధుల సాయముతో ప్రాణములు రక్షించుకొని పారిపోయెను.

## 58.

అర్జునుడు తన రథమును గురువైన ద్రోణాచార్యుని దిశ మరల్చెను. మత్తమాతంగముల వలె వారు ఒకరికొకరు యెదురు రాగా, అర్జునుడు "ఓ సమరదుర్జయా! మేమింతకాలము అరణ్యములపాలై ఉన్నాము. దానినుంచి విముక్తి పొంద నేడు సిద్ధమగుచున్నాము. అందువలన మా యెడ జాతక్రోధము వహింపకుడు. నాపై మీరు ఆక్రమణ చేయకుండా ఉన్నంతసేపు మీపై అస్త్రము నెత్తనని నేను ప్రతిజ్ఞ చేసియున్నాను. కావున దయచేసి ముందుగా శరప్రయోగము చేయుడని" ప్రార్థింప, ద్రోణుడు ధనుంజయునిపై శరనిక్షేపము కావించగా, వారిరువురి మధ్య తీవ్రమైన యుద్ధము ఆరంభమయ్యెను.

ఆ మహాయోధులు ఒకరినొకరు బాణవర్షములో కప్పివేయుచూ, ప్రతిసంహారము చేయుచూ లోకవిస్మయకరమైన యుద్ధము చేయదొడంగిరి. ఆచార్యుడు వేసిన ఐంద్ర, వాయవ్య, ఆగ్నేయాది అస్త్రములను పార్థుడు అవలీలగా స్వీయ అస్త్రములతో వానిని మరల్చెను. తుదకు అర్జునుని బాణములచే ఆచార్యుని రథమే కన్పించకుండునట్లు చేయ కౌరవసేనలో హాహాకారములు చెలరేగెను.

అంత రథయూథాధ్యక్షుడైన అశ్వత్థామ మనస్సులోనే అర్జునుని విద్యను ప్రశంసించుచూ, రథములను అర్జునుని దారికడ్డముగా నిల్పి శరసహస్రములను వేయదొడంగెను. పగిలిన కవచముతోను, శరీరమంతయూ గాయపడిన ద్రోణుడు ఆ అవకాశము పొంది ఆ స్థానమునుండి వేగగామియైన అశ్వసహాయమున ప్రస్థానము చేసెను.

## 59.

అశ్వత్థామార్జునులు కొదమసింగముల వలె గర్జించుచూ భీకరమైన సమరము కావించిరి. ధనుర్వేద పండితుడైన గురుపుత్రుడు లాఘవముగా అర్జునుని గాండీవపు నారి త్రుంచగా, కౌరవ వీరులు అశ్వత్థామను మిక్కిలి ప్రశంసించిరి. కొంతవడికి అశ్వత్థామ వద్దనున్న శరములు పూర్తికాగా తప్పుకొనవలసి వచ్చెను. అక్షయతూణీరములు కల అర్జునుడు మందహాసము చేసెను.

## 60.

అనంతరము అర్జునుడు కర్ణుడు బాణములనే కాక వాక్యబాణములతో కూడా యుద్ధము చేయుచూ కొంతవడి పోరిన పిమ్మట అర్జునుని తీవ్రబాణమునకు కర్ణుడు మూర్ఛితుడై కొంతవడికి తెప్పరిల్లి బాధకు తాళలేక ఉత్తరదిశగా పారిపోయెను. అర్జునుడు, ఉత్తరుడు గట్టిగా నవ్వి ఆతనిని వదలిరి.

## 61.

అంత అర్జునుడు హిరణ్మయ తాళవృక్షకేతనుడైన భీష్ముని దెస రథమును నడుపుమని ఉత్తరునితో పలికి, భీతిచెందుచున్న రాజకుమారునికి ఉత్సాహము చేకూర్చు ధైర్యవచనములు పలుకగా, ఆతడు పితామహుని దెస రథము నడిపెను.

అర్జునుడు పితామహుని ధ్వజదండమును ఛేదించి, తనను చుట్టుముట్టిన దుశ్శాసన, వికర్ణ, దుస్సహ, వివంశతాది వీరులతో పోరాడి వారి పీచమడంచెను.

## 62-63

అనంతరము కౌరవులతో అర్జునుడు తీవ్రమైన సంకుల యుద్ధము కావించి పలాయనము కావించునట్లు చేసెను.

## 64.

తమ సైనికులు పారిపోవుచుండుట చూచి భీష్ముడు వారిని హెచ్చరించుచూ మహాశరాసనము పూని సుతీక్ష్ణమైన శరములను వేయుచూ అర్జునుని సమ్ముఖము నకు వచ్చెను. అర్జునుడు కూడా తాతతో యుద్ధము చేయ సన్నద్ధుడయ్యెను.

ఆ యోధులిరువురు ఒకరిపై నొకరు బాణపరంపరలను వేయుచూ తమపై వచ్చు శరములను ఖండించుచూ కౌరవాదులందరూ అబ్బురపడి చూచుచుండ యుద్ధము చేయసాగిరి. వారు తమ ప్రతాపము చూపుచూ ఇంద్ర, ఆగ్నేయాది వారుణ వాయువ్యాది అస్త్రములను ప్రయోగించుచుండిరి.

అర్జునుడు వాడియైన బాణముతో పితామహుని విల్లు ముక్కలు చేయగా, ఆతడు మరియొక ధనస్సు గ్రహించి ఇనుమడించిన ఉత్సాహముతో యుద్ధము చేయసాగెను.

తుదకు అర్జునుడు వాడియైన పది బాణములను భీష్ముని వక్షస్థలముపై వేయగా ఆతడు సంజ్ఞ కోల్పోయెను. రథికుని ప్రాణములను రక్షించుటకై సారథి త్వరితముగా రథము నక్కడినుండి మరలించి దూరముగా తీసుకొనిపోయెను.

## 65.

రణరంగమునుండి భీష్ముడు తొలగిపోగా దుర్యోధనుడు ఇనుమడించిన కోపముతో అర్జునుని యెదుర్కొనెను. అర్జునుని శరములకు ఆతని శరీరమునుండి రక్తము ప్రవహింపగా, భయముతో పారిపోసాగెను. అర్జునుని యెగతాళిని, యెత్తిపొడుపు మాటలను కూడా లెక్కింపక ఆతడు వెన్నుచూపి ప్రాణములను రక్షించుకొనెను.

## 66.

అనంతరము భీష్మ, ద్రోణ, కర్ణ, అశ్వత్థామ, కృప, దుశ్శాసనాది వీరు లందరూ యేకమై అర్జునుని చుట్టుముట్టి తీవ్రముగా శరపరంపరలను కురిపింప దొడగిరి.

అర్జునుడు వారి దాడిని యెదుర్కొని వారందరిపై సమ్మోహనాస్త్రము ప్రయోగింపగా కౌరవులందరూ స్మృతిని కోల్పోయి మృతినొందినవారి వలె నేలకూలిరి.

అంత అర్జునుడు సమ్మోహనాస్త్రమునకు లొంగని భీష్ముని తప్ప మిగిలినవారి తలపాగాలను తెచ్చి చెల్లెలైన ఉత్తరకు ఆనందము చేకూర్చుమనగా ఉత్తరుడు అట్లు కావించెను.

ఇట్లు విజయలక్ష్మిని పొందిన అర్జునుడు స్పృహ కోల్పోని పితామహుని శరపరంపరలను లెక్కింపక, ఆతని అశ్వములను వధించి, ఉత్తరునకు ఆనందము చేకూర్చుచూ నగరాభిముఖుడయ్యెను.

కొంతసేపటికి తత్తరపాటుతో లేచిన కౌరవులలో దుర్యోధనుని చూచి భీష్ముడు, "మహావీరుడైన అర్జునుడు ధర్మము తప్పనివాడు. అందువలననే తెలివితప్పి పడియున్న వీరులను వధింపలేదు. ఇక ఇచ్చట తాళి ముప్పును తెచ్చుకొనుట అవివేకము. సత్వరము రాజధానికి మరలుటయే ఉత్తమము" అని పలుకగా, దుర్యోధనుడు తలవాల్చి తూష్ణీభావము వహించి, బరువెక్కిన హృదయములతో కౌరవులు వెనుకకు మరలిరి.

## 67.

అర్జునుని రథము మరల శమీవృక్షమును సమీపింపగా, ఆతడు ఉత్తరునితో తాను యుద్ధము చేసిన సంగతి తెలుపవద్దని తెలిపి, అస్త్రములను దాచి, మరల స్యందనముపై సింహధ్వజమునుంచి, వేణిని సవరించుకొని, ఉత్తరుని రథికునిగా నుంచి తాను రథము నగరము వైపుగా నడుపసాగెను. అర్జునుని ఆదేశానుసారము ఉత్తరుడు గోవులను తోలుకొని వచ్చుచున్న గోపాలురతో తన విజయవార్త నగరిలో తెలియజేయుడని ముందుగా పంపెను.

## 68. బృహన్నలను సారథిగా చేసుకొని కుమారుడు యుద్ధమునకు వెడలిన వార్త విని విరాట నృపతి చింతించుట

వైశంపాయనుడిట్లనెను, "మహారాజా! విరాటనృపతి పాండవుల సహాయముతో త్రిగర్తులను యుద్ధమున ఓడించి గోధనముతోను, ధనరాసులోను నిజపురమునకు మరలి, ప్రజల అభినందనలను గైకొనుచూ అంతఃపురము ప్రవేశించి భార్యా, పుత్రికల వలన ఉత్తరుడు బృహన్నల సారథి కాగా భీష్మ,

ద్రోణ, కర్ణ, దుర్యోధనాది వీరులతో యుద్ధము చేసి గోవులను విడిపించదలచి బయలుదేరిన సంగతి తెలుసుకొని, కుమారుడు తప్పక మృతిచెందియుండునని భావించుచూ, మంత్రులను కలసుకొని సైన్యములను సిద్ధపరుపుడని ఆజ్ఞాపించెను.

ఆ సమయమున యుధిష్ఠిరుడు ఆతనితో, "మహారాజా! మీరు ధైర్యము వహింపుడు. బృహన్నల సారథిగా యున్న మీ కుమారుడు కౌరవులే అననేల దేవతలనైనను తప్పక జయించి తిరిగి వచ్చును" అని ధైర్యము తెలిపెను.

అట్టి అవసరమున గోపాలురు అచ్చటకు వచ్చి, రాజకుమారుడు కౌరవులను ఓడించి, గోవులను కాపాడిన వైనము తెలుపగా విరాట నృపతి మిక్కిలి సంతసించి, వారికి ఉచిత పారితోషికముల నిచ్చి భటులతో విజయుడై వచ్చుచున్న కుమారునికి ఉత్సవ సమారోహములతో తోడ్కొని రమ్మని ఆనతిచ్చి, సైరంధ్రిని పిలిచి, తాను కంకునితో జూదమాడుదునని, పాచికలను తెమ్మని ఉత్సాహముతో పలుకగా ధర్మరాజు, "మహారాజా! మహానందముతో ఉన్నవారితోడను, ధూర్తులతోను జూదమాడకూడదని లోకులు తెలుపుదురు. మీరు నేడు చాలా ఆనందముతో ఉన్నారు. కావున మీతో జూదమాడదలచుకొనలేదు. మరి ఇంకే కార్యమైనను ఆజ్ఞాపింపుడు తప్పక కావింతును" అని పలికెను.

ఆతని మాటలు విని విరాటనృపతి, "కంకా! జూదమే ఆడకపోయిన ఈ ధనకనక వస్తువాహనాదులెందుకు? రమ్ము, మనము ఆనందముగా జూదమాడుదము" అని ఉత్సాహపరుప యుధిష్ఠిరుడు ద్యూతక్రీడకు సిద్ధపడెను.

జూదమాడుచూ మత్స్యరాజు తన కుమారుని వీరత్వమును పొగుడుకొనుచుండగా ధర్మరాజు మరల బృహన్నల తప్ప మరియెవ్వరూ భీష్మ, ద్రోణాది వీరులను జయింపజాలరని పలుకగా విరాటుడు కోపగించి తన చేతిలో ఉన్న పాచికలను యుధిష్ఠిరుని మోముపై విసరగా, ఆతని నాసికనుండి రక్తము స్రవింపసాగెను. తన రక్తము నేలపై పడకుండా చేతులలో పట్టుచూ సైరంధ్రి దెస చూడగా ఆమె త్వరితముగా ప్రక్కనున్న సువర్ణపాత్రను యుంచెను.

ఆ సమయమున ద్వారపాలకుడు అచ్చటకు వచ్చి రాజుతో ప్రజల నివాళులను అందుకొనుచూ ఉత్తరకుమారుడు నగరము ప్రవేశించెననియు, తండ్రిగారిని దర్శించుకొనుటకై బృహన్నలతో ద్వారదేశమున యుండి అనుజ్ఞ కోరుచున్నాడనియు తెలుపగా, నృపతి వారిరువురను వెంటనే ప్రవేశపెట్టుమని అనుజ్ఞ ఇడెను.

యుధిష్ఠిరుడు ద్వారపాలుని ప్రక్కకు పిలచి, రహస్యముగా "ఓయీ! ముందుగా ఉత్తరకుమారుని మాత్రమే పంపుము. బృహన్నల నా రక్తము చూసిన విరాటరాజును సపరివారముగా నాశనము చేయును. యుద్ధమున తప్ప నా రక్తము చిందించినవానిని హతమార్తునని ఆతడు ప్రతిజ్ఞ చేసియున్నాడు" అని పలికెను.

ఉత్తరుడు సభ ప్రవేశించి, ముందుగా తండ్రికి అనంతరము కంకునకు నమస్కారము చేసి, రక్తసిక్త వదనముతో నేల కూర్చొనియున్న కంకుని చూచి, వెరుగుపడి ఇట్టి కార్యము చేసినదెవ్వరని తండ్రిని ప్రశ్నించెను.

రాజు కుమారునితో విజయము పొందిన రాజకుమారుని పొగడక బృహన్నలను పొగుడుటచే కోపముతో తానే ఇట్టి కార్యము కావించితిననగా, ఉత్తరుడు వెంటనే బ్రాహ్మణశ్రేష్ఠుని క్షమింప ప్రార్థింపుమని అనగా, ఆతడటులనే కంకుని క్షమింపుమని వేడెను.

అంత ధర్మరాజు "మహారాజా! నేను మిమ్ము చాలాసేపటి క్రితమే క్షమించితిని. నా రక్తమే నేలపడిన మీరు, మీ రాజ్యము నాశనము చెందెడివారు. అందువలన వాటిని ఆపితిని. మీ యెడ నాకెట్టి కోపమూ లేదు. బలవంతులైన ప్రభువులు తమ అధీనులను క్రోధపరవశులై దండించుట లోకులకు తెలిసిన విషయమే కదా!" అని పలికెను.

కొంతసేపటికి రక్తస్రావము ఆగగా ఆ స్థలమును శుభ్రపరచి తాను శుచియై ధర్మరాజు బృహన్నలను ప్రవేశపెట్టుమని భటునకు తెలిపెను.

బృహన్నల సభ ప్రవేశించగా, విరాటరాజు ఆతని నమస్కారమును గ్రహించి, ఆతని సమక్షముననే కుమారుని ప్రశంసించుచూ, నీవు యెట్లు భీష్మ ద్రోణాది వీరులను యెదుర్కొని యుద్ధము చేసి పరాజితులను కావించితివో తెలుపుమనెను.

## 69. ఉత్తరుడు దేవకుమారుడు యెట్లు యుద్ధము కావించెనో తెలుపుట

తండ్రి మాటను విన్న ఉత్తరుడు, "తండ్రీ! నేను కౌరవ వీరులను జయింపలేదు. వారిని చూచి నేను భయముతో రథము దిగి పారిపోవుచుండగా ఒక దేవకుమారుడు తనను ఆపి, సారథివిగా ఉండమని తానొక్కడే కౌరవవీరులను యెదుర్కొని భీష్మ, ద్రోణ, కర్ణ, కృప, అశ్వత్థామాది వీరులను యెదుర్కొని, వారిని ఒక్కొక్కరినే ఓడించి, తుదకు వారందరూ యేకమై పోరినను వెనుదీయక ససైన్యముగా వారిని ఓడించి, వారి వసనములు హరించి, అవమానము పాలు

చేసి, మన గోధనమును నగరమునకు మరల్చెను. ఆ మహానుభావుని దయవలననే నేను నేడు కౌరవుల బారినుండి మరలి రాగలిగితిని" అని తెలుపగా విరాటుడు ఆ దేవకుమారుడేడని ప్రశ్నింపగా, ఆతడు అదృశ్యము చెందెనని, త్వరలోనే మరల వచ్చునని ఉత్తరుడు బదులు పలికెను.

అనంతరము మహావీరుడైన అర్జునుడు విరాటుని అనుమతి తీసుకొని అంతః పురమున ఉత్తరను చేరి తాను తెచ్చిన కౌరవుల వసనముల నిచ్చి ఆనందపరచెను.

తదుపరి పాండవులు ఉత్తరుని కలసుకొని తదుపరి కార్యక్రమమును ఆలోచించిరి.

గోహరణ పర్వాధ్యాయము సమాప్తము

## 70. వైవాహిక పర్వాధ్యాయము

వైశంపాయనుడిట్లనెను, "జనమేజయమహారాజా! నాటికి మూడవ దినమున ప్రతిజ్ఞను పూర్తిచేసిన పాండవులు అభ్యంగన స్నానాదులు కావించి, శుక్ల వసనములు, నానావిధ ఆభరణములను దరించి విరాటుని సభ ప్రవేశించి రాజసింహాసనమున ఆసీనులైరి. వారు సూర్యసమాన తేజస్సుతో అగ్నిశిఖలవలె ప్రకాశింపుచుండిరి. ఆ సమయమున రాజ్యకార్యములను నిర్వర్తించుటకు సభను ప్రవేశించిన మత్స్యరాజు తన సింహాసనమున అధిరోహించియున్న యుధి ష్ఠిరునితో, "కంకా! నిన్ను నేను జూదమాడుటకు సహచరునిగా నియమించితిని. నీవు యెట్టి సాహసముతో నా సింహాసనమున కూర్చుంటివి?" అని ప్రశ్నించెను.

అంత అర్జునుడు లేచి, "రాజా! ఈతడు ఇంద్రుని అర్ధసింహాసనము గ్రహింపగల మనీషి. వదాన్యుడు, గుణశాలి. ధర్మమార్గమున యెల్లవేళలా చరించు వాడైన యుధిష్ఠిరుడు. కురుకులావతంశుడు. రారాజులచేత నమస్కారములు అందుకున్నవాడు, రాజసూయ యజ్ఞము చేసినవాడు, దాంతుడు, జితక్రోధుడు అయిన ఈతని రాజ్యలక్ష్మిని చూచి దుర్యోధనుడు, అతని అనుచరులు మిక్కిలి అసూయపడెడివారు. ఈతడు నీ రాజ్య సింహాసనము అధిరోహింప అర్హుడు కాడా?" అని గంభీరముగా ప్రశ్నించెను.

## 71.

ఈ మాటలు విని విరాటరాజు, "ఈతడు మహారాజైన యుధిష్ఠిరుడైన మిగిలిన భీమ, అర్జున, నకుల, సహదేవులు, భార్యయైన ద్రౌపది యేరి?" అని

ప్రశ్నించెను. అంత అర్జునుడు భీముడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపదిని పరిచయము గావించి, తాము అతనివద్ద తల్లి గర్భమున ఉన్న సంతానము వలె అజ్ఞాతవాసము గడపగలిగితిమని ధన్యవాదములు తెలిపెను.

ఉత్తరుడు పాండవులొక్కొక్కరిని తండ్రికి తెలిపి, అర్జునుని చూపుచూ ఈ మహానుభావుడే కౌరవులను జయించి, గోవులను రక్షించెనని తెలియజేసెను.

కుమారుని మాటలు విని మత్స్యరాజు మిక్కుటముగా సంతసించి, యుధిష్టిరుని చేరి సమస్త రాజ్యమును, సంపదను ఆతనికి ప్రదానము గావించి భీమ, అర్జున, నకుల, సహదేవులను కౌగలించుకొని, "నేటికి నా జన్మ ధన్యమైనది. నా సంపదలన్నియూ మీవిగా భావింపుడు. మా సుకృతఫలవశముననే మీరు అరణ్యవాసము పూర్తిగావించి, అజ్ఞాతవాసము మావద్ద గడిపిరి. తెలియక మేము కావించిన అపరాధములను మన్నింపుడు. నా ఆనందమునకు మీకు కానుకగా నా కుమార్తెయైన ఉత్తరను అర్జునునకు భార్యగా సమర్పిందలచితిని" అని వేడికొనగా యుధిష్టిరుడు అర్జునుని వంక చూడగా, ఆతడు, "రాజా! మత్స్య, భరత కులములు యేకమగుట సముచితము. నేను ఉత్తరను కోడలిగా గ్రహింతును" అని పలికెను.

## 72.

విరాటరాజు అర్జునునితో తన కుమార్తెను యేల భార్యగా గ్రహించుట లేదని ప్రశ్నింపగా అర్జునుడు, "మహానుభావా! నేను అంతఃపురమున యేకాంతమున నీ కుమార్తెతో వసించితిని. ఆమె నన్ను యెల్లవేళలా తండ్రి వలెనే భావించెడిది. ఆమెకు నేనెంతో శ్రద్ధగా నృత్యము నేర్ప ఆమె నన్ను ఆచార్యునిగా పూజించెడిది. ఆ యువతితో నేనిట్లు సంవత్సర కాలము గడిపితిని. నేడు ఆమెను నేను భార్యగా గ్రహించిన మీకు, ఇతరులకు సందేహము కలుగవచ్చును. నేను ఆమెను కోడలిగా గ్రహించిన నా యెడలగాని, ఆమె యెడల గాని యెవ్వరికీ యెట్టి సందేహము కలుగదు. కుమారసదృశుడు, అస్త్రకోవిదుడు, కృష్ణుని మేనల్లుడు అయిన నా కుమారుడు అభిమన్యుడు ఉత్తరకు తగిన భర్త. మీరు అట్లు కావించిన నేను ఆనందింతును" అని జవాబు పలికెను.

మత్స్యరాజు అర్జునుని ధర్మభీరుత్వమును పొగిడి, ఆతని కోరికకు అంగీకారము తెలిపెను. విరాటరాజు, యుధిష్టిరుడు సంబంధము నిశ్చయించి, ఈ వార్తను తెలుప స్నేహితుల వద్దకు చారులను పంపిరి. ధర్మరాజు మరియొక అనుచరుని పిలిచి ఈ శుభవార్తను వాసుదేవునకు తెలుపుమని పంపెను.

పదమూడు సంవత్సరములు పూర్తి కాగా పాండవులు విరాటనగరమున ఉన్నట్లు అంతటా ప్రకటించబడినది. అర్జునుడు అభిమన్యుని, కృష్ణుని, యాదవులను ఆహ్వానించుటకు చారులను పంపెను. యుధిష్ఠిరుని స్నేహితులైన కాశీరాజు, శైవుడు ఒక్కొక్కరూ అక్షౌహిణీ సైన్యముతో పాండవులను కలసుకొనిరి. అక్షౌహిణీ సైన్యముతో ద్రుపదుడు, ఆతని కుమారులైన దుష్టద్యుమ్నుడు, ద్రౌపది పంచ పుత్రులు అచ్చటకు వచ్చిరి. వారందరూ అక్షౌహిణీ సేనలకు నాయకులు. విరాట రాజు రాజులనందరినీ ఆహ్వానించి తగిన ఆతిథ్యము చేసి వారిని ఆనందింప చేసెను.

అనంతరము వాసుదేవుడు, బలదేవుడు, కృతవర్మ, యయుదానుడు, సాత్యకి, అక్రూరుడు మొదలైన యాదవ వీరులు సుభద్ర, అభిమన్యులతో వచ్చిరి. ఇంద్రసేనాది పాండవ సారథిగణము వారి సమస్త రథములను తీసుకొని వచ్చిరి. వృష్ణి, అంధక, భోజవంశీయులు అగణిత హస్త, అశ్వరథాదులతో పాండవులను చేరిరి.

## ఉత్తరతో అభిమన్యుని వివాహము

అనంతరము యథావిధిగా వివాహకార్యము నెరవేరెను. శంఖ, భేరీ, ప్రణవాది వాద్యనాదముల శబ్దము మిన్నుముట్టెను. గాయకులు, ఆఖ్యాయకులు, నటులు, వైతాళికులు, సూతులు పాండవులను కీర్తించిరి. సర్వాంగసుందరమైన మత్స్యనారీగణముతో సుధేష్ణ, ఇంద్రుని కుమార్తె వలె ఉత్తరను అలంకరించి వివాహవేదికపైకి తీసుకొని రాగా, పాంచాలనందనుని రూపలావణ్యముతో వారికి మిన్నయై యెదురేగెను.

ధనుంజయుడు తన కుమారునితో విరాటకన్య వివాహము కావించి ఇంద్రుని వలె శోభాయమానుడయ్యెను. విరాటరాజు కుమార్తెను అభిమన్యుని హస్తములనుంచి, ఆనందముతో యేడువందల అశ్వములు, రెండువందల యేనుగులు, భూరి ధనము కానుకగా అర్పించెను.

వివాహక్రియ పూర్తియైన పిమ్మట యుధిష్ఠిరుడు బ్రాహ్మణులకు గోవులను, ధనము, వస్త్రములను దానము చేసెను. విందుభోజనములతో అతిథులు మిక్కిలి ఆనందించిరి.

వైవాహిక పర్వాధ్యాయ సమాప్తం
విరాటపర్వం సంపూర్ణం